# భారతం

## (ప్రథమ భాగం)

ఉషశ్రీ



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# భారతం

(ప్రథమ భాగం)

ఉషశ్రీ

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2006

# **BHARATAM-Part - I** (Telugu)

(An abridged version of Mahabharata)

By
**Ushasri**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No : 110

Re-prints : 2001, 2004, 2006

Copies : 5,000

Published by:
**Sri A.P.V.N. Sarma, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati — 517 507

*Cover Design:*
Ponnapalli Giriprasad

*Printed at*
Vidhyarambham Press and Book Depot
Alleppey,
KERALA.

# ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థానం వారు చేపట్టిన ఆధ్యాత్మిక ప్రచార ప్రణాళికలో భారతీయ పురాణేతిహాస గ్రంథ ప్రచురణ ఒక అంతర్భాగం. ప్రాచీన భారతీయ వేదాంత గ్రంథాలు, మత సంబంధమైన అనుష్ఠాన శాస్త్ర ప్రార్థనా గ్రంథాలు, ప్రాచీనార్ష విజ్ఞాన ప్రబోధాత్మకాలైన పుస్తకాలు వ్రాసి ప్రచురించే రచయితలకు ఆర్థిక సహాయం చేస్తున్నారు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఈ ఒక ప్రణాళిక క్రిందే ఇంతవరకు శతాధిక గ్రంథాలు వెలువడ్డాయి. ఇంకా వెలువడుతున్నాయి. భారత దేశంలో సాంస్కృతిక జగత్తులో సాహిత్యరంగంలో ఆధ్యాత్మిక జగత్తులో భారత భాగవత రామాయణాలకు ఉన్న విశిష్ట ప్రాముఖ్యం యుగయుగాంతరాలుగా ఆ ఉద్గ్రంథాలు అశేష ప్రజానీకానికి పురుషార్థ నిర్వహణలో మార్గదర్శకత్వం వహించిన సంగతి పునరుద్ఘాటించవలసిన అవసరం లేదు మహాభారతం నన్నయ మహాకవి చెప్పినట్లు ఆర్ష విజ్ఞాన సర్వస్వం.

మహాభారతం

ధర్మతత్త్వజ్ఞుల దృష్టిలో - ఒక మహా ధర్మశాస్త్రం

ఆధ్యాత్మిక తత్త్వవేత్తల దృష్టిలో - వేదాంతనిధి

సత్కవీశ్వరుల దృష్టిలో - సమస్త సాహితీ భాండారం

లాక్షణికుల దృష్టిలో - సకల లక్ష్య సంగ్రహం

ఐతిహాసికుల దృష్టిలో - ఇతిహాసం

నీతికోవిదుల దృష్టిలో - నీతివిధానం

పౌరాణికుల దృష్టిలో - బహుపురాణ సముచ్చయం.

భారతీయ వాఙ్మయంలో భారతం పంచమవేదంగా ప్రసిద్ధి కెక్కింది. దానికి తిక్కన వేసిన వ్యాఖ్యానం హృదయంగమమైనది. స్థూలదృష్టికి, వేదప్రోక్తములైన ధర్మాలకు ఉపనిషత్ పురాణాదులలోని ధర్మాలకు వైరుధ్యం ఉన్నట్లు కనబడవచ్చు. కాని సూక్ష్మదృష్టితో చూస్తే వైరుధ్యాలు తొలగి

పోయి 'ధర్మాద్వైతం' సాక్షాత్కరిస్తుంది. అందుచేత ధర్మాద్వైతమూర్తి వేదవ్యాసమహర్షి ధర్మసూక్ష్మ ప్రతిపాదకమైన మహాభారతం నిర్మించినట్లు తిక్కన ప్రవచనం. ఆంధ్రదేశంలో భారత భాగవతాలకు గల అనన్య ప్రచార ప్రభావాలు జగద్విదితాలు. ఈ గ్రంథాలు సులభ సుందరశైలిలో ఆంధ్రావళికి అందించి ప్రజానురంజకులైన రచయిత 'శ్రీ ఉషశ్రీ'. ఆయన వ్రాసిన భాగవతం, సుందరకాండ ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రచురించారు.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు కవిత్రయ విరచిత మహాభారతాన్ని ప్రతిపదార్థ తాత్పర్య వ్యాఖ్యానసహితంగా ప్రచురించారు.

ఇది 'ఉషశ్రీ భారతం' ప్రథమ భాగం. ఇందులో ఆది, సభా, ఆరణ్య, విరాట, ఉద్యోగ పర్వాలు ఉన్నాయి. రెండు భాగాలుగా వెలువడుతున్న ఈ గ్రంథాన్ని పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నందువల్ల మళ్లీ మళ్లీ ముద్రింపబడుతుండడం ముదావహం.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# మహాభారత సుప్రభాతం

శ్రీమద్రామాయణ మహాభారతాలు మానవజాతికి మనశ్శాంతినీ, ఆత్మ జ్ఞానాన్నీ అనుగ్రహించగల ఆనందామృత ఝురులు.

ఆస్తికులయినా నాస్తికులయినా అందరికీ అవశ్య పఠనీయాలు ఈ కావ్య ఇతిహాసాలు.

* * *

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం ప్రతి శనివారమూ ప్రభాత సమయంలో భక్తిశ్రద్ధలతో ఆలకించేవారు అదే మధ్యాహ్నం తమ గృహమే నైమిశారణ్యంగా పవిత్ర హృదయాలతో అరగంట సేపు నిశ్శబ్దంగా విజయవాడ రేడియోద్వారా విన్నారు భారతం. భారతకథను వినిపించింది నేనే అయినా, ఆ ఆలోచన కలిగింది రజనీకాంతారావు గారికి. కలిగించినవాడు పరమేశ్వరుడు.

ఆ ఈశ్వరుడే ఈనాడు ఈ భారతం ఉచితంగా కాకున్నా, సముచితంగా అందించే సంకల్పం కలిగించాడు శ్రీ ప్రసాద్ గారికి.

అందుచేత ఇది "రజనీ - ప్రసాదం"
అందుకోండి స్వామికి అంజలి ఘటించి.
ఆరాధనా మందిరంలో భద్రంగా ఉంచండి.
వ్యాసపీఠం మీద
అనుదినం చదివి మీ పిల్లలకు వినిపించండి.

* * *

వార్తలూ, సినిమాపాటలూ తప్ప రేడియో ఎవడు వింటాడు! అని మహామహులు విశ్వసించే రోజులలో - సినిమా పాటలు వినిపించే అరగంట కాలాన్ని 'భారతం' వినిపించడానికి కేటాయిస్తే ఆ సమయం చాలదని

మరో అరగంట భారతం వినాలని కోరిక వెలిబుచ్చిన వేలాది శ్రోతలు 'రజని' గారికి కృతజ్ఞులై ఉండాలి.

అశ్లీలమూ, స్వైరాప్రణయమూ, అవినీతి నిండిన నవలలు తప్ప భారత రామాయణాలు చదివేవా రెవరు? ఒకవేళ చదివినా ఆ గ్రంథాలమీద దుర్వ్యాఖ్యలు చదువుతారు తప్ప అసలు కథ ఎవరికి కావాలి? అని మేధావులు భావించే ఈ రోజులలో —

భారత, రామాయణ, భాగవతాలు సక్రమంగా చవకగా అందిస్తే లక్షలమంది చదువుతారు — అనే విశ్వాసంకల కార్యనిర్వహణాధికారి "శ్రీ ప్రసాద్‌గారు" నాకీ అవకాశం ఇచ్చినపుడు "జ్ఞానపీఠం" బహుకృతికంటె ఘనంగా భావించి ఆనందించాను, లక్షకంటె లక్షలాది పాఠకహృదయాలు లభించాయనే తృప్తితో.

ముందుగా బాగవతం,

తరువాయి రామాయణం


విడుదలవేసి, వేలసంఖ్యలో అమ్ముడుపోగా, ఇప్పుడీ భారతం మీ కరకమలాలలో ఉంచాడు.

భారత, భాగవత, రామాయణాలు మూడూ ఉగ్గుపాలతో నాకు లందించిన జననీజనకులు పురాణపండ రామమూర్తి, కాశీఅన్నపూర్ణమ్మ లకూ, మనజాతికి మాతామహ పితామహులయిన వ్యాస - వాల్మీకి మునీంద్రులకూ, ప్రత్యక్షదైవం స్వామి శ్రీ వేంకటేశ్వరునికీ వినయ వినమిత శీర్షంతో అంజలిస్తూ .... .....

— ఉషశ్రీ

# భారతం

(ప్రథమ భాగం)





ప్రాంశుపయోదనీల తనుభాసితు నుజ్జ్వల దండధారుఁబిం
గాంశుజటాచ్ఛటాభరణు నాగమపుంజ పదార్థతత్త్వని
స్సంశయకారుఁ గృష్ణమృగచర్మ కృతాంబరకృత్యు భారతీ
వంశవివర్ధనున్ ద్రిదశవందితు సాత్యవతేయుఁ గొల్చెదన్.

# ఆదిపర్వం

ఇందులో:


పూర్వగాథలు

భీష్మప్రతిజ్ఞ

కురుపాండవ జననం

పాండురాజు మరణం

దుర్యోధనుని దుర్బుద్ధి

కృప - ద్రోణులు

విద్యాప్రదర్శనం : కర్ణుడు

గురుదక్షిణ

లక్కయిల్లు

ఘటోత్కచుడు

బకాసురుడు

స్వయంవరం

ఖాండవప్రస్థం

సుభద్రాపరిణయం

ఖాండవదహనం

# ఆదిపర్వం

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని
యైతిహాసికు లితిహాసమనియు
బరమపౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యంబని మహిఁ గొనియాడుచుండ
వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసు
డాదిమునిపరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరఁగుచుండ జేసె భారతంబు.

జనమేజయ మహారాజు సర్పయాగం సాగించే సమయంలో విచ్చేసిన ఆగమ పుంజ పదార్థతత్త్వనిస్సంశయకారుడు వ్యాసమహర్షి తన శిష్యుడైన వైశంపాయన మునిశ్రేష్ఠునికి భారత ప్రవచన కార్యం వప్పగించి వెళ్ళాడు.

ఆ మునిశ్రేష్ఠుడు గురుప్రోక్తమయిన జయ ప్రబంధనామక భారతేతిహాసాన్ని వినిపించడానికి ఉద్యోగించినవాడై,

నారాయణం నమస్కృత్య
నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం
తతో జయ ముదీరయేత్.

వ్యాసం వసిష్ఠ నప్తారం
శక్తేః పౌత్ర మకల్మషమ్,
పరాశరాత్మజం వందే
శుకతాతం తపోనిధిమ్.

అని మనసా స్మరించి,

జనమేజయ మహారాజా! మంగళ ప్రదమూ, సర్వలోక విషయంభరమూ, పాపహరమూ, పరమ పవిత్రమూ అయిన ఇతిహాసాన్ని ఆరంభిస్తున్నాను; శ్రద్ధాసక్తులతో ఆలకించండి, అని వైశంపాయనుడు సావధానచిత్తుడై సభాసదులను తిలకిస్తూ వినిపించిన గాథ యిది.

భారతభారతీ శుభ గభస్తి చయంబులఁ జేసి
ఘోర సంసార వికార సంతమసజాల
విజృంభణము వాపి, సూరిచేతో రుచిరాబ్జ
బోధనరతుండగు దివ్యుఁ బరాశరాత్మజాం
భోరుహమిత్రుఁ గొల్చి మునిపూజితు
భూరి యశోవిరాజితున్॥

ఆయుష్యం బితిహాస వస్తుసముదాయం
బైహికాముష్మిక శ్రేయఃప్రాప్తి నిమిత్త
ముత్తమసభాసేవ్యంబు
లోకాగమ న్యాయైకాంతగృహంబు నాఁ బరగి
నానా వేద వేదాంత విద్యాయుక్తం బగుదానిఁ
జెప్పఁదొడఁగెం దద్భారతాఖ్యానమున్.

## పరీక్షిత్తు

విద్యా శ్రీయుతులయిన శౌనకాది మహామునులు నైమిశారణ్యంలో సత్రయాగం ఆరంభించిన సమయంలో లోకకళ్యాణ కాంక్షాపరుడయిన సూతమహర్షి అక్కడకు విజయంచేసి వారి పూజలంది, సమాసీన సదస్య జన

వాంఛానుసారం జగద్ధిత దృష్టితో మహర్షి వేదవ్యాసులవారు అనుగ్రహించిన భారతకథను వినిపించడానికి ఉద్యుక్తుడై గంభీర గళంతో ప్రసన్నవదనుడై:

మహామునులారా!

జనమేజయ మహారాజు సర్పయాగం ఆరంభించాడు. అని, పలికిన నిఖిల పురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుడయిన సూతమహర్షిని తిలకించి వారు:

మహర్షీ! ఆ ప్రభువు సర్పయాగ దీక్షాపరుడు కావలసిన కారణం ఏం వచ్చింది, అన్నారు.

మహామునులారా!

జనమేజయ మహారాజు తండ్రి పరీక్షిత్తు.

ఈయన పాండవ పౌత్రుడు. పాండవ మధ్యముడు అర్జునునకు సుభద్ర వల్ల కలిగిన వాడు అభిమన్యుడు. ఉత్తరాగర్భాన అభిమన్యు నందనుడుగా ఆవిర్భవించినవాడు పరీక్షిత్తు. ఆయన కొడుకు జనమేజయుడు. ఇది వీరి వంశవృక్షం.

ఈ మహారాజు సర్వధర్మమర్మాలూ ఎరిగినవాడు. ఎరిగినవాడే కాదు, ధర్మ మార్గ ప్రవర్తనుడు. తన ఏలుబడిలోని ప్రజలందరూ ధర్మమార్గాన నడిచే విధంగా పాలించేవాడు. నిరంతరం తన ప్రజల శ్రేయస్సునే దృష్టిలో ఉంచుకుని అందుకు తగిన రీతిని రాజ్యాంగం నిర్వహించేవాడు. అందువల్ల ప్రజానీకం అందరూ ఆయనను ప్రేమతో గౌరవించేవారు. ధర్మరాజువలె ఆయన అజాతశత్రువు. తన దేశంలోని దీనుల, వికలాంగుల రక్షణ పోషణ భారం స్వయంగా చూసుకునేవాడు. ఈ కారణాలవల్ల ప్రజలందరూ సత్యవ్రతపరాయణులూ, ధర్మదీక్షితులూ అయి ఉండేవారు.

ఆయన రాజనీతినీ, అర్థశాస్త్రాన్నీ కరతలామలకం చేసుకుని డెబ్బై సంవత్సరాలు పాలించాడు.

ఆ రోజులలో ఒక నా డాయన వేటకు వెళ్ళాడు.

ఎన్నో క్రూరమృగాలను వేటాడి, వేటాడి, అలసి సమీపంలో వున్న శమీకమహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు.

ఆయన విడిచిన బాణం దెబ్బ తిన్న ఘాతుక మృగం పరుగు పరుగున అటు రావడంతో దాన్ని వెంటాడుతూవచ్చి తపోదీక్షలో వున్న శమీకమహర్షిని సమీపించి:

"మహామునీ! ఈ వయిపు వచ్చిన మృగం ఎటు పోయింది"

అని అడిగాడు.

మౌనవ్రతంలో ఉన్న ఆయన సమాధానం యివ్వలేదు. అలసి వున్నాడు పరీక్షిత్తు. దానికితోడు వార్ధక్యం. ఆపైన ఆకలి. ఇన్నికలసి మహాముని సమాధానం యివ్వక పోవడంతో క్రోధం పెరిగింది. కోపంతో ఆశ్రమానికి అల్లంత ఎడంలో వున్న మృతసర్పాన్ని తన బాణంకొనతో తెచ్చి ఆయన మెడలోవేసి వెళ్ళిపోయాడు.

శమీకమహాముని ప్రశాంతవదనంతో తపస్సు సాగించుకుంటున్నాడు.

శమీకమహాముని కుమారుడు శృంగి ఆ రోజునే విద్యాభ్యాసం పూర్తిచేసి గురువుల వద్ద సెలవు తీసుకుని తండ్రిదగ్గరకు వస్తున్నాడు.

వచ్చేదారిలో శృంగి బాల్యస్నేహితుడు కృశుడు కనిపించి జరిగిన విషయం వివరించగా, శృంగికి విపరీతమయిన కోపం వచ్చింది.

ప్రథమకోపం మంచిది కాదనుకుని నిగ్రహించుకున్నాడు. కాని, వాని స్నేహితుడు రెచ్చగొట్టగా అరుణారుణ నయనాలతో:

తపోదీక్షలో ఉన్న నా పితృపాదునిపై సర్పాన్ని విడిచిన పాపి పరీక్షిత్తు నేటికి ఏడవరోజున తక్షకవిషంవల్ల మరణిస్తాడు — అని శపించాడు.

తండ్రిదగ్గరకు చేరాడు. ఆయన తపోదీక్షలోనే వున్నాడు. భుజంమీద మృతసర్పం ఉంది. తండ్రిని చూచిన శృంగికి దుఃఖం మిన్నంటింది.

ఆయన పాదాలమీద వ్రాలి, పరీక్షిత్తుని తాను శపించిన విషయం చెప్పగా విని శమీకుడు:

నాయనా! కోపం మనకు తగనిది. ఆ మహారాజు ధర్మపాలనవల్ల మనం ప్రశాంతంగా తపస్సు చేసుకుంటున్నాం. అటువంటి సత్పురుషుని శపించి నాకు మనస్తాపం కలిగించావు. ధర్మమార్గాన నడిచే మహారాజుకి హాని కలుగకూడదని తెలియదా!

ఆయన వేటలో అలసి వున్నాడు, దానికి తోడు ఆకలి దాహబాధకూడా ఉంటుంది. అటువంటి దశలో నేను మౌనవ్రతంలో ఉన్నట్టు తెలుసుకునే స్థిమితం ఆయనకు ఉండదు.

ఇప్పుడు నీ శాపం కారణంగా దేశం అరాచకం అవుతుంది. చోరులు నిర్భయంగా తిరుగుతూ సామాన్య సంసారులను హింసిస్తారు. ప్రజలలో ధర్మదీక్ష ఉండదు. చక్రవర్తి ధర్మదండాన్ని వహించినప్పుడే ప్రజలు పాప కర్మలకు దూరంగా ఉంటారు. అటువంటి మహారాజును శపించి చాలా అకార్యం చేశావు.

నీ వంటి యోగశక్తి కలవాని వాక్కుకి తిరుగులేదు. అందువల్ల శాపవార్త పరీక్షిన్మహారాజుకు తెలియజేసి ప్రతీకారం చేసుకోగలడేమో చూసుకోమనాలి.

అని తన శిష్యుని పంపి మహారాజు కీ వార్త అందజేశాడు.

జరిగిన పొరపాటుకి చింతించి పరీక్షిన్మహారాజు ఎత్తయిన స్తంభం నిర్మించి దానిమీద మేడ కట్టించి అక్కడనుండే రాజకార్యనిర్వహణకు ఉపక్రమించాడు.

ఆరురోజులు గడిచాయి. ఏడవరోజు ప్రవేశించింది.

వివిధ మంత్రశాస్త్రాలు తెలిసిన కాశ్యపుడనే విప్రుడు పరీక్షిత్తుకు రానున్న ప్రమాదాన్ని తప్పించడానికి హస్తినాపురం వస్తున్నాడు. దారిలో కాశ్యపునికి ఎదురుపడ్డ తక్షకుడు ఆయన మంత్రశక్తి గ్రహించి:

ఓ బ్రహ్మవేత్తా! నీ విద్య అమోఘ మయినదే కాని, ఈ మహారాజు శాపగ్రస్తుడు. దానికి తోడు ఆయుర్దాయంకూడా చెల్లిపోయింది. ఇటువంటి దశలో నీ శక్తి పనిచెయ్యకపోతే నీ కీర్తి ధ్వంసం అవుతుంది. అందుచేత

తేజోమయమూ, తపశ్శక్తిసంపన్నమూ, ప్రజ్వలితాగ్నిసదృశమూ అయిన జరత్కారుని అనుగ్రహంవల్ల ఆమె గర్భం శుక్లపక్ష చంద్రునివలె ప్రవృద్ధ మవుతున్నది.

అవుతున్న కాలంలో —

ఒకనాడు జరత్కారుడు అర్యణంలో తిరిగి తిరిగి వచ్చి అలసటతో ఆమె తొడమీద తల ఉంచి విశ్రాంతి తీసుకుంటున్నాడు. అలసటవల్ల ఆయనకు నిద్రపట్టింది. నిద్రసాగుతున్నది. సూర్యుడు పడమటి దిక్కుకు చేరాడు.

సంధ్యాసమయం అయింది—
అటు సూర్యుడు అస్తమిస్తున్నాడు.
ఇటు భర్త నిద్రిస్తున్నాడు.
సంధ్యావిధ్యుక్త కర్మనిర్వహణకాలం అతిక్రమిస్తున్నది.
ఆయన లేవడంలేదు.
లేపి నిద్రాభంగం కలిగిస్తే...
ఆందోళనలో పడింది జరత్కారువు.
నిద్ర లేపితే ఆయనకు ఆగ్రహం రావచ్చు.
లేపకపోతే ధర్మకర్మకు లోపం వస్తుంది.
ఏం చెయ్యాలి!
ఆయనకు కోపం వస్తే తనను విడిచేస్తారు.
కాని ధర్మలోపం జరిగితే....
అంతే భర్తను నిద్ర లేపింది. సంధ్యోపాసన సమయం అయింది, అని సూచించింది.

జరత్కారుడు కనులు విప్పినాడు.
భార్య ముఖంలోకి చూశాడు.
నియమభంగం అయింది.
ఆయన కన్నులు ఎర్రబడ్డాయి.
బొమముడి బిగిసింది.

ఓ తరుణీ!

నా శక్తి సామర్థ్యాలు తెలియక దుస్సాహసం చేసి నియమభంగానికి ఒడిగట్టావు.

మన శక్తి సామర్థ్యాలు గుర్తించలేని వారి దగ్గరా, తగిన గౌరవం లభించని చోటా పురుషు డన్నవాడు ఒక్కక్షణం ఉండడు. సామాన్యుడికే అంత అభిమానం ఉంటే, యింక మా వంటి వారి విషయం చెప్పాలా!

పైగా మన వివాహవేళ చెప్పాను. నా మనసుకి వ్యతిరేకంగా నడిచిన క్షణంలో నిన్ను విడిచి పెడతానని గుర్తుందా! నేను వెడుతున్నాను, అని లేచి అడుగు వేస్తున్నాడు.

మహర్షీ! క్షమించండి. ఈ క్షణంలో మీ ధర్మదీక్షకు ఆటంకం రాకూడదని నిద్ర లేపానే కాని, మరో ఊహలేదు నాకు — అని దీనంగా ప్రార్థించింది.

ఓసి అమాయకురాలా!

నా మాటకు తిరుగులేదు. ఇంతకూ యిప్పుడు నీకు జరగబోయే అన్యాయంకూడా లేదు. ఈ విషయం అలనాడే మీ అన్నయ్యకు చెప్పాను. ఆయనకు యిది వివరించు.

ఇప్పుడు నువ్వు గర్భవతివి. ధర్మనిరతుడయిన బాలుడు నీ గర్భంలో ప్రవృద్ధ మవుతున్నాడు. వాడు వేదవేదాంగవిదుడై మీ వంశరక్షకు డవుతాడు, అని అరణ్యంలోకి సాగిపోయాడు.

జరత్కారువు విచారవదనంతో వాసుకి దగ్గరకు చేరి, జరిగిన విషయం అంతా వివరించింది. ఆమెను దగ్గరగా తీసుకుని తలనిమిరి:

చెల్లీ! ఇప్పుడాయన సంకల్పం మరలించలేం. నువ్వు మన వంశరక్షణ చెయ్యాలి. నీ వేదన నాకు తెలుసు, అయినా ఈ వంశరక్షణ భారం అనే మహత్కార్యం నీ వల్ల సాగాలి కనక సంతోషంతో ఉండు, అని ఆమెను కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు.

నెలలు నిండాయి.

ఒకానొక సుముహూర్తంలో ఆమె కుమారుని ప్రసవించింది.

ఉభయవంశదీపకు డయిన ఆ బాలుడు దినదిన ప్రవర్ధమానుడవుతు న్నాడు. అతనికి ఆస్తీకుడని పేరుపెట్టారు.

విద్యాభ్యాసయోగ్య మయిన వయసు వచ్చింది. చ్యవనమహర్షి ఆశ్ర మానికి విద్యార్థిగా పంపారు. ఆయన శిక్షణలో బ్రహ్మచర్యదీక్షతో వేద వేదాంగాలు అభ్యసించి, ఆయన ఆశీస్సులు పొంది తల్లి దగ్గరకు వచ్చాడు ఆస్తీకుడు.

అప్పుడు వాసుకి:

"నాయనా! జనమేజయ మహారాజు సర్పయాగం ఆరంభించాడని వినే వుంటావు. యాగశాలానిర్మాణసమయంలో అక్కడకు వచ్చిన వాస్తు శిల్ప శాస్త్రజ్ఞుడయిన సూతుడు దానిని చూచి:

ఈ నిర్మాణముహూర్త లోపంవల్ల ఈయాగం నిర్విఘ్నంగా పరిసమాప్తం కాబోదు. ఒకానొక వేదవేత్త దీనిని మధ్యలోనే ఆపుతాడు, అన్నాడు.

అది విని జనమేజయుడు అపరిచితు లెవరినీ యజ్ఞకుండసమీపానికి రానివ్వరాదని ఆజ్ఞాపించాడు.

యజ్ఞం ప్రారంభ మయింది. చ్యవనవంశీయుడయిన చండ భార్గవుల పర్యవేక్షణలో వేదవేత్తలయిన మహామహులు తీవ్రదీక్షతో యజ్ఞ కార్యం నిర్వహిస్తున్నారు.

అశ్వాకారసర్పాలు, మత్తేభాకృతికల మహానాగాలు, ఏనుగుతొండాలవలె ఉండే భుజంగాలు ఒక్కొక్కటే వెళ్ళి ఆ అగ్నికుండంలో పడుతున్నాయి.

ఈ వార్త వింటూనే తక్షకుడు దేవేంద్రుని శరణు వేడాడు.

ఆయన అభయం యిచ్చాడు.

నాయనా! నువ్వు త్వరగా బయలుదేరి వెళ్ళి జనమేజయ మహారాజు చేత ఈ సర్పయాగం ఆపించకపోతే మన వంశం సర్వనాశనం అవుతుంది" అన్నాడు.

చిరునవ్వుతో ఆస్తీకుడు తల్లికి నమస్కరించి ఆవిడ ఆశీర్వాదాలు పొంది, మేనమామవద్ద సెలవు తీసుకుని జనమేజయుని నగరానికి శీఘ్రగతిని సాగుతున్నాడు.

తన బిడ్డ అంతవాడయినందుకు జరత్కారువు హృదయం ఎంతో సంతోషించింది.

సర్పజాతి భీతి నెమ్మది నెమ్మదిగా తగ్గుతున్నది.

యాగశాలలో అడుగు పెడుతూనే ఆస్తీకుడు:

సోమస్య యజ్ఞో వరుణస్య యజ్ఞః,
ప్రజాపతే ర్యజ్ఞ ఆసీత్ ప్రయాగే ।
తథా యజ్ఞోఽయం తవ భారతాగ్ర్యః
పారిక్షిత స్వస్తినోఽస్తు ప్రియేభ్యః॥

రజనీనాథకులైక భూషణుఁడవై,
రాజర్షివై ధారుణీ
ప్రజనెల్లన్ దయతోడ ధర్మ చరితం
బాలింపుమన్ దొంటి ధ
ర్మజు, నాబాగు, భగీరథున్, దశరథున్,
మాంధాతృ రామున్, రఘున్
విజయుం బోలితి సద్గుణంబుల జగ
ద్విఖ్యాత పారీక్షితా!

స్వస్తి మహారాజా! ప్రయాగలో ప్రజాపతి చేసిన యజ్ఞంతో వరుణ, సోమాదిప్రముఖులు సాగించిన క్రతువులతో తులతూగే మహాయాగం చేస్తున్న నీకు శుభమగుగాక!

ఈ యాగం సర్వబంధుకోటికీ శ్రేయస్సులు కలిగించాలి.

దశరథనందనుడు రాముడు. పాండురాజ నందనుడు ధర్మరాజు, హరిమేధ, రంతిదేవ, నల, నృగమహారాజులూ, కుబేరాదులూ సాగించిన క్రతువులవలె సాగే ఈ యజ్ఞంతో నీ కీర్తి ముల్లోకాలూ వ్యాపిస్తున్నది.

జితక్రోధులలో వసిష్ఠులు,
అద్భుతశక్తిసంపన్నులలో వాల్మీకి,
బ్రహ్మచర్య వ్రతదీక్షితులలో భీష్ముడు,
ధర్మపాలనలో యముడు,

లోకపాలకులలో ఇంద్రుడువలె యాగనిర్వాహకులలో నిన్ను అగ్రేసరుడుగా కీర్తిస్తారు.

అని ప్రశంసలు సాగిస్తూంటే యాగశాలలో అందరూ పులకిత హృదయులై ఆ మాటలే వింటూ ఆ బాలునే చూస్తున్నారు.

అప్పుడు జనమేజయుడు వారందరి సంతోషం తిలకించి:

ఓ బ్రహ్మచారీ! నీ కేం కావాలో కోరుకో, అన్నాడు.

మహారాజా! ఈ క్షణంలో ఈ యజ్ఞం ఆపు చెయ్యాలి — అని అర్థించాడు ఆస్తీకుడు.

జనమేజయుడు కొంతసేపు చర్చించి, ఎట్టకేలకు తనవాగ్దానం ప్రకారం ఆస్తీకుని కోరికకు అంగీకరించాడు.

సరిగ్గా అదే సమయానికి యజ్ఞకుండం దగ్గర వేదవేత్తలు:

'సహేంద్ర తక్షకాయ స్వాహా'

అని మంత్రం పఠించారు.

అభయమిచ్చిన దేవేంద్ర సమేతం తక్షకుడు అగ్నికుండంలో పడబోతున్నాడు. చూసి ఆస్తీకుడు:

"యాగం పరిసమాప్త మయింది. అక్కడే ఆగు" అన్నాడు.

ఆ విధంగా తక్షకుడు రక్షితు డయ్యాడు.

అని సర్పయాగ గాథను సూతుడు వినిపించగా:

'మహర్షీ! కన్నతల్లికదా కద్రువ. ఆవిడ తన సంతాన నాశనకారక మయిన శాపం ఎందు కిచ్చింది?'

అని మునిజనం అడిగారు.

ఆరంభిస్తున్నాడు సూతుడు:

మహామునులారా! కశ్యపప్రజాపతికి కద్రువ, వినత అని యిద్దరు భార్యలు.

వారిద్దరూ ఒకనాడు సాగరతీరాన వాహ్యాళి సాగిస్తున్నారు. అదే సమయంలో ఉచ్చైశ్శ్రవం అక్కడ విహరిస్తున్నది.

దూరంనుంచి దాన్ని చూచి కద్రువ: ఆ గుఱ్ఱం ఏ రంగులో ఉంది, అని అడిగింది.

కనిపిస్తున్నది కదా తెల్లగా వెలుగుతూ, అంది వినత. అప్పటికి సంధ్యాసమయం అవుతున్నది.

సరిగ్గా చూడు, గుఱ్ఱం శరీరం అంతా తెల్లగానే ఉన్నా దానితోక నల్లగా ఉంది, అంది కద్రువ.

తోకకూడా తెల్లగానే ఉంది, అని వినత అనగా, వివాదం రేగింది

దగ్గరగా వెళ్ళి మాద్దా మనుకున్నారు.

కనుచీకటి పడుతూండడంవల్ల రేపు ఉదయమే చూడవచ్చునంది కద్రువ.

ఎవరిమాట నెగ్గితే వారికి జీవితాంతం రెండవవారు దాసీగా ఉండాలని పందెం వేసుకున్నారు.

రాత్రి యింటికి చెరుతూనే కద్రువ తన బిడ్డలందరినీ పిలిచి:

తెల్లావారకుండా మీ రందరూ వెళ్ళి సముద్రతీరాన విహరించే ఉచ్చై శ్శ్రవం తోక నిండా నల్లని రోమాలుగా ఉండాలి, అనగా వారందరూ అటువంటి అన్యాయం తమవల్ల కాదన్నారు. అయితే మీరందరూ జనమేజయుడు సాగించే సర్పయాగంలో నాశనం అవుతారు, అంది.

ఆమాట వింటూ కర్కోటకుడు: అమ్మా! నీ కోరిక నెరవేరుస్తాను, అని ఆ గుర్రం తోకను నలుపు చేశాడు.

తెల తెల వారుతుండగా వినత, కద్రువ లిద్దరూ, సాగరతీరానికి వెళ్ళి చూడగా వినత మాట పొల్లుపోయింది. అదిమొదలుగా వినతను దాసిగా చేసుకుంది కద్రువ.

అదే రోజున వినతానందనుడు గరుత్మంతుడు ప్రభవించాడు.

ఆతత పక్ష మారుత రయప్రవికంపిత ఘూర్ణితాచల
వ్రాత మహార్ణవుండు బలవ న్నిజదేహ సముజ్జ్వలప్రభా
ధూత పతంగతేజుఁ డుదితుండయి తార్క్ష్యుఁడు తల్లికిన్ మనః
ప్రీతి యొనర్చుచు న్నెగసె భీమ జవంబున నభ్రవీథికిన్ ॥

ప్రభవిస్తూ మహాపరాక్రమంతో గగనతలాని కెగిరి, విహరించి దిగివచ్చి తల్లికి నమస్కరించి, అనంతరం కద్రువకు వందనం చేయగా ఆమె:

నాయనా మీ అమ్మవలెనే నువ్వుకూడా మా దాసుడివై ఉండాలి. ఇది మొదలుగా నా బిడ్డలందరినీ నీ మూపురం మీద ఎక్కించుకు ఆడిస్తూవుండు, అంది.

అందు కంగీకరించి గరుత్మంతుడు వారిని తన మూపున ఎక్కించుకుని ఎగిరి, ఎగిరి సూర్యమండల సమీపానికి చేరాడు.

సూర్యుని తాపానికి తాళలేక నాగులన్నీ తలలు వాల్చి స్పృహతప్పి నేలబడ్డాయి. అది చూచి కద్రువ ఇంద్రుని ప్రార్థించి కుంభవృష్టి కురిపించి వాటికి ఆశ్వాసన కలిగించింది. రోజులు గడుస్తున్నాయి.

ఈ దాసభావం గరుడునికి నచ్చలేదు. తన తల్లికి ఈ బానిసత్వం ఎలా వదులుతుందో చెప్పమని అడుగగా నాగజాతి ప్రముఖులందరూ, అమృతం తెచ్చియిస్తే దాస్యం వదులుతుంద, అన్నారు.

అంగీకరించి గరుత్మంతుడు తల్లిని చేరి:

అమ్మా! నేను అమృతం తెచ్చి యీ నాగులకు పోస్తే మనకు దాస్య విముక్తి లభిస్తుంది. అది తీసుకు రాగల శక్తి నాకున్నది. కాని, ఆ శ్రమకు తగిన ఆహారం కావాలి, అన్నాడు.

నాయినా! ఈ సముద్ర మధ్యంలోని ద్వీపం నిండా ఎందరో నిషాదులున్నారు. వారిని ఆరగించి నీ ఆకలి తీర్చుకో, అంది వినత.

గరుత్మంతుడు ఉత్సాహంతో తల్లికి నమస్కరించి గగనవీధికి లేచాడు.

లేచేవేళ విసరిన రెక్కలగాలికి సముద్రం కల్లోలిత మయింది. ద్వీపాన్ని చేరేవేళ ఆ గాలి విసురుకి అక్కడి మహావృక్షాలు ఊగిసలాడాయి. నేలమీద నిలబడలేక నిషాదులు సుడిగాలిలో తిరుగుతూ పైకి లేస్తూంటే గరుత్మంతుడు తననోరు విశాలంగా తెరిచి అందరూ తన ఉదరంలోకి చేరగానే నోరు మూసేశాడు.

నిషాదులందరినీ ఆరగించినా ఆకలి తీరలేదు. ఆకాశవీధిని వెడుతూం డగా కశ్యపుడు కనిపించి:

నాయనా! నువ్వూ మీ అమ్మా కుశలంగా ఉన్నారా! అన్నపానాలకు లోటు కలగడం లేదు కదా, అని కుశలప్రశ్నలు వేశాడు.

పితృపూజ్యా! కుశలంగానే ఉన్నాం. అయితే ఇప్పుడు అమ్మకు దాస్యవిమోచనం కలిగించడానికి వెడుతున్నాను. నా ఆకలి తీరే మార్గం చెప్పండి. అన్నాడు.

"నాయనా! ఇక్కడికి సమీపంలో పెద్ద సరోవరం ఉంది. దానిలో గజకచ్ఛపాలు రెండు నిర్విరామంగా పోరాడుతున్నాయి. చిత్రం ఏమిటంటే

యీ రెండూ గత జన్మలో సోదరులై అప్పటి వైరంతో యిలా పుట్టి కొట్టుకుంటున్నాయి.

ఆ జన్మలో వీరి పేర్లు విభావసుడు, సుప్రతీకుడు ఇద్దరూ నిష్ఠగా తపస్సు చేసుకునే వారే, కాని వారికి సంపదల మీద వ్యామోహం వదలక తన భాగం తన కిమ్మని తమ్ముడు సుప్రతీకుడు అడిగాడు.

తమ్ముడూ! లోభబుద్ధికల మనుష్యులే సంపదలు పంచుకుని ఆ వ్యామోహంతో ఒకరి నొకరు చంపుకుంటారు. అన్నదమ్ముల మధ్య యిటువంటి ద్వేషం పెరిగిన సందుచూసి ఇతరులు వచ్చి వీరి సొమ్ము కాజేస్తారు. అందుచేత పంపకాలు మంచి పనికాదు. పయిగా నేను నీ అన్నగారిని.

కనిష్ఠాన్ పుత్రవత్ పశ్యే జ్యేష్ఠో భ్రాతా పితృ సమః.

అని ధర్మశాస్త్రం చెపుతున్నది. నిన్ను నేను తండ్రిలా చూసుకోవాలి, అన్నాడు వాడు వినలేదు.

వీడికి పంపకం ఇష్టంలేదు.

వాద ప్రతివాదాలు పెరిగాయి.

చివరకు విపరీత క్రోధంతో ఒకరినొకరు శపించుకుని యిలా ఏనుగు, తాంబేలు అయి పుట్టి కొట్టుకుంటున్నారు.

ఆ ఏనుగు చెరువుగట్టుదిగుతూ ఘీంకరిస్తుంది. ఆ ధ్వని వింటూనే తాబేలు నీటి మీద తేలి అలలు రేకెత్తిస్తుంది. రెండూ సంగ్రామం సాగిస్తాయి.

మహాపర్వతంలా ఉంటుంది ఏనుగు.

పెద్దమేఘంలా ఉంటుంది తాబేలు.

ఆ రెంటినీ ఆహారంగా గ్రహించి ని ఆకలి తీర్చుకో, అని ఆశీర్వదించి పంపాడు.

గరుత్మంతుడు సరోవరం సమీపించి ఒకకాలిగోళ్ళతో ఏనుగునూ మరొకకాలి గోళ్ళతో తాబేలునూ పట్టి ఎగిరాడు.

ఎగిరి ఎగిరి మేరుగిరిమీద అలంబతీర్థం చేరి అక్కడ విశాలశాఖలతో అలరారే మర్రిచెట్టుకొమ్మమీద కాలూనుతూండగా అది ఫెళఫెళలాడుతూ విరగసాగింది.

ఆ సమయంలో ఆ కొమ్మమీద పాదాలుంచి తలక్రిందుగా వ్రాలి తపస్సు చేసే వాలఖిల్యులు కనిపించారు. కొమ్మ నేలకూలితే వారందరూ మరణిస్తారనే భయంతో ఆ కొమ్మను ముక్కుతో పట్టి ఎగురుతున్నాడు.

ఎగిరి ఎగిరి గంధమాదనం చేరి, అక్కడ తపస్సు చేసుకునే కశ్యపుని చేరగా ఆయన.

నాయనా! ఇంత దుస్సాహసం ఎందుకు చేశావు. సూర్యకిరణాలే ఆహారంగా జీవిస్తూ తపోదీక్షలో ఉన్న వాలఖిల్యమహర్షిగణం నిన్ను అనుగ్రహించుగాక, అని ఆశీర్వదించాడు.

వాలఖిల్యులు ఆ కొమ్మను విడిచి మరో వృక్షశాఖను ఆశ్రయించారు.

అప్పుడు కశ్యపుని సూచనానుసారం గరుత్మంతుడు ఆ మహా వట వృక్షశాఖను నిర్జనంగా ఉండే మంచుకొండ సమీపంలో విడిచి, గజ, కచ్ఛపాలను తృప్తిగా ఆరగించి, బయలుదేరాడు.

గరుత్మంతుడు తీవ్రవేగంతో దేవలోకం చేరుతున్నాడు. గమనవేగానికి ధూమమేఘాలతో అగ్నిజ్వాలలు పుడుతున్నాయి. ఉల్కలు పడుతున్నాయి. సిద్ధ సాధ్య వసు మరుద్గణాలు అలజడి పడ్డాయి. దేవతాకిరీటాలు ధూళితో నిండుతున్నాయి.

అది చూసి దేవేంద్రుడు భయకంపితుడై తమ గురువయిన బృహస్పతి మ్రోల చేతులు జోడించి నిలువగా ఆయన:

అమృతం హరించడానికి గరుత్మంతుడు వస్తున్నాడు. వాడు సర్వశక్తి సంపన్నుడు. నువ్వు వాలఖిల్యమహర్షులను పరిహసించిన ఫలం యిదే, అన్నాడు.

దేవేంద్రుడు తక్షణం అమృతరక్షకులయిన దేవతల వద్దకుపోయి గరుత్మంతుని రాకను తెలిపి తగు రక్షణ కల్పించాడు.

దేవతలందరూ చక్ర, శూల, పరిఘ, పట్టిసాది ఆయుధాలను సన్నద్ధం చేసుకుని గదా ఖడ్గధారులై అప్రమత్తంగా నిలబడ్డారు, అని సూతుడు చెప్తూంటే;

మహర్షి దేవేంద్రునిపై వారి కెందుకు ఆగ్రహం కలిగిందో వివరించి అమృతహరణ గాథ కొనసాగించండి, అన్నారు మహామునులు.

సూతుడు: మహర్షులారా! కశ్యప ప్రజాపతి పుత్రసంతానం కోసం ఆరంభించిన యాగంలో సహకరించడానికి సర్వదేవ, గంధర్వ ముని సంఘాలూ వచ్చాయి. అప్పుడు సమిధలు తెచ్చే పని దేవతలకూ వాలఖిల్యులకూ అప్పగించారు.

దేవేంద్రుడు పర్వతమంత సమిధలమోపు తెస్తున్నాడు. అంగుష్ఠమాత్ర దేహులయిన వాలఖిల్యులు తెచ్చే సమిధలను చూచి పరిహాసంచేశాడు. వారు ఇంద్రుని అహంకారానికి ప్రాయశ్చిత్తంగా వానిని కలవరపరచే పరాక్రమ తేజస్సంపన్నుడయిన మహాశూరుడు జన్మించాలని సంకల్పించి యజ్ఞం చేయబోయారు.

అది విని కశ్యపుడు: బ్రహ్మ ఆజ్ఞానుసారం ఇంద్రుడు త్రిలోకాధిపతిగా ఉన్నాడు. ఆ చతుర్ముఖుని మాటకు వ్యతిరేకంగా మీరు మరొక ఇంద్రుని సృష్టించడం ఉచితం కాదు. నేను సంకల్పించిన యజ్ఞంలో ప్రభవించే బాలుడు పక్షీంద్రుడయి దేవేంద్రుని అహంకారాన్ని అణచగలడని చెప్పగా వారు శాంతించారు.

అదీ నాటి కథ!

గరుత్మంతుడు అమృతహరణానికి దేవభూమిలో దిగుతున్నాడు.

ఆ రెక్కలవిసురులో పుట్టిన గాలికి అక్కడి మహావృక్షాలు సైతం ఊగిసలాడిపోగా రక్షణ కార్యం నిర్వహించే వారందరి గుండెలూ గజ

గజ లాడుతున్నాయి. గాలికి రేగిన ధూళిలో అందరికన్నులూ మూసుకు పోయాయి. అయినా శక్తి కూడగట్టుకుని వారు తిరగ పడ్డారు. వాడి గోళ్ళతో, బలమయిన ముక్కుతో చీల్చి వారిదేహాలను రక్తసిక్తం చేశాడు.

అందరినీ పరాజితులను చేసి అమృతభాండాన్ని చేరుతున్నాడు. కలశం చుట్టూ అగ్ని జ్వాలలు రేగాయి. తక్షణం తన నోటినిండా నదీజలాలను తెచ్చి ఆ జ్వాలలను చల్లార్చి సూక్ష్మరూపంతో అమృత కలశాన్ని సమీపించాడు.

దాని చుట్టూ ఒకనొక చక్రం పదునయిన కత్తులతో పరిభ్రమిస్తున్నది. ఏ వస్తువు దాన్ని సమీపించినా ఛిన్నాభిన్నం కావలసిందే!

అత్యల్ప సూక్ష్మ శరీరంతో చక్ర రంధ్రంలోంచి కలశసమీపానికి చేరాడు. దాన్ని రెండు మహాసర్పాలు రక్షిస్తున్నాయి. అవి బుస కొడుతూంటే అగ్నిజ్వాలలు రేగుతున్నాయి. వాటి కన్నులు మాణిక్యాలవలె వెలుగుతున్నాయి. నేత్ర గోళాంలోకి ధూళి విసిరాడు. అవి కన్నులు మూసుకున్నాయి. వెంటనే తన గోళ్ళతో వాటిని చీల్చి చక్రాన్ని తునియలు చేసి అమృతకలశం తీసుకుని గగనవీధికి చేరాడు.

అది చూసి మహావిష్ణువు సంతోషించి ఎదురుగా వచ్చి : నీకు కావలసిన వరం కోరుకో, అనగా :

స్వామీ! నన్ను మీ ధ్వజలాంఛనంగా స్వీకరించండి. ఈ అమృతం ఆస్వాదించనవసరం లేకుండా నాకు అజరామరత్వం ప్రసాదించండి. అనగా అనుగ్రహించి నువ్వు నా వాహనంగా ఉండు, అన్నాడు నారాయణుడు.

పరమానందంతో అంగీకరించాడు గరుత్మంతుడు.

అప్పటికి దేవేంద్రుడు ఎదురువచ్చి వజ్రాయుధం ప్రయోగించగా దాని శక్తిని కించపరచడం యిష్టంలేక తన రెక్కలోని ఒక ముక్కను దానికి విడిచాడు.

అది చూసి దేవేంద్రుడు ఆశ్చర్యంతో:

నీ శక్తి చాలా ఆశ్చర్యకరంగా ఉంది. నాతో సఖ్యంగా ఉండు. ఇప్పుడు నువ్వు ఈ అమృతకలశం నాగులకు అర్పిస్తే యిది స్వీకరించి వారు లోకకంటకులు అవుతారు అన్నాడు.

దేవేంద్రా! మాతృదాస్య విముక్తికి ఈ కార్యం నిర్వహిస్తున్నాను. నేను వారి కిది యివ్వక తప్పదు. ఇచ్చి మా అమ్మకు దాసీత్వం తప్పించు కుంటాను. నేను వారి దగ్గర ఉంచిన క్షణంలో నువ్వు అపహరించుకు పోవచ్చు, అన్నాడు.

అంగీకరించాడు ఇంద్రుడు.

అందుకు ప్రతిఫలంగా నాగజాతిని గరత్మంతునికి ఆహారంగా అనుగ్రహించాడు.

గరుత్మంతుడు అమృతభాండంతో నాగులను సమీపించి :

ఇదిగో! ఈ పవిత్రమయిన దర్భలమీద దీన్ని ఉంచుతున్నాను. మీ రందరూ స్నానాలు చేసి వచ్చి ఆరగించండి. మా అమ్మకు దాస్యవిముక్తి కలిగింది కదా! అనగా సర్పాలన్నీ సంతోషంతో స్నానానికి బయలుదేరాయి; అంతే!

అమరేంద్రుడు అమృతభాండాన్ని హరించుకుపోయాడు.

తిరిగివచ్చిన సర్పాలు కలశం కనిపించక విచారంతో దర్భలు నాకాయి. వాటి నాలుకలు చీలిపోయాయి. ఇదీ ఆ కథ, అని సూతుడు కొనసాగుతున్నాడు.

తల్లికి ఆగ్రహం కలిగించిన కారణాన సర్పజాతికి శాపం వచ్చింది. విధి నిర్ణయానుసారం జనమేజయ మహారాజు సర్పయాగం ఆరంభించాడు.

ఆ సమయాన అక్కడకు ఎందరెందరో వేదవేత్తలు, మహామునులు, పురాణ వ్యాఖ్యాతలు చేరారు. వారందరూ సద్గోష్ఠులు సాగించే సమయంలో జనమేజయుడు వ్యాసమహర్షిని సమీపించి తమ పితామహులయిన కురుపాండవుల గాథ వినిపించవలసిందని అర్థించాడు.

అప్పుడు మహర్షివ్యాసుడు ఆ భారతసత్కథా ప్రవచనం సాగించుమని తన శిష్యుడయిన వైశంపాయనుని ఆదేశించగా ఆ మునిచంద్రుడు:

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమం
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్

అని నర నారాయణులకూ సరస్వతీ బాదరాయణులకు అభివాదం చేసి భారత ప్రవచనానికి ఉపక్రమించాడు.

## జనమేజయ మహారాజా!

జగదారాధ్యులూ, తేజస్సంపన్నులూ అయిన మా గురుపూజ్యులు కృష్ణ ద్వైపాయనులు లక్షశ్లోకాలతో నూరు పర్వాలతో సర్వజన శ్రవణ యోగ్యంగా వేదధర్మమంతా యిందులో నిక్షేపించారు. కురు, పాండవ రాజవంశ గాథలే కాక అలనాటి సర్వరాజవంశాల చరిత్రనూ ఈ మహేతిహాసంలో అందించారు.

చతుర్విధపురుషార్థ చర్చ విస్తారంగా ఉంది. మంత్రశాస్త్రం ఉంది. నదీ, నద సాగరాలతో సర్వ తీర్థ క్షేత్రాల వివరణా యిచ్చారు. చతురంగబలాంతో వ్యూహనిర్మాణ విశేషాలున్నాయి.

సాహిత్యంలో కనిపించే వాక్యనిర్మాణం, శైలీభేదం, కథలో కథ అల్లుకుంటూ పోయే సొగసు, ఉత్కంఠను పెంచే కథనకౌశలం అన్నీ ఉన్నాయి.

ఇంతెందుకు ఇందులో లేనిది ఎక్కడా లేదు. ఎక్కడ ఉన్నదయినా యిందులో దొరుకుతుంది. అంటే ఇందులో ఏ విషయం ఉన్నదో అదే అంతటా లభిస్తుంది.

ధర్మే చార్థే చ కామేచ మోక్షేచ భరతర్షభ!
య దిహాస్తి త దన్యత్ర య న్నేహాస్తి న తత్ క్వచిత్,

వేదములకు అఖిల స్మృతి
వాదములకు బహు పురాణ వర్గంబులకున్

వాద్దైన వోటులను తా
మూదల ధర్మార్థ కామ మోక్ష స్థితికిన్.

సముద్రం రత్నాలకు నిలయం అయినట్లు భారతం సర్వగాథలకూ, నీతులకు కేంద్రం. అటువంటి భారతం-

ఆయుష్యం బితిహాస వస్తుసముదాయం బైహి కాముష్మిక
శ్రేయఃప్రాప్తి నిమిత్త ముత్తమ సభాసేవ్యంబు లోకాగమ
న్యాయ్యై కాంత గృహంబు నాఁ బరఁగి నానా వేద వేదాంత
విద్యాయుక్తంబగు దానిఁజెప్పఁదొడఁగెం తద్భారతా ఖ్యానమున్.

భారత భారతీ శుభ గభస్తిపయంబులఁజేసి ఘోరసం
సారవికార సంతమసజాల విజృంభమువాపి సూరి చే
తో రువిరాజ్జ బోధన రతుండగు దివ్యుఁ బరాశరాత్మ జాం
భోరుహమిత్రుఁగొల్చి మునిపూజితు భూరియశో విరాజితున్.

# కథా ప్రారంభం

ధర్మచింతన తత్పరుడయిన ఉపరిచరుడనే మహారాజు చేదిదేశాన్ని ప్రజారంజకంగా పాలిస్తూ ఉండేవాడు.

కొంతకాలం రాజ్యపాలనం సాగించిన అనంతరం అరణ్యానికి వెళ్ళి తపోదీక్షతో పరబ్రహ్మను ఆరాధిస్తున్న రోజులలో ఆయన తీవ్రనిష్ఠకు భయపడి దేవేంద్రుడు స్వయంగా వచ్చి:

ఆర్యా! అప్పుడే నువ్వు తపోదీక్ష వహించవలసిన పనిలేదు. ధన కనక వస్తు వాహన సంపన్నులయిన చేదిదేశ ప్రజలు ధర్మపరాయణులు. వారు పరిహాసానికికూడా అసత్యం పలకరు. ఎప్పుడూ సంతోషంతో కల కలలాడే వదనాలతో ఉంటారు. గురుసేవానిరతులు. తండ్రి జీవించి ఉండగా ఆస్తి పంపకాలకోసం కొట్లాడుకునే నైచ్యం వారిలో లేదు. దీనజన రక్షణ జీవితపరమావధిగా కాలం గడుపుతారు. అటువంటి దేశాన్ని నువ్వు మరి కొంత కాలం పాలించాలి. స్ఫటికమణి నిర్మితమయిన యీ విమానమూ

శస్త్రాస్త్ర భీతి కలగనీయని ఇంద్రమాల నీకు కానుకగా యిస్తున్నాను. వీటికి తోడు ధర్మరక్షణార్థం వంశీదండం కూడా బహూకరిస్తున్నాను. అని ఉపరిచరుణ్ణి చేదిదేశానికి ప్రభువుగా పంపాడు.

ఉపరిచరుడు ధర్మకామనతో సంసారం సాగించి అయిదుగురు బిడ్డలను కన్నాడు.

వారిలో బృహద్రథుడు మహారథికుడుగా ప్రఖ్యాతుడయి మగధదేశానికి చక్రవర్తి అయాడు. మిగిలిన నలువురినీ నాలుగు రాజ్యాలకూ అధిపతులను చేశాడు. (మణివాహన, ప్రత్యగ్రహ, యదు మావేల్ల అని వారి పేర్లు)

తన రాజధానీ నగరసమీపంలో ప్రవహించే శుక్తిమతీ నదికి కోలాహలమనే పర్వతం అడ్డురాగా దాన్ని తన పాదంతో తన్ని తునాతునకలు చేశాడు. ఆ కోలాహల సంయోగ కారణంగా నదీగర్భంనుంచి ఒక బాలుడు, బాలిక ప్రభవించారు. వారిద్దరినీ ఉపరిచరునికి అప్పగించింది శుక్తిమతి.

ఆ కన్యను ఆయన భార్యగా గ్రహించాడు. ఆమె పేరు గిరిక. ఆ బాలుని పరాక్రమం గ్రహించి సేనాపతిగా నియోగించాడు.

ఒకనాడు వేటకువెళ్ళి, ఆ వసంతశోభకు మదనతాపం చెలరేగి యింద్రియ స్ఖలనం అయింది. ఆ సమయాన శాపవశాత్తూ మత్స్యరూపంలో ఉన్న అద్రిక అనే అప్సరస గర్భాన అదిపడి ఒక బాలిక, బాలుడు పుట్టారు. ఆ బాలుడు మత్స్యుడనీ, బాలిక మత్స్యగంధి అనీ ప్రఖ్యాతు లయారు. ఈమెనే సత్యవతి అని పిలుస్తారు.

నదీతీరాన ఉండే దాశరాజుకి బాలికను నప్పగించాడు ఉపరిచరవసువు. ఆమె అక్కడే పడవ నడుపుతూ తండ్రి అదుపాజ్ఞలలో పెరుగుతున్నది.

ఆ రోజులలో ఒకనాడు పరాశరమహర్షి ఆ దారినే వచ్చి నది దాటడానికి పడవ ఎక్కాడు.

నావ నదీమధ్యం చేరింది.

పరాశరమహర్షి హృదయం చలించింది.

సిద్ధ సాధ్య గణాలను సమ్మోహింపజేసే సత్యవతి సౌందర్యం ఆ మునిచంద్రుని మనసును చూరగొన్నది. ఆయన తన మనస్సు విప్పి చెప్పాడు.

ఆమె సిగ్గుతో పరిసరాలలో ఉన్న మునిజనాన్ని చూపింది.

ఆయన తపశ్శక్తితో పరిసరాలలో చీకటితెరలు ప్రసరించాడు.

అప్పుడామె: స్వామీ! నేను కన్యను. నామీద సర్వాధికారాలూ మా నాన్నగారివి. ఇది మీరెరుగని విషయం కాదు. పయిగా యిందువల్ల నా కన్యాత్వం దూషితం అయితే బంధువుల ముందు నేను నిలబడగలనా!

అని శంకించింది.

తరుణీ! ఇందువల్ల నీ కన్యాత్వం దూషితం కాని వరం యిస్తున్నాను. మరేంకావాలో కోరుకో అన్నాడు.

ఆమె: స్వామీ! నా శరీరం మత్స్యగంధంతో ఉన్నది. దాన్ని తొలగించండి, అనగా అనుగ్రహించాడు మహర్షి.

## వ్యాసజననం

పరమసంతోషంతో పరాశరుని వాంఛ తీర్చింది. తీరిన ఉత్తరక్షణంలో:

పరమేష్ఠికల్పుఁడగు న
ప్పరాశరు సమాగమమునఁ బరమగుణైకా
భరణకు ననవద్యమనో
హరమూర్తికి సత్యవతికి నమ్మునిశక్తిన్.

సద్యోగర్భంబున
నహిమద్యుతితేజుండు
వేదమయుఁ డఖిలమునీంద్రాద్యుఁడు
వేదవ్యాసుం డుద్యత్ జ్ఞానంబుతోడ
నుదితుండయ్యెన్ —

మునిలోకపూజ్యుడు, వేదవేదాంగవిదుడు అయిన వేదవ్యాసుడు సద్యో గర్భంలో ఉదయించి తల్లికి నమస్కరించి :

అమ్మా! నేను తపోదీక్షకు వెడుతున్నాను. నువ్వు ఎప్పుడు స్మరిస్తే అప్పుడు నీ సమక్షంలో ఉంటాను. అని తపోవనానికి వెళ్ళి తీవ్రనిష్ఠతో తపస్సుచేశాడు.

సంచితపుణ్యుఁ డంబురుహసంభవు నంశముఁ దాల్చి, పుట్టి
లోఁకాంచితుఁ డైనవాడు నిఖి లాగమపుంజము
నేర్పడన్ విభాఁగించి జగంబులందు వెలుఁగించి
సమస్త జగద్ధితంబుగాఁ బంచమవేదమై పరఁగు
భారతసంహితఁ జేసె నున్నతిన్:

ఆ మహర్షి అనుగ్రహించిన మహాభారతాన్ని సావధాన చిత్తులై ఆకర్ణించండి.

ఇంద్రపదవిని అధిష్ఠించిన నహుషుని కుమారుడు యయాతి. ఆయన కుమారులలో కనిష్ఠుడయిన పూరువు కారణంగా పురువంశం ఏర్పడింది. పురువంశీయులలో ప్రముఖుడు ప్రతీప మహారాజు.

ఈ మహారాజు సర్వప్రజలనూ అనురాగంతో చూస్తూ, ధర్మమార్గం విడవకుండా చిరకాలం రాజ్యపాలనం చేసి, గంగానదీతీరాన తపస్సు చేస్తున్నాడు.

ఆ రోజులలో ఒకనాడు —

గంగ దివ్యాంగన రూపంతో నిజాంగదీప్తులతో వచ్చి ఆ ప్రతీప మహారాజు యొక్క కుడి తొడమీద కూర్చుని, కనులలో తన కామవాంఛను కేంద్రీకరించి చూసింది.

ప్రతీపుడు: ఓ పద్మనయనా! నువ్వెవరవు? ఎందు కిలా వచ్చావు.

గంగ: ఇంద్రసమతేజా! నేను జహ్నుముని పుత్రిని. నన్ను జాహ్నవి అంటారు. నిన్ను భర్తగా కోరి వచ్చాను.

ప్రతీపుడు: అగ్నిసాక్షిగా పరిణయమయిన పత్నిని తప్ప మరొక వనిత వదనం చూడని నన్ను కోరాలని నీ కెందుకు బుద్ధి పుట్టింది. పుట్టినా నారీజనం వామ భాగాన ఉండాలి కాని, కన్నబిడ్డలు కూర్చునే కుడితొడమీద కూర్చుంటారా! అయినా నువ్వు కోరికతో వచ్చావు కనక నా కుమారుని భార్యగా నిన్ను స్వీకరిస్తాను. అనడంతో గంగ నిష్క్రమించింది.

ప్రతీపమహారాజు తన భార్య సునందాదేవితో విధ్యుక్తంగా ధర్మకర్మలాచరిస్తూ సంసారయాత్ర చేస్తూ ఒక కుమారుని కన్నాడు. ఆ బాలునికి శంతను డని పేరుపెట్టి సర్వవిద్యలూ నేర్పించి రాజ్యభారం అప్పగించి.

నాయనా! ఒకనాడు గంగానదీతీరాన ఒక సుందరాంగి నన్ను చేరినప్పుడు, ఆమెను నా కోడలుగా స్వీకరిస్తానన్నాను. ఆమె నీకు తటస్థ పడినప్పుడు నిశ్శంకగా ఆమెను వివాహం చేసుకో, అని తపోవనానికి వెళ్ళాడు.

శంతనుడు రాజ్యం పాలిస్తూ దేవేంద్ర సదృశంగా వెలుగుతున్నాడు. ఒకనాడాయన ధనుర్బాణాలు ధరించి వేటకు వెళ్ళి ఘాతుకమృగా లెన్నిటినో సంహరించి. గంగా తీరానికి వచ్చాడు.

అక్కడ విశ్రాంతిగా విహరించే సమయంలో గంగ దివ్యాంగనా రూపంతో సాక్షాత్కరించింది. ఆ లావణ్యవతిని చూసిన శంతనుని మనసులో మదనుడు అలజడి లేపాడు. ఆయన ఆమెను సమీపించి:

సుశ్రోణీ! దేవ, దానవ, నాగ, గంధర్వ, యక్ష, రాక్షస, మానవ భామలలో యింతటి సౌందర్యవతిని నేను చూడలేదు. నన్ను అనుగ్రహించు అన్నాడు.

గంగ: మహారాజా! నాకేమీ అభ్యంతరం లేదు. అయితే కొన్ని నియమాలున్నాయి. నా మాటను కాదన్నా, నా మనసుకి కష్టం కలిగించినా ఆ క్షణంలో నేను మిమ్మ్మి విడిచి వెడతాను. ఇది మీకు అంగీకారం అయితే మీ అభీష్టం నెరవేరుతుంది.

గంగా శంతనుల వివాహం అయింది.

వారి సంసారయాత్రలో గంగ ఏడుగురు బిడ్డలను కని అందరినీ నదీ ప్రవాహంలో విడచి, ఎనిమిదవ కుమారునికూడా అదే రీతిగా విడవడానికి సన్నిద్ధం అవుతూండగా :

ఓ వనితా! అసలు నువ్వెవరవు? ఎందుకిలా చేస్తున్నావు. పుత్రహత్యా పాతకభీతి లేదా నీకు! అని నిరోధించాడు.

నియమానుసారం నేను నిన్ను విడిచి వెడుతున్నాను. అంటూ గంగ:

నేను జాహ్నవిని; సర్వముని సంఘ సేవితను. దేవకార్యార్థం నీ దగ్గరకు వచ్చాను. వసిష్ఠుల శాపంవల్ల వసువులకు నరజన్మ ఎత్తవలసి వచ్చింది. నన్ను వేడారు. వారి శాప విమోచనార్థం యిలా చేశాను. ఇంక ఈ బాలుడు వారందరి అంశలతో జన్మించాడు. వీడు నీ వంశప్రతిష్ఠను నిలుపుతాడు. వీని విద్యాభ్యాసం అయేవరకూ నాదగ్గర ఉంచి తరువాయి నీకు అప్పగిస్తాను. వీనిని గంగానందనుడని పిలుస్తారు, అందరూ అంది:

అంగీకరించాడు శంతనుడు

ఇరవైనాలుగు సంవత్సరాలు గడిచాయి.

ఒకనాడు వేటకు వచ్చిన శంతనుడు గంగాతీరాన విహరిస్తున్న యువకుని చూచి ఆశ్చర్యచకితుడై నిలబడగా గంగ ఆ యువకుని తీసుకొనివచ్చి: ఈ బాలుడు నీ కుమారుడు. వీడు సర్వ విద్యావిదు డయ్యాడు. ఇంక, నీ వెంట తీసుకు వెళ్ళవచ్చు, అంది:

శంతనుడు గాంగేయుని వెంటబెట్టుకొని రాజధాని చేరాడు.

శంతన మహారాజు తన కుమారునితో రాజధానికి వచ్చాడు. గాంగేయుడు తన సత్ప్రవర్తనతో, విద్యాశక్తులతో సర్వ ప్రజారంజకత్వం సంపాదించాడు. అలా నాలుగేళ్ళు గడిచాయి.

శంతనుడు ఒక సాయంసంధ్యలో యమునానదీ తీరాన విహరిస్తూ, చల్లగా వీచే గాలిలో సువాసనలు రాగా, అటే సాగి సాగి వినీలకేశపాశంతో,

పద్మదళలోచన దీప్తులతో కన్ను కదలనీయని సుందర రూపంతో వున్న యౌవనాంగిని చూసి, ఆమె గోత్రనామాలు ప్రశ్నించగా, తాను ఆ ప్రాంతపు నిషాదరాజు బిడ్డననీ, ఆయన ఆజ్ఞానుసారం యమునా నదిలో పడవ నడుపుతూ బాటసారులను దాటిస్తాననీ అంది.

రూపాన్ని మించిన ఆమె మృదు మధుర వాక్యాలు విన్న మహా రాజు అప్పటికప్పుడే నిషాదరాజును సమీపించి ఆమెను తనకు భార్యగా అనుగ్రహించ మని వేడుకున్నాడు.

తన బిడ్డకు అంతకంటె ఉత్తమ వరుడు లభించడనీ అయితే తన అభిమతానుసారం ఆమె కుమారుడే రాజ్యాధికారి కావాలనీ అన్నాడు.

శంతనుడు ఆమోదించలేక తిరిగివచ్చి, విచారహృదయంతో, ఆమె యందే మనసు నిలిపాడు. తండ్రి విచారంతో వుండడం గమనించిన గాంగేయుడు ఆయన బాధకు కారణం తెలుప గోరగా:

నాయనా! నువ్వు నాకు ఒక్క కొడుకువు. అయినా వందల బిడ్డలను కన్న తృప్తి వున్నా, నువ్వు మహావీరుడవు కావడంవల్ల ఏ సమయంలో నీకు ఏ ప్రమాదం సంభవిస్తుందో, అందువల్ల ఈ పురువంశం అంతరిస్తుందేమో అని బాధపడుతున్నాను.

వేదత్రయమూ, అగ్నిహోత్రమూ, శిష్యప్రశిష్యయుత మయిన విద్యా వంశమూ ఆత్మసంతానంతో సమానం కాబోవు అని మహామహులు చెపుతున్నారు. సంతానజ్యోతి నిరంతరాయంగా ప్రకాశిస్తూ వుండాలి - అన్నాడు.

అది విని గాంగేయుడు వృద్ధమంత్రిని సమీపించగా నిషాదరాజు పెట్టిన నియమం వినిపించాడు. గాంగేయుడు కులవృద్ధులతో నిషాదరాజును చేరి :

దాశరాజా! నీ నియమానుసారం నీ దౌహిత్రుడే రాజ్యాధికారి అవు తాడు. నేను ఈ క్షణంలో రాజ్యవాంఛ త్యాగంచేస్తూ, నా సర్వాధికారాలనూ వదలుకుంటున్నాను అన్నాడు.

అప్పుడు దాశరాజు: రాజనందనా! నీమీద నాకు విశ్వాసం వుంది. కాని నీ సంతానం రాజ్యకాంక్ష లేకుండా వుంటారని నాకు నమ్మకం వుండదు కదా! అనడంతో :

ఓ దేవతలారా! పితృప్రియం కోరుతూ నేను చేసే ప్రతిజ్ఞ ఆల కించండి. ఇతః పూర్వమే నేను రాజ్యవాంఛ విడిచిపెట్టాను. ఇప్పుడు బ్రహ్మచర్యవ్రతం స్వీకరిస్తున్నాను. అద్యప్రభృతి ఈ నియమాన్ని ఆజన్మాంతం సాగిస్తాను-అన్నాడు.

దాశరాజు హృదయం పొంగి పులకించింది. మరుక్షణమే తన బిడ్డను గాంగేయునితో రథం ఎక్కించి హస్తినాపురం పంపాడు.

కుమారుని ప్రయత్నమూ, ప్రతిజ్ఞా విన్న శంతనుడు హర్షపులకితుడై నానికి స్వచ్ఛంద మరణం వరంగా యిచ్చి సత్యవతిని విధ్యుక్తంగా వివాహ మాడాడు.

సత్యవతీ శంతనుల దాంపత్యఫలంగా చిత్రాంగదుడూ, విచిత్రవీర్యుడూ అను కుమారు లిద్దరు కలిగారు. వారికి యింకా యౌవనం రాకుండానే శంతనుడు దివంగతుడయ్యాడు. సత్యవతి ఆజ్ఞానుసారం చిత్రాంగదుని పట్టాభిషిక్తుని చేసి రాజ్యవ్యవహారాలు తానే చూస్తున్నాడు గాంగేయుడు.

చిత్రాంగదుడికి వయస్సు వచ్చింది. ఆ రోజులలో చిత్రాంగదుడనే గంధర్వుడొకడు వచ్చి నువ్వు కూడా నా పేరే పెట్టుకున్నావు. కనుక నాతో యుద్ధంచేసి గెలుపొందినా సరే, లేదా నీ పేరు మార్చుకున్నా ఆనందమే, అనగా చిత్రాంగదుడు కోరమీసం మెలిద్రిప్పి యుద్ధానికి పిలిచాడు. ఆ యుద్ధంలో చిత్రాంగదుడు నేలకూలడంతో విచిత్రవీర్యుని సింహాసనం ఎక్కించాడు భీష్ముడు.

విచిత్రవీర్యుడికి వయసురాగానే గాంగేయుడు కాశీరాజకన్యలను ముగ్గు రిని స్వయంవరంలో జయించితెచ్చి, తన సోదరుని కిచ్చి పెళ్ళి చేయ్యా లనుకున్నాడు. వారిలో అంబ తానంతకు ముందే సాళ్వ దేశాధిపతికి తన హృదయం అర్పించా నంది. ఆమెను రథం మీద పంపి అంబిక, అంబాలికలకు విచిత్రవీర్యునితో పెండ్లి చేశాడు.

ఏడు సంవత్సరాలపాటు విచిత్రవీర్యుదు అంతఃపురం వీడకుండా భార్యలిద్దరితో కామోపభోగా లనుభవించడంతో క్షయవ్యాధి ఆయన దేహాన్ని ఆరగించింది.

గాంగేయుడు విచార పూర్ణహృదయంతో తల్లి అనుమతి పొంది సోద రునికి దహన సంస్కారాలు పూర్తిచేశాడు. సత్యవతిహృదయం పుత్రశోకంతో నిండింది. రోజులు గడుస్తున్నాయి. గాంగేయుడికి వెన్ను విరిగినట్లే అయింది.

## ధృతరాష్ట్రాదుల జననం

రోజులు వెనుకబడుతున్నాయి.

సత్యవతి కొంతతేరుకుని:

గాంగేయా! ఈ వంశ కీర్తి ప్రతిష్ఠలూ, వీరి పరలోకగతులూ నీ మీద ఆధారపడి వున్నాయి. విచిత్రవీర్యుని భార్యలిద్దరూ నిండు యౌవనంలో వున్నారు. దేవర న్యాయానుసారం నువ్వు వారియందు సంతానం పొంది ఈ వంశాన్ని ఉద్ధరించు, అంది.

అమ్మా! నా ప్రతిజ్ఞ నువ్వెరగనిది కాదు; ఏ ప్రలోభంతోనూ నేను రాజ్యాన్ని కానీ, స్త్రీని కానీ మనస్సులోకి రానివ్వను, అన్నాదు గాంగేయుడు.

ఆ సమాధానానికి సత్యవతి తృప్తిపడి:

నాయనా! పరాశరుని అనుగ్రహ విశేషంవల్ల కన్యాత్వం చెడకుండా నేను వ్యాసుని కన్నాను. నేను ఎప్పుడు తలచుకుంటే అప్పుడే వస్తానన్నాడు వాడు. ఇప్పుడు వానిని రప్పించి, ఈ ధర్మకార్యం వానిచేత పూర్తిచేయిద్దాం, అని వ్యాసుని స్మరించగా ప్రాంశు పయోదనీలతనుభాసితుడు, ఉజ్జ్వల దండధారి, కమండలపాణియై సాక్షాత్కారించి తల్లికి అభివాదంచేసి నిలువగా:

నాయనా! నువ్వు సర్వధర్మవిదుడవు. ఇప్పుడు దేవర న్యాయానుసారం ఈ వంశాన్ని నిలబెట్టాలి, అనగా తల్లి మాటలకు తలవంచాడు వ్యాసుడు.

సత్యవతి పెద్దకోడలిని పిలిచి: అంబికా! నా దురదృష్టంవల్ల కొడుకు లిద్దరూ పోయారు. ఇందుమూలంగా ఈ కురువంశం అంతరించే ప్రమాదం ఏర్పడింది. ఆ ప్రమాదం నుంచి రక్షించడానికి గాంగేయుని అనుమతితో వ్యాసులవారిని అంగీకరింపజేశాం. ఆయన అనుగ్రహాన నువ్వు కుమారుని కని ఈ రాజ్యానికి ప్రభువుగా నిలబెట్టాలి. అని ఆమెను అంగీకరింపజేసి శయ్యాగృహానికి పంపింది.

రత్నదీపకాంతులు నిండిన హంసతూలికాతల్పం మీద అతిలోక మోహ నాంగి అంబిక సంతానార్థియై వ్యాసులవారికోసం నిరీక్షిస్తున్నది. ఆయన వచ్చాడు.

శయ్యామందిరం వీడి వెడుతూండగా సత్యవతి: 'నాయనా!' అని సాభిప్రాయంగా చూసింది.

అమ్మా! ధీరుడూ శూరుడూ అనంతశక్తి సంపన్నుడూ, విద్వాం సుడూ అయిన కుమారుడు జన్మిస్తాడు. అయితే మాతృదోషంవల్ల వాడు అంధుడవుతాడు - అని చెప్పాడు.

నాయనా! ఈ కురుసామ్రాజ్యానికి గుడ్డివాడు రాజు కావడానికి వీలులేదు. అందుచేత రాజ్యాధికారం వహించగల కుమారుని అంబాలి కకు అనుగ్రహించు — అని ప్రార్థించగా అంగీకరించి వ్యాసుడు, ఆమె శయనాగారానికి వెళ్ళాడు.

ఆయన తిరిగివస్తూండగా సత్యవతి ఎదురయింది.

అమ్మా! వీడుకూడా మహావీరుడూ శూరుడూ అవుతాడు. కాని మాతృదోషం వల్ల పాండువర్ణదేహి అవుతాడు. అనగా ఆమె, నాయనా! ఏ అవలక్షణాలూ లేని మరొక బాలుని అంబికకు అనుగ్రహించు అంది.

అంగీకరించాడు. అమ్మమాట వ్యాసమహర్షి.

అంబిక అత్తగారిమాటకు ఎదురు చెప్పక అంతఃపురానికి వచ్చి తన దాసిని అపూర్వంగా అలంకరించి పంపింది. శయ్యామందిరంలో ఆ మహర్షిని సేవించి, ఆనందించి, సంతుష్టునిచేసి ఆయనతో శయనించింది, దాసి.

ఆయన తిరిగివెడుతూ: అమ్మా! అంబిక తనదాసిని పంపింది. శాపగ్రస్తుడయిన యమధర్మరాజును ఆమె గర్భంలో నిక్షేపించాను. వాడు మహావిద్వాంసుడూ, ధర్మపరుడూ, లోభ, క్రోధరహితుడూ అయి ఈ వంశశ్రేయస్సుకు పాటుపడతాడు. అని నిష్క్రమించాడు.

## వివాహ వేదిక

బాలురు ముగ్గురూ పెరుగుతున్నారు. ప్రజలందరూ ఉత్సవాలతో ఉత్సాహంతో గడుపుతున్నారు.

యౌవనం రాగానే ధృతరాష్ట్ర, పాండురాజ, విదురులకు వివిధ విద్యలూ నేర్పించాడు భీష్ముడు. పాండురాజు ధనుర్విద్యలో అసమానఖ్యాతి గడించాడు. ధృతరాష్ట్రుడు దేహబలంలో అసదృశు డయాడు. విదురుడు ధర్మవిషయవిదుడూ, ఆత్మజ్ఞానీ అయాడు.

అంధత్వం కారణంగా ధృతరాష్ట్రుడూ, అన్యక్షేత్రం కారణంగా విదురుడూ సింహాసనార్హులు కారని పాండురాజును చక్రవర్తి పీఠం ఎక్కించారు. అనంతరం ఒకనాడు భీష్ముడు విదురునితో:

నాయనా! వ్యాసుని కృపవల్ల ఈ కురువంశం నిలిచింది. ఇప్పుడు మీరు ముగ్గురూ ఈ రాజ్యచక్రాన్ని నడపాలి. ధృతరాష్ట్రుడూ, పాండురాజూ నవయౌవనులయారు. వారికి యోగ్యులయిన రాజపుత్రికలను పరిణయం చెయ్యాలి. గాంధార రాజు సుబలుని కుమార్తె గుణ శీల రూపవతి అని విన్నాను. అలానే యదువంశీయు డయిన శూరసేనుని కుమార్తె కుంతిభోజుని దత్తపుత్రికగా పెరుగుతున్నది. వారిద్దరినీ మన ఇంటి కోడళ్ళుగా తీసుకురావాలని వుంది. నీ అభిప్రాయం ఏవిటి, అని అడిగాడు.

వినయంతో విదురుడు: ఆర్యా! మీకంటె మా కెక్కువ తెలిసిందిలేదు. మీ అభిమతానుసారం జరిపించండి, అన్నాడు.

గాంగేయుడు గాంధార దేశానికి దూతను పంపాడు. ధృతరాష్ట్రుడు గుడ్డివాడని విన్న సుబలుడు కొంత విచారించాడు. తనకు కాబోయే భర్త

అంధుడని వింటూనే గాంధారి ఒక వస్త్రంతో తన కన్నులు బంధించుకొన్నది. తన భర్త నేత్రదోషాన్ని చూడడం ఇష్టం లేక ఆ శీలవతి అలా ప్రవర్తించ డంతో సుబలుడు తన బిడ్డను వారికివ్వడానికి అంగీకరించాడు. గాంధార రాజకుమారుడు శకుని తనసోదరితో హస్తినాపురం వచ్చి గాంగేయుని ఆజ్ఞానుసారం విధ్యుక్తంగా వివాహం జరిపించాడు. గురువృద్ధజన సేవతో గాంధారి వారందరి అభిమానానికీ, ప్రజాగౌరవానికీ పాత్రురా లయింది.

శూరసేనుని యింటబుట్టిన కుంతీదేవి కుంతిభోజుని దత్తపుత్రికగా వెళ్ళి అక్కడ సకల భోగభాగ్యాలతో పెరిగే రోజులలో వారింటికి అతిథిగా వచ్చిన దుర్వాసమహర్షిని సేవించి, ఆయన అనుగ్రహంతో యిచ్చిన వర ప్రభావాన్ని పరిశీలించే సంకల్పంతో సూర్యుని ఆహ్వానించి, కర్ణుని ప్రసవించి గంగలో విడిచింది.

సూర్యవరంవల్ల కన్యాత్వం చెడని కుంతి నవయౌవనాంగియై సర్వరాజ కుమారులకూ ఆకర్షణీయం అయింది.

కుంతిభోజుడు స్వయంవరం ప్రకటించాడు. వచ్చిన రాజులందరిలో కుంతీ హృదయాన్ని పాండురాజు చూరగొన్నాడు. భూసురాశీర్వాదాలతో వారి వివాహం జరిగింది. కుంతిని వెంటబెట్టుకుని పాండురాజు స్వగృహానికి వచ్చాడు. నాటి రాజవంశాలలో పేరుపడ్డ వారు మద్రదేశాధీశులు, మద్ర దేశాధిపతి శల్యుడికి మాద్రి సోదరి. ఆమె గుణరూపశీలాలు విన్న భీష్ముడు ఆమెనుకూడ పాండురాజుకిచ్చి పరిణయం చేయ నిశ్చయించి వారి దేశానికి వెళ్ళి, స్వాగత మర్యాదలందుకుని విషయం చెప్పాడు.

అప్పుడు శల్యుడు - ఆర్యా! నీవంశంతో సంబంధం మాకెంతో సంతోష ప్రదం. అయితే మావంశాచారానుసారం కన్యాశుల్కం చెల్లించి మీరు మాసోదరిని తీసుకువెళ్ళండి, అన్నాడు. సువర్ణ, రత్నాభరణాలు శల్యునికి చెల్లించి మాద్రిని తన వెంటతెచ్చి ఒకానొక సుముహూర్తంలో పాండురాజుకిచ్చి పెళ్ళిచేయించాడు గాంగేయుడు.

భార్యాద్వయంతో పాండురాజు ధర్మపథం వీడకుండా ప్రజారంజకంగా పాలిస్తూ ఒకనాడు గాంగేయునిచేరి.

ఆర్యా! దిగ్విజయయాత్ర చేసి రావాలనే కోరికతో వున్నాను. ఆశీర్వ దించండి. అనగా, ఆహ్లాదతరంగిత హృదయుడై భీష్ముడు కురువృద్ధులతో, గురుజనంతో పాండురాజును ఆశీర్వదింపజేసి, చతురంగబలాలతో యాత్రకు పంపాడు.

నానాదేశాధీశులను జయించివచ్చిన పాండురాజుకి హస్తినాపురం ప్రజలు అమితోత్సాహంతో స్వాగతం పలికారు. పాండురాజు తాను తెచ్చిన ధన కనకరాసులు భీష్ముని ముందుంచి, ఆయనపాదాలకు అభివాదం చేశాడు. భీష్ముడు గాఢాలింగనం చేసుకుని పొంగిపోయాడు. అంతఃపురికివెళ్ళి తెచ్చిన భూషణాలు తల్లిముందుంచాడు. పాండురాజు.

జయంతుని శచీదేవి ఆలింగనం చేసుకున్నట్లు అంబాలిక పాండు రాజును దగ్గరకు తీసుకొని శిరస్సు మూర్కొన్నది.

అనంతరం పాండురాజు అన్నగారిచేత అశ్వమేధయాగాలు చేయించి అన్నదానాలతో సువర్ణరత్నరాసుల బహూకృతులతో, ప్రజారంజనం చేశాడు.

కొంతకాలం గడిచింది.

భార్యలిద్దరినీ వెంటబెట్టుకుని పర్వత, వనప్రాంతాలలో విహరించే కోరి కతో హిమవత్పర్వత ప్రదేశానికి వెళ్ళి అక్కడ యధేచ్ఛగా విహరిస్తున్నాడు. ఆడు ఏనుగుల మధ్య గజరాజులా వున్నాడాయన. వారికి అవసరమయిన సామగ్రులు సేవకులు తెచ్చి పెడుతున్నారు.

ఆ రోజులలోనే - దేవకుడనే రాజుదగ్గర వినయసంపన్న అయిన బాలామణి వున్నదని విని భీష్ముడు వెళ్ళి ఆమెను తెచ్చి విదురునకిచ్చి వివాహంచేశాడు. ఈ విధంగా కురువంశోద్ధారకులయిన ధృతరాష్ట్ర పాండు రాజ విదురులు పెరుగుతున్నారు, నిత్యసంతోషచిత్తులై, ధర్మతత్పరులై, ప్రజాభిమానరతులై, అని వైశంపాయనుడు సాగుతున్నాడు.

## కురు పాండవ జననం

జనమేజయ మహారాజా! పాండురాజు వనవిహారానికి వెడుతూ ధృత రాష్ట్రుని సర్వాధికారిగా వుంచాడు. ఆయన రాజ్యచక్రం నడుపుతున్నాడు. ఆ

రోజులలో ఒకనాడు వ్యాసుడు విచ్చేశాడు. ఆయన పరిచర్యలన్నీ గాంధారి స్వయంగాచేసి వారి అభిమానానికి నోచుకొని నూరుగురు బిడ్డలతల్లి అయ్యే వరం పొందింది.

పర్వత, వనప్రాంతాలలో విహరించే పాండురాజు వేటసాగిస్తూ ఒక నాడు రతిక్రీడలోవున్న లేడిని పడగొట్టాడు. బాణఘాతంతో నేలకూలిన ఆడులేడి ఆక్రందనంతో, గుండె విలవిలలాడిన మగలేడి.

"మహారాజా కురువంశీయులు తలవంచుకునే పనిచేశావు. అనురాగ క్రీడలో ఆనందించే మృగాలను కరకుగుండె వేటగాడుకూడా హింసించడే. అటువంటిది రాజవంశంలో పుట్టి నారీద్వయంతో విలాసవిహారం చేసే నువ్వు చేసిన యీ హింసకు ప్రాయశ్చిత్తం తప్పదు. ఏక్షణంలో నువ్వు కామదృష్టితో స్త్రీని దగ్గరకు తీసుకుంటావో అదే క్షణంలో మరణిస్తావు, అని అక్కడే ప్రాణాలు విడిచింది. (కిందముడనే ముని ఆరూపంలో విహరిస్తూన్న లేడి.)

పాండురాజు ఎంతగానో విచారించి, వేటవల్ల ఎటువంటిబాధలు కలుగుతాయో గ్రహించి ధనుర్బాణాలు విడిచి, సన్యాసం స్వీకరించడానికి ఉద్యుక్తుడయాడు. అప్పుడు ఆయన భార్యలిద్దరూ:

ప్రభూ! దీనికోసం సన్యాసం అవసరంలేదు. వానప్రస్థమార్గం వున్నది. మేము కూడా మీతోనే వుంటాం, అన్నారు.

అందుకు పాండురాజు అంగీకరించి, అనుచరుల నందరినీ రాజధానికి పంపి, అనేక పర్వత, వనప్రాంతాలు తిరిగి, శతశృంగ పర్వతం చేరాడు. అక్కడ ఋషులతో సత్కాలక్షేపాలు చేస్తూ ఇంద్రియాలను జయించి తపోదీక్ష వహించాడు.

ఒకనాడు ఆ ఋషులందరూ వుండగా పాండురాజు:

మహాత్ములారా! మానవజన్మ యెత్తినవాడు పితృ, దేవ, ఋషి, మనుష్య ఋణాలు నాలుగింటిలో యజ్ఞకర్మతో దేవఋణాన్నీ, తపస్స్వాధ్యాయ నిరతితో ఋషిఋణాన్నీ, దయాదానాలతో మనుష్య ఋణాన్నీ

తీర్చుకుంటాడు. సంతానవంతుడై, శ్రాద్ధకర్మలు చేసి పితృఋణం తీర్చుకోవాలి. సంతానంలేని నేను ఈ పితృఋణవిముక్తి ఎలా పొందగలను, అని ప్రశ్నించాడు.

పుణ్యాత్ముడా! నీకు దేవతాసమపరాక్రము లయిన పుత్రులు కలిగే అదృష్టంవున్నట్లు మాకు గోచరిస్తున్నది. కనుక చింతించక ప్రయత్నించు, అన్నారు.

అప్పుడు పాండురాజు ఏకాంతంలో కుంతిని సమీపించి:

శూరసేననందినీ! మాతృపితృవంశాలను ఉద్ధరించగల సంతానంలేని వానిజన్మ వ్యర్థం కనుక నా హృదయశాంతికోసం నువ్వు సంతానవతివి కావాలి. బంధుదాయాదులూ, అబంధుదాయాదులూ అని పన్నెండువిధాల సంతానం వుంది. అందులో ఉత్తమపురుష సమాగమంతో కలిగే సంతానం ప్రణీతులు అనబడతారు. ఇప్పుడు నువ్వు ఆ మార్గం అనుసరించాలి, అన్నాడు.

మహారాజా! మీరు సంతానవాంఛా సంతప్తహృదయంతో నన్ను ఏంచెయ్యమంటున్నారో ఊహించలేకపోతున్నారు. నా మనస్సు మీరు చెప్పినదానిని సహించడం లేదు, అని కుంతి దీనవదనంతో అన్నది.

కల్యాణీ! ధర్మాధర్మ నిర్ణయంలో నాకంటె తెలిసినదానివి కాదు. అయినా భర్త మాటకు ఎదురుచెప్పకుండా ఆయన శాసనాన్ని పాటించడమే స్త్రీకి పరమోత్తమ ధర్మం. అటువంటి మహోత్తమ ధర్మాన్ని విడిచి ఎన్ని మంచిపనులు చేసినా, పూజలూ, వ్రతాలూ సాగించినా వ్యర్థమే. భర్త మనసుకు వ్యతిరేకంగా చరించి బాధ కలిగించే ఆడది ఎన్ని ధర్మకార్యాలు చేసినా బూడిదలోపోసిన పన్నీరే, అని ధర్మవిదులు చెపుతున్నారు. కనక నువ్వు నా అభిమతానుసారం ప్రవర్తించాలి — అని నొక్కి చెప్పాడు.

కుంతీదేవి: అయితే వినండి. నా చిన్ననాడు ఒక మహా మునిని సేవించి పొందిన వరంతో నేను దేవతలను ఆహ్వానించి వారివల్ల సంతానవతిని కాగలను, అనగా అంగీకరించాడు పాండురాజు.

యమధర్మరాజును ఉపాసించి ధర్మరాజునూ, వాయువును ఆహ్వానించి భీమసేనునీ, ఇంద్రుని ప్రార్థించి అర్జునునీ కన్నది. పాండురాజు ఆనందభరితహృదయుడై కుంతిని అభినందించాడు.

ధృతరాష్ట్రుని అనురాగంతో గాంధారి గర్భవతి అయింది. మాసాలు సాగుతున్నాయి. అంతలో అక్కడ కుంతి ప్రసవించినవార్త గాంధారి చెవినిబడి కడుపు బాదుకొని రోదించింది. ఆ తాడనానికి ఆమె గర్భంనుండి పిండం బయటపడింది. ఆమె మరీ రోదిస్తూంటే వ్యాసుడువచ్చి చింతించవద్దనిచెప్పి, నూరుకుండలు నేతితో నింపించి వాటిని గుప్తస్థానంలో వుంచి, ఆ పిండాన్ని శీతలజలాలతో తడపమన్నాడు. అది నూటఒక్క శకలాలయింది. ఆ శకలాలను కడవలలోవుంచి రక్షిస్తూండగా రెండు సంవత్సరాలకు నాటినుండి శిశువులు బయలుదేరారు.

అక్కడ కుంతి భీమసేనుని కంటున్నది ఇక్కడ దుర్యోధనుడు పుట్టాడు. వాడు పుడుతూనే గాడిదలా ఓండ్రపెట్టాడు. నగరం పెనుగాలులతో, ధూళితో, మహోత్పాతాలతో నిండిపోగా, ధృతరాష్ట్రుడు వృద్ధులందరినీ రావించి, మా వంశానికి ధర్మరాజే జ్యేష్ఠుడు, వాడే రాజ్యాధికారి కాగలడు. వాని అనంతరమయినా నా కుమారుడు సింహాసనం అధివసిస్తాడా? అని ప్రశ్నించాడు.

మహారాజా! ఈ ఉత్పాతాలన్నీ చూస్తూంటే వీడు వంశనాశకుడు కాగల డనిపిస్తున్నది. ఇప్పుడే వీనిని విడిచిపెడితే ఆ ప్రమాదం తప్పుతుంది.

వంశశ్రేయస్సుకోసం వ్యక్తినీ, గ్రామశ్రేయోదృష్టితో వర్గాన్నీ, దేశ కళ్యాణానికి గ్రామాన్నీ, ఆత్మాభ్యుదయానికి ప్రపంచాన్నీ విసర్జించు, అని ధర్మశాస్త్రం చెపుతోంది అన్నారు.

సంతానవాత్సల్యం నిండిన ధృతరాష్ట్రుని మనస్సు వారిమాటలు వినలేకపోయింది. గాంధారి గర్భవతిగా వుండగా ప్రభుసేవలోనున్న ఒక నారీమణికి యుయుత్సుడనే పుత్రుడు ధృతరాష్ట్రునివల్ల కలిగాడు.

(దుర్యోధన, యుయుత్సు, దుశ్శాసన, దుస్సహ, దుర్ముఖ, వివిం శతి, వికర్ణ, జలసంధ, సులోచన, విందు, అనువింద, దుర్ధర్ష, సుభాహు, దుష్ప్రకర్షణ, దుష్కర, కర్ణ, శల, చిత్ర, ఉపచిత్ర, చిత్రాక్ష, చారుచిత్ర, చిత్రాంగద, దుర్మద, దుష్ప్రదర్ష దుర్వి గాహ, వివిత్స, వికట, ఊర్ణనాభ, సునాభ, సత్వ, సమ, నంద, ఉపనంద, చిత్రబాణ, చిత్రవర్ణ, సువర్ణ, దుర్విరోచన, అయోబాహు, మహాబాహు, చిత్రాంగ, చిత్రకుండల, భీమవేగ, భీమబల, బలాకి, బలవర్ధన, ఉగ్రాయుధ, సుషేణ, కుండోదర, మహోదర, చిత్రాయుధ, నిషంగి, పాశి, వృందారక, ధృఢవర్మ, ధృఢక్షత్ర, సోమకీర్తి, అనూదర, ధృఢసంధ, జరాసంధ, సత్యసంధ, సువాక్కు, ఉగ్రశ్రవ, ఉగ్ర సేన, సేనాని, దుష్టరాజయు, అపరాజిత, పండితక, విశాలాక్ష, దురాధర, దృఢహస్త, సుహస్త, వాతవేగ, సువర్చస, ఆదిత్యకేతు, జిహ్వాశి, నాగదత్త, అగ్రయాయి, కవచి, క్రధన, దండి, దండధారి, ధనుర్గ్రహ, ఉగ్రభీమరథ, వీర, వీరబాహు, అలోలువ, అభయ, రౌద్రకర్మ, దృఢరథాశ్రయ, అనాధృష్య, కుండభేది, విరావి, చిత్రకుండల, ప్రమధ, ప్రమాధి, దీర్ఘరోమ, వీర్యవంత, దీర్ఘబాహు, మహాబాహు, వ్యూఢోరు, కనకధ్వజ, కుండాశి, విరజ, దుశ్శల).

వీరందరికీ వేదవేదాంగ విద్యలూ శస్త్రాస్త్రప్రయోగ-ఉపసంహారాలు నేర్పించి యుక్తవయస్సు రాగానే వివాహాలు చేయించాడు. భీష్ముడు.

దుశ్శలకు సింధురాకుమారుడయిన జయద్రధునితో పరిణయం జరి గింది.

కుంతీతనయులు పెరుగుతున్నారు.

ఒకనాడు పాండురాజుతో మాద్రి: నాథా! ఈనాటివరకూ నాకే క్లేశమూ లేదు, కాని నా సవతి సంతానవతి అవడం నాకు బిడ్డలు లేకపోవడం బాధగా వుంది. ఈ విషయం ఆమె ముందు ప్రస్తావించడానికి నా స్త్రీత్వం అడ్డువస్తున్నది, అని విలపించగా పాండురాజు కుంతిని పిలిచి, ఆ మంత్రం వుపదేశింపజేశాడు. ఆ మంత్రపునశ్చరణతో అశ్వినీ దేవతలను ఆహ్వానించి నకుల సహదేవులను కన్నది మాద్రి.

శతశృంగపర్వతంమీద పాండురాజు పుత్రవంతుడయిన వార్త విని వసుదేవుడు విప్రవరులతోవచ్చి వారందరికీ నామకరణాది సర్వ విధ్యుక్త కర్మలూ పూర్తిచేయించాడు.

పాండవులకు వేదవిద్యలు మునులు బోధిస్తూంటే, ధనుర్విద్యను రాజర్షి శుక మహారాజు బోధించాడు, లక్ష్యభేదన సూక్ష్మరహస్యాలతో.

ధర్మరాజు తోమరాలు విసరడంలో, భీముడు గదాచాలనంలో, అర్జునుడు ధనుర్విద్యలో, నకుల, సహదేవులు డాల్కత్తులతో ముందుకు సాగడంలో నైపుణ్యం ప్రదర్శించారు. నిర్మలసరోవరజలాలలో పద్మాలు ప్రవృద్ధమవుతున్నట్లు ధృతరాష్ట్రసుతులూ, పాండురాజనందనులూ ప్రవర్ధమానులవుతున్నారు.

## పాండురాజు మరణం

ఆ రోజులలో ఒకనాడు —

అర్జునుడికి పదునాలుగో సంవత్సరం ప్రవేశించిననాడు కుంతి సంతోషంతో తమ ఆశ్రమపరిసరాలలోని మునులకూ, స్నాతకులకూ భోజనభాజనాలు సమకూర్చి వారలందరినీ సాదరవచనాలతో ఆరగింపజేస్తున్నది. ఆ సమయంలో పాండురాజు మాద్రీసహితుడై దూరంగా వనవిహారం చేస్తున్నాడు. పూలవాసనలతో, ఆరణ్యకపక్షుల కలస్వనాలతో నిండిన ఆ ప్రాంతంలో విహరిస్తున్న వేళ పాండురాజు మనస్సు కామమలినమయింది. ఎంత ప్రయత్నించినా బలీయమైన ఇంద్రియవాంఛను నిగ్రహించలేక మాద్రిని గాఢంగా ఆలింగనం చేసుకున్న క్షణంలో ఆయన ప్రాణవాయువులు అనంతవాయుపథంలో కలిసిపోయాయి.

మాద్రి గోలుగోలున విలపించసాగింది. ఆమె దీనారావం చెవినిపడగానే కుంతి అటు వచ్చింది, ఆ పదధ్వని వింటూ మాద్రి:

అక్కా! పిల్లల్ని తీసుకురాకు. నువ్వు ఒంటరిగానే యిటురా - అంది.

అర్థమయింది పరిస్థితి కుంతీదేవికి.

ఏకాకిగావచ్చి చూసి, కన్నీరు విడుస్తూ

చెల్లీ ఎంత తెలివి తక్కువపని చేశావు! ఇప్పుడింక చింతించి లాభంలేదు. నువ్వు అదృష్టవంతురాలివి. ఆఖరు ఘడియలలో ఆయన అనురాగానికి నోచుకున్నావు - అంటూ భర్త పాదాలమీద పడి ఎంతోసేపు ఏడ్చింది. అప్పటికి అక్కడికి చేరిన మునులందరూ వారిని ఓదార్చి, విలవిల విలపించే పాండురాజ నందనులను దగ్గరకుతీసి ఉత్తరక్రియలకు ప్రయత్నిస్తూండగా కుంతి సహగమన సంకల్పం వెల్లడించగా మాద్రి: అక్కా! నావల్ల ఆయన ప్రాణాలు కోల్పోయారు, కనక నేనే సహగమనం చేస్తాను. పిల్లల పోషణ భారం నువ్వెరిగినంతగా నాకు తెలీదు. అందుచేత వీరి రక్షణభారం నువ్వు వహించు అంది.

భర్తృహీన జీవించడం న్యాయమా - అని కుంతి రోదించగా, మునులు అమ్మాయీ! బ్రహ్మచర్య నియమంతో, భోగలాలసత్వం విడిచి, ఉప్పూ కారం తినకుండా అధశ్శయనం చేస్తూ, భర్తనే స్మరించుకునే వ్రతం అనుసరించి పిల్లల రక్షణభారం వహించు. ఇప్పుడు నిన్నూ, పిల్లలనూ హస్తినాపురం పంపుతాం. ధృతరాష్ట్రుడు లోభబుద్ధి అయినా అటు కుంతిభోజాది చక్ర వర్తులనూ, ఇటు మద్రదేశాధిపతినీ స్మరించి వీరిని జాగ్రత్తగానే చూస్తాడు అని ఒప్పించారు.

పాండురాజుకి చితి పేర్పించి యధావిధి దహనసంస్కారానికి ఉప క్రమించారు. అగ్నిజ్వాలలు ఆకాశానికి లేస్తున్నవేళ మాద్రి ఆ చితిమీద పడింది. ఉభయుల భౌతిక దేహాలూ పంచభూతాలలో లీనమయాయి.

అనంతరం కుంతినీ, పాండవులనూ, వెంటబెట్టుకుని హస్తినాపురం చేరి మునులు పాండురాజు అస్థికలుకూడా ధృతరాష్ట్రునికి వప్పగించి నిష్క్రమించారు. మునులందరికీ అభివాదాలు చేసింది కుంతి.

ధృతరాష్ట్రుడు పత్నీసహితుడై, మంత్రి పురోహిత బంధుజనంతో ఆ అస్థికలను రాజశిబికమీద వుంచి పూలతో అర్చించి, సుగంధ జలాలు చల్లిస్తూ సర్వ లాంఛనాలతో నదీతీరానికి తెచ్చి, అనంతరకర్మలు నిర్వర్తింప

జేసి, అస్థినిమజ్జనం చేయించాడు. అశౌచం ముగిసేవరకూ పాండవులు నగరసరిహద్దులలో వుండి, అంతిమ దినాన శుభ్రస్నాతులై, నూతనవస్త్రాలు ధరించి హస్తినాపురంలో అడుగుపెట్టారు. పాండురాజు మరణవార్త విన్ననాడు నగరంలోని ఆబాలగోపాలం ఆవేదనాభార హృదయంతో కటిక నేలమీదనే శయనించింది.

పుత్రశోకం భరించలేక అంబాలిక అడవికి వెడతానంది. అప్పటి కక్కడికి చేరిన వ్యాసులవారు తల్లినిచేరి: అమ్మా! నువ్వింక ఈ నగరం విడిచి, అడవికి వెళ్ళి తపోదీక్షతో ముక్తిమార్గం అనుసరించు - అనగా సత్యవతికూడా అంబాలికతో బయలు దేరనుండగా, అంబిక తానుకూడా వచ్చి, అత్తగారి సేవలో జీవితం గడుపుతానంది.

ముగ్గురూ అరణ్యానికి వెళ్ళారు.

పాండవులూ, కౌరవులూ విద్యాభ్యాసంతో, వివిధ క్రీడా విలాసాలతో గడుపుతున్నారు. ఆట పాటలలో ఎప్పుడూ భీమసేనుడు కౌరవులను అపహాస్యం చేస్తూ హింసించేవాడు. వాని బలానికి వారెవరూ చాలేవారు కారు.

## దుర్యోధనుని దుర్బుద్ధి

ఆటలు సాగుతున్నప్పుడు భీముడు పదిమంది కౌరవుల జుట్టుపట్టి, ఈడుస్తూ ఏడిపించేవాడు. పదిమందిని ఆ చంకకింద, పదిమందిని ఈ చంకకింద వుంచి నీళ్ళలో ముంచేవాడు. కోతికొమ్మచ్చి ఆటలో కౌరవులు ఎక్కిన చెట్లను అవలీలగా ఊపి వారిని భయపెట్టేవాడు. పరుగుపందెంలో, కుస్తీపట్టులో భీమునితో సమంగా నిలవలేక పోయేవారు, కౌరవులు.

ఈ పనులన్నీ వారిలో స్పర్థకు మారు ద్వేషాన్ని కలిగించాయి. ఒక నాడు గంగానదీతీరాన ఆటలాడి అలసి నిద్రిస్తున్న భీమసేనుని బంధించి నదీమధ్యంలో ముంచడానికి నిశ్చయించి, ప్రమాణకోటి తీర్థందగ్గర ఉదక క్రీడన శిబిరాలు నిర్మింపజేశాడు దుర్యోధనుడు. అక్కడే వంటలు చేయించి,

భోజనసమయంలో ఒకరికొకరు ముద్దలందించుకునే క్రీడ సాగుతూండగా, కాలకూట విషం కలిపిన అన్నం భీమునికి పెట్టాడు దుర్యోధనుడు. భీముడు నిస్సంకోచంగా ఆరగించాడు. అనంతరం క్రీడలుసాగాయి.

అలసి నిద్రిస్తున్నారందరూ. అప్పటికి విషం బాగా ఎక్కి భీముడు అచేతనంగా ఉన్నాడు. అది చూసి దుర్యోధనుడు వానిని గట్టి తీగల తాళ్ళతో బంధించి నదీ మధ్యంలో పారవేశాడు. భీముడు సముద్ర పాదతలం నుండి నాగలోకందాకా పోయిపడ్డాడు. నూతన పదార్థం కనిపించగానే మహానాగాలు కాటు వెయ్యబోయాయి. ఇనుములా గట్టిగావున్న ఆ దేహంలో మర్మస్థానాలలో కోరలు దిగి విషం ఎక్కి దుర్యోధనుడు తినిపించిన విషం విరిగిపోయి భీమునికి స్మృతి వచ్చింది. లేస్తూ ఒక్కసారి కాళ్ళూ చేతులూ ఆడించాడు. కట్టిన బంధాలన్నీ పటపట తెగగానే నాగ సంహారం ఆరంభించాడు.

నాగనాయకుడు వాసుకి భయపడి వృద్ధుడయిన ఆర్యకుని పిలిచి ఈః మహాబలిష్టు డెవడో చూడండి - అనగా పరిశీలించి:

నాయనా! వీడు నా మనవడయిన శూరసేనుని కుమార్తె కుంతిబిడ్డ, అంటూనే ఆలింగనం చేసుకుని వానికి బలవర్థకరసాలు తెప్పించి ఇచ్చాడు. గుక్కకొక్క కడవగా ఎనిమిది కడవలు రసపానంచేసి, మృదువయిన శయ్యమీద విశ్రాంతి తీసుకున్నాడు.

ఇక్కడ విహారాలు పూర్తిచేసి, అందరూ స్వగృహాలకు చేరారు. భీముడు ముందుగా వెళ్ళివుంటాడని భావించిన ధర్మరాజుకి ఇంటిదగ్గర కుంతి ఒంటరిగా కనిపించడంతో కన్నీరు మున్నీ రయింది.

విదురునితో సంప్రదించారు. విద్వాంసుడయిన విదురుడు వ్యాసుని మాటలు స్మృతికి తెచ్చి పాండవులు అల్పాయుష్కులు కారు. కనక వాడు మరణించి వుండడని చెప్పగా, ఆవేదన నిండిన గుండెతో ఎదురుచూస్తున్నారు భీమునికోసం.

ఎనిమిది రోజులు ఏకపట్టున నిద్రించిన భీముడు తొమ్మిదవనాడు నాగలోకం నుంచి బయలుదేరుతుండగా వాసుకి:

నాయనా! వేల ఏనుగుల బలంవచ్చే రసపానం చేశావు. ఇంక నీ శత్రువెవడూ నీ మీద జయం పొందలేడు. అని ఆశీర్వదించాడు.

భీముడు తిరిగివచ్చి, జరిగిన విషయాలన్నీ చెప్పగా, విదురుడు ఈవార్త పైకి పొక్కనివ్వద్దన్నాడు. ఏ మాత్రం బైటపడ్డా దుష్ట దుర్యోధనుడు పాండవులందరినీచంపే ప్రయత్నం చేస్తాడన్నాడు.

అనంతరం ఒకసారి దుర్యోధనుడు భీముని రథసారథిని పీక పిసికి చంపినా పైకి పొక్కనివ్వలేదు పాండవులు. అలా గుట్టుగా, ఆత్మరక్షణ చేసుకుంటూ కాలం గడుపుతున్నారు.

## కృప - ద్రోణులు

గౌతమమహర్షి మనుమడూ, శరద్వంతుని పుత్రుడూ అయిన కృపాచార్యుని వద్ద కురు, పాండవులు ధనుర్వేదం అభ్యసిస్తున్నారు.

[శస్త్రాస్త్రవిద్య నాలుగుభాగాలు : ముక్త (బాణాలు విడవడం). అముక్త (ఖడ్గాద్యాయుధాలతో సాగించేది). ముక్తాముక్తం (ప్రయోగం - ఉపసంహారం), మంత్రముక్తం (ప్రయోగమే కాని ఉపసంహారం తెలియని అస్త్రవిద్య). ఆదాన, సంధాన, విమోక్ష, సంహారాలని కూడా అంటారు.]

భరద్వాజనందనుడయిన ద్రోణుడు పరశురామునివద్ద అస్త్రశస్త్ర విద్యల్లో అగ్రేసరుడయాడని విన్న భీష్ముడు ఆయన ఉనికిని గురించి పరిశీలిస్తూండగా ఆయన పాంచాలా ధీశుడయిన ద్రుపదుని బాల్యమిత్రుడనీ, ద్రుపదుడు రాజయాక తన దరిద్రాన్ని నిర్మూలించుకుందామని వెడితే, ఆ చక్రవర్తి సంపద్గర్వంతో అవమానించాడనీ పరాభవదుఃఖంతో ఆయన ఇంటిపట్టున ఉండకుండా తిరుగుతున్నాడనీ, శరద్వంతుని కుమార్తె కృపి ఆయన అర్ధాంగి అనీ, వారికి అశ్వత్థామ అనే కుమారు డున్నాడనీ విన్నాడు.

ఆ రోజులలో కురు - పాండునందనులు కందుకక్రీడ సాగిస్తుండగా ఆ బంతి నూతిలో పడింది. దానిని పైకి తీసే దారితోచక, వారు

విచారించే సమయంలో ద్రోణుడక్కడకు చేరి, చేతిలో ఉన్న దర్భలను ఒకదాని వెంట ఒకటి విడిచాడు. అందులో మొదటిది బంతికి గుచ్చుకుంది. మిగిలినవన్నీ ఒకదానికొకటి అంటుకున్నాయి.

ఆ రాజపుత్రులు ఆశ్చర్యంతో ఆయన పాదాలకు నమస్కరించి, తాతగారికి ఆ విషయం తెలియజేశారు. భీష్మాచార్యులు ద్రోణులను రావించాడు. ఆయన ఆకార విశేషాలను వినినట్లు చూచినాడు భీష్ముడు. తన తండ్రి శిష్యుడయిన అగ్నివేశునివద్ద వేద విద్యతో, ధనుర్విద్యాభ్యాసం చేశానని చెప్పాడు ద్రోణుడు.

భీష్ముడు సంతోషంతో ఆయనను తన ఆస్థానంలో విద్యాగురుపీఠం అలంకరించమని ప్రార్థించి అంగీకరింపజేశాడు.

కురు పాండవులే కాక వృష్ణి, అంధక వంశీయులతో కర్ణుడు కూడా ఆయనవద్ద విద్యాభ్యాసం చేస్తూ అర్జునునితో స్పర్థవహించి, దుర్యోధనునితో మైత్రి సాగిస్తున్నాడు.

నిద్రాహారాలను లక్ష్యపెట్టకుండా శస్త్రాస్త్ర విద్యాసాధనకు శ్రమించే అర్జునుడు ద్రోణుని హృదయంలో ప్రముఖ స్థానం ఆక్రమించాడు. చీకటిలో ఎప్పుడూ అర్జునునికి భోజనం పెట్టవద్దని ద్రోణుడు ఆజ్ఞాపించాడు. ఒకనాడు భోజన సమయంలో పెనుగాలికి దీపం ఆరిపోయినా అలవాటు ప్రకారం అర్జునుడు భోజనం ముగించి, చీకటిలో కూడా విద్యాభ్యాసంచేసే ప్రయత్నం ఆరంభించాడు.

నిద్రలోవున్న ద్రోణాచార్యునికి అర్జున ధనుష్టంకారం వినిపించి లేచి వెళ్ళిచూసి గాఢాలింగనం చేసుకుని, అస్త్రవిద్యలో నీ అంతటివాడు ఉండడు అని వెన్ను తట్టాడు. అది మొదలుగా వివిధవిధ శస్త్రాస్త్రవిద్యలూ అభ్యసింపజేస్తున్నాడు, ప్రత్యేక శ్రద్ధతో.

## ఏకలవ్యుడు

ఆ రోజులలో హిరణ్యధన్వుడనే ఎరుకరాజు కుమారుడు ఏకలవ్యుడు, ద్రోణాచార్యుని వద్ద విద్యాభ్యాసానికి రాగా ఆయన తిరస్కరించి పంపాడు.

అయినా ఏకలవ్యుడు ఆయన పాదాలకు నమస్కరించి, తిరిగి వచ్చి త.. ఆశ్రమంలో ద్రోణుల విగ్రహం ఉంచుకొని ఆ ప్రతిమనే గురువుగా భావించి పూజిస్తూ, ధనుర్విద్య అభ్యసిస్తున్నాడు.

కురు-పాండునందనులు క్రూరమృగ సంహారానికి వేటకు వెళ్లారు. పరివారంతో వేటకుక్కలతో అరణ్యంలో క్రూరమృగాలను నేలకూలుస్తూ ముందుకు సాగుతూండగా ఒక వేటకుక్క ఏకలవ్యుని చూసి మొరిగింది. నోరు తెరిచి మొరుగుతూన్న క్షణంలో ఏకలవ్యుడు తన అస్త్ర నైపుణ్యం ప్రదర్శిస్తూ ఏకకాలంలో ఏడు బాణాలు దాని నోటిలో నాటినాడు.

అది చూసి అర్జునుడు ఆశ్చర్యచకితుడై ఏకలవ్యుని సమీపించి, వాని కులగోత్రాలడిగి తెలుసుకొని అతను కూడా ద్రోణుని శిష్యుడే అని విని, హస్తినాపురం వస్తూనే ఆ విషయమై ఆచార్యుని ప్రశ్నించాడు.

ఆచార్యద్రోణులు అర్జునునితో అడవికి వచ్చి ఏకలవ్యుని ఆశ్రమంలో అడుగు పెట్టగానే ఆ వీరుడు పాదాభివాదంచేసి గురుదక్షిణగా ఏం కావాలన్నా ఇస్తానన్నాడు. వెంటనే కుడిచేతి బొటనవ్రేలు కోసి ఇమ్మన్నాడు - ద్రోణుడు. క్షణంకూడా ఆలోచన చెయ్యకుండా, ఏకలవ్యుడు గురువు కోరిన ప్రకారం దక్షిణ అర్పించాడు. ఆచార్యుడు అర్జునునికి చేసిన వాగ్దానం కోసం ఏకలవ్యుని అంగుష్ఠం గ్రహించి తిరిగివచ్చాడు.

తన శిష్యులందరూ విలువిద్యలో ఆరితేరినారని గ్రహించిన ఆచార్యుడు, ఒక చెట్టు చివరికొమ్మమీద పిట్టబొమ్మ పెట్టి అందరికీ దానిని చూపి ఆ పక్షి శిరస్సు పడగొట్టమని చెపుతూ:

నాయనా: ఆ పిట్టనీ నన్నూ నీ సోదరులనూ అందరినీ చూస్తున్నావా - అనగా తల వూపినాడు ధర్మరాజు. దుర్యోధనాదు లందరినీ ఒక్కొక్కరినే పిలిచి అదే ప్రశ్నవేసి చివరగా అర్జునుని అదే ప్రశ్న వేయగా,

ఆచార్యా! పక్షి తప్ప నా కంటికి మరేమీ కనిపించడం లేదు, అంటూనే సంధించిన బాణం విడిచి పక్షితల పడగొట్టాడు.

మరొకసారి నదీస్నానం చేస్తుండగా ఆచార్యులను మొసలి పట్టు కున్నదని తెలిసిన క్షణంలో అయిదు బాణాలతో అర్జునుడు మొసలిని ముక్కలుగా ఖండించి ఆయనను కాపాడగా ఆయన బ్రహ్మశిరోనామకాస్త్రం ఉపదేశించాడు.

## విద్యాప్రదర్శనం : కర్ణుడు

అనంతరం కొంతకాలానికి తన శిష్యుల అస్త్ర విద్యాప్రదర్శనానికి ఏర్పాట్లు చేయించమని ధృతరాష్ట్రునికి చెప్పాడు. కృప, ద్రోణు లిరువురికీ మణిరత్న భూషణాలూ చీనీ చీనాంబరాలూ బహూకరింపించి ప్రదర్శన సన్నాహాలు సాగించాడు మహారాజు.

ప్రదర్శన రంగస్థలం రమణీయంగా అలంకృతమైంది. రాజమాతలు కుంతి, గాంధారి దాసదాసీ జనంతో వచ్చి ఉచితాసనా లలంకరించారు. పెద్దలకూ, పౌరులకూ ప్రత్యేకాసనాలు వేయించారు. మంగళవాద్యఘోష సాగుతున్నది.

సుమూహూర్తవేళ ద్రోణాచార్యులు కౌరవశతంచేత ధనుర్విద్య ప్రద ర్శింపచేసి ఖడ్గచాలనవిద్య చూపించాడు.

దుర్యోధన భీమసేనులు గదాదండాలతో రంగభూమిలో కాలు పెట్టారు. ఒకరి ఎదుట ఒకరు మదపుటేనుగుల్లా ఘీంకరిస్తూ నిలబడ్డారు. గదాయుద్ధ ప్రదర్శనం ఆరంభమయింది. ప్రేక్షకాగారం మహోత్సాహంతో కోలా హలంగా వుంది. సముద్రంలో కల్లోలం రేగినట్లు విజృంభించారు ఆ యోధులిద్దరూ. ప్రదర్శనం క్రమంగా విద్వేషాగ్నిని ప్రజ్వలింపజేస్తున్నది. ఒకరి నొకరు కడతేర్చుకొనేదశకు చేరడం కనిపెట్టి ఆచార్యద్రోణుడు అశ్వత్థామను పిలిచి ఆ ప్రదర్శనం ఆపుచేయించి అర్జునుని రంగంలోకి పంపాడు.

ధనుర్బాణధరుడయి అర్జునుడు రంగప్రవేశం చేస్తుండగానే హర్షోల్ల సిత హృదయంతో సభ అభినందన పరంపరలతో నిండింది. కుంతి కన్నులు ఆనందాశ్రుపూర్ణాలయాయి; ఆ మాతృహృదయం ఉప్పొంగి క్షీరధార లుబికినవి.

ప్రదర్శనం ప్రారంభించి ఒకక్షణం సాలప్రాంశుడుగా, మరోక్షణంలో అంగుష్ఠ మాత్రుడుగా కన్పిస్తున్నాడు. రథం మీద కనిపించిన నిమేష వ్యవధిలో భూమిమీద వుంటున్నాడు. ఆగ్నేయాస్త్రంతో అగ్నిని సృష్టించి, వారుణాస్త్రంతో చల్లార్చి, పర్జన్యాస్త్రంతో మేఘాలను సృష్టించి, వాయువ్యాస్త్రంతో చెల్లాచెదరుచేసి, అస్త్రవిద్యా ప్రదర్శనం ముగించి గదా, ఖడ్గవిద్యలో తన శక్తిని చూపుతున్నాడు.

రంగశాలా బహిర్ద్వారంనుండి మత్తేభగమనంతో వస్తున్న సాలప్రాంశువు. ఉజ్జ్వల సహజకవచుడు, ఖడ్గహస్తుడు, ధనుర్బాణధరుడు అయిన విశాలనేత్రకాంతుల తోడిపురుషుని సూర్యసమప్రభుని, కర్ణుని చూసి విస్తుపోయారు ప్రేక్షకులు.

కర్ణుడు రంగమధ్యానికి వచ్చి, అర్జునుడు ప్రదర్శించిన విద్యలన్నీ చూపి ప్రేక్షకుల వయిపు తిరుగగా, దుర్యోధనుడు అపరిమితానందంతో కర్ణుని గాఢాలింగనం చేసుకుని తనతో సఖ్యంగా వుంటూ, ఈరాజ్యభోగాలన్నీ అనుభవించమన్నాడు. అందుకు కర్ణుడు అంగీకరిస్తూ అర్జునునితో ద్వంద్వయుద్ధం చెయ్యాలనే కోరిక వ్యక్తంచేశాడు.

అర్జునుడు ద్వంద్వయుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. కర్ణుడు ధనుర్బాణాలు పట్టి వానికెదురునిలిచాడు. వారిద్దరినీ చూసిన కుంతి కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ మూర్ఛపోయింది.

కృపాచార్యుడు రంగమధ్యంలో అడుగుపెట్టి:

ద్వంద్వయుద్ధ ధర్మానుసారం ఉభయులూ కులగోత్రనామాలు చెప్పుకోవాలి. రాజనందనులు నీచ వంశజులతో ద్వంద్వయుద్ధానికి దిగడం శాస్త్రవిరుద్ధం, అనగా దుర్యోధునుడులేచి :

ఆచార్యా! మీరు శాస్త్రవాక్యం చెప్పారు. ఆ శాస్త్రమే ఉత్తమ కులసంజాతునీ, మహావీరునీ, సైన్యాధిపతినీ క్షత్రియులుగా పేర్కొన్నది. ఇప్పు డీ కర్ణుని అంగదేశాధీశుడుగా అభిషేకిస్తున్నాను అని, అప్పటికప్పుడు స్వర్ణ సింహాసనం తెప్పించి అభిషిక్తుని చేయగా, దుర్యోధన రాజేంద్రా!

నువ్వు నాకు చేసిన ఈ ఉపకారానికి కృతజ్ఞతగా నీకోసం ఏం కావాలన్నా చేస్తానని వాగ్దానంచేశాడు.

ఆ సమయానికి వచ్చిన అధిరథుడు అమితోత్సాహంతో వెళ్ళి కర్ణుని ఆలింగనం చేసుకోబోగా కర్ణుడు గౌరవసూచకంగా పాదాభివాదం చేశాడు. అది చూసి భీమసేనుడు: కొరడాపట్టి రథం తోలవలసిన నీకు రాజ్యాధిపత్యమా? అని నవ్వుతూండగా భీమసేనుని వైపు క్రోధాగ్ని జ్వాలలుకక్కే చూపులతో దుర్యోధనుడు: భీమసేనా! బలమే క్షత్రియునికి ప్రధానం. హీనుడయినా బలవంతుడయితే క్షత్రియుడే క్షత్రియమిత్రుడూ క్షత్రియుడే. శూరుల, నదుల ఉత్పత్తి స్థానాలు తెలియవు. అంతవరకూ దేనికి! మీ అన్నదమ్ములందరూ ఎలా పుట్టారు? ఇక నిసర్గ కవచకుండల శోభతోవున్న ఈ కర్ణుడు సూతకులజుడనే భావం ఎలా కలుగుతున్నది? లేడి కడుపున పులిపిల్ల పుడుతుందా! సూర్యతేజస్వి కర్ణుడు అంగరాజ్యానికే కాదు సమస్త భూమండలానికీ ప్రభువు కాదగ్గవాడు, అలా ప్రసంగం సాగుతుండగా సంధ్యాకాంతులు పశ్చిమాకాశాన సప్తవర్ణ శోభ లీనాయి.

దుర్యోధనుడు కర్ణుని భుజంమీద చెయ్యివేసి రంగమండపం విడిచి పెట్టాడు. భీష్మ ప్రముఖులందరూ నిష్క్రమించారు.

తన కొడుకు అంగదేశాధీశుడు కావడం చూసిన కుంతికన్నులు ఆనందాశ్రువులతో నిండాయి. అర్జునుని ఓడించగల మిత్రుడు దొరికిన సంతోషంతో దుర్యోధనుడు గుండెమీద చేతులుంచుకొని నిద్రపోయాడు.

## గురుదక్షిణ

విద్యా దానం చేసిన ఆచార్యుని దక్షిణ కోరుకోమనగా పాంచాలాధిపతి అయిన ద్రుపదుని బంధించి తనముందు నిలబెట్టాలన్నాడు. ద్రోణుడు ఉభయ వంశాలవారూ ఆయుధాలతో రథారూఢులై నడిచారు. అహమహమికతో రాజకుమారులు చుట్టుముట్టిన వార్త విని ద్రుపదుడు సోదరసహితుడై ఎదురువచ్చాడు. పోరు ప్రారంభమయింది. కురుసంతతి ఆవేశంతో సాగుతున్నది.

అది చూసి అర్జునుడు ద్రోణాచార్యుని సమీపించి - ఆచార్యా! మీతో సమంగా శస్త్రాస్త్రవిద్యను అభ్యసించిన ఈ మహారాజును వీరు జయించలేరు. వారు వెను దిరిగిన అనంతరం నేను ధనుస్సు అందుకుంటాను - అని సోదరసహితుడై నగరానికి అర్ధక్రోశ దూరంలో వుండిపోయాడు.

దుర్యోధన, దుశ్శాసన, జలసంధ, సులోచన, కర్ణ, వికర్ణ, యుయుత్సులు సంతోషభరిత హృదయులై ద్రుపదుని బంధించడానికి ముందుకు సాగుతున్నారు. రణరంగం మహోద్రిక్త వాతావరణంలో వున్నది. ద్రుపదుడు ఎదురువచ్చినవారినల్లా పరాభూతులను చేస్తున్నాడు. పాంచాల సేనలతోపాటు పౌరులందరూ ఆయుధాలతో ఎదురురావడంతో కౌరవుల ఉత్సాహం సన్నగిల్లింది. ద్రుపదుడు నిశితశరాలతో కర్ణుని అంగసంధులలో తాడనం చేయడంతో వాడు మూర్ఛపోయాడు. అప్పటికే కౌరవుల రథాలు వెనుదిరిగాయి.

అది చూసి అర్జునుడు ధర్మరాజును ఆచార్యులవద్దనే నిలిపి నకుల సహదేవులను రథరక్షకులుగా తీసుకుని బయలుదేరాడు. భీముడు గదా దండముతో ద్రుపదసేనపై విరుచుకు పడ్డాడు. విజయశంఖం పూరిస్తున్న పాంచాలసేన తీవ్రక్రోధంతో తిరగబడింది. కోరలు పైకిపెట్టిన మొసలిలా పాంచాలసేనాసాగరంలో ప్రవేశించాడు భీముడు. ముందుగా గజ బలాన్ని చిందరవందరచేసి విజృంభిస్తున్నాడు. అర్జునుడు కుపిత సింహంలా ద్రుపదుని మీదికి రాగా వాని సోదరుడు సత్యజిత్తు అడ్డు వచ్చాడు. వారిమధ్య తీవ్రసమరం సాగింది. గరుత్మంతుడు మహాసర్పాన్ని పట్టినట్టు ద్రుపదుని బంధించే సమయానికి భీముడు సోదర సహితుడై శత్రుసేననూ నగరాన్నీ విధ్వంసం చేయడానికి పూనుకోగా అర్జునుడు వారించి: పాంచాలరాజులు మన బంధు కోటిలోని వారు, మనం ఈ చక్రవర్తిని బంధింప వచ్చామేకాని నగర విధ్వంసనానికి కాదు అన్నాడు.

భీమసేనుడు శాంతించాడు. పాంచాలసేనలు హాహాకారాలు చేస్తుండగా అర్జునుడు ద్రుపదుని కట్టి తెచ్చి, గురువుగారి పాదాలముందు వుంచగా ద్రోణుడు:

వీరు ద్రుపదమహారాజులా, పాంచాల ప్రభువులా! తమ కెటువంటి దశ పట్టింది! మీ వంటి శ్రీమంతులకు రావలసింది కాదీస్థితి, అని నవ్వి, ఇప్పుడు నీ రాజ్యం అంతా నా చేతులలో వుంది. గంగకు దక్షిణభాగాన్ని నీకు ధారవోసి, ఉత్తర భాగానికి నేను చక్రవర్తినయి నీతో స్నేహాన్ని కోరుతున్నాను. చక్రవర్తి కానివాడు చక్రవర్తికి మిత్రుడు కాబోడని నన్ను పరాభవించావు. అయినా మన బాల్యస్నేహంవల్ల నీ కీ సగం ఇస్తున్నాను. నీకు ప్రాణభీతి లేదు. నేను విప్రుణ్ణి, విప్రసహజమైన క్షమా హృదయం నాకున్నది అని బంధముక్తుని చేశాడు.

అది మొదలుగా ద్రుపదుడు చర్మణ్వతీ నదికి దక్షిణాన కాంపిల్యనగరం రాజధానిగా చేసుకొని పాలిస్తున్నాడు. ద్రోణుడు ఉత్తరాన అహిచ్ఛత్రం రాజధాని చేసుకొని ఏలుబడి చేస్తున్నాడు.

## యువరాజ పదవి : కూటనీతి

రోజులు గడుస్తున్నాయి!

సద్గుణ సంపన్నుడూ, దయార్ద్ర హృదయుడూ, ధైర్యస్థైర్య సమన్వితుడూ, ప్రజాభిమానీ అయిన ధర్మరాజును యువరాజపీఠం మీద అభిషిక్తుని చేశాడు ధృతరాష్ట్రుడు. ధర్మరాజు సదాచారశీలసంపత్తితో పాండురాజును మించిన కీర్తిగడించాడు. అర్జునుడు సోదర సహితుడై తూర్పు, దక్షిణ ప్రాంతాలకు వెళ్ళి నిర్విఘ్నంగా విజయయాత్ర పూర్తి చేసుకొని వచ్చాడు.

ఆనాటి కానాడు పాండవుల కీర్తి శరత్కాలచంద్రకాంతిలా, వ్యాపించడం విన్న ధృతరాష్ట్రుని హృదయం చింతాభర మయింది. తన మంత్రులలో కూటనీతి తెలిసిన కణికుడనే వానిని ఏకాంతానికి రప్పించి తన బాధ తెలుపగా, ఆ నీతివేత్త:

మహారాజా! శత్రునాశనానికి ముందు వారి ఉత్సాహ, ఐశ్వర్య, మంత్రాంగాలనే త్రివర్గాలనూ, అమాత్య, దుర్గ, కోశ, సేనా, రాష్ట్రాలనే పంచవర్గాలనూ, సామ, దాన, భేద, దండ, ఉద్బంధన, విషప్రయోగ,

అగ్నిప్రసరణమార్గాలలో నాశనం చెయ్యాలి. శత్రుబలాన్ని మూలచ్ఛేదం చేసి, అనంతరం ఆశ్రయవర్గాన్ని నాశనం చెయ్యాలి.

మహారాజా! పిరికిపందలను భయపెట్టాలి. లోభికి ధనమిచ్చి లోబరచుకోవాలి, బలహీనుడయితే పరాక్రమంతో స్వాధీనం చేసుకోవాలి. సమబలునితో స్నేహం చెయ్యాలి. విషం తినిపించికానీ, మోసగించిగాని శత్రువును కడతేర్చాలి. ఇది నీతిశాస్త్రం చెప్పే విషయం.

శత్రువును సాధించదలచినప్పుడు క్రోధం పనికిరాదు. చిరునవ్వుతో వరిస్తూ వాడికి విశ్వాసం కలిగించి పాములా కాటు వెయ్యాలి. ఎటువంటి ఘాతుకం తలపెట్టినా ఆ విషయం తెలియకుండా చిరునవ్వుతో, మృదు భాషణతో ఓరిమి వహించి అదనెరిగి నెరవేర్చుకోవాలి. కష్టపడని ప్రాణికి సుఖప్రాప్తిలేదు. చిత్తశాంతి కోరేవారు విద్వాంసులను తృప్తిపరుస్తూ, వారి ఆదరం పొందాలి.

ఆశలు రేకెత్తించాలేకాని అవి నెరవేర్చకూడదు. కూడదని ఆ భావం ఎదుటివారికి తెలియనివ్వకుండా వాయిదాలు వేస్తూండాలి. ఇనుముతో చేసిన కత్తిని తొడుగులో భద్రపరచి అవసరానికి తీసి కేశఖండనానికి వినియోగించినట్లుండాలి. మన మంత్రాంగం, మనం ఏ పనిచేసినా అది మరొకరికి విపత్తుగా తెచ్చిపెట్టకూడదు. ఇవన్నీ మీ రెరుగనివి కావు. అయినా అడిగారు కనుక చెప్పడం నా విధి. నీతిశాస్త్రం చెప్పిన విషయాలు దృష్టిలో ఉంచుకొని మీ కార్యం నిర్వర్తించండి - అని కణికుడు సెలవు తీసుకున్నాడు.

ఆ సమయంలో దుర్యోధనుడువచ్చి: ప్రభూ! రానురాను పాండవు లంటే ప్రజలలో అభిమానం పెరుగుతున్నది. అంధత్వం కారణంగా మీకు రాజ్యాధికారం లేకుండా పోయింది. ఇప్పుడు యువరాజు పీఠం ఎక్కిన ధర్మరాజు రేపు రాజయితే మేమందరం వాని ఆదరాభిమానాలమీద ఆధారపడాలి. తరువాయి నా బిడ్డలందరు ఈ ధర్మజుని పినుసన్నలలో మెలగాలి, అంతకంటే నరకం మేలు. అందుచేత ఈలోగానే మీరు రాజ్యాధికారులయితే ఆ విపత్తులన్నీ తప్పుతాయి: ఇందుకోసం కర్ణ, శకుని,

దుశ్శాసనులతో ఆలోచించి నేను ఒక నిర్ణయానికి వచ్చాను. ఇప్పుడు వారిని వారణావతం పంపాలి. అక్కడ వారుండగా ప్రజలందరినీ దానధర్మాలతో తిప్పుకుంటాను. అనంతరం నేను సింహాసనం ఎక్కాక కుంతీసహితం వారంతా యధేచ్ఛగా ఇక్కడే ఉండవచ్చు - అన్నాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు నాయనా! నీ ఆలోచన బాగానే ఉంది; కాని ఇందుకు భీష్మ, ద్రోణ, కృప, విదురాదులు అంగీకరించరు గదా - అన్నాడు.

మహారాజా! అశ్వత్థామకు నేనంటే విపరీతమయిన అభిమానం. లేగ దూడను విడిచి, ఆవు ఉండలేనట్లే ఆచార్యుడు అశ్వత్థామను విడిచి ఉండలేడు. భీష్ములవారు తటస్థులే; విదురుడు అర్థాంతరంగా మనలను విడువడు. పాండవ పక్షపాతం ఉన్నా మనలను వేయగలిగిందేమీ లేదు - అన్నాడు. తల వూపాడు గ్రుడ్డిరాజు.

దుర్యోధనుడు దాన ధర్మాలు అధికం చేశాడు. వారణావతం గురించీ, ఆ నగర సౌభాగ్య సుందరోద్యానాల గురించీ పాండవులకు చెవినిల్లుగట్టుకు చెప్పే జనాన్ని ఏర్పాటు చేశాడు. నిరంతరం వారణావత విషయం చెవిన బడటంతో పాండవులకు అక్కడకు వెళ్ళాలనే కోరిక పుట్టింది. ఆ వార్త విన్న ధృతరాష్ట్రుడు పాండవులకు కోరిక వుంటే వారణావతం వెళ్ళి అక్కడ జరిగే వుత్సవాలు తిలకించి కొంతకాలం హాయిగా గడిపి రమ్మన్నాడు.

దుర్యోధనుడు పురోచనుడనే పేరుగల తన మంత్రిని పిలిచి, నేతిలో నూనెలో కలిపిన లక్కతో సుందర భవనం నిర్మించి అందులో అన్ని సౌకర్యాలూ రాజవాస యోగ్యంగా రూపొందించి పాండవులు అక్కడకు రాగానే వారిని ఆదరంగా ఆహ్వానించి అక్కడే విడిది చేయించి ఆ భవన సమీపంలో నిప్పు సెగ తగిలితే మండే సామగ్రిని గుప్తంగా ఉంచమని పంపించాడు.

ధృతరాష్ట్రుని ఆజ్ఞానుసారం పాండవులు ప్రయాణ సన్నాహాలు చేసి భీష్మ, ద్రోణ, కృప, విదురులకూ, కురువృద్ధులకూ అభివాదాలర్పించి బయులుదేరారు. నగర పౌరులందరూ కంటతడిపెట్టారు. సద్గుణశీల

సంపదతో రాజ్యాధికారం సాగించనున్న ధర్మరాజాదులంటే యీ ధృత రాష్ట్రునికి గిట్టక ఇటువంటి దారుణానికి తలపడినా భీష్మాదులు ఎలా ఆమోదించారని విచారించారు. శంతనుడూ, విచిత్రవీర్యుడూ, పాండు రాజు పాలించినట్లే ధర్మనందనుడు తమను శ్రేయోమార్గాన ఏలగలడని నమ్మిన వారందరూ హస్తినాపురం విడిచి వారణావతం వస్తామన్నారు. అంగీకరించలేదు ధర్మరాజు.

ప్రయాణ ప్రారంభవేళ సభలో అందరూ వింటూండగానే విదురుడు ద్వందార్థయుత మయిన వాక్యాలతో పాండునందనులారా! శత్రువ్యవహా రాలను అవగతం చేసుకొన్నవాడు ఆ ప్రమాద నివారణకు యత్నించాలి. లోహనిర్మితంకాని శస్త్రం ఉన్నది. దాని ఆఘాతం తినకుండా రక్షించు కోవాలి. ఎండిన గడ్డితోవున్న అడవి మండుతున్నా కలుగులో దూరిన ఎలుక నాశనం కాదు. తరువాయి అది సరయిన దారిచూసుకుని బైటపడుతుంది. దిక్కు తెలియడానికి నక్షత్రం ఉన్నది. పంచేంద్రియాలనూ స్వాధీనంలో ఉంచుకొన్నవాడు శత్రుపీడనుండి ముక్తుడవుతాడు. అని విదురుడనగా ధర్మరాజు: మహామంత్రీ! మీ మాటలు నాకు అర్థమయాయి, అని బయలుదేరాడు.

ప్రయాణం కొంతదూరం సాగింది. అప్పుడు కుంతి - నాయనా! విదురుడేమో చెప్పాడు! నువ్వు అవగతమయిందన్నావు. ఏమిటా రహస్యం - అని అడిగింది.

అమ్మా! శస్త్రం అంటే సస్త్రం అనగా ఇల్లు. ఆ ఇల్లు అగ్నితో దగ్ధమవుతుందనీ అందుకు మనతో వుండబోయే పురోచనుడే కారణ మవుతాడనీ, రక్షణకు బిల మార్గం నిర్మించుకోమనీ, పంచేంద్రియాలంటే సోదరపంచకమనీ, వీరు ఏకాభిప్రాయంతో ఉంటే ఏ ప్రమాదమూ రాదనీ ఆ ధీశాలి ఉపదేశం - అన్నాడు ధర్మజుడు.

## లక్కయిల్లు

ధర్మరాజాదులు వారణావతం చేరగానే నగర ప్రజలు వారికి ఎదు రేగి కానుకలర్పించి స్వాగత మర్యాదలు జరిపారు. చిరునవ్వుతో స్వీకరించి

ముందుగా విద్వాంసుల గృహాలకు వెళ్ళి వారి యోగక్షేమాలు విచారించి అనంతరం వీరులందరినీ ఉచితానుసారం పలకరించి మిగిలిన ప్రజలంద రితో ఆదరంగా భాషించి పురోచనుని అభిమతానుసారం "శివభవనం"లో ప్రవేశించారు.

అడుగుపెడుతూనే ధర్మరాజు: భీమసేనా! చూశావా ఇల్లంతా నేతి వాసన, అంటే దీన్ని నేతితో కలిపిన పదార్థంతో నిర్మించి, నిప్పుపెట్టడానికి నిశ్చయించా రన్నమాట. అందుచేత మనం ఈ భవన పరిసరాలన్నీ గమ నించి రహస్యంగా సొరంగం ఏర్పాటుచేసుకుని పరిసరారణ్యాలలో కాలక్షేపం చెయ్యాలి - అనగా భీముడు: మనం ఇప్పుడే ఈ భవనం విడిచిపెడితే - అని ప్రశ్నించాడు.

అది ధీమంతుల లక్షణం కాదు. దుర్యోధనుడు గూఢచారులతో మన ఆనుపానులు కనిపెట్టి కడతేర్చే ప్రయత్నంచేస్తాడు. ఇప్పుడు అంగబలం, అర్థబలం వాని చేతులలో వున్నాయి. అది మరచి పోకూడదు. మనం అప్రమత్తులమై రక్షణమార్గం ఏర్పరచుకోవాలి - అన్నాడు.

కాలం గడుస్తున్నది.

ఒకనాడొకవ్యక్తి ధర్మరాజును సమీపించి ఏకాంతంలో: అయ్యా! నేను సొరంగాలు తవ్వడంలో నేర్పరిని; విదురులవారు నన్ను పంపారు - అనగా ధర్మరాజు వానిని తనకొలువులో నియోగించాడు.

సౌధకందకం పరిశుభ్రం చేసే నెపంతో ఖనకుడు భవనమధ్యంలో బిలం త్రవ్వడం మొదలుపెట్టాడు. పురోచనునికి అనుమానం కలగకుండా బిలఖననం సాగుతున్నది. పురోచనుడు తన కార్యక్రమం సక్రమంగా సాగించి లాక్షాగృహానికి నిప్పుముట్టించే అదను కోసం చూస్తున్నాడు. పాండవులు ఒక కంట పురోచనుని వ్యవహారాలన్నీ కనిపెడుతూ వున్నారు.

ఒకనాడు కుంతి బ్రాహ్మణ సమారాధనం సాగించి, నగరవాసు లంద రికీ భోజనాలు పెట్టింది. ఆ సాయంత్రం ఒక భిల్లస్త్రీ అయిదుగురు బిడ్డలతో వచ్చి తృప్తిగా ఆరగించి తప్పతాగి మత్తులో అక్కడే నిద్రపోయింది.

అంత్యక్రితంరోజునే సొరంగం తవ్వడం పూర్తి అయింది కనక పురోచనుడు నిప్పుపెట్టే వరకు ఆగకుండా లక్కయింటికీ, దానిప్రక్కనేవున్న ఆయుధాగారానికి ఏక కాలంలో నిప్పుముట్టించి పలాయనం సాగించాలన్నాడు భీమసేనునితో రహస్యంగా - ధర్మరాజు.

ఆ రాత్రి రెండోఝాము చివర వారణావతం గాఢాంధకారంలో ప్రగాఢ నిద్రలో వున్నది. భీమసేనుడు పిల్లిలా అడుగులు వేసుకుంటూ వెళ్ళి పురోచనుని గదిదగ్గర నిప్పుపెట్టాడు; ఒక్క అంగలో సింహద్వారానికి నిప్పు ముట్టించాడు. అటే వెళ్ళి మిగిలిన మూడుద్వారాలు అంటించాడు.

పొగలుముదిరి సెగలురేగి మంటలు వ్యాపించేవేళకు పాండవులు కుంతీసహితులై బిలమార్గాన బయలుదేరి కొంత నడిచేసరికి వారికి అలసటరాగా, భీముడు వారిని తన భుజాలమీద కెక్కించుకుని వేగంగా నడుస్తున్నాడు. పాండవులు గంగాతీరం చేరారు. అప్పటికి అక్కడకు విదురుని పంపునచేరిన నావికుడు తన నావమీద, వారిని గంగ దాటించి వెళ్ళినాడు. పాండవులు అడవిలోపడి పోతున్నారు.

తెల్లవారింది. భస్మమయిన లాక్షాగృహంలో అయిదుగురు బిడ్డలతో శయనించిన భిల్లస్త్రీ అస్థులుచూసి అవి కుంతీ, పాండవుల అవశేషాలని ధృతరాష్ట్రునికి వార్తపంపారు ప్రజలు.

ఖనకుని నేర్పువల్ల భస్మగృహంలో సొరంగ ద్వారం కనిపించనందున పాండవులే నిహతులయినట్లు భావించి, దుర్యోధనుడు మిత్రులతో ఆనందించాడు. ధృతరాష్ట్రుడు కొంతసేపు ఏడ్చి భీష్మ, దుర్యోధనాదులతో గంగాతీరానికి వెళ్ళి అంత్యక్రియలు జరిపి, తర్పణాలు అర్పించాడు. భీష్ముడు విపరీతంగా విలపించడం చూసి, విదురుడు ఏకాంతంలో రహస్యం అంతా వివరించగా, పితామహుడు తృప్తిగా విదురుని అభినందించాడు.

## ఘటోత్కచుడు

లక్కయిల్లు విడిచిన పాండవులు కీకారణ్యంలో పడి వెడుతున్నారు. సూర్యరశ్మి నేలకు సోకని గాఢారణ్యంలో సాగి, సాగి సంధ్యాసమయానికి ఒక

ప్రాంతంచేరారు. యామినీదేవి తన అంధకార వస్త్రాన్ని భూమిక ముసుగు వేయనున్నసమయం. కుంతీదేవి తనకు దాహంగా వున్నదన్నది. భీముడు ఒక్క అంగలో ముందుకిదూకి సరోవరంకోసం చూచే ఊహతో, ఉన్నత వృక్షశిఖరం ఎక్కాడు. కొద్దిదూరంలో సరోవరం కనిపించింది. పరుగు పరుగున వెళ్ళి నీరు తెచ్చేసరికే అన్నదమ్ములూ, కుంతీ గాఢనిద్రలో వుండడం చూచి నిట్టూర్చి అక్కడే వారికి రక్షగా కూర్చున్నాడు.

అదే వనంలో విశాలవృక్షం వాసభూమిగా హిడింబుడనే రాక్షసుడు తనచెల్లి హిడింబతో పాలనం సాగిస్తున్నాడు. అడవిలో నరవాసన సోకడంతో, చెల్లినిపంపి ఆ మనుషులను తీసుకొనివచ్చి, వంటచేసి, పెట్టమన్నాడు. వచ్చిన హిడింబ అల్లంత దూరంలో భీమసేనుని చూసి అతని రూప దార్ఢ్యాలకు మోహితురాలయి, ఈ మహావీరుడే నాకు తగినభర్త అనుకొన్నది.

ఆమె మనస్సు భీముని గాఢపరిష్వంగంకోసం పరువులు తీయగా, ఆ కామరూపిణి, అత్యంత సుందరరూపం ధరించి: ఓ మోహనాంగా! మీరెవరు? ఇది మా అన్న హిడింబుడనే రాక్షసుని ఏలుబడిలోని అరణ్యం. వాడు మిమ్మల్ని సంహరించి తీసుకు రమ్మన్నాడు. కాని నాకు మిమ్ము చూసిన క్షణం నుంచీ మనసు స్వాధీనంతప్పింది. మీభార్యగా స్వీకరించకపోతే ఇక్కడే ప్రాణత్యాగం చేస్తాను. అని సిగ్గుతో తలదించుకుని కనురెప్పలు అల్లల్లాడిస్తూ ఓరగంటిచూపుతో అర్థించగా భీమసేనుడు:

కామినీ! ఆయన మా అగ్రజుడు. వీరు నా సోదరులు. ఆమె మాతల్లి. పెద్దవాడికి వివాహం కాకుండా పెళ్ళిచేసుకునే సాహసం నాకులేదు. అదీకాక, వీరందరినీ ఈ క్లేశాలలో విడిచి నేను నీతో సాంసారిక సుఖభోగాలు అనుభవించే నీచుణ్ణికాను. మరిన్నీ నీ అన్నకు భయపడి, యిప్పుడు సుఖంగా నిద్రిస్తున్న వీరికి నిద్రాభంగంచేయను. వాడెవడో రానియ్యి; వాడి పరాక్రమం చూస్తాను - అన్నాడు.

హిడింబ పరిపరివిధాల తన అన్న రాక్షసశక్తిని తెలుపుతూ, తన మనసులోని కామవాంఛను వ్యక్తంచేస్తూ భీముని ప్రార్థిస్తూనే వుంది.

చెల్లెలు వెళ్ళి ఘడియలు దాటుతున్నా, తిరిగి రాకపోయేసరికి నర మాంసంకోసం నాలుక తడుపుకుంటున్న హిడింబుడు తీవ్రక్రోధంతో చెంగు, చెంగున సింహంలా లంఘిస్తూ, చింతనిప్పులవంటి కన్నులలో సెగలు జిమ్ముతుండగా, దీర్ఘంగా నిట్టూర్పులు వదులుతూ, వానకాలపు మబ్బులా వచ్చి పిలిచాడు. అన్నను చూస్తూనే హిడింబ గజ గజ వణుకుతూ, మీ అందరినీ నా వీపుమీద ఎక్కించుకుని వెళ్ళిపోతాను, రండి - అంది.

భీముడు వికటంగా నవ్వి, మీసంమీద చెయివేశాడు. తనచెల్లెలు ఒక సామాన్య మానవుని ప్రేమించడం చూసిన రాక్షసుడికి ఆమెమీద ఆగ్రహం కలిగింది. తక్షణం ఆమెను సంహరించాలని అడుగు ముందుకు వెయ్యగా భీమసేనుడు అడ్డువెళ్ళి ఓరీ నీచుడా! నిరపరాధిని అయిన ఆ పిల్లమీద చెయ్యిచేసుకోకు. ఇక్కడ నా సోదరులూ, తల్లీ సుఖనిద్రలో వున్నారు. వారికి నిద్రాభంగం కాకుండా చూడాలినేను. నడు కొంచెందూరంగా వెళ్ళి మనబలం చూసుకుందాం. నీ చెల్లెలు నువ్వు చెప్పినపని చేద్దామనే వచ్చింది. కాని దాని మనస్సు కామవశమయింది. ఇప్పుడు దాన్నేమీ చెయ్యకు. దూరం నడు. మత్తెక్కిన ఏనుగుపాదంకింద పడిన మనిషి తలలా యిప్పుడు నువ్వు నా కాళ్ళక్రింద నలిగిపోవడానికి సిద్ధంగా వున్నావు.

అనగా ఆ రాక్షసుడు చాలాసంతోషం. నిద్రపోయే వారిని చంపే నీరసం లేదు నాకు! వింటున్నాను కదా! అని తెగ వాగుతున్నావు. రా, నీ రక్తంతాగి అప్పుడు నిన్ను ప్రేమించే ఈ కామినిని సంహరిస్తాను, అన్నాడు.

అంటూనే అడుగు ముందుకువేసి, పొడవయిన ఇనపదూలంవంటి చెయ్యి పైకెత్తి ముందుకు జాపాడు. ఆ చేతిని అలా గాలిలోనే ఎత్తిపట్టి ఎనిమిది ధనువుల దూరం నెట్టుకుంటూపోయి, తన బాహువులమధ్య బిగించాడు ఆ మహాకాయుణ్ణి. వాడు గిలగిల్లాడుతూ గర్జించాడు. ఆ ధ్వని తనవారికి నిద్రాభంగ కారణ మవుతుందని మరింతదూరం యీడ్చుకుపోయి విడిచి, ముష్టియుద్ధం ఆరంభించాడు. ఉన్మాదం ఎక్కిన మత్తేభాల వలె వారు పోరుతూంటే ఆ అడవి అంతా దద్దరిల్లుతున్నది. ఆ ప్రాంతమంతా ఎగుడు,. దిగుడులు లేకుండా సమతల ప్రాంతం అయింది.

అప్పటికి నిద్రలేచిన ధర్మరాజాదులూ, కుంతీ ఆశ్చర్యంతో తమ ఎదురుగావున్న సుందరస్త్రీని చూసి విశేషం అడుగగా హిడింబ, జరిగిన కథంతా నెమ్మదిగా చెప్పింది. వింటూనే అర్జునుడు భీమునికి సాయంవచ్చి; అగ్రజా! ఇప్పుడు మన విద్యాప్రదర్శనం కాదు ప్రధానం. అదిగో ఉదయసంధ్య రానున్నది. సంధ్యలు రాక్షసులకు బలంహెచ్చే వేళలు. నువ్వు క్రీడసాగించక వీణ్ణి పడగొట్టు - అనగా భీముడు ఆ అసురుని నేలమీద పడవేసి పిడికిలిపోట్లు పొడుస్తూంటే నిప్పుకాక తగిలిన దుందుభి మ్రోగినధ్వనులు బయలు దేరాయి. వాడు కడసారి గర్జించి కన్నుమూశాడు. తెలతెలవారుతున్నది. కొడుకులను వెంట బెట్టుకుని కుంతి ముందుకు నడుస్తున్నది. వారిని అనుసరించింది హిడింబ.

కొంతదూరం నడిచి హిడింబ కుంతి చేతులు పట్టుకుని:

మహాస్వాధ్వీ! నీ కొడుకుని చూసిన ఉత్తరక్షణంలోనే నా మనస్సు వానిమీద మరులుగొన్నది. కామబాధ ఎంత బలీయంగా స్త్రీని వేధిస్తుందో ఆడదాని వయిన నీకు బాగా తెలుస్తుంది. నన్ను అనుగ్రహించు - అని కంటతడి పెట్టింది.

కుంతీదేవి గుండె ద్రవించింది. హిడింబను దగ్గరగా తీసుకుని:

నాయనా! మదనబాధపడే స్త్రీని ఆ క్లేశంనుండి రక్షించడం కూడా ధర్మపథమే అని ధర్మసూక్ష్మం తెలిసినవారు అంటున్నారు. అనగా ధర్మరాజు:

అమ్మాయీ! నీమాటకు సమ్మతిస్తున్నాం; కాని ఒక నియమం. మావాడు సాయంకాలం పడకుండా మాకళ్ళ ముందుండాలి. వాడి స్నాన సంధ్యలకు అవరోధాలు కలగకూడదు. అందుకు అంగీకరిస్తావా? అన్నాడు.

హిడింబ సంతోషచిత్తంతో అంగీకరించి వారిని అనుసరించింది.

భీముడు ఆమె పాణిని గ్రహిస్తూ, నీకు ఒక కుమారుడు కలిగేవరకే నువ్వు నాతో వుండాలి. అనంతరం విడిచి వెళ్ళిపోవాలి - అన్నాడు.

అపరిమితానందంతో హిడింబ భీముని వెంటబెట్టుకుని కామోద్దీపనం కలిగించే వనాలలో, పర్వతగుహలలో నదీతీరసికతా తలాలపై విహరింపజేస్తూ వాని హృదయానికి ఆహ్లాదం కలిగించింది.

ఆ శృంగారయాత్రలో వారి ఆహ్లాదఫలంగా ఒక కుమారుడు కలిగాడు. విశాల దేహూడూ. శంఖగళుడూ, భయంకరనయనుడూ అయిన ఆ బాలునికి నెత్తిమీద జుట్టు లేకపోవడంవల్ల ఘటోత్కచుడు అని పేరుపెట్టింది హిడింబ.

నియమానుసారం కొడుకును వెంటబెట్టుకుని అత్తగారి సెలవు తీసుకొని వెళ్ళింది.

## బకాసురుడు

పాండవులు అడవులు తిరిగి తిరిగి ఏకచక్రపురం చేరారు. అక్కడ ఒక విప్రగృహంలో వుంటూ బిక్షాటనతో గడుపుతున్న రోజులలో, తెచ్చిన పదార్థాన్ని రెండుభాగాలుగా చేసి సగం భీమునికిచ్చి మిగిలినదానిని కొడుకులు నలుగురితో తినేది కుంతి. అలావుండగా ఒకనాడు వారుంటున్న ఇంటినుండి ఆర్తనాదాలు వినిపించగా కుంతి వెళ్ళి విషయం తెలుసుకుని వచ్చి భీమసేనుని పిలిచి :

నాయనా! ఈ నగరంలో బకాసురుడనే రాక్షసుడున్నాడు. వాడికి రోజుకొక ఇంటి వారు బండెడు అన్నం, రెండు దున్నపోతులూ ఆహారంగా పంపుతూ ఒక మనిషిని కూడా ఆరగింపు పెట్టాలట. ఈ రోజు మన ఇంటివారిది వంతు - అంది. అమ్మా! దానికింత ఆలోచన దేనికి? వారిని వంటపూర్తిచేసి బండి ఎక్కించమను. బకాసురుడిబాధ యీరోజుతో ఈ నగరానికి లేకుండా చేస్తాను - అని ఉత్సాహంతో కూర్చున్నాడు.

భిక్షాటనం చేసివచ్చిన ధర్మరాజు భీముని ముఖంలో సంతోషం చూసి, తల్లి దగ్గరకు వెళ్ళి విషయం విని:

అమ్మా! వీడి బలపరాక్రమాలు నమ్మిగదా మనం ఎన్ని క్లేశాలయినా దాటగలమని వున్నాం. అటువంటి వీణ్ణి బకాసురుడికి బలి ... అని

గొంతు తడుపుకోగా కుంతీదేవి; నాయనా! ఎందరు బిడ్డలున్నా తల్లికి ఏ బిడ్డమీదా ద్వేషం వుండదు. అందరూ తన కడుపు పంటలే. నేను తల్లిని, కొడుకును బలియిచ్చే మూర్ఖత్వంలేదు. వీడి బలపరాక్రమాలు వీడు పుట్టిననాడే ఎరుగుదును. కనుకనే పంపుతున్నాను. వీడు ఆ రాక్షసుడి పీడ వదిలిస్తాడు అంది.

కుంతీదేవి తన కొడుకుని పంపుతాననేసరికి ఆ విప్రగృహిణి, అమ్మా! నాకు ఒక్కడే కొడుకయినా నీకు అయిదుగురు కొడుకులయినా కన్న బిడ్డను పరోపకారార్థం బలి యివ్వటం ఉచితమా? నేను అంగీకరించను. ప్రత్యుపకారం పేరిట యింత చేస్తారా అనగా కుంతి ఆమెను ఓదారుస్తూ అమ్మా! నా బిడ్డను బలిపశువుగా పంపడం లేదు. ఆ అసురుణ్ణి ఈ రోజుతో వదిలించడంకోసమే పంపుతున్నానని వారికి విశ్వాసం కలిగించింది.

అన్నం బండితో భీముడు నగరం సరిహద్దులు చేరి సరోవర సమీపాన ఆగి పాదప్రక్షాళనంచేసి, సుష్టుగా ఆరగించి, త్రేన్చి విశ్రాంతిగా కూర్చున్నాడు. భోజనంవేళ అతిక్రమించినా, నగరవాసులు ఆహారం పంపనందుకు బకాసురుడు కోపంతో గర్జిస్తూ తన నివాసంనుండి వెలుపలికివచ్చి, సరోవరందగ్గర నిశ్చింతగా త్రేనుస్తూన్న భీముని చూసి పెదవి పంటితో కొరికి కన్ను లెర్రజేసి ఒక్క భీకరారవం చేసి భీమునిమీదికి ఒక చెట్టు విసరబోగా పక్కనే వున్న మరొక చెట్టును విసిరి బకాసురునితో కలియబడ్డాడు భీముడు.

ముష్టియుద్ధం సాగింది కొంతసేపు. కాలయాపన యిష్టం లేక భీముడు తన రెండు చేతులతో వానిని బంధించి, మోకాలితో వెన్నుమీద పొడుస్తూ రెండుసార్లు నేలకు కుదించాడు. నోటినుండి రక్తం కారుస్తూ ఒక్క అరుపు అరచి ప్రాణాలు విడిచాడు బకాసురుడు.

ఏకచక్రపురవాసు లందరూ భీముని, వాని సోదరులనూ ప్రశంసలతో ముంచెత్తారు. కుంతి హృదయం తృప్తి పొందింది.

అలా కాలం గడుపుతూండగా, ఒకనాడు వారి ఇంటికి చేరిన ఒక విప్రుడు ద్రుపదమహారాజు యజ్ఞంచేసి ఆ యజ్ఞ వేదికనుండి ధృష్టద్యుమ్నుడనే కుమారునీ, ద్రౌపది అనే కుమార్తెనూ పొందాడనీ, ఆ బాలుడు

ద్రోణసంహారార్థం జన్మించాడనీ పాండవుడైన అర్జునునికి భార్యగా ద్రౌపది ప్రభవించిందనీ, ప్రస్తుతం పుష్యశుక్ల అష్టమినాడు ద్రౌపదీస్వయంవరం జరుగ నున్నదనీ, ఆ ఉత్సవం తిలకించడానికి వెడుతున్నాననీ, అయితే పాండవులు లాక్షాగృహంలో భస్మమయినట్లు విన్నాననీ మరి ద్రుపద రాజనందిని ఎవరిని భర్తగా స్వీకరించేదీ చూడాలని వుందనీ, మత్స్యయంత్రం కొట్టే వీరుడు ఆమె పాణిగ్రహణం చెయ్యాలని స్వయంవరం నియమం ద్రుపదుడు పెట్టా డనీ చెపుతూండగా విన్న పాండవులు, మరుసటిరోజునే తాము వుంటున్న గృహయజమానికి కృతజ్ఞతలు చెప్పి, పాంచాల దేశం వైపు ప్రయాణం ప్రారంభించారు.

ఉత్తరదిశగా వారు సాగుతూండగా, గంగాతీరాన సోమశ్రవ తీర్థ ప్రాంతంలో అంగారపర్ణుడనే గంధర్వరాజు జలక్రీడలు సాగిస్తూ, పరిసరా లలో రక్షకులను వుంచాడు. వారు పాండవులను నిరోధించగా :

ఓరిమూఢులారా! సముద్రతీరాలూ, నదీతటాలూ, హిమాలయమూ, ఉభయ సంధ్యలూ ఎవరి హక్కు భుక్తంకావు. సర్వులూ యథేచ్ఛగా చరించ తగినవి. అందునా ఈ గంగాతీరం ఎవరి ఏలుబడికిందా నలగడంలేదు, అని అర్జునుడనగా - అంగారపర్ణుడు మాటలతో ప్రయోజనం లేదని ధనుస్సు తీసి, బాణాలు విడిచాడు. అర్జునుడు అవలీలగా వాటిని తునా తునకలు చేశాడు. పోరు పొడిగించే యిష్టంలేక తన అస్త్రవిద్యను చవిచూసే ఉద్దేశంతో, అగ్నేయాస్త్రంతో వానిరథాన్ని భస్మం చేశాడు. అంగారపర్ణుని నేలకూల్చాడు. అంగారపర్ణుని భార్య కుంభీనస ధర్మరాజు పాదాలమీదపడి పతిభిక్ష వేడింది. ధర్మరాజు అర్జునుని కోపాన్ని వారించాడు. అంగారపర్ణుడు లేచి క్షమాభిక్ష కోరుతూ: కౌంతేయా! నీకు గంధర్వహయాలు కానుకగా యిస్తాను అన్నాడు.

అర్జునుడు నవ్వుతూ: నువ్వు దయతలచి మాకు దానధర్మాలు చేస్తే స్వీకరించడానికి మేము విప్రులంకాము అనగా ఆ గంధర్వపతి, ఆ దృష్టి తనకు లేదనీ, మహాపురుషులు సఖ్యచిహ్నంగా చేసుకునే మర్యాదగా యిస్తున్నాననీ అగ్నేయాస్త్రం యిచ్చి తనవద్దనున్న చాక్షుషీవిద్య గ్రహించ

వలసిందనీ కోరుతూ: మీ వంశీయులకీర్తివిన్నాను మీ శ్రేయస్సును కాంక్షించే పురోహితు డొకడు మీ వెంట వుండాలి. అంటూ కురువంశం అనే పేరు రావడానికి కారణమయిన తపతీ - సంవరణుల ప్రణయకథా, వారి కల్యాణం. జరిపించిన వశిష్ఠుని కథా, విశ్వామిత్రుని విశేషమూ చెప్పి: అర్జునా! ఈ అడవిలోనే ఉత్కోచతీర్థం వున్నది. అక్కడ దేవల మహర్షి సోదరుడయిన ధౌమ్యుడనే తపస్స్వాధ్యాయ సంపన్నుడున్నాడు. ఆయనను ప్రార్థించి పురోహితునిగా గ్రహించి ఆయన అనుగ్రహం పొందండి అన్నాడు.

అంగారపర్ణుని దగ్గర సెలవుతీసుకుని పాండవులు ఉత్కోచతీర్థం చేరి ధౌమ్యుల వారిని అర్చించి పురోహితులుగా స్వీకరించి వారితో పాంచాల దేశంవైపు సాగారు.

దక్షిణపాంచాలంలో ద్రుపదుని రాజధానిలో ప్రవేశించి, ఒక కుంభ కారుని యింట వసతి ఏర్పరచుకున్నారు. స్వయంవరోత్సవానికి నానా ప్రాంతాలనుంచి చక్రవర్తులూ, వేదవేదాంగవిదులూ, నృత్య, గానకళా కోవిదులు చేరుకున్నారు. అందరికీ సముచితావాసాలు ఏర్పరిచాడు ద్రుపదుడు.

## స్వయంవరం

స్వయంవర సభామండపం చక్రాకారంలో నిర్మించారు. సువాసన లీనే పూలదండలు మండపంనిండా వ్రేలాడదీశారు. శీతలసుగంధజలాలు ప్రాంగణ మంతా జల్లించారు. చంద్రకిరణాలవలె రాజహంసలవలె అగరుధూపం సభాభవనంలో వ్యాపిస్తున్నది. ఈశాన్య భాగంలో కల్యాణమండపం వున్నది. అందరికీ అది స్ఫుటంగా కనిపించేటట్లు సోపాన శ్రేణిలో ఆసనాలు వేయించారు.

ఉదాత్తానుదాత్త స్వరిత స్వరయుక్తంగా వేదఘోష వినవస్తుండగా, మంగళవాద్యాలు తేలితేలి గాలి అలలవలె సాగుతూండగా, జ్వలితజ్వాలా రోచులతో ధగధగలాడే అగ్నిలో ఆజ్యాహుతులు వ్రేలుస్తున్న సమయంలో పన్నీట జలకమాడి ముడిచిన కేశపాశంతో సర్వాంగాలూ రత్నకాంతులీనే

భూషణాలతో అలరారుతూండగా, శోభనరూపిణియైన ద్రౌపదీదేవి శుచిస్మిత వదనంతో రాయంచనడలతో మండపంలో అడుగు మోపింది.

అప్పుడు ధృష్టద్యుమ్నుడు రాజులందరినీ చూస్తూ:

ఉత్తమవంశీయుడూ, సుందరాకారుడూ, బలపరాక్రమ సమన్వితుడూ అయిన మహాధనుర్వేత్త ఎవరయినా, ఈ అయిదుబాణాలతో పైనున్న మత్స్యయంత్రాన్ని పడగొట్టి, నా సోదరి పాణిని గ్రహించవచ్చు - అని గంభీరంగా పలికాడు.

ఒక్కసారి ఆ రాజకుమారు లందరినీ ఎరుకపరుస్తూ: సోదరీ! ఈయన కురువంశీయుడయిన దుర్యోధనుడు, ఇదిగో వీరందరూ ఆయన తమ్ములు. ఆయనకు ఆ ప్రక్క కర్ణుడు: వీరు వారి బావలు, గాంధారరాజపుత్రులు - శకుని, వృషక, బృహద్బలులు. ఆయన అశ్వత్థామ, ఈయన భోజుడు, వారు బృహంతదేశ ప్రభువులు, ఈయన విరాటుడు. వీరు ఆయన పుత్రులు శంఖుడు, ఉత్తరుడు.

వృద్ధక్షేముని కుమారుడు సుశర్మ ఆయన. జలసంధ, విదండ, దండ, పౌండ్రక వాసుదేవ భగదత్త, భూరిశ్రవస, సాత్యకి, అనిరుద్ధ, వాసుదేవ, బృహద్రథ, బాహ్లిక, ఉలూక, శిశుపాల, జరాసంధ, వత్సరాజులు వారు. అలా అందరి వంశ, పౌరుషాలు వివరించి, ఆసనం అలంకరించాడు.

నిశ్శబ్దంగా వుంది కల్యాణమండపం. అందరూ ఆ అతిలోకసుందరి తమ అర్ధాంగి కావాలని కోరుకుంటున్నారు. ఏ ఒక్కరి చూపులూ ద్రౌపదీదేవి ముఖపద్మం నుండి మరలడం లేదు.

ఆ సమయంలో సభాస్థలిని కలయజూస్తున్న యదువంశీయుడు కృష్ణుడు బలరామునితో అన్నయ్యా! అదిగో నివురుగప్పిన నిప్పులవలె, లక్ష్మి సమక్షంలో వుండే మత్తేభాలవలె కనిపిస్తున్నారే వారే పాండవులు, అని పరమ రహస్యంగా చెప్పాడు. పాండవులు సజీవులయి వున్నందుకు సంతోషించాడు, బలరాముడు.

రాజులందరూ రెప్పవాల్చకుండా, పెదవులు పంటితో కొరుక్కుంటూ ద్రౌపదిని చూస్తూ, పక్కనున్న రాకుమారులను ద్వేషభావంతో చూస్తున్నారు.

నెమ్మదిగా ఒక్కొక్కరే అమితోత్సాహంతో మత్స్యయంత్రం పడగొట్టడానికి ముందుకు సాగి, విల్లు ఎక్కుపెట్టి బాణం సంధించడానికి ప్రయత్నించి, విఫలు లవుతున్నారు. సాళ్వ, శల్య, సునీధప్రభువుల వంతు పూర్తి అయింది. అశ్వత్థామ, దుర్యోధనుడు, కర్ణుడు కూడా ప్రయత్నించి వచ్చారు.

శిశుపాల, జరాసంధులు కూడా, ఆ ధనుస్సును ఎక్కుపెట్టి నారి సంధించలేక, అవమానభారంతో రథాలు ఎక్కి ఎవరి దేశానికి వారు వెళ్ళారు.

అటువంటి సమయంలో వేదవేదాంగవిదులందరూ కూర్చునే ప్రాంతం నుండి వస్తున్న మహోన్నత శరీరుని చూసి అందరూ ఆశ్చర్యపడ్డారు. క్షత్రియవీరులు చెయ్యలేనిది ఈ విప్రుడా చేసేది, బాల్యచాపల్యం కాక, అని పెదవి విరిచారు.

పరశురామునీ, అగస్త్యునీ స్మృతికి తెచ్చుకుని విప్రులు ఆనందంతో అటే చూస్తున్నారు. వారి ఆశీర్వాదాలు అర్జునునికి ఉత్సాహం కలిగించాయి. ధనుస్సును సమీపించి ప్రదక్షిణం చేసి పార్వతీపతికి మనసా నమస్కరించి రెప్పపాటులో ధనుస్సు ఎక్కుపెట్టి అయిదు బాణాలూ తొడిగి ఉత్తరక్షణంలో మత్స్యయంత్రాన్ని నేల కూల్చాడు అర్జునుడు. ఇంద్రజాలంలా సాగింది మత్స్యయంత్ర భేదనం. విప్రులందరూ తమ భుజాలమీద ఎర్రని శాలువాలు గాలిలో వూపుతూ హర్షధ్వానాలూ చేశారు. తూర్యస్వనాలూ, వందిమాగదుల జయజయధ్వానాలూ మిన్నుముట్టినవి.

చిరునవ్వులు పెదవులపై చిందుతొక్కే ద్రౌపదీదేవి, చిగురు కెంగేల వలపుతావులు గుబులు కొలుపే కమనీయ కల్యాణ కల్హారమాలిక అర్జునుని కంఠసీమలో అలంకరించింది. పూలవాన సభాభవనం అంతా నిండిపోయింది. ద్రౌపదీసహితుడై అర్జునుడు రంగభూమి నుండి నిష్క్రమించాడు.

రాజకన్య సామాన్య విప్రబాలుని వరించడం రాజలోకానికి బాధాకరమై, ఇటువంటి అకార్యానికి తలపడిన ద్రుపదునికి తగిన శాస్తి చెయ్యాలని వారందరూ కత్తులు దూశారు.

అది చూచి భీముడు సభామండపం ఆవలనున్న ఒక మహా వృక్షం పెరికి వేపరెమ్మ ఆకులు దూసినట్లు చెట్టుకున్న చిన్నకొమ్మలూ రెమ్మలూ దూసి వారికి ఎదురు నిలిచాడు. అర్జునుడు ధనుస్సు ఎక్కుపెట్టాడు. అటు శల్యుడూ, కర్ణుడూ ఇటు వీరి కెదురు నిలిచారు. కొంత పోరుసాగాక కర్ణుడు: ఓ బ్రాహ్మణ యువకుడా! నీ విద్య చూస్తూంటే నువ్వు సాక్షాత్పరశురామునిలా కనిపిస్తున్నావు - అని ప్రశంసించాడు.

ఇప్పుడు కుశలప్రశ్న లనవసరం అని అర్జును డనగా కర్ణుడు నవ్వుతూ బ్రహ్మవేత్తలతో యుద్ధం మంచిదికాదు అని విరమించాడు.

అప్పటికి భీమసేనుడు శల్యునితో తీవ్రంగా ముష్టియుద్ధం సాగించి, ఆయనను రెండు చేతులతో పైకెత్తి నేలమీద పడగొట్టాడు. అంతలో రాజులందరూ ఈ బాలకులు సామాన్యులు కారనీ, వీరి గోత్ర నామాదులు తెలుసుకోవాలనీ అనుకుంటూ శాంతచిత్తులయారు.

భీమార్జునులు ద్రౌపదిని వెంటబెట్టుకుని ఇంటికివచ్చి వంటయింటనున్న తల్లిని సమీపించి:

అమ్మా! భిక్షతెచ్చాం అన్నారు.

అయిదుగురూ పంచుకోండి నాయనా - అని కుంతి వెనుదిరిగి చూసే సరికి కల్యాణ తిలకంతో అతిలోక సౌందర్యంతో సర్వభూషణాలంకృతయైన యువతి కంటపడింది.

ఆమెను చూస్తూనే కుంతి: నాయనా! నా మాట పొల్లుపో కూడదు. ఈ బిడ్డకు అధర్మదోషం అంటకూడదు అటువంటిదారి ఆలోచించండి-అంది.

అప్పుడు ధర్మరాజు: అర్జునా! మత్స్యయంత్రం పడగొట్టిన నువ్వే యీమె పాణిని గ్రహించాలి — అనగా అర్జునుడు: అన్నా! మీకు వివాహం కాకుండా నేను కల్యాణం చేసుకోవడం శాస్త్రసమ్మతం కాదు-అన్నాడు.

ధర్మరాజు చిరునవ్వుతో: ప్రపితామహులు వ్యాసులవారు ఈ ద్రౌపది మన అయిదుగురికీ భార్య కాగలదన్నారు. ఆ మాటప్రకారమే అమ్మగారి

నోటకూడా అదే పలుకు వచ్చింది. అందుచేత మనం అయిదుగురం యీమెను పెండ్లాడాలి — అని నిశ్చయించాడు.

సాయంకాలం అయింది. అన్నదమ్ము లయిదుగురూ భిక్ష తెచ్చి కుంతికి సమర్పించగా ఆమె ద్రౌపదిని పిలిచి:

అమ్మాయి! భిక్షాన్నం రెండుభాగాలు చేసి ఒక భాగాన్ని దేవతలకు నివేదనచేసి, విప్రులకు దానంచేసి కొంతభాగం మన ఆశ్రయంలో జీవించే వారికి పెట్టు — మిగిలినది రెండుభాగాలు చేసి ఒక భాగాన్ని ఆరుగా విభజించి అందులో నాలుగు భాగాలు అన్నదమ్ములు నలుగురికి పెట్టు, పక్కగా వుంచిన భాగాన్ని ఈ భీముడి ముందు పెట్టు, ఆ ఆరింటిలో మిగిలిన రెండూ మనకిద్దరికీ -- అంది.

అత్తగారి మాటలను తు-చ తప్పకుండా అనుసరించింది. అందరూ భోజనాలు చేసి, మృగచర్మాలమీద మేను వాల్చారు. ద్రౌపదీదేవి అత్తగారి పాదసమీపంలో శయనించింది.

ద్రౌపదిని వెంటబెట్టుకుని భీమార్జునులు వచ్చిన క్షణంనుంచీ వారిని అనుసరించి వస్తున్న ధృష్టద్యుమ్నుడు ఇక్కడ జరిగిన కథ అంతా తన తండ్రికి నివేదించి: వారి నడవడి, సంభాషణాక్రమం చూస్తూంటే వారు పాండవులే అనిపిస్తున్నది. లాక్షాగృహంలో పాండవులు బూడిద కాలేదనేవార్త ఒకటి మనం విన్నదే. వీరిని చూస్తూంటే అది నిజమే అనిపిస్తున్నది — అనగా సంతోషించి ద్రుపదుడు తన పురోహితుని పంపి వారందరిని వచ్చి వివాహం శాస్త్రవిధిగా జరిపించుకో మన్నాడు.

ద్రుపదుడు పంపిన రథాలమీద పాండవులు తల్లినీ, ద్రౌపదినీ తీసుకొనివచ్చి అక్కడ విందారగించి, తాంబూలసేవనం చేస్తుండగా ద్రుపదుడు వినయంగా వారి కులగోత్రాలు అడిగాడు. ధర్మరాజు పెదవులు కదలని చిరునవ్వుతో తాము పాండురాజు నందనులమనీ, రాజమర్యాదానుసారం పెళ్ళి జరిపించమనీ అనగా ద్రుపదుడు తన బిడ్డను అయిదుగురికీ భార్యగా ఇవ్వడం శాస్త్రసమ్మతమా — అన్నాడు.

ఏకస్య బహవో జాయా భవంతి
నైకస్యై బహవ స్సంతి పతయః.

ఆ ప్రస్తావన సాగుతూండగా అక్కడకు విజయం చేసిన వ్యాసుడు ద్రౌపది పూర్వ జన్మకథ చెప్పి ఆమె అయిదుగురికీ భార్య కావడం విధాత నిర్ణయం అనగా ద్రుపదుడు ఆనందంతో వివాహ ప్రయత్నాలు ఆరంభించాడు.

కల్యాణమండపం కలువలూ, తామరలూ కలిపిగుచ్చిన దండలతో అలం కరించారో, కలువకన్నెలతో పద్మవదనలతో అలరారజేశారో తెలియనంత సందడిగా వుంది.

పురోహితుడు ధౌమ్యుడు, అగ్నిని ప్రజ్వలితంచేసి, ఆహుతు లర్పిం చాడు. ద్రౌపదిని మంగళస్నానాలు చేయించి, అలంకరించి కల్యాణ వేదికకు కొనితెచ్చారు. చంద్రుడు పుష్యమీనక్షత్రంలో అడుగుపెట్టేవేళ వైదిక మంత్ర ఘోషతో మంగళవాద్యాలు సాగుతూండగా ధౌమ్యులవారు ద్రౌపదీ ధర్మరాజుల కొంగులు ముడివేసి పాణిగ్రహణం జరిపించారు.

అలానే ఒక్కో సుముహూర్తంలో మిగిలిన నలుగురికీ పరిణయం జరిపించి అల్లుళ్ళు అయిదుగురికీ రత్నభూషణాలూ, చీనీ చీనాంబరాలూ ఇచ్చి ఆడబిడ్డకు ఆమె మనస్సుమెచ్చే అలంకారాలు అంబరాలూ యిచ్చి నగరజనానికి అన్న వస్త్రదానాలు చేసి పరితృప్తి కలిగించాడు.

నెమ్మది నెమ్మదిగా ద్రౌపదిని పెండ్లాడినది పాండురాజపుత్రులే అనే వార్త నానా దేశాలకూ చేరి వారందరూ ధృతరాష్ట్రుని దుర్బుద్ధినీ, దుర్యోధనాదుల కుతంత్రాలనూ నిందించసాగారు.

ఇక్కడ హస్తినాపురంలో ధృతరాష్ట్రునికి తన వంశయులే ద్రౌపదిని స్వయంవరంలో చేపట్టారనేవార్త వినిపించగానే విదురుని పిలిచి: దుర్యోధ నుడు ద్రౌపదీ సహితుడయి వస్తున్నట్లు విన్నాను. వారిరువురికి ఘనస్వాగతం ఏర్పాటు చెయ్యి, అనగా విదురుడు —

మహారాజా! పెండ్లి జరిగింది పాండవులకు — అన్నాడు. ధృత రాష్ట్రుడా మాట వింటూనే గుండెలో విపరీతమయిన బాధపుట్టగా దాన్ని

వ్యక్తంచెయ్యక, మహామంత్రీ! పాండవులు జీవించివుండడమే కాక ద్రౌపదిని పెండ్లిచేసుకోవడం కూడా నాకు ఆనందం కలిగిస్తున్నది. వారందరినీ రప్పించి ఉత్సవాలు జరిపించు — అన్నాడు.

ప్రభువు అనుమతితో విదురుడు సెలవుతీసుకున్న క్షణంలో దుర్యోధనుడు శకుని కర్ణులతో వచ్చి: మీ మనస్సు మాకు అవగాహన కావడంలేదు. మీరు పాండవ పక్ష పాతంలో వున్నట్టున్నారు — అని దీనంగా అడుగగా ధృతరాష్ట్రుడు తాను విదురునిముందు అలానే మాట్లాడతాననీ అందుకు బాధపడకుండా తగిన ఉపాయాలు అన్వేషించమనీ అన్నాడు.

అప్పుడు శకుని: మహారాజా! శత్రువును ఎదుర్కొనే విషయంలో రాజనీతి మూడు దారులు చూపిస్తున్నది. ఓ రకం శత్రువుని నిరంతరం దుర్బలదశలో వుంచాలి. మరొక వర్గాన్ని ఎప్పుడూ హింసిస్తూ ఉండాలి. మూడవ రకం శత్రువును ఎప్పుడుపడితే అప్పుడు ఎక్కడదొరికితే అక్కడ సంహరించాలి. పాండవుల విషయంలో ఇదే శ్రేష్ఠమయిన మార్గం — అన్నాడు.

అదివిని దుర్యోధనుడు: మహారాజా! మనం కుంతీపుత్రులకు, మాద్రి కొడుకులకూ మధ్య విభేదం కల్పించాలి. లేదా ద్రుపదునికి ధనలోభం కలిగించాలి. కాదా, పాండవులకు పాంచాలదేశం మీద వ్యామోహం పెరిగేదారి చూడాలి. అన్నిటికంటె ద్రౌపదికి భర్తలమీద అనురాగం తగ్గి ద్వేషం పుట్టే మార్గం యోచించాలి. సమయం చూసి భీమసేనుని యమపురికి పంపినా మనకార్యం సానుకూలమవుతుంది. ఇవేవీ సాగకపోతే పాండవులకు ఇతర స్త్రీలతో పరిచయం కలిగించి, వారిచేత మన పని పూర్తిచేయించాలి — అనగా కర్ణుడు.

ప్రభూ! ఈ ఆలోచనలేమీ ఆచరణకు పనికివచ్చేవి కావు. భిక్షాటనం చేసేవారిని సేవించడానికి వెనుకాడని స్త్రీకి వారిమీద ద్వేషం కలగడం అసంభవం. ఒకేస్త్రీయందు అనురక్తి వున్నా వారిమధ్య విద్వేషాలు రావడం లేదంటే ఇంక మనం వారి ఐకమత్యాన్ని విచ్ఛిన్నం చేయలేము. ఉత్తమ వంశీయుడూ, గుణశీల సంపన్నుడూ అయిన ద్రుపదునికి ధన ప్రలోభం

కలిగించటం అసాధ్యం. పరాక్రమ ప్రదర్శనమే క్షత్రియ వీరునికి కార్యసాధన మార్గం. పాండవులే పాంచాలిని వరించినట్లు చాలా దేశాలవారికి తెలియదు. ఈ దశలో మనం ద్రుపదుని జయించి పాండవులను పరాభూతులను చేయడం ఏకైక మార్గం అన్నాడు.

ఆ యోచనకు ధృతరాష్ట్రుడు తృప్తిపొంది భీష్మ, ద్రోణ, విదురులతో సంప్రదించి నిర్ణయిద్దామని వారిని రప్పించి విషయం వారి ముందుంచాడు. అప్పుడు భీష్ముడు: నాయనా! నీకూ నాకూ పాండవుల రక్షణ భారం సమంగా వుంది. ఇక ఈ రాజ్యాన్ని ఏలవలసింది పాండవులేకాని ఈ దుర్యోధనాదులు కారు. అధికారం వారిది. అందుచేత వారిరాజ్యం వారికివ్వడం ధర్మమార్గం. లాక్షాగృహంలో పాండవులు దగ్ధమయారని విన్నది మొదలు నేను ప్రజలముందు తలయెత్తి తిరగలేకపోతున్నాను. వంశ వృద్ధువుండగా యిటువంటి అఘాయిత్యం చూచి వూరుకుంటాడా! అని నలుగురూ అంటుంటే నా గుండె బాధతో ముడుచుకుపోతున్నది. దైవం అనుకూలించి ఈ నాటికి వారు సుఖంగా వున్నారని విన్నాను. వారిని తక్షణం రావించి రాజ్యభాగం యిచ్చి సుఖంగా వుండు — అన్నాడు.

అనంతరం ద్రోణాచార్యులు లేచి తన అభిప్రాయం కూడా భీష్ముల వారి ఊహనే బలపరుస్తున్నదనీ పాండురాజనందనులు సజీవులై వున్నారని విన్న పౌరులూ, జానపదులూ అందరూ వారిని చూడాలని ఎదురుతెన్నులు చూస్తున్నారనీ అందుచేత ప్రజాభిమతం గ్రహించి పాలించే కురువంశంలో ప్రభవించిన మీరు తక్షణం ఆదరంగా పాండవులను హస్తినాపురానికి రప్పించండి — అన్నాడు.

ఇద్దరిమాటలూ విని ధృతరాష్ట్రుడు విదురుని పిలిచి, పాంచాలానికి వెళ్ళి రాజ లాంఛనాలతో పాండవులను ద్రౌపదీ సమేతం తీసుకు రమ్మన్నాడు.

విదురుడువచ్చి ద్రుపదునికి ధృతరాష్ట్రుని అభిప్రాయం తెలియజేసి వారిచేత సత్కారాలు పొంది ద్రుపదుడు కానుకగా యిచ్చిన రథాలమీద రత్నమాణిక్యాది భూషణాలతో చీనాంబరాలతో పాండవసహితుడై హస్తినా పురం చేరాడు.

వీరందరికీ స్వాగతం యివ్వడానికి వికర్ణ చిత్రసేనులతో ద్రోణాచార్యునీ, కృపాచార్యునీ పంపించాడు ధృతరాష్ట్రుడు.

ద్రౌపదిని అంతఃపురానికి కొనితేవడానికి దుర్యోధనుని భార్యతో కురు వంశ స్త్రీ లందరూ వచ్చారు.

హస్తినాపుర పౌరులేకాక పరిసర జనపదాల ప్రజలు లక్షల సంఖ్యలో వచ్చి పాండవులను చూచి ప్రశంసావర్షం కురిపించారు.

విద్వాంసులూ, కళాకోవిదులూ వారిని అభినందించి సత్కారాలు పొందుతూంటే మంగళవాద్య ఘోష మిన్నుముట్టుతూండగా వణిక్ప్రముఖులు తమకు చక్కని రక్షకులు వచ్చారని సంతోషంతో పాండురాజనందనులను అభినందించారు. నగరవీధులన్నీ పన్నీటి జలాలతో సుగంధ ధూపాలతో అలరారుతున్నాయి.

కుంతినీ, ద్రౌపదినీ వెంటబెట్టుకుని దుర్యోధనపత్ని గాంధారి సౌధానికి తీసుకొని వెళ్ళింది. పట్టమహిషి ద్రౌపదిని గాఢాలింగనం చేసుకొని, ఆశీర్వదించిన అనంతరం వారిని పాండురాజ భవనంలో ఒక సుముహూర్తాన ప్రవేశపెట్టవలసిందిగా విదురునికి కబురు పంపింది.

కొద్దిరోజులు గడిచాయి. ధృతరాష్ట్రుడు సభాభవనానికి పాండవులను రావించి; ధర్మనందనా! అహంకార దర్పోన్మత్తులయిన నా కొడుకులు నన్ను లెక్కచెయ్యడంలేదు. అందుచేత వారికీ మీకూ విద్వేషాలు పెరగకుండా మీరు ఖాండవప్రస్థంలో నిశ్చితంగా వుండండి. మీ అర్ధరాజ్యాన్ని మీరు సుఖంగా అనుభవించండి — అని విదురునితో, మహామంత్రీ! నేడే ధర్మరాజుకు రాజ్యాభిషేకం చేయిస్తున్నాను. వేదవిదులయిన విప్రులనూ, వ్యాపారరహస్యాలు తెలిసిన శ్రేష్ఠులనూ రప్పించు. భద్రగజంమీద ధర్మరాజు రాజలాంఛనాలతో ఊరేగుతుంటే పౌరులందరూ పాండురాజు చేసిన ఉపకారానికి ఉచితరీతిని ధృతరాష్ట్రుడు ప్రత్యుపకారం చేశాడని ఆనందించాలి అన్నాడు.

ఆ సమయానికి అక్కడకు విచ్చేసిన వ్యాసుడూ, కృష్ణుడూ సంతోషచిత్తులై వేదోక్తంగా ధర్మరాజుకు రాజ్యాభిషేకం జరిపించారు.

నగరప్రదక్షిణంచేసి వచ్చిన ధర్మరాజును దగ్గరగా తీసికొని ధృతరాష్ట్రుడు: నాయనా! పురూరవ, నహుష, యయాతిప్రభృతి మనవంశీయులందరికీ ఖాండవప్రస్థమే రాజధాని. కాలాంతరంలో హస్తినాపురానికి వచ్చింది. నువ్వు ఖాండవప్రస్థాన్ని పునర్నిర్మించి మన వంశకీర్తిప్రతిష్ఠలు నిలబెట్టు. ఈ నగరంలో నిన్ను అభిమానించే వారందరూ నీ వెంటవస్తారు. వారందరితో హాయిగా నీ రాజ్యం నువ్వు పాలించుకో అన్నాడు.

## ఖాండవప్రస్థం

శ్రీకృష్ణుని ముందుంచుకొని పాండవులు ఖాండవప్రస్థం చేరారు. అది మహారణ్యంలా వుంది. కృష్ణుడు విశ్వకర్మను రప్పించి అమరావతితో తులతూగేనగరం నిర్మించమన్నాడు. వ్యాసులవారు శాంతికర్మ జరిపించారు. నగర నిర్మాణ పథకం రూపొందింది. అగాధమయిన కందకం త్రవ్వి విశాలమైన వీధులు ఏర్పరచి, ఉన్నత గోపురాలతో భవనాలు నిర్మించారు. సువిశాల స్థలాన్ని విలువిద్యాభ్యాసానికి సమతలం చేయించారు. శస్త్రాగారాలు వేరే కట్టించారు. నగరం చుట్టూ రెండునాలుకల పాముల్లా లోహ నిర్మిత యంత్రాలు రక్షణకోసం ఏర్పాటు చేశారు. నగరంలో రమణీయ ఉద్యానవనాలు, దిగుడుబావులు, క్రీడానరోషరాలు, కృత్రిమగిరులు నిర్మింపజేశారు.

చిలుకలూ, కోకిలలూ, జలపక్షులూ నిర్విరామంగా విహరిస్తుంటే, పురి విప్పి నెమళ్ళు అడుతూంటే పూలతావులు మత్తెక్కిస్తూ ఆ ఉద్యానవనాలు సర్వేంద్రియాహ్లాదం కలిగిస్తున్నవి.

వేదవిదులయిన విప్రులు, వ్యాపారకుశలులయిన వణిగ్వరులు, నృత్త, గీత, వాద్యనిపుణు లయిన కళాకోవిదులూ నగరం చేరారు.

ఒక సుముహూర్తాన మంగళవాద్యఘోష, వేదవిదుల స్వస్తివాచకం చెవులబడుతూండగా ధౌమ్యులవారు గంగా జలపూరితమయిన కలశంతో ముందు సాగగా వ్యాసులవారివెంట ధర్మరాజు నగరం ప్రవేశించాడు. దానికి ఇంద్రప్రస్థం అని పేరుపెట్టారు.

నగరానికి ముప్పదిరెండు ద్వారా లుంచారు. తోరణద్వారానికి వర్ధమానమని నామకరణం చేశారు. ఆ ద్వారం దాటి లోపలకు వెళ్ళింది ధర్మరాజు అధిష్ఠించిన రాజమత్తేభం.

నగరవాసులందరికీ వారి వారి అవసరాలకు తగిన ఏర్పాట్లు జరిగాయో లేదో స్వయంగా చూసుకున్నాడు ధర్మరాజు.

కొద్దిరోజులు గడిచాక కృష్ణుడు ద్వారకానగరానికి బయలుదేరుతుంటే కుంతీదేవి: నాయనా! నీ అనుగ్రహం విశేషం వల్ల నా బిడ్డలు వారి రాజ్యం పొంద గలిగారు. ఎప్పుడూ వారిని ఒక కంట చూస్తూండు — అంది.

తలవూపి కృష్ణుడు బయలుదేరాడు.

దాన ధర్మాదులతో ప్రజారంజకంగా ధర్మరాజు ఇంద్రప్రస్థంలో పాలన సాగిస్తూన్న రోజులలో నారదుడు వచ్చి సుందోపసుందులనే అన్నదమ్ములు ఒకనారీమణి కారణంగా ఒకరినొకరు పొడుచుకు మరణించారనీ అందుచేత ఒకే భార్యగల అన్నదమ్ము లయిదుగురూ నియమబద్ధంగా సాగకపోతే ప్రమాదం రాగలదనీ, అనగా ధర్మరాజు —

మహర్షీ! మేం ఒక నియమం చేసుకున్నాం. సంవత్సరానికి ఒకరితో ద్రౌపది వుంటుంది. ఆ రోజులలో వారి శయ్యామందిరానికి మాలో యితరులెవరు వెళ్ళినా పన్నెండునెలలు అరణ్యంలో వుండాలి — అనగా నారదుడు సంతోషించి వారి సత్కారాలు పొంది వెళ్ళాడు.

అలా సుఖ శాంతులతో ఉన్నరోజులలో, ఒక విప్రుని సంపదలు హరించిన చోరులను వేటాడడానికి, అర్జునుడు చకచక ద్రౌపదీ ధర్మరాజు లున్నమందిరంలో అడుగుపెట్టి సమయభంగం కారణంగా, అడవులకు వెడతానన్నాడు.

ధర్మరాజు వారించి: నాయనా! అన్నగారు అంతర్మందిరంలో వున్నా తమ్ముడు రావచ్చు. కాని తమ్ముని శయనమందిరానికి అన్న వెళ్ళకూడదని ధర్మశాస్త్రం చెప్తోంది — అన్నాడు.

అయినా అర్జునుడు నియమభంగానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటానని బయలుదేరగా అతనివెంట ఎందరో వేదవిదులూ, యతులూ; పౌరాణికులూ బయలుదేరారు.

## సుభద్రా పరిణయము

కమ్మగా కథలు చెప్పేవారు మార్గాయాసం తెలియనివ్వకుండా మంచి మంచి విషయాలు వినిపిస్తూంటే, యాత్ర సాగిస్తూ హరిద్వారం చేరాడు. అక్కడ గంగాస్నానం చేస్తూండగా, నాగరాజకన్య ఉలూపి అర్జునుని వలచి, అతనివల్ల ఇరావంతుడనే కుమారుని కన్నది.

అక్కడనుండి ముందుకుసాగి, హిరణ్యబిందు తీర్థంలో స్నానంచేసి, తూర్పుగా నడిచి, ఉత్పలినీ, యశస్వినీ, నందా, అపరనందా నదులలో పితృదేవతలకు తర్పణాలు విడిచి, సముద్రతీరం వెంట మణిపురం చేరాడు. అక్కడ రాజపుత్రి చిత్రాంగదమీద మనసుపెట్టి, ఆ రాజునుచేరి ఆమెకు కలిగిన కుమారుని వారికే ఇవ్వడానికి అంగీకరించి మూడేళ్ళు అక్కడే గడిపి, చిత్రాంగద గర్భవతి కాగానే, ఆమెను ఓదార్చి ముందుకు సాగి, అగస్త్య, సౌభద్ర, పౌలోమ, కరంధము, భారద్వాజ క్షేత్రాలు దర్శించి అక్కడి ప్రశాంతతకు ముగ్ధుడై సౌభద్ర క్షేత్రంలో స్నానానికి దిగగా, అందులో ఒక మొసలి వానిని పట్టి లాగబోగా, దానిని ఒడ్డుకు లాగడంతో అది స్త్రీ రూపం ధరించింది.

ఆమె తనతో తన చెలికత్తెలు మరో నలుగురు వున్నారనీ, వారినీ ఉద్ధరించమనగా, వారినీ ఒడ్డుకు లాగి శాపముక్తులను చేసి, మళ్ళీ తిరుగు ప్రయాణంలో మణిపురం వెళ్ళీ, చిత్రాంగద ప్రసవించిన కుమారునికి బభ్రువాహనుడని పేరుపెట్టి గోకర్ణంలో ప్రభాసక్షేత్రం చేరి, అక్కడ తనను చేరిన కృష్ణునితో రైవతకాద్రిమీదె ఒకరాత్రి వృత్త, గాన వినోదాలతో గడిపి, మరునాడు ద్వారకాపురం చేరాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఆ రోజులలో ఒకనాడు రైవతకాద్రిమీద ఉత్సవం జరుగుతూండగా కృష్ణార్జునులుభయులూ ఆ వేడుకలు తిలకిస్తుండగా, అర్జునుని కంటబడిన సుభద్ర ఆ మహావీరుని మనస్సును ఆకర్షించినట్లు గ్రహించి:

అడవులలో తిరిగే యతీశ్వరులకు కూడా మనస్సు చలిస్తుందని యిప్పుడే తెలిసింది. అంటూ పరిహాసమాడి, ఎవరికీ తెలియకుండా సుభద్రనూ, అర్జుననీ ఒక రథం ఎక్కించి పంపించాడు కృష్ణుడు.

ఈ వార్త విన్న నగరపాలకుడు రణ సన్నాహ భేరీ మ్రోగించాడు. అది విని బలరాముడు వచ్చి కృష్ణునితో సంప్రదించకుండా యీ ప్రయత్నం ఏమిటని ఆగ్రహంతో పలికి, కృష్ణునివైపు తిరిగి, ఈ పార్థుడు మనకు తగని పని చేశాడు, దీనికి ప్రతీకారం నే నొక్కడినే వెళ్ళి చేసివస్తాను, అని మేఘగర్జన చేశాడు. వీరులందరూ సింహనాదాలు చేశారు.

కృష్ణుడు నవ్వుతూ లేచి: భరత, శంతనులు పుట్టిన వంశీయుడు అర్జునుడు. ఆ వీరుడు క్షత్రియ ధర్మోచితంగానే సుభద్రను తీసుకువెళ్ళాడు. ఇప్పుడు దీనికి కత్తులు దుయ్యవలసినపనిలేదు. దూతలను పంపి వారిని రప్పించి చక్కగా కళ్యాణం జరిపించడమే మన కర్తవ్యం — అనగా అందరూ ఆమోదించారు.

సుభద్రను పెండ్లాడి ఒక సంవత్సరం గడిపి, అనంతరం అర్ధాంగితో హస్తినాపురం వస్తూనే ధౌమ్యులకూ ధర్మజులకూ అభివాదాలూ, పూజలూ జరిపి అనంతరం ద్రౌపది దగ్గరకు రాగా, ఆమె అలకతో; సుభద్రతో అక్కడే వుండలేకపోయేవా? కొత్త బంధం పాతబంధాన్ని సడలిస్తుందంటే ఏమిటో యిప్పు డర్థమయింది. అని కంట తడిబెట్టగా ఆమెను ఓదార్చి ప్రసన్నురాలిని చేశాడు.

తదుపరి సుభద్రను అలంకారాలన్నీ తీయించి ఎర్రని పట్టుచీర కట్టించి గోపికా వేషంతో ద్రౌపదీదేవి దగ్గరకుపంపి ఆమె పాదాలకు నమస్కరింప జేయగా ఆమె ఆనందంతో నీ భర్త శత్రుభీతి లేకుండా వుండుగాక అని ఆశీర్వదించి సుభద్రను ఆలింగనము చేసుకున్నది.

ఈ వార్తలన్నీ విన్న యదువంశ ప్రముఖులు రత్న, భూషణాదులు కానుకగా తెచ్చి సుభద్రకు అర్పించారు. వచ్చినవారందరినీ ఉచితరీతిని సత్కరించాడు ధర్మరాజు. అందరూ తిరిగివెళ్ళిన అనంతరం కృష్ణార్జునులు విలాస విహారాలు సాగిస్తున్నారు.

ఆ రోజులలో సుభద్ర అభిమన్యుని ప్రసవించింది. అనంతరం కొంత కాలానికి ద్రౌపది ధర్మరాజువల్ల ప్రతివింధ్యునీ, భీమునివల్ల శ్రుతసోమునీ, అర్జునునికి శ్రుతకర్మనూ, నకులునికి శతానీకునీ, సహదేవునివల్ల శ్రుతసేనునీ ప్రసవించింది.

అందరూ ధౌమ్యులవారి శిక్షణలో వేదశాస్త్రాలూ, అర్జునునివద్ద ధనుర్వేదమూ, అభ్యసిస్తున్నారు.

## ఖాండవవన దహనం

కాలం గడుస్తున్నది.

ఒకనాడు కృష్ణార్జునులు వనవిహారంచేసి ఒక చోట విశ్రాంతిగా కూర్చుండే వేళ అగ్నిహోత్రుడు విప్రవేషంలో వచ్చి తన ఆకలికి ఆహారంగా ఖాండవవనం భక్షించే అవకాశం కలిగించాలనీ, అయితే దానిని ఇంద్రుడు రక్షిస్తున్నాడనీ, తక్షకుడు దానిని తన పరివారంతో కాపాడుతున్నాడని అన్నాడు.

కృష్ణార్జునులు అభయమిచ్చారు.

అగ్నిభట్టారకా: ఎవడెదురుగావచ్చినా నిలబెట్టగలను. కాని ప్రస్తుతం నా దగ్గర ధనుస్సు లేదు. చేతిలో వున్న ఈ ధనుస్సు వేటకే కాని తీవ్ర సంగ్రామానికి పనికిరాదు — అన్నాడు అర్జునుడు.

వరుణుని ప్రార్థించి అగ్ని విచిత్ర వర్ణాలతో కనులు మిరుమిట్లు గొలుపుతూ, అప్రతిహతంగా బాణాలు విడవటానికి వినియోగపడే గాండీవమూ, దానికి తగిన అక్షయతూణీరాలూ, నాలుగు తెల్లని గుర్రాలను పూన్చిన దివ్యరథమూ అర్జునునికి యిప్పించాడు. ఆ రథ పతాకంమీద కపిచిహ్నం భయానకంగా వుంది.

అర్జునుడు కాసెకోక బిగించి, కవచం తొడగి, కత్తిచేబూని రథానికి ప్రదక్షిణ నమస్కారాలుచేసి, నమస్కారపూర్వకంగా గాండీవం అందుకుని, రథం ఎక్కి ఒక్కసారి ధనుష్టంకారం చేశాడు. అప్పుడు అగ్నిహోత్రుడు సుదర్శనచక్రాన్ని కృష్ణుని కిచ్చాడు. వరుణుడు తనవద్దనున్న కౌమోదకి అనే గదనుకూడా వాసుదేవునికి అర్పించాడు.

శ్వేతకి జరిపిన ద్వాదశవర్షయజ్ఞంలో నిరంతరాయంగా ఆహుతి చేసిన ఆజ్యం తనకు జీర్ణంకాని కారణంగా, ఆ బాధానివారణకు అగ్ని ఖాండవ వనాన్ని స్వాహా చేసే సంకల్పంతో సప్తజిహ్వాలతో వనాన్ని చుట్టుముట్టాడు. ఆ జ్వాలల వేడిసోకి కొన్ని మాడుతున్నాయి. మంటలుతాకి కొన్ని వాలుతున్నాయి. మంటలోపడి కొన్ని బూడిద అవుతున్నాయి. ఆ వేడికి వనంలోని సరోవరంలో నీళ్ళువేడెక్కి, అందులోని చేపలూ, తాబేళ్ళూ ఉడికిపోతున్నాయి. వనమధ్యంలోని జంతువుల రోదనధ్వానాలు సాగరమథన వేళ కల్లోలాన్ని తలపింపజేస్తున్నాయి. ఖాండవవనం అంతా మండడం మొదలుపెట్టింది. ఈ వార్త దేవేంద్రునికి అందగానే ఆయన కుంభవృష్టి ఆరంభించాడు. మంటలమీద నీరుపడి పొగలు బయలుదేరాయి. అర్జునుడు తన బాణాసనాన్ని నిర్విరామంగా నడిపి, వనంలో వానచినుకు పడకుండా చేశాడు.

వనరక్షకుడుగా వున్న తక్షకుని కొడుకు అశ్వసేనుడు ఆర్తనాదం చేయగా, వాని తల్లి ఆ బిడ్డను నోటితో పట్టుకుని ఎగరబోతూండగా అర్జునుడు దానిని ఖండించాడు.

ఇంద్రార్జునులు దివ్యాస్త్రాలు సంధించుకున్నారు. కొంతసేపు పోరు సాగాక దేవేంద్రుడు యుద్ధంచాలించి వెళ్ళిపోయాడు, పదిహేను రోజులు ఏకధాటిగా, అగ్ని హోత్రుడు ఖాండవవనాన్ని ఆరగించి తృప్తిపడ్డాడు. ఆ వనం నుండి బైటపడ్డవారు మయుడూ, అశ్వసేనుడూ, శార్ఙ్గకాలనే నాలుగు పక్షులూనూ తప్పించుకుపోతూన్న మయుని సంహరించడానికి కృష్ణుడు యత్నించాడు. కాని అర్జునుడు అభయ మిచ్చి రక్షించాడు.

ఆ విధంగా ఖాండవవనాన్ని అగ్నికి ఆహుతిచేసి, కృష్ణార్జునులు ఆనందంగా ఇంద్రప్రస్థం చేరారు, అని వైశంపాయనుడు జనమేజయునికి ఆదిపర్వం వినిపించాడు.

ఆదిపర్వం సమాప్తం.

[ఈ పర్వప్రారంభంలో ఎన్నెన్నో మహత్తరమయిన ఉపాఖ్యానా లున్నాయి. భారతీయ సాంఘికవ్యవస్థ పరిణామాన్ని పరిశీలించేవారికి ఉపయోగపడే సమాచారం ఎంతగానో లభిస్తుంది మూలగ్రంథంలో. అది విమర్శకులు ప్రమాణబుద్ధితో అధ్యయనం చేయదగ్గది.]

కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులనేకుల్ చూచుచుండన్ మదో
ద్ధురుఁడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోక భీ
కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘని
ర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్.

# సభాపర్వం

ఇందులో:

మయసభ

జరాసంధవధ

శిశుపాలవధ

ద్యూతక్రీడ

వస్త్రాపహరణం

అనుద్యూతం

# మయసభ

కృష్ణార్జునులు ఇష్టసల్లాపాలలో వున్న సమయం. ఖాండవవన దహన వేళ వారివల్ల రక్షణపొందిన మహాశిల్పి మయుడు వారిదగ్గరకువచ్చి, నా ప్రాణరక్షణచేసిన మీకు కృతజ్ఞత తెలుపుకుందుకు అవకాశం ఇప్పించండి అనగా ప్రత్యుపకారదృష్టితో నే నాపని చెయ్యలేదన్నాడు — అర్జునుడు.

తాను మహాశిల్పిననీ తన హృదయానికి తృప్తికలిగేందుకు ఏదో ఒక పని చేయించుకోమనీ కోరాడు. అప్పుడు కృష్ణుడు పాండవులకు చక్కని సభాభవనం నిర్మించి యిమ్మన్నాడు.

మయుడు మనస్సులో మహాసభాభవన నిర్మాణానికి ఆలోచనాబీజం నిక్షేపించి ఒకానొక సుముహూర్తంలో మంగళాచరణం జరిపి వైదికస్వస్తి పలికించి పాయసాన్నదానాలు చేయించి, సువర్ణ ముద్రికలు కూడా వేద విదులకు అర్పించి నిర్మాణ కార్యక్రమం ప్రారంభించేముందు అర్జునుని సమీపించి,

విజయా! సభాభవన నిర్మాణానికి అవసరమయిన సామగ్రితో మణి భాండం ఒకటి వృషపర్వుని రాజధాని బిందుసరంలో వుంచాను. దానితోపాటు ఆ నగరంలోనే వున్న ఒకానొక గదాదండం భీమసేనునికి బహూకరించాలని వుంది. అక్కడే వరుణుడు దేవదత్తశంఖం భద్రపరిచాడు. అది నీ చేతులలో వుండాలి. వాటిని తెచ్చి పని మొదలు పెడతానని సెలవు తీసుకొని వెళ్ళి తిరిగివచ్చి గదాశంఖాలను వారి కిచ్చి, భవన నిర్మాణం సాగించాడు.

అంతా అయాక ఒకనాడు ధర్మజునికి ఆ భవనాన్ని చూపుతూ:

ధర్మనందనా! ఇంద్రనీలాలను తిరస్కరించే జలాలతో పద్మరాగారుణ పద్మాలతో చక్రవాకాది జలపక్షులతో స్వర్ణమయాలయిన మత్స్యకూర్మాలతో పిల్లగాలికి రేగే నీటి బిందువులతో తామరపాకులు మత్స్యభ్రాంతి కలిగించే ఈ సరోవరాలకు స్ఫటికసోపానాలు నిర్మించాను.

ఈ పుష్కరిణి ఒడ్డున శిలావేదికలన్నీ స్ఫటికశిలలతోనే ఏర్పాటు చేశాను. అయితే వివేకంలేని వారి కిది సరోవరంలా కాక చక్కని

భూమిలా వుంటుంది. ఇక ఈ భవన పరిసరాల్లో చల్లని గాలులు వీచే వృక్షాలతో, లతలతో, ఉద్యానవనం ఏర్పరచాను. దీని నిర్మాణ విశేషాలన్నీ నాకు నేను చెప్పడం మంచిదికాదు. పదునాలుగు మాసాల వ్యవధిలో దీన్ని పూర్తిచేశాను. ఈ భవనప్రవేశానికి ముందు జరగవలసిన శాంతిక్రియలన్నీ సాగించండి — అని సెలవు తీసుకున్నాడు, వారి అభినందనలతో.

పదివేలమంది వేదవిదులను పంచభక్ష్య పరమాన్నాలతో, వస్త్ర భూషణాదులతో, గోదానాలతో సంతుష్టులనుచేసి వారి ఆశీస్సులుపొంది, మంగళవాద్యఘోష మిన్ను ముట్టుతూండగా వేదవిదులు స్వస్తివాచనం చేస్తుండగా సభాభవనంలో దేవతాస్థాపనం చేసి సింహాసనం అధివసించాడు — ధర్మరాజు.

ఆ సభాభవన ప్రవేశోత్సవానికి నానాదేశాల చక్రవర్తులూ, బహుదూర ప్రాంతాల ఆప్తులూ, స్నేహితులూ వచ్చారు. అందరికీ ఉచితరీతిని స్నాన, పాన, భోజన, విశ్రాంతి సౌఖ్యాలు ఏర్పాటుచేశారు. విమల గాంధర్వ విద్యాకోవిద లయిన అప్సరసలు నాట్యం చేస్తుంటే, తుంబుర చిత్రసేనులు గానం చేస్తూ సదస్యులకు నయన, శ్రవణతర్పణం చేస్తున్నారు. అలా మహోత్సాహంగా సభాభవనంలో రోజులు గడుపుతుండగా ఒకనాడు వేదవేదాంగ విదుడు, తపస్సంపన్నుడు, పురాణేతిహాస మర్మజ్ఞుడు, ధర్మతత్వప్రచారకుడు, కాలజ్ఞుడు, రాజనీతిరహస్యవేత్త, సంగీతకోవిదుడు, మహావక్త అయిన నారద మహర్షి విజయం చేయగా ధర్మరాజు వినయ వినమితశిరస్కుడై ఆయన కెదురేగి అర్ఘ్యపాద్యాలర్పించి, ఉచితాసనంమీద ఆసీనునిచేసి కుశల ప్రశ్నలు ముగించాడు.

అప్పుడు నారదుడు: ధర్మనందనా! నువ్వు నీ తండ్రి తాతలు నడిచిన న్యాయమార్గాన నడుస్తున్నావా? నీ రాజ్యంలో ప్రజలందరినీ సమదృష్టితో చూస్తున్నావా? ధనలోభంతో ధర్మకార్యాలను విడిచిపెట్టడం లేదుకదా! అలానే కామబుద్ధితో ధర్మార్థాలను వదులుకోకూడదుసుమా. ఉదయవేళ దానధర్మకార్యాలూ, మధ్యాహ్నవేళ అర్జార్జన కార్యాలూ, రాత్రులు కామోపభోగమూ సాగించాలని శాస్త్రం ఘోషిస్తున్నది. చతుర్దశ స్థానరక్షణతో

చక్రవర్తి షడ్గుణాలూ అభ్యసించి, ఉపాయసప్తకం ఎరిగివుండాలి. శత్రువు మనకంటే బలవంతుడయితే వానితో స్నేహం చెయ్యాలి.

నీ ప్రకృతిజను లెవ్వరూ శత్రుకూటంతో చేతులుకలపకుండా చూడాలి. ధనం వున్నదే అది దుర్వ్యసనాలవైపు మనస్సును నడుపుతుంది. దాన్ని నిరోధిస్తున్నావా?

విషయవివేచనాశక్తి, భూతకాలవిషయస్మృతి, దూరదృష్టి, నీతిజ్ఞత, తర్కశాస్త్రజ్ఞానం, ప్రగల్భవర్తన — ఇవి షడ్గుణాలు. సామ, దాన, భేద, దండమార్గాలు, మంత్రశక్తి, ఔషధవిజ్ఞానము, ఇంద్రజాలము — ఇవి ఉపాయసప్తకం.

రథ, గజ, తురగ, పదాతులూ, ధన, లేఖన, గణన, అధికార, అంతఃపుర, దుర్గ, దేశ శాస్త్రబలాదులూ కోటకు చతుర్దశస్థానాలు. ధర్మాధ్యక్ష దుర్గాధ్యక్ష, బలాధ్యక్షులూ, పురోహిత, వైద్య, కార్తాంతిక, సేనాపతులూ ప్రకృతిజనులు.

అకాలంలో నిద్రపోయి, రాత్రివేళ జాగరణం చేయకూడదని ఎరుగుదువు కదా! ఉషఃకాలంలో మేలుకాంచి అవసరకార్యాలు నిర్వర్తిస్తున్నావా? ప్రతిపక్షంవారి గూఢచారులు నీ మంత్రులతో రహస్యసమాలోచనలు సాగించడం లేదుకదా! మిత్రుడైనా శత్రువయినా తటస్థుడయినాసరే ...... ఎవడు ఎప్పుడు ఏ పనిని చేస్తున్నాడో ఒక కంట చూస్తున్నావా! సంధిగ్ధస్థితులు ఏర్పడినపుడు సమర్థులయిన మేధావులతో సంప్రదిస్తున్నావుగా.

విశ్వసనీయుడు, విశుద్ధవర్తనుడు, నిర్వహణదక్షుడు, వినిర్మల మనస్వి, ఉత్తమవంశసంజాతుడు, కుశాగ్రబుద్ధి అయినవానినే మంత్రిపీఠం మీద ఉంచాలని ఎరుగుదువు కదా! అని నారదుడు అవశ్యమయిన రాజనీతిని ఉపదేశిస్తున్నాడు.

విషమసమస్యలు ఎదురయినపుడు ప్రధానులతోనే సంప్రదించాలి కాని, కనిపించిన వారి నందరినీ సలహా అడగకూడదు. ఇక కోశాగారం ఎప్పుడూ సమృద్ధంగా వుండాలి. సేద్యవ్యవహారాలకు అవసరమయిన సామగ్రిని

సకాలంలో అందించాలి. అంతేకాని వారిని ఇతర కార్యకలాపాలకు వినియోగించకూడదు.

> ధర్మదృష్టికల శాస్త్రజ్ఞులే విద్యాబోధకులుగా వుండాలి.
> వెయ్యిమంది మూర్ఖులను ఆదరించి చేరదీయడం ఎంత అవివేకమో
> వివేకముగల ఒక్క విద్వాంసుని దూరం చేసుకోవడం అంత హానికరం.

శస్త్రాస్త్రాలూ, ధనధాన్యాలూ కోటలో ఎప్పుడూ తరగకూడదు. నగరవాసులకు స్వచ్ఛమయిన మంచినీటికి ఇబ్బంది రాకూడదు. శత్రుపక్షంలోని మంత్రి, పురోహిత, సేనాపతి, ద్వారపాలకాదులనూ, అంతఃపుర, కోశాగార, కారాగారాధ్యక్షులనూ, నగరాధికారినీ, శిల్పులనూ, ధర్మసభాధ్యక్షునీ, దుర్గరక్షకునీ, వనపాలునీ, ధనవ్యయాధికారినీ, యువరాజునూ, వారి దండనాథులనూ ఒక కంట కనిపెడుతూండాలి. నీ వర్గంలో కూడా మంత్రి పురోహితులనూ, యువరాజునూ, విడిచి మిగిలిన అందరి వ్యవహారాలనూ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూండాలి.

వ్యక్తుల స్వభావాలు పరిశీలించి, ఉత్తమ, మధ్యమ, అధమవర్గాలకు వారికి తగిన పదవులివ్వాలి. శిష్టాచార మర్యాదలు తెలిసి, వంశపారంపర్యంగా మనసేవలో వున్న మంత్రులను ఉత్తమ కార్య నిర్వహణకే నియోగించాలి సుమా. సమయ, సందర్భాలు తెలియకుండా దండనీతిని అమలు జరిపినా, అవసరమయినపుడు దానిని విడిచినా ప్రమాదమే.

అనాచారిగా వుండే యజమానిని పవిత్రుడయిన యాజకుడు విడిచేస్తాడు. అలానే కామలాలసుడయిన పురుషుని శీలవతి అయిన స్త్రీ విడిచిపెడుతుంది. తన కర్తవ్యాన్ని ప్రజలపై ఉంచే ప్రభువును వారు పదభ్రష్టుని చేస్తారు.

నీ సేనలోనివారు సాహస, పరాక్రమాలు ప్రదర్శించినపుడు వారిని సద్యఃకాలంలో సమ్మానిస్తున్నావా? వారి అర్హతల ననుసరించి పై పదవులకు పంపుతున్నావా? సేనలకు నిత్యజీవితావసర వస్తువులు ఎప్పటికప్పుడు అందకపోతే రాజ్యానికి విపరీత ప్రమాదాలు వస్తాయి సుమా! దేశరక్షణార్థం ప్రాణత్యాగం చేసేవారి కుటుంబాలపోషణ ప్రభువే వహించాలి; లేకపోతే

అనంతరకాలంలో మరెవ్వరూ ప్రాణత్యాగానికి సాహసించరు. విద్యా వివేకాలు కలిగి, కార్యాకార్యపరిజ్ఞానంవున్న మేధావులను ఆదరించి పోషించుకోవాలి.

నీ అంగరక్షకులూ, వారి ప్రోత్సాహకులూ, వ్యవహారాలలో ఉదాసీనంగా వుండే వారూ వీరందరూ మంత్రాంగంలో వుండవచ్చు. శత్రు పక్షంలో లోభీ, అవమానితుడూ, జీతాలూ సరిగా అందనివాడూ, వీరందరినీ చేరదీసి మన కార్యాలు చక్కబెట్టుకోవచ్చు.

రాజ్యాని కెప్పుడూ రెండు రకాల ప్రమాదాలు వస్తాయి. అందులో వరదలూ, తుపానులూ, అగ్నిప్రమాదాలూ, కరువూ వున్నాయే ఇవి దైవంవల్ల వచ్చే ప్రమాదాలు.

రాజ్యంలో మూర్ఖుల సంఖ్య పెరిగి వారు నాయకులు కావడమూ, స్వార్థమూ, లోభమూ పెంపొందడం మరొక ప్రమాదం; ప్రభువే లోభ బుద్ధితో ప్రజాపీడనం చేయడం మరింత ప్రమాదకరం. రాజబంధువులూ, మిత్రులూ, కుట్రలకు పూనుకోవడంకంటె ప్రమాదంలేదు. అయితే ఈ మానుష వ్యసనాలు ప్రభువు అసమర్థుడయినప్పుడే పెరుగుతాయి.

శత్రువర్గంలోని యోధులను ధనధాన్యాలు ఎరజూపి మనవైపు తిప్పుకుంటూండాలి. మనవారెవరయినా అలా అటు తిరిగిపోతున్నారేమో గ్రహించాలి.

అన్నిటికంటె కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను జయించడం ముఖ్యం. సురాపానమూ, జూదమూ, వేట ప్రభువుకి వుండవలసినవికావు.

ఆదాయంలో సగంకంటె ఖర్చు కాకూడదు. మరీ విపత్తులు వస్తే మూడోవంతు మిగుల్చుకోవాలి. ఏనాటి కానాడు గణకులు ఆదాయ వ్యయ వివరాలు తెలుపుతూ ఉండాలి. చోరుడూ, జారుడూ, లోభి ఆలోచనారంగంలో ప్రవేశించకూడదు.

రాజకుమారులూ, అంతఃపుర స్త్రీలూ, సామాన్యప్రజను పీడిస్తూంటారు. వారివల్ల ఆ బాధలు రాకుండా ప్రజలకు రక్షణ కల్పించాలి.

దేహారోగ్యానికి శుచిగా ఉండే మితాహారం ఎలా అవసరమో, అలానే మనోవికాసానికి అనుభవజ్ఞుల మేధావుల సాంగత్యమున్నూ అనుదినమూ – సత్పురుషులయిన శాస్త్రకోవిదులతో గోష్ఠి జరుపుతూండాలి. ప్రభువుకీ, పరిజనానికీకూడ కామినీజనగోష్ఠి నిషిద్ధమే.

దోషిని ఎన్నడూ విడిచిపెట్టకూడదు. వాడిమీద ఏమాత్రం కనికరం చూపినా సామాన్యులలో దోషప్రవృత్తి విపరీతంగా రేగుతుంది. అందుచేత నేరం చేసినవాడికి సకాలంలో శిక్షపడవలసిందే.

దేశ దేశాలనుంచి వ్యాపారంకోసం వచ్చే వర్తకులుంటారే, వారి దగ్గర అధికంగా పన్నులు వసూయిచేసి పీడించే అధికారులుండవచ్చు. అటువంటివారివల్ల మొదటికే మోసం వస్తుందని ఎరుగుదువుగా. ఒక్కొక్క సమయంలో వారు పన్నులు ఎగవేసి తప్పించుకుపోయే అవకాశంకూడా లేకపోలేదు.

ప్రభువుకూ, దేశానికి ఉపకారాలుచేసే వారిని రాజసభకు రావించి ఘనసన్మానాలు జరుపుతున్నావా? అది లేకపోతే సేవాభావం సన్నగిల్లుతుంది. విద్వాంసులు నీరసించి పోతారు. అగ్ని, సర్ప, రోగ బాధలు లేకుండా ప్రజలను కాపాడడం ప్రభుధర్మం సుమీ! రాజ్యంలో అంగవికలులుంటారు. వారందరి పోషణభారమూ నీదే అని గుర్తించావా? అనాథులూ సన్యాసులూ కూడా నీ మీదనే ఆధారపడి ఉంటారు. ఈ విషయాలన్నీ నీకు తెలియనివికావు. అయినా చెప్పడం మా విధి – అని నారదుడు చిరునవ్వుతో ధర్మజునివైపు చూడగా:

మహర్షీ! మీరు చూపిన అభిమానానికి ధన్యులం మహాశిల్పి మయుడు నిర్మించి యిచ్చిన యీ సభాభవనం చూశారుకదా! ఇటువంటి భవనాన్ని మీ రిదివరలో ఎక్కడయినా చూశారా? అని అడిగాడు.

అప్పుడు నారదుడు, చతుర్దశ భువనాలలోని విశిష్టసభాభవనాలనూ అభివర్ణించి, వాటి వాటి ప్రత్యేకశిల్పరీతులనూ అక్కడ ఆసీనులయే ప్రముఖులను గురించీ చెప్పి:

అన్ని సభాభవనాలలోనూ సత్యలోకంలోని బ్రహ్మగారి భవనం అపూర్వ మయినది; దానివలెనే ఈ మానవజగత్తులో మీ సభాభవనం అద్వితీయ మయినది. ఇటీవల నేను దేవలోకానికి వెళ్ళినపుడు పాండురాజు: నా కుమారులు రాజసూయయాగం చేసి విఖ్యాతులు కావాలనీ కోరుతున్నాను అన్నాడు. అందుచేత రాజసూయయాగం చేయడం మీ విధి — అని బోధించి, అందరి సత్కారాలూ అందుకుని నిష్క్రమించాడు.

ధర్మరాజు తన సోదరులనూ, మంత్రులనూ, సభాభవనం చూడ వచ్చిన విరాట్ద్రుపదులనూ సమావేశపరిచి రాజసూయయాగ నిర్వహణలో వాసుదేవుని సహాయం మన కవసరం కదా అన్నాడు. అందరూ ఆయన అభిప్రాయానికి ఆమోదం తెలిపారు. దూతను పంపారు. వాసుదేవుడు వచ్చాడు. యథోచిత మర్యాదలు జరిపి కుశలాదికం అడిగి తన అభిప్రాయం తెలిపాడు — ధర్మరాజు.

నవ్వురాజిల్లెడి మోమువాడపుడు:

ధర్మనందనా! నీ సంకల్పం చాలా మంచిది. ఈ రాజసూయంలో అందరూ ఒక ఎత్తు, జరాసంధుడు ఒక్కడూ ఒక ఎత్తు. వాడు కంసుని మామ. నేను కంసుని సంహరించిన కారణంగా నా మీద కత్తి గట్టాడు. ఆ యోధుని సంహరించగలవాడు భీముడు. మిగిలిన ప్రాంతాలకు నకులసహదేవులు వెళ్ళి దిగ్విజయం సాధించి వస్తారు.

ఇక ఈనాడు రాజులందరూ సమయం చూచుకొని యితరరాజ్యాలను ఆక్రమిస్తున్నారేకాని సామ్రాజ్యసంస్థాపనం వారి దృష్టికి రావడంలేదు. వచ్చినా వారికి శక్తిలేదు. సర్వశత్రుసంహారంచేసి మాంధాత, ప్రజా పాలనలో దక్షుడై భగీరథుడూ, తపఃప్రభావంతో కార్తవీర్యార్జునుడూ, భుజబలంతో భరతుడూ, సాధన సంపత్తిని సమకూర్చుకొని మరుత్తు, సమ్రాట్టులుగా విఖ్యాతు లయ్యారు.

ఈ గుణాలన్నీవున్న నువ్వు సామ్రాజ్యస్థాపనకు అర్హుడివి. కనక అత్యా చారాలు సాగించే జరాసంధుని అడ్డుతొలగించి సామ్రాజ్య సంస్థాపనభారం

వహించు, అనగా ధర్మ నందనుడు — జరాసంధుని పుట్టుపూర్వోత్తరాలు ఏవిటని అడిగాడు.

మగధనుపాలించే మహావీరుడు బృహద్రథుడు. నిరంతర యజ్ఞయాగ నిర్వహణతో ఆయున దేవేంద్రునివలె వెలిగేవాడు. ఆయునకు కాశీరాజ కన్యలిద్దరు భార్యలు. భార్యాసహితుడై ఈ రాజు చండకౌశికుని దర్శించి తనకు సంతానంలేని లోటు తప్ప మరేమీలేదన్నాడు. అప్పుడాయన ఇచ్చిన ఫలాన్ని వాని భార్యలు ఇద్దరూ ఆరగించారు. పర్యవసానంగా వారు రెండుఖండాలుగా ఒక ప్రాణిని కన్నారు. రాజుకి భయపడి ఆ ముక్కలు అవతల పారేయించారు.

అప్పుడక్కడ తిరుగుతున్న జర అనే రాక్షసి ఆ రెండు ముక్కలూ కలపగా వీడు పుట్టాడు. బృహద్రథుని ధర్మదృష్టి పెరిగిన ఆ రాక్షసి ఆ బిడ్డను తెచ్చి వాని కర్పించింది. క్రమంగా వాడు పెరిగి పెద్దవాడయాక, రాజ్యాభిషిక్తునిచేసి ఆ రాజు వానప్రస్థం స్వీకరించాడు. ఈ జరాసంధుడికి అంతటి వీరయోధులు హంస డిభకులనే యిద్దరు మంత్రు లున్నారు.

ఒకానొక యుద్ధంలో హంసుడనే పేరుగల రాజు మరణించాడు ఆ వార్త విని వాడు తన మిత్రుడే అనుకొని డిభకుడు ప్రాణత్యాగం చేశాడు. డిభకుని మరణవార్త హంసుని నిశ్చేష్టుని చేసింది. అలా వారు యముపురికి వెళ్ళారు. భీముని భుజబలంతో నా ధీశక్తితో అర్జునుని కౌశలంతో జరాసంధుని కడతేర్చగలము — అన్నాడు.

ధర్మరాజు పరమానందంతో వారికి అనుమతిని యిచ్చాడు. మగధకు బయలుదేరారు వాసుదేవ భీమార్జునులు.

## జరాసంధవధ

మగధరాజధానిలో అడుగుపెట్టిన కృష్ణార్జున భీములు ఆ నగరంలోని ఉద్యానవన, సరోవర, సౌధ, పర్వతశోభను తిలకిస్తూ సంతోష తరంగితహృద యులై సింహద్వారం గుండా ప్రవేశించక చైత్య పర్వతంవైపు సాగుతూండగా వాసుదేవుడు:

భీమసేనా! మగధేశుడు బృహద్రథుడు ఒకప్పుడు వృషభుడనే రాక్షసుని సంహరించి వాని చర్మంతో మూడుభేరీలు నిర్మించాడు. శత్రు వెవడయినా నగరంలో కాలుమోపితే ఆ భేరీలు వాటంతట అవే భయాన కంగా మ్రోగుతాయి. దానితో పూలవానకూడా పడుతుంది. అంటూనే ఆ భేరీలను బద్దలుకొట్టించాడు. వారు విప్రవేషాలతో పూలమాలలు ధరించి, జరాసంధుని యజ్ఞశాలను సమీపించారు.

జరాసంధుడు అతిథిపూజ చేసి అభివాదాలర్పించగా — మహారాజా! వీరిద్దరూ నేటి అర్థరాత్రివరకూ మౌనవ్రతంలో వుంటారు. అప్పుడుకాని నీతో మాట్లాడరు, అన్నాడు కృష్ణుడు. అర్థరాత్రి జరాసంధుడు వారిని సమీపించి: ఆర్యా! స్నాతకవ్రతదీక్షలో వున్న మీరు పూలమాలలు ధరిం చటం, మంచిగంధం పూసుకోవడం ఆశ్చర్యంగా వున్నాయి. ఇదేకాక మీ భుజాలు చూస్తుంటే ధనుర్బాణాలు ధరించే చిహ్నాలున్నాయి. మీ రెవరో సత్యం చెప్పండి — అన్నాడు.

మహారాజా! స్నాతకవ్రతం క్షత్రియులకు నిషిద్ధంకాదు. ఇక పూలమాల లంటావా విజయలక్ష్మిని వరించ వచ్చినవారికి అవీ అవసరమే. మిత్ర గృహానికి సింహద్వారాన, శత్రుసదనానికి పాణిద్వారాన వెళ్ళాలని ధర్మశాస్త్రం చెపుతున్నమాటే అని కృష్ణుడనగా —

ఆర్యా! నే నెప్పుడూ మిమ్మల్ని చూడలేదు. మీకు అపకారమూ చేయలేదు. పోగా ధర్మవిరుద్ధంగా ఎన్నడూ నడవలేదు. ఇక మీతో నాకు శత్రుత్వం ఎలా వచ్చింది? అని జరాసంధుడు ప్రశ్నించగా —

జరాసంధా! ధర్మవిదులయిన మహా పురుషులు ధర్మసంరక్షణ భారం కూడా వహించాలి. ఈ భూమండలంలోని రాజులందరినీ నిష్కారణంగా బంధించావు. రుద్రదేవతా ప్రీత్యర్థం వారందరినీ బలి ఇవ్వడానికి సిద్ధ పడుతూ ధర్మవిరుద్ధంగా నడవలేదని అనడం చాలా విపరీతంగా వుంది. కల్యాణస్వరూపుడయిన పరమశివునికి నరబలి ఇవ్వాలనే దుర్బుద్ధి ఎందుకు పుట్టింది నీకు?

ఉత్తమధర్మనిష్ఠకల క్షత్రియ వీరరక్షణార్థం మేము నిన్ను సంహరించ డానికి వచ్చాం. మాకూ చతురంగబల సంపద వున్నది. కాని నీ ఒక్కడికోసం యీ మగధలోని సామాన్యప్రజను హింసించడం, నీ సేనను నిష్కారణంగా హతమార్చడం మా అభిమతం కాదు. అందుచేత మా ముగ్గురిలో ఎవరితోనో ఒకరితో ద్వంద్వయుద్ధానికి సిద్ధపడు; లేదా నువ్వు బంధించిన రాజులందరినీ విడిచిపెట్టు — అనగా జరాసంధుడు: నేను వ్రతపాలనకోసం వారిని బంధించాను. మీ బెదిరింపులతో వారిని విడిచేది లేదు. మీ ఇద్దరిమధ్యవున్న ఆ మహాబలిష్ఠునితో మల్లయుద్ధం నాకూ తృప్తిగా వుంటుంది — అన్నాడు భీముని చూపుతూ.

భీమసేన జరాసంధులుభయులూ యుద్ధసంప్రదాయానుసారం పర స్పరం అభివాదాలు చేసుకుని చేతులు కలిపారు.

మత్తేభశుండాల సదృశ భుజదండాలుకల వారు బాహుపాశ, చరణపాశ, పూర్ణకుంభ ప్రయోగాలతో సాగించే పోరు ప్రేక్షకులకు అత్యంతానందం కలిగిస్తున్నది. ఒకరి నొకరు ముష్టిఘాతాలతో వేధిస్తుంటే పిడుగులు పడుతున్నట్టు పర్వతాలు బద్దలవుతున్నట్టు వున్నది.

వారు సింహగర్జనలు చేస్తూంటే దిశాంతాలు అదురుతున్నాయి. చూడవచ్చిన వారిలో గుండెనిబ్బరంలేనివారు వారి పిడికిటిపోట్ల ధ్వనులకే గజగజలాడి వెనక్కి వాలుతున్నారు. ప్రకర్షణ, ఆకర్షణ, వికర్షణ, అనుకర్షణాది భేదాలతో ఒకరి నొకరు నిర్విరామంగా హింసించుకుంటున్నారు.

కార్తీక శుద్ధపాడ్యమినాడు ఆరంభమయిన యుద్ధం త్రయోదశివరకూ సాగింది. ఆ పూట జరాసంధుడు కొంత అలసివుండగా భీమసేనుడు వానిని రెండు చేతులతో ఆకాశాని కెత్తిపట్టిన క్షణంలో, భీమసేనా; శత్రువు అలసివున్నాడు. ఎందు కంతశ్రమపడతావు. అంటూ కృష్ణుడు గడ్డిపరకను రెండుగా చీల్చి వ్యత్యస్తంగా పడేశాడు. అది సంకేతంగా భీమసేనుడు జరాసంధుని క్రిందికి పడవేస్తూనే వాని కాలు తన కాలితో నొక్కి పట్టి, రెండవకాలు చీల్చి, రెండు ముక్కలయిన దేహాన్ని అటూ ఇటూ పారేశాడు.

బాధతో జరాసంధుడూ, సంతోషంలో భీమసేనుడూ చేసిన సింహనాదాలకు గిరివ్రజం దద్దరిల్లింది. గర్భవతులకు గర్భస్రావాలే అయాయి.

జరాసంధుని వధించగానే, అతని కుమారుడు సహదేవుడు వచ్చి శరణువేడగా వానికి అభయమిచ్చి తిరిగివచ్చారు.

జరాసంధవధతో పాండవుల కీర్తి నానా దేశాలకూ వ్యాపించింది. భీమార్జున నకులసహదేవులు నాలుగుదిక్కులకూ విజయయాత్రకు బయలు దేరి నాలుగుదిక్కులలోవున్న రాజులనూ జయించి కానుకలు తెచ్చారు. దిగ్విజయయాత్ర పూర్తికాగానే ధర్మరాజు యాగసన్నాహా లారంభించి మిత్ర, సామంత జనానికి ఆహ్వానాలు పంపాడు.

మణి, రత్నాలు కానుకలుగా తెచ్చిన కృష్ణునికి ఎదురేగి పూజించి సుఖాసనం మీద కూర్చుండబెట్టి ధర్మరాజు: దేవకీనందనా! నీ అనుగ్రహ విశేషంవల్ల ఈ విజయం సాధించాం. ఈ సంపదలన్నీ దానధర్మాలకు వినియోగించాలని ఉంది. నువ్వు అనుమతిస్తే యాగదీక్ష వహిస్తానన్నాడు.

చిరునవ్వుతో అంగీకారం తెలిపాడు దేవకీనందనుడు. ధర్మరాజు యాగావసర వస్తుసామగ్రి సమకూర్చేభారం సహదేవునిమీద వుంచాడు.

వ్యాసమహర్షి వేదవిదులతో విజయం చేశాడు.

ఆయనకే బ్రహ్మపీఠం యిచ్చారు. సునాముడు సామగానానికి నియోజితుడయాడు (ఔద్గాత) పైలుడూ, ధౌమ్యులవారూ హోతలుగా, యాజ్ఞవల్క్యుడు అధ్వర్యుడుగా, వీరి శిష్యులు సప్తహూతలుగా నిలిచారు.

వేదవిదులు స్వస్తిపలికారు. యాగశాల సత్కథాగోష్ఠులతో, నృత్య గానాలతో ధర్మమీమాంసలతో నిండివుంది. ఎవరికి ఏ ఏ అవసరాలువచ్చినా ఉత్తరక్షణంలో వాటిని నెరవేర్చడానికి పరిచారకులు అప్రమత్తంగా వున్నారు.

విశ్రాంతి మందిరాలన్నీ చంద్రకాంతశిలా వేదులతో, పన్నీటివాసనలతో అగరు ధూమాదులతో ఆహ్లాదం కలిగిస్తున్నాయి.

భీష్మ ద్రోణు లుభయులూ ధర్మజునికి వచ్చిన కానుకల రక్షణలో వున్నారు. కృపాచార్యుడు వేదవిదుల సత్కారాలనూ, దుశ్శాసనుడు

అతిథుల భోజన సౌకర్యాలనూ, అశ్వత్థామ విద్వజ్జనుల స్వాగత పరిచర్య లనూ పర్యవేక్షిస్తున్నారు. కురువంశ వృద్ధులయిన బాహ్లిక, సోమదత్త, ధృతరాష్ట్రులను సుఖాసనాలమీద ఆసీనులను చేశాడు నకులుడు.

వచ్చిన కానుకలను అందుకోవడానికి దుర్యోధనుడు నిలిచాడు. మహా మంత్రి విదురుడు అవసరానుసారం వ్యయశాఖకు ధనం అందిస్తున్నాడు. విద్వాంసులయిన విజ్ఞుల పాదప్రక్షాళనం వాసుదేవుడు స్వయంగా నిర్వహి స్తున్నాడు.

నిరతాన్నదానంతో నిర్విరామ సత్కాలక్షేపంతో నిరంతర వేదఘోషతో సత్యలోకాన్ని స్ఫురింపజేస్తున్నది యాగశాల. ప్రాయశ్చిత్త రహితంగా యజ్ఞం పూర్తిచేసిన అనంతరం సముచితంగా సత్కారాలు జరపవలసిన ముహూర్తం రాగానే భీష్మ పితామహుడు లేచి, నాయనా! ఈ మహాసభలో ముందుగా పూజింపదగినవాడు వసుదేవనందనుడు కృష్ణుడు — అనగా ధర్మరాజు వాసుదేవుని అర్చించాడు.

## శిశుపాలవధ

భీష్మపితామహుని నోట మాట వింటూనే శిశుపాలుడు లేచి —

అవనీనాథు లనేకు లుండగ విశిష్టారాధ్యులు ఆర్యుల్, మహీదివిజుల్ పూజ్యులు పల్వురుండగ, ధర్మనందనా! ఈ గాంగేయు దుర్వ్యవసాయం బున హీనచరితుడయిన దాశార్హుని కృష్ణుని పూజార్హునిగా భావిస్తున్నావా! వార్ధక్యంతో బుద్ధి చలించిన యీ భీష్ముని మాటలు లక్ష్యపెట్ట నవసరం లేదు. కృష్ణుడు వయోవృద్ధుడని పూజిస్తున్నావా? వసుదేవుడున్నాడు. కాదు ఋత్విజ శ్రేష్ఠు డంటావా? కృష్ణద్వైపాయను డున్నాడు. కాక గురుస్థానీయుడుగా భావిస్తే అటు కృప ద్రోణాది ఆచార్యులున్నారు.

రాజపురుషులలో ఉత్తముడు మహాయజ్ఞం తలపెట్టాడని మే మంద రమూ వచ్చాం. ఇప్పుడు నువ్వు చెయ్యబోయేపని మా కందరికీ అవమానకరం. నపుంసకుడికి నవయౌవనాంగిని భార్యగా యివ్వడం, చెవిటివాడికి మధుర గీతం వినిపించడం, పుట్టుగుడ్డికి అత్యంత సుందర వస్తువు చూపబోవడం

కంటె నువ్వు చెయ్యబోయేది చాలా తెలివితక్కువపని, అంటూండగా ధర్మరాజు చిరునవ్వుతో శిశుపాలుని సమీపించి:

ధీరుడవు, గుణసంపన్నుడవు అయిన రాజవల్లభుడవుకదా! నీకు ఈ వాక్పారుష్యం ఎలా వచ్చింది? సర్వలోకోత్తరుడనీ, గురుపూజ్యుడనీ ఎందరో అభినందించారే ఈ వాసుదేవుని ..... అంటూండగా భీష్ముడు —

ధర్మనందనా! రాజ్యలక్ష్మి లలనాంధబుద్ధియై అకారణ వాదాలకు దిగే ఆ బాలుడితో ఎందుకు వాదిస్తావు — అని, శిశుపాలా: జ్ఞానవృద్ధుడయితే బాలుడయినా విప్రుడు పూజ్యుడే. నరపాలగణంలో విక్రమ సాహసాలుగల క్షత్రియుడు పూజ్యుడు. ఇది ధర్మశాస్త్ర వచనం. గుణ వృద్ధులలో శ్రేష్ఠుడు కనుకనే వాసుదేవుని పూజిస్తున్నాం అన్నాడు.

అంతలో సహదేవుడు లేచి: ఈ సమయంలో మేం వాసుదేవునికే ప్రథమపూజ జరిపాం. మా పనిని కాదనే వారి తలమీద పెట్టడానికి యిదిగో నా వామపాదం, అంటూ కోపంతో కాలు పైకెత్తడంతో శిశుపాలుడు తన పక్షానచేరే రాజులను కూడగట్టి యుద్ధసన్నద్ధు డవడంతో, ఎదురుగావున్న, భోజ, యదు, వృష్ణి, కుకురాంధక సేనలుకూడా యుద్ధసన్నాహంతో లేచాయి.

అది చూసి ధర్మరాజు యజ్ఞానికి విఘ్నం కలుగుతుందేమో అని భయపడుతుండగా భీష్ముడు: నాయనా! సింహ పరాక్రముడయిన వాసుదేవుడే ఆ విషయం చూసుకుంటాడు, అంటూంటే శిశుపాలుడు:

ఓ భీష్మా! నీ ముసలితనానికి తోడు, నీకు మతికూడా తప్పింది. గోవులనూ, స్త్రీలనూ చంపకూడదని ధర్మవిదులు ఘోషిస్తున్నారు కదా! అయినా ఈ కృష్ణుడు పూతనను, ధేనుకాసురుని హతమార్చిన పాపికదా. వాడికి పూజార్హత కట్టబెట్టమని చెప్పే నువ్వు అనవత్యదోష దూషితుడివి.

సంతానహీనుడికంటె అధర్మపరుడు లేడే! నువ్వా యిక్కడ పెద్దవు, అని దుర్భాషలు సాగిస్తూండగా, వాసుదేవుడు దనుజాంతకచక్రం విడిచాడు. ఉత్తరక్షణంలో శిశుపాలుని శిరసు తెగి నేలమీద పడింది. అనంతరం శిశుపాల సుతులచేత దహన సంస్కారం చేయించారు.

యాగం నిర్విఘ్నంగా పరిసమాప్తమయింది. వచ్చినవారందరూ ధర్మ జుని అభినందించి సెలవు తీసుకున్నారు.

శకుని దుర్యోధనులు మాత్రం మయసభావలోకన కుతూహలంతో వుండిపోయారు.

దుర్యోధనుడు ఒంటరిగా, ఆ సభాభవనాన్ని చూడడానికి బయలుదేరి, స్ఫటిక మణిమయ శిలానిర్మిత స్థలాన్ని సరోవరంగా భ్రమించి, పంచె పయికెత్తుకుని నడిచి, అంతలో కాలుజారి సిగ్గుతో దుఃఖంతో నిట్టూరుస్తూ సాగుతున్నాడు. సోపానాలున్న దిగుడుబావి సమతల ప్రాంతంగా కనిపించింది: అందులో జారిపడ్డాడు. అది చూసిన భీమసేనుడికి నవ్వు ఆగలేదు. పక్కనేవున్న అర్జున, నకుల, సహదేవులు కూడా ఫక్కున నవ్వారు. భీమసేనుడు పరివారకునిద్వారా కొత్తబట్టలు పంపాడు.

నెమ్మదిగా మెట్లెక్కి మేడమీదికి చేరాడు. అక్కడ స్ఫటిక శిలానిర్మితమయిన ద్వారం మూసివుంది. అది తెలియక తలుపులు తెరిచివున్నాయనే భ్రమతో ముందడుగు వేశాడు. తల గడపకు కొట్టుకుంది. తలుపులు తెరిచివున్న గడపజేరి, చూసి సంభ్రమతో దానినితోయబోయి ముందుకు పడ్డాడు. చూస్తూ నిలబడ్డ పాండవులకు అది మరొక వేడుక అయింది. ఇక అవమానాలు భరించలేక వెనుదిరిగి వచ్చినదారినే వెళ్ళిపోయాడు.

మరునాడే శకునితో కలిసి హస్తినాపురం చేరాడు. రథం సాగుతుండగా శకుని, నాయనా! సుయోధనా! ఏమిటి నీ ముఖం దీనంగా వుంది? నీలో ఉత్సాహం కనిపించడం లేదు — అని వెన్నుతట్టాడు.

మామా! వారు సోదరులు నలుగురూ దిగ్విజయయాత్ర చేసివచ్చి ధర్మరాజుచేత రాజసూయం చేయించి నానా దేశాధీశుల కానుకలూ అందుకున్నారు. దానికితోడు వారి సభాభవనం నన్ను ఎన్ని అవమానాలపాలు చేసింది! అన్నాడు.

నాయనా! దాని కింత బాధపడుతున్నావా? ధర్మరాజుకి జూదమంటే మహాప్రీతి. నువ్వు మన మహారాజుతో మాట్లాడి ఎలా అయినా వారిని

జూదానికి కూర్చోబెడితే ఆ సంపదలన్నీ అవలీలగా నీ పరం చేస్తాను — అని వెన్ను తట్టాడు.

మామా! మహారాజుని ఒప్పించే భారంకూడా నీదే అన్నాడు — దుర్యోధనుడు.

శకుని ధృతరాష్ట్రుని సమీపించి : మహారాజా! నానాటికి దుర్యోధనుని ఆరోగ్యం క్షీణిస్తున్నది. తేజస్సు తగ్గుతున్నది కారణం విచారించారా అనగా కొడుకును పిలిపించి, నాయనా! ఏమిటీ విపరీతం — అన్నాడు.

మహారాజా! పాండవులు ఈ నాడు ఇంద్రసములై వెలుగుతున్నారు. సామాన్య ప్రజలు పన్నులు కట్టినట్టు వివిధ దేశాల రాజులూ వారికి మణి, ధనరత్నరాసులతో గుర్రాలనూ, ఏనుగులనూ అర్పించి వారి అనుగ్రహంకోసం మడిచేతులు కట్టుకు నిలబడ్డారు. వారి సభాభవనం చతుర్దశ భువనాలకూ తలమానికం — అని నారదుడు చెప్పి వెళ్ళాడు ఇంతకంటె నా వంటి అభిమానధనుడికి బాధ కలిగించే దేముంది?

ఆ యాగం జరిగినంతకాలం అక్కడ అన్నదానం జరిగింది. లక్షమంది సజ్జనులు తృప్తిగా భోజనంచేసిన క్షణంలో మ్రోగేటట్లు ఒక ఘంట ఏర్పాటు చేశారు. ఆ ఘంట మ్రోత ఆగినజాడలేదు. నిరంతరాయంగా ఘంటానాదం సాగుతుంటే నా గుండె దిగులుతో నీరసించిపోయింది. అభిమానవంతుడికి పరుల పెంపుకంటె అవమానం లేదుకదా ప్రభూ, అంటూండగా శకుని:

మహారాజా! మీరు అనుమతిస్తే నేను వారి సంపదలన్నీ క్షణంలో మీకు దత్తం వెయ్యగలను. ధర్మరాజును ద్యూతానికి ఆహ్వానించండి అన్నాడు. ధృతరాష్ట్రుడు, వికలచిత్తుడై విదురునితో ఆలోచించి చెపుతా నన్నాడు.

మహారాజా! నా అభిమతాన్ని మీరు నెరవేర్చలేకపోతే నేను ఆత్మహత్య చేసుకుతీరతా నన్నాడు — దుర్యోధనుడు!

నాయనా! అంత అకార్యం చెయ్యకు. తక్షణం మహాశిల్పులను రప్పించి సహస్ర స్తంభాలతో, నూరు ద్వారాలతో రత్నఖచిత కుడ్యాలపై సుందర

కళారూపాలు చిత్రింపజేసి మనోహర సభాభవన నిర్మాణం ఆరంభించి దాని ప్రవేశ సమయవేళ ఈ జూదం విషయం నాకు గుర్తుచెయ్యి — అని వారిని పంపి, విదురుని కబురంపి ధర్మరాజును ద్యూతక్రీడకు ఆహ్వానించమన్నాడు.

విదురుడు జూదంవల్ల వచ్చే ప్రమాదాలను వివరించగా.

మహామంత్రీ! ఈ అన్నదమ్ముల మధ్య విద్వేషాలు పెరగకూడదనీ వా రుభయులూ సంతోషంగా పెరగాలనీ నేను వాంఛిస్తున్నాను. భీష్మ ద్రోణులూ, నువ్వూ వుండగా వారిమధ్య విద్వేషాలు పెరగవు. ద్వేషానికి తావులేని సుహృద్ద్యూతం ఏర్పాటుచేయిద్దాం. ఇక నువ్వు ఎదురుచెప్పక వారిని మన సభాభవనం చూడడానికి రమ్మని వార్త పంపు అనగా చేసేదిలేక విదురుడు గాంగేయ భవనానికి వెళ్ళాడు.

ధృతరాష్ట్రుడు దుర్యోధనుని పిలిపించి, నాయనా? విద్వాంసు డయిన విదురుడు జూదంవల్ల అన్నీ అనర్థాలే వస్తాయంటున్నాడు. కనక ఆ యత్నం విరమించండి అని పరిపరివిధాల మందలించినా పెడచెవిని పెట్టాడు దుర్యోధనుడు.

మహారాజా! అనుభవం లేని శాస్త్రజ్ఞాని విదురుడు: అటువంటివాని కీ వ్యవహారాలు అర్థంకావు.

యస్యనాస్తి స్వయం ప్రజ్ఞా కేవలం తు బహుశ్రుతః,
న స జానాతి శాస్త్రార్థం దర్వీసూపరసావివ.

అని మీరు ఎరుగుదురు. ద్యూతక్రీడ రాజులకు చిరకాలంగా వున్న వినోదమే. జూదం కారణంగా జరిగిన యుద్ధాలేం లేవు. అందుచేత మీరు పాండవులకు కబురుపెట్టండి! భవన నిర్మాణం పూర్తి కావస్తున్నది — అన్నాడు.

పాండవులను తీసుకురమ్మని ధృతరాష్ట్రుడు విదురుని పంపాడు.

విదురుని రాకను విన్న ధర్మరాజు, వినయంతో ఎదురు వెళ్ళి ఉచితమర్యాదలు జరిపి:

మహామంత్రీ: ఎప్పుడూ ప్రసన్నంగా ఉండే నీ ముఖంలో విచారం కనిపిస్తున్నది. కారణం — అనగా,

ధర్మనందనా! కౌరవ జ్యేష్ఠుడు తన తండ్రిని బలవంతాన నొప్పించి మిమ్మల్ని ద్యూతక్రీడకు ఆహ్వానించమంటే వచ్చాను — అనగా,

ధర్మరాజు — మహామంత్రీ! జూదం సర్వనాశన హేతువని తెలియని వాడివా నువ్వు. అయినా ఎందు కంగీకరించావు — అన్నాడు.

విదురుడు జరిగిన విషయాలన్నీ చెప్పాడు. ధర్మరాజు ధృతరాష్ట్రుని ఆజ్ఞను తిరస్కరింపలేక తమ్ములతో, ఆప్తులతో హస్తినాపురానికి బయలు దేరాడు.

## ద్యూతక్రీడ

హస్తినాపురి సరిహద్దులలో శిబిరాలు వేసి విడిదిచేసి తమరాకను ధృతరాష్ట్రునికి తెలియజేసి ఆయన అనుమతితో నగరం ప్రవేశించారు, పాండవులు. భీష్మ, ద్రోణ, కృపాచార్యాది కుల, గురువృద్ధులందరికీ అభివాదాలు చేసి కర్ణ, దుర్యోధన, శకుని, సోమదత్త, అశ్వత్థామాదులను కుశల ప్రశ్నలతో సత్కరించి తారాగణ మధ్యంలో చంద్రునివలె కోడండ్రతో వున్న గాంధారికి నమస్కరించి ఆశీర్వాదాలు పొంది ధృతరాష్ట్రుని చేరి పాదాభివందనం చేశారు. ఆయన వారందరినీ దగ్గరగా తీసుకుని శిరస్సులు ముద్దాడాడు.

అనంతరం ఆయన ఆజ్ఞమీద సభాభవన దర్శనానికి వెళ్ళారు. అక్కడ దుర్యోధన సోదరి దుశ్శల, దుర్యోధనుని పత్ని భానుమతి యితర నారీజనం ద్రౌపదికి స్వాగత మిచ్చారు. అందరినీ ద్రౌపది సౌందర్యం ఆకర్షించింది. వారిలో అది అసూయ రేపింది.

ఆ రోజు గడిచింది.

మరునాడు ఆ నూతన సభాభవనానికి పాండవులు రాగానే శకుని పాచికలు ఆడిస్తూ; పాండవాగ్రజా! నీ కత్యంత ప్రీతికరమైన ద్యూతక్రీడ కొంతసేపు సాగిద్దాం — అన్నాడు.

శకునీ! ద్యూతం వినోదానికి బాగానే ఉంటుంది. కానీ అది పాప, కలహహేతువనీ దానికో నీతిలేదనీ, కపటచిత్తులే అందులో పాల్గొంటారనీ పెద్దలంటున్నారు, అన్నాడు ధర్మరాజు.

అప్పుడు శకుని: ధర్మనందనా! ఎవడు తన ఊహ ననుసరించి పాచికలు నడపగలడో వాడికి ఈ భయాలు అనవసరం. ఈ విద్యలో నువ్వు అసమానుడివి. ద్యూత క్రీడామర్మాలు తెలిసిన నువ్వు భయపడుతున్నావంటే ఆశ్చర్యంగా వుంది. జయాపజయాలు దైవాధీనాలు అని మేము దానికి సిద్ధపడుతూంటే విజయమర్మం తెలిసిన నువ్వు వెనుకంజ తెలిసివేస్తావా — అన్నాడు శకుని.

ఎలా అయినా ఆట జరగకుండా చూడాలని ధర్మరాజు ప్రయత్నించాడు. కాని శకుని కవ్వించి కవ్వించి రంగంలోకి దింపాడు.

శకునీ! యుద్ధానికీ ద్యూతక్రీడకూ ఆహ్వానం వస్తే తిరస్కరించటం రాజధర్మం కాదు. సరే ఇప్పుడెవరితో ఆడాలి — అని ధర్మరాజనగా: దుర్యోధనుడు: నా పక్షాన మా శకునిమామ ఆడబోతున్నాడు — అన్నాడు.

ఆ వినోదం తిలకించడానికి కురుసభా భవనం నిండింది ప్రముఖులతో.

ఆట ప్రారంభ మయింది.

ధర్మరాజు ఒడ్డుతున్నాడు, ఓడుతున్నాడు. ఓడినకొద్దీ పందెం పెంచు తున్నాడు. సర్వసంపదలూ ఓడి తమ్ములను ఒడ్డి ఓడిపోయాడు. ఇంక మిగిలిందిలేదు. శకుని పాచికలు గలగల లాడిస్తూ నవ్వుతున్నాడు. విదురుడు పదేపదే జూదాన్ని నిరోధించమని ధృతరాష్ట్రునికి చెపుతూనే వున్నాడు. వినీ విననట్లు ఆయన ఊరుకున్నాడు.

మహారాజా! పూర్వం ఒక వనంలో కొన్ని పక్షులు బంగారాన్ని వమనంచేసేవి. దాన్ని తీసుకుపోయి అమ్ముకు జీవించే ఒక వేటగాడు ఆ పక్షులన్నిటినీ ఒక్కసారి పట్టుకు చంపితే తనకు కావలసినంత బంగారం వస్తుందనుకొని చంపేశాడు. వాడికి లభించే ఫలితం ఎటువంటిదో యిప్పుడు

నీ కొడుకులు పాండవుల సిరిసంపదలు హరించడంలో పొందే ఫలమూ అంతటిదే అని విదురుడన్నా వినలేదు ధృతరాష్ట్రుడు.

మహారాజా! భోజభూపతి కుమారుడు కంసుడు తండ్రిని ఎదిరించి అత్యాచారాలు సాగిస్తూంటే, ప్రజలందరికీ కంటకుడుగా తయారవుతూంటే చూసి వాడిని ప్రజాభిమతానుసారం సంహరింపచేశాడు కృష్ణుడు. అలానే వంశక్షయానికి హేతువుగా తయారవుతూన్న నీ పెద్దకొడుకుని నిర్బంధంలో వుంచడానికి అనుజ్ఞ యిస్తే భవిష్యత్తులో ఏ ప్రమాదమూరాదు. నీ వంశమూ, ప్రజలూ సుఖసంతోషాలతో వుంటారు. పాండవులు నెమళ్ళు; నీ కొడుకు కాకి, వారు శార్దూలాలు; నీ కొడుకు నక్క. అందువల్ల నీ కొడుకును విడిచిపెట్టు.

వంశంకోసం వ్యక్తినీ, దేశంకోసం గ్రామాన్ని, గ్రామంకోసం దుష్టవర్గాన్నీ ఆత్మరక్షణకు భూమండలాన్నీ విసర్జించాలని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అని హితవు చెప్పినా వినలేదు కురుభూపాలుడు.

ఆయనతో చెప్పి లాభంలేదని,

సుయోధనా! నీకు కావలసిన సంపదలన్నీ యిప్పటికే జూదంలో సంపాదించావు. ఇంకా ముందుకు సాగి అకార్యాలకు సాహసించకు. కపటద్యూత కుశలుడయిన శకునిని వారించి యింతటితో ఈ జూదం ఆపి, ధర్మస్వరూపులయిన పాండవులతో స్నేహంగా వుండు. శకునిని పంపించెయ్యి — అని విదురుడు చెబుతూ ఉండగానే దుర్యోధనుడు: ఆదినుంచీ నువ్వు మా శత్రువులను కీర్తిస్తూ, మమ్మల్ని అవమానిస్తూనే ఉన్నావు. నీ పాండవ పక్షపాతానికి హద్దులేకుండావుంది. నువ్వు ఎంత గొప్పవాడవయినా నీ సలహా మా కవసరంలేదు. ఎవరు ప్రోత్సహించినా ఎంతటి మూర్ఖుడూ పర్వతాన్ని తలతో గుద్ది బద్దలు కొట్టడానికి ప్రయత్నించడు. పాముకి పాలు పోసి పెంచడు.

కులటమైన స్త్రీని ఎంత ఆదరించి, ఆభరణాలతో అలంకరించినా అది ఒకడికి కట్టుబడివుండదు. అలా వుంది నీ వ్యవహారం. స్వపక్షీయులను

అవమానిస్తూ, శత్రువర్గాన్ని ఆకాశాని కెత్తే నీకిక్కడ స్థానంలేదు. నువ్వు నీ యిష్టం వచ్చిన చోటికి పోవచ్చు — అన్నాడు.

సుయోధనా! మనస్సుకు ఉల్లాసం కలిగించే సల్లాపాలు పలికేవారు కోకొల్లలు. అప్రియమయినా హితబోధ చెయ్యగల మంచి స్నేహితుడు దొరకడం దుర్లభం. కటువుగా వున్నా శ్రేయోదాయకమయిన హితవును వినగలవాడే ఉత్తమస్థితి పొందుతాడు.

కురువంశ శ్రేయస్సుకంటె మరేకోరికాలేని నామాటలు నీకు రుచించ కపోతే నీకో నమస్కారం; వేదవిదుల ఆశీర్వాదం, అనుగ్రహం ఉంటే చాలు నాకు. అఖరిసారిగా చెపుతున్నాను. పాండవులు ఎంత శాంతస్వభావులయినా వారికి క్రోధం కలిగితే బరిమీద కోడెత్రాచుల్లా, ఆకలిగొన్న పెద్దపులుల్లా విజృంభిస్తారు. రాజుల హృదయాలెప్పుడూ ద్వేషాగ్నితో రగులుతూంటాయి. దానికి ముఖస్తుతి ఆజ్యం. ఆ నెయ్యి పోసేవారిని చేరదీయడంకంటె నాశనంలేదు. ఇక నీ యిష్టం అన్నాడు.

ఇలా ఈ ప్రసంగం సాగుతున్నట్లయినా తెలియకుండా శకుని జూదం సాగిస్తూనే వున్నాడు. కొడుకు గెలుపు కలిగిస్తున్న సంతోషంలో వున్నాడు ధృతరాష్ట్రుడు.

అంతలో శకుని అట్టహాసంతో, ధర్మనందనా! ద్రౌపదిని కూడా ఓడిపోయావు. ఇంక ఆటకు నీ దగ్గ రేం మిగిలింది, అని పాచికలు బిగబట్టాడు.

ఆ మాట వింటూనే సుయోధనుడు విదురుని జేరి, తక్షణంవెళ్ళి ద్రౌపదిని సభకు తీసుకురా, ఈ క్షణంనుంచీ అది మా దాసి, అన్నాడు.

విదురుని గుండె చివుక్కుమంది. సభ్యుల హృదయాలు విషాద భారంతో నిండాయి. వారి ముఖాలు దీనంగా దించుకుపోయాయి. భీష్మ, ద్రోణ, కృప, బాహ్లీక, సోమదత్త, భూరిశ్రవస, సంజయ, అశ్వత్థామ, యుయుత్సు, వికర్ణ ప్రభృతులందరూ వేడి నిట్టూర్పులు విడుస్తూ తలలు వాల్చేశారు. అందరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

# వస్త్రాపహరణం

విదురుడు తల మొత్తుకుంటూ:

నాయనా! కాలపాశాన్ని నీ చేతులతో నీ మెడకు చుట్టుకుంటున్నావు. ఘోర కాకోల విషం కక్కే భయంకర సర్పం పడగవిప్పి నీ తలమీద ఆడుతున్నది. దాన్ని రెచ్చగొట్టకు. ఈ ధర్మరాజు తనను తాను ముందు ఓడిపోయాడు. ఓడిపోయిన వాడికి మరొకరిని ఒడ్డే అధికారంలేదు. ఇప్పటి కయినా నువ్వు ఈ దుర్వ్యవసాయం ఆపు. తలలో గుచ్చుకున్న మేకును తీసుకుందామని ఒక మేక తలను రాతిబండకువేసి కొట్టుకుందట అలావుంది నీ వ్యవహారం.

అంటూండగానే దుర్యోధనుడు ప్రాతికామిని పిలిచి ద్రౌపదిని తీసుకు రమ్మన్నాడు. ప్రభువాజ్ఞను శిరసావహించి ప్రాతికామి వెళ్ళి తను వచ్చిన పని చెప్పాడు. ద్రౌపదీదేవి హృదయం ఆందోళనతో నిండింది.

ప్రాతికామీ! జూదంలో ఒడ్డడానికి మరేమీ లేకనేనా కట్టుకున్న భార్యను పణం పెట్టాడు? అంతమత్తులో వున్నాడా, జూదంలో ఆయన — అని అడిగింది.

అన్నీ ఓడిపోయాకనే ఆయన మిమ్మల్ని ఒడ్డి ఓడిపోయారు. ఇప్పుడు మీరు వారికి దాసిగా రావాలి అని మా దుర్యోధనులు చెప్పారు; అనగా ద్రౌపది:

అయితే ధర్మరాజు నన్ను ముందుగా పందెంలో ఓడిపోయారో, ఆయనే ముందు ఓడి నన్ను పణంగా పెట్టారో కనుక్కురా, నేనిప్పుడు ఏకవస్త్రను, సభాభవనానికి రాకూడదు — అంది.

ప్రాతికామి వచ్చి సభలో నివేదించాడు. ఆ విషయం యిక్కడే తేలుస్తాం రమ్మను — అని నవ్వుతూ పంపాడు దుర్యోధనుడు. తిరిగి వచ్చిన ప్రాతికామి మాటవిని, ద్రౌపది సభాభవనానికి వస్తూ గాంధారి దగ్గరకు వెళ్ళింది.

భయంతో అంతఃపుర స్త్రీజనంవున్న చోటుకి పరుగుపెట్టే ద్రౌపదిని చూసి అట్టహాసం వేస్తూ దుర్యోధనుడు:

తమ్ముడూ! ఈ ప్రాతికామి పాండవులకు భయపడుతున్నాడు. వీరు మన సేవకులు; వెళ్ళి నువ్వే ద్రౌపదిని లాక్కురా — అన్నాడు.

దుశ్శాసనుడు పరమసంతోషంతో నాలుగంగల్లో ద్రౌపదిని సమీపించి, రాజసూయావభృథ స్నానంతో పవిత్రమయిన ఆమె కేశపాశం పట్టి, రోదిస్తున్నా వినకుండా సభా భవనానికి తీసుకువచ్చాడు. వచ్చేదారిలో,

దుశ్శాసనా! నేను రజస్వలను, ఈ స్థితిలో సభాభవనానికి రాకూడదు. నన్ను విడిచిపెట్టు. అని దీనంగా అడిగింది.

నువ్వు ఏకవస్త్రవయినా, రజస్వలవయినా, దిగంబరంగా వున్నా ప్రమాదం లేదు. నువ్వు మా దాసివి, అంటూ దుశ్శాసనుడు ఆమెను ఈడ్చుకొస్తూంటే,

ఈ సదస్యులలో ఒక్కరూ నన్ను రక్షించేవారు లేరా? ఈ భరతవంశం ధర్మానికి తిలోదకాలిచ్చిందా? ఆడదానికి అత్యాచారం జరుగుతూంటే భీష్మ, ద్రోణ, విదుర, ధృతరాష్ట్రాదు లందరూ ఏమీ చెయ్యలేని నిస్సహాయులా? పరమేశ్వరా! లోక రక్షకా! జగన్నాథా! నువ్వే నాకు దిక్కు — అని ప్రార్థించి:

ఓ మహామహులారా! ఇప్పుడు చెప్పండి. ఈ జూదంలో నేను ధర్మబద్ధంగా ఓడిపోయానా? అధర్మంగా జరిగిందా ఈ పందెం —అని అడిగింది.

పరధనాన్ని పణంగా ఒడ్డే అధికారం జూదరికి లేదు; అయితే భార్య ఎప్పుడూ భర్త ఆధీనంలో ఉండేదే. ఈ రెండు విరుద్ధ విషయాలను సమన్వయించేసే సూక్ష్మ ధర్మం మాకు తెలియడంలేదు అన్నాడు భీష్ముడు.

ఈ సభలో కురువంశ ప్రముఖులు వారి కొడుకులతో, కోడళ్ళతో వున్నారు. గురువృద్ధు లున్నారు. ఇందరిలో ఎవరికీ ధర్మనిర్ణయశక్తి

లేదా? అది లేనివారిని జ్ఞానులనీ, వృద్ధులనీ, అనగలరా .... కపటద్యూతం సాగించికాదా ఈ స్థితి కల్పించారిక్కడ — అని ఆమె రోదిస్తూ అన్నది.

దుశ్శాసనుడు ఆమెపైట చెంగుపట్టి లాగుతూంటే భీమసేనునికి ఆవేశం హెచ్చింది. చింతనిప్పులు కక్కే ఆ వీరుని కన్నులలో అగ్నిజ్వాలలు రేగాయి.

క్రోధారుణజ్వాలారోచులు చిమ్మేకన్నులతో, ఆ నిప్పుసెగ లుమిసే నిట్టూర్పులతో, మండే అగ్నికణంలా పొంగిననరాలతో, కణకణ మండే దేహంతో భీమసేనుడు: ధర్మనందనా! ఎంతటి జూదరి అయినా తను చేరదీసిన కులటనుకూడా పందెం ఒడ్డడే; అటువంటప్పుడు రాజసూయ యాగంలో పవిత్రమయిన ఈ పతివ్రతను, కులస్త్రీని జూదంలో ఒడ్డేశావే! మా సర్వసంపదలనూ మమ్మల్నీ ఓడినా మాకు బాధలేదు; కాని హద్దుమీరి నువ్వు కులస్త్రీని ఒడ్డి నీచమయిన పనిచేశావు. ఇంతవరకూ నిన్ను సహించాను, నీ సహనం సర్వనాశనం చేస్తున్నది. ఇప్పుడింక నిన్ను విడువను, అని తమ్ముడివైపు తిరిగి — సహదేవా! నిప్పు తీసుకురా, ఇంతటి దుస్థితి కలిగినా ఏమీచెయ్యలేని నా రెండుచేతులూ ఈయనకోసం కాల్చుకుంటాను అని ఉరిమాడు.

అర్జునుడు కొంత శాంతింపచెయ్యడానికి ప్రయత్నించాడు. ఉపశాంతి కలగలేదు భీమునికి; ప్రళయ ఝంఝలో ఊగిసలాడే పర్వతంలా చలించి పోతున్న దతనిదేహం, తీవ్రకోపంలో.

అప్పుడు దుర్యోధన సోదరులలో ఒకడైన వికర్ణుడు లేచి: ఓ సభాసదులారా! ఇందరు మహామహులు, ధర్మవేత్తలు, లోకజ్ఞులు వున్నచోట నిష్పాక్షికంగా ధర్మనిర్ణయం చేసి, ద్రౌపది సందేహ నివృత్తి చెయ్యాలి. అని సభను కలయజూశాడు. ఒకరి ముఖా లొకరు చూచుకుంటున్నారే తప్ప ఒక్కరూ పెదవి కదపకపోవడంతో —

ప్రభువయినవాడికి వేట, త్రాగుడు, జూదము, కామభోగాసక్తి కూడని వ్యసనాలు. ఇందులో దేనికి లొంగినా వారి వివేకం నశిస్తుంది. అంతకు మించి ఈ ధర్మరాజు తమ సోదరు లయిదుగురిభార్య అయిన ద్రౌపదిని

పణం పెట్టాడు. పయిగా జూదంలో తనను ఓడిన అనంతరం మరొకరిని పందెంపెట్టే అర్హతలేదు ఈయనికి. అందుచేత ద్రౌపది ధర్మవిజిత కాదు - అని ఉచ్ఛైస్వరంతో పలుకడంతో సభంతా కలవరపడింది. అప్పుడు కర్ణుడు లేచి, ఫక్కున నవ్వి:

వికర్ణా! నీ ప్రస్తావన చాలా విచిత్రంగా వుంది. అరణిలో పుట్టిన అగ్ని అరణిని నశింపజేయడం, శరీరంలో పెరిగే వ్యాధి శరీరాన్ని సర్వనాశనం చెయ్యడం, పశువు తినే గడ్డినే తన కాళ్ళతో తొక్కుకోవడం ఎరుగుదుం. కాని నీవలె పుట్టిన వంశాన్ని నాశనం చేసేవాడు ఇంతవరకూ కనిపించలేదు.

భీష్మ, ద్రోణ, కృపాచార్యాది పెద్దలున్న సభలో, గాంధారీ, ధృతరాష్ట్రులున్న చోట నువ్వు ధర్మనిర్ణయానికి దిగడం ఎంత దుస్సాహసం! నీ చేతిగొడ్డలితో నీ కాళ్ళు నరుక్కోకు, ధర్మరాజు ఆమెను ఒడ్డుతున్నప్పుడు మిగిలిన సోదరులుకూడా అడ్డు చెప్పలేదే.

ఆమె పతివ్రత అంటున్నారు. అయిదుగురి భార్య అది. అటు వంటిదాన్ని "బంధకి" అంటారు. బంధకిని ఏ దశలో అయినా సభకు తీసుకురావచ్చు. ఇక నువ్వు కూర్చో, దుశ్శాసనా! నువ్వు ఈ పాండవులతోపాటు ద్రౌపదీదేవి ధరించిన వస్త్రాలు విప్పెయ్యి అన్నాడు.

ఆ మాట వింటూనే పాండవులు తమ ఉత్తరీయాలు కిందపెట్టారు. దుశ్శాసనుడు ద్రౌపది చెంగుపట్టాడు; లాగడం మొదలుపెట్టాడు, ద్రౌపది ఏడుస్తూ సర్వలోకేశ్వరుని ప్రార్థించింది.

దుశ్శాసనుడు వికటాట్టహాసంతో ఆమెచీర విప్పుతున్నాడు. ఏ అతీత శక్తిని ద్రౌపదీదేవి ప్రార్థించిందో ఆ శక్తిప్రభావంతో ఆమె శరీరంమీద చీర అలా సాగుతూనే వుంది. దుశ్శాసనుడు చీర లాగుతూనే వున్నాడు. అది సాగుతూనేవుంది. చీర గుట్టలా పడుతున్నది.

మహాసభలోని వారందరి గుండెలూ కుంచించుకుపోయాయి. వారి కన్నులు ఆశ్చర్య చకితాలయాయి. అందరూ ఇంద్రజాలం చూస్తున్నారు.

అప్పుడు భీముడు లేచి పళ్ళు పటపట కొరుకుతూ: కురు గురు వృద్ధ బాంధవులు కూర్చునివున్న ఈ రాజసభా భవనంలో మదోద్ధురుడై యీ అఘాయిత్యానికి తలపడ్డ ఈ దుష్టుడి రొమ్ము చీల్చి, రక్తపానంచేసే సంగ్రామంకోసం ఎదురుచూస్తున్నాను, అన్నాడు.

చీర లాగుతున్న దుశ్శాసనుని చేతులు అలసిపోయాయి. ముఖం చెమటతో నిండింది, భుజాలు వాలి జారి నిలబడిపోయాడు. అప్పుడు విదురుడు లేచి :

సదస్యులారా! ఈ పాంచాలరాజనందన ప్రశ్నకు సమాధానం ఇవ్వ వలసినభారం మీ అందరిమీదా వుంది. మహాసభకు విపద్దశలో వచ్చినవారు వెలిబుచ్చే సందేహానికి సత్యబద్ధమయిన సమాధానం యివ్వకపోతే ఆ పాపం మనల్ని కట్టి కుడుపుతుంది. ఆ సమాధానం ధర్మవిరుద్ధంగా యిస్తే ఆ ఫలితమంతా వారే అనుభవించాలి — అని హెచ్చరించగా.

అందరూ ఒకరి ముఖా లొకరు చూసుకుంటూ వుండిపోయారు. కర్ణుడు నవ్వుతూ: దుశ్శాసనా! ఈ దాసిని మీ యింటికి తీసుకుపో — అనగా దుశ్శాసనుడు దీర్ఘంగా ఊపిరి విడిచి, లేచి ద్రౌపదివైపు అడుగులు వేస్తున్నాడు.

అప్పుడు ద్రౌపది: సదస్యులందరికీ అభివాదా లర్పిస్తున్నాను. స్వయం వర వేళ తప్ప మళ్ళీ నేను మీ ఎవరికంటా పడలేదు. రాజభవనంలోవున్న నన్ను కన్నెత్తిచూడగల సాహసం ఎవరికీ లేకపోయింది. ఈనాడు ఈ జూదం పేరిట ఇంతటి అవమానం జరిపారు. కులస్త్రీని, ఏకవస్త్రను, సభామధ్యానికి ఈడ్చుకురావడం మీ వంశసంప్రదాయానికే కళంకం. ధర్మ తత్పరుడైన పాండవజ్యేష్ఠుని భార్యను దాసీస్థానంలో ఉంచే దుస్సాహసం మీకే చెల్లింది. ఇంతకూ నేను ధర్మవిజితనా అధర్మవిజితనా — అని రెట్టించగా, భీష్ముడు:

అమ్మాయీ! ధర్మం బహుసూక్ష్మ మయినది. ఈ ధర్మనిర్ణయంలో మహామహులే తలక్రిందులవుతూంటారు. ఈ ప్రపంచంలో ఒక విచిత్రం కనిపిస్తుంది.

బలవంతుడు ఏది ఆచరిస్తే అదే న్యాయమని ప్రచారం చేయడం, బలహీనుడు చేసే ధర్మప్రచారాన్ని త్రోసిపుచ్చడంకూడా ఆ విచిత్రాల్లో ఒకటి. ఆ బలం ధర్మబలాన్ని ఎడమ చేత గెంటగలదు; కనుకనే ద్రోణాచార్య, కృపాచార్యాది ప్రముఖధర్మ వేత్తలందరూ రెండు చేతులతో తలలు బిగబట్టుకు కూర్చున్నారు. ఇక ఈ సమయంలో ధర్మనిర్ణయం చెయ్యగలవాడు ధర్మరా జొక్కడే. అని మౌనం వహించాడు.

ద్రౌపది దుఃఖభరహృదయంతో తలదించుకుంది. సభ మౌన నిశ్శబ్దంలో వున్నది. అది గమనించి దుర్యోధనుడు; ద్రౌపదీ! నీ ప్రశ్నకు భీమార్జున, నకుల సహదేవులు జవాబిస్తారేమో అడుగు; కాక ధర్మపరుడయిన ధర్మ రాజు చెప్పినా మంచిదే, నిన్నూ, నీ భర్తలనూ చూస్తూంటే సభాసదులకు విచారంగా వుంది — అన్నాడు.

సభలో కొందరు దుర్యోధనుని అభినందిస్తూ, మరికొందరు నిందిస్తూ వారిలో వారే గుసగుసలు పోతున్నారు.

కొంతసేపటికి మళ్ళీ నిశ్శబ్దం తాండవించింది. అప్పుడు భీముడు లేచి, ఈ ధర్మరాజు నన్ను ఒకణ్ణి అయినా జూదంలో ఓడిపోయి వుండకపోతే, ఈ ప్రపంచంలో ద్రౌపదివైపు కన్నెత్తిచూడగలప్రాణి వుండేదికాదు. ఆ స్వేచ్ఛ నాకుంటే యీపాటికి వీరంతా యమసదనం చేరివుండేవారు. మేము ధర్మసూత్రబంధంలో వుండిపోయాం. అని బుసకొట్టే పాములా నిలబడ్డాడు.

భీష్మ, ద్రోణులు భీమసేనుని క్రోధాన్ని ఉపశమింపజేసి, ఓరిమి అవసరం అన్నారు. సభ విచలితహృదయంతో, నిశ్శబ్దంగా వుంది.

అప్పుడు కర్ణుడు: పాంచాలీ! సేవకుడూ, కుమారుడూ, పరాధీన అయిన ఆడదీ ఎప్పుడూ అస్వతంత్రులే. సర్వసంపదలూ కోలుపోయి సేవావృత్తిలో వుండే వాడి భార్యా, వస్తువులూ అన్నీ వాడు సేవించే యజమానివే అవుతాయి. ఇప్పుడు నువ్వు దుర్యోధనుని దాసివి. ఆయన ఏపని చెపితే అది చెయ్యాలి — అని నవ్వుతూంటే భీమసేనుని గుండెలో రేగిన మంటలు సెగలు ఉచ్ఛ్వాస, నిశ్వాసాలుగా వెలువడుతున్నాయి.

కన్నులలో ఎర్రజీరలు రేగుతూండగా ధర్మజునివైపు చూశాడు. ఆయన కనులతోనే శాంతంగా వుండమన్నాడు.

శాంతంకాక ఎవరిమీద కోపగించను? కర్ణుడు దాసధర్మం చెప్పాడు. ఇంతకూ మీ రాడిన జూదం ఇంత పరాభవాన్ని తెచ్చిపెట్టింది — అని తల దించుకున్నాడు.

అప్పుడు దుర్యోధనుడు వికటంగా నవ్వి, భీమునివైపు కోరచూపు చూసి: ధర్మ నందనా! మీరు చెప్పండి, ద్రౌపది ప్రశ్నకు సమాధానం, అంటూనే ఏనుగుతొండాలవంటి తన తొడలు చూపుతూ ద్రౌపదికి చేసన్న చేశాడు.

అది భీమసేనుడి కంటబడింది. ఒక్క సింహగర్జనచేసి; దుష్ట దుర్యోధనా! రానున్న సంగ్రామంలో, ఇప్పుడు నువ్వు చూపిన తొడలు విరగకొట్టి రణరంగంలో రక్తధారలు చిమ్మించకపోతే నేను పితృదేవతల గతి తప్పినవాడినే అవుతా, అని పళ్లు పటపట కొరికాడు.

అప్పుడు విదురుడు: నాయనా! ఇంక ఈ దురాగతం ఆపండి. ఇది కురువంశానికే కళంకం. ధర్మరాజు తనను ఒడ్డి, ఓడకముందు ద్రౌపదిని పందెంకాసివుంటే అది ధర్మమయ్యేది. అలా జరగలేదు -- అని చెపుతూంటే, దుర్యోధనుడు సీత్కారం చేశాడు.

పరిస్థితి విషమిస్తున్నదని, విదురుడు గాంధారిని వెంటనుంచుకొని, ధృతరాష్ట్రుడికి విషయమంతా వివరింపగా, విన్న ధృతరాష్ట్రుడు:

ఓరీ మూర్ఖుడా, దుర్యోధనా! కురు గురు వృద్ధజనంవున్న సభలోకి ఈ వంశపు పెద్దకోడలిని రప్పించి అత్యాచారాలు సాగిస్తావా? నీకంటె నీచుడు లేడురా, అని ద్రౌపదిని దగ్గరకు రప్పించుకొని:

అమ్మాయీ! వాళ్ళ మూర్ఖత్వాన్ని గురించి ఆలోచించకు, నీవంటి ఉత్తమ గుణవతికి ఏమేలు చేసినా అది మా అదృష్టమే. నువ్వు ఏం కోరినా ఇవ్వవలసిందే కోరుకో అనగా ద్రౌపది:

మహారాజా! మీరు వరం ఇవ్వదలిస్తే ధర్మనందనుని బంధముక్తుని చేయండి. లేకపోతే నా బిడ్డలు శాశ్వతంగా లోకంలో దాసీపుత్రులవుతారు, అనగా అంగీకరించి మరొక వరం కోరుకోమన్నాడు.

నా భర్తల ధనుర్బాణ రథాలు వారికి యిప్పించండి — అంది. ధృతరాష్ట్రుడు అంగీకరించి మరొక వరం కోరుకోమనగా,

మహారాజా! నేను ధర్మం తప్పి నడవలేను. క్షత్రియకాంతకు రెండు వరాలుకోరే అర్హతనే ధర్మశాస్త్రం అనుగ్రహించింది — అంది.

ధృతరాష్ట్రుడు ఆమె కోరిన రెండువరాలూ ఇచ్చి ఆమె ధర్మవర్తనను అభినందిస్తుంటే భీమసేనుడు, పొంగివస్తున్న క్రోధంతో ధర్మరాజును సమీపించి: ఇప్పుడు మనకు దాసభావం పోయింది కనుక నువ్వు అనుగ్రహిస్తే ఇప్పుడే ఈ దుష్టులను కడతేరుస్తాను — అన్నాడు.

ధర్మరాజు భీముని వెన్ను నిమిరి: తమ్ముడూ శాంతించు, ఇప్పుడు మన మేమీచెయ్యకూడదు — అన్నాడు.

ధృతరాష్ట్రుడు ధర్మరాజును పిలిచి:

నాయనా! మీ రాజ్యమూ, మీ సిరిసంపదలూ మీరే తీసుకుని ఇంతవరకూ జరిగినదాన్ని మరిచిపోయి సుఖంగా వెళ్ళిరండి. నువ్వు సజ్జనుడివి; ఈ దుష్టుల దుస్సాహసాలను విస్మరించగలవని నే నెరుగుదును. నన్నూ, నీ పెద్దతల్లిని స్మరించి వాళ్ళందరినీ క్షమించు. బంధు మిత్రులు నలుగురూ ఈ నాలుగురోజులూ కులాసాగా గడుపుతారని యీ వినోదానికి ఒప్పుకున్నాను. అది ఇలా పరిణమిస్తుందనుకోలేదు. మీరంతా ఇంద్రప్రస్థం వెళ్ళి ధర్మతత్పరులై ప్రజాపాలనం చెయ్యండి అన్నాడు.

పాంచాలీసహితులై పాండవులు రథంమీద బయలుదేరారు.

## అనుద్యూతం

పాండవులు ఇంద్రప్రస్థంవైపు బయలుదేరగానే, దుశ్శాసనుడు రోషంతో: మనం కష్టపడి సంపాదించుకున్న సర్వస్వాన్నీ ఈ మహారాజు ధారపోశాడు.

ఇప్పుడు మనం మరో ఉపాయం పన్ని వారిని పరాజితులను చెయ్యాలి — అన్నాడు.

కర్ణ, శకుని, దుర్యోధనుల సమాలోచనలు సాగాయి. అనంతరం దుర్యోధనుడు తండ్రిని సమీపించి;

మహారాజా! కాలకూట విషంక్రక్కే భుజంగాలవంటి పాండవులను మీరు మా పీకలమీద విడిచారు. అందులోనూ ఆ అర్జునుడివంటి దుస్సహయోధుడు జీవించివుండగా నాకు మనశ్శాంతి వుండదు. శత్రువును ఉదాసీనంగా విడిచి, నిశ్చితంగా వుండే వాడికంటే మూర్ఖుడులేడని బృహస్పతివంటి నీతిశాస్త్రవిదుడు ఘోషించాడు. అందుచేత మీరు పాండవులను మళ్ళీ ఆహ్వానించండి.

వారితో మరొకమారు జూదం సాగిస్తాం. ఈసారి జూదంలో ఓడినవారు పన్నెండేళ్ళు అరణ్యవాసం, ఒక ఏడు జనపదంలో అజ్ఞాతవాసం సాగించాలి. అలా వారిని ఓడించి, ఆ రాజ్యాన్ని స్వాధీనం చేసుకుంటే రాజులందరూ మనపక్షంలో వుంటారు. అప్పుడింక వీరు దండెత్తి వచ్చినా మనకు భయంలేదు అనగా ధృతరాష్ట్రుడు చాలాసేపు అనంగీకారమే తెలిపి, చివరకు అంగీకరించాడు. కబురు పంపాడు పాండువులకు.

ధర్మరాజు చేసేదిలేక మళ్ళీ పాంచాలితో, సోదరులతో హస్తినాపురం చేరాడు.

అందరూ పరిపరివిధాల జూదం జరగకుండా చూడమని ధృతరాష్ట్రునికి చెప్పగలిగినదంతా చెప్పారు.

అప్పుడు గాంధారి:

ప్రభూ; వీడు పుడుతుంటే నక్కలు అరిచాయి. అది చాలా అనర్థంగా భావించి వీణ్ణి విడిచెయ్యమన్నారు. మీరు మమకారం వీడలేక ఇంతకు తెచ్చారు. నిన్నకాక మొన్న జరిగిన అల్లరి విన్నారు. ఇప్పుడు మళ్ళీ ఆ దుష్టుడి పన్నాగం కొనసాగిస్తున్నారు. అన్నదమ్ముల బిడ్డలమధ్య ఎందుకీ విద్వేషం పెరగనిస్తారు? శాంత మనస్కులయి, నీతిని, ధర్మాన్నీ పరిశీలించి

నడపండి. భ్రమ, ప్రమాదాలకు లోనుగాకుండా మీ కార్యాలను సాగించండి. ఈ జూదం ఆపండి — అంది.

వినలేదు ధృతరాష్ట్రుడు.

ధర్మరాజాదులు రాగానే కుశలప్రశ్నలు అయాక మళ్ళీ ద్యూతప్రసంగం వచ్చింది. బంగారులేడి వుంటుందో వుండదో తెలియకనే రాముడు దాని వెంట బడ్డాడా? విధి విపరీత మయినప్పుడు యిటువంటివి తప్పవు అనుకుంటూ జూదానికి సిద్ధపడ్డాడు.

ధర్మనందనా! ఈ మారు ఎవరి సిరిసంపదలూ ఒడ్డనవసరంలేదు. ఓడిన వారు పన్నెండేళ్ళు అరణ్యవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం సాగించాలి. అజ్ఞాతవాస సమయంలో దొరికిపోతే మళ్ళీ పన్నెండేళ్ళు అరణ్యసంచారం. అజ్ఞాతవాసమూ — అన్నాడు శకుని.

అంగీకరించాడు — ధర్మరాజు.

శాస్త్ర మర్యాదానుసారం ద్యూతానికివచ్చిన ఆహ్వానాన్ని తిరస్కరించడం రాజధర్మంకాదు కనుక సిద్ధపడతా నన్నాడు.

శకుని పాచికలు విసిరాడు. దుర్యోధనుడూ, దుశ్శాసనుడూ అట్టహాసం చేశారు.

ఈసారికూడా పరాజయం ధర్మరాజునే వరించింది.

అప్పటికే అక్కడ వనవాసానికి అవసరమయిన మృగచర్మాంబరాలు సిద్ధంకావడం చూసి, ధర్మరాజు వాటిని ధరించాడు. సోదరులందరూ అనుసరించారు. సభాసదులు అందరూ దీనవదనాలతో కంట తడిపెట్టారు. చీనీ, చీనాంబరాలతో రాజలాంఛనాలతో, రథాలమీద సాగవలసిన పాండు రాజ నందనులకు ఈ స్థితి కలిగిందంటే కాలం ఎంత బలీయమయినదీ అనిపించింది విజ్ఞులకు.

అప్పుడు పాండవులు ధృతరాష్ట్రునికి అభివాదం చేసి, కుంతికి నమస్కరించారు. ఆవిడ కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ: అదృష్టవంతులు కనుక

పాండురాజు, మాద్రి ఈ దురవస్థ చూడనవసరం లేకుండా వెళ్ళిపోయారు. నా ఖర్మ యిలా కాలింది. నాయనా, సహదేవా! నువ్వుకూడా యీ క్లేశాలు అనుభవించవలసిందేనా, అంటూండగా ద్రౌపదీదేవి అత్తగారి పాదాలకు నమస్కరించింది.

అమ్మా: నీ కెంతటి దుస్థితి కలిగింది! ఎటువంటియింట బుట్టావు. ఎటువంటి గడప మెట్టావు! అయినా నీ కీస్థితి కలగటం ....... అని ఆమెను గుండెకు హత్తుకుంది.

పాండవులు అడుగులేశారు. ద్రౌపదివెంట కుంతి అడుగులు వేస్తూంటే విదురుడు వచ్చి: ఈ వార్థక్యంలో పాండురాజు పత్నికి వనవాస క్లేశాలు అవసరంలేదు. ఆవిడ యిక్కడే వుంటుంది — అన్నాడు.

ఆ విద్వాంసుని ఉచితజ్ఞతకు అనేకులు ఆనందించారు. పాండవులు హస్తినాపుర వీధులలో వెడుతూంటే పౌరులు దుర్యోధనాదులను నిందిస్తూ విచార వదనులయ్యారు.

వారిని కొంత దూరం సాగనంపి, కన్నీటితో తిరిగివచ్చింది కుంతి.

విదురుడు ధృతరాష్ట్రుని సమీపించి.

మహారాజా! ధర్మరాజు తన ఉత్తరీయంతో ముఖం కప్పకు వెళ్ళాడు. భీమసేనుడు తన దృఢ, దీర్ఘభుజాలను పొంగించి వాటినే చూస్తూ నడిచాడు. అర్జునుడు గుప్పెళ్ళతో ఇసుకచల్లుతూ నడుస్తూంటే, నకులుడు శరీరం నిండా దుమ్ము పులుముకుంటూ అనుసరించాడు. సహదేవుడు తన ముఖం ప్రజలు చూడకుండా దాచుకున్నాడు. ద్రౌపది తన దీర్ఘ కేశాలతో ముఖం మూసుకుని శోకంతో నడుస్తూండగా వారి పురోహితుడు ధౌమ్యుల వారు ధర్భలు చేతపట్టుకుని యమదేవతాసంబంధమయిన సామసూక్తాలు పఠిస్తూ వెళ్ళారు — అనగా ధృతరాష్ట్రుడు: మహామంత్రీ! వాటి అంతరార్థం ఏమిటని అడిగాడు.

ప్రభూ! మనవారు సాగించిన దుష్టకార్యాలకు ధర్మరాజు గుండె కుతకుతలాడుతున్నది. ఆ వేడికనులు ఎవరిమీద పడితే వారు నశిస్తారు. అలా జరగడం యిష్టంలేక ఆయన ముఖం కప్పకున్నాడు.

భీముడు తన భుజబలంతో శత్రుమర్దనం చేసి తీరుతానంటున్నాడు. ఇసుక జల్లినట్లు శరవర్షం కురిపిస్తానని అర్జునుడూ, తన సౌందర్యం ఎవరినీ ఆకర్షించకూడదని నకులుడూ, ఈ స్థితిలో తన ముఖం ఎవరూ చూడ కూడదని సహదేవుడూ వెళ్ళారు. తనకీ దుర్దశను ప్రాప్తింపజేసిన వారి భార్యలు తమ పతులనూ పుత్రులనూ కోల్పోయి యింతకంటె దారుణంగా శోకిస్తారని ద్రౌపది భావం. తమ శత్రువులు మరణించినప్పుడు జరగవలసిన కర్మకాండకు సూచకంగా ధౌమ్యులు దర్భలు పట్టుకుని సామమంత్రాలు పఠించారు. అని విదురుడు వివరించి సెలవు తీసుకున్నాడు.

ధృతరాష్ట్రుడు సంజయుని పిలిపించాడు. వస్తూనే సంజయుడు మహారాజా! చేజేతులా ఎంతటి విపత్తు నెత్తిమీద తెచ్చుకున్నారు! మీ బుద్ధి విపరీతంగా సాగింది. అన్నిటికంటె బలీయమయిన కాలం మీ మనస్సును వశపరచుకుంది. రజస్వలాదశలో ఏకవస్త్రంతో వున్న ఇంటి కోడల్ని పాంచాల రాజపుత్రిని మహాసభామధ్యంలో అవమానించిన దుస్సాహసానికి ఫలం అనుభవించక తప్పదు అన్నాడు.

సంజయా! విదురుడు అధర్మం జరుగుతుందనీ, ధర్మతత్పరులను హింసించరాదనీ హితబోధ చేశాడు. కానీ నా పుత్రవాత్సల్య దౌర్బల్యం నన్ను నిరోధించింది — అంటూ చింతాక్రాంతు డయాడు ధృతరాష్ట్రుడు — అని జనమేజయునికి వైశంపాయనుడు సభాపర్వం వివరించాడు.

సభాపర్వం సమాప్తం.

# ఆదిపర్వం

## మూలభారతంలో పర్వవిభజన

అనుక్రమణిక, పర్వ సంగ్రహ, పౌష్య, పౌలోమ, ఆస్తీక పర్వాలలోని 2,400 పై చిలుకు శ్లోకాలనూ విడిచిపెట్టక తప్పలేదు; ఆ ఉపాఖ్యానాలు రసభరితాలే అయినా.

సంభవ, జతుగృహ, హిడింబవధ, చైత్రరథ, స్వయంవర, వైవాహిక, విదురాగమన, రాజ్యలాభ, అర్జున వనవాస, సుభద్రాహరణ, హరణాహరణ, ఖాండవదహన, అను ఉపపర్వాలతో, 8,460 శ్లోకాలతో వుంది.

# సభాపర్వం

సభాక్రియా, లోకపాలసభాఖ్యాన, రాజసూయారంభ, జరాసంధవధ, దిగ్విజయ, రాజసూయ, అర్ఘాహరణ, శిశుపాలవధ, ద్యూత, అనుద్యూతపర్వం అని పది ఉపపర్వాలతో 2,500 పై చిలుకు శ్లోకాలతో వుంది.

శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారక హారపంక్తులన్
చారుతరంబులయ్యె వికసన్నవకైరవగంధబంధురో
దారసమీర సౌరభముఁ దాల్చి సుధాంశు వికీర్యమాణక
ర్పూర పరాగ పాండురుచిపూరములం బరపూరితమ్ము లై.

# అరణ్యపర్వం

ఇందులో:

విదుర బహిష్కరణ

ద్రౌపది నాస్తికవాదం

పాశుపతం

ఊర్వశి

రామదూత

జటాసురుడు

కలియుగం

సత్యభామ

ఘోషయాత్ర

# విదుర బహిష్కరణ

జనమేజయ మహారాజా! ద్రౌపదీ సహితులై, ధౌమ్యపురస్సరులై పాండవులు కామ్యకవనం వయిపు వెళ్ళిన అనంతరం ధృతరాష్ట్రుడు విదురుని పిలిపించి:

ధర్మసూక్ష్మా లెరిగిన నువ్వు బృహస్పతి సముడవు. నీకు కౌరవులూ, పాండవులూ సమానమే. కనక పాండవులవల్ల, వారిని అభిమానించే ప్రజలవల్ల మన రాజ్యానికీ, నా బిడ్డలకూ ఉపద్రవం రాని దారి ఏమిటో చెప్పు — అని ప్రశ్నించగా విదురుడు:

ప్రభూ! రాజ్యం సుఖశాంతులతో వుండాలన్నా, ప్రజాభిమానం ప్రభుగణానికి కావాలన్నా, ధర్మపథాన సత్యబద్ధులమయి నడవాలి. ఇప్పుడు పాండవులను పిలిపించి. వారి రాజ్యభాగం వారికి అర్పించి, వారిని శాంత చిత్తులను చేసుకోవడమే శరణ్యం. పరధనానికి ఆశపడడం న్యాయం కాదు. శకుని సలహాలను పాటించక పాండవులను చేరదీసి మనశ్శాంతి పొందండి, అనగా—

ధృతరాష్ట్రుడు విసుగుతో:

నీకు పాండవ పక్షపాతం తగ్గడంలేదు. నేను నిన్నెంత ఆదరించి అభిమానించినా నువ్వు అంతకంతా మాకు వ్యతిరేకంగానే వుంటావు. ఎంతో అభిమానంతో అన్ని వాంఛలూ తీర్చినా కులటకు ప్రేమ స్థిరంగా వుంటుందా? అలానే నువ్వూ వున్నావు. నీవంటివాణ్ణి వుండనివ్వడంకంటె తక్షణం దేశంనుండి బహిష్కరించడం మంచిది. నీ యిష్టంవచ్చిన చోటికి పో — అని తీవ్రంగా అన్నాడు.

విదురుడు హస్తినాపురం విడిచి కామ్యకవనం చేరి పాండవులను కలుసుకున్నాడు. ధృతరాష్ట్రుడు తనను బహిష్కరించిన విషయం ప్రస్తావిస్తూ షష్టిపూర్తి అయిన పురుషుని వివాహమాడిన ముగ్ధ ఆ భర్తమీద అనురాగం పెంచుకోలేదు. అలానే ధృతరాష్ట్రుడు ధర్మబోధపట్ల విముఖంగా వున్నాడు. తామరాకుమీద జలబిందువులా ఆయనమీద నా నీతివాక్యాలు

నడుస్తున్నాయి. మీరు కూడా జూదానికి దిగవద్దని చెప్పినా పెడచెవినే పెట్టారు. ఇప్పుడయినా మీరు సత్యధర్మాలను విడవకుండా ఓరిమితో వుండండి. క్షమాశీలుడు లోకాన్ని జయిస్తాడు — అంటూ వారికి హితబోధచేసి కాలం గడుపుతున్నాడు.

ఈవార్త విన్న ధృతరాష్ట్రుని మనస్సు వికలమయింది. సంజయుని పిలిచి, తక్షణం వెళ్ళి ఎక్కడున్నాసరే, విదురుని తీసుకురమ్మన్నాడు. సంజయుడు కామ్యకవనానికి రాగానే ధర్మరాజు స్వాగత మర్యాదలు జరిపి, విశేషా లడిగాడు.

ఈ మహామంత్రి విదురుడు దేశం విడిచిన నాటినుంచీ మహారాజు మనస్సు అశాంతితో నిండివుంది. ఆయనకు అన్నం రుచించడం లేదు; కంటికి నిద్ర రావడంలేదు. తెలియని ఆవేశంలో ఈ విద్వాంసుని మనస్సు నొప్పించినందుకు ఆయన ఎంతో బాధపడుతున్నాడు. తక్షణం తీసుకురమ్మని నన్ను పంపాడన్నాడు. విదురుడు సంజయునితో బయలుదేరాడు.

విదురుడు మళ్ళీ హస్తినాపురానికి తిరిగిరావడం, ధృతరాష్ట్రుడే ఆయనను పిలిపించడం దుర్యోధనునికి విపరీతవ్యధ కలిగించింది.

శకుని, దుశ్శాసన, కర్ణులతో సమావేశం జరిపి:

మళ్ళీ వచ్చాడు పాండవపక్షపాతి, విదురుడు. ఈ ధీమంతుడు మన మహారాజుతో మాట్లాడి పాండవులను వనవాసం నుండి తప్పించే ప్రయత్నం చేస్తాడు. అంతకంటె నాకు అవమానంలేదు. అవమానంకంటె అభిమానధనుడికి మరణం మేలు కనక నేను ఆత్మహత్య చేసుకోవడానికి నిశ్చయించుకున్నాను — అన్నాడు.

అది విని శకుని దుర్యోధనా! నువ్వు మరీ పసివాడిలా వున్నావు. సత్యప్రతిజ్ఞుడైన ధర్మరాజు తిరిగిరాడు. ఒకవేళ వచ్చినా మనం వారి పాలనలో లోపాలు కనిపెట్టి పదభ్రష్టులను చేద్దాం — అన్నాడు.

ఆ భావం దుర్యోధనుడికి నచ్చలేదని గ్రహించి, కర్ణుడు: రారాజా! మీ శ్రేయస్సుకోసం మేము ఏదయినా చెయ్యగలం. మనం ఇప్పుడే

వెళ్ళి పాండవులను అడవులలోనే సంహరిద్దాం. వారు ప్రస్తుతం క్లేశాలతో, దుఃఖభారంతో వున్నారు. ఈ సమయంలో వారిని కడతేర్చడం మనకు సులభం — అన్నాడు.

ఆ ఆలోచన అందరికీ ఆనందదాయక మయింది. ఆయుధాగారం వైపు నడిచారు వారు.

ఆ సమయానికి రాజధానికి వచ్చిన వ్యాసుడు వారి దుర్వ్యవసాయ వార్త విని, ఆ నలుగురినీ మందలించి, వారిని ఆ ప్రయత్నం నుండి విరమింపజేసి, ధృతరాష్ట్రునితో:

నాయనా, కుటుంబసభ్యులతో కలహం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. నువ్వు నీ బిడ్డలను అదుపులో వుంచుకో. ఈ దుర్యోధనుడు కొంతకాలంపాటు పాండవులతో అడువులలో తిరిగితే వారి సహవాసబలంవల్ల నయినా, వీడిబుద్ధి మారవచ్చు. పుట్టుకతో వచ్చిన బుద్ధులు మారవు. కాని మానవప్రయత్నం మంచిదికదా! అనగా, ధృతరాష్ట్రుడు:

మహర్షీ! ఈ జూదం వద్దని నేనెంతగా వారించినా వాడు విన లేదు. విదుర, భీష్మ, ద్రోణులతో, గాంధారికూడా చెప్పింది. అయినా పుత్రవ్యామోహంతో నేను అనుమతించాను — అన్నాడు.

అప్పుడు వ్యాసుడు: నాయనా పుత్రవ్యామోహం ఎంత బలీయమయి నదో నే నెరుగుదును. ఒకప్పుడు గోమాత సురభి కన్నీరు విడుస్తూ దేవేంద్రునిముందు నిలిచి:

ఓ అదితినందనా! ఈ కర్షకులను చూశావా? ఆ ఎద్దుల బలాన్ని పూర్తిగా నాశనం చేసికూడా యింకా నాగలికికట్టి, హింసించి, చేలు దున్నుకుంటున్నారు. బలంగావున్నంత కాలం పనిచేయించుకోవచ్చు కాని నీరసపడిన పసరాలను హింసించడం ధర్మమా — అంది.

అప్పుడు ఇంద్రుడు: సురభీ! నీకు వేలకొద్దీ సంతానంవున్నా యీ బాధపడే రెండు మూడు పశువులకోసం ఎందుకేడుస్తావు — అన్నాడు.

దేవేంద్రా! బిడ్డలందరూ నాకు సమానులే. అందునా నీరస దశలోవున్న వీటి మీద మరింత వాత్సల్యం వున్నది అంది.

విన్నావుకదా సురభి మాటలు: ఇప్పటికయినా నువ్వుక్లేశాలలో, ఆపదలోవున్న .పాండవులను దగ్గరకుతీసి ఆదరించు — అన్నాడు.

మహర్షీ! మీరు నన్ను అనుగ్రహించి ఈ విషయం మీనోటితోనే దుర్యోధనుడికి చెప్పి ఒప్పించండి, అని అర్థించాడు ధృతరాష్ట్రుడు.

అంతలో అక్కడికి మైత్రేయమహర్షి రావడం గమనించి వ్యాసుడు:

ధృతరాష్ట్రా! ఈ మైత్రేయుడు నీకూ, నీ బిడ్డలకూ శ్రేయస్సాధకమయిన మార్గం చెపుతాడు, అలా ప్రవర్తించు, అని నిష్క్రమించాడు.

## మైత్రేయుడు

ధృతరాష్ట్రుడు పుత్రసహితుడై మైత్రేయునికి స్వాగత మిచ్చి అతిథి సత్కారాలు సక్రమంగా నిర్వర్తించి సుఖాసనం అర్పించాడు. మైత్రేయుడు ఆసీను డయాడు.

ఋషిశ్రేష్ఠా! మీరు హస్తినాపురానికివస్తూ అరణ్యంలో పాండవులను చూశారుగదా! వారు సుఖంగాఉన్నారా? అరణ్య అజ్ఞాత వాసాల విషయమై తమ ప్రతిజ్ఞను మరచి పోలేదుగదా! కౌరవులమీద సోదరప్రేమ వారిలో అచంచలంగా ఉన్నదా? అని ధృతరాష్ట్రుడు ప్రశ్నించాడు.

మహారాజా! నేను తీర్థయాత్రలు సాగిస్తూ కురుజాంగలదేశాలు చేరబోయేముందు కామ్యకవనంలో ధర్మరాజాదులను చూశాను. రురు మృగ చర్మాలు ధరించి జటాజూటాలతో తపోవనంలో వారిని చూడటానికి ఎందరోఋషులు వచ్చారు.

నీ కొడుకులు దుర్బుద్ధులై అతినింద్యమైన ద్యూతం సాగించి మోసంతో పాండవులను ఓడించి అడవులకు పంపినట్లు విన్నాను. ఆ విధంగా వారిని పంపిన నీ బిడ్డలెలా ఉన్నారో చూడాలనే ఊహతో వచ్చాను. నీమీద నాకు స్నేహభావమూ ప్రేమా ఉన్నాయి. నువ్వూ భీష్ముడూ బ్రతికి ఉండగా

పాండవ ధార్తరాష్ట్రులు కలహించడం ఉచితంగా లేదు. సర్వస్వాతంత్ర్యాలూ ఉండి ఈ అన్యాయాన్నీ ఆ ఘోరాన్నీ చూస్తూ ఊరుకున్నావు. నీ మహాసభలో నీచప్రవర్తన జరిగినా ఉపేక్షించడంవల్ల తపస్విమండలంలో నీ ఖ్యాతి సన్నగిల్లింది. అని దుర్యోధనుని వైపు తిరిగి:

దుర్యోధనా! నీ శ్రేయస్సుకోరి నీ కొక హితవు చెపుతున్నాను విను. పాండవులపట్ల ద్రోహబుద్ధితో వరించకు. నీకూ పాండవులకూ లోకానికి సుఖశాంతులు కలిగే మార్గం చూడు. మహావీరులూ, సాహసపరాక్రమ సంపన్నులూ సర్వశ్రేష్ఠులూ అయిన పాండవులు దశసహస్ర గజబల సమన్వితులు, వజ్ర సదృశ దృఢకాయులు, సత్యవ్రత పరాయణులు కామరూపులైన హిడింబ కిర్మీరాది రాక్షసులను హతమార్చిన మహావీరులు.

ఇక్కడనుండి ప్రయాణం సాగిస్తున్నపుడు అర్ధరాత్రివేళ వారి దారి కడ్డంగా పర్వతాకృతితో నిలిచిన కిర్మీరరాక్షసుని పట్టుకుని భీమసేనుడు పశువును చంపినట్లు చంపాడు. దిగ్విజయ యాత్రాసమయంలో జరాసంధుడు భీమసేనుని హస్తాలలో నిహతులైనట్లు మీరెరుగుదురు. నందనందనుడైన శ్రీ కృష్ణభగవానుడు కూడా వారి మీద అభిమానంతోనే ఉన్నాడు. ద్రుపదరాజ పుత్రులు పాండవులకు బావమరుదులే కదా?

ఈ స్థితిలో పాండవుల కెదురు నిలిచి పోరాడగల మానవ ప్రాణి ఉన్నదా? దుర్యోధనా! నీవు క్రోధభావం విడిచి మహాశూరులైన పాండవులతో శాంతంగా ప్రవర్తించు, అన్నాడు.

మైత్రేయుడు హితబోధ చేస్తూంటే దుర్యోధనుడు పాదాలతో భూమిని దట్టిస్తూ ఏనుగు తొండంలాంటి చేతితో తొడ చరుస్తూ చిరునవ్వుతో ఆ మహర్షిమాటలు విననట్లే కూర్చున్నాడు.

మైత్రేయమహర్షికి దుర్యోధనుని ప్రవర్తన ఆగ్రహం కలిగించింది. ఆక్షణంలో ఆయన ఆచమనం చేసి:

ఓరీ మూఢదుర్యోధనా! నీ హితవుకోరి చెప్పినా నీకు వినపడలేదు. పైగా అనాదరభావంతో కాళ్ళు నేలరాస్తూ తొడ చరుస్తున్నావు. దీని

ఫలం అనుభవించక తప్పదు. నీ దురాలోచనలు కారణంగా కురు పాండవ సంగ్రామం సంభవించి తీరుతుంది. ఆ రణస్థలిలో భీమసేనుడు నీ తొడలు విరగగొట్టుగాక; అని శపిస్తూంటే ధృతరాష్ట్రుడు ముని పాదాలపై బడి క్షమాభిక్ష కోరుతూ శాపవిమోచనం అర్థించాడు.

కరుణ రస హృదయుడైన మైత్రేయుడు మహారాజా! దుర్యోధనుడు పాండవులను ప్రేమించి వారి రాజ్యం వారి కిచ్చి సఖ్యభావంతో ఉంటే ఈ శాపం తగలదు. లేదా శాపఫలం అనుభవించవలసిందే, అన్నాడు.

ధృతరాష్ట్రునికి భీమసేనుని బలం తెలుసుకోవాలనే కోరిక గలిగి కిర్మీర వధాఘట్టం వివరించమని మైత్రేయుని అర్థించాడు.

మహారాజా! నీ కొడుకు నా మాటలు వినడంలేదు . ఈ సమయంలో నేను ఇంక ఏమీ మాట్లాడదలచుకోలేదు. ఆ విషయం కావలిస్తే విదురుడు చెప్తాడు విను. నేను ఇక్కడ ఒక్కక్షణంకూడా ఉండను, అని వచ్చినవాడు వచ్చినట్లే వెళ్లిపోయాడు.

భీమసేనుని హస్తాలలో కిర్మీరుడు మరణించిన వార్తవిని దుర్యోధనుడు ఉద్విగ్న మనస్కుడై సభాస్థలి విడిచి వెళ్ళిపోయాడు.

ధృతరాష్ట్రుడు విదురునివైపు తిరిగి కిర్మీర భీమసేనుల సంగ్రామవార్త సమగ్రంగా వివరించమన్నాడు. విదురుడు చెప్తున్నాడు.

మహారాజా! మానవాతీతశక్తిగల భీముడు కిర్మీరుని వధించిన వృత్తాంతం కామ్యక వనంలో విప్రవరులు ప్రసంగించుకుంటూండగా విన్నది విన్నట్టుగా చెప్తున్నాను. హస్తినాపురం విడిచి మూడు అహోరాత్రాలు ప్రయాణంచేసి పాండవులు కామ్యకవనం చేరారు. అర్ధరాత్రివేళలలో భయం కరాకారులూ నరమాంసభక్షకులూ అయిన రాక్షసులు ఆ ప్రాంతాలలో చరించేవారు. అందువల్ల మునులూ అరణ్యవాసులూ ఆ వనం విడిచి వెళ్ళిపోయారు. అటువంటి భీకరారణ్యంలో పాండవులు అడుగుపెడుతూన్న క్షణంలోనే ప్రజ్వలితాగ్ని సదృశ నేత్రాలతో పర్వతగుహవంటి నోటితో ఒకానొక రాక్షసుడు వారి దారికి అడ్డంగా నిలబడ్డాడు. ఆ రాక్షసుని చూస్తూనే

స్థలచరాలూ పక్షులూ భయపడి పారిపోయేవి. అడవిజంతువులు కూడా వాని మేఘగర్జనలు విని చెల్లాచెదరైపోయేవి. ఆ రాత్రివేళ ప్రచండ వేగంతో వాయువు వీస్తున్నది. ధూళిరేగి ఆకాశంలో నక్షత్రాలు కూడా కనబడటంలేదు.

అటువంటి భీకరాకారుని అంతకుముందు చూడలేదు సరికదా వినలేదు పాండవులు. వాడు మైనాకపర్వతంవలె దారి కడ్డు నిల్చేసరికి ద్రౌపది భయంతో కన్నులు మూసుకున్నది. దుశ్శాసనుని దుష్టహస్తాలలో చిక్కిన కేశపాశపు చిక్కులు అలానే ఉన్నాయి. ఐదు మహాపర్వతాలమధ్య నదివలె ఉన్న పాంచాలి మూర్ఛపోయింది. పంచేంద్రియాలవలె పాండవులు ద్రౌపది యం దనురక్తులై ఆమెను ప్రక్కకు తీసుకు వెళ్ళారు.

వేదవిదుడైన ధౌమ్యుడు రాక్షసవినాశకరములు సక్రమ ప్రయోగార్హములు అయిన అథర్వణమంత్రాలతో కిర్మీరుడు ప్రయోగించే మాయాజాలాన్ని ఉపసంహరించాడు. దానితో కిర్మీరుడు క్రోధతామ్రాక్షుడైనాడు. వాడు బకాసురుని సోదరుడు కామ్యకవనంలో ఆ పరిసరాలలో మనుష్యులను భుజిస్తూ ఉంటాడు.

ఆ విషయం చెప్పి వారుకూడా తన కాహారం కాదలచి వచ్చారా? అని ప్రశ్నించాడు వాడు.

కిర్మీరా! నేను పాండురాజనందనుడను. యుధిష్ఠిరుడని ప్రజలు నన్ను పిలుస్తారు. బహుశః నీవు వినే వుంటావు. మా శత్రువులు జూదంలో మోసగించి ఓడించగా నేను నా సోదరులైన భీమార్జున నకుల సహదేవులతో సుఖంగా గడపవచ్చునని యిలా వచ్చాను, అన్నాడు ధర్మరాజు.

ఆ మాటలు విని కిర్మీరుడు యింతకాలానికి దేవతలు అనుగ్రహించారు. ఏకచక్రపురంలో తన సోదరుడైన బకాసురుని మంత్రబలంచేత సంహరించిన భీముని చంపాలని కత్తిపట్టుకు తిరుగుతున్న నాకీ నాటికి భీముడే తటస్థపడడం అదృష్టమే. నా మిత్రుడైన హిడింబాసురునికూడా సంహరించిన భీముని హతమార్చి ఆ రక్తంతో సోదరునికి తర్పణాలిచ్చి మిత్ర

ఋణంకూడా తీర్చుకుంటాను. అగస్త్యుడు వాతాపిని జీర్ణం చేసుకున్నట్లు భీముని జీర్ణించుకుంటాను, అంటుండగా:

ధర్మరాజు: కిర్మీరా! నువ్వు ఊహించినట్లు జరగదు. భీముణ్ణి నువ్వు ఏమీ చేయలేవు, అన్నాడు.

భీమసేనుడు సమీపంలో ఉన్న మహావృక్షం పీకి దాని ఆకులు దూసేశాడు. అర్జునుడు గాండీవ ధనుష్టంకారం చేశాడు. భీముడు అర్జునుని వారించి గర్జిస్తూ రాక్షసుని మీదపడి కాలదండంలా వున్న వృక్షంతో మోదడం మొదలు పెట్టాడు. వాడు చలించకుండా వజ్రసదృశాయుధం ప్రయోగించగా భీముడు ఎడమ కాలితో తన్నగా అది రాక్షసుని మీదనే పడింది. వాడు కుపితుడై ఒక వృక్షం లాగి భీమునిపై తిరగబడ్డాడు. వాలి సుగ్రీవులవలె వారు పోరాడుతున్నారు. అక్కడి వృక్షాలన్నీ అయిపోయాయి. మత్తేభ కుంభస్థలాల క్రింద తామర రేకులవలె మహావృక్షాలు నలిగి పోతు న్నాయి. రాక్షసుడు బండరాయి విసిరాడు. భీముడు స్తంభించి పోయాడు. ఆ సమయంలో వాడు సూర్యుని వైపు సాగే రాహువువలె ఉరకబోతుండగా భీముడు ఎదుర్కొన్నాడు. రెండు పెద్ద పులులు సంఘర్షిస్తూన్నట్లు వారు పోరాడుతున్నారు.

దుర్యోధనుని వల్ల జరిగిన అవమానం తన బాహుబలం, ద్రౌపదీదేవి ప్రసరించే ప్రేమవర్షం, భీముని క్రోధాగ్నిని రెట్టించగా రెండు బాహువులతోనూ ఆ రాక్షసుని పట్టాడు.

వెదురువనం బ్రద్దలవుతూన్నట్లు వారు ముష్టియుద్ధం సాగిస్తున్నారు. మహావాయువు విశాల వృక్షాన్ని పైకెత్తినట్లు భీముడు రాక్షసుని నడుంపట్టి పైకెత్తి త్రిప్పుతూ పశువును బంధించినట్లు తన చంకలో బిగించాడు.

భేరీలు బ్రద్దలవుతూన్నట్లు కిర్మీరుడు అరుస్తూంటే భీముడు గిరగిర త్రిప్పాడు.

వాడు శక్తి హీనుడై మూర్ఛపోయినట్లు గ్రహించి గొడ్డును బాదినట్లు బాది మోకాళ్ళతో త్రొక్కిపట్టి గొంతు నులిమేశాడు. రాక్షసుని గ్రుడ్లు గిరగిర తిరిగాయి. వాడు భీకరంగా గర్జిస్తూంటే,

ఓరి మహా పాపీ! యమసదనానికి వెళ్ళు. హిడింబ, బకాసురులు నిన్ను ఓదార్చి నీ ఏడుపు తగ్గిస్తారు, అని అనేక విధాల హింసించి వాని ప్రాణం పోతూన్న సమయంలో వదలిపెట్టాడు.

పాండవులు భీముని అభినందించి ద్రౌపదిని ముందుంచుకొని ద్వైత వనం వైపు సాగుతున్నారు.

ఈ వార్త విప్రవరులవల్ల నేను విన్నాను. అని విదురుడు చెప్పగా ధృతరాష్ట్రుడు వేడి నిట్టూర్పులు విడిచి విచారసాగరంలో మునిగాడు.

## బంధువులు

పాండవుల వనవాస వార్త విని వృష్ణి అంధక భోజ వంశీయులు ధృష్టద్యుమ్న ధృష్టకేతు కేకయ రాజనందనులు ధార్తరాష్ట్రులను నిందిస్తూ పాండవులను చూడటానికి వెళ్ళారు.

వారందరూ పరివేష్టించి ఉండగా శ్రీకృష్ణుడు ధర్మరాజుకు అభివాదం చేసి దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణాదు లందరి రక్తమూ పానం చేయాలని భూదేవి కోరుతూన్నది. రానున్న సంగ్రామంలో కౌరవు లందరినీ పుత్ర మిత్ర బంధుసమేతం సంహరించి ధర్మరాజుకు పట్టాభిషేకం చేయాలి. ఇతరులను మోసగించి సుఖభోగా లనుభవించే వారికి మరణమే శరణ్యం అని అరుణ నేత్రాలతో లేచి నిలబడ్డాడు.

అర్జునుడు శ్రీకృష్ణుని శాంతచిత్తుని చేసే సంకల్పంతో:

కృష్ణా! నువ్వు సర్వాంతర్యామివి తేజోమయ సత్యస్వరూపుడవు. అప్రమేయుడవు. సర్వలోక నాథుడవు. మహావిష్ణురూపుడవు. నారాయణ ఋషిరూపంలో సాయం గేహ నామంతో గంధమాదన పర్వతంమీద పదివేలసంవత్సరాలూ, జలాహారంతో పుష్కరతీర్థంలో పదకొండువేల సంవత్స రాలూ, బదరికావనంలో మూడుసంవత్సరాలూ తపస్సుచేశావు.

సరస్వతీ నదీతీరంలో సర్వస్వదక్షిణయాగం పండ్రెండు సంవత్సరాలు చేసి నీ ఉత్తరీయంకూడా దానమిచ్చావు, నిన్ను చూచి యితరులు

పుణ్యకర్మలు చేయడం నేర్చుకోవాలని ప్రభాస తీర్థంలో వెయ్యి సంవత్స రాలు ఒంటికాలిమీద నిలబడి ఘోర తపస్సు చేసిన యజ్ఞస్వరూపుడవు, సర్వలోకేశ్వరుడవు. దైత్య దానవ సంహారంచేసి శచీపతికి త్రిలోకాధిపత్యం ప్రసాదించిన నారాయణుడవు, అని అర్జునుడు స్తుతించాడు.

అప్పుడు ద్రౌపది: కృష్ణా నీకు సోదరినై, పాండవపత్నినై ధృష్టద్యుమ్నుని తోడబుట్టువునైన నన్ను కౌరవసభలోకి దుశ్శాసనుడు జుట్టుపట్టి ఈడ్చు కొచ్చాడు. నాకే యింతటి అవమానం జరిగితే ఇక యితర వనితాలోకం గతిఏమిటి? ఏక వస్త్రనే! రజస్వలనే!

లజ్జాభయకంపితురాలనై ఉన్న నన్ను రాజపరిషన్మధ్యంలోకి బలవం తంగా ఈడ్చుకువచ్చారు. మలినవస్త్రంతో ఉన్న నన్ను చూసి దుష్ట ధార్తరాష్ట్రులు వికటాట్టహాసం చేశారు.

పాంచాల పాండవ వృష్ణి వంశవీరు లందరినీ జయించినట్లే భావించు కొని నన్ను దాసిగా నియోగించడానికి సాహసించారు. ఈ పాండవసింహాలు తమ ధర్మపత్నికి దుర్భరమైన అవమానం జరుగుతూంటే చూస్తూ ఊరు కున్నందుకు వీరిని నేను నిందించకుండా ఉండలేకపోయాను.

భీముని బాహుబలమూ, అస్త్రవిద్యా మర్మవిదుడయిన అర్జునుని గాండీవమూ నిష్ప్రయోజనమే. నిండుసభలో తమ భార్యకు అవమానం జరుగుతూంటే నిర్లిప్తంగా ఊరుకోగలిగిన వీరి బల పరాక్రమ శౌర్యాల ప్రయోజన మేమిటి? ఈషణ్మాత్రం శక్తి లేనివాడు కూడా ఆత్మకళత్ర రక్షణకు యత్నిస్తాడే! భార్యకు రక్షణ లేకపోతే ఆమెవల్ల కలిగే సంతానానికి రక్షణ ఉంటుందా?

సంతాన సంరక్షణకదా ఆత్మశ్రేయో హేతువు. పురుషుడు తన ఆత్మనే స్త్రీ గర్భంలో ప్రవేశపెట్టి సంతానరూపంలో ప్రభవింపజేస్తాడు. కనకనే ఆమెను జా యా అని పిలుస్తారు. గర్భరూపంలో జన్మగ్రహణ జరుగుతుంది గనుక పత్నీ సంరక్షణ అవశ్యం.

శరణార్థినైన నాకు వీరు ఏ రక్షణా యివ్వలేకపోయారు. సర్వ జనశరణ్యుడవైన నిన్ను శరణు వేడాను. నీవల్ల రక్షణ పొందాను.

ఈ ఐదుగురివల్లా అయిదుగురుబిడ్డలు ప్రతివింధ్య, శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతకర్ములు, నాకు కలిగారు.

వారి రక్షణార్థమైనా వీరు నన్ను రక్షించవలసింది. నీ ప్రద్యుమ్నాదు లెంతటి మహాశూరులో నా తనయులూ అంతటి రథికులే. ధనుర్విద్యా పారంగతులు, అజేయులు అటువంటివారుకూడా ధార్తరాష్ట్రుల, అత్యాచారాలను సహించగలిగారు. కౌరవులు జూదంలో అన్యాయంగా రాజ్యం హరించి పాండవులను దాసులుగా చేశారు. ఆ సమయంలో నేను ఏకవస్త్రను; రజస్వలను నిండుసభలోకి తెస్తే గాండీవధారి అయిన అర్జునుడుకూడా చూస్తూ ఊరుకున్నాడు. భీమార్జునులూ నువ్వూ తప్ప ఇతరులు ఎక్కుపెట్టలేని గాండీవం వీరి దగ్గర ఉండి లాభమేమిటి! నన్ను రక్షించలేని భీమసేనుని బాహుబలం వ్యర్థంకాదా?

దుర్యోధనుడు అంతటి అత్యాచారం సాగించాక, ఒక్క ఘడియ జీవించడం కూడా కష్టమే. బ్రహ్మచర్యవ్రతదీక్షతో విద్యాభ్యాసంచేసే చిన్ననాడే పాండవులను కుంతీదేవితో సహా అకారణంగా రాజ్యంనుండి బహిష్కరించారు. భీముని భోజనంలో కాలకూటవిషం కలిపారు. ఆయుర్భాగ్యం ఉంది గనుక భీమసేనుడు విషాన్ని ఆరగించి జీర్ణశక్తి వృద్ధి చేసుకున్నాడు. ప్రమాణ కోటి తీర్థంలో ఒళ్ళు మరచి భీముడు నిద్రిస్తూండగా కాళ్ళు చేతులూ కట్టి నదిలో పారవేయించి తన కేమీ తెలియనట్లు వెళ్ళిపోయాడు దుర్యోధనుడు. భీముడు కళ్ళుతెరచి తనస్థితి చూసుకొని కట్లు తెంచుకొని ఒడ్డుకు చేరాడు. అంతటితో వారు తృప్తిపడలేదు.

నిద్రపోయే భీముని పాములచేత కరిపించారు. అయినా భీమునకు ప్రమాదము జరగలేదు. దుర్యోధనుని దురాగతాలకు అంతులేకుండా పోయింది. భీమసేనుని రథసారథిని తుద ముట్టించారు.

కుంతీసహితులై వారణావతంలో ఉండేటప్పుడు ఆ యింటికి నిప్పు పెట్టించారు. ఆనాడు కుంతీదేవి అనాథలా ఎంత దుఃఖించింది? ఆ సమయంలో ఈ భీమసేనుడు తల్లిని ఓదారుస్తూ గరుత్మంతునివలె ఎగిరే శక్తి తనకున్నదనీ వారందరినీ ఆ అగ్నిజ్వాలలనుండి రక్షిస్తాననీ కుంతీదేవిని

వామాంకం మీద ధర్మజుని దక్షిణాంకం మీద నకుల సహదేవులను భుజాలమీద అర్జునుని వీపుమీద ఎక్కించుకొని రక్షించాడు.

ఏకచక్రపురం చేరి వ్యాసమహర్షి ఆదేశానుసారం కాలం గడుపుతూ బకాసురుని వధించి పాంచాలనగరం చేరారు. భీష్మక మహారాజకుమార్తె యైన రుక్మిణిని నువ్వు చేపట్టినట్లు సవ్యసాచి సంగ్రామం సాగించి నన్ను గ్రహించాడు.

కృష్ణా! వీరాధివీరులైన భర్తలయిదుగురున్నా నాకీక్లేశాలు తప్పలేదు. ఈ ధౌమ్యులుకూడా మాతో వనవాసం చేయవలసివచ్చింది. వాసుదేవా! నా దుఃఖానికి అంతం లేదా! శోకాగ్ని జ్వాలాశిఖలలో నేను దగ్ధం కావలసిందేనా! దుష్టాత్ములు పెట్టే కష్టాలు అనుభవించ వలసిందేనా! ఎటువంటి వంశంలోపుట్టాను. ఏ వంశానికి కోడలినయాను. ఎటువంటి వారికి భార్యనయాను. అయినా దుష్టదుశ్శాసనుడు తన కర్కశ హస్తాలతో నా జుట్టుపట్టి ఈడ్చుకొచ్చాడు. అని ద్రౌపదీదేవి తలవంచి భోరు భోరున ఏడుస్తూ కొంతసేపటికి కన్నీరు తుడుచుకొని

కృష్ణా! నన్ను రక్షించడానికి భర్తలూ లేరు, బిడ్డలూలేరు, తండ్రిలేదు, సోదరులూ లేరు. బంధువులసలే లేరు. నువ్వుకూడా లేనట్లే. నీచులైన కౌరవులు నన్నలా అవమానిస్తుంటే మీలో ఏ ఒక్కరికీ క్రోధం రాలేదు సరికదా అభిమానమైన కలగలేదు. ఆఖరికి నా దీనదశ మీకు విచారాన్ని కూడా కలిగించలేదు.

ఆ సమయంలో కర్ణుడు నవ్విన నవ్వు నా హృదయాన్ని దహిస్తోంది. యదునందనా! నీకూ నాకూ ఉన్న సన్నిహితబాంధవ్యమూ అగ్నిగుండం నుండి ప్రభవించిన ఘనతా మన స్నేహమూ నన్ను గౌరవస్థానంలో ఉంచ డానికి చాలు. ఇవి కాక నన్ను సంరక్షించే సామర్థ్యం నీ కున్నది కనుక నన్ను కాపాడుతూ ఉండు — అంది.

సోదరీ! ఈనాడు నువ్వు దుఃఖిస్తూన్నట్లే జ్వాలా సదృశమయిన అర్జునుని బాణాల వేడిలో శత్రువు లందరూ హతమారిననాడు వారి భార్యలు ఇంతకంటే అధికంగా శోకించడం నీ కళ్ళతో నువ్వు చూడగలవు.

పాండవుల శ్రేయస్సుకోసం నా శక్తి సామర్థ్యాలన్నీ వినియోగిస్తాను. నీకు పట్టమహిషిత్వం ప్రాప్తించి తీరుతుంది. హిమవత్పర్వతం రజమయినా, భూగోళం విశీర్ణమయినా, మిన్నువిరిగి మీదపడినా సముద్రాలింకిపోయినా నామాట వ్యర్థంకాదు. అన్నాడు శ్రీకృష్ణుడు.

ద్రౌపదీదేవి నేత్రాలు అర్జునునివైపు తిరిగాయి. అర్జునుడు ద్రౌపదిని ఓదారుస్తూ కృష్ణుని మాటలు వ్యర్థంకావనీ అది అవశ్యం భావి అనీ అన్నాడు.

అప్పుడు ధృష్టద్యుమ్నుడు:

చెల్లీ! నేను ద్రోణుని సంహరిస్తాను. భీష్ముడు శిఖండి వంతు, భీమసేనుని చేతులలో దుర్యోధనుడూ, సవ్యసాచి హస్తాలలో కర్ణుడూ మరణిస్తారు. కృష్ణుడూ బలరాముడూ మాకు అండగా ఉండగా దేవేంద్రుడుకూడా మా ముందు నిలువలేడు. ఈ కౌరవులొక లెక్కా! అన్నాడు.

అక్కడి వీరులందరూ ఇంద్రనీల మాణిక్యకాంతు లీనే యదుసింహుని వైపు తమ దృష్టులు కేంద్రీకరించారు.

## శ్రీకృష్ణుడు

సర్వరాజలోకాన్నీ అవలోకించి శ్రీకృష్ణుడు: నేను ద్వారకలోగాని ద్వారకా నగర సమీపంలోగాని ఉన్నట్లయితే ఈ ప్రమాదం ఏర్పడేది కాదు. ధృతరాష్ట్రుడూ దుర్యోధనుడూ నాకు ఆహ్వానం పంపకపోయినా నేనే వచ్చి ఆ ద్యూతసభలో జరిగిన అన్యాయాన్ని ఖండించి వారికి దుఃఖం కలిగించేవాడిని.

సోదరులమధ్య ద్యూతం తగదని నిర్భయంగా చెప్పి వారించి ఉండేవాడిని. ఈ ద్యూతవ్యసనంతోనే వీరసేన మహారాజు కుమారుడైన నలుడు తన రాజ్యం కోలుపోయాడనీ అది సర్వనాశనహేతువనీ ఆ ఆలోచననే శాస్త్రాలు నిషేధించాయనీ స్పష్టంగా చెప్పి ఉందును. ద్యూతమూ, వేటా, మద్యపానమూ, నారీ లాలసహేలాజీవితమూ దుఃఖకారణాలనీ ఐశ్వర్యనాశనహేతువులనీ శాస్త్రజ్ఞులు ఘోషిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా ద్యూతం సర్వ

సంపదలనూ ఒక్కసారిగానే హరిస్తుంది. అయినా దానిమీద ఆసక్తిపోదు! ఆ వ్యసన మందిరానికిపోయి ఆ కఠోరవాక్యాలు వినడానికే జూదరి వ్యామోహపడతాడనీ ధృతరాష్ట్రునికి వివరించి, కురువంశానికి సుఖశాంతులు ప్రసాదించి ఉండేవాడిని. నా హితబోధ వారిచెవికెక్కకపోతే వారందరినీ హతమార్చి తీరుదును. ఏమైతేనేం! సమయం మించిపోయింది. నే నక్కడలేను. ఈ విషమపరిస్థితి ఏర్పడింది.

నేను ద్వారక వచ్చేసరికే ఈ సంఘటన జరిగిందని సాత్యకి చెప్పాడు. నా మనస్సు వికావికలై పోయింది. తక్షణం బయలుదేరి వచ్చాను. ఇటు వంటి దీన దశలో మిమ్మల్ని చూడవలసి వచ్చిందిగదా అని విచారిస్తున్నాను, అన్నాడు.

ధర్మరాజూ భీముడూ కృష్ణుని కౌగలించుకుని శిరస్సు ముద్దాడారు. కృష్ణార్జునులు గాఢాలింగనం చేసుకున్నారు. నకుల సహదేవులు కృష్ణునికి నమస్కరించారు. ధౌమ్యులు గౌరవపురస్సరంగా అవలోకించారు. ద్రౌపది కన్నీటితో పాదాభిషేకం చేసింది. వారందరివద్దా సెలవుతీసుకుని సుభద్రనూ అభిమన్యునీ వెంటబెట్టుకుని ద్వారకవైపు ప్రయాణం సాగించాడు. ధృష్టద్యు మ్నుడు ద్రౌపదీనందనులతో పాంచాలంవైపు పయనించాడు. చేది భూపతి ధృష్టకేతుడు, తనసోదరియైన నకులునిభార్యను (కరేణుమతి) పాండవాను మతితో వెంటబెట్టుకు వెళ్ళాడు. కేకయనందనుడు పాండవుల అనుజ్ఞపొంది తనదేశానికి వెళ్ళాడు. ధర్మజుని రాజ్యంలో నివసించే బ్రాహ్మణులూ వైశ్యులూ మాత్రం పాండవులను వదలి వెళ్ళడానికి సమ్మతించలేదు.

బంధు మిత్రులందరూ వెళ్ళిన అనంతరం బ్రాహ్మణుల అనుమతితో ప్రయాణం సాగించడానికి ధర్మరాజు రథాలను సిద్ధపరచమని ఆజ్ఞాపించాడు.

ధర్మరాజు సోదరులతో ద్రౌపదీదేవితో ధౌమ్యసమేతుడై రథారోహణం చేసి కామ్యకవనం విడిచి ముందుకు సాగబోతూ విప్రశ్రేష్ఠులకు గో హిరణ్య వస్త్రదానాలు చేశాడు.

శ్రీకృష్ణుడు సుభద్రాసహితుడై రథంమీద సాగుతూంటే వారివెనుకనే ఇంద్రసేనుడు మరొక రథంమీద సుభద్రయొక్క దాస, దాసీజనంతో

ఆమె వస్త్రాభరణాలను తీసికొని బయల్దేరాడు. కురుజాంగల దేశీయులైన బ్రాహ్మణులూ పౌరులూ ధర్మరాజుతో సంతోషంగా గడిపారు. ఆ దేశీయులు తమపై చూపే ప్రేమాభిమానాలకు వివశుడై ధర్మరాజు కొంతసేపు అక్కడే గడిపాడు. వారి అనురాగహృదయం ధర్మరాజుకు ఆనందం కలిగించింది. పాండవులు వారితో భాషించి సంతోషం కలిగించారు. పాండవుల దుస్థితి పౌరులకు విచారం కలిగించగా వారు, కన్నతండ్రివలె పరిపాలించే ధర్మరాజు మనలను విడిచి వెళ్ళిపోవడం ఎంత అన్యాయం? ధార్తరాష్ట్రుల దౌష్ట్యం ఎంత మితిమీరి పోయింది. శకుని నీచబుద్ధితో ఎంతటి పనిచేయించాడు. వాడెంత క్రూరుడు? పరమశివుని నివాసమైన కైలాసంలా ఇంద్రప్రస్థం నిర్మించి పరిపాలించే ధర్మరాజు మనలను విడిచి వెళ్ళవలసిందేనా? దేవమాయతో ఉపమింపదగ్గ మయసభాభవనం విడిచి వీ రెక్కడకు వెడతారు?

అలావారు ప్రసంగించుకుంటూంటే అర్జునుడులేచి అరణ్యవాసానంతరం ధర్మరాజు సర్వశత్రుసంహారం చేసి ఏకచ్ఛత్రాధిపతి అవుతాడు. మీ రందరూ ప్రసన్నచిత్తులై మా శ్రేయస్సును కోరుతూ భగవానుని ప్రార్థించండి, అనగా వారందరూ అర్జునుని అభినందించి పాండవులవద్ద సెలవుతీసికొని ఉదాసీనహృదయంతో తిరిగివెళ్ళారు.

ధర్మరాజు సోదరులనందరినీ ఉద్దేశించి:

పండ్రెండు సంవత్సరాలకాలం ఈ నిర్జనారణ్యంలో మనం నివసించాలి. అందుచేత దాని కనువైన ప్రదేశాన్ని అన్వేషించండి. జల, ఫల, పుష్పాలు సమృద్ధిగా లభించే చోటు చూడండి. పశు పక్ష్యాదులుకూడా చరించే ప్రదేశమే మన కవసరం. ఆ ప్రదేశాలలో పుణ్యపురుషులుకూడా ఉండాలని మరచిపోకండి - అన్నాడు.

అగ్రజా! మీరు యితఃపూర్వం మహామునుల సత్పురుషుల సన్నిధానంలో సంచరించినవారు. నారద ద్వైపాయనాది మహర్షులను సేవిస్తూ జితేంద్రియులై సర్వలోక మర్యాదలు తెలుసుకున్నవారు. దేవ గంధర్వ బ్రహ్మలోకాలు కూడా మీ రెరుగుదురు. బ్రహ్మతత్త్వమూ బ్రాహ్మణప్రభావమూ విదితపూర్వమే. ఈ ప్రపంచములో మీకు తెలియని విషయమూ

మీరెరుగని ప్రదేశమూలేవు. కనుక మీరు ఎక్కడ మంచిదని అనుకుంటే అక్కడే మేమంతా ఉండగలం.

నిర్మల జలపూర్ణ సరోవరాలతో సుందరసుమాలతో స్వాదుఫలాలతో రమణీయంగా ఉన్న ఈ ద్వైతవనంలో బ్రహ్మవిదు లెందరో ఉంటున్నారు. ఇదే మనకు వాసయోగ్యమైన ప్రదేశమని నాకుతోస్తోంది, అని అర్జును డనగా ధర్మరాజు సమ్మతించి బ్రాహ్మణ సమేతుడై ద్వైతవనంలోని సరోవరసమీపానికి వెళ్ళాడు.

ఆ ప్రాంతంలో నివసించే బ్రహ్మచారులూ, వానప్రస్థులూ తప స్సంపన్నులూ రతాగ్నిహోత్రపరాయణులూ అయిన బ్రాహ్మణు లందరూ ధర్మరాజును సమీపించి, ఆశీర్వదించి ఆహ్వానించారు.

తాల, తమాల, ఆమ్ర, అర్జున, కదంబ, కర్ణికార, నీప సాలవృక్షాలతో ఫల పుష్ప భరితమై చాతక, చక్రవాక, కేక, కోకిలాది పక్షిసంతతుల కల కలారవాలతో నేత్ర కర్ణ పర్వమై అలరారే ద్వైతవనంలో పర్వతసమదేహాలతో మత్తేభయూధాలు చరిస్తున్నాయి. ఆ ప్రాంతాలలోనే జటావల్కలధారులూ బ్రహ్మజ్ఞాననిష్ఠులూ అయిన సిద్ధులు పవిత్ర సరస్వతీనదీజలాలలో స్నానం చేసి నిత్యకర్మలతో అంతఃశుద్ధులవుతున్నారు, వారిని చూస్తూనే ధర్మరాజు రథందిగి వారందరికీ ప్రణామాలుచేసి ఆశీర్వాదాలు పొందాడు. ధర్మజుని దర్శనార్థం ఎందరో సిద్ధులూ చారణులూ వచ్చారు. వారందరి అనుమతితో వనమధ్యంలో ప్రవేశించి అక్కడ ఉండే తపస్వులకు గౌరవభాజను డయ్యాడు.

ధర్మరాజు సుగంధసౌరభసంపన్నమైన ఒకానొక వృక్షచ్ఛాయలో ఆసీను డయాడు. క్రమానుసారం భీమార్జున నకుల సహదేవులూ ద్రౌపదీదేవి సుఖోపవిష్టులయారు. సేవక జనం వాహనాలుదిగి ధర్మజుని సమీపంలో కూర్చున్నారు. ఉన్నతపర్వతాల మధ్య నివసించే మత్తేభయూధాలలో గజరాజులవలె లతానికుంజాలతో అలరారే ఆ ద్వైతవనంలో పాండవులు శోభిస్తున్నారు.

సరస్వతీనదీతీరంలో సాలవనందగ్గర ఆవాసం కల్పించుకొని ఆ ప్రాంతాల మునులకూ, యతులకూ, బ్రాహ్మణులకూ స్వాదుఫలాలర్పిస్తూ

వారిని సంతృప్తులను చేసి సంతోషంగా కాలం గడుపుతున్నారు. కన్న తండ్రివలె పురోహితధౌమ్యుడు వారిని ప్రేమిస్తూ వారిచేత యజ్ఞయాగాది సత్కర్మలూ, పితృకర్మలూ, సక్రమంగా నిర్వర్తింపచేస్తున్నాడు.

వనవాసదీక్ష సాగించే పాండవులవద్దకు ఒకానొక శుభసమయంలో మార్కండేయ మహర్షి అతిధిగా వచ్చాడు. ప్రజ్వలితాగ్నిశిఖా సదృశమైన కాంతితో అలరారే ఆ మహర్షి దేవ, మానవ, ఋషి జన సంపూజ్యుడు; తపస్సంపాదిత తేజోమయుడు. ఆయన రాకను గమనిస్తూనే ధర్మరాజు ఎదురేగి అర్ఘ్య పాద్యాలతో యధావిధిగా అర్చించాడు.

సర్వజ్ఞుడైన ఆ మునిచంద్రుడు వారందరిని కరుణాదృష్టితో వీక్షించి సంతృప్త చిత్తుడైనాడు. దరహసితవదనంతో అక్కడి మునిజనమధ్యంలో ఆసీనుడై వారందరినీ సంతోషంగా అవలోకించాడు. మార్కండేయుని ముఖకవళికలను గాఢంగా పరిశీలించి ధర్మరాజు;

మహర్షీ! నా అవస్థను చూసి చిరునవ్వు నవ్వుతున్నారు. దానికి కారణమేమిటో చెప్ప గోరుచున్నాను అన్నాడు.

ధర్మనందనా! సంతోషంతో నేను చిరునవ్వు నవ్వలేదు. నీ అవస్థ చూసేసరికి నాకు శ్రీరామచంద్రుడు జ్ఞప్తికి వచ్చాడు. జటావల్కల ధారియై ధనుర్బాణ హస్తుడై లక్ష్మణసమేతుడై పితృవాక్య పరిపాలనార్థం దండకారణ్యంలో చరించే శ్రీరాముని ఋష్యమూక పర్వతంమీద చూశాను.

కౌసల్యానంద వర్ధనుడు పుణ్యకర్మరతుడై అద్వితీయశక్తి సంపన్నుడై అలరారేవాడు. ధర్మనిర్వహణలో యమునికూడా శాసించగల వాడాయన. నముచి దానవుని సంహరించగల పరాక్రమసంపన్నుడు. అయినా పితృ పాదుల ఆజ్ఞానుసారం సర్వభోగాలనూ విడిచి ధర్మమార్గాన అరణ్యవాసం చేశాడు. పరాక్రమంలో ఇంద్రుడు. త్యాగంలో ఆయనే ప్రథముడు.

అధర్మానికి ఎంతమాత్రం తావివ్వలేదు. ఆయనకు పూర్వం నాభాగ భగీరథాది మహారాజులు చతుస్సముద్ర ముద్రిత భూవలయాన్ని సత్య ధర్మమార్గాన పరిపాలించి లబ్ధప్రతిష్ఠులై ఉత్తమలోకాలు పొందారు. కాశీ,

కరూషదేశాధిపతియైన అలర్కుడు సత్యధర్మాలకోసం రాజ్యభోగాలే విడిచి పెట్టాడు. వారందరి జీవితాలవల్లా మనకు తెలిసే దేమిటంటే బలం ఉన్నదిగదా అని అధర్మానికి దిగకూడదని స్వధర్మనిర్వహణవల్ల ఉత్తమగతులు ప్రాప్తిస్తాయి. విధివిహితంగా అగ్నిహోత్రాది నిత్యకర్మలు అనుష్ఠించేవారు దివ్యలోకంలో శాశ్వతానందం పొందుతారు.

పర్వతదేహాలతో దీర్ఘదంతాలతో ఉండే ఏనుగులుకూడ విధి ననుసరించి నలసినవే. ఈ జీవకోటి తన జన్మానుసారం విధ్యుక్తధర్మమార్గాన నడవ లేకాని దానిని త్రోసిపుచ్చేశక్తి వీనికి లేదు. శక్తి ఉన్నదికదా అని అధర్మంగా పోకూడదు.

కౌంతేయా! నువ్వు యథోచిత కర్మాచరణవల్ల అందరికీ గౌరవ భాజనుడ వయ్యావు. స్వధర్మనిర్వహణమే నీకు అగ్ని సూర్యులతో సమమైన కాంతి నిస్తున్నది. నీ ప్రతిజ్ఞానుసారం ఈ వనవాసదీక్ష పరిసమాప్తంకాగానే కౌరవులను జయిస్తావు. రాజ్యలక్ష్మి నిన్ను వరిస్తుంది. ధర్మబద్ధుడవై సత్కర్మలు ఆచరిస్తూసుఖంగా ఉండు, అని పలికి మార్కండేయుడు ఉత్తరదిశాభిముఖుడై వెళ్ళిపోయాడు.

## ద్రౌపది

వనవాసం సాగుతోంది.

ఒకనాడు పాండవు లందరూ చింతాపూరిత హృదయంతో సంభాషించు కుంటూండగా ద్రౌపదీదేవి ధర్మరాజు నుద్దేశించి:

మహారాజా! దుష్టదుర్యోధనుడికి మన దుస్థితి ఏమాత్రం పరితాపాన్ని కలిగించదు. నీచుడైన ఆ క్రూరుడు మృగచర్మాలు కట్టించి మనలను వన వాసానికి పంపినందుకు ఈషన్మాత్రం పశ్చాత్తాప పడడు. వాడి హృదయం ఇనుముతో చేశారు. కనుకనే నీ వంటి సత్పురుషులను అంత కఠోరంగా అవమానించి అనుచరసమేతుడై ఆనందడోలికలలో ఊగుతున్నాడు. నీవంటి ధర్మప్రకాశుడు కూడా వల్కలాజినాలు ధరించవలసిన స్థితి కలిగిందే అని

కురు సభాభవనమంతా విచారించిందే కాని దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులు మాత్రం విచారరేకలైనా చూపలేదు.

హంసతూలికా తల్పాలమీద ఆనందభోగాలు అనుభవించవలసిన మీరు ఈ గడ్డిమీద శయనించవలసి వచ్చింది. రత్నఖచిత దంత వినిర్మిత సింహాసనాలమీద రాజపరిషన్మధ్యంలో విరాజిల్లవలసిన మీరు ఈనాడు ఈ దర్భాసనాలమీద కూర్చోవలసి వచ్చింది. దివ్యచందన చర్చలతో ఉదయభానుని వలె ప్రకాశించే మీరు ధూళి ధూసరిత దేహులై మెలగవలసివచ్చింది. చీని చీనాంబరధారులు వల్కలాలు కట్టవలసివచ్చింది. సహస్రాధిక బ్రహ్మవిదుల పంక్తిని హేమ పాత్రలలో ఆరగించవలసిన వారు ఈ స్థితిలో ఉండవలసి వచ్చింది. ఎందరో యతులు, బ్రహ్మచారులు అను దినమూ అతిథులుగా వస్తూంటే వారందరికీ స్వాదురసభోజనాలు సమకూర్చే శక్తి కలవారు అరణ్యాలపాలై కందమూలఫలాలు ఆరగించవలసి వచ్చింది. ఇంతకంటే విచారించదగ్గ విషయాలేమున్నాయి.

మహాబలసంపన్నులైన నీ సోదరులుకూడా యీ స్థితిలో ఉండడం అనవసరమేమో అనిపిస్తోంది. ఎటువంటి శత్రువుకైనా వెన్నుచూపని భీమసేనవీరుడు యిలా విషాదంతో ఉంటే మీరెలా సహించగల్గుతున్నారు? శత్రువుల మీద మీకు ఈషన్మాత్రమైనా క్రోధం ఎందుకు కల్గటంలేదు? యుద్ధభూమిలో శత్రువీరులను అవలీలగా చీల్చి చెండాడే మహాశక్తిగల భీముడు మీ మాట దాటలేక ఈ కష్టాలు పడుతూ శత్రువులను ఉపేక్షిస్తున్నాడు.

కార్తవీర్యార్జునునితో ఉపమింపతగ్గ పరాక్రమంగల సవ్యసాచికూడా ఈ అవస్థపాలుకావలసి వచ్చింది. ఆ మహావీరుని ధనుస్సుకు భయపడిగదా రాజలోకమంతా రాజసూయ సమయంలో తలలు వంచింది. దేవ, దానవ, మానవ, నాగజాతులను జయించగల ఆ మహావీరుని శక్తికి తట్టుకోలేకగదా అశ్వ, గజ, రథ, రత్నరాసులు కానుకలుగా పోశారు. ఏకకాలంలో అయిదు వందల బాణాలు విడువగల ఆ మహాశూరుడు యిలా దుఃఖిస్తూంటే కూడా మీకు శత్రువులమీద ఎందుచేత రోషం కలగడంలేదో నా కర్థంకావడంలేదు.

అసమానసుందరుడు శ్యామవర్ణుడు, ఘనకార్యనిర్వహణదక్షుడు, ఖడ్గ యుద్ధనిపుణుడు అయిన నకులుడు యింత కష్టపడుతుంటే మీరెంత మాత్రం శత్రువులవిషయం ఆలోచించటంలేదు. పరమ మోహనాంగుడయిన వీరసహదేవుని విషాద వదనం చూసినా మీకు శత్రువులమీద ద్వేషభావం ప్రకోపించడంలేదు. ద్రుపదరాజపుత్రినై పాండురాజు కోడలినై ధృష్టద్యుమ్ను సోదరినై పాండవ పత్నినై నేను కూడా ఈ అవస్థలు పడవలసి వచ్చింది. అయినా మీరు సహనమే ప్రదర్శించడం ఉచితం కాదు. అసలు మీలో క్రోధం వున్నదా అని? సోదరులూ భార్యా యింతటి అవస్థ పడుతున్నా మీకు విచారమే లేదు.

'క్షరతే ఇతి క్షత్రం' అని కదా క్షత్రియ శబ్దార్థం. దుష్టనాశనార్థం క్రోధం క్షత్రియుల కవసరం, అది మీలో లేదు, క్రోధంలేని క్షత్రియు డుంటాడా! అవసరం వచ్చినప్పుడు క్షాత్రధర్మం ప్రదర్శించని వానికి గౌరవం లేదు. తిరస్కారమే ప్రాప్తిస్తుంది.

క్రోధా సహనాలకు సమయా సమయాలున్నాయి. సమయానుసారంగా వానిని ప్రదర్శించాలి. సహనసమయంలో సుఖాలకు దూరమైనా జీవకోటి వైముఖ్యం ప్రదర్శించినా శాంతంతోనే వుండాలి.

బలి తన పితామహుడయిన ప్రహ్లాదుని చేరి,

తాతా! సహన క్రోధాలలో శ్రేష్ఠమయిన దేదో నాకు వివరంగా చెపితే ఆ మార్గాన నడుస్తాను, అన్నాడు.

అప్పుడు ప్రహ్లాదుడు:

నాయనా! సహనం మంచిదే కాని సర్వసమయాలలోనూ దానినే అవలంబించడం మంచిదికాదు. అదేవిధంగా క్రోధంతోనూ ఉండ కూడదు. సర్వవేళలా సహనంతోనే ఉంటే శత్రువులూ, సేవకులూ, తటస్థులూ నిర్లక్ష్య భావంతో చూస్తారు. అందుచేతనే విజ్ఞులు సమయానుసారం సహనం ప్రదర్శిస్తారు.

నిరంతరం ఓరిమి వహించే చక్రవర్తియొక్క సేవకులు అకార్యా చరణకు సంకోచించరు. మహారాజభోగాలను భృత్యులే అనుభవించటానికి ప్రయత్నిస్తారు. వారిలో సేవాభావం నశిస్తుంది. సేవకుల అవహేళనకు పాల్పడవలసివస్తుంది. అంతకంటె మరణం నయం. రాజస్త్రీలను, నారీ జనాన్నీ అవమానించడానికి కూడా ప్రయత్నిస్తారు. దండనీతిని విడిచి సదా క్షమాహృదయంతో ఉండే యజమానికి అనుచరులు ప్రమాదాలు కలిగిస్తారు. ఓర్పు ఇన్ని అనర్థాలకు మూలం.

ఇక క్షమారహితుల విషయం కారణం లేకుండా సదా క్రోధంతో ప్రవర్తించే మానవుడూ, మంచి చెడ్డలు ఆలోచించకుండా దండనీతిని ప్రయోగిస్తూ దురాగ్రహంతో ఆప్తమిత్రులకు కూడా దూరమవుతాడు. ఆత్మీయులూ, ఇతరులూ కూడా వానిని ద్వేషిస్తారు. క్రోధస్వభావుడు అందరినీ అవమానిస్తూ శత్రువులను సృష్టించుకుంటాడు. క్రోధపరవశుడై క్రూరదండనలు సాగిస్తూ సర్వాన్నీ కోల్పోయి ఆఖరుకు ప్రాణంకూడా పోగొట్టుకుంటాడు.

హితులతోనూ అహితులతోనూ కటువుగా భాషిస్తాడు. విషం క్రక్కే పామును చూచినట్లు క్రోధస్వభావుని చూస్తారు. సమయంచూసి వానిపై కసి తీర్చుకుంటారు.

కనక నిరంతరం క్రోధంతో ఉండకూడదు; సహనంతోనూ సంచరించకూడదు. సమయానుసారం ప్రవర్తించాలి. అలా చరించేవాడు ఇహపరసుఖాలు పొందుతాడు. నీ వల్ల ఉపకారం పొందినవాడు నీకు అపచారం చేసినా వానిని క్షమించాలి. ఈ ప్రపంచంలో ప్రజలందరికీ వివేచనాశక్తి ఉండదు.

తెలియక అపరాధం చేస్తే వారిని క్షమించాలి. తెలిసి అక్రమంగా చరించినట్లయితే శిక్ష తప్పదు. ప్రాణులన్నిటికీ ప్రథమాపరాధం క్షమార్హమే. రెండవమారు దోషం స్వల్పమయినా కఠినశిక్ష తప్పదు. శిక్షించడానికి ముందు విచారణ జరిపి దోషనిర్ణయం చేసి దోషి అజ్ఞుడో విజ్ఞుడో నిర్ణయించి శిక్షించాలి. మనుష్యుడు మృదుస్వభావంతో మెలగగలిగితే శత్రువు

లందరూ అతని వశంలో ఉంటారు. అటువంటివానికి వశంకాని వస్తువే లేదు.

దేశకాల పరిస్థితులనూ బలాబలాలనూ గ్రహించి, సామోపాయంతో కార్యం సాధించుకోవాలి. అపరాధి శరణార్థియై వస్తే క్షమించి తీరాలి. పరిస్థితులు విపరీతమైనప్పుడే తేజోబలాలు ప్రదర్శించాలి అని చెప్పాడు.

ధర్మనందనా! దుష్టదుర్యోధనుడు ఎప్పుడూ మీకు ద్రోహమే తల పెడుతున్నాడు. కనక వానిపై ప్రతీకారం తీసుకోక తప్పదు. కౌరవుల విషయంలో సహనం అనవసరం మృదుస్వభావంతో ప్రజాహృదయాలను ఆకర్షిస్తూ క్రోధంతో వారి ఆగ్రహానికి గురి కాకుండా న్యాయంగా పరి పాలించేవాడు ఉత్తమప్రభువు, అని పలికి ద్రౌపది కొనగోట కన్నీరు తుడుచుకుంది.

## సహనశక్తి

అప్పుడు ధర్మరాజు ఆమెవైపు తిరిగి:

ద్రౌపదీ! మానవులకు క్రోధం మరణహేతువు. దాన్ని జయించినవానికి అభ్యుదయపరంపరలు ప్రాప్తిస్తాయి. క్రోధవశులకు పతనమే. సర్వనాశ హేతుభూతమైన క్రోధాన్ని ఆశ్రయించి నేను శత్రువులపై ప్రతీకారచర్య తీసుకోలేను.

ఆగ్రహం కలిగితే గురుహత్యకు కూడా మానవుడు వెనుదీయడు. పరుషవాక్యాలతో పరులను పరాభవింప జేసేదీ, అకార్యాచరణకు ప్రేరే పించేదీ, సజ్జనులను కూడా చంపించేదీ, దుర్మార్గులను పూజింపచేసేదీ, ఆత్మహత్యకు సహకరించేదీ అయిన క్రోధం యమలోకానికే దారితీస్తుంది.

కనుకనే ప్రాజ్ఞులు క్రోధాన్ని పరిత్యజించి యిహ పరాలలో ఉత్తమ గతులు పొందుతున్నారు. ఎదుటివాడు ఆగ్రహంతో వచ్చినా ప్రాజ్ఞుడు సౌమ్య స్వభావంతో ప్రవర్తించి ఉభయులకూ క్షేమం కలిగిస్తున్నాడు. మనో నిగ్రహంలేక ఆగ్రహంతో చరించేవాడు ఇహపరాలకు దూరు డవుతున్నాడు. అసమర్థులపై క్రోధం ప్రదర్శించని వాడే ఉత్తమపురుషుడు.

అవివేకులూ మూర్ఖులూ క్షమను విసర్జిస్తారు.

వారివలె నేనుకూడా సదాచారాలకు హేతుభూతమైన క్షమను ఎలా విడువగలను? భూదేవితో సమానమైన ఓర్పుకల మానవులే లేకపోతే ఈ ప్రపంచంలో నిరంతరం యుద్ధాలే జరుగుతుంటాయి. అధర్మ హేతువైన క్రోధం పరస్పరదూషణలకూ హత్యలకూ దారితీస్తుంది. భార్యా భర్తలూ, తండ్రీ కొడుకులూ తమ సంబంధ బాంధవ్యాలు విస్మరించి ఒకరి నొకరు చంపుకోడానికి వెనుదీయరు. ఈ స్థితిలో ప్రపంచానికి సుఖమూ శాంతీ ఎలా లభిస్తాయి?

యాజ్ఞసేనీ! ఈ కాలం భరతవంశ నాశనం కోసం ఎదురుచూస్తోంది. దుర్యోధనునికి సహనంలేదు సరికదా దానిని గుర్తించే అర్హతలేదు. నేనో సదా సహనంతోనే చరిస్తున్నాను. దాని నాశ్రయించే అర్హత నా కున్నది. క్షమ దయా లనే రెండుగుణాలే జితేంద్రియులకు ఆవశ్యక మైనవని సనాతనధర్మవిదులు ఘోషిస్తున్నారు. కనకనే నేను దయా క్షమలనే ఆశ్రయించి గౌరవిస్తున్నాను. అని అన్నాడు.

## నాస్తికవాదం

ధర్మరాజు ప్రసంగం సమగ్రంగా ఆకర్ణించి ద్రౌపది:

మహారాజా! నీ విజ్ఞానాన్ని మోహసాగరంలో ముంచిన పరమేశ్వరునీ, ప్రారబ్ధాన్నీ ప్రణామాలతో అర్చిస్తున్నాను. పితృ పితామహులు పోయిన సదాచార మార్గానుసరణ విషయంలో మీరు కొంచెం విపరీతంగా ప్రవర్తిస్తున్నారేమో అని నా కనిపిస్తోంది. మానవుడు తాను చేసే కర్మం ననుసరించి ఉత్తమ, మధ్యమ, అధమ జన్మలు ఆ యా లోకాలలో అనుభవించే పర్యంతం కర్మ నాశనం కాదు. కనుకనే కర్మకు నిత్యత్వం సిద్ధించింది. కర్మఫలాన్ని నిర్లక్ష్యం చేసి మూర్ఖులు లోభబద్ధులై మోక్షాకాంక్షతో ఉంటారు. ధర్మమూ, సాధు స్వభావమూ, క్షమా, వినయమూ, దయా లభిగాగలవన్నీ కర్మఫలానుసారమే ప్రాప్తిస్తాయి. ఇప్పుడు మీరు దుఃఖభాజనులు కా నవసరం లేదు. మీరుకాని సోదరులుకాని ఇంతవరకూ అధర్మమార్గాన

చరించలేదు. అప్రియ కార్యాచరణకు తలపోసినదీ లేదు. ధర్మయుతంగానే మీ జీవితనౌక సాగిస్తూన్నట్టు గురుజనులూ, దేవతలూ, బ్రాహ్మణులూ గమనించారు.

అవసరమైతే ధర్మరక్షణార్థం భీమార్జున నకుల సహదేవులనూ నన్నూ కూడా మీరు విడువగలరు. ధర్మవిషయంలో మీ పట్టుదల అంతటిది. నేనెరుగుదును. ధర్మరక్షణచేసే ప్రభువును ధర్మమే రక్షిస్తుందని నేను పెద్దలవల్ల విన్నాను. కాని అది మీ విషయంలో విపరీతంగా కనిపిస్తోంది.

నీడ మానవుని వెనువెంట నడిచేటట్లు మీ బుద్ధి ఎప్పుడూ ధర్మ పథంలోనే చరిస్తుంది. చతుస్సముద్రవలయిత భూమండలానికి అధిపత్యం వహించినా మీరెన్నడూ అహంకారంతో, మదంతో ప్రవర్తించలేదు. ఎవరినీ అవమానించడానికి సంకల్పించలేదు.

కాని —

దురాత్ములు కుట్రపన్ని ఆహ్వానించిన కపటద్యూతసమయంలో మీ బుద్ధికుశలత విపరీతంగా నడిచినందువల్లనే సర్వసంపదలనూ ఆయుధా లనూ, రాజ్యాన్నీ, సోదరులనూ ఆఖరికి భార్యనైన నన్నూ పణం పెట్టి ఓడిపోయారు.

మహారాజా! మీరు సౌమ్యస్వభావులు, ఉదారహృదయులు సత్య వాక్పరిపాలకులు లజ్జాసంపన్నులు. ఇన్ని సద్గుణాలు మూర్తీభవించిన మీరు ద్యూతదుర్వ్యసనానికి ఎలా లొంగిపోయారో నా కర్థమవటంలేదు. ఇన్ని విపత్తులలో చిక్కుకున్న మిమ్మ చూస్తూంటే నాకు దుఃఖం ఆగటంలేదు.

ఒకటి మాత్రం నిజం. మానవజాతిలో ఎవడూ స్వశక్తిమీద ఆధారపడి ఏ పనీ చేయలేడనీ, పరమేశ్వర సంకల్పానుసారమే నడుస్తారనీ నమ్మక తప్పదు. ఈ జీవకోటి కర్రబొమ్మలవలె ఈశ్వరసూత్రధారి చేతులలో ప్రదర్శనా లిస్తూంటారు. ఆకాశంవలె పరమేశ్వరుడు సర్వవ్యాపియై జీవుల కర్మానుసారం సుఖదుఃఖాలను ప్రాప్తింపజేస్తాడు ఏ జీవికీ స్వతంత్రంగా చరించే అధికారం లేదు. పంజరంలో పక్షిలా ప్రాణి ఈశ్వరాధీనంలో

ఉంటుంది. ఈ జీవికి ఎవరిమీదా అధికారం లేదు. అంతేనా! తనమీదనే తన కధికారం లేదు. సూత్రబద్ధమైన మణిలా ముక్కుత్రాడుతో బంధింపబడ్డ వృషభంలా, గట్టుమీదనుండి విరిగిపడి మహాప్రవాహంలో పోయే వృక్షంలా దేహధారియైన జీవుడు పరమేశ్వరాధీనుడై పోతూఉంటాడు.

జీవుడు ఈశ్వరాధీనుడేకాదు; ఆ శక్తిచేత ఆచ్ఛాదితుడు. కనుకనే కాలగతిని గుర్తించలేడు. అజ్ఞానియైన జీవుడు రానున్న సుఖ దుఃఖాలను గుర్తించలేక ఈశ్వరప్రేరితుడై కొన్ని కర్మలు ఆచరించి ఆ కర్మఫలానుభవం కోసం స్వర్గానికో నరకానికో పోతాడు. గాలిలో గడ్డిపోచవలె ఇహపరాలమధ్య యాత్ర సాగిస్తూఉంటాడు. పుణ్యకర్మలు చేసే వారిలోనూ పాపాచారరతుల లోనూ ఈశ్వరు డుంటాడు. ఆ ఈశ్వరుడు జీవులకు శరీరాలను సాధనంగా ఉపయోగిస్తున్నాడు. శుభాశుభఫలాల నిచ్చే ద్వివిధకర్మలనూ ఈశ్వరుడే చేయిస్తున్నాడు. మాయతో జీవకోటిని మోహింపజేసి ఒక జీవిచేత మరొక జీవిని హింసింప జేస్తున్నాడు.

పరమేశ్వరతత్త్వం మహర్షులకే అవగతం. ఎడారిలో ఎండమావులవలె ఈ మోహసముద్రం అజ్ఞులను వ్యామోహింపజేసి బిన్న భిన్న వస్తురూపాలలో ఈ జగత్తును ప్రదర్శిస్తోంది. కాని పరమేశ్వరుడుమాత్రం సర్వజీవులనూ ఒకే విధంగా సృష్టించి లయింపజేస్తున్నాడు. శిలలూ, లోహాలూ, కర్రలూ వానిచేతనే అవి ముక్కలు చేయబడేటట్లు పరమేశ్వర మాయ ఈ జీవులను జీవులచేతనే నశింపజేస్తున్నది. ఆటవస్తువులతో పిల్లలు ఆడుకొని సంతోషించేటట్లు ఈశ్వరుడు ఈ ప్రాణికోటిని సృష్టించి లయింప చేస్తూ ఆనందిస్తాడు.

అయితే అతీంద్రియశక్తిసంపన్నుడైన ఈశ్వరుని మాత్రం ఈ కర్మ బాధించలేదు. ఇటు దుర్యోధనునీ అది బాధించటంలేదు. కనకనే నేను విచారిస్తున్నాను. అంది.

అప్పుడు ధర్మరాజు:

యాజ్ఞసేనీ! నీ ప్రసంగం మనోహరంగా ఉంది. అయితే అజ్ఞానవశంచేత నాస్తికత్వాన్ని ప్రతిపాదిస్తున్నావు. నేను కర్తవ్యానుసారం యజ్ఞ దానాది

కర్మలు చేస్తున్నానే కాని ఫలాపేక్షతో మాత్రంకాదు. ఈగార్హస్థ్యకర్మ నిర్వహణ వల్ల దానిఫలం నాకు ప్రాప్తిస్తే ప్రాప్తించవచ్చు. సత్పురుషుల ఆచార వ్యవహారాలను శాస్త్రమర్యాదలను తెలిసికొని ధర్మమార్గాన చరించినందువల్ల తత్ఫలం లభిస్తుందనే లోభం నాకులేదు. ఫలాపేక్షతో చేసే ధర్మకార్యాలను విజ్ఞులు హీనంగా చూస్తూ నిందిస్తారు. పాపులు ఫలాపేక్షతో ధర్మాచరణ చేస్తూ ధర్మాన్నే శంకిస్తూ నాస్తికులై స్వార్థపరు లవుతారు. వారికి ధర్మఫలం మాత్రం లభించదు. ఎన్నో శాస్త్రాలు అవలోకించి ఆచారవ్యవహారాలు గ్రహించి ఈ విషయం నీకు చెపుతున్నాను.

ఆర్షప్రోక్తమైన ఉద్గ్రంథాలకు విపరీత వ్యాఖ్యానాలుచేస్తూ శాస్త్రాచారాలు అతిక్రమించేవాడు ఎన్ని జన్మలెత్తినా సుఖం పొందలేడు. మహర్షుల ఆదేశాలనూ, విజ్ఞుల ఆచరణనూ ప్రమాణాలుగా గ్రహించి ఆచరించే వానికి ఇహ పరాలలో ఉత్తమస్థితి కలుగుతుంది. కావున సర్వజ్ఞులూ మహాద్రష్టలూ అయిన ఋషులు ప్రతిపాదించిన ధర్మలను శంకించకూడదు. దూరదేశాలతో వాణిజ్యం సాగించేవాడు సముద్రతరణానికి ఓడను ఆధారం చేసుకునేటట్లు స్వర్గలోకం వాంఛించే మానవుడు ధర్మకర్మాచరణతో సంసార సాగరం దాటాలి. మహాపురుషులు ఆచరించే ధర్మం ఫలరహితమయితే ఈ ప్రపంచానికి అంధకారమే శరణ్యం. ఆనాడు జ్ఞానులకు కూడా మోక్షం లేదు. అప్పుడు మానవజాతి పశుప్రవృత్తిలో పడిపోతుంది. సద్యఃకాలంలో ధర్మఫలం ప్రాప్తించలేదని ఈశ్వరునీ ధర్మాన్నీ శంకించి నిందించకూడదు.

ధర్మరాజు తన ఉపదేశం ముగించగానే ద్రౌపది తనకు ధర్మంమీద ఉపేక్షాభావంలేదనీ దాన్ని నిందించటం లేదనీ జీవకోటిని సృష్టించి పాలించే పరమేశ్వరుని తిరస్కరించే ఊహకూడా తనకు లేదనీ శోకసాగరంలో మునిగిపోవడంవల్లనే అలా మాట్లాడవలసి వచ్చిందనీ అంటూ:

మహారాజా! స్థావరాలయిన వృక్షాలూ పర్వతాలూ తప్ప మిగిలిన జీవకోటి అంతా ఏదో ఒక కర్మ చేస్తూనే ఉన్నది. ఆవుదూడలు పాలుత్రాగి చల్లని నీడలో విశ్రాంతి పొందుతున్నాయి. ఆదేరీతిగా జీవులన్నీ తమ తమ కర్మ లాచరిస్తూ ఆనందంగా జీవిస్తున్నాయి. మానవుడు మంచి కర్మ చేసి ఇహపరాలలో సుఖశాంతులు కోరుతున్నాడు.

జలప్రాంతాలలో చేపలకోసం నిలబడే కొంగలవలె ప్రాణులన్నీ ఏదో ఒక వృత్తిని ఆశ్రయించి జీవధారణ చేస్తున్నాయి. ధాత విధాత సృష్టిపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఏ పనీ చేయని జీవికి జీవితలక్ష్యం సిద్ధించదు.

ప్రారబ్ధాన్ని నమ్మి మన పనులు మానకూడదు. జీవితం కర్మాశ్రయంతోనే సాగుతుంది. మీరుకూడా కర్మకవచం ధరించి కృషిచేయాలేకాని విచారంతో కూర్చోకూడదు. సత్కర్మలు ఆచరించేవారు నూటి కొక రుంటారో లేదో తెలియదు.

ధనసంపాదనకూ దాని రక్షణకూ అభివృద్ధికీ తగిన కార్యాలు చేయకపోతే హిమవత్పర్వత సదృశధనరాశికూడా లుప్తమై పోతుంది. సర్వప్రాణులూ కర్మను విసర్జిస్తే ప్రళయమే ప్రాప్తిస్తుంది. కర్మ ఫలరహితమే అయిననాడు ప్రజావృద్ధి లేదు. ఒక్కొక్కప్పుడు ప్రజలు వ్యర్థకర్మలు చేస్తారు. ఏమంటే ఏపనీ లేకపోతే జీవితం గడవదు కనుక.

కేవలం అదృష్టాన్ని విశ్వసించి, జరిగినట్లే జరుగుతుందనీ అనుకొన్నవన్నీ అనుకొన్నట్లే లభిస్తాయనీ ఏ పనీ చేయకపోయినా ఫలం, లభించకపోదనీ వాదించటం మూర్ఖత్వమే.

పురుషార్థం గ్రహించి కర్మచేసే వారే ప్రశంసనీయుడౌతాడు. అంతేకాని ప్రారబ్ధాన్ని నమ్మి ఏ పని చేయకుండా సోమరిగా నిద్రించేవాడు, పచ్చి కుండలోని నీరువలె నిష్ప్రయోజకుడవుతాడు. అటువంటివాని ఆయుర్దాయం కూడా అల్పమే.

అకస్మాత్తుగా అప్రయత్నంగా ధనం లభిస్తే అది వాని అదృష్టమని లోకులంటారు. దైవయోగమనీ అంటారు. స్వయంకృషితో ఫలం సాధిస్తే అది పురుషార్థ మవుతుంది. ఇది ప్రపంచానికి తెలిసిన విషయమే. కర్మప్రవృత్తిపరుడైన మానవుడు ఆ ఫలం పొందినా పొందకపోయినా అది కర్మ స్వభావమనే అంటారు. దైవమనీ యోగమనీ, స్వభావమనీ విభాగించే భాగ్యాలన్నీ పూర్వజన్మార్జిత సుకృత ఫలాలని మరువకూడదు. ఆయా జన్మలలోని కర్మఫలాలను పరమేశ్వరు డనుగ్రహిస్తూ శుభాశుభ

కార్యాలు చేయిస్తూ ఉంటాడు. దేహధారియైన మానవుడు చేసేకర్మలన్నీ ఈశ్వరప్రేరణలే. ఫలితాలుకూడా పరమేశ్వరాధీనాలే.

జీవుడు పరతంత్రుడు వీనిచేత పరమేశ్వరుడే సర్వకార్యాలూ చేయిస్తూ ఉంటాడు. మనోవాంఛాఫల సిద్ధ్యర్థం మానవప్రాణి కొన్ని కర్మలుచేసి ఫలసిద్ధి పొందుతోంది. దానినే పురుషార్థ మన్నారు.

ప్రభూ! రాజ్యం పోయిన దైన్యం వేధిస్తున్న ఈ సమయంలో పురుషార్థదృష్టితో కృషిచేసి ఈ విపత్తునుండి విముక్తులైతే కీర్తి లభిస్తుంది. కర్మచేసేవరకూ దాని ఫలం ఎవరికి ప్రాప్తిస్తుందో చెప్పలేం. రైతు భూమి దున్ని విత్తనాలు జల్లుతాడు. దాని ఫలం మేఘాలమీద ఆధారపడి ఉంది. సకాలంలో అవి వర్షించకపోతే అది రైతుదోషం కాదే. అయితే కొందరికి ఫలం లభించవచ్చు. ఇతనికి లభించకపోవచ్చు. అంతమాత్రంచేతవాడు నిరాశోపహతుడై విందించుకోడు. పురుషార్థ నిర్వహణలో ఫలప్రాప్తి లేనంత మాత్రంచేత చిత్తవైకల్యం అవసరం లేదు. పురుషార్థానికి ప్రారబ్ధమూ దైవమూ తోడుపడాలి.

మహారాజా! నా చిన్ననాడు మా యింటికి వచ్చిన ఒక విద్వాంసుడైన బ్రాహ్మణుడు మా తండ్రితో చెప్పిన విషయాలన్నీ నేను శ్రద్ధగా ఆలకించాను. ఆ మహాపురుషుడు బృహస్పతిప్రోక్తమైన నీతిశాస్త్రం ఉపదేశించేటప్పుడు నా తండ్రి ఒడిలో కూర్చుని విన్న విషయాలే మీకు చెప్పాను అంది.

## భీముడు

మహారాజా! రాజ్యసాధనకు ఉత్తమపురుషులు అవలంబించే దారి మీరు కూడా త్రొక్కండి. పురుషార్థాలచేత వంచింపబడి ఈ అరణ్యాలలో మనం చెయ్యగలిగిందేమీ లేదు. దుర్యోధనుడు సౌమ్యస్వభావంతో కాని బలపరాక్రమాలతో కాని మన రాజ్యం సాధించలేదు. కపటద్యూతంతో అపహరించాడు. చిన్న నక్కపిల్ల సింహం ఆహారాన్ని దొంగిలించినట్లుంది దుర్యోధనుని వ్యవహారం. ధర్మ కామాల అభివృద్ధికి అవశ్యమైన రాజ్య ధనాలు కోల్పోయి లేశమాత్రమైన ధర్మంతో విచారిస్తే ప్రయోజనం లేదు.

గాండీవం ధరించి సవ్యసాచి నిలబడి ఉండగా దేవేంద్రుడు కన్నెత్తి చూడలేడే. అటువంటిది మీ ప్రమత్తతవల్ల ఈ రాజ్యం పోయింది. గోవులనూ, ఫలాలనూ ఎవరైనా హరించినా వికలాంగులు ఏమీ చేయలేనట్లే జూదంలో సర్వమూ మీరు ఓడిపోతున్నా మేము మౌనంగా ఉండిపోవలసి వచ్చింది. మీరు ధర్మతత్పరులు కనుక మీవాంఛ నెరవేరింది. మీ శాసనాలను పాలించే మాకు దుఃఖమే ప్రాప్తమైంది. దుష్టులయిన ధార్త రాష్ట్రులను ఆనాడు సంహరించకపోవడంవల్ల నేటికీ వారు మనకు కష్టాలు కలిగిస్తూనే ఉన్నారు. మృగాలవలె వనవాసం చేయవలసిన దౌర్బల్యం మనకు లేదే. ఈ వనవాసక్లేశాలను కృష్ణార్జునులు గాని నకుల సహదేవులు కాని అభిమన్యుడుకాని స్పంజయవీరులుకాని నేను కాని ఆమోదించ లేక పోతున్నాం.

ధర్మప్రవచనాలతో వ్రతాలతో మీరు మాకు కష్టాలే కలిగిస్తున్నారు. వైరాగ్యంతో సాహస శూన్యత్వం మిమ్ము వరించిందో నపుంసకులవలె వ్యర్థజీవితం సాగించాలనుకుంటున్నారో తెలియడంలేదు. అసమర్థులు, దుర్బలులూ మాత్రమే తమ సంపదలను సాధించడానికి ప్రయత్నించరు. సర్వశక్తి సంపన్నతకు దూరదృష్టి తోడుపడిన మీ వంటి వారు కూడా చేజేతులా పురుషార్థాలను విడిచిపెట్టారు.

ఎన్ని సుగుణాలు ఉన్నా ధనహీనుడు యజ్ఞకర్మ ధర్మాన్ని ఆచరించ లేడు. ఈ ప్రపంచానికి ధర్మమే మూలకారణం. దానిని మించిందిలేదు. ధర్మకార్యాచరణకు అవశ్యమైనది ధనం. భిక్షాటనం చేస్తూనో, నపుంసకత్వంతో చేతులు ముడుచుకు కూర్చుంటూనో, ధర్మంమీద మనస్సుతోనో ఉంటే ధనం ప్రాప్తించదు. యాచనతో కార్యసాధన చేసే బ్రాహ్మణులవలె మీరు చరించరాదు. వీరత్వంతో ధనం సంపాదించాలి. దానికి తగిన మార్గం చూడండి. ఉత్సాహ బల పౌరుషాలు క్షత్రియధర్మాలు. వానితోనే మీరు శత్రువులను వధించండి.

ఆత్మవిశ్వాసం లేనివాడు యుద్ధానికి పనికిరాడు. ఆత్మబలమే సర్వా నికీ మూలహేతువు. హేమంతఋతువులో చెట్లనీడవలె దుర్బలాత్ముడు శుద్ధ

అప్రయోజకుడు. అమితమైన పంటకోసం కొద్దిపాటి విత్తనాలు రైతు చల్లే టట్లు అపారధనార్థియైనవాడు కొద్దిపాటి అర్థం విడిచిపెట్టాలి. వెచ్చించిన ధనంతో సమంగాకాని అర్థం లభించకపోతే అది నిష్ఫలమే. గాడిదకు కండూతి కలిగితే దానికి గోకేవాడుండనట్లే వ్యర్థవ్యయం కూడదు అన్నాడు.

ధర్మరాజు: భీమసేనా! నీ వాగ్బాణాలతో నా హృదయాన్ని ఛేదించావు. అవి నన్ను ఎంత పీడిస్తున్నాయో నీకు తెలీదు. అందుకు నేను నిన్నేమి అనను. ఈ కష్టాలన్నీ మీ నెత్తిమీదకు తెచ్చి పెట్టింది చాలక యింకా మిమ్మల్ని ఏమనను? ఆనాడు దుర్యోధనుని రాజ్యాన్ని హరించే ఊహతోనే నేను ద్యూతంలో దిగాను. కాని శకుని ఎదురుతిరిగాడు. వాడు మాయాద్యూతం సాగించాడు. పాచికలు వాని యిష్టానుసారం నడిచాయి. అటువంటి మోసం జరుగుతుందని తెలిస్తే నే నందుకంగీకరించే వాణ్ణే కాదు. ఆవేశం మానవుని ధైర్యాన్ని లొంగదీస్తుంది. విషయవ్యసనమైన చిత్తం పురుషార్థానికీ అభిమాన పరాక్రమాలకూ లొంగదని మరచి పోకూడదు.

దుర్యోధనుడు మనరాజ్యం అపహరించి సేవకులుగా చేసినప్పుడు ద్రౌపది ఆ కష్టం నుండి కాపాడింది. వారు మళ్ళీ జూదానికి ఆహ్వానించారు. ఈ విషయం నీకూ అర్జుననకూ కూడా తెలుసు. రెండవమారు జూదంలో పండ్రెండు సంవత్సరాల అరణ్యవాసమూ ఒకసంవత్సరం అజ్ఞాత వాసమూ పణంగా పెట్టి అనంతరం ఎవరిరాజ్యం వారిదే అన్నారు. అందుకు కూడ నే నంగీకరించాను. అప్పుడు మనం ఓడిపోయి ఈ అరణ్యాల పాలయ్యాం.

మనరాజ్యం హరించినా దుర్యోధనునికి శాంతి లేదు. కౌరవులందరినీ కూడ గట్టుకొని వారికి కొన్ని కొన్ని క్రొత్త పదవులిచ్చి మనకు కష్టాలే కలిగించాలని ప్రయత్నిస్తున్నాడు.

సోదరా! ఆనాడు అరణ్య అజ్ఞాతవాసాలకు సమ్మతించి సభామధ్యంలో ఓడిపోయిన నేను ధర్మంవిడిచి రాజ్యం ఎలా అడగను? ద్యూతసమయంలో రెండు చేతులూ దహిస్తానని నువ్వు లేచినపుడు అర్జునుడు నిన్ను వారించాడు. ఆ సమయంలో గదపైకెత్తి శత్రువులవైపు సాగబోయావు. అప్పుడే

నువ్వు అలాచేస్తే ఎంతటి ప్రమాదం సంభవించేది? ఒక్క విషయం నువ్వు మరచి పోతున్నావు. ఇప్పుడు నువ్వు చేసిన ప్రసంగం ఉన్నదే అది ఆనాడే సభామధ్యంలో నా ప్రతిజ్ఞకు పూర్వం చేసి ఉంటే ఎంతో సమంజసంగా ఉండేది.

ద్రౌపదికి కలిగిన క్లేశం ఆమె విషాదవదనమూ నాకూ బాధ కలిగిస్తున్నాయి విషం త్రాగినంత బాధగా ఉంది నాకు. అయినా నా ప్రతిజ్ఞను ఉల్లంఘించలేను. పొలంలో విత్తనాలు చల్లి పంటకోసం నిరీక్షించే రైతులా నువ్వుకూడా ఓపికపట్టు. శత్రువు మోసగిస్తే సమయంవచ్చేవరకూ ఆగి శత్రువును మూలచ్ఛేదంచేసే వాడే రాజ్యలక్ష్మిని గ్రహించడానికి అర్హుడు. నీ శౌర్య ప్రతాపాల ముందు శాత్రవకోటి తలవంచుతుందని నాకు తెలుసు. కాని ఈ లోగా ఎందరో మిత్రులు మనకు సమకూరుతారు. ఇంద్రసహాయంతో దేవతలు సుఖంగా ఉండేటట్లు మిత్రసహకారంతో మనం శత్రువులను జయించి ప్రశాంతంగా ఉండవచ్చు.

నాయనా! నా జీవితాన్నీ అమరత్వాన్నీ ఉపేక్షిస్తాను. కాని ఉత్కృష్టమైన ధర్మాన్ని విడిచిపెట్టలేను. ఈ రాజ్యమూ దారాపుత్రులూ యశోధనాలూ సత్య ధర్మాలలో షోడశాంశం కూడా కావు. సత్య ధర్మ పాలనమే నా జీవితవ్రతం, అని భీమునికి సమాధాన మిచ్చారు.

ధర్మజుని మాటలతో భీముని హృదయం విషాదపూర్ణమయింది. అయినా ధర్మజుని యుద్ధోన్ముఖుని చేసే సంకల్పంతో:

మహారాజా! మీరు మరణధర్మంగల మానవులు కాలపాశ బంధితులు. ముగ్గిన పండులా, నీటిబుడగలా, కాలంకూడా నిలబడేది కాదు. జలపాత వేగంతో పోయే కాలాన్ని వృధాచేసి సమయ, సావకాశాలకోసం నిరీక్షించి సంధి చేసుకోవాలని మీరు ప్రయత్నిస్తున్నారు. ఆ కాలం అతిసన్నిహితంగా ఉందని మీరుభావిస్తున్నారు. కంటికి పెట్టుకోవటానికి చేతిమీదికి తీసే కాటుకలా కాలం హరించిపోతూ ఉంటుంది. ఆయుర్దాయం క్షీణిస్తుంది. క్షణభంగురమైన జీవితం గల మానవప్రాణి సమయనిరీక్షణ చేయడం అర్థరహితంగా కనిపిస్తోంది.

పదమూడు సంవత్సరాలు నిరీక్షిస్తూ కూర్చుంటే మృత్యువు మన గుమ్మంముందు కూర్చుంటుంది. అసలు మృత్యువు దేహధారుల శరీరం లోనే తిష్ఠవేసుకొని ఉంటుంది. దాని నోట్లో మనం పడకుండానే మనరాజ్యం మనం సాధించుకోవాలి. తమశక్తిని అణచి పెట్టుకుని ఉండేవాడు భువికి భారభూతుడే. శత్రువులను హింసించనివాడు ఎద్దులా బాధలు పడుతూండ వలసిందే.

ఈ భూమండలంలోని రాజులందరినీ మనం ఓడించాం. దుర్యోధనుని ఆశ్రయించి వారందరూ ఉంటున్నారు. అటువంటివారు మనకు ఆదరించి ఆశ్రయమిస్తారనుకోవడం శుద్ధభ్రమ. పైగా వారే మన జాడ తెలుసుకుని దుర్యోధనునికి తెలియజేయడానికి ప్రయత్నిస్తారు.

ఇప్పటికి పదమూడు మాసాలు గడిచాయి. మనం గడపవలసిన సంవత్సరాలు పదమూడు. మానవులు మాసాన్ని సంవత్సరానికి ప్రతినిధిగా గ్రహిస్తారు. యాగాలలో "పూతిక"ను సోమలతకు ప్రతిగా గ్రహించేటట్లు ఈ పదమూడు మాసాలనే పదమూడు సంవత్సరాలుగా మనం పరిగణించ వచ్చు. బరువుమోసే ఎద్దుకు కొరడాదెబ్బలు తప్పనట్లు మీరు ఎన్ని కష్టాలుపడి మీప్రతిజ్ఞ నెరవేర్చుకున్నా మీకు లభించే ప్రయోజనమేమీ లేదు. యుద్ధానికి మించిన క్షత్రియధర్మం లేదు. కనుక దుర్యోధనాదులపై ప్రతీకారచర్యకు యిప్పుడే కంకణం కట్టండి, అన్నాడు.

భీముని ఆగ్రహావేశవచనాలు విని ధర్మరాజు వేడి నిట్టూర్పు విడిచాడు. ఆయన మనస్సు ఆలోచనలో పడింది. సర్వవిషయాలు తెలిసినవాడు వర్త మానంతో భవిష్యత్తును సమన్వయించి పరిశీలించకపోతే నిష్ప్రయోజకుడే అవుతాడు. బలం ఉందికదా అని మేరువును ఢీకొట్టినట్లు ధర్మపథాన్ని అతిక్రమించకూడదు. ఈ విధంగా ఆలోచించి భీమునివైపు తిరిగి,

**భారతకులభూషణా! నువ్వు చెప్పిందంతా సత్యమే కాని నా మాట కూడా కొంచెం విను. సాహసంతో పాపకర్మలకు అంకురార్పణ చేస్తే అవి దుష్ఫలితాలనే యిస్తాయి. ఉత్తములతో సంప్రదించి సాగించే సన్నాహాలకు దైవబలం తోడుపడుతుంది. నీ బలగర్వం నిన్ను చపలచిత్తుని చేసి యుద్ధోన్ముఖుని చేస్తున్నది అని చెపుతున్నాడు.**

ఆ సమయానికే యోగిపుంగవుడు వేదవ్యాసుడు అక్కడకు రాగా పాండవులు ఎదురువెళ్ళి స్వాగతమిచ్చి అతిథిపూజ నిర్వర్తించారు. స్వాగత సత్కారాలు స్వీకరించి వ్యాసుడు:

ధర్మజా! నీ మనస్సులోని అభిప్రాయం గ్రహించి నేను యిలా వచ్చాను. భీష్మ ద్రోణ దుర్యోధనాదుల విషయమై నువ్వు భయపడుతున్నావు. కాని వారిని నాశనం చేసే ఉపాయం ఒకటిఉంది. అది చెపుతాను యిలారా! అని ఏకాంతంలోకి తీసుకువెళ్ళి:

నీకు శుభక్షణాలు రానున్నాయి. అస్త్రవిద్యాపారంగతుడైన అర్జునుడు శత్రువులను నిర్జించి తీరుతాడు. నువ్వు శరణాగతుడవై నన్ను అర్థిస్తే ప్రతిస్మృతి ఉపదేశిస్తాను. అర్జునుడు దానిని ఉపాసించి తపస్సుచేసి రుద్ర వరుణ యమ కుభేర ఇంద్రుల అనుగ్రహం పొంది దివ్యాస్త్రాలు సాధిస్తాడు. నారయణసఖుడైన నరుడే ఈ అర్జునుడు.

వీడు ధర్మచ్యుతుడు కాకుండా విజయశీలియై లోకపాలురవల్ల దివ్యాస్త్రాలు పొందుతాడు.

మీరు ఈ వనం వదలి మరోవనానికి వెళ్ళండి. మీరు ఒకేచోట ఎక్కువకాలం ఉండటం మంచిదికాదు. కొందరు మునులకు తపోవిఘ్నం కలిగి వారికి ఆగ్రహం కలిగించిన వారవుతారు. ఇక్కడి క్రూరమృగాలను సంహరించి ప్రశాంతత ఏర్పరచారు. విద్వాంసులైన విప్రులను పోషిస్తున్నారు. మీ అగ్ని కార్యాలలో యిక్కడి ఓషధులు క్షయమైపోతున్నాయి త్వరగా వాసస్థలం మార్చాలి. అని పలికి ప్రతిస్మృతి ఉపదేశించి అదృశ్య మయ్యాడు.

వ్యాసుని ఉపదేశాన్ని శుభసమయాలలో ఉపాసిస్తూ ద్వైతవనం విడిచి కామ్యక వనంలో సరస్వతీ నదీతీరాన విడిదిచేశారు ధర్మరాజు, సోదరులతో వేదవేదాంగవిదులైన బ్రాహ్మణులు కూడా ధర్మరాజును అనుసరించారు. అక్కడ పాండవులు క్రూరమృగాలను సంహరిస్తూ ధనుర్విద్యాసాధన చేస్తూ దేవతలనూ పితరులనూ తృప్తిపరుస్తూ కాలం గడుపుతున్నారు.

## పాశుపతాస్త్రం

కాలం సాగుతోంది.

ఒకనాడు ధర్మజునికి వ్యాసుని సందేశం స్మృతికి వచ్చింది. అర్జునుని ఏకాంతం లోకి పిలిచి కొంతసేపు యిష్టాగోష్ఠి నడిపి-

అర్జునా! భీష్మ ద్రోణ కర్ణ అశ్వత్థాములు ధనుర్వేదం అమూలాగ్రంగా అభ్యసించినవారు. దైవీ బ్రాహ్మీ మానుషరీతులలో అస్త్రప్రయోగం చేయగల వీరందరినీ దుర్యోధనుడు అపరమిత గౌరవముతో చూడటంవల్ల వారందరూ వారికే సుఖం కలిగేటట్లు చూస్తారు. ఇతర యోధులను కూడా దుర్యోధనుడు గౌరవించడంవల్ల వానిశక్తి మరీ వృద్ధిపొందుతోంది. ఈ భూమండలమంతా వాని అధీనంలో ఉంది. నువ్వు తప్ప మమ్మ్ము. రక్షించేవారు లేరు.

ఇప్పుడు నీకర్తవ్యం బోధిస్తున్నాను. వ్యాసమహర్షి నాకొక విద్యను ప్రసాదించాడు. దానివల్ల ఈ ప్రపంచములో ఏది ఎందుకు జరుగుతుందో తెలుస్తుంది. నువ్వు కఠోర వ్రతదీక్షతో ఈ మంత్రం అనుష్టించి ఏకాగ్ర చిత్తంతో మౌనవ్రతంతో ఉత్తరదిశా ముఖంగా వెళ్ళి తీవ్రతపస్సుచేసి సమస్త దేవతాశక్తులూ కల వృత్రాసురసంహారిని ప్రసన్నుని చేసికుని వానినుండి దివ్యాస్త్రాలు గ్రహించు అని పలికి అర్జునునికి ప్రతిస్మృతి ఉపదేశించి తపోదీక్షకు అనుమతియిచ్చాడు.

శాంతిక పౌష్టిక కర్మలు నిర్వర్తించి బ్రాహ్మణాశీర్వాదాలు స్వీకరించి కవచం ధరించి గాండీవమూ అక్షయతూణీరాలు గ్రహించి శిరోఽంగుళి త్రాణధారియై ఒక్కసారి ఆకాశంవైపు చూసి బరువుగా నిట్టూర్చి ధార్తరాష్ట్ర నాశనసంకల్పంతో అడుగువేసే అర్జునుని చూసి సిద్ధులూ బ్రహ్మవిదులూ అర్జునుని మనోభీష్టం నెరవేరుతుందని పలికేరు.

అర్జునుడు సోదరులకూ ధౌమ్యులకూ ప్రదక్షిణాలు చేసి ఇంద్ర సమాగమానికి సాగుతున్నాడు. ప్రతిస్మృతి విద్యాసంపన్నుడైన పార్థుడు పుణ్యపురుషసేవితమైన హిమవత్పర్వతాన్ని ఒక్కరోజులో చేరి క్రమంగా

గంధమాదనం దాటి అహోరాత్రదీక్షతో దుర్గమప్రాంతాలు గమించి ఇంద్ర కీలపర్వతం సమీపించే సరికి నీ విక్కడే ఆగు, అని అదృశ్యవాణి వినిపించింది.

అర్జునుడు ఆగి నలువైపులా చూడగా ఒక విశాలవృక్షంక్రింద తపస్సు చేసుకొనే పురుషుడు కనిపించాడు. పింగళవర్ణంతో జటాజూటంతో బ్రహ్మ తేజంతో ప్రకాశించే ఆ తపస్వి అర్జునుని చూచి:

నాయనా! హర్షక్రోధాలను జయించిన శాంతతపస్వుల నిలయమైన ఈ ప్రదేశానికి ధనుర్బాణాలతో ఎందుకువచ్చావు? ఇక్కడ యుద్ధాలేమీ జరుగవే! తేజస్సులో ఓజస్సులో నీ అంతటివానిని నేను చూడలేదు. ఇక్కడ నీ ధనుర్బాణాలు విడచి ఉత్తమగతులు పొందు; అని నవ్వుతూ ఎన్నిసార్లు చెప్పినా అర్జునుడు చలించకపోయేసరికి ఆ ఋషి ప్రసన్నుడై తానే ఇంద్రుడననీ వరంకోరుకోమనీ అనగా, సవ్యసాచి చేతులు జోడించి:

మహాపురుషా! అస్త్రవిద్యా రహస్యాలన్నీ గ్రహించాలనుకున్నాను. ఆ వరం అనుగ్రహించండి, అనగా ఇంతవరకూ వచ్చి అస్త్రాలతో ఏం చేస్తావనీ ఉత్తమలోకాలు కోరుకోమనీ అన్నాడు.

సురేశ్వరా! కష్టాలలో ఉన్న నా సోదరు లందరినీ విడిచి శత్రుసంహారం చేయకుండా లోభంతో దేవత్వాన్ని కోరలేను. అమరైశ్వర్యం ప్రాప్తించినా గ్రహించలేను. అని అర్జునుడనగా అమరేంద్రుడు సంతోషించి:

నాయనా! సర్వభూతనాథుడైన పరమశివుని దర్శించగానే నీకు దివ్యాస్త్రాలిస్తాను, ఆ మహాదేవుని దర్శించి నువ్వు స్వర్గానికి రాగలవు అని ఇంద్రుడు అదృశ్యు డయ్యాడు. అర్జునుడు యోగదీక్ష వహించాడు.

అర్జును డొక పర్వతశిఖరం చేరాడు. ఫల, పుష్ప భరితమై పక్షుల కలస్వనాలతో, నిర్మల జలపూర్ణ నిర్ఝరిణులతో అలరారేచోట తపోదీక్షకు ఉపక్రమించాడు. ఆదిలో ఫలాలే ఆరగించి మూడుమాసాలూ, అనంతరం వాయుభక్షణంతో కొంతకాలమూ సాగించి కాలిబొటనవ్రేలిపై నిలిచి తపస్సు చేస్తూంటే దానికి సంతృప్తులయిన మహర్షులు పరమశివుని చేరి అర్జునుని అనుగ్రహించమన్నారు.

ఆదిశంకరుడు కిరాతరూపం ధరించి, పినాకం చేబూని, పార్వతీ సహితుడై భూతగణాలతో వచ్చాడు. అదే సమయానికి మూకాసురుడనే క్రూర రాక్షసుడు అర్జునుని సంహరించడానికి రావడం అటు పరమశివుడూ ఇటు పార్థుడూ ఒకేమారు చూసి, బాణాలు విడిచారు. సూకరరూపంలో వున్న రాక్షసుడు నేలకూలాడు;

తన బాణంతో బాటుగా బాణం విడిచిన కిరాతుని చూసి, అర్జునుడు ఈ భయంకరారణ్యంలో స్త్రీజనంతో చరించే ధైర్యం నీకెక్కడిదీ? పయిగా నేను వేటాడుతున్న సూకరాన్ని నీ బాణానికి గురిచేసి నన్ను అవమానించినందుకు నీకు శిక్ష తప్పదు అన్నాడు.

ఓ మహావీరుడా! మేం అరణ్యసంచారులం. ఇది నా ఏలుబడిలో వుండే అడవి. ఇక్కడ ఏం సుఖపడదామని వచ్చావు? పయిగా నన్ను దోషిగా నిలబెట్టి మాట్లాడుతున్నావు. కాసుకో - అని పరమశివుడు బాణం తియ్యబోగా అర్జునుడు శరవర్షం కురిపించాడు. కిరాత రూపంలో వున్న శివుడు ఆ బాణాలన్నీ ఎడమచేతితో పక్కకు విసురుతూ నిలిచాడు. పర్వతం మీద కుంభవృష్టిలా వుంది, కిరాతునిమీద అర్జునుని బాణవర్షం. లాభంలేదని గాండీవం పైకెత్తి శివుని శీర్షంపై కొట్టబోయాడు. అది ఆ కిరాతుని శరీరంలో లీనమయింది. ముష్టియుద్ధానికి దిగాడు. కిరాతుని ముష్టిఘాతాలకు తట్టుకోలేక మూర్ఛపోయాడు అర్జునుడు.

మూర్ఛనుండి తేరుకుంటూనే అక్కడ తన రక్తంతో తడిసిన మట్టితో శివలింగంచేసి అర్చించాడు. పరమశివుడు ప్రసన్నుడై వరం కోరుకోమన్నాడు. పాశుపతాస్త్రం అర్థించాడు పార్థుడు.

పరమశివుడు ఆ ప్రళయాస్త్రమంత్రం ఉపదేశించి దాని ప్రయోగోప సంహారాలు వివరించి ఆశీర్వదించి తిరోహితుడయ్యాడు.

ఆనందంతో అర్జునుడు పరమశివస్తోత్రం చేసి తన్మయుడయివుండగా యమ, వరుణ, ఇంద్ర, కుబేరులు ప్రత్యక్షమయి వానికి తమ దివ్యాస్త్రాలు అనుగ్రహించారు.

అందరూ ఎవరి లోకాలకు వారు వెళ్ళిన అనంతరం ఇంద్రుడు పంపిన రథంమీద అర్జునుడు దేవలోకం వెళ్ళి అక్కడ నృత్యగానాలలో నిపుణుడయిన చిత్రసేనునివద్ద ఆ విద్యలు అభ్యసిస్తున్నాడు. అర్జునుని రాకకు సంతోషంగా దేవేంద్రుడు ఊర్వశీ నృత్య ప్రదర్శనం ఏర్పాటు చేశాడు.

ఆ సమయంలో అర్జునుడు తదేకదృష్టితో ఊర్వశిని తిలకించడం గుర్తించిన ఇంద్రుడు ఆ రాత్రి ఊర్వశిని అతని శయ్యామందిరానికి పంపించమని చిత్రసేనుడికి ఆజ్ఞాపించాడు. చిత్రసేనుని మాటవిని ఊర్వశి పరమానందంతో తన అతిలోక సౌందర్య దేహాన్ని మరింతగా అంగరాగాలతో అలంకరించి, పృథు నితంబాలమీద పలచని చీర జారుతుండగా, సమున్నత వక్షోజశోభను ప్రదర్శించే చీనాంశుకోత్తరీయం ధరించి కుటిలాలకాలు చిరుగాలికి అల్లలాడుతుండగా విశాలపద్మనేత్ర కాంతులతో అర్జునుని మందిరంలో హంసనడకలతో ప్రవేశించిన, ఆ నృత్య విద్యుల్లతను చూస్తూనే అర్జునుడు వినయంగా ఎదురేగి, నమస్కరించి ఉచితాసనం చూపాడు.

ఊర్వశి హృదయం ఛిన్నమయింది.

చిత్రసేనుని సందేశమూ, ఇంద్రుని ఆదేశమూ, తన ఆకాంక్షా అన్నీ వివరించి ఆశగా చేతులు జాపింది.

"అమ్మా! మా పురువంశాన్ని ఉద్ధరించిన జననివి నువ్వు. నీకు నేను ప్రపౌత్రుడిని. కుంతిదేవినీ శచీదేవినీ చూసిన రీతినే నిన్నూ చూశాను. నీపాదలకు అభివాదాలు" అన్నాడు.

కాంక్షతో పెల్లుబికే వాంఛతో వచ్చిన ఊర్వశి అర్జునుని మాటలతో క్రుంగిపోయి అభిమాన అహంకారాలు దెబ్బతినగా:

కోరివచ్చిన కోమలాంగిని తిరస్కరించిన పాపఫలమూ అనుభవించక తప్పదు. నపుంసకుడవై నారీజనానికి నృత్య, గానాలు నేర్పుతూ వుండు - అని కోపంతో వెనుదిరిగి వెళ్ళిపోయింది.

ఆ వార్త విన్న దేవేంద్రుడు అర్జునుని ఆశ్వాసించి, నాయనా! ఈ ఊర్వశీ శాపం నీకు వరమే. రానున్న అజ్ఞాతవాస సమయంలో నువ్వు నాట్యగురువుగా ఒక్క సంవత్సరం ఈ శాపఫలం అనుభవించి విముక్తుడివి అవుతావు - అన్నాడు.

అనంతరం కొంతకాలం ఇంద్రలోకంలో వుండి అనేక దివ్యాస్త్రాల ప్రయోగోపసంహార క్రమాలు తెలిసికున్నాడు.

అమరావతిలో అయిదు సంవత్సరాలుండి అస్త్రవిద్య రహస్యాలెన్నో అర్జునుడు అవగాహన చేసికొన్న వార్త ఆకర్ణించిన ధృతరాష్ట్రుడు సంజయునితో:

ఇక మనం పాండవులను జయించే ఆశ నాకు లేదు. నా కొడుకులు ఎందుకూ కొరగాని దురభిమాను లయారే తప్ప, మరేదీ సాధించలేకపోతున్నారు - అని వేదనలో పడ్డాడు.

మహారాజా! విదురుడూ, నేనూ ఆదినుంచీ చెపుతూనే వున్నాం. దుర్బుద్ధి నిండిన గుండెకల శకుని, దుశ్శాసన, కర్ణుల మంత్రాలోచనలతో దుర్యోధనుడు వక్రమార్గాలు తొక్కుతున్నాడు. ఆ దారి వంశనాశనానికి తప్ప ఎందుకూ కొరగాదు. అందుచేత వారిని సరయిన దారిలో పెట్టండి. ఎవరు చెప్పినా యిది మీ చెవికి ఎక్కడంలేదు అన్నాడు సంజయుడు.

## తీర్థయాత్ర

ఈ అయిదు సంవత్సరాలూ ధర్మరాజూ, ద్రౌపదీ, భీమ, నకుల, సహదేవులు, ధౌమ్యసహితులై అర్జునుని శ్రేయస్సుకోసమే ఆరాధనలు చేస్తూ కాలం గడుపుతున్నారు. వారు అనుక్షణం అర్జునుని కోసం ఎదురుచూస్తూనే వున్నారు. ఆ మహావీరుడు రావడం ఆలస్యమయినకొద్దీ వారి ఉత్కంఠ పెరుగుతూనే వుంది.

ఎవరెవరో మహర్షులు వస్తున్నారు ఏవేవో ధర్మశాస్త్ర విషయాలు, రాజనీతి ఉపదేశిస్తున్నారు. వారి ముఖాన అనేకానేక శాస్త్రమర్మాలు వింటూ కాలం గడుపుతూండగా ఒకనాడు భీమసేనుడు:

ధర్మనందనా! కృచ్ఛ్రవ్రతాచరణానుసారం ఒకదినం ఒకసంవత్సరంగా గణనకు వస్తుందని శాస్త్రం చెపుతున్నది. మీరు పదమూడు రోజులు ఈ వ్రతం అనుష్ఠించి పదమూడేళ్ళ గడువూ పూర్తిచేస్తే మేము కౌరవులతో యుద్ధం చేసి, వారిని సర్వనాశనంచేస్తాం - అన్నాడు.

నాయనా! అసత్యదోషం నానెత్తిమీద పడనిస్తావా? ఈ గడువు కాలం పూర్తికాగానే నీ అభిమతానుసారం ప్రతిజ్ఞలు నెరవేర్చుకోవచ్చు. అసమానయోధుడ వయిన నువ్వు మాత్రం అక్రమమార్గం అనుసరిస్తావా? ఆవేశంలో అంటున్నావు కాని - అని ధర్మరాజు అనునయించాడు.

ఆ సమయానికి అక్కడకు చేరిన బృహదశ్వమహర్షిని ఉచితరీతిని సత్కరించి: మహర్షీ! నావలె ఇలా క్లేశాల పాలయిన వాడెవడేనా యితః పూర్వం వున్నాడా, అని ధర్మరాజు ప్రశ్నించగా, బృహదశ్వుడు: ధర్మనందనా! నీకంటె అదృష్టహీనుడు నలమహారాజు. ఆయన కలిప్రేరితుడై జూదంలో ఓడిపోయి, అడవులలో కట్టుబట్టలుకూడా లేక భార్య చీరచెరుగు చింపి కట్టుకుని ఆమెను ఆ ఘోరారణ్యంలో విడిచి, ఋతుపర్ణమహారాజు దగ్గర వంటలవాడుగా చేరి, చివరకు భార్యను, రాజ్యాన్నీ పొందాడు. ఆ సమయంలోనే నలుడు ఋతుపర్ణుని అశ్వహృదయం బోధించి ఆయన దగ్గర అక్షహృదయం నేర్చుకున్నాడు.

అందుచేత సత్య, ధర్మపరాయణులు క్లేశాలు అనుభవించినా, చివరకు వారే ఇహపరాలలో సుఖసంతోషాలు పొందుతారు - అని ఆశ్వాసించాడు.

రోజులు గడుస్తుండగా ఒకనాడు నారద మహర్షి వచ్చి కుశల ప్రశ్నలు ముగిశాక భారతదేశంలోని తీర్థక్షేత్రాలనూ వాటి ఫలాలను వివరించారు.

అంతలో ధర్మరాజు తీర్థయాత్రాభిలాష వ్యక్తం చేయగా, త్వరలోనే ఈ ప్రాంతానికి లోమశమహర్షి వస్తున్నాడనీ, ఆయన సాయంతో యాత్రలు సాగించమనీ నారదుడు నిష్క్రమించాడు.

వచ్చిన లోమశమహర్షిని వెంటబెట్టుకొని ధర్మరాజాదులు తీర్థయాత్ర ప్రారంభించారు. ఒక్కోక్షేత్ర విశేషాన్ని, తీర్థ మాహాత్మ్యాన్నీ వివరిస్తూ

అగస్త్యాశ్రమ ప్రాంతం చేరి అక్కడ వాతాపిని అగస్త్యుడు జీర్ణించుకున్న గాథ చెప్పి, వింధ్యపర్వతం పెరుగుతూంటే దాని గమనాన్ని నిరోధించిన కథా, సముద్రాలను ఆపోశనం చేసిన విశేషమూ చెప్పాడు. ఋష్యశృంగాశ్రమం చేరగానే ఆయన కథ చెప్పాడు.

పరశురాముని క్షత్రియసంహారగాథ, సుకన్యా-చ్యవన పరిణయ కథ, ఔశీనరుడయిన శిబిచక్రవర్తి విశేషాలు, అష్టావక్రుని విశిష్టలక్షణాలూ, మార్గ మధ్యంలోని విలక్షణ దేశాల వివరాలూ చెపుతూ నిర్విఘ్నంగా యాత్ర చేయిస్తున్నాడు.

సాగి సాగి రైభ్యమహర్షి ఆశ్రమం గడచి, ఉశీరబీజం విడిచి, మైనాకాన్ని దర్శించి శ్వేతపర్వతం అధిరోహించి కాలశైల, కాలగుహలు దాటిన అనంతరం లోమశుడు:

ఇక ముందున్నవి మందరాచల, కైలాసగిరులు. అక్కడ యక్షేశుడు కుబేరుడుంటాడు. ఎనభై ఎనిమిది వేలమంది గంధర్వులూ, వారికి నాలుగురెట్లు కిన్నరులూ విచిత్రాకారాలతో శస్త్రాస్త్రాలతో విహరిస్తుంటారు. అక్కడే యక్ష, రాక్షసులు కూడా చరిస్తుంటారు. అది సామాన్యులకు దుర్గమప్రాంతం. ఇక ముందుకు సాగలేం మనం - అన్నాడు.

ధర్మరాజు సోదరులవైపు తిరిగి: భీమసేనుడు ద్రౌపదీసహితుడై యిక్కడ వుంటాడు. మనం యీ మహర్షి అడుగుజాడలలో ఆ క్షేత్రాలు చూచి వద్దాం - అని నకుల సహదేవులను తోడుకొని బయలుదేరు తుండగా:

అగ్రజా! మీరు మమ్మల్ని విడిచివెళ్ళవద్దు. ద్రౌపదీ నేనూ కూడా అర్జునుని చూడాలనే ఉత్కంఠతో వున్నాం. అందుచేత మీరు మమ్మల్ని కూడా రానివ్వండి - అన్నాడు హిడింబా హృదయచోరుడు.

ఎదురు చెప్పక ధర్మరాజు అంగీకరించాడు.

అందరూ గంధమాదన పర్వతముఖంగా సాగుతుండగా లోమశ మహర్షి:

ధర్మనందనా! మొట్టమొదటి కృతయుగంలో మహావిష్ణువే యముని ధర్మాలుకూడా నిర్వహించేవాడు. ఆ రోజులలో మృత్యువే ఉండేదికాదు.

సృష్టి నిరంతరాయంగా సాగుతుండేది. పశు, పక్షిజాతులు విపరీత సంఖ్యలో పెరిగాయి. మానవజాతి వర్షాకాలంలో వానజల్లులా పెరుగుతున్నది. ఈ భారాన్ని ఆపలేక ధారుణి పాతళానికి కుంగిపోతున్నది. సాగరసంక్షోభం ఆరంభమయింది. ప్రాణికోటి ప్రకంపించింది. లోకాలన్నీ శోకమగ్నాలయాయి. భూమి నూరుయోజనాలులా దిగిపోయింది. అప్పుడు మహావిష్ణువు వరాహరూపుడై భూమిని పైకెత్తాడు. దేవగణాలన్నీ ఆ మహాపురుషుని అనంతనామాలతో కీర్తించాయి. అని చెప్తుండగా అప్సరోభామల విహార స్థలాలూ, కిన్నెర క్రీడారంగాలూ అలరారే గంధమాదనం ఎదురయింది.

అందరూ ఆ పర్వతం మీద అడుగుపెట్టారు.

అంతలో ప్రచండవాయువు రేగింది. ఆ వాయు వేగానికి మహావృక్షాలు సమూలంగా కంపించాయి. ఆకాశం ధూళి ధూసరిత మయింది. భూమ్యాకాశాల్లో ఏమీకనిపించడం లేదు. అంతా అంధకారం. ఆ గాలికి బండరాళ్ళు ఒకదాని మీద ఒకటి పడి పిప్పి పిప్పి అవుతున్నాయి. ఆకాశం బ్రద్దలయి భూమి ముక్కలు ముక్కలయి పర్వతాలు ఒకదానిలో ఒకటి ఢీ కొడుతున్నట్లు ధ్వని రేగింది.

భీముడు ఒక చేత్తో ద్రౌపదినీ, మరొకచేత్తో ఒక మహావృక్షాన్నీ గట్టిగా పట్టుకు నిలిచాడు. ధౌమ్యులవారు ధర్మజసహితులై అగ్నిహోత్రాలు సంరక్షిస్తూ ఒక స్థావరంలో ఆగారు. సహదేవుడొకచోట, నకులుడు తమతో వచ్చే బ్రాహ్మణులతో మరొకచోట రక్షణ మాచుకున్నారు. కొద్ది క్షణాలలో ధూళి సన్నగిల్లింది. వాయువేగ తీవ్రత తగ్గింది. విద్యుత్కాంతులతో వర్షధారలు ప్రవృద్ధమయాయి. అంతలో సెలయేరులు ఏరుగామారి నురగలు కక్కే తరంగాలతో నదీరూపంతో ప్రవహించాయి. ఇదంతా కొద్ది క్షణాలు. అంతలో మేఘాలు మాయమయాయి: కొండమీద వానపడ్డ జాడలేకుండా నీరు క్రిందికి దిగిపోయిది. సూర్యకిరణాలతో పర్వతం మెరుస్తున్నది.

## గంధమాదనం

సంతోషం విరిసిన కన్నులతో పాండవులు మళ్ళీ యాత్ర సాగించారు.

కంటక, శిలామయ మార్గంలో నడిచి, నడిచి, అలసిన ద్రౌపదీదేవి నడికట్టున చేతులుంచి నాలుగడుగులు వేసి కూలబడింది. అది చూసి భీమసేనుడు ఆమెను రెండు చేతులతో ఒడిలోకి తీసుకున్నాడు. ధర్మరాజు కంట తడిపెట్టి, ముఖాన చల్లని నీరు చిలికాడు. నకుల, సహదేవులు ఆమె పాదాలు ఒత్తుతున్నారు.

అభ్యంతర మందిరాలలో, హంసతూలికాతల్పంపై శయనించవలసిన పాంచాలరాజ పుత్రి, ముళ్లపొదలు క్రమ్మిన రాళ్ళ మీద శయనించవలసి వచ్చింది. ద్రుపద మహారాజు ఈ సుకుమారిని మా చేతులలో వుంచుతూ - అమ్మాయీ! నువ్వు అనంత వైభవంతో అమర సుఖాలు పొందుతావమ్మా! అన్నాడు. అదంతా పొల్లయిపోయింది. ఇంతకూ నా ద్యూతప్రీతి కారణం - అని ధర్మరాజు విలపించాడు.

శైత్యోపచారాలతో ద్రౌపది తేరుకున్నది. అప్పుడు ధర్మరాజు: భీమసేనా! ముందు ముందు ఇంకా మంచు దట్టంగా పేరుకొని వున్నది. ఈ పాంచాలి ఆ క్లేశం భరించలేదు. అనగా భీముడు:

అగ్రజా! మీకా భయం అవసరంలేదు. ఈమెనూ, మిమ్మందరినీ కూడా నేనే మోయగలను. ఆ అవసరం కూడా లేదు. నా కొడుకు ఘటోత్కచుడు నా అంతటివాడు. వాడికి ఆకాశగమనమున్నూ వున్నది అని కొడుకును స్మరించగానే వాడు ప్రత్యక్షమై పాదాభివాదం చేశాడు. భీముడు వానికి కర్తవ్యం చెప్పగా, ఘటోత్కచుడు:

ఆర్యా! నేనే మీ అందరినీ గంధమాదన శిఖరాగ్రానికి కొనిపోగలను. ఆ అవస్థ లేకుండా నేను ద్రౌపదీమాతను భుజాలమీదకు ఎక్కించుకుంటాను. నా అనుచరులు మీ అందరినీ తీసుకొస్తారు, అని తన సేవకులను చూచాడు.

ఉత్తరక్షణంలో అందరూ రాక్షసుల భుజాలమీద వున్నారు.

ధాతుశోభితప్రాంతాలు, కిన్నర, కింపురుష, గంధర్వ విహార భూములూ చూస్తూ సాగుతున్నారు. చమరీమృగ విహారాలు, వానర లంఘనాలూ,

మహిష, సూకర రురుమృగ క్రీడలూ, పెలయేళ్లమర్మర ధ్వానాలు, మశక మక్షిక శూన్యమయిన పుష్ప, ఫలభరిత లతా పరివేష్ఠిత ఉన్నత తరువులు............ అన్నిటినీ చూస్తూ నరనారాయణాశ్రమం చేరారు. సూర్యరశ్మి లేకుండానే అది కాంతిమయంగా వుంది. అక్కడ ఒక మహా వృక్షచ్ఛాయలో అందరూ క్రిందికి దిగారు. సువర్ణ శిఖరాలు కల మైనాకం అక్కడకు సమీపంలో వున్నది.

అక్కడ విడిదిచేసి, ప్రక్కనేవున్న గంగా తరంగిణిలో స్నానసంధ్యాదులు చేసుకుంటూ పితృ, దేవగణాలను అర్చిస్తున్నారు.

అలా వుండగా ఒకనాడు:

సువాసనాభరితమయిన వెయ్యి దళాలుకల పద్మం ఒకటి ద్రౌపది ముందు పడింది. ఆ సుగంధం ఆమెకు మత్తెక్కించింది; ఆ దళాలకాంతులు ఆమెకు ఆశ్చర్యం కలిగించాయి. కొద్ది క్షణాలు ఆ పుష్పసౌందర్యాన్ని అవలోకిస్తూ, సుగంధాన్ని ఆస్వాదించి భీమసేనుని సమీపించి:

ఆర్యపుత్ర! మనం కామ్యకవనంలోని ఆశ్రమానికి ఇటువంటి పుష్పాలతో వెళ్ళాలని వుంది. వీటిని ధర్మరాజుకి కానుకగా ఇవ్వాలనీ నా కోరిక — అనడంతో భీమసేనుడు ధనుర్బాణధరుడై ఈశాన్యదిశగా ప్రయాణమయాడు.

సప్తవర్ణధాతుశోభతో అలరారే గంధమాదనం అధిరోహిస్తున్నప్పుడు భీముని శరీరానికి చల్లని గాలులుసోకి ఆశ్వాసన ఇస్తున్నాయి.

పుత్రగాత్రపరిష్వంగం తండ్రికి కలిగించే ఆనందం 'ఎటువంటిదో పితృ పరిష్వంగం (ఆవాయుస్పర్శలో) భీమసేనునికి అవగతమయింది. ఎదురుగా గిరిశిఖరంమీద సహస్రదళశోభతో సువాసనలతో సౌగంధికాలు కనిపిస్తున్నాయి. అటే సాగుతున్నాడు. ఒకోసారి అతను భీకరంగా గర్జిస్తుంటే ఆ కొండగుహలలో విశ్రాంతి తీసుకుంటున్న క్రూరమృగాలు అదిరిపడుతున్నవి. అతని పదఘట్టనలకు పర్వతం దద్దరిల్లుతున్నది.

మదించిన ఏనుగులా సాగుతున్నాడు. అంతలో ఆర్ద్రపక్షాలతో ఎగిరే పిట్టలు కనిపించాయి. సమీపంలో సరోవరం వున్నదని గ్రహించి ముందుకు

నడిచి కొలను సమీపించి ఆ కమలాలను చూస్తూ ఉత్సాహంతో అందులో దిగి కొంతసేపు ఈదులాడి ఒక్క శంఖనాదం చేశాడు. అది విని సింహాలు గర్జించాయి. ఏనుగులు ఘీంకరించగా పెద్దపులులు గాండ్రించాయి. పర్వతగుహలు ప్రతిధ్వనించాయి.

## రామదూత

ఆ ధ్వని విని పరిసరంలో వున్న హనుమంతుడు తన సోదరుడయిన భీమసేనుడు వచ్చివుంటాడని గ్రహించి ఆ దారి కడ్డంగా తన తోక జాపి పడుకున్నాడు. భీమసేనుడు మరొకసారి గర్జించాడు. అది విని హనుమంతుడు:

నాయనా! వార్ధకంలో అనారోగ్యంతో వున్న జంతువుని, నన్నెందుకు బాధిస్తావు? మానవులు దయార్ద్ర హృదయులనీ, భూతదయాపరులనీ విన్నాను - అన్నాడు.

నా దారికడ్డంగా వున్న తోక పక్కకు తియ్యి - అన్నాడు పాండు నందనుడు.

నేను కదిలే స్థితిలో లేను; పయిగా ఈ దారిని ఇక ముందుకు వెళ్ళడం మంచిది కాదు. కాదంటావా, దాటుకు వెళ్ళు - అనగా;

సర్వదేహాలలోను పరమేశ్వరాంశ వుంటుంది. కనుక దాటి వెళ్ళడం ధర్మంకాదు - అన్నాడు కౌంతేయుడు.

అయితే వెనుదిరిగి పో, అని హనుమంతు డనగా కుపితుడై:

నే నెవరిననుకుంటున్నావు? శతయోజన విస్తీర్ణమయిన మకరాలయాన్ని గోష్పదంగా లంఘించిన హనుమంతుని సోదరుడను, వాయుపుత్రుడను - అన్నాడు.

చిరునవ్వు నవ్వి హనుమంతుడు:

తోక పక్కగా పెట్టి నీ దారిన నువ్వు వెళ్ళు - అన్నాడు. ఎడమచేత్తో తోక కదపబోయాడు, కదలలేదు. రెండుచేతులూ కలిపాడు. ప్రయోజనం

లేకపోయింది. శక్తి అంతా వినియోగించినా అది కదలలేదు. కన్నులు ఎర్ర పడ్డాయి; కనుబొమలు ముడిపడ్డాయి. కండరాలు పొంగాయి, శరీరమంతా కంపించింది.

వ్యర్థప్రయత్నుడై: మహాత్మా! మీరెవరో చెప్పి నన్ను అనుగ్రహించండి - అనగా:

నాయనా! నేను కేసరిక్షేత్రంలో వాయువుకి కలిగిన హనుమంతుడను- అనడంతో భీముడు వాని పాదాలమీద వ్రాలాడు. భీముని ప్రార్థనతో హనుమంతుడు రామకథ చెప్పి నువ్వు సౌగంధిక కమలం కోసం కదా వచ్చావు. ఇదిగో ఈ దారిని వెళ్ళు. వెడుతూనే పువ్వులు కొయ్యక అక్కడి దేవతలను ప్రసన్నులను చేసుకో. ధర్మమార్గం వీడనివారే ఇహపరాలలో సుఖాలు పొందుతారు - అని యుగధర్మాలు, ఆచారవ్యవహారాలు వివరంగా చెప్పి భీముని కోరికపై సముద్ర లంఘనం నాటి తన రూపం చూపి తృప్తి కలిగించి ఆశీర్వదించాడు.

భీముడు ముందుకు సాగుతున్నాడు.

ఎదురుగా యక్ష, రాక్షస రక్షితమయిన సరోవరం కంటబడింది. జల పక్షుల కలస్వనాలు వినవచ్చాయి. భీముని చూస్తూనే ఆ సరోవర రక్షకులు భీముని కులగోత్రాలు అడిగి తెలుసుకుని ఇది కుబేరుని సరోవరమనీ, ఆయన అనుమతి లేనిదే ఈ సరోవరంలో అడుగు పెట్టరాదనీ అన్నారు.

పర్వతాలమీద కురిసినవాన, ఆ నీరు చేరిన సరోవరం. దీనిమీద కుబేరుడి అధికారం ఏమిటి - అంటూ సరోవరంలో దిగుతూంటే వారు అడ్డురాగా ఒక్కొక్కరినే విసిరేశాడు; అది విని కుబేరుడు భీమునికి అడ్డు వెళ్ళవద్దని అన్నాడు.

సౌగంధిక కమలాలు తీసుకుని బయలుదేరే సమయానికి ప్రచండ వాయువు, కుంభవృష్టీ ఆరంభమయ్యాయి. మృగ పక్షిసంతతులు రోదించాయి. ఆకాశం ఎర్రబడింది. అంతలో అంధకారం ఆవరించింది.

ఈ స్థితిని చూసి ధర్మరాజు ఘటోత్కచ పురస్సరంగా సోదరులతో బయలుదేరి భీముడున్నచోటికి చేరాడు.

## జటాసురుడు

వారందరూ అక్కడే అర్జునుని రాకకోసం ఎదురుచూస్తూన్నారు. ఘటోత్కచుడు అనుచరులతో తన ఆవాసానికి వెళ్ళాడు. అలా వుండగా ఒకనాడు భీముడు దూరంగా అడవికి వెళ్ళిన సమయంలో జటాసురుడనే రాక్షసుడు బ్రాహ్మణరూపంలో వచ్చి ధర్మరాజు అనుగ్రహం పొంది, అక్కడే గడుపుతూ ఒక సమయంలో పాండవులనూ, వారి అస్త్రాలనూ, ద్రౌపదినీ అపహరించుకుపోయే ప్రయత్నం చెయ్యగా, సహదేవుడు ఖడ్గధారియై భీముడు వెళ్ళినదిశగా గొంతెత్తి అరిచాడు.

అంతలో భీముడు వచ్చి — ఓరి, కపటచిత్తుడా! నీ పూర్వులయిన బకాసుర, హిడింబాసురులను చేరుకో, అని అయిదుపడగల పాము వంటి తన అరచేతితో వాని మెడమీద చరిచాడు. వాని మెడనరాలు తోదుకుపోయి నేలకూలాడు.

అక్కడినుండి వారు మరికొంత నడిచి అరిష్టషేణుని ఆశ్రమప్రాంతానికి చేరారు.

ఆ ఆశ్రమంలో వారు ఉంటూండగానే అర్జునుడు దేవలోకం నుండి వచ్చాడు. వస్తూనే ధౌమ్యులవారికి పాదాభివాదంచేసి ధర్మజ, భీమసేనులకు నమస్కరించి, నకుల సహదేవ, ద్రౌపదులను దగ్గరకు తీసుకున్నాడు. అమరావతిలో వున్న అయిదేళ్ళలో జరిగిన విశేషాలు వివరిస్తూ నివాత కవచ, కాలకేయ సంహారగాథ, వివిధాస్త్రాలను గ్రహించిన విషయాలూ చెప్పి ఆ అస్త్రప్రయోగోపసంహార ప్రదర్శనం చేసి అందరినీ ఆనందపరవశులను చేశాడు.

అరణ్యవాసకాలం పూర్తికావస్తున్న సమయంలో గంధమాదనం విడిచి హిమాలయానికి నమస్సు లర్పించి సాగిసాగి పర్వతరాజు ఉత్తరీయంగా ధరించిన యమునానదీ జన్మస్థలం చేరారు. అక్కడ ఒక సంవత్సరం

గడిపారు. ఒకనాడు భీముడు పర్వత గుహాలలో సంచరిస్తూ ఒక కొండచిలువకు చిక్కి దాని పట్టు వదలించుకోలేక ఉక్కిరిబిక్కిరవుతూండగా ధర్మరాజు వచ్చి ఆశ్చర్యపడి, ఆ అజగరం అగస్త్యశాపంతో బాధపడుతున్న నహుషుడని తెలుసుకొని అది అడిగిన ప్రశ్నలకు సమాధాన మిచ్చి భీముని విడిపించుకొని వచ్చాడు.

అనంతరం ఆ ప్రాంతం విడిచి నెమ్మది నెమ్మదిగా అనేక తీర్థాలు దర్శిస్తూ కార్తీక పౌర్ణమినాటికి కామ్యకవనం చేరారు. అది విని కృష్ణుడు సత్యభామా సహితుడై వారిని చూడవచ్చి కుశలప్రశ్నలు ముగించి, మార్కండేయ మహర్షి ఆ ప్రాంతానికి వస్తున్నట్లు విని ధర్మరాజుతో ఎదురేగి ఆ మహర్షిని కొనివచ్చి అతిథిపూజ జరిపించాడు.

మార్కండేయ మహర్షి అనేకానేక విషయాలు చెపుతూ, పూర్వరాజ వంశాల గాథలు వివరించి యుగధర్మాలు విశదం చేస్తూ కలియుగలక్షణాలను వివరిస్తూ—

## కలియుగం

ధర్మనందనా! ఈ యుగాంతంలో మానవులు మిథ్యావాదు లవుతారు. వర్ణధర్మాలన్నీ చెడిపోతాయి. విప్రులు వేదాధ్యయనమూ, యజ్ఞానుష్ఠానాలు విడిచి సర్వపానియాలూ, ఆహారాలు, స్వీకరిస్తారు. కపటవిత్తులు అధికారుల వుతారు. అల్పాయుష్కులూ, అసత్యవాదులూ ఎక్కువగా ఉంటారు. జ్ఞానం లేశమూ లేనివారు బ్రహ్మవిద్యను ఉపదేశిస్తామంటారు. సుగంధద్రవ్యాలు వాసనలేకుండా పోతాయి. మనుష్యులందరూ మరుగుజ్జు లవుతారు.

ఆహార పదార్థాలలో రుచివుండదు. కామవాంఛ విపరీతంగా ప్రబలుతుంది. గడ్డాలు, శిరోజాలు, గోళ్ళూ విపరీతంగా పెంచేవారి సంఖ్య విరివిగా వుంటుంది. మద్యపానం ఒక విలాసం అవుతుంది. నాస్తికులు పెచ్చు పెరుగుతారు. పరాన్నభుక్కులు మితిమీరుతారు. ఏడెనిమిది ఏళ్ళ కన్యలే గర్భవతులౌతారు. యౌవనం నిండకుండానే పురుషుల, స్త్రీల జుట్టు తెల్లబడుతుంది. కట్టుకున్న భర్తను కాదని సేవకులతో బాహాటంగా సంచరి

స్తారు. స్త్రీలు, యౌవనంలో వార్ధక లక్షణాలు, వృద్ధులలో కామవాంఛలూ ప్రబలుతాయి.

ఇవన్నీ విపరీతంగా ప్రబలాక కొన్ని సంవత్సరాలు వానలు కురియవు. ఆకలిబాధలు పెరుగుతాయి. ఏడుగురు సూర్యులు ఉదయిస్తారు. ఆ వేడికి నదీ, నద, సాగర సరోవరాలు ఎండిపోతాయి. సస్యాలు నశిస్తాయి. ఝుంఝామారుతంతో అగ్నిరేగుతుంది. అప్పుడు ఆకాశం కారుమేఘాలతో నిండిపోతుంది. అందులో రంగులమేఘాలుంటాయి. మెరుపులతో పన్నెండేళ్ళు ఏకధారగా వానలు కురిసి, భూమిని జలమయం చేస్తాయి. ఒక్క ప్రాణీ కూడ మిగలదు. ఆ అఖండ జలరాశిలో విశాల వృక్షశాఖా మధ్యంలో హంసతూలికా తల్పం మీద కౌస్తుభ వక్షుడయిన మూర్తి వుంటాడు. ఆ మూర్తిని దర్శించాను - అని చెపుతూంటే:

మహర్షీ! లోకంబులు, లోకేశులు, లోకస్థులు తెగిన తుది అలోకంబగు పెంజీకటికి అవ్వలి వెలుగును దర్శించిన మీ దర్శనం మా అదృష్టం. మీ ముఖాన ఇంకా కలియుగ లక్షణాలు వినగోరుతున్నాను. అన్నాడు ధర్మరాజు.

అందరూ ఆసక్తితో ఆ మహర్షి నోట వెలువడే అద్భుత విషయాలను ఆలకించే కుతూహలంతో సావధానులయి కూర్చున్నారు.

నాయనా! అప్పుడు నేను చూసిన కలియుగంలో మానవులందరూ పాపాచర పరాయణులే. అల్పాయుష్కులే, అసత్యప్రియులే, మూఢులే, కామసేవనపరులే, వర్ణసంకరులే, మత్స్య, మాంసాలు తిననివారు లేరు. చోరులూ, నాస్తికులూ అసంఖ్యాకంగా వున్నారు. ఎక్కడ చూసినా హత్యలు, దోపిడీలూ, వేళాపాళా లేకుండా పాలుపిండడంతో గోసంపద నశించింది.

జనపనారతో తయారయిన వస్త్రాలు ధరించి వీధులలో ఎక్కువగా తిరిగేవారు; మూర్ఖులు సర్వజ్ఞులుగా చెలరేగి ప్రభువులయి ప్రజలనుండి పన్నులు వసూలు చెయ్యడమేకాని వారి రక్షణ బాధ్యత తమదికాదన్నట్టు వుండేవారు. కన్యాదానాలు లేవు. వయస్సు వచ్చిన అనంతరం ఆమెయే

యిద్దరు ముగ్గురితో కలిసి తిరిగేది. సోదరుల మధ్య డబ్బుకోసం దోపిడీలు, హత్యలు పెచ్చు పెరిగాయి. వర్ణవ్యవస్థ ఛిన్నాభిన్నమయింది. సాధువుల వేషాలతో ధనాన్ని సంపాదించేవారు ఎక్కువయ్యారు. తండ్రిని కొడుకు గౌరవించడు. భర్తను భార్య మన్నించదు. పదహారేళ్లు పూర్ణాయుర్దాయం. అన్న, వేద విక్రయాలు ప్రతిప్రాంతంలో వున్నాయి. ఎముకలతో విగ్రహాలు తయారుచేసి గోడలకు అలంకరిస్తారు. పువ్వులోంచి పువ్వు, పండులోంచి పండు పుడతాయి.

అమావాస్యతో నిమిత్తం లేకుండా సూర్యగ్రహణం వచ్చేది. నక్షత్రాలు కాంతిహీనాలయేవి. పశు, పక్షి సంతతుల రోదనధ్వానాలు రేగాయి. ప్రజలు పల్లెలు విడిచి నగరాలలో చేరారు. ఇలా ప్రపంచం అంతా అస్తవ్యస్త స్థితిలో పడిపోతుంది. అప్పుడు ప్రళయరుద్రుంభు. సప్తసూర్యుల ఉదయం. భుగభుగ ధ్వనులతో ప్రళయాగ్ని విహారం, కుంభవృష్టి.

అలా అయాక రవి, గురు, చంద్రులు ఏక కాలంలో కర్కాట కంలో పుష్యమీ నక్షత్రంలో ప్రవేశించినప్పుడు కృతయుగం ప్రవేశిస్తుంది. సకాలంలో వానలుపడి, నక్షత్రాలు తేజస్వంతాలయి ప్రజలు జరా రోగ భీతి లేకుండా హాయిగా వుంటారు. అన్నదానాలతో, దేవపూజలతో, సత్కార్యా చరణతో ప్రపంచం నిత్యకల్యాణం పచ్చతోరణంగా వుంటుంది.

ధర్మనందనా! బకదాల్భ్య మహర్షి దేవేంద్రునికి చెప్పిన శాశ్వత సత్యాలు నీకు కొన్ని చెపుతాను.

ఇష్టం లేనివారితో సఖ్యంగా వుండవలసిరావడం, ప్రియజనులకు దూరంగావుండే స్థితి కలగడం కంటె దుఃఖహేతువు లేదు. ఏ అపేక్షా లేకుండా, దుర్జనులకు దూరంగా వుండి, పరులముందు చెయ్యి జాపకుండా, మిట్టమధ్యాహ్నవేళ శాకాహారం తీసుకుంటూ, ఆత్మస్తుతి పరనిందా లేకుండా జీవించేవాడు సుఖజీవి అని ఎన్నెన్నో ఉపాఖ్యానాలు చెప్పి ధర్మవ్యాధుని గాథ ప్రారంభించి:

# ధర్మవ్యాధుడు

పాండురాజ నందనా! చాలాకాలం క్రితం మాట. ఆ రోజులలో కౌశికుడని ఒక విప్రుడు వేద వేదాంగవిదుడు చెట్టుక్రింద కూర్చుని తపస్సు చేసుకుంటూ భిక్షాటనతో జీవించేవాడు. ఒకనాడు ఆ చెట్టు మీది కొంగ రెట్ట విడిచింది. ఆయన కోపంతో కనుల్తెర జేయడంతో అది మాడిపోయింది.

ఆ సన్నివేశంతో ఆయన మనస్సు చింతాకులమైంది. కొంతసేపు దుఃఖించి భిక్షాటనకు బయలుదేరాడు.

భవతీభిక్షాందేహి అని ఒక గడపదగ్గర నిలిచాడు. వస్తున్నా అని ఆ ఇల్లాలు రాబోతున్నది. అంతలో ఆమె భర్త తిరిగి, తిరిగి వచ్చాడు. భర్తకు కాళ్ళు కడుగుకుందుకు నీళ్ళు యిచ్చి సుఖాసనం మీద కూర్చుండబెట్టి, తృప్తిగా భోజనం పెట్టి తాంబూలమిచ్చి ఆయన విశ్రమించాక గడపలో భిక్షార్థి వున్న విషయం గుర్తుకు వచ్చి అన్నం తెచ్చి పెట్టబోయింది.

కౌశికుడు తీవ్ర క్రోధంతో: నీ ప్రవర్తన మాకు నచ్చలేదు, అనగా —

ఆర్యా! స్త్రీకి పతిని మించిన దైవం లేదు. ఆయన సేవానంతరమే ఏ పని అయినా, అనగా ఆయన తన ప్రతాపం చూపడానికి కన్ను తెరజేస్తూంటే —

స్వామీ! మీ క్రోధాగ్నికి భస్మం కావడానికి నేను కొంగను కాను. భర్తను ఆరాధించి అందులోనే సర్వదేవతలనూ తృప్తిపరిచేదాన్ని. మీరింకా ధర్మవిషయాలు తెలుసుకోవాలంటే మిథిలానగరంలో ధర్మవ్యాధుడనే బోయ వున్నాడు. వానిని అర్థించండి అంది.

కౌశికుడు మిథిలకు చేరి, ధర్మవ్యాధుని నివాసం తెలుసుకొని, పంది మాంసమూ, మేకమాంసమూ విక్రయించే ఆ స్థలానికి నాలుగడుగుల దూరంలో నిలబడ్డాడు.

ఆ విప్రుని చూస్తూనే ధర్మవ్యాధుడు వానిని సమీపించి —

మీరు సద్విప్రులు, మిమ్ము పంపిన పతివ్రతా శిరోమణికి మీకు నమస్సులు, అనడంతో కౌశికుడు ఆశ్చర్యచకితు డయాడు.

ఆయనను వెంటబెట్టుకొని తన యింటికి తీసుకు వెళ్ళి అర్ఘ్యపాద్యాలిచ్చి-

వృద్ధులయిన తల్లిదండ్రులను సేవిస్తూ అతిథులనూ, దేవతలనూ ఆరాధిస్తూ తరతరాలుగా వచ్చే నా కులవృత్తిని నీతి తప్పకుండా ఆచరిస్తున్నాను. నామీద ఆధారపడిన వారందరూ తృప్తిగా భుజించాక నేను భోంచేస్తాను. ధర్మచ్యుతి కాకుండా కులధర్మాన్ని ఆచరించడమే ఎవరికయినా విధి. మా రాజ్యంలో కన్నకొడుకు అక్రమంగా చరించినా తండ్రి వానిని యథాన్యాయం శిక్షించి తీరుతాడు. అహింస, సత్యవాక్పాలన - ఈ రెండు మానవునికి ఉత్తమస్థితి కల్పిస్తాయి. అయితే నేను మాంస విక్రయం చేస్తూంటే జీవహింస జరుగుతున్నది కదా అంటారు. కాని ఈ ప్రాణికోటి ఒక దానిమీద ఒకటి ఆధారపడి జీవిస్తున్నాయి. మీరు తినే శాకాలలో ధాన్యాలలో జీవంవున్నది కదా. ప్రాణధారణకు అవసరమయిన ఆహారంకోసం జరిపేది హింసకాదు. ఇది ధర్మసూక్ష్మం. ఇలా ఎన్నెన్నో వున్నాయి.

మనస్సును రాగ ద్వేష శృంఖలాలనుండి తప్పించి బుద్ధిని ధర్మమార్గంలో వుంచుకో గలగడం కంటె చెయ్యవలసింది లేదు —

అంటూ ఎన్నెన్నో లౌకిక, పారలౌకిక విశేషాలు వినిపించి, రండి - ఈ వృద్ధులయిన నా జననీజనకులకు ఏ క్లేశము రాకుండా సేవించడం వల్లనే నాకీ జ్ఞానం లభించింది. మాతా పితృ సేవయే నా తపస్సు. అని నమస్కరించాడు.

ధర్మనందనా! విన్నావు కదా

అని మార్కండేయుడు మరెన్నో గాథలతో వారిని సంతృప్తిపరచాడు. అలా రోజులు గడుస్తున్నాయి.

# సత్యభామ

ఒకనాడు సత్యభామ ద్రౌపదిని సమీపించి —

వదినా! లోకపాలకులతో సమానులయిన వారు నీ భర్తలు, వారెప్పుడూ ప్రసన్నవదనాలతో నిన్ను చూస్తారు. పల్లెత్తి పరుషం పలకకుండా, కన్ను లెర్రజేయకుండా వుంటున్నారే. ఏ వ్రతంచేస్తే, మరే ఔషధం ప్రయోగిస్తే, ఏ మంత్రం ఉపాసిస్తే, ఏ గంగాస్నానం చేస్తే భర్త యింత అనుకూలంగా వుంటాడో ఆ రహస్యం చెబుదూ, అంది.

ద్రౌపదీదేవి చిరునవ్వునవ్వి: భామామణీ! నువ్వు చెప్పిన వ్రతాలు, మంత్రాలు, మందులూ, స్నానాలూ మనవంటివారికి కాదమ్మ; శీలరక్షణ తెలియని కుత్సితస్వభావులకు అవి కావాలి, అసలు మన మనస్సు అటువంటి ఊహలనే రానివ్వకూడదు.

భర్తను వశపరచుకుందుకు మందులూ, మంత్రాలు ప్రయోగిస్తున్న విషయం తెలిసిన ఉత్తరక్షణంలో త్రాచుపాము చేరిన యింటిని చూసినట్లే చూస్తారు. వారి మనస్సు అశాంతితో నిండిపోతుంది.

ఇక మందులు; ఇవి తినిపించడంవల్ల వారు భయంకరరోగాలకు గురి అవుతారు. ఉన్మాదులు కావచ్చు. కొందరు ఈ మందులు తిని మరణించనూ వచ్చు. నడివయస్సులో వున్న భర్తకు వార్ధకమూ, మూగతనమూ, చెవుడూ ప్రాప్తించవచ్చు. అందుచేత ఈ దారులేవీ అనుసరించరాదు.

ఇక నేను సాధించిన మార్గం; అహంకార, దురభిమానాలను ధరి జేరనివ్వను. ఎవరితోనూ పరుషంగా మాట్లాడను. ఎక్కడపడితే అక్కడ నిలబడి అనవసర విషయాలను చూస్తూండను. సిగ్గులేని దానిలా అందరి తోనూ మాట్లాడను. మనకు పరిచయంలేనివారివైపు చూడాలని కూడా అనిపించదు. నిరంతరం మావారి మనస్సును గ్రహించి దానికి అను గుణంగా నడుచుకోవడమే నేను సాధించిన బ్రహ్మవిద్య. వారు సంపదలతో

తులతూగిననాడు ఏ గౌరవం చూపానో ఈ నాడిక్కడ కూడా అదే దృష్టితో చూస్తున్నాను.

ఏ పనిమీదయినా వారు యిల్లు విడిచిపెట్టి వెళ్ళినప్పుడు తిరిగిరాగానే చేతిలోవున్న పని విడిచేసి, నవ్వుతూ స్వాగతమిచ్చి, పాద ప్రక్షాళనానికి నీరిచ్చి, స్వాదుజలాలందించి వారి సేవలోనే వుంటాను. ఎవరికేది రుచియో వారికోసం ఆ వంట నేనే స్వయంగాచేసి వడ్డించి చిరునవ్వుతో వారిచేత తినిపిస్తాను. ఇల్లు పరిశుభ్రంగా ఉండేలా నేనే చూస్తాను. సోమరితనాన్ని నా దరిదాపులకు రానివ్వను. పరిహాస ప్రసంగ సమయంలో తప్ప వారిముందు కూడా నవ్వుతూ వెకిలిగా నిలబడను. తోటలలో ఒంటరిగా తిరగను. నీచులను దరిజేర నివ్వను. అసంతృప్తి అనేది నేనెరగను. అసలు కోపమే రానివ్వను. వచ్చినా క్షణంలో తోసేస్తాను. భర్త తోడులేకుండా పరగృహంలో కాలుపెట్టను. ప్రసంగాలు వింటానే తప్ప అందులో నా తెలివి ప్రదర్శించను. వారు దేశాంతరం వెడితే అలంకారాలు ముట్టను. అలంకారశూన్యంగా, అపరిశుభ్రవస్త్రాలతో జుట్టు విరబోసుకుని వారికెప్పుడు కనపడను.

కుంతీదేవి యీ కుటుంబజనంలో ఎవరెవరితో ఎలా ప్రవర్తించేదో అలానే నడుపుతున్నాను. అత్తగారిని ఒక్కమాట కూడా అనను. ఆవిడకూ, వీరికి ఎదురుచెప్పి వాదాలు చెయ్యను. మనస్సు నిర్మలంగా వుంచుకొని ఉషఃకాలంలో నిద్రలేచి ఎవరెవరి అవసరాలేమిటో అన్నీ స్వయంగా చూస్తాను.

ఇంద్రప్రస్థంలో వున్న రోజులలో ఎనిమిదివేలమంది వేదవిదులూ, ఎనభై ఎనిమిది వేలమంది విద్యార్థులూ, ఇంకా ఎందరో అతిథులూ, అభ్యాగతులూ, వారందరి భోజన భాజనాలూ స్వయంగా చూసుకునేదాన్ని. ఇంకా మా పరిచారికాగణం - వారందరి సుఖ సంతోషాలూ నా బాధ్యతే.

ఆదాయ వ్యయాలు ఎప్పటికప్పుడూ చూసుకునే దాన్ని. మా కోశాగారంలో నాకు తెలియనిది లేదు. అది అక్షయంగా ఉండేటట్లు చూసేదాన్ని. అందరికన్నా ముందు నిద్రలేచి అందరూ సుఖంగా నిద్రించాక నేను శయ్యాగారం చేరుతాను. వీటితోనే నేను వారి అనుగ్రహం పొందాను.

సుఖంవల్ల సుఖం రాదు సత్యభామా! దుఃఖానుభవం కలిగితేనే సుఖం తెలిసేది.

ప్రాంగణంలో భర్త కనిపించగానే దాసీలను పిలిచి ఆయనకు అవస రాలు చూడమనకు. నువ్వే స్వయంగా ఆయనను సేవించు. నీ భర్త నీకు ఏ విషయం చెప్పినా అది పరమరహస్యంగా వుంచు, రహస్యం కాకపోయినాసరే. నీ భర్త శ్రేయోభిలాషులూ, స్నేహితులూ కనిపించినప్పుడు వారి విషయంలో అనాదరం కనిపించనివ్వకుండా, వారి భోజన భాజనాలు అన్నీ స్వయంగా చూసుకో. ఆయనకు గిట్టనివారుంటే వారి వయిపు చూడనే చూడకు.

ఊసుపోకకు చాడీలు పలికే ఆడవారిని నీ దగ్గరకు రానీయకు. కొడుకులతో అయినా సరే ఏకాంతంలో వుండకు. ఎప్పుడూ చిరునవ్వుతో సువాసనలీనే పూలు ముడిచిన సిగతో అంగరాగాలంకారాలతో, పరిశుభ్ర వసనం ధరించి, వినయంగా భర్తను సేవించడానికి ఎదురు చూస్తూ వుండు. అప్పుడు వాసుదేవుడు తన అనురాగ సామ్రాజ్యానికి నిన్ను పట్టమహిషిని చేస్తాడు అంది. అలా కొన్ని రోజు లక్కడ గడిపిన అనంతరం వాసు దేవుడు ధర్మరాజాదులకు ఆశ్వాసనవాక్యాలు పలికి సత్యభామా సహితుడై ద్వారకానగరానికి ప్రయాణమయాడు.

## ఘోషయాత్ర

పాండవులు మునిజనసేవతో, పరమేశ్వరారాధనతో కాలం గడుపు చున్నారు. వనవాస క్లేశంతో వారి శరీరాలు కృశిస్తున్నాయి - అని ధృతరాష్ట్రుని సమీపించిన ఒక వేదవిదుడయిన విప్రుడు చెప్పగా విన్న ఆ చక్రవర్తి వారికి కలిగిన క్లేశాలకు కొంతసేపు దుఃఖించి వనవాస సమయంలోనే అర్జునుడు దివ్యాస్త్రాలు సాధించిన విషయాలు స్మృతికి రాగా మరింత బాధపడ్డాడు. పాంచభౌతికదేహంతో ఇంద్రలోకం దర్శించి అక్కడ అనేకాస్త్రాలు అర్జునుడు ప్రయోగ ఉపసంహారాలతో నేర్చి రావడంకంటె హృదయానికి ఆఘాతం మరేముంది నాకు - అని శోకించడం విన్న శకుని, కర్ణులు దుర్యోధనుని సమీపించి:

కురువంశ శిరోభూషణ! నువ్విప్పుడు శత్రువులను పరాజితులను చేసి దేవేంద్రుని వలె వెలుగుతున్నావు. ఈ వైభవాన్ని చూసి నీ హితులందరూ ఆనందించి, అభినందించడం కంటె విరోధివర్గం నీ రాచరికం చూసి తలవంచడమే మనకెక్కువ ఆనందం. ఆపదలో చిక్కి అనాధలవలె దిక్కులు పట్టిపోయిన శత్రువులను చూసినప్పుడే మనకు హద్దులు లేని ఆహ్లాదం కలుగుతుంది - అని, సమయం కనిపెట్టి ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళి, మహారాజా! మన గోగణాలన్నీ యిప్పుడు ద్వైతవనంలో వున్నాయి. ఒక్కమాటు వాటి మంచిచెడ్డలు చూచిరావాలి - అనగా, ఆయన: పాండవులు ద్వైతవనం చేరారని విన్నాను. అక్కడి కిప్పుడు మీరు వెళ్ళడం మంచిది కాదు - అన్నాడు. తాము పాండవుల వయిపు వెళ్ళ బోవడం లేదని, గోవులను చూసి వస్తామని నమ్మబలికి, అనుచరవర్గంతో అలంకారశోభితులయి, దుర్యోధన, దుశ్శాసనశతం, శకుని, కర్ణులు బయలుదేరి వెళ్ళారు.

ద్వైతవనంలో భల్లూక, ఖడ్గ, శార్దూలాది మృగాలను వేటాడి, ఒక సరోవర సమీపానికి చేరి, అక్కడ విహరిస్తున్న చిత్రసేనుడనే గంధర్వుని అనుచరులను వెడొంగమన్నారు. అంతలో వారు కుపితులై దుర్యోధనుని అనుచరులను బంధించారు. కౌరవయోధులు యుద్ధ సన్నద్ధులయారు. చిత్రసేనుడు వారినందరిని మూర్ఛితులను చేసి దుర్యోధనుని బంధించాడు.

ఈ వార్త ధర్మరాజుకు తెలిసి భీమార్జునులతో గంధర్వులమీద యుద్ధానికి వచ్చాడు. వచ్చినవాడు అర్జునుడని తెలిసి చిత్రసేనుడు వానిని సమీపించి, అమరావతిలో తన స్నేహవార్తలు ముచ్చటించి, ధర్మజుని కోరిక మేరకు దుర్యోధనుని విడిచిపెట్టాడు.

కాగలకార్యం గంధర్వులు తీర్చినా మనం దుర్యోధనుని విడిపించడం నాకు నచ్చలేదన్నాడు, భీమసేనుడు. ధర్మరాజు శాంతంగా ఓదార్చాడు.

తిరిగి వెడుతూండగా దుర్యోధనుడు విషాదవదనంతో, యింతటి పరాభవంతో హస్తినాపురం వెళ్లడానికి మనస్కరించలే దనగా —

మహారాజా! పాండవులు మీ రాజ్యంలోని అరణ్యంలో వుంటున్నారు. కనక వారు మీ సేవకులు కనుకనే వారు తమ ప్రభువుగా మిమ్ము

రక్షించారు - అనగా దుర్యోధనుడు ఏమయినా శత్రువుల వల్ల రక్షణ పొందడంకంటే మరణం మేలు - అన్నాడు.

మహారాజా! ఈ అరణ్యావాస అజ్ఞాతవాసాలు పూర్తికాగానే పాండవులను నేను సంహరించి తీరుతాను - అని ధనుస్సు చేబూని ప్రతిజ్ఞ చేసి, మనం హస్తినాపురం చేరగా నేను దిగ్విజయయాత్ర సాగించి, ఈ భూమండలాన్ని నీ పాదాక్రాంతం చేస్తానన్నాడు కర్ణుడు. దుర్యోధనుడు సంతుష్టుడై హస్తినాపురం చేరాడు.

కర్ణుడు వన, నది, సాగర పరివృత పర్వత భూమండలాన్ని జయించి అపార ధనరాసులతో తిరిగి రాగానే దుర్యోధనుడు రాజసూయవాంఛ ప్రకటించి పురోహితుని రావించగా ఆయన రాజసూయం చేసిన ధర్మరాజు జీవించి వుండగా మరొకరు రాజసూయం తలపెట్టకూడ దన్నాడు. దానికి ప్రత్యామ్నాయంగా వైష్ణవయజ్ఞం ఉన్నదనీ అది సాగించవలసిందనీ, అనగా, ఆ ప్రయత్నాలు ఆరంభించాడు.

ఆ యాగ దర్శనానికి రమ్మని పాండవులకు వార్త పంపారు. అరణ్యవాససమయంలో నగరప్రవేశం కూడనిపని కనక రాలేమన్నాడు - ధర్మరాజు.

ద్వైతవనంలో వుండగా ఒకనాడు క్రూరమృగాలు కొన్ని ధర్మరాజును సమీపించి; స్వామీ! మాయందు కనికరించి, ఈ అడవి వదిలి పెట్టండి. మా సంఖ్య పూర్తిగా క్షీణించింది. మాజాతిని సర్వనాశనం చేయకుండా విడిచిపెట్టండి - అని ప్రార్థించగా ధర్మరాజు సోదర, పరిజన సహితుడై ద్వైతవనం నుంచి కామ్యకవనం చేరాడు.

పదకొండు సంవత్సరాలు గడిచాయి.

## దుర్వాసుడు

దుర్యోధనుని అతిథిసత్కారాలతో సంతృప్తుడయిన దుర్వాసుడు వాని కోరిక ననుసరించి తన శిష్యులతో పాండవులున్న చోటికి వచ్చి, తనకు భోజనం కావాలనీ నదీస్నానం చేసి వస్తాననీ వెళ్ళాడు.

అప్పటికి అందరి భోజనాలు అయి ద్రౌపది కూడా భుజించి పాత్ర కడిగేసింది. ఆనాటి కిక అతిథి సత్కారావకాశం లేదు. ద్రౌపది చింతాక్రాంత చిత్తయై కృష్ణుని స్మరించింది. ఆయన ప్రసన్నుడై తనకు ఆకలిగా ఉన్నదనీ, పచనపాత్ర తెమ్మనీ అన్నాడు. పాత్ర పరిశుభ్రంగా కడిగేశానంటూ ద్రౌపది పాత్ర తెచ్చింది. ఆ పాత్రలోపలి అంచులో ఆ పూట వండిన పాకలేశం దొరికింది. అది వాసుదేవు డారగించి, యీ పత్రలేశంతో విశ్వాత్ముడు తృప్తుడవుగాక - అన్నాడు.

అక్కడ నదీస్నానం చేసి సంధ్యవార్చి బయలుదేరుతున్న శిష్యు లందరూ: మహామునీ! మా కడుపులన్నీ నిండుగా వున్నాయి. గుక్కెడు నీళ్ళకు కూడా అవకాశం లేదన్నారు. తనూ అదేస్థితిలో వున్న దుర్వాసుడు తన అంతేవాసులతో అటునుంచి అటే వెళ్ళిపోయాడు.

వారి రాకకోసం నిరీక్షించిన ధర్మరాజు చూచి రమ్మని తమ్ముని పంపాడు. అతడు నదీతీరానికి వెళ్ళి వారు ఎటో వెళ్ళిపోయారని అక్కడి మునులవల్ల విని అన్నగారికి చెప్పాడు.

## సైంధవుడు

కొన్నిరోజులు గడిచాయి. పాండవులు పరిజనంతో దూరంగా వేటకు వెళ్ళారు. ద్రౌపది ఒంటరిగా ఆశ్రమ ప్రాంగణంలో చెట్టు నీడన వున్నది. ఆ సమయాన సైంధవుడు తన పరిజనులతో మిత్రులతో రథాల మీద వెడుతూ:

మిత్రమా! ఆ సౌందర్యవతి ఎవరో తెలుసుకురా అనగా వాడు వెళ్ళి వచ్చి సమాచారం చెప్పగానే సైంధవుడామెను సమీపించి తనవాంఛ తెలియజేయగా —

ద్రౌపది తాను పాండవపత్నిననీ, సైంధవునికి చెల్లెలి వరుస అనీ ఎంత చెప్పినా వినకుండా ఆమెను త్వరత్వరగా రథంమీదికి ఎక్కించి, వేగంగా గుర్రాలను నడిపాడు. అప్పుడే వచ్చిన ధౌమ్యులవా రది చూస్తూనే మ్రాన్పడ్డాడు. తిరిగి వచ్చిన పాండవులు విషయం తెలుసుకొని తీవ్రగమనంతో

వెళ్ళి సైంధవుని అనుచరులను నేలకూల్చి వానిని బంధించారు. భీమసేనుడు వానికి కేశఖండనం చేసి ద్రౌపది ముందు నిలబెట్టి కత్తిదూశాడు. ఉభయవంశాలకూ ఒకే ఒక ఆడబిడ్డ దుస్సల. ఆమెను అనాధను చెయ్యడం మంచిదికాదను ద్రౌపది వారించడంతో విడిచేశాడు.

ఆ అవమానం భరించలేక సైంధవుడు తపస్సుచేసి, పరమశివుని అనుగ్రహంతో పాండవులలో అర్జునుని తప్ప మిగిలినవారిని ఎదుర్కోగల వరం పొంది స్వదేశం చేరాడు.

పాండవులు ధర్మతత్పరులై మునిగణ సేవలు చేస్తూ గడుపుతున్నారు.

ఒకనాడు ధర్మరాజు మార్కండేయ మహర్షితో మాట్లాడుతూ: ఋషి పుంగవా! నా వలె యిలా వనవాసక్లేశా లనుభవించిన వారెవరయినా వుంటారా, అని ప్రశ్నించగా ఆయన రామకథ అంతా వినిపించి:

నాయనా! అన్ని క్లేశాలు మీదపడ్డా ధర్మపథం విడవక వరించాడాయన - వనవాసం పూర్తిచేసి పట్టాభిషిక్తుడై ప్రజారంజకంగా పాలించాడు. అలానే నీ సోదరుల సాయంతో నువ్వు రాజ్యాధిపత్యం చేపడతావు - అన్నాడు.

మహర్షి! ఇంతటి పతివ్రతా శిరోమణి అయిన ద్రౌపదికి రావలసిన కష్టాలేనా యివి. అని మళ్ళీ ప్రశ్నించగా మార్కండేయుడు, సావిత్రికథ చెప్పి ఆమెవలెనే ఈ పతివ్రత శిరోమణి మీ కష్టాలను హరించగలదు - అని ఆశ్వాసన వాక్యాలు పలికాడు.

అలా అనేకానేక కథా కాలక్షేపాలతో వనవాస సమయం పూర్తి కావస్తుండగా ఒకనాడు యమధర్మరాజు పెట్టిన పరీక్షలో ధర్మరాజు యక్ష ప్రశ్నలకు సమాధానాలిచ్చి ఆయనవల్ల అజ్ఞాతవాసంలో ఎవర్తూ తమను గుర్తుపట్టకుండా వుండే వరాలు పొంది, పరిజనులందరినీ విడిచి ధౌమ్యుల వారితో రహస్యయాత్ర సాగించాడు - అని అరణ్యపర్వం ముగించాడు వైశంపాయనుడు.

## అరణ్యపర్వం సమాప్తం

దుర్వారోద్యమ బాహువిక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీరనిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసన్ గిట్టి గం
ధర్ముల్ ప్రాణమ్ముమానముంగొనుటతథ్యం బెమ్మోయింగీచకా!

# విరాటపర్వం

ఇందులో:

విరాటనగర ప్రవేశం

కీచకవధ

దక్షిణగోగ్రహణం

సుశర్మ పరాభవం

ఉత్తరగోగ్రహణం

విజయశ్రీ

కల్యాణవేదిక

# విరాటనగర ప్రవేశం

అరణ్యావాసం పూర్తి అయింది.

అజ్ఞాతవాసానికి సంకల్పించి పాండవులు బాగా ఆలోచించి తమమీద గౌరవమూ, ఆదరమూ కల మత్స్య దేశాధిపతి విరాటరాజు ఆస్థానంలో చేరటానికి నిశ్చయించుకున్నారు.

అప్పుడు ధర్మరాజు తాను కంకభట్టు నామంతో ప్రవేశించి, మహా రాజుతో ద్యూతక్రీడ సాగించే పనిలో వుంటాననీ, ఎవరయినా తన జీవిత విశేషా లడిగితే ధర్మరాజుకి ప్రాణమిత్రుడుగా వుండేవాడననీ, వారు అడవు లుపాలు కావడంతో ఇలా దేశాలు పట్టి తిరుగుతున్నానని నమ్మించగలను - అన్నాడు.

అప్పుడు భీముడు తాను వారి మహానసశాలలో వంటలవాడుగా ప్రవేశించి, భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్య, పానీయాలలో వారికి కొత్తరుచులు చూపుతాననీ, పూర్వం ధర్మరాజు దగ్గర పాకశాలాధ్యక్షుడుగా వుండేవాడినని చెప్పి కాలం గడుపుతా నన్నాడు.

ధర్మరాజు అర్జునుని వయిపు చూడగా: అన్నయ్యా! నాకు దేవలోకంలో నృత్తగానాలలో శిక్షణ లభించింది. దానికితోడు 'నపుంసకుడవు కమ్ము' అనే శాపం ఉంది. ఇప్పుడు నేను బృహన్నలా నామంతో వారి అంతఃపుర జనానికి ఈ కళలు నేర్పే అధ్యాపకుడుగా చేరి, నేను పూర్వం ద్రౌపదికి పరిచారకుడుగా వుండేవాడినని చెప్పి కాలం గడుపుతాను - అన్నాడు.

నకులుడు లేచి నేను గ్రంధికనామంతో వారి అశ్వరక్షకుడుగా చేరు తాను, అనగా సహదేవుడు తంత్రీపాల నామంతో వారి గోశాలలో ప్రవేశిస్తా నన్నాడు.

కన్నీరు ఒత్తుకుంటూ ధర్మరాజు ద్రౌపదివైపు తిరిగాడు.

మహారాజా! ఈ లోకంలో స్వతంత్ర ప్రతిపత్తితో దాసీపనిచేసే సైరంధ్రీజాతి ఒకటున్నది. అంతఃపురాలలో నారీజనానికి కేశాలంకరణ

చేయడం, పూలమాలలతో అలంకరించడం వారి పని, ఆ వృత్తిలో నేను ప్రవేశిస్తాను, మాలిని అనే పేరుతో - అంది.

ఈ నిశ్చయాలకు పూర్వమే తమవెంట నున్న వారందరికీ వీడ్కోలిచ్చి, ధౌమ్యులవారితో ధర్మరాజు కొంతదూరం నడిచాడు. అప్పుడు ఆ పురోహితుడు:

ధర్మనందనా!

రాజభవనానికి వెళ్ళదలచినవారు ముందుగా అనుమతి పొందాలి. సభాభవనంలో ఎక్కడ కూర్చుంటే మనల్ని ఎవరూ కదపరో అక్కడే కూర్చోవాలి. ప్రభువు అభిమానం పొందినాము కదా అని మనచిత్తం వచ్చినట్లు చరించకూడదు. కొన్ని, కొన్ని సందర్భాలలో సాహసించి, ప్రభుసేవ సాగించాలి. సాధ్యమయినంత వరకూ రాజాజ్ఞకోసమే ఎదురు చూస్తూ వుండాలి.

రాణీవాసంతో పరిచయం పెరగనివ్వకూడదు. వారి బంధుజనంతో అతిగా సంబంధం పెంచుకోకూడదు. రాజద్రోహులను మన దరికే రానివ్వకూడదు.

యుద్ధ సమయాలలో ప్రభువు అవమానించినా లక్ష్యపెట్టకూడదు. అతి రహస్య విషయాలు సభామాధ్యంలో ప్రస్తావించే ప్రయత్నమే పనికిరాదు. ప్రభుగణం దగ్గర మన ఘనత కీర్తించుకుంటే చాలా అనర్థా లున్నాయి. సభలో కాళ్ళూ చేతులూ ఆడించడం, వెకిలిగా నవ్వడం వికారచేష్టలు చెయ్యడం ఏ వ్యక్తికీ తగనివే. అయితే సందర్భానుసారం మందహాసం చెయ్యాలే కాని మరీ బిర్ర బిగిసి పెదవులు ముడుచుకు కూర్చోకూడదు.

మితంగా సత్యభాషణం చెయ్యాలి. దేశాంతరాలు వెళ్ళ వలసివస్తే నిస్సంకోచంగా ముందడుగు వెయ్యాలే తప్ప భార్యా - బిడ్డలకు దూరం కావలసి వస్తుందేమో అనుకునేవాడు రాజసేవకు పనికిరాడు. ప్రభువు మనకిచ్చిన కానుకలు ఉచితంగా అలంకరించుకుంటూ వుంటూండాలి.

ఏ పరిస్థితుల్లోనూ వారికి అనుమానం కలిగేటట్లు చరించకుండా, వారి అభిమానం పొందడానికి ప్రయత్నించేవాడు ఎంత కాలమయినా రాజానుగ్రహం పొందుతాడు. కనుక మీరు నిశ్చింతగా వెళ్ళిరండి -- అని బోధించి అగ్నిని ప్రజ్వలితంచేసి పాండవుల శ్రేయస్సును కోరుతూ, హోమం జరిపి, ద్రౌపదీ సమేతం వారిచేత ప్రదక్షిణం చేయించాడు.

ఆ ఆరుగురి నమస్కారాలు అందుకుని ధౌమ్యులవారు పాంచాలదేశం వైపు నడిచారు. పాండవులు విరాటనగరం వయిపు నడుస్తున్నారు.

యమునానది దక్షిణతీరం వెంట సాగిసాగి దశార్ణదేశానికి ఉత్తరంగా పాంచాలానికి దక్షిణంగా వెడుతున్నారు. మీసాలూ, గడ్డాలూ పెరిగిపోయాయి. కట్టుబట్టలు ధూళిధూసరితా లయాయి. నెమ్మదిగా మత్స్యదేశ సమీపంలోని జనపదంలో అడుగు పెట్టడానికి ముందు, ద్రౌపది:

మహారాజా! నేను బాగా అలసిపోయాను. ఇంక అడుగు కదపలేను, అనగా ధర్మనందనుడు: అర్జునా! ఈ రోజుతో మనం అడవి విడిచి జనపదం చేరాలి. అజ్ఞాతవాసం ఈనాడే ప్రారంభం కావాలి. కనుక ఈ ద్రుపదరాజ పుత్రిని నీ భుజస్కంధాలమీద వహించి తీసుకురా, అన్నాడు. ప్రయాణం మరికొంత సాగిన తరువాయి, ధర్మరాజు: మనం ఈ ఆయుధాలతో నగరప్రవేశం చేస్తే అందరూ భయపడతారు. పయిగా విశ్వవిఖ్యాతమయిన ఈ గాండీవం చూడగానే జనులు మనలను గుర్తుపట్టగలరు. అందుచేత వీటిని రహస్యస్థానంలో వుంచి వెళ్ళాలి - అన్నాడు.

అర్జునుడు నలువంకలా చూచి:

అగ్రజా! అదిగో, వల్లకాటికి సమీపంలో జమ్మిచెట్టు. దాని పరిసరాలలో క్రూరమృగాలు విచ్చలవిడిగా చరిస్తున్నాయి; బాటకు దూరంగానూ ఉంది. కనుక అక్కడ భద్రపరుద్దాం - అని, ఆయుధా లన్నిటినీ కట్టగా కట్టి, నకులుని చేతికిచ్చి చెట్టుమీద దృఢంగా బంధింప జేశాడు.

మళ్ళీ కొంతదూరం నడిచి, విరాటనగర సరిహద్దులు చేరుతుండగా ధర్మరాజు దుర్గాస్తుతి చేస్తూ:

బాలార్క సదృశాకారే పూర్ణచంద్ర విభాననే
చతుర్భుజే చతుర్వక్త్రే పీనశ్రోణి పయోధరే!
జయా త్వం విజయాచైవ సంగ్రామేచ జయప్రదా
మమాపి విజయం దేహి వరదా త్వం చ సాంప్రతమ్....

అని పవిత్ర గంగానదీ స్నానం చేసి, తర్పణాలు విడిచి, ధర్మదేవతను కూడా స్తుతించి, అజ్ఞాతవాసి యోగ్యంగా తరుణ బ్రాహ్మణవేషం ధరించాడు. అలానే మిగిలిన వారు తమ తమ వేషాలు మార్చుకున్నారు.

కంకభట్టువేషంలో కొలువుకూటానికి వస్తున్న ధర్మరాజును చూచి విరాటుడు - సభాసదులారా! ఇటువస్తున్న మహాపురుషుని చూశారా! వేషం విప్రసదృశంగా వున్నా, మూర్ధాభిషిక్తుడయిన మహారాజులా, దేవేంద్రునివలె కనిపిస్తున్నాడు. అదిగో మత్తేభ గమనంతో యిటే వస్తున్నాడు - అంటుండగా కంకభట్టు సభలో ప్రవేశించి:

ప్రభూ! సర్వసంపదలూ కోలుపోయిన విధివంచితుడను. మీ సేవకోసం వచ్చాను. అనగా, విరాటుడు వానికి అతిథి సత్కారాలు జరిపించి కులగోత్రాలు ప్రశ్నించాడు.

ఆర్యా! నేను వైయాఘ్రపద గోత్రీక విప్రుడను. నన్ను కంకభట్టు అని లోకులు పిలుస్తారు. ద్యూతవిద్యలో కుశలుడను, ధర్మజుని కొలువులో ఉండేవాడిని - అన్నాడు.

అప్పుడు విరటుడు: విప్రశ్రేష్ఠా! నీకేం కావలసినా ఇస్తాను. నాకు అక్షవిద్య తెలిసిన వారంటే చాలా ఇష్టం. నీకు కావలసింది కోరుకో — అన్నాడు.

మహారాజా! నీచులతో నన్ను వివాదానికి దింపకూడదు. జూదంలో పందెం పెట్టిన ధనం అప్పటికప్పుడే నాకు సమర్పించాలి. ఇందుకు మీ కంగీకార మయితే మీ కొలువులో వుంటాను - అన్నాడు.

అంగీకరించాడు విరటుడు.

కంకభట్టు ప్రవేశించిన అనంతరం కొద్దిరోజుల వ్యవధిలో భీముడు వల్లవుడనే పేరుతో వంటలవాడుగా ప్రవేశించాడు.

అనంతరం ఒకనాడు సైరంధ్రీ రూపంలో వీధిలో వెడుతూన్న ద్రౌపదిని చూచి రాజపత్ని సుధేష్ణ పరిచారికలను పంపి లోపలకు రప్పించి, ఆమె కులగోత్రాలడిగింది.

అమ్మా! నేను సైరంధ్రీ వృత్తిలో జీవిస్తున్నాను. నన్ను సత్యభామా, ద్రౌపదీకూడా మెచ్చుకున్నారు. నాకు మీ దగ్గర సేవచేసే అవకాశం ఇప్పించండి అనగా సుధేష్ణ:

అమ్మాయీ! నీ సౌందర్యం ఈ అంతఃపుర స్త్రీ జనాన్నే వ్యామోహ పరుస్తున్నది కదా! నిన్ను చూసి మా మహారాజు మనసు చలిస్తే నేనేం కావాలి? నీ చిరునవ్వు పురుషుల నేత్రాలకు తాళ్ళుపోసి బిగించేలా వుంది, అంటూంటే ద్రౌపది:

మహారాణీ! నా భర్త లయిదుగురూ గంధర్వులు. వారెప్పుడూ నన్ను కాపాడుతుంటారు. ఏ పురుషుడు నన్ను కామదృష్టితో చూసినా నా భర్తల బారినుండి బయటపడడు, అని నచ్చజెప్పి ప్రవేశించింది.

అనంతరం నకులుడు గ్రంథిక నామంతో అశ్వరక్షకుడుగా, సహదేవుడు తంత్రీపాల నామంతో గోరక్షకుడుగా చేరారు.

సహదేవుడు ప్రవేశించిన అనంతరం అర్జునుడు బృహన్నలారూపంలో నాట్యాచార్యుడుగా కొలువు కుదుర్చుకున్నాడు.

జనమేజయ మహారాజా! రాజర్షియైన తృణబిందుని అనుగ్రహమూ, ధర్మదేవత వరప్రభావమూ కారణంగా పాండవులు నిశ్చింతగా అజ్ఞాతవాసం సాగిస్తున్న రోజులలో ఒక నాడు అంతఃపురానికి వచ్చిన కీచకుడు ద్రౌపదిని చూసి, ఆ సౌందర్యానికి మోహితుడై, ఆమెను సమీపించి:

జగదేక లావణ్యలహరీ! నువ్వెవరి బిడ్డవు? ఇక్కడెందుకు ఈ సేవలో బ్రతుకుతున్నావు? నీ ముఖచంద్రుడు నా మనస్సాగరాన్ని ఉల్లోల కల్లోలితం చేస్తున్నాడు. కనుక కలశ సదృశములయి. శ్రీసముపేతంగా

భాపించే నీ సమున్నత వక్షోజాల సంఘర్షణకు అలంకారంగా మణిరత్న భూషణా లుంచాలి. ఆ చక్రస్తనాలు మదనుని చేతిలోని కొరడావలె నన్ను బాధిస్తున్నాయి. నీ పృథునితంబాలు నన్ను మోకరిల్లజేస్తున్నాయి. మదనుడు నన్ను దహిస్తూంటే నీ సౌందర్యం దానికి ఆజ్యధార అవుతున్నది.

నువ్వు నా భవనానికి వచ్చి అక్కడ నాతో సర్వరాజ భోగాలూ అనుభవించు అని దీనంగా కామప్రలాపం ప్రారంభించాడు.

పరిపరివిధాల నీతిబోధ చేసింది. నిజకళత్రంతో సంసారం సాగించే వాడికి యిహపరాలలో సుఖశాంతులు లభిస్తాయని చెప్పింది.

కీచకుని మోహావేశం హెచ్చింది. మాలినికి మరింత దగ్గరగా వెళ్ళాడు. అప్పుడు వాడు సింహకిశోరాన్ని సమీపించిన జంబుకంలా వున్నాడు.

మాలినీ! ఈ కీచకుడు యింత దైన్యదశలో ఎప్పుడూ పడలేదు. వీడి సంగతి నీకు తెలీదు. అనవసరంగా నన్ను తిరస్కరించి పశ్చాత్తాప పడతావు. అని పరి పరివిధాల బ్రతిమాలి ప్రయోజనం కనపడక అక్కగారి దగ్గరకు వెళ్ళి తన మనసు విప్పు కున్నాడు. ఆవిడకూడా మందలించినా వినలేదు. వాణ్ణి పంపి, ఆ రాత్రి మద్యం తేవడం కోసం మాలినిని కీచక భవనానికి పంపింది.

మాలినీ దర్శనంతో మనసు చెదిరిన కీచకుని ఎలా అయినా సక్రమ మార్గాన పెట్టాలని సుధేష్ణ. గుణశీల సంపన్నురాలిని వాంఛించే వాడి నెత్తిమీద మృత్యువు తాండవిస్తూంటుందనీ, వాడికేకాక వాడి వంశానికీ కీడు మూడుతుందనీ, కామాంధునికి యమసదనం సన్నిహిత మయినట్లే. అని యెంత బోధించినా తలకెక్కని తమ్ముని సాగనంపింది.

కీచకుడు తన భవనానికి వచ్చి రుచికరమయిన భోజ్యాలూ, మధురాతి మధుర పానీయాలూ చేయించి సుధేష్ణకు కబురు పంపాడు.

సుధేష్ణ నెమ్మదిగా తనకు విపరీతమయిన దాహంగా వున్నదనీ, తన తమ్ముడియింట రసభరిత మధురపానీయా లుంటాయనీ స్వయంగా నువ్వే వెళ్ళి తీసుకు రావాలనీ అన్నది సైరంధ్రితో.

మహారాణీ! నేను నీ దగ్గరకు వచ్చిననాడే కొన్ని నియమాలు చెప్పాను. ఇప్పుడు మీరు నన్ను ఆ సిగ్గుమాలిన వాడి యింటికి వెళ్ళమంటున్నారు. కామోద్రేకంతో వున్న ఆ నీచుడు నన్ను అవమానించడాని కిదే అదనుగా తీసుకుంటాడు. అందుచేత యీ పని మరెవరికయినా నియోగించండి, అంది.

మాలినీ! వాడు నీకేకష్టమూ కలిగించడు. వెళ్ళి మద్యం తీసుకురా, అని సువర్ణ పాత్ర అందించింది.

గత్యంతరంలేక మాలిని బయలుదేరి వెడుతూ, సూర్యుని ప్రార్థించి, నేను నా భర్తలను తప్ప యితరు లెవరినీ నా మనసులోకి రానివ్వని దానినయితే, నా పాతివ్రత్యమే నాకు రక్షగా వుంచు, అంది.

భయసంత్రస్తహృదయంతో లేడిపిల్లలా కీచక భవనంలో అడుగు పెట్టింది. నదీ మధ్యంలో కొట్టుకు పోయేవాడికి నావ దొరికిన ట్లనిపించింది. మాలినిని చూచిన కీచకుడికి.

మాలినీ! ఈ రాత్రి నీకు సర్వసుఖాలూ సమకూరుతున్నాయి. నా దాసదాసీజనం నీకు సేవలు చెయ్యడానికి సిద్ధంగా వున్నారు. నవరత్నాలు పొదిగి ఆభరణాలు, దివ్యాంబరాలూ, నీకోసం ఎదురుచూస్తున్నాయి. అదిగో అతిమెత్తని హంసతూలికాతల్పం. నీకోసం స్వాగతం పలుకుతోంది. నీ కోకిల కంఠంతో ఒక్కమాట మాట్లాడి నా హృదయతాపం చల్లార్చు - అని అట్టహాసం చేశాడు.

ఓరి దుష్టుడా! ఉత్తమవంశంలో జన్మించిన శీలవతిని నీచబుద్ధిగల నిషాదుడు పొందలేనట్లే నువ్వు నన్ను చేరలేవు. ధర్మమార్గం విడిచి అపమార్గానపడే దురాచారులు పొందే దుర్గతి నీకు తప్పదు. దాహబాధతో వున్న మీ అక్కగారికి మద్యం కావాలంటే వచ్చాను. త్వరగా యిచ్చి పంపు, అంది.

మదిరాసవం నా దాసీలు తీసుకు వెడతారులే అంటూ కీచకుడు పట్టలేని మోహావేశంతో మాలిని దగ్గరగా చేరి, ఆమె చీరచెంగు అందు

కున్నాడు. రెండుచేతులతో వెనక్కు నెట్టింది. మూలంతెగిన చెట్టులా నేలకూలాడు కీచకుడు.

ఆ అదనులో ఆమె పరుగు పరుగున రాజభవనానికి చేరింది. ఆమెను వెన్నాడు తున్నాడు కీచకుడు.

సభాభవనంలో కొలువుతీర్చివున్న విరటుని సమక్షంలో అకార్యానికి సాహసించి బోర్లపడ్డాడు కీచకుడు.

సభాసదులందరూ కీచకుని దుర్మార్గానికి ముక్కున వేలుంచుకొని ఛీ ఛీ అన్నారు. ఆ సమయానికి అక్కడకు వచ్చిన భీమసేనుడు మాలినికి జరిగే పరాభవానికి ప్రతీకారం చెయ్యాలనుకుంటూ కొద్ది దూరంలో వున్న మహావృక్షం వయిపు దృష్టి సారించగా గమనించిన ధర్మరాజు,

వల్లవా! వంటకట్టెల కోసం ఫలపుష్ప భరితమయిన వృక్షం పెక లిస్తారా? నగరం వెలుపల కావలసినన్ని ఎండు చెట్లు దొరుకుతాయి. వెళ్ళి తెచ్చుకో, అని ద్వంద్వార్థ సూచకంగా పలికాడు. అన్నగారి మాటల అంతరార్థం అవగతమైన భీముడు లోలోపలే క్రోధాన్ని దిగ మ్రింగాడు. కుపిత భుజంగం బుసలు కొడుతున్నట్లు నిశ్వసిస్తూ మాలిని:

మహారాజా! ప్రభువుకి తన రాజ్యంలోని ప్రజలందరిమీద సమదృష్టి వుండాలి. న్యాయమూర్తిలా అధర్మాన్ని అవరోధించాలి. సజ్జనులకు రక్షణ యివ్వాలి. ఈ దుష్టుడు మీ కనుల ఎదుటనే ఎటువంటి అత్యాచారానికి ఉప క్రమించ సంకల్పించాడో చూచారు కదా! ఇటువంటి ధూర్తుల్ని దండించ లేని ప్రభువు ఏలుబడిలో ప్రజలకు శాంతి వుండదు. ధర్మాన్నీ, నీతిని విడవకుండా రాజ్యపాలనం సాగించే చక్రవర్తిగా ప్రఖ్యాతులయిన మీరు నాకు జరిగిన యీ అవమానానికి కారకుడయిన వాడిని న్యాయపథాన శిక్షించండి, అని ప్రార్థించి;

అసహాయస్థితో వున్న ఈ అబలను రక్షించగలవారే లేరా? విధివశాన యిటువంటి దాసీవృత్తికి పాలుపడిన నన్ను యిక్కడకూడా అవమానాల పాలుచేసే విధిని నిందించడం వినా నేను చేయగలిగింది లేదు. ఈ కీచకుని

స్పర్శకంటె మరణమే మేలు. కన్ను లెఱ్ఱజేసి నా భర్తలు ధనుష్టంకారం చేస్తే మహాబలులైన శత్రువులు సైతం వెన్నుజూపి పారిపోతారు; అటువంటి భర్త లయిదుగురు వున్నా నే నీ దశలో పడడం కాల ప్రభావమే. మహారాజా! మీరు కూడా నిస్సహాయస్థితిలో పడడం నా దురదృష్టం: నా భర్తలే నన్ను కాపాడలేనప్పుడు ఒకరినని లాభంలేదు - అని నిట్టూర్చి కంట తడిపెట్టింది.

సైరంధ్రీ! మీమధ్య వివాదం ఏమిటో, దాని స్వరూప స్వభావా లెటువంటివో తెలియనిదే ఎవరు మాత్రం న్యాయనిర్ణయం చేయగలరు - అన్నాడు విరటుడు.

ద్రౌపది కథా సర్వస్వం వివరించింది. అప్పుడు సభాసదులందరూ ఇటువంటి శీలవతి, సౌందర్యరాశి, యిలా అవమానం పొందడం ఉచితం కాదన్నారు.

మాలినీ! నువ్విక్కడ నిలబడటం ఉచితం కాదు. అంతఃపురానికి వెళ్ళు. భర్తృ శాసనానుసారం వర్తించే స్త్రీకి సుఖశాంతులు లభిస్తాయి. కులస్త్రీకి పతిసేవకంటె, భర్తమాటకు ఎదురు చెప్పకుండా ఆచరించడం కంటె నోములూ, వ్రతాలు, ఉపవాసాలూ, అవసరం లేదు. శత్రువులు కల్పించే క్లేశాలకు నీ భర్తలే తలవొగ్గు తున్నప్పుడు నువ్వు ఎదురు తిరగడం మంచిది కాదు. ఓరిమితో సర్వకార్యాలనూ సాధించవచ్చు. దేనికయినా సమయం సందర్భం కలిసి రావాలి. అప్పుడన్నీ సానుకూలమవుతాయి. సంవత్సర రూప కాలచక్రం పరిభ్రమించేవరకూ ఓరిమితో వుంటే సర్వసంపదలూ లభిస్తాయి. ఓరిమి పట్టడానికి శక్తి లేకపోతే అన్ని విపరీతాలే తటస్థిస్తాయి. అని ధర్మరాజు ధ్వని గర్భంగా పలికినా, ద్రౌపది అలానే నిలబడగా:

మాలినీ, నీకు సమయాసమయ పరిజ్ఞానం పోయింది. సామాన్య నటివలె సభా మధ్యంలో రోదించడం తగనిపని. ఇక్కడ రాకుమారుడు క్రీడాసక్తుడై వున్నాడు. ఆయన సంతోషానికి విఘ్నం రాకూడదు. నువ్వు వెళ్ళు. నీ భర్తలు గంధర్వులన్నావుగా. వారే ఈ వ్యవహారం పరిష్కరిస్తారు. నిన్నవమానించినవారికి మృత్యువు తప్పదు. ఇక వెళ్ళు అన్నాడు.

ద్రౌపది కోపంతోనే వెళ్ళిపోయింది. అంతఃపురములో అడుగుపెట్టగానే:

కల్యాణీ! ఇలా వున్నావేం? ఎందుకు శోకిస్తున్నావు? నీ కెవరు క్లేశం కలిగించారు? కన్నీరు తుడుచుకో అంది సుదేష్ణ.

నన్ను మీరు మద్యం తెమ్మని పంపారు.

నిర్జనారణ్యంలో కూడా ఏ క్రూరుడూ చేయసాహసించని అవినీతిక వాడు రాజసభలో తలపడ్డాడు అంది మాలిని.

మాలినీ! నువ్వు కోరితే వాడికి మరణదండన వేయిస్తాను. నీ వంటి ఉత్తమురాలిని పరాభవించినవాడిని ఉపేక్షించరాదు. కాలం నెత్తిమీద కూర్చున్నవాడే యిటువంటి అకార్యాలకు దిగుతాడు అంది సుధేష్ణ.

అమ్మా! నీ సోదరుడి జీవితం నేటితో సమాప్తం కానున్నది. ఒక్కసారి వెళ్ళి కన్నులారా చూచుకో. నా భర్తలలో ఒక మహావీరుడున్నాడు. ఆయన ముందు నిలువగల బలవంతుడెవడూ లేడు. ఈ ప్రపంచాన్నే సర్వనాశనం చేయుగల మహావీరుడాయన. ఆయన కామరూపధరుడు.

అని నిప్పులు కక్కే కన్నులతో అడుగులు వేసుకుంటూ తన వాసానికి వెళ్ళింది.

సుధేష్ణతోపాటు అంతఃపురములోని నారీమణు లందరూ ఆమెను అనునయించడానికి ప్రయత్నించారు. కాని సైరంధ్రి ఆనాడు స్నాన పానాదులు సాగించలేదు.

అక్కడ కీచకుడు మోహసాగరంలో ఆకలి దప్పులు లేకుండా ఈదు లాడు తున్నాడు.

అన విని జనమేజయుడు, వైశంపాయన మహర్షీ! అసలీ కీచకు డెవరు! అని ప్రశ్నించగా —

మహారాజా! విప్రస్త్రీకి క్షత్రియ పురుషుని వల్ల కలిగిన సంతానం సూతవంశంగా వ్యవహృతమవుతుంది. ప్రతిలోమ జాతులలో సూతులు రథకారులుగా వుంటారు. పూర్వకాలంలో యీ సూతులకు రాజవంశాలతో సంబంధభాంధవ్యా లుండేవి. అయినా వారిని సూతులుగానే వ్యవహరిస్తారు.

అయితే వీరిలో కొందరు రాజాశ్రయం పొంది రాజ్యాలు సంపాదించారు. అటువంటి సూతులకు అధిపతి కేకయుడు. వాని కిద్దరు భార్యలు. అందులో మాళవి అనే భార్యకు జన్మించినవాడు కీచకుడు. వీడు మహాబలిష్ఠుడు. కేకయుని రెండవభార్య కూతురు సుధేష్ణ. విరటుని ప్రథమపత్ని శ్వేత కోసలరాజపుత్రి. ఆమె మరణం కారణంగా విరటుడు సుధేష్ణను పట్టమహిషిగా స్వీకరించాడు. ఈమెకు ఉత్తరుడు, ఉత్తర అని యిద్దరు బిడ్డలు.

కీచకుడు అక్కగారిని చేరి ఈ మహారాజును సేవిస్తూ సేనాబలాన్నీ కోశాగారాన్నీ వృద్ధిచేసి పరిసర ప్రాంతాల రాజ్యాలెన్నో జయించి వచ్చాడు. వీడి బలం వేయి ఏనుగులను మర్దించగలది. అందుచేత సేనాపతిగా వున్నాడు. విరటుని పదిమంది సోదరులు ఉన్నా వారందరూ కీచకుని అనుసరించే వారే కాని, ఆజ్ఞాపించగలవారు కాదు. అదీ వాడి కథ.

ఇక, ఆ సాయంత్రం ద్రౌపది స్నానం చేసి ఉతికిన మడతలు కట్టి తన కార్యం సానుకూలం కావాలంటే భీమసేనుడే తగినవాడని అటు నడిచి.

భీమసేనా! నన్ను అవమాన పరచినవాడు జీవించి వుండగా నీకు నిద్ర పడుతున్నదా అనేసరికి భీముడు సింహంలా లేచాడు.

## కీచకవధ

సింహంలా లేచిన భీమసేనుడు ఎదురుగావున్న, ద్రౌపదిని చూశాడు. ఆమె విశాల నేత్రాలు బొటబొట కన్నీరు విడుస్తున్నాయి. కుపిత భుజంగంలా ఒక్క నిట్టూర్పు విడిచి ద్రౌపదిని ఓదారుస్తూ:

ఇప్పుడు నీకు కావలసిన దేమిటో చెప్పు - అన్నాడు.

కన్నీరొత్తుకుని ద్రౌపది, కీచక భవనానికి వెళ్ళవలసిన స్థితిని, అక్కడ జరిగిన కథనూ వివరించి తక్షణం కీచకుడు యమసదనానికి పోవాలంది.

పాంచాలరాజపుత్రి పాండవమహిషి ఒక నీచుడిచేత పరాభూత కావడం, బధిర పంగ్వంధ, యాచక ప్రతతిని సాదరంగా పోషించే ధర్మ

రాజు కంకభట్టుగా విరాటుని కొలువులో పడివుండడం భీముని మనస్సులో అగ్నిగుండాలు జ్వలింపజేశాయి. క్షణకాలం ఆలోచించి:

పాంచాల రాజనందినీ! నువ్వు రేపు ఏదో ఒక విధంగా కీచకుని కలుసుకొని రాత్రికి నర్తనశాలకు రప్పించు, నిర్జనంగా వుంటుంది; కనుక అక్కడ వాడిని కడతేరుస్తాను. ఇక నువ్వు వెళ్ళు - అన్నాడు.

తెల్లవారింది. రాత్రంతా నిద్రలేని కీచకుడు ఉదయమే అంతఃపురానికి వచ్చాడు. ఏకాంతంలో వున్న ద్రౌపదిని సమీపించి:

ఇప్పటికయినా నీకు కీచకుని శక్తి తెలిసి వుంటుంది. ఈ విరటుడు నామమాత్ర ప్రభువు అని గ్రహించావా? అందుచేత యిప్పుడయినా నన్ను చేపట్టు. దాస దాసీజనంతో మహారాణిలా సాగుతుంది నీ జీవితం - అన్నాడు.

కీచకా! మన సమాగమవిషయం మూడో కంటికి తెలియడానికి వీల్లేదు. అందుకు అనుకూలంగా రాత్రివేళ నర్తనశాలకు రా - అంది చిరునవ్వుతో.

అంగీకరించాడు కీచకుడు. సంతోషం నిండినగుండెతో తన భవనానికి వెళ్ళాడు. సాయం సంధ్యాకాంతులు నగరాన్ని జోకొట్టేవేళకు, కీచకుడు అలంకారాలు ముగించుకున్నాడు. నెమ్మదిగా ద్రౌపది భీమసేనునికి ఈ వార్త అందించింది. భీముడు రాత్రి అవసరమయిన పథకం సిద్ధంచేసుకున్నాడు. చీకట్లు ముదురుతున్నాయి. నర్తనశాల పరిసరాలలో జనసంచారం మాటు మణిగింది.

నెమ్మదిగా రాణీవాసం నుంచి ద్రౌపది, పాకశాలనుంచి భీమసేనుడు బయలుదేరి నర్తనశాలకు చేరారు.

కీచకుడు విరహాతురుడై వున్నాడు. క్షణం యుగంగా సాగుతోంది. నెమ్మదిగా నర్తనశాలకు చేరాడు. గాలి కదిలితే, ఆకు ఆడితే మాలిని వస్తున్నదని ఆశగా చూసి, నిరాశ పడుతున్నాడు. వెనకచూపులు చూస్తూనే నర్తనశాలలో ప్రవేశించాడు. గాఢాంధకారం. నర్తనశాలలో విశ్రాంతికోసం వుంచిన పర్యంకం మీద భీమసేనుడు.

కీచకుడు పర్యంకం చేరుతూనే దానిమీద మనిషి అలికిడి గమనించి, మాలినీ! నే నెంతటి భాగ్యశాలినీ! అని పొగడ నారంభించగా, మాలిని: నీ జీవితంలో ఎరుగని సుఖసంతోషాలను రుచి చూడబోతున్నావు. కీచకా! స్త్రీ వశీకరణలో నువ్వు యింతటి ఘటికుడవని నే నెరుగను - అంటూనే భీమసేనుడు శయ్యదిగి వికటాట్టహాసం చేశాడు. జరిగిన మోసం గ్రహించి కీచకుడు కయ్యానికి తలపడ్డాడు.

కీచకా! సింహంముందు మత్తేభంకూడా నిలువలేదు! ఈ విషయం మరచిపోకు. నిన్ను ముద్దగా చేసిన వార్త విని నీ అక్కగారు సంతోషిస్తారు. మాలినికి పీడ విరగడయి ఆమె భర్తలు హాయిగా వుంటారు - అని జుట్టుపట్టి నేలపడగొట్టాడు. కీచకుడు లేచి ఎదురుగా నిలిచాడు. ఉక్కుపంజరంవంటి బాహుమధ్యంలో బంధించాడు భీముడు. కీచకుడు తప్పించుకున్నాడు. మదించిన ఏనుగుల్లా ఉభయులమధ్య పోరాటం సాగింది. భయంకర వ్యాఘ్రాల వలె పోరుతున్నారు. నర్తనశాల గోడలు కదులుతున్నాయి, వారి పదఘాతాలతో.

కీచకుని రొమ్ముమీద భీముడు గుద్దుతుంటే పిడుగులు పడు తున్నట్లుంది. వానిజుట్టు చేతపుచ్చుకుని మెలిదిప్పుతూ లేడిపిల్లను పట్టిన సింహంలా ఆడుతున్నాడు భీముడు. కీచకుడు చైతన్యహీనుడయాడు. అంగసందులు విడదీసి ముద్ద చేశాడు, కీచక శరీరాన్ని భీమసేనుడు.

వానిపొట్ట చీల్చి శిరస్సును అందులో దూర్చేశాడు. అంతవరకూ నర్తనశాల వెలుపల నిలిచి, ఆ ధ్వనులే వింటున్నా ద్రౌపదిని సమీపించి, అగ్నిని ప్రజ్వలింపజేసి, ఆ కీచక దేహం చూపి;

ద్రౌపదీ, నీవంటి శీలవతిని కన్నెత్తిచూసే పాపికి జరిగే పరాభవం ఎలా వుంటుందో చూడు - అన్నాడు.

ద్రౌపది పరమానందంతో అంతఃపురానికి చేరింది. అక్కడివారందరినీ లేపి -

పరస్త్రీ బలాత్కారానికి సాహసించే కీచకునివంటి కాముకులకు జరిగే పరాభవం చూడదలచినవారు నర్తనశాలకు వెళ్ళవచ్చు - అని చెప్పింది.

ఆందోళితహృదయులై అనేకులు నర్తనశాలకు వెళ్ళారు. ముద్దగా చుట్టిన మానవ కళేబరం వారి కంటబడింది. ఏ అవయవమూ విడిగా కనబడడం లేదు. అంతా ఒకటే ముద్ద. ఇటువంటి సాహసశూరకార్యం గంధర్వులు తప్ప సామాన్యులు చెయ్యలేరు - అని నిశ్చయించుకున్నారు.

నెమ్మదిగా కీచక సంహారవార్త నగరమంతా వ్యాపించింది. బంధుజనం అంతా చేరారు. తాబేలులా పడివుంది కీచకదేహం. అది చూసేసరికి వారికి దుఃఖం పెల్లుబికింది. కొంతసేపు ఏడిచి దహనసంస్కారానికి ప్రయత్నాలారంభించారు.

ఆ సమయంలో అక్కడకు కొంచెం దూరంలో వున్న మాలిని వారి కంటబడింది.

ఆ మాలిని కారణంగానే మన సోదరుడు మరణించాడు. అందుచేత ఈమెను కూడా ఈ సేనాపతి శవంతో కట్టి దహించాలి. అప్పుడుకాని కీచక సేనాని మనస్సు శాంతించదు - అనుకుంటూ కీచకుని సోదరులు విరాటరాజుకి తమ సంకల్పం తెలియజేశారు.

విషాదవార్త విని విరటుడు కొంతసేపు విచారించి, వారి సంకల్పాన్ని ఆమోదించాడు.

ఉపకీచకులు తిరిగివచ్చేసరికి ద్రౌపది మూర్ఛపడి వుంది. ఆమెను కీచక దేహంతో బంధించి శ్మశానభూమికి బయలుదేరారు వారు. మార్గమధ్యంలో మాలినికి స్మృతివచ్చి ఆర్తనాదాలు ఆరంభించింది.

పాకశాలలోవున్న భీమసేనుని చెవినబడిం దా ఆర్తనాదం. తక్షణం వేషం మార్చి పాకశాల గోడదూకి, పరుగు పరుగున శ్మశానభూమికి చేరాడు.

అక్కడ సమీపాన వున్న ఒక మహావృక్షం మొదలంటా పెరికి, యమధర్మరాజులా నిలిచాడు. ఆ భయంకరాకారాన్ని చూసిన ఉపకీచకులు గజగజలాడిపోయారు.

ఒక్క ఊపుతో తన చేతిలోని చెట్టునే ఆయుధంగా చేసి, భీమసేనుడు కీచకసోదరులందరినీ మర్దించి, సోదరసమేతం కీచకుణ్ణి యమపదనానికి పంపించి తృప్తిగా ద్రౌపదిని వెంటబెట్టుకుని వచ్చాడు. కొంతదూరం వచ్చాక ద్రౌపదీభీములు ఎవరిదారిన వారు నగరంలో ప్రవేశించారు.

ఉపకీచకులు మరణించారన్న వార్త నగరవాసులను దిగ్భ్రాంతులను చేసింది. వారంతా మహారాజును సమీపించి, మాలినివంటి సౌందర్యరాశివల్ల జరిగిన ఈ ఘోరం మళ్ళీ జరగకుండా ఆమెను నగరంనుండి పంపించి వెయ్యమని కోరారు. విరటుడు సుధేష్ణకు అదే కబురు పంపాడు. సుధేష్ణ మాలినితో అదేమాట చెప్పగా - మరొక్క పదమూడు రోజులు గడువిస్తే తన పతుల కష్టాలు తీరి వారేవచ్చి తీసికెడతారని అర్థించింది. సరేనంది సుధేష్ణ.

## దక్షిణగోగ్రహణం

అజ్ఞాతవాసం సాగిస్తున్న పాండవులను ఎలా అయినా పసిగట్టి, వారి చేత తిరిగి అరణ్యవాసం, అజ్ఞాతవాసం చేయించాలని ప్రయత్నిస్తున్నాడు - దుర్యోధనుడు.

దుర్యోధనుని యీ ప్రయత్నాన్ని సఫలం చెయ్యాలని వెళ్ళిన చారులు తిరిగి వచ్చి తమరాక చక్రవర్తికి ఎరిగించి, వారి అనుమతి పొంది సభాభవనంలో ప్రవేశించి దేశదేశాలు తిరిగినా పాండవులజాడ తెలియలేదనీ, ఆలోచించి చూడగా వారు ఈ క్లేశాలు భరించలేక మరణించివుంటారనీ, లేకపోతే ఘోరారణ్యంలో పులులో, సింహాలో వారిని ఆరగించి వుంటాయనీ అన్నారు.

అయినా మరొకవిధంగా వారిని అన్వేషించే ప్రయత్నం చేయమంటే తప్పక కొనసాగిస్తా మన్నారు.

అంతలో ఒక చారుడు లేచి —

ప్రభూ, మరొక్కవిశేషం తమకు మనవి చెయ్యాలి. సింహబలుడుగా ప్రఖ్యాతుడైన మత్స్యదేశాధీశుని బావగారు కీచకుడు, ఒకానొక స్త్రీని

బలాత్కరించిన కారణంగా, ఆమె గంధర్వభర్త వాయుగావచ్చి కీచకునీ, అతని సోదరులందరినీ కూడా ఒక్క రాత్రిలో యమపురికి పంపినట్లు విచిత్రంగా చెప్పుకుంటున్నా రక్కడి జనం, విరటుడు తమ విరోధి వర్గం వాడు కనుక యిది తమకు సంతోషం కలిగించవచ్చునని విన్నవించుకున్నాను - అన్నాడు.

క్షణకాలం ఆలోచించి దుర్యోధనుడు సభాసదులను తిలకించి - పాండవులు ఎక్కడ వుండే అవకాశం వున్నదో మీరంతా ఆలోచనచేసి చెప్పండి. అరణ్యవాసం పూర్తిచేసి అజ్ఞాతవాసం ముగించబోతున్నారు. అది పూర్తి అయితే వారు ఘోరసర్పాలవలె విషం కక్కుతూ మన మీదికి వస్తారు. అలా రాకుండా ఈ అజ్ఞాతవాస దీక్షాసమయంలోనే వారి జాడ పసిగట్టగలిగితే మరొక పదమూడేళ్ళు మనం నిశ్చింతగా వుండగలం - అనగా విని, కర్ణుడు సమర్థులయిన గూఢచారులను మళ్ళీ పంపాలి. ధన, కనక, వస్తు, వాహన సమృద్ధమై జనసమ్మర్దం వున్న ప్రాంతాలూ, ఋషులూ, మునీశ్వరులు వుండే ప్రాంతాలు మాచుకుంటూ తెలివిగా వారిని గుర్తుపట్టేవారిని పంపాలి - అన్నాడు.

అప్పుడు దుశ్శాసనుడు లేచి: వారి జాడ తెలుసుకు తీరాలి. ఒకవేళ మరణించినా ఆ విషయం తెలుసుకురాగల వారులను పంపాలి - అన్నాడు.

అనంతరం ఆచార్యద్రోణులు - ధర్మతత్పరులూ, మహావీరాగ్రేసరులూ అయిన పాండవులు మరణించారనుకోవడం భ్రమ. వారు సమయం కోసం నిరీక్షిస్తుంటారు. కాల విలంబన వెయ్యకుండా వారిని పట్టే ప్రయత్నం త్వరగా సాగించాలి - అనగా భీష్మాచార్యుడు లేచి:

నాయనా, దుర్యోధనా! ఆచార్య ద్రోణులు యథార్థం సెలవిచ్చారు. వారు మరణించడం అసంభవం. వారు నివసించే ప్రాంతంలో ప్రజలందరూ ధర్మతత్పరులుగా వుంటారు. వారుండే చోట విద్వాంసులు విశిష్టపూజలు అందుకుంటూ వుంటారు. పాడి పంటలు సమృద్ధిగా వుంటాయి. వారున్న చోట నాస్తికులుండరు. దేవతారాధనలూ, యజ్ఞయాగాది క్రతువులూ, దానధర్మాలు విరివిగా సాగుతూంటాయి. అటువంటి ప్రదేశంలో మన వారులు జాగ్రత్తగా గుర్తుపడితే వారు దొరుకుతారు - అన్నాడు.

అప్పుడు కృపాచార్యుడు: సుయోధనా! రాజ్యాధిపత్యం కోరేవాడు శత్రువును ఉపేక్షింపరాదు. సామాన్య శత్రువునే ఉదాసీనంగా విడిచి పెట్టరాదని నీతిశాస్త్రం చెపుతూంటే యిక పాండవులవంటి మహావీరుల విషయమై అలసభావం అసలే పనికి రాదు. అందుచేత మన ప్రయత్నాలు మనం త్వరగా సాగించాలి. అజ్ఞాతవాసం ముగిసిందో వారు పరాక్రమ విహారానికి ఉపక్రమిస్తారు. ఈ లోపునే నువ్వు సైన్యాలనూ, సంపదలనూ, సమీకరించి ఉంచుకోవాలి. నీతో సహకరించే వారెవరో తేల్చుకోవాలి. యుద్ధం జరిగినా, సంధి కుదిరినా సేనాబలానికి సంతృప్తి కలిగించడం మన విధి. ఈ విషయమై కూడా నువ్వు అప్రమత్తుడవై ఉండడం అవసరం - అని హితబోధ చేశాడు.

అందరి అభిప్రాయాలు విన్న దుర్యోధనుడు లేచి —

సభాసదులారా! ఇప్పుడు నాకొక విషయం స్మృతికి వస్తున్నది. ఆత్మబలం, దేహబలం, మనోబలం కల మహావీరులు నలుగురు మానవ, దైత్య, రాక్షసవంశాలలో ప్రభవించారనీ, వారు నలుగురూ సమాన శక్తి సాహసాలు కలవారనీ, ఒకరినొకరు జయించాలనే కాంక్షతో వున్నారనీ విన్నాను. అందులో కీచకు డొకడు. మిగిలినవారు బలరామ, శల్య, భీములు. వీరిలో కీచకుడు మరణించాడంటే ఆ మృత్యువు భీమునివల్లనే కలిగివుంటుంది. కీచకుడు కామించిన స్త్రీ ద్రౌపది అయివుండవచ్చు. అందుచేతనే కీచకసంహారం ఎవరిచేతులలో జరిగిందో తెలియకుండా వుందని విన్నాను.

ఇంకా ఆలోచిస్తే కీచకుణ్ణి చంపినతీరు, చారుడు వర్ణించిన రీతిని చూస్తే ఎముకలు పిండిచేసి అవయావాలన్నీ పొట్టలోకి ముడిచిపెట్టినట్టు చెపుతున్నాడు. అంతటి శక్తి భీముడికే వుంది. పితామహులు చేసిన వర్ణన ప్రకారం మత్స్యదేశం సుభిక్షంగా, గోసంపదలతో అలరారుచున్నట్టు వింటున్నాం. ఈ కారణాలచేత పాండవులు అక్కడే వుండాలి. మనం విరాటుని గోగణాన్ని హరించడానికి బయలుదేరుదాం. అప్పుడు వారు విరటునికి తోడు వస్తారు. ఆ సమయంలో మనం వారిని గుర్తించి మళ్ళీ

అరణ్యానికి పంపుదాం. ఒకవేళ అక్కడ వారు లేకపోయినా విరటుడికి మన మీద చిరకాలంగా తిరస్కారభావం ఉన్నది కనుక, వానికి ప్రతీకారం చేసినట్లూ అవుతుంది. వాని గోసంపదనూ, కోశాగారాన్నీ చేపట్టనూవచ్చు. ఇప్పటికిది మన కర్తవ్యం - అని ఆసనం అలంకరించాడు.

అప్పుడు త్రిగర్త దేశాధీశుడయిన సుశర్మ లేచి —

మహారాజా! మాకు పొరుగున ఉన్న విరటుడు ఎన్నో మారులు మామీద దాడిచేసి, చాలా క్లేశాలు కలిగించాడు. ఇప్పుడు వారి సేనాని కీచకుడు, తన సోదరులతో నిహతుడయాడు. కనుక నేను ప్రతీకారం తీర్చుకుంటాను. మా సేనలు మీవెనుక నడిచి మత్స్య దేశాన్ని మీకు సామంతరాజ్యం చేస్తాయి. మా ప్రతీకార వాంఛ నెరవేరుతుంది. మీప్రయత్నమూ సఫలమవుతుంది - అన్నాడు.

అందరూ ఆ అభిప్రాయానికి ఆమోదం తెలిపి దండయాత్రా సన్నాహాలు ప్రారంభించారు.

సుశర్మ చతురంగ బలాలను వెంటబెట్టుకుని దక్షిణదిశగా విరాటనగరం సమీపించి గోగణాన్ని పట్టడానికి ముందుకు దూకాడు. గోపాలకులు హుటాహుటి విరాటుని కొలువు కూటానికి వచ్చి త్రిగర్తల దుస్సాహసం నివేదించారు.

విరటుడు తక్షణం సేనాబలాన్ని యుద్ధసన్నద్ధంచేసి, సోదరుడు మదిరాక్షుని రక్షణలో ముందుకు నడుపుతూండగా ధర్మరాజు విరాటుని చేరి-

మహారాజా! ఒకానొక మహర్షి అనుగ్రహంవల్ల నాకు ధనుర్విద్యాకౌశలం లభించింది. నాకు కూడా కవచధారణకు అవకాశం యిస్తే గోవుల పద చిహ్నాలు గుర్తుపట్టి మన సేనల్ని నడిపించగలను. పాకశాలలోని వల్లవుడూ, గోశాలధ్యక్షుడయిన తంత్రీపాలుడూ, అశ్వపాలకుడయిన గ్రంథికుడు కూడా యుద్ధవిద్యలో నిపుణులే అని విన్నాను. కనుక వారికి కూడా అవకాశం యివ్వండి - అన్నాడు.

విరాటుడు తన సోదరుడయిన శతానీకుని పిలిచి, ఈ కంక భట్టుకీ, గ్రంధిక, వల్లవ, తంత్రీపాలులకూ కవచాలు రథాలు సమకూర్చమని ఆజ్ఞాపించాడు.

రథాలు సిద్ధమయాయి. విరాటుడు స్వహస్తాలతో వారికి కవచాలు అందిచాడు. ఆ నలుగురు పరమ సంతోషంతో రథాలు అధిరోహించారు. విరాటుని రథం వెనుకనే వారి రథాలు సాగుతున్నాయి. వేలసంఖ్యలో రథికులూ, అశ్వబలగమూ, గజబలమూ నడుస్తూంటే పరమోత్సాహంతో సేనావాహిని నగరపొలిమేలరలో త్రిగర్తసేనను ఎదుర్కొన్నది.

## సుశర్మ పరాభవం

విరాటుడు వ్యూహం పన్ని త్రిగర్తసేనలను ఎదుర్కొన్నాడు. గోగణంలో వెడుతూన్న త్రిగర్తసేనా సమూహం ఎదురుతిరిగింది. ఉభయసేనల మధ్య పోరు ప్రారంభమయింది. అంకుశ, తోమర, ప్రాసాది ఆయుధాంతో ప్రహారాలు సాగుతున్నాయి. మహావీరులు విడిచే బాణాలు ఆకాశాన్ని కప్పేశాయి. సాయంకాలం కాకుండానే చీకట్లు క్రమ్మాయి. రణరంగమంతా ధూళిక్రమ్మింది. రథికులు, రథికులతో, అశ్వికులు అశ్వికులతో, పదాతులు పదాతులతో పోరుతున్నారు.

కొద్ది ఘడియల కాలంలో రణరంగం రక్తప్రవాహంతో నిండింది. మణి, రత్నాలు పొదిగిన కుండలాలు ధరించిన శిరస్సులు నేలమీద దొర్లుతున్నాయి. మహాయోధుల సమున్నత విశాలదేహాలు సాలవృక్షాలవలె నేలకూలుతున్నాయి. కొందరు మృతి చెందుతున్నారు.

ధర్మరాజు శ్యేనవ్యూహం పన్నాడు. నకుల, సహదేవులు రెక్కలుగా, భీముడు పుచ్ఛంగా వస్తూండగా ముఖస్థానంలో ధర్మరాజే నిలిచి నడుపుతున్నాడు. వారు విక్రమించి సాగుతూంటే ఎదురు నిలిచే యోధుడే లేడు.

పోరు తీవ్రమయ్యే వేళకు ఆకాశంలో పక్షి ఎగిరే అవకాశం లేకుండా పోయింది.

అటునుంచి శతానీకుడూ, మదిరాక్షుడూ తమ సేనలకు బలోత్సాహాలు కల్పిస్తూ వస్తున్నారు.

విశాలాక్ష, సూర్యదత్తులు త్రిగర్తసేనలను చీల్చుకుపోతుంటే ఆ వెనుక వచ్చే మదిరాక్షుడు పక్కలనుంచి ప్రతిపక్షులను ఊచకోత కోస్తున్నాడు.

సేనలు భయభ్రాంతా లయాయి. వారిని వారే సంహరించుకొనే దుర్దశలోపడ్డారు.

విరాటుడు ఏకకాలంలో రెండు రథాలను నడుపుకుంటూ సుశర్మను ఎదుర్కొన్నాడు. సుశర్మ నిబ్బరంగా నిలిచి ఎదురుపోరు సాగించాడు. సింహ గర్జనలూ, ఖడ్గధ్వనులూ, హయహేషలు, గజఘీంకారాలు భూమ్యాకాశాలను దద్దరిల్లజేస్తున్నాయి.

క్రమంగా ఆకాశంలో చీకట్లు ముదిరాయి. సంధ్యాకాంతులు సన్న గిల్లడంతో రణరంగంలో మనిషికి మనిషి కనిపించని చీకటి ముసిరింది. యుద్ధనీతి ననుసరించి విరామభేరి మ్రోగింది. కొంతసేపటికి ధూళి అణిగి ఆకాశం నిర్మల మయింది. అష్టమీ చంద్రకాంతులు వచ్చేవరకూ విశ్రాంతి తీసుకున్న సేనలు ఆ వెన్నెల వెలుగులో యుద్ధం ఆరంభించాయి.

త్రిగర్తాధీశుడయిన సుశర్మ తన కడగొట్టు తమ్మునితో విరటుని మీదికి నడిచాడు.

సుశర్మ బాణధాటికి విరటుని రథాశ్వాలు నేలకూలాయి. రథపార్శ్వ రక్షకులు నిహతులయారు. విరటుడు సుశర్మకు చిక్కిపోయాడు. అంత టితో మత్స్యసేనలు హాహారవాలు ప్రారంభించడం చూసి ధర్మరాజు భీముని పిలిచి, ఇంతకాలం మనకు ఆశ్రయమిచ్చిన చక్రవర్తి ఆపదలో పడ్డాడు. నువ్వు తక్షణం వెళ్ళి ఆయనను విడిపించు - అనడంతో నకుల, సహదేవులు వెంటరాగా భీముడు సమీపంలోవున్న మహావృక్షాన్ని పెకలించబోయాడు. అది చూసి ధర్మరాజు వారించి, నాయనా! ఈ పని చేసినట్లయితే నీవు భీమసేనుడవని గుర్తు పట్టరా? - అని హెచ్చరించడంతో భీముడు, నకుల సహదేవులను చక్రరక్షకులుగా వుంచుకుని సుశర్మమీదికి నడిచాడు.

నడుస్తూనే మహాయోధు డెవడయినా వుంటే తనతో పోరుకు సిద్ధం కమ్మన్నాడు. సుశర్మ సోదరసహితుడై ఎదురుగా ముందువచ్చిన సహస్రాధిక సైనికులను నేలకూల్చాడు. అది చూసి తన సోదరులూ భీముని చేతులలో నిహతులవుతారేమోనని భయం కలిగి, సుశర్మ బాణవర్షం కురిపిస్తూ భీముని నిరోధించబోయాడు. భీముడు విక్రమించడంతో విరాటుని సేనలు ఉత్సాహంతో పోరు సాగించడానికి ఉద్యుక్తమయాయి.

సహదేవుడూ, ధర్మరాజూ సుశర్మకు ఎదురు నడిచారు. సుశర్మ విడిచిన బాణాలు ధర్మరాజు రథానికి పూన్చిన గుర్రాలను నేలకూలుస్తున్న సమయంలో భీమసేనుడు విక్రమించి సుశర్మ సారథినీ, పృష్ఠరక్షకులనూ హతమార్చాడు. రథహీనుడయిన సుశర్మమీదికి మదిరాక్షుడు విజృంభించడంతో విరటుడు బంధవిముక్తుడై గదను చేబూని సుశర్మపై తిరగబడ్డాడు. ఆ దాడికి తట్టుకోలేక సుశర్మ ఫలాయన మంత్రం పఠించాడు.

వెన్ను చూసి పారిపోయే సుశర్మను ఉద్దేశించి - రణరంగంలో వెన్ను చూపడానికి వెనుదీయనివాడిని యుద్ధానికి వచ్చావా? సిగ్గుచేటు. సేనలనూ, పరివారాన్నీ సంగరభూమిలో విడిచిపోవడం రాజలక్షణం కాదు. నిలబడి పోరాడు - అని గర్జించడంతో, సుశర్మ సేనలోని రథయూథాధిపతి భీముని కెదురువచ్చి నిహతుడయాడు.

భీముడు పరుగుపరుగున పోయి సుశర్మను పట్టుకొని నేల పడగొట్టాడు; మూర్ఛితుడయాడు సుశర్మ. అంతలో త్రిగర్తసేనలు వెనుదిరిగాయి.

విరాటుని గోగణం మత్స్యదేశం వైపు మరలింది. సుశర్మను తాళ్ళతో కట్టి రథం మీద పడేసి భీముడు విరటుని దగ్గరకు తెచ్చి, వీనికి జరగవలసిన ప్రాయశ్చిత్తం చెప్పమన్నాడు.

అప్పుడు ధర్మరాజు భీమసేనునివైపు తిరిగి - వల్లవా! సుశర్మను విడిచిపెట్టు అన్నాడు.

సుశర్మను విడిచిపెడుతూ భీమసేనుడు - ఓరి, నువ్వు సర్వరాజసభలకూ పోయి "విరటుని దాసుడని" అని చెప్పకో, పో - అని విడిచేశాడు.

సుశర్మ సిగ్గుతో తలవంచుకొని విరటుని పాదాలమీద వాలి క్షమాభిక్ష నర్థించి. తన దేశానికి తిరుగుముఖం పట్టాడు.

సుశర్మను పరాజితునిచేసి, తనకు బంధవిముక్తి కలిగించి, గోసంపదను తరలించిన కంకభట్టుకూ, వల్లవుడికీ, గ్రంధిక, తంత్రీపాలులకూ కృతజ్ఞత తెలుపుతూ వారిని సముచితంగా సత్కరించడానికి సంకల్పించాడు విరటుడు.

అక్కడికక్కడే కొలువుదీర్చి - కంకభట్టూ, మహావీరులై విక్రమించిన మీరు నా ధన, ధాన్య, సంపదలన్నిటికీ అధికారులు. చీనీ చీనాంబరాలనూ, రత్నరాసులనూ, దాసీజనాన్నీ, మీకు అర్పిస్తున్నాను. మీ మనసు దేనిని కోరితే అది అర్పించడానికి సన్నద్ధుణ్ణి - అన్నాడు విరటుడు.

మహారాజా! మీ విజయం కంటె మాకు కావలసింది లేదు. మీరు చూపే ఆదర గౌరవాలకు మాకు చాలా ఆనందంగా వుంది. మీరు ప్రభువుగా వుండడమే మేము కోరుతున్నాం. ఇంతకుమించి మే మేమీ కోరడం లేదు. మనమిప్పుడు వేగరులగు దూతలను నగరానికి పంపి విజయోత్సవసన్నాహాలు సాగించమని చెప్పాలి. ముందు జరుగవలసిన పని అది. అక్కడ మీరు మమ్ము సత్కరించవచ్చు - అన్నాడు ధర్మరాజు.

ఆ సలహా ప్రకారం విరటుడు తన పరివారంతో త్వరితగతిని పోయే దూతలను నగరానికి పంపి, విజయవార్తతో ఉత్సావవసర కార్యక్రమాలు కొనసాగించుమన్నాడు.

## ఉత్తర గోగ్రహణం

అటు సుశర్మను విరాటనగరానికి దక్షిణదిక్కుగా పంపిన మరునాడే దుర్యోధనుడు ఉత్తరదిశగా విరాటనగరానికి సేనలతో వచ్చాడు. భీష్మ, ద్రోణ, కృపాశ్వత్థామాదులూ, దుశ్శాసన, కర్ణ, వికర్ణ, వివింశతి, శకుని, చిత్రసేన, దుర్ముఖాదులూ దండయాత్రలో అగ్రభాగాన నిలిచారు.

నగరం పరిహద్దులలో ఉన్న గోష్ఠాగారంలో మేతవేసే సహస్రాధిక గోగణాలను తరలించడానికి వారు ప్రయత్నించగా, అడ్డుకున్న గోపాలకులు వారిధాటికి నిలువలేక రథారూఢులై నగరంలోని రాజభవనానికి వచ్చి,

రాజనందనా! కురుసేనలు మనగోసంపదను హరించడానికి వచ్చాయి. మీరు తక్షణం వచ్చి, ఆ గోగణాలను స్వాధీనం చేసుకుని, సేనలను తరిమి కొట్టండి.

మీ ధనుర్వీణానాదం శత్రుశ్రవణాలను దద్దరిల్ల జెయ్యాలి - అని ఉత్తరకుమారునికి నివేదించారు.

అప్పటికి అంతఃపురంలో స్త్రీ జనమధ్యంలో వున్న ఉత్తరుడు మహోత్సాహంతో ధనుస్సు చేబూని; నేను కురుసేనను చెల్లాచెదురు చేయగలను. వారందరూ నన్ను చూసి అర్జునుడని భయపడేటట్లు విక్రమించగలను. కాని నాకు సారథి లేడే! అందరూ దక్షిణ గోగ్రహణానికి వెళ్ళారు కదా - అని తటపటాయిస్తూంటే, అక్కడవున్న బృహన్నల మాలినిని పక్కకు పిలిచి:

మన అజ్ఞాతవాస సమయం నిన్నటితో ముగిసింది. నా శాపకాలమూ సమాప్తమయింది. అందుచేత నువ్వు ఉత్తరుడి దగ్గరకు వెళ్ళి, పాండవ మధ్యముడయిన అర్జునునకు బృహన్నల సారథ్యం చేసేవాడనీ, వీనిని సారథిగా గ్రహిస్తే విజయం మనదే అనీ చెప్పు - అన్నాడు.

మాలిని తిరిగివస్తూనే - రాజకుమారా! ఇంతకాలంగా మన నర్తనశాలలో ఉత్తరకు నాట్యం నేర్పుతున్న బృహన్నల యిదివరలో ఎన్నో సందర్భాలలో అర్జునునికి సారథ్యం వహించాడు. మహాధనుర్వేత్తలవద్ద అస్త్రవిద్యలో, సారథ్యంలో శిక్షణపొందాడు. అందుచేత బృహన్నలను సారథిగా తీసుకెళ్ళు - అంది.

ఉత్తరుడు పకాలున నవ్వి - మాలినీ! అంతటివాడయితే నపుంసకత్వం ఎందుకు సిద్ధిస్తుంది? అయినా నువ్వు చెబుతున్నావు కనక సారథ్య సామర్థ్యం ఉంటే నా రథానికి గుర్రాలను పూన్చమని చెప్పు - అనగా, మాలిని - మన ఉత్తరమాటమీద బృహన్నలకు ఆదరం ఎక్కువ. అందుచేత ఆమెచేత కబురు పంపు - అంది.

ఉత్తరుడు ఉత్తరను పిలిచి బృహన్నల దగ్గరకు పంపాడు. పరమ సంతోషంతో ఉత్తర నర్తనశాలకు వచ్చింది.

ఏవమ్మా! అకాలంలో యిలా వచ్చావు - అని అడిగాడు.

ఆచార్యా! మన గోసంపదను కౌరవులు హరించుకు పోతున్నారు. వారిని ఎదుర్కొని మన గోగణాలను మరలించుకు రావడానికి మా అన్నయ్య వెళ్ళాలి. అయితే వాని రథానికి సారథిలేక ఆగిపోయాడు. సైరంధ్రి వచ్చి మీ శక్తిసామర్థ్యాలను చెప్పింది. మీరు సారథ్యం వహిస్తే మా గోసంపద మాకు లభిస్తుంది. నా కోరిక మన్నించండి - అని ఉత్తర కోరడంతో, బృహన్నల ఆమె వెంట బయలుదేరాడు.

ఉత్తరుడు సంతోషంతో స్వయంగా బృహన్నలకు కవచం తొడిగాడు. బృహన్నల రథాన్ని సిద్ధం చేశాడు. ఉత్తరుడు రథం అధిరోహించాడు. రథం కదులుతూండగా ఉత్తర వచ్చి కౌరవవీరుల తలపాగాకుచ్చులు బొమ్మ పొత్తికలకు తెచ్చిపెట్టండి - అంది.

మీ అన్నగారు కౌరవులను జయిస్తే వారి తలపాగా కుచ్చులు తేవడం అంత కష్టమయిన విషయంకాదు - అని బృహన్నల రథాన్ని ముందుకు సాగించాడు.

జనం చూస్తూండగా రథం తీవ్రవేగంతో నగరవీధులు దాటేసింది. కన్నుమూసి తెరిచేలోపల రాజధాని ప్రధానద్వారం దాటి కౌరవసేనలకు అల్లంతదూరంలో ఉంది.

ఎదురుగా మహారథిక పరివేష్టితమయిన సేనావాహినిని చూస్తూనే ఉత్తరుడు --

బృహన్నలా! రథం ఆపుచెయ్యి. భీష్మ, ద్రోణ, కృపాది ధన్వినికరా భీలంగా, దుర్యోధన గ్రీష్మాదిత్య పటుప్రతాప విసరాకీర్ణమై, వివిధశస్త్రాస్త్ర విదులతో వున్న ఈ సేనను ఎదిరించే శక్తి నాకు లేదు. పయిగా నాన్నగారు నన్ను నగరరక్షణలో నియోగించారే కాని ఈ దాడిని ఎదుర్కోమని చెప్పలేదు. మన రథాన్ని వెనక్కి తిప్పేయ్యి - అని గజగజలాడుతూంటే, అర్జునుడు:

రాకుమారా! క్షత్రియు డయినవాడు విజయాన్నో, వీరమరణాన్నో వరించాలే తప్ప వెన్నుచూపి పోరాదు. మనమింకా వారితో తలపడనే

లేదు. వారి బలమెంత వున్నదో చూడలేదు. అంతే కాక - నువ్వు అంతఃపుర స్త్రీజనమధ్యంలో ఎంతో పరాక్రమ ప్రదర్శన సామర్థ్యం కలవాడిలా మాట్లాడావు. ఇప్పుడిలా వెళ్ళిపోతే నగర నారీజనం అంతా నవ్వులపాలు చేస్తారు.

అంటూండగా ఉత్తరుడు:

బృహన్నలా! రథాన్ని మరలించు. బతికుంటే బలుసాకు తిని గడపవచ్చు. వృథాగా ఎందుకు ప్రాణాలు వదులుకోవడం - అని రథం దిగి, పలాయనం ఆరంభించాడు.

అది చూసి బృహన్నల రథం ఆపి, కిందికి దిగి, గబగబ నాలుగడుగులు వేసి ఉత్తరుని పట్టుకున్నాడు.

ఆ సన్నివేశాన్ని తిలకిస్తున్న కౌరవసేనలోని పెద్దలందరూ ఆశ్చర్య, సంతోషాలలో మునిగిపోయారు.

ఎర్రనిచీర కట్టుకుని స్త్రీరూపంలో వున్న యీ సారథి, నిస్సందేహంగా అర్జునుడే అయివుంటాడని పెద్దలు భావించారు. అర్జునుడయితే అలా నపుంసకుడుగా ఎందుకుంటాడని సామాన్యు లనుకున్నారు.

ఆ నడకనూ, ఆజానుబాహువులనూ, ఆకారాన్నీ చూసినవారు నిస్సం దేహంగా అతను అర్జునుడే అని నిశ్చయించారు.

ఇక్కడ అర్జునుడు ఉత్తరుని నెమ్మదిగా రథం దగ్గరకు తెచ్చి మీది కెక్కించి:

వృథాగా భయపడి శత్రువులకు వెన్నుచూపకు. ఈ స్థితిలో నగరానికి వెడితే అందరూ అపహసిస్తారు - అంటూనే రథాన్ని శ్మశానం దగ్గర శమీవృక్ష సమీపానికి నడిపించి –

రాజనందనా! ఈ చెట్టెక్కి దానిమీద వున్న గాండీవ ధనుస్సు నా కందియ్యి, యుద్ధం నేను చేస్తాను. యుద్ధ సమయంలో నాచేతికి నీ ధనుస్సాగదు - అంటూండగానే:

ఈ జమ్మిచెట్టుమీద శవం వున్నదని వూరంతా చెప్పుకుంటున్నారు. రాజకుమారుడిచేత శవాన్ని ముట్టిస్తావా - అన్నాడు ఉత్తరుడు.

నేనంతటి అమాయకుణ్ణిగాదు. నీచేత మృతకళేబరం పట్టించను. పాండవులు అజ్ఞాతవాసానికి వెడుతూ తమ ఆయుధాలన్నీ యీ చెట్టుమీద వుంచారు. ఎక్కు - చెట్టెక్కి అందులో గాండీవం నా చేతికియ్యి!

అని పరి పరి విధాల చెప్పగా, ఉత్తరుడు సందేహనివృత్తి కోసం అడిగిన ప్రశ్నలకు జవాబుగా తానే అర్జునుడననీ, కంకభట్టు ధర్మరాజనీ, మాలిని ద్రౌపది అని అంతా వివరించాడు.

ఉత్తరుడు జమ్మిచెట్టెక్కి శస్త్రాలు బంధించిన మోపు విప్పాడు. అతని కనులు మిరుమిట్లు గొలిపేలా ఆ బాణాసనాలన్నీ త్రాచుల్లా మెరుస్తూ కనిపించాయి. వాటన్నిటి వివరాలు అడిగాడు.

బంగారు పూలతో అలంకృతమయి, హరితారుణ కాంతు లీనుతూ సువర్ణమయ సూర్య చిహ్నాలున్న ఆ ధనుస్సు గాండీవం. హేమలతల్లా గోచరిస్తూ లక్షల సంఖ్యలో ఉన్న ఆ తూణీరాలే నా అక్షయబాణాలు - వాటిని నా కందియ్యి!

ఆదిలో యీ గాండీవాన్ని చతుర్ముఖుడు వెయ్యి సంవత్సరాలు తనే వినియోగించి, ప్రజాపతికిచ్చాడు. ఆయన అయిదువందల మూడు సంవత్సరా లుంచుకొని ఇంద్రుని కిచ్చాడు. దేవేంద్రుని హస్తాలలో యిది ఎనభై అయిదేళ్లున్నది. అది సోముడు గ్రహించి అయిదువందల వర్షాలుంచు కొని వరుణుడికి కానుకగా యిచ్చాడు. వరుణుడి దగ్గర నుంచి అగ్ని మైత్రీచిహ్నంగా బహూకృతి పొందాడు. ఖాండవవన దహన సమయంలో నాకు బహూకరించాడు. ఇది నా చేతులలో అరవై అయిదు సంవత్సరా లుంటుంది.

ఇక నువ్వడిగిన అర్జునుడి పది పేరులూ - అర్జున, ఫల్గుణ, కిరీటి, శ్వేతవాహన, కృష్ణ, జిష్ణు, బీభత్స, విజయ, సవ్యసాచి, ధనంజయ. ముందు ఆ ధనుస్సు అందించు - అంటూ ఆ వివరాలన్నీ చెప్పి ధనుస్సు గ్రహించాడు.

ఉత్తరుడు చెట్టు దిగుతూనే అర్జునునికి అభివాదంచేసి, నన్ను మన్నించు అన్నాడు.

అర్జునుడు నవ్వుతూ ఉత్తరుని వెన్నుతట్టి, నువ్వు సారథ్యం వహించి, రథాన్ని కురుసేన ముఖంగా నడిపించు. వారిని నిర్జించి, మన పరాక్రమం ప్రదర్శిద్దాం అన్నాడు. రథం సాగుతోంది.

## విజయశ్రీ

అర్జును డిక్కడ యిలా ఉత్తరునితో సన్నాహాలు చేస్తుండగా అక్కడ కురుసేనలో కలకలం బయలుదేరింది. వచ్చేవాడు అర్జునుడయితే ఆ కౌంతేయుడికి తగినశాస్తి చేయడానికి నిశ్చయించుకున్నారు. దుర్యోధనశతం. వీరిలా ప్రతాపవాక్యాలు పలుకుతూంటే, ద్రోణాచార్యులు భీష్ముని చూస్తూ నర్మగర్భంగా -

ఏమి సాహసంగా వస్తున్నాడు: అహంకారం కాకపోతే కురువీరులకు ఎదురుగా వస్తాడా? వీడి ఆకారం చూస్తూంటే ఇంద్రునివలె వున్నాడే, అనేసరికి భీష్మాచార్యులవారు:

శత్రువును ఎదుర్కొనడానికి తగిన సమయం వచ్చింది. అడ్డంకులన్నీ తీరిపోయాయి. ఇంక ఎదిరికి భయపడవలసిన పనిలేదు - అని సమాధాన మిచ్చాడు. అంతతో అజ్ఞాతవాస సమయం చెల్లినందువల్లనే అర్జునుడు నిర్భయంగా వస్తున్నాడని అర్థమయింది, ద్రోణాచార్యునికి.

మత్తేభయూథాలను చూసిన సింహంలో మన సేనమీదికి వస్తున్నాడు అర్జునుడు. రుద్రదేవుని ఎదిరించి నిలిచిన ఈ కౌంతేయుని ఎదిరించగల సామర్థ్యం మనవారిలో ఎవరికుంది - అని ద్రోణు డంటూండగానే, కర్ణుడు అడ్డుకొని:

ఆచార్య! మీరెప్పుడూ శత్రువులను ప్రశంసించడానికే అలవాటు పడ్డారు. వచ్చెడివాడు ఫల్గుణుడయినా, మరెవడయినా వానిని నిర్జించడానికే నే నున్నాను. మీరు నిశ్చింతగా ఉండండి - అన్నాడు.

అప్పుడు దుర్యోధనుడు — పితామహా! అజ్ఞాతవాస సమయం పూర్తికాకుండా అర్జునుడు వస్తున్నాడు. నిజంగా వచ్చేది అర్జునుడే అయితే నిరభ్యంతరంగా మళ్ళీ వారు అడవులకు పోవలసిందే కదా? అనడంతో, భీష్మాచార్యుడు: నాయనా! సుయోధనా! కళ కాష్ఠ, ముహూర్త, దిన, పక్ష, మాస, ఋతు, వత్సరరూపంలో కాలచక్రం భ్రమిస్తున్నది. కాలగమనంలో వృద్ధుల, మాసాల హెచ్చుతగ్గులను సరిజెయ్యడానికి కాలజ్ఞులయిన కార్తాంతికులు రెండున్నర సంవత్సరాల కొక అధికమాసం వస్తుందన్నారు. అలా గణిస్తే, యిప్పటికే పదమూడేళ్ళూ నిండగా, అయిదు మాసాల పన్నెండురోజులు అధికంగానే గడిచాయి.

ఇక ఆ మీమాంస విడిచి పెట్టి, యుద్ధానికి సిద్ధం కండి. జయాపజయా లెలా తిరిగినా, యుద్ధం క్షాత్రధర్మం. ఇష్టమయితే యిప్పుడే వారి అర్ధరాజ్యం వారికిచ్చి సంధికి సిద్ధపడు. లేదా .......... అంటూండగానే దుర్యోధనుడు

సంధి మాట అనవసర మన్నాడు.

అయితే నాయనా! మనసేనలో నాలుగవ భాగాన్ని ముందుగా హస్తినాపురానికి పంపు. మరొక నాలుగవవంతు సేనతో గోగణాలను తరలించు. మిగిలిన వారితో మనం ఆ యోధుని ఎదుర్కొందాం - అన్నాడు.

అందరూ సరే అన్నారు.

అనంతరం భీష్మాచార్యులు తన సేనను చూస్తూ

ఆచార్యద్రోణులు సేనామధ్యంలో వుంటారు. అశ్వత్థామ వామపార్శ్వంలోనూ, కృపాచార్యులు దక్షిణభాగంలోనూ వుంటారు. కవచధారియై కర్ణుడు సేనాగ్రంలో నిలుస్తాడు. యోధులందరూ అర్జునుని ఎదుర్కొంటారు - అని సేనలను వజ్రగర్భ, వ్రీహిముఖ, అర్ధచంద్రాంత, మండల వ్యూహాలతో నిలిపి అన్నిటికి వెనుక ఆయన నిలిచాడు. సేనా సమూహం అంతకూ వెనుకవున్న ఆ కురువృద్ధుని పతాకంమీది తాళధ్వజం మహోన్నతంగా అందరికీ కనిపిస్తూ ఆనందం కల్గిస్తున్నది.

శమీవృక్షం మీంచి దిగుతూ ఉత్తరుడడిగిన ప్రశ్నకు జవాబుగా అర్జునుడు - రాకుమారా! ఒకప్పుడు మా అన్నగారి ఆజ్ఞానుసారం నేను దేవలోకానికి వెళ్ళాను. అప్పు డొకనాడు ఊర్వశి తన నృత్యకౌశలం ప్రదర్శిస్తున్నది. ఆమె కళకౌశలానికి ఆశ్చర్యపడుతూ నేను కన్నార్పకుండా చూస్తూవున్నాను. కొంతసేపయాక ఆమె దృష్టి నా మీదనే నిలిచింది.

నృత్యం ముగిసేవరకూ ఆమె చూపులు నా మీద వున్నట్లు నాకు తెలీదు. ఆ రాత్రి నేను సుఖనిద్రలో వుండగా ఆమె వచ్చి నన్ను లేపి, తన వాంఛ తీర్చమంది. నేను తెల్లబోయాను. ఆమె మీద నాకు మాతృగౌరవం, ఆమె నృత్యకళమీద అభిమానం కలిగాయే తప్ప మరొక ఊహ లేదన్నాను. తన కోరికను నిరాకరించినందుకు ఆమె కోపంతో నన్ను నపుంసకుడవు కమ్మని శపించింది.

తరువాయి ఈ వార్త తెలిసిన దేవేంద్రుడు, ఈ శాపం నీకు అజ్ఞాతవాస సమయంలో వరంగా వినియోగపడుతుంది. విచారించకు - అని ఆశ్వాసన చేశాడు. అదీ నా కథ. ఇక రథాన్ని పోనియ్యి. అదిగో కురుసేన సర్వసన్నద్ధమయివుంది. ఇక క్షణం ఆగకు. రథాన్ని త్వరితంగా సాగించు - అన్నాడు.

ఉత్తరుడు పగ్గాలు సడలించాడు. రథాశ్వాలు వాయువేగం పుంజుకు న్నాయి. అర్జును డొక్కసారి గాండీవ ధనుష్టంకారంచేసి, దేవదత్తం పూరించాడు. ఆ శంఖ ధ్వనికీ, జ్యావల్లీ నాదానికీ ఉత్తరుడు బెంబేలు పడి, కూలబడ్డాడు. మహావేగంతో వెడుతున్న గుర్రాలు కాళ్ళు వణికి ఆగిపోయాయి.

ఎదురుగా కురుసేనలోని మహాయోధులందరూ కంపించిపోయారు. వారి సర్వాంగాలూ స్వేదపూరితా లయాయి. వచ్చేవాడు అర్జునుడే అని గ్రహించారు. యుద్ధంమీద ఎవరికీ ఉత్సాహం కనిపించడంలేదు. అందరి ముఖాలలోనూ భీతి తాండవిస్తోంది. అశ్వ, గజ బలాలు రోదనధ్వానాలే చేశాయి. సేనకు పార్శ్వాలనుంచి కుక్కలూ, నక్కలూ ఘోరగడం మొదలుపెట్టాయి. పయిన కాకులు, గ్రద్దలూ ఎగురుతున్నాయి.

తన సేన పరిస్థితిని చూసి భీష్మాచార్యులు వారందరికీ ధైర్యం కలిగిస్తూ ముందుకు సాగించాడు.

అర్జునుడు ముందుగా భీష్మ ద్రోణుల పాదాలమీదికి రెండేసి బాణాలు నమస్కార సూచకంగా విడిచి, మరో రెండేసి శరాలు చెవుల ప్రక్కగా కుశలప్రశ్న లడుగుతున్నట్లు విడిచి ముందుకు వచ్చాడు.

కౌంతేయుడు చూపిన గౌరవానికి ఆ గురు, కురు వృద్ధు లుభయులూ ఎంతో ఆనందించారు.

అర్జునుడు ఉత్తరునికి ధైర్యం కల్పించి రథాన్ని ముందుకు నడిపించాడు. యుద్ధం ప్రారంభమయింది.

కురుసేనలు గోగణాలను తరలించుకుపోతున్న దిశగా రథాన్ని సాగనిచ్చి వారి ప్రయత్నం విఫలంచేసి మహాయోధులతో యుద్ధానికి తలపడ్డాడు.

మహారథికులు ఒక్కొక్కరుగా అర్జునుని ఎదుర్కొన్నారు. గాండీవం నుంచి వెలువడే శస్త్రాల తాకిడికి తట్టుకోలేక వారు పరాఙ్ముఖు లవుతు న్నారు. అశోకవృక్షం విరిగబూసి రక్తారుణకాంతు లీనుతున్నట్లు యోధుల శరీరాలు అర్జునుని వాడిబాణాలతో తూట్లు పడి రక్తధారతో రాజిల్లు తున్నాయి. సేనాసముద్రాన్ని రెండుపాయలుగా చీలుస్తూ అర్జునుని రథం సాగుతున్నది.

కర్ణార్జునుల మధ్య ముఖాముఖీ పోరాటం ఆరంభమయింది. కర్ణుని అనుసరించివచ్చిన బలగమంతా నేలకూలడంతో కుపితుడై కర్ణుడు వాడి బాణాలతో అర్జునుని గుర్రాలనూ, కేతనాన్నీ గాయపరిచాడు. అంతతో అర్జునుడు మరింత రోషంతో కర్ణుని మీదికి శరవర్షం సాగించాడు. మళ్ళీ అటు దుర్యోధనుని ఎదుర్కొని వివిధశస్త్రాలతో వేధించడం మొదలు పెట్టగా సుయోధనుడు రథం వెనక్కు తిప్పేశాడు. అలా ఒక్కొక్కరినీ పరాభూతు లను చేసి ఇంక సంగరక్రీడ కట్టిపెట్టే తలంపుతో ఇంద్రదేవతాకమయిన సమ్మోహనాస్త్రం ప్రయోగించాడు.

కురుసేనావాహిని చాపచుట్టగా నేలవ్రాలింది. అందరికీ స్మృతి తప్పింది. అప్పుడు ఉత్తరుని పిలిచి:

తక్షణం వెళ్ళి తలపాగాలు కోసుకురా. అదిగో సుయోధనుడూ, అశ్వత్థామా చుట్టిన పాగాలు నల్లగా కనిపించేవి. కర్ణునిది పచ్చగా వుంటుంది. ద్రోణ, కృపులు చుట్టిన పాగాలు తెల్లగా వుంటాయి. ఆ ముందుకుపోయి భీష్మాచార్యుల కోసం ప్రయత్నించకు. ఆయనను ఈ అస్త్రం బంధించదు. త్వరగా పోయిరా - అన్నాడు అర్జునుడు.

ఉత్తరుడు చకచక సాగి వారి వారి పాగాకుచ్చులు ఉత్తరించి, వచ్చి రథమెక్కాడు. అర్జునుడు గోగణాలతో విరాటనగరంవైపు తిరిగాడు.

అప్పటికి తెలివి వచ్చిన సుయోధనుడు తిరిగి యుద్ధసంకల్పముతో చూడగా, భీష్మాచార్యులు తమ వారికి జరిగిన పరాభవం వివరించి సేనలను హస్తినాపురానికి తరలించాడు.

## కల్యాణ వేదిక

అర్జునుడు తన రథాన్ని శ్మశాన సమీపంలో శమీవృక్షం దగ్గర ఆపించి గాండీవం మళ్ళీ యథాస్థానంలో వుంచమని, రథానికి అలంకృతమయిన కపికేతనం స్థానంలో సింహధ్వజం కట్టించాడు. రథం కొంతదూరం సాగాక—

రాకుమారా! మన గుర్రాలు బాగా అలసి వున్నాయి. వాటికి కొంత విశ్రాంతి అవసరం కనుక మన గోపాలకులు ముందుగా నగరానికి వెళ్ళి నీ విజయవార్త తెలిపి తగు సన్నాహాలు చేస్తారు - అన్నాడు.

ఉత్తరుని ఆజ్ఞానుసారం గోపాలకులు తరలి వెళ్ళారు. ఉత్తరుడు రథాశ్వాలను విప్పి విశ్రాంతిగా సరోవర సమీపాన విడిచాడు.

సరే —

అటునుంచి నగరానికి తిరిగివచ్చిన విరాటరాజు కొలువుదీర్చి, తన విజయుగాథాగానం చేసే వంది, మాగధులను సంతుష్టులను చేసి, ఉత్తరు డేమయాడని అడిగి, వివరం తెలుసుకొని, వెలవెలబోయే ముఖంతో మంత్రుల వైపు తిరిగి తక్షణం సేనలను ఉత్తరునికి సాయంగా పంపమన్నాడు.

పుంస్త్వమయినా లేని బృహన్నల సారథ్యంలో వెళ్ళిన తన కుమారు డీపాటికి ఏమయి వుంటాడో అని భయపడుతూ ఉండడం గమనించి, ధర్మరాజు -

మహారాజా! బృహన్నల సారథ్యంలో మీ కుమారుడు విజయ శ్రీయు తుడై మన గోగణాలను తరలించుకు వస్తాడు - అని అంటూండగానే ఉత్తర దిక్కునుంచి వచ్చిన గోపాలుడు విజయవార్త నివేదించాడు. ఆ వార్తాహరుడిని రత్నభూషణాలతో బహూకరించి, నగరమంతా అలంకరించి విజయోత్సవం ఏర్పాటు చేయుమన్నాడు.

ఆ సంతోషంలో కంకభట్టును పిలిచి కొంతసేపు జూదం ఆడదాం పాచికలు తెమ్మన్నాడు.

మహీపతీ! జూదం ఆడి దర్మరాజంతటివాడు సర్వం కోలుపోయిన విషయం మీరు వినే వుంటారు. సామాన్య స్థితిలోనే జూదం నిషిద్దం. ఇప్పుడు మీరు మాంచి ఉత్సాహంలో వున్నారు. అందుచేత అసలే ఉచితం కాదన్నాడు - ధర్మరాజు. విరటుడు బలవంతం చేశాడు, ఆట సాగించి తీరాలనీ, సైరంధ్రిని పిలిచి పాచికలు తెమ్మన్నాడు.

ఆట కొంత సాగాక - మా ఉత్తరుడు కురుసేనను జయించడం చాలా ఆశ్చర్యకరమయిన విషయం ...... అంటూ ప్రసంగిస్తూంటే, కంకభట్టు అడ్డుతగిలి బృహన్నల సారథిగా వుంటే ఎవరయినా విజయం సాధించి తీరుతారు - అనగా, ఇంతవరకూ విజయలక్ష్మి సారథిని వరించడం నేను వినలేదు. పయిగా మా ఉత్తరుడి విజయాన్ని నువ్వు విశ్వసించలేక పోతున్నావు — అన్నాడు.

నిజమే మహారాజా! బృహన్నల సామర్థ్యం అటువంటిది. ఇంద్రసారథి మాతలి, అర్జున సారథి కృష్ణుడు కూడ బృహన్నల సారథ్యంతో తూగలేరు - అంటూంటే విరటుడూ క్రోధంతో చేతిలోవున్న పాచిక విసిరాడు. ఆ దెబ్బకు ధర్మజుని నుదురు చిట్లి రక్తం చిమ్మడం గమనించి పక్కనే నిలబడిన సైరంధ్రి త్వరత్వరగా తన పైట చెంగుతో ఆ రక్తం తుడిచి

తడిగుడ్డతో నుదురు తుడుస్తూంటే, విరాటుడు తెల్లబపోయి సైరంధ్రీ! ఏమిటి నువ్వు చేస్తున్న పని - అనగా,

ఉత్తమవంశ సంజాతుడూ, శీలవంతుడూ అయిన మహాపురుషు డాయన. అటువంటి ఉత్తమ పురుషుని రక్తబిందువులు యీ భూమిమీద ఎన్ని పడతాయో అన్ని సంవత్సరాలు అనావృష్టి పీడ తగులుతుంది. కనుక మీ రాజ్యానికి అటువంటి పీడ తగులకూడదని ఈ పని చేసానంది.

ఇలా సంభాషణ సాగుతూండగా, రాకుమారుడు కోట గుమ్మం దగ్గర విజయోత్సాహంతో నిలిచి వున్నాడని కబురు వచ్చింది.

తక్షణం లోపలకు తీసుకురమ్మన్నాడు విరటుడు. ప్రతీహారి వెళ్ళ బోతుండగా, కంకభట్టు వానిని పిలిచి - కొద్దిక్షణాలు బృహన్నల లోపలకు రాకుండా చూడు. నా నుదుట యీ రక్తం చూస్తే, అతనికి నా మీద గల గౌరవంతో ఆవేశపడి ఏ సాహసమయినా చేయవచ్చు నన్నాడు.

కంకభట్టు మాట ప్రకారము అర్జునుని ద్వారంలోనే నిలిపి, ఉత్తరుని లోపలకు తెచ్చారు.

రాగానే కొడుకును కౌగిలించుకొని విజయవిశేషాలడిగాడు, విరటుడు.

మహారాజా! ఒక మహాపురుషుని అనుగ్రహ విశేషం వల్ల నేనీ విజయం సాధించాను. ఆయన రేపు మన నగరానికి వస్తారన్నాడు.

విరటుడు యుద్ధవిశేషా లడుగుతూంటే ఉత్తరుడు క్షణ క్షణం ఆ మహాపురుషుని పొగడుతూ, యుద్ధవార్తలు వివరించాడు.

అనంతరం వచ్చిన బృహన్నల సాభిప్రాయంగా కంకభట్టును చూచి, అందరి దగ్గరా సెలవు తీసుకొని, అంతఃపురానికి వెళ్ళి ఉత్తరకు బొమ్మ పొత్తిక అందించాడు.

చీకటి పడ్డాక భీమసేన, ధర్మరాజులు రహస్యంగా కలుసుకొని, ఆ మరునాడు తమ తమ స్వస్వరూపాలు విరటుని ఎరిగించడానికి పథకం సిద్ధం చేశారు.

ఉషోరాగాలు ఉదయాచలంమీద నడయాడే సమయానికి వారం దరూ విధ్యుక్త కర్మలు నిర్వర్తించి, తెల్లని వస్త్రాలు ధరించి, ముందుగా కొలువుకూటానికి వచ్చారు.

ధర్మరాజు విరటుని సింహాసనం అధివసించాడు. సోదరులందరూ రాజమిత్రులలంకరించే ఆసనాలమీద వున్నారు.

అప్పుడు సభాస్థలికి వచ్చిన విరటుడు తన సింహాసనం మీద వున్న కంకభట్టును చూచి, ఆశ్చర్యమూ క్రోధమూ పెల్లుబకగా:

కంకా! నాతో ద్యూతక్రీడ సాగించే నువ్వు ఈ ఆసనం అధిష్ఠించడంలో ఆంతర్యం? అని అడుగగా, పార్శ్వాన వున్న అర్జునుడు,

త్యాగశీలుడూ, నిస్స్వార్థసేవా పరాయణుడూ, నియమపరుడూ, శస్త్రాస్త్రవిదుడూ అయిన ఈ మహాపురుషుడు ఇంద్రసింహాసనం కూడా అధివసించడానికి అర్హుడు.

విరాటరాజా! ఉదయారుణ కిరణాలతో భాస్కరుడు ప్రపంచాన్ని కాంతిమయం చేస్తున్నట్లు, తన దానత్యాగాలతో ఆర్జించిన యశశ్చంద్రికలతో సర్వ ప్రజాహృదయాలనూ ఆహ్లాదమయం చేసే పాండవజ్యేష్ఠుడీయన. క్రోధ ద్వేషాలను దరిజేరనీయని ఈ ధర్మజుడు ....... అంటూండగానే విరటుడు ఆశ్చర్యంతో - అయితే మిగిలిన పాండవులూ, ద్రౌపదీ, అని అర్థోక్తిలో ఆగాడు.

మహారాజా! సైరంధ్రిని బలాత్కరించ సాహసించిన కీచకుని సోదర సమేతం హతమార్చిన పాకకళాకోవిదుడు భీముడు. అశ్వపాలకుడు నకులుడు. గోపాలకుడు సహదేవుడు. విశాలనేత్రాలతో, శుచిస్మితవదనంతో అలరారే సైరంధ్రి ద్రౌపది - అని అర్జునుడు అనగా -

ఈ బృహన్నల అర్జునుడు అని భీమసేనుడు కూర్చువ్నాడు.

ఔను మహారాజా! అంటూ ఉత్తరుడు తండ్రిని సమీపించి, మొన్న గోగ్రహణంలో కురుసేనలను చెల్లచెదరు చేసిన మహాయోధుడీయనే అని చేతులు జోడించాడు.

విరాటుడు వినయాంజలిబద్ధుడై ధర్మరాజును సమీపించి;

ఆర్యా! ఈ రాజ్య సర్వస్వాన్ని మీకు సమర్పిస్తున్నాను. నా ముద్దుల బిడ్డ ఉత్తరను మీ ధనంజయునికి వధువుగా స్వీకరించండి అన్నాడు.

రాజా! మీ ఉత్తరను నేను నా ఒడ్డగా మాస్తూ విద్య నేర్పాను. కనుక ఆమెను నా కోడలుగా స్వీకరిస్తాను. గురుశిష్య బాంధవ్యం పితా సుత సమంగా ఉండాలే కాని ప్రేయసీ ప్రియులుగా మారరాదు. మారితే మామధ్య విద్యాదానం కంటె మరొక దుర్బల వ్యాపారం యిదివరకే వుండి వుంటుందని లోకులు ముక్కున వేలువేసుకుంటారన్నాడు. పాండవుల ధర్మపరాయణత్వానికి సంతోషించి విరటుడు అంగీకరిస్తూ, బంధు బాంధవులందరికీ ఆహ్వానపత్రికలు పంపాడు.

పాండవులు విరాటనగరంలో బహుసత్కారాలు పొంది, ఉపప్లావ్యంచేరి అక్కడ ప్రజల ఆదర సత్కారాలతో సంతుష్టచిత్తులయి వున్నారు.

విరటుని ఆహ్వానం అందుకుని కాశీరాజు శైబ్యుడూ, పాంచాలాధిపతి ద్రుపదుడూ, ఇతర మిత్రరాజులూ విరాట నగరానికి తమ తమ పరివార సేనాసమేతం విజయం చేశారు. వార్త అందగానే కృష్ణుడు, బలరాముడూ, సాంబ, సాత్యకి, అక్రూర, కృతవర్మ ఆదిగాగల యాదవ ప్రముఖులతో సుభద్రనూ, అభిమన్యునీ వెంట బెట్టుకుని, అంతవరకూ తమ నగరంలో వున్న ఇంద్రసేనాది పాండవ రథసారథులతో చేరారు. అంధక, వృష్ణి, భోజ వంశీయులయిన రాజులందరూ వివాహ మహోత్సవం తిలకించడానికి వచ్చారు.

విరాటనగరం అంతా పెండ్లి వేడుకలతో అలరారుతున్నది. వచ్చిన అతిథులకూ, బంధువులకూ, వారి వారి అర్హతలను అనుసరించి విడిది మందిరాలు ఏర్పాటు చేశారు. ఎవరికీ ఏ లోటూ రాకుండా స్నాన, పాన, భోజన, తాంబూలాదులు సకాలంలో సాదరంగా అందుతున్నాయి.

నగరం మంగళవాద్యాలతో ముఖరిత మవుతున్నది. గీత వాద్య సహకారంతో నృత్యగోష్ఠులు సాగుతున్నాయి. కంకణస్వనాలూ శింజినీని

స్వనాలు, మణికింకిణీబద్ధ కాంచీనూపురరవాలు, మంజీర మృదుశబ్దాలు, మధుర మధురంగా మదవతీమణుల మనోహర సంభాషణలూ, మణిమయ కర్ణభూషణాలను పరిహసించే విశాల వినీల నేత్రకాంతులు ...... విరుగంటుల సవ్వడిలా వినీవినిపించని మంజులహాసాలు .......

నగర నారీజనం అంతా పెండ్లి పేరంటంతో క్రిక్కిరిసి వున్నది. అటు సుధేష్ణాదేవి సర్వాలంకార భూషితయై, కొత్తనగకట్టుతో కుమార్తెను అలంకరించి పెండ్లిపీటల మీదకు తీసుకొని వచ్చింది. అలంకారా లంతగా లేకపోయినా తన నిసర్గ సౌందర్యశోభతో ద్రౌపదీ దేవి మహిళాలోకానికి శిరోభూషణంగా వెలుగుతూ అభిమన్యుని వెంట సుభద్రతో కల్యాణ వేదిక చేరింది.

లోకకల్యాణ కాంక్షాపరుడయిన వాసుదేవుని సమక్షంలో, వేదవిదుల మంత్ర పూత నాదాలలో, మంగళవాద్య ఘోషలో అభిమన్యుడు ఉత్తరగళ సీమలో మాంగల్య తంతువు బంధించాడు. ఉత్తర సిగ్గుతో వంచిన మోములో విరిసిన చిరునవ్వు కాంతులు అభిమన్యుని పాదాలమీద పారిజాతాలు వర్షించాయి.

## విరాటపర్వం సమాప్తం.

## మూలభారతంలో పర్వవిభజన

అరణ్యపర్వం: మూలంలో మూడవ పర్వాన్ని వనపర్వం అన్నారు. ఇందులో అరణ్య, కిమ్మీర వధ, అర్జునాభిగమన, కైరాత, ఇంద్రలోకాభిగమన, నలోపాఖ్యాన, తీర్థయాత్ర, జటాసురవధ, యక్షయుద్ధ, నివాతకవచ, అజగర, మార్కండేయసమాఖ్య, ద్రౌపదీ-సత్యభామా సంవాద, ఘోషయాత్ర, వ్రీహిద్రౌణిక, ద్రౌపదీహరణ, జయద్రథ విమోక్షణ, కుండలాహరణ. ఆరణేయ పర్వాలు 17,220 శ్లోకాలకు పైగాను ఉన్నాయి.

విరాటపర్వం: మూలంలో పాండవ ప్రవేశ, కీచకవధ, గోహరణ, వైవాహిక పర్వాలతో 2,260 శ్లోకాలకు పైబడి వుంది.

సారపుధర్మమున్ విమల సత్యముఁబాపముచేత బొంకుచేఁ
బారముఁబొందలేక చెడఁబాటినదైన యవస్థ దక్షులై
వ్వార లుపేక్షసేసిరది వారల చేటగుఁ గాని, ధర్మని
స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవ ముండెడున్.

# ఉద్యోగపర్వం

**ఇందులో:**

సమాలోచనము

ద్వారక

మొదటి రాయబారి

విదురనీతి

సంజయ రాయబారము

శ్రీకృష్ణుడు

కర్ణహృదయము

కుంతీదేవి

సన్నాహాలు

సమరాంగణము

## ఉద్యోగభూమి

మానవ జీవిత మహేతిహాసం మహాభారతం

భారత గంగాప్రవంతిలో మణికర్ణికా ఘట్టం

## ఉద్యోగపర్వం

రాయబార రూపంలో రాజనీతి

విదురుని ఉపదేశంలో లోకనీతి

సనత్సుజాతుని నోట ఆత్మజ్యోతి.

ఈ పర్వంలో గ్రహించి దర్శించాలి. అందుకే

రామాయణంలో 'సుందరకాండ' వలె భారతంలో ఉద్యోగపర్వం నిత్యం చదువుకోవాలి; ఆత్మ ఉన్నతీ, మనోవికాసం సాధించడానికి.

ఇందులో నలుగురు రాయబారులు వస్తారు.

వ్యవహారజ్ఞానం లేకుండా నిజాన్ని నిష్ఠూరంగా చెప్పడమే, తెలిసిన రాయబారి ద్రుపద పురోహితుడు.

కర్ర విరగకుండా, పాముచావకుండా మంత్రాంగం నడిపే రాయబారి సంజయుడు.

త్రాచుపామును బలమయిన కర్రతో నడ్డి విరగబొడిచే రాయబారి వాసుదేవుడు.

విరిగిన మనసులను మరింత విరిచే అవివేక రాయబారి శకుని కొడుకు ఉలూకుడు.

ఈ నలుగురి రాయబార విధానాలనూ పరిశీలిస్తే ఈ నాటి ప్రపంచ రాజకీయాలలో వీరిని మించిన ప్రవృత్తికల రాయబారి కనిపించడు.

అందుచేత రాజకీయవేత్త లందరూ యిది చదవాలి, ఎప్పటికప్పుడు బుద్ధికి పదును పెట్టడానికి.

ప్రజాక్షేమాన్ని కాంక్షించే రాజకీయ వర్గాల వారందరూ విధిగా నిత్యం పారాయణం చెయ్యాలి విదురనీతి; ఇది విద్యార్థు లందరికీ అవశ్య పఠనీయం.

అనిత్యమయిన పాంచభౌతిక దేహంకోసం అనవసర యాతనలుపడే వారందరికీ జ్ఞాననేత్రం ప్రసాదించి, ఆత్మజ్ఞాన జ్యోతిని దర్శింపజేస్తాడు యీ పర్వంలోనే సనత్సుజాతుడు.

ఇన్ని నిక్షేపించిన వ్యాసమహర్షిని స్మరించి చదవండి.

— ఉషశ్రీ

ప్రాంశుపయోదనీల తనుభాసితు ఉజ్జ్వల దండధారు పిం
గాంశుజటాచ్ఛటాభరణు ఆగమపుంజ పదార్థతత్త్వని
ష్ప్రంశయుకారుఁ గృష్ణమృగచర్మ కృతాంబరకృత్యు భారతీ
వంశవివర్ధనున్ త్రిదశవందితు సాత్యవతేయు గొల్చెదన్.

మధుర గంభీర వచశ్శ్రీయుతుడు, కథా కథన దక్షుడు వైశంపా యనుడు ఆది, సభా, అరణ్య, విరాటపర్వాలు ముగించి ఉద్యోగపర్వం ఆరంభించాడు.

జనమేజయ మహారాజా!

వైభవోపేతంగా ఉత్తర వివాహం జరిగింది అభిమన్యునితో. పెండ్లి వేడుకలు సాగుతున్నాయి పరమసంతోషంగా.

ఒకనాటి మధ్యాహ్నవేళ భోజనానంతరం బంధు మిత్ర రాజులందరూ సముచిత సల్లాపాలు సాగిస్తున్నారు. కొంతసేపు సాగనిచ్చి వాసుదేవుడు గొంతు సవరించి:

మిత్రులారా! అనడంతో అందరి దృష్టులూ ఆయనమీదికి నడిచాయి.

ఆ సభలో పెద్దవారయిన విరాట ద్రుపదులు ఉన్నతాసనాలమీద ఉన్నారు. వారి ప్రక్కనే వసుదేవుడు, బలరాముడూ, కృష్ణుడూ వున్నారు. ఆవంక సాత్యకి, భీమార్జున, నకుల, సహదేవులు, యదువంశీయులయిన సాంబ, ప్రద్యుమ్నులు, విరాటరాజ కుమారులు, అభిమన్యుడు, ఉప పాండవులు ఆసీనులయారు. ఆ మహాయోధుల రత్నభూషణ కాంతులు నక్షత్రశోభ లీనుతున్నాయి.

చిరునవ్వులు చిందే కృష్ణునివదనం తిలకిస్తున్న వీరందరూ సావధానులయినట్లు గ్రహించి శ్రీకృష్ణుడు:

పెద్దలూ పిన్నలూ బాగా ఆలోచించి నిర్ణయించవలసిన విషయం ఇది.

మాయాతంత్రం తెలిసిన శకుని దుర్యోధనుని పక్షాన జూదం ఆడి ధర్మరాజును ఓడించి వీరి రాజ్యం అపహరించిన విషయం మీ అందరికీ

తెలుసు. వారు చేసింది అన్యాయం: అయినా జూదనియమం ప్రకారం పాండవులు అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తిచేశారు.

ప్రపంచాన్ని జయించగల శక్తిసామర్థ్యాలు కల వీరు ధర్మదీక్షతో యీ క్లేశాలు సహించారు. మనందరి మాటా ఎలావున్నా అజ్ఞాతవాస సమయాన వీరు పడ్డ బాధలు విరాటరాజుకి తెలుసు. ఈ బాధలన్నీ ఎందుకు పడ్డారు వీరు!

తమ రాజ్యభాగం తమకు సక్రమంగా లభించాలని కదా!

ఇప్పుడు మనం అటు దుర్యోధనుడికీ, యిటు ధర్మరాజుకీ కష్టం కలగని రీతిలో న్యాయంగా ఈ సమస్యను పరిష్కరించాలి. ధర్మానికి విరుద్ధంగా ఏది జరిగినా ధర్మరాజు భరించలేడు.

వాస్తవం చూస్తే రణరంగంలో పాండవులను కౌరవులు జయించలేరు. కనుకనే కుతంత్రాలతో వారు వీరిని వంచించారు.

ఈనాడు వీరి తండ్రి రాజ్యం వీరికి రావాలి. అంతేకాదు, వీరు స్వయంగా జయించిన భూ భాగాన్నే వీరు కోరుతున్నారు.

యత్తు స్వయం పాండుసుతై ర్విజిత్య
సమాహృతం భూమిపతీ న్ప్రపీడ్య
తత్ప్రార్థయంతే పురుషప్రవీరాః
కుంతీసుతా మాద్రవతీ సుతా చ!

పోగా—

చిన్ననాటి నుంచీ వీరిని ఎలాగయినా హతమార్చాలని వారు పన్నిన పన్నాగాలూ, సాగించిన కుట్రలూ లోకానికి తెలిసినవే.

వీరి ధర్మదృష్టి వారి లోభబుద్ధి మీ రెరుగుదురు. ఇప్పటికీ దుర్యోధనుడు తన మనసు మార్చుకోకపోతే వారికి యమసదనమే శరణ్యం.

యుద్ధం సిద్ధమయితే వాం బలంముందు వీరు ఆగుతారా! అని సందేహించ వలసిన అవసరం లేదు. మిత్రరాజులతో కలిసి శత్రునాశనం చెయ్యగలరు వీరు.

ఇప్పుడే మనం యుద్ధం ప్రకటించవచ్చు. కాని అక్కడి వారి అభిప్రాయం తెలుసు కోకుండా నిశ్చయించడం రాజనీతి కాదు.

ధర్మశీలంతో అప్రమత్తంగా, దూతకృత్యం నడపగల ఉత్తమపురుషుని పంపి వారి ఆలోచన గ్రహించి రమ్మనాలి. అనంతరం మన కర్తవ్యం నిర్వర్తించవచ్చు, అని సదస్యులను చూస్తూ అన్నాడు కృష్ణుడు.

## బలరాముడు

కృష్ణుని ప్రసంగం విని బలరాముడు:

మిత్రులారా! మా తమ్ముడు ధర్మార్థయుక్తంగా చెప్పిన విషయాలు మీరు విన్నారు. అలా జరిగి వీరి రాజ్యం వీరి కిచ్చినట్లయితే మనందరం సంతోషిస్తాం.

మనం పంపే దూత వున్నాడే, వాడు చాలా వినయంగా ఎవని మనసుకీ నొప్పి కలగకుండా మాట్లాడగలగాలి.

జూదం విషయం చూస్తే ధర్మరాజుకి కుతూహలం ఉన్నంత కౌశలం లేదు. కనుక శకుని జయించాడు. అది వారి దోషం కాదే! ఓడుతున్న కొద్ది ఆవేశం పెరిగి ఒడ్డుతూ వచ్చాడు ధర్మరాజు.

ఆ విషయం యిప్పు డనవసరం. మన దూత చాలా సౌమ్యంగా శాంతచిత్తంతో సంధికి ప్రయత్నించాలి. యుద్ధం వల్ల ఉభయులూ నష్టపోతారు, అన్నాడు.

## సాత్యకి

బలరామా!

మనిషి ప్రకృతిని బట్టి మాటకూడా ఉంటుంది. మీ అంతఃకరణను మీరు విశదం చేశారు సంతోషం.

ప్రపంచంలో శూరులూ వీరులూ వున్నట్లే దుష్టులూ మూర్ఖులూ వున్నారు. మానవ జాతి ఉన్నంతకాలం వీరుంటారు. చెట్టుకు రెండు కొమ్మలుంటే అందులో ఒకటే పుష్పించి ఫలించవచ్చు. రెండవది ఫలించక పోవచ్చు. ఒక కుటుంబంలో కొందరు బలిష్ఠులు పుట్టి ఒకడూ అరా నపుంసకులూ పుట్టవచ్చు.

ఇంతకూ మీ మాటలలో తప్పుపట్టడం నా ఉద్దేశం కాదు. ఆ మాటలు వింటూ మౌనంగా కూర్చున్నారే, వీరిని చూసి బాధపడుతున్నాను.

జూదంలో కౌశలంలేని ధర్మరాజును పనిగట్టుకు పిలిపించి, ఓడించారు కదా వారు. అది ధర్మమనీ, వారు దోషులు కారనీ ఎలా అనగలిగారు మీరు.

మన దూత వారి సభలో వినయంగా చేతులుకట్టుకు నిలబడి మాట్లాడ వలసిన అవసరం లేదు. తలవంచడం అనేది క్షత్రియుడు చేసే పనికాదు. అక్కడున్న భీష్మ, ద్రోణ విదురాదు లెవరూ వీరి రాజ్యం వీరి కిప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు వినబడదు.

రణరంగంలో ధనుస్సు ధరించి నిలిచి ఆ దుర్మార్గులందరినీ బంధించి యీ పాండవాగ్రజుని పాదాలమీద పడవేస్తాను. అది యీయనకు నచ్చకపోతే వారందరినీ యమలోకం పంపుతాను.

గాండీవం ధరించి అర్జునుడు

గదాదండంతో భీమసేనుడు

సుదర్శనధారియై వాసుదేవుడు

విరాట, ద్రుపద, ధృష్టద్యుమ్న, నకుల సహదేవాదులను ఎదిరించి పోరగల వారెవరు!

ఇక మహాయోధుడు అభిమన్యు డున్నాడు, ఉపపాండవు లున్నారు.

ప్రద్యుమ్న, గద, సాంబులు యమ, సూర్య అగ్ని సదృశులు. ఇందరం యుద్ధం సాగించి దుర్యోధన శకుని కర్ణులను సంహరించి ధర్మరాజును పట్టాభిషిక్తుని చేస్తాం.

ధృతరాష్ట్రుడు వీరి రాజ్యం వీరికివ్వాలి. అందుకోసం దీనంగా యాచన చేయనవసరం లేదు. కౌరవులు ఈ దారికి అంగీకరించకపోతే రణరంగంలో శాశ్వత నిద్రకు సిద్ధం కావాలి, అన్నాడు.

## ద్రుపదుడు

సాత్యకీ! నీ ఆలోచన చక్కగా ఉంది. శాంతచిత్తంతో దుర్యోధనుడు వీరిరాజ్యం వీరి కివ్వడు. పుత్రప్రేమ కారణంగా ధృతరాష్ట్రుడు యిందుకు సుముఖంగా ఉండడు.

భీష్మ ద్రోణులంటావా!

కౌరవుల కృపతో బ్రదుకుతున్నారు కనుక మాట్లాడరు. శకుని, కర్ణులు మూర్ఖంగా దుర్యోధనుని అనుసరిస్తారు. అందుచేత బలరాముని అభిప్రాయం ప్రయోజనకరం కాదు.

దుర్బుద్ధీ, క్రూరుడు అయిన దుర్యోధనునిముందు వినయమూ, శాంతమూ పనికిరావు.

గాడిదలముందు వినయమూ, గోవులదగ్గర క్రౌర్యమూ ఎంత ప్రయోజనకరమో దుర్యోధనునితో సౌమ్య వ్యవహారమూ అంతే!

మధురంగా వినయంగా భాషించేవారిని అసమర్థు లనుకుంటారు మూర్ఖులు, అటు వంటివారు దుర్యోధనాదులు.

ముందుగా మనం మిత్రదేశాల రాజుల దగ్గరకు దూతలను పంపి సేనాబలం సమీకరించాలి.

ముందుగా కోరిన వారికే, సాయపడడం ఉత్తమ [illegible] ధర్మం. ఈ పాటికే దుర్యోధనుడు ఈ ప్రయత్నంలో ఉండవచ్చు.

ఇక—

హస్తినాపురం వెళ్ళి దూతకృత్యం సాగించడానికి విద్వాంసుడూ, వ్యవహార కుశలుడూ అయిన మా పురోహితులను పంపవచ్చు. అక్కడ ఎవరితో ఏం చెప్పాలీ అనేది మనం విశదం చేద్దాం అన్నాడు.

## శ్రీకృష్ణుడు

మహాశయులారా! ద్రుపద మహారాజు సూచన సముచితంగా ఉంది. నీతికోవిదులు కూడా హర్షిస్తారు ఈ మాటలు.

ఇటు పాండవులు అటు కౌరవులు ఉభయులూ మనకు సమానులే. వారికీ వీరికీ నష్టం కష్టం కలగని దారి మనం అనుసరించాలి, అంటూ ద్రుపదుని వైపు తిరిగి:

మీరు వయస్సులో జ్ఞానంలో మాకంటె పెద్దలు. ధృతరాష్ట్రుడు కూడా మిమ్ము గౌరవభావంతో చూస్తాడు. కృప ద్రోణులకు మీతో స్నేహం ఉన్నది.

అందుచేత సముచిత సందేశంతో మీరు దూతను పంపండి. మీ అభిప్రాయాన్ని మేమందరం అంగీకరిస్తాం. దుర్యోధనుడు మన సూచనానుసారం ధర్మపథాన నడిచినట్లయితే ప్రజాక్షయం ఉండదు.

ఈ ఉభయ వంశాలమధ్య సౌహార్దం వెల్లి విరుస్తుంది.

అలా జరగక—

లోభం అహంకారం వదలక మన మాట కాదన్నాడా! మన సంగ్రామ సన్నాహం ఉండనే ఉన్నది. ఈ గాండీవి పరాక్రమిస్తే కురువంశం మిగలదని అందరూ ఎరుగుదురు.

వివాహ శుభకార్యం పేరిట వచ్చి చాలా రోజులయింది. మాకింక సెలవిప్పించండి అన్నాడు.

యదువంశీయు లందరూ విరటుని సత్కారాలందుకుని రథాల మీద బయలు దేరారు.

అనంతరం విరాట ద్రుపదులతో ధర్మరాజ సంప్రదించి రాజులందరి దగ్గరకూ దూతలను పంపాడు.

ఇది తెలిసిన దుర్యోధనుడు తన దూతలను దేశదేశాల రాజుల దగ్గరకు పంపాడు.

## రాయబారి

ధర్మరాజ అభిప్రాయం సమగ్రంగా తెలుసుకుని ద్రుపదుడు తన పురోహితుని రావించి:

విప్రవరా! భూతకోటిలో ప్రాణం కల జీవి శ్రేష్ఠం. ప్రాణికోటిలో వివేచనకల బుద్ధిజీవి శ్రేష్ఠం. ఈ జీవులలో మానవుడు ఉత్తముడు. మానవులలో వేదవేదాంగ విషయ పరిజ్ఞానం కలవాడు సర్వోత్తముడు. తెలిసిన ధర్మం ఆచరించేవాడు మరీ శ్రేష్ఠుడు. అటువంటి వారు మీరు. శుక్ర బృహస్పతి సములు. మీకు దుర్యోధనుని బుద్ధి తెలుసు.

ధర్మజుని వడవడీ ఎరుగుదురు.

విదురుని వంటి విద్వాంసుడు చెప్పినా వారి చెవికెక్కలేదు.

అందువల్లనే శకునిచేత జూదంలో మోసగింపజేసి వీరిని యిన్ని అవస్థల పాలు చేశారు.

వారి జీవితధ్యేయం మోసం!

అటువంటి వారు వీరి రాజ్యం వీరికిస్తారనే నమ్మకం లేదు.

అయినా మన ప్రయత్నం మనం చేయడం ధర్మం. ఈ విషయాలన్నీ మనసులో వుంచుకుని మీరు ధృతరాష్ట్రునితో మాట్లాడాలి. ఈ వ్యవహారంలో ఆలస్యం మనవారికే మేలు. ఎందుకంటే సేనాబలం సమకూర్చడానికి వారికంటే మనకు వ్యవధి కావాలి.

మీ మాటలలో కురువంశీయుల కీర్తి ప్రతిష్ఠల ప్రశంస ఉండాలి. అదే సమయంలో పాండవుల బాధలు వర్ణించాలి. అప్పుడు వారి మనస్సు మారినా ఉభయులూ అదృష్టవంతులు.

ఎంత ఆకతాయి లక్షణాలున్నా వారు మీవంటి విద్వాంసులను బాధించరు. పైగా రాయబారిగా వెడుతున్నారు కనుక ఏ ప్రమాదము లేదు.

రేపు పుష్యమీ నక్షత్రం, జయ ముహూర్తంలో బయలుదేరండి, అన్నాడు, ద్రుపదుడు.

ఇది అంకురార్పణ.

## ద్వారక

హస్తినాపురానికి రాయబారిని పంపి యితర దేశాల చక్రవర్తుల దగ్గరకు దూతలను పంపి అర్జునుడు స్వయంగా ద్వారకానగరం చేరాడు.

అదే సమయానికి దుర్యోధనుడూ వచ్చాడు. బంధుత్వం కారణంగా వా రుభయులూ శ్రీకృష్ణుని శయన మందిరం ప్రవేశించారు.

అప్పటికింకా ఆయన నిద్రలో వున్నాడు.

తలవైపున ఉన్న ఆసనంమీద దుర్యోధనుడు కూర్చున్నాడు.

పాదాలవద్ద వినయంగా నిలబడ్డాడు పార్థుడు.

కొంతసేపటికి వాసుదేవుడు నిద్రలేచి కనులు తెరిచాడు.

ఎదురుగా అర్జునుడు కనిపించాడు.

లేచి కూర్చొని యిటు తిరిగేసరికి దుర్యోధనుడు కనిపించాడు. చిరునవ్వుతో ఉభయుల కుశలం అడిగాడు.

అప్పుడు దుర్యోధనుడు:

కృష్ణా! నీకు మా ఉభయ కుటుంబాలతో స్నేహమూ, బాంధవ్యమూ బలీయమయినవే. అయితే ముందుగా నేను వచ్చాను. రానున్న సంగ్రామంలో సహాయం కోరడానికి, ముందు కోరినవారికే సాయపడడం

సత్పురుష లక్షణం. ఈ సదాచారాన్ని నువ్వు గౌరవిస్తావని నా నమ్మకం, అన్నాడు.

నవ్వురాజిల్లెడు మోముతో వాసుదేవుడు:

దుర్యోధనా! రావడం మాట ఎలా ఉన్నా ముందుగా నేను అర్జునుని చూశాను. నాసహాయం మీ ఉభయులకూ ఉంటుంది. ముందు బాలుర కోరిక తీర్చాలని శాస్త్రం ఘోషిస్తున్నది. ఈ విషయం నీకూ తెలుసు. కనక అర్జునుని కోరిక తీర్చి తరువాయి నీ విషయం.

బలిష్ఠులూ, యుద్ధప్రియులూ, అయిన నారాయణ గోపాలురు అసంఖ్యాకంగా వున్నారు నా సేనలో. వారందరూ కావాలా?

ఆయుధం పట్టకుండా మాట సాయం చెయ్యడానికే నిశ్చయించుకున్న నేను కావాలా! అన్నాడు.

అర్జునుడు: నాకు నువ్వే కావాలి.

దుర్యోధనుడు: నీ సేనను నాకు పంపించు, అనగా అంగీకరించాడు వాసుదేవుడు.

దుర్యోధనుడు సంతోషంతో బలరామునిచేరి అర్థించాడు. అప్పుడు బలరాముడు: దుర్యోధనా!

మా అభిమన్యుని వివాహమహోత్స సమయంలో అక్కడ విరాటరాజ భవనంలో జరిగిన సంగతులు నీ చెవిని పడి వుంటాయి. నా మాటలు మా కృష్ణునికి నచ్చలేదు. నేను కృష్ణుని విడిచి వుండలేను. పయిగా మీరుభయులూ మాకు ఆప్తబంధువులు. ఈ సందర్భంలో నేను ఎవరికీ సాయం చెయ్య దలుచుకోలేదు. నువ్వు క్షాత్రధర్మం విడవకుండా యుద్ధం చెయ్యి, అన్నాడు.

దుర్యోధనుడు కృతవర్మ దగ్గరకు వెళ్ళాడు.

ఆయన అక్షౌహిణీ సేనతో వస్తానన్నాడు.

సంతోషంతో దుర్యోధనుడు హస్తినాపురం చేరాడు.

కృష్ణుడు: బావా! ఆయుధం పట్టను, యుద్ధం చెయ్యను అని ప్రతిజ్ఞ చేసిన నన్ను కోరుకున్నావు. ఏం తెలివి నీది? అని ప్రశ్నించాడు.

అర్జునుడు: బావా! యశోధనుడవైన నీవు నా ప్రక్కన ఉంటే చాలు. మిగిలినదంతా నేనే చక్కబరచుకుంటాను. నువ్వు నిలిచిన చోట కీర్తికాంత నడయాడుతుంది. అదే నేను కోరుతున్నాను. నీ కరుణాకటాక్షంతో నే నొక్కడినే సర్వశత్రు సంహారం చేయగలను. నా రథానికి నిన్ను సారథిగా చూడాలని చిరకాలంగా వున్న వాంఛ. అది తీరుతుంది.

ఉభయులూ గాఢాలింగనం చేసుకున్నారు. అర్జునుడు వాసుదేవుని వద్ద సెలవు తీసుకొని వెనుదిరిగాడు.

## శల్యుడు

దూతలద్వారా వార్త విన్న శల్యుడు పాండవులకు సాయపడడానికి బయలుదేరాడు, తన సేనాసమూహంతో.

మద్రదేశపు అలంకారాలూ, ఆభరణాలు చూపరులకు ఆకర్షణ కలిగిస్తున్నాయి.

శల్యుడు బయలుదేరిన వార్త వింటూనే దుర్యోధనుడు వారి దారిలో విడిది మందిరాలూ, భోజన, పాన, సౌకర్యాలూ ఏర్పాటు చేశాడు.

తన సేనలకు ఏ క్లేశమూ లేకుండా ఎక్కడికక్కడ సర్వసుఖాలూ, క్రీడా, విహార సౌకర్యాలూ కల్పించిన వారు ధర్మజుని అనుచరులే అని శల్యుడు భావించి:

మాకు సంతోషం కలిగించే రీతిలో స్వాగత సత్కారాలు నడిపే వారిని ఉచితంగా సన్మానించాలని ఉంది, అన్నాడు.

అంతవరకూ మారువేషంలో ఉండి శల్యుని సేవించే దుర్యోధనుడు నిజరూపంతో ఎదుటికి వచ్చి నిలిచాడు. శల్యుడు పరమానందంతో కౌగిలించుకొని కావలసింది కోరుకోమన్నాడు.

నన్ను మీ వాడుగా భావించి మీరు మాకు సాయపడాలి, అని దుర్యోధనుడనగా అంగీకరించి శల్యుడు:

దుర్యోధనా! మేం ఆడినమాట తప్పం. నీకు సాయం చేస్తాం. ప్రస్తుతం ధర్మరాజు దగ్గరకు వేళ్ళి వారి యోగక్షేమాలు విచారించి వస్తాం, అన్నాడు.

మామా! వాగ్దాన విషయం మరువకుండా మీరు సత్వరం తిరిగి రావాలి, అన్నాడు దుర్యోధనుడు.

శల్యుడు ఉపప్లావ్యం చేరాడు. ధర్మరాజాదు లందరూ తమ మేన మామను గౌరవ సత్కారాలతో విడిది భవనంలోకి తీసుకు వెళ్ళారు.

కుశల ప్రశ్నలు ముగిశాయి.

శల్యుడు: ఇంతకాలం మీరు క్లేశాలు పడి యీ నాటికి సుఖంగా వున్నారు. నాకు సంతోషంగా వుంది. సత్యమార్గం విడవకుండా దానధర్మాలు సాగిస్తూ మీ పూర్వ రాజర్షులు నడిచిన దారినే నువ్వు నడవాలి. లోకనీతి తెలిసిన నువ్వు శత్రువులను అవలీలగా జయించగలవు, అని ఆశ్వాసన వాక్యాలు పలుకుతూ, దుర్యోధనునకీ తనకూ జరిగిన సంభాషణ వివరించాడు.

ధర్మరాజు: మామా! చాలా సంతోషం. నువ్వు వారి కిచ్చిన వరం మాకు ఉపయోగ పడుతుంది. రేపు రణరంగంలో కృష్ణునితో సమంగా సారధ్యం వహించే శక్తి నీకే వున్నది.

అర్జునునికీ కర్ణునికీ యుద్ధం సాగే సమయంలో నిన్ను వాని సారథిగా ఉంచుతారు. అప్పుడు కర్ణుని ఉత్సాహాన్ని తేజస్సునూ కించపరుస్తూ ప్రసంగం సాగించు. దానితో వాని శౌర్యం సన్నగిల్లుతుంది అని ప్రార్థించాడు.

శల్యుడు సంతోషంగా తల ఊపి:

కురుసభా భవనంలో పాంచాలికి జరిగిన పరాభవం మీరు పడిన పాట్లూ విన్నాను. ఇక మీకు బాధలు లేవు. ఇప్పుడు గతాన్ని స్మరించి

దుఃఖించ వలసిన పని లేదు. దేవతలకే తప్పలేదు క్లేశాలు అని వృత్రాసురవధ వినిపించి, వారి వద్ద వీడ్కోలు తీసుకున్నాడు.

## సేనాసమూహం

మహారథికుడు సాత్యకి తన అక్షౌహిణీ సేనతో ధర్మరాజు దగ్గరికి వచ్చాడు. అలానే చేది దేశాధిపతి ధృష్టకేతువు వచ్చాడు. మగధాధీశుడు జరాసంధమానుడు, సహదేవుడూ, సాగరసేనా సమూహంతో పాండ్యుడూ, పాంచాలరాజు ద్రుపదుడు, విరటుడు, పార్వతీయ ప్రభువు తమ సేనలను ధర్మజునికి సహకారంగా తీసుకువచ్చారు. అలా ఏడు అక్షౌహిణీలు చేరింది.

అటు భగదత్తుడు తన సేనతో దుర్యోధనుని చేరాడు. వారిలో కిరాత చీనా దేశీయులున్నారు. శల్యుడు, భూరిశ్రవసుడు, కృతవర్మ, సింధు, సౌవీర వతులూ, కాంభోజరాజు, సుదక్షిణుడూ. (వీని సేనలో యవన, శకదేశీయు లున్నారు.) మాహిష్మతీ నగరాధిపతి నీలుడు; అవంతీ ప్రభువులు వింద, అనువిందులు, వీరుకాక యితర ప్రాంతాల సేనలు మూడు అక్షౌహిణీలు చేరాయి. వీరందరూ కలిసి పదకొండు అక్షౌహిణులయారు.

హస్తినాపురంలో ప్రముఖులకే విడిది భవనాలు చాలలేదు.

పంచనద, కురుజాంగల, రోహితకవన, అహిచ్ఛత్ర, కాలకూట, వారణ, వాటధాన, గంగాతట, యమున, పర్వత ప్రాంతాలలో సర్వ సౌకర్యాలతో వారికి ఆవాసాలు ఏర్పాటు చేశారు.

ద్రుపద పురోహితుడు హస్తినాపురం చేరేసరికి వీరందరూ అక్కడకు చేరారు.

## మొదటి రాయబారి

ద్రుపద పురోహితుడు హస్తినాపురం ప్రవేశించాడు. ప్రవేశిస్తూనే ధృత రాష్ట్ర భీష్మ విదురులను దర్శించి వారివల్ల కుశల ప్రశ్నలూ సత్కారాలు పొంది, పాండవుల క్షేమ సమాచారాలు వినిపించాడు.

సభామధ్యంలో అందరినీ తిలకించి:

మహారాజా! రాజధర్మం బాగా ఎరిగినవారు మీరు. అది తెలిసిన మీకు కొన్ని విషయాలు విశదం చేయడానికి వచ్చాను.

పాండురాజు, మీరు అన్నదమ్ములు.

అన్నదమ్ము లిద్దరూ తండ్రి ఆస్తికి సమంగా భాగస్వాములు.

అయితే సర్వసంపదలూ మీ బిడ్డలే అనుభవిస్తూ పాండవులకు ఏమీ లేకుండా చేశారు. ఇది అందరూ ఎరిగిన విషయమే.

ఇక మీ దుర్యోధనాదులు అనేక ప్రయత్నాలు చేసి పాండవులను సంహరించాలని చూశారు. దైవం వారి పట్ల ఉన్నందున వీరి ప్రయత్నాలు విఫలం అయాయి. పాండవులు తమ శక్తి సామర్థ్యాలతో రాజ్యాన్ని వృద్ధి చేసుకున్నారు. అప్పుడు మీ వారు శకునితో జూదం ఆడించి వారిని మోసం చేసి వారి రాజ్యం అపహరించారు. ద్రౌపదీదేవిని పరాభవించారు. అందరినీ అడవులపాలు చేశారు.

అజ్ఞాతవాస సమయంలో వారు ఎన్ని క్లేశాలు అనుభవించారో మీరు ఊహించగలరు.

ఇన్ని జరిగినా వారు మీతో కలిసి ఉండడానికే కుతూహల పడుతున్నారు.

వారి గుణశీలాలను సదాచార సంపదనూ బాగా ఎరిగిన వారెందరో యీ సభలో వున్నారు.

మీరందరూ పూనుకొని దుర్యోధనుని మనసు మార్చడానికి ప్రయత్నించాలి. యుద్ధం అవసరం లేకుండా తమ రాజ్యం తమకు వస్తే చాలునని పాండవులు భావిస్తున్నారు.

దుర్యోధనుడు యుద్ధానికే సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్నది.

వారి బలం ఏడు అక్షౌహిణులు

మీ సేనాబలం పదకొండు అక్షౌహిణీలు

కనుక మనమే బలవంతులమని దుర్యోధనుడు భావించడం పొరపాటు.

ఎందుకంటారా!

సాత్యకీ, భీమ, నకుల, సహదేవులు, ఒక్కొక్కరు ఒక్కొక్క అక్షౌహిణీతో సమానం.

అసలీ పదకొండక్షౌహిణీలు ఒక్క అర్జునుని ముందు నిలబడలేవు. అంతకన్న మహామహుడు వాసుదేవుడు.

ధర్మజుని సేనాబలం

అర్జునుని గాండీవబలం

వాసుదేవుని బుద్ధిబలం

ఈ మూడు కలిసిననాడు వారి ముందు నిలబడగలవా డెవడు?

కనక నా మాట విని వారి రాజ్యభాగం వారికిచ్చి ఉభయులూ సుఖశాంతులతో వర్ధిల్లండి, అన్నాడు.

అది విన్న భీష్ముడు:

బ్రాహ్మణోత్తమా! వాసుదేవ సహితులై పాండవులు సుఖంగా వున్నారనీ యిప్పటికీ వారు ధర్మమార్గం తప్పడం లేదనీ వినడం చాలా సంతోషంగా ఉంది.

మీరు చెప్పింది ప్రత్యక్షరమూ సత్యమే కాని, అంత తీక్షణంగా ఉండనవసరం లేదు మీపలుకు. కాని విప్ర స్వాభావిక మయిన పౌరుష్యం అది.

పాండవులు చాలా క్లేశాలు పడ్డారు, నిజమే! మీరు చెప్పినట్లు వారి తండ్రి సంపదలూ, రాజ్యమూ పొందే అధికారం వారికి ఉంది. అర్జునుని అస్త్ర విద్యాపాటవం మే మెరిగినదే. అమరేంద్రుడు కూడా వాని ముందు నిలబడలేడు.

అని భీష్మ పితామహుడు మాట్లాడుతూండగానే కర్ణుడు దుర్యోధనుని మాసి భీష్ముని వైపు పరిహాసంగా చూస్తూ:

ఈ దూత చెప్పిన విషయాలు అందరికి తెలిసినవే. అవి మళ్ళీ త్రవ్వి తలకెత్తనవసరంలేదు. దుర్యోధనుని పక్షాన శకుని జూదం ఆడాడు. అందులో పాండవులు ఓడి పోయారు. నియమ ప్రకారం అరణ్య, అజ్ఞాత వాసాలు సాగించాలి. అజ్ఞాతవాసం ముగియకుండానే వారు బైటపడ్డారు. అందుచేత మళ్ళీ అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తి చేసి రావాలి.

అంతేతప్ప మత్స్య పాంచాలాది బంధు దేశాల రాజుల అండచూసుకొని బెదిరింపులు సాగిస్తే మనం లొంగ నవసరం లేదు.

ధర్మమార్గాన నడిస్తే శత్రువుకయినా రాజ్యం ధారపోయడానికి దుర్యోధనుడు సిద్ధమే అధర్మంగా వారు వస్తే రాజ్యంలో నాలుగోవంతు వారికి దక్కదు. కాదని యుద్ధానికి వస్తే సరే అనుభవిస్తారు, అన్నాడు.

పితామహుడు: రాధేయా! ఎందుకీ వ్యర్థ ప్రసంగాలు. నిన్న కాక మొన్న గోగ్రహణ సమయంలో అర్జునుడు ఏకైక వీరుడుగా వచ్చి మనకు జరిపిన పరాభవం మరిచిపోయావా? ఆనాడు నీ సాహస పరాక్రమాలు ఏమయాయి. అజ్ఞాతవాస విషయం అక్కడే నీకు వివరించాను. మళ్ళీ ఆ ప్రస్తావన దేనికి. ఇప్పుడీ విప్రుడు చెప్పినది విని ఆచరించడం మంచిది లేదా వినాశనమే!

అని అంటుండగా ధృతరాష్ట్రుడు కర్ణుని మందలించి భీష్మునితో:

మీ మాటలలో మా ఉభయ వంశాల శ్రేయస్సువున్నది. అంతే కాదు లోకకల్యాణకాంక్ష మీది.

నేను బాగా ఆలోచించి వారి వద్దకు సంజయుని పంపుతాను అని పురోహితుని వైపు తిరిగి:

ఆర్యా! ఈ విషయం వారికి చెప్పండి. మా సంజయుడు వచ్చి వ్యవహారం నడుపుతాడు. అని ఆయనను యథోచితంగా సత్కరించి పంపాడు.

## సంజయుడు

నిజ మందిరానికి చేరి ధృతరాష్ట్రుడు సంజయునికి కబురు పంపాడు. సంజయుడు వచ్చి నమస్కరించి కూర్చున్నాడు.

సంజయా!

పాడవులు ఉపప్లావ్యం చేరినట్లు తెలిసింది. నువ్వు రేపు బయలుదేరి వెళ్ళి వారి క్షేమ సమాచారాలు తెలుసుకు రావాలి. అక్కడకు వెళ్ళగానే ధర్మరాజును దర్శించాలి. ఆదర వచనాలతో వారి యోగక్షేమాలు నేను అడిగినట్లు చెప్పాలి.

నాయనా! క్లేశాలన్నీ సహించి క్షేమంగా వున్నట్టు తెలిసి సంతోషించాను. మేము కూడా క్షేమంగా వున్నాం.

సాధు స్వాభావాలూ, పరోపకార పరాయణులూ అయిన మీకు రాకూడని కష్టాలు వచ్చాయి, అని చెప్పు.

మరొక్కమాట సంజయా! ఇంత జరిగినా వారికి మన మీద క్రోధం లేదు. ఎన్నడూ మోసం చేసి ఎరుగరు. సాహస పరాక్రమాలు ప్రదర్శించి సంపదలు సాధించారు. అవన్నీ గౌరవభావంతో నా అధీనంలో వుంచారు. ధర్మవిరుద్ధంగా ఏనాడూ వారు ప్రవర్తించలేదు; కామచింతతో చరించలేదు. శీతోష్ణాలనూ, ఆకలిదప్పులనూ లక్ష్యం చెయ్యకుండా, నిద్రనూ అలసత్వాన్నీ దూరంగా ఉంచి విచక్షణాపరులై ధర్మకర్మలు చేస్తున్నారు.

ఇంతకాలం ప్రవాసంలో వున్న యీ నాడు వారి మిత్రులందరూ వారి దగ్గరికే చేరారు; అంటే స్నేహబంధాన్ని వారు ఎలా రక్షించుకుంటూ వస్తున్నారో గ్రహించు. స్వాగత, సమ్మానాలు అందుకోవడానికి అర్హులు వారు. అయినా మన కర్ణ, సుయోధనాది మందబుద్ధులు వారిని అవమానాల పాలు చేశారు.

నా దుర్యోధనుని బుద్ధి రాగ ద్వేషాలకు లొంగి కాలవశమై మూర్ఖంగా నడుస్తున్నది.

వీడు సుఖంగా సర్వభోగాలూ అనుభవిస్తూ వారి సంపదలను కూడా హరించాలనుకుంటున్నాడు. అదేదో ఘనకార్యం; అని వాడి ఊహ.

అక్కడ చూస్తే —

భీమార్జున నకుల సహదేవులతో కృష్ణుడు, సాత్యకీ ధర్మజుని మాటమీద నడుస్తారు.

గాండీవం ధరించి కదిలితే ప్రపంచాన్ని జయించగలడు సవ్యసాచి. మేఘగర్జనలా ధనుష్టంకారం చేసి మిడతలదండులా బాణాలు వదిలే ఆ వీరుని ముందు నిలువగల వారెవరు. అలానే జగత్త్రయాన్ని నడపగలవాడు వాసుదేవుడు. వారిద్దరూ అటు వున్నారు.

ఉత్తర కురుభూములను జయించాడు; ద్రవిడులను ఓడించాడు; ఖాండవవన దహన సమయమున ఇంద్రాదులను నిగ్రహించి అగ్నిహోత్రునికి తృప్తి కలిగించాడు, వాడు.

ఉద్దండ గదాదండం ధరించి నిలబడే భీముని ముందెవ డాగగలడు. వాడు దశసహస్ర గజబలుడు. అస్త్రవిద్య తెలిసినవాడు. యుద్ధం జరిగితే వా డొక్కడే నా కొడుకులందరినీ నేల కూలుస్తాడు. అటువంటి వారితో వైరం పెంచుకున్నారు వీరు.

నకుల సహదేవు లిద్దరూ అర్జునుని శిక్షణలో ఆరితేరారు. డేగల జంట బయలుదేరి పక్షి సమూహాలను సర్వనాశనం చేసేటట్లు వీరిద్దరూ శత్రుసంహారం సాగించగల యోధులు.

మన సేనలో యోధులు లేకపోలేదు; సంఖ్యాబలం కూడా మనదే ఎక్కువ. కాని, వారి ముందు మనవారు ఆగరు. ధృష్టద్యుమ్నుడు, విరటుడు, కేకయ కుమారులు, పాండ్యరాజు, పర్వతప్రాంతాల అధీశులు వీరంతా వారికోసం ప్రాణాలు ఒడ్డి పోరాడడానికి సిద్ధంగా వున్నారు.

మందబుద్ధి నా దుర్యోధనుడు వారితో పోరాటానికి సిద్ధపడుతున్నాడు. కృష్ణార్జునులు ఏకరథారూఢులై వస్తే యింక చెప్పవలసిన దేమున్నది. వారు ఇంద్ర నారాయణులవలె వుంటారు.

ధర్మరాజు అజాతశత్రువు, ధర్మపరాయణుడు, లజ్జా వినయాలంకార భూషితుడు. కనుకనే జూదంలో మోసం జరిపి మనం పరాభవించినా నియమానికి కట్టుబడి వీటిని విడిచి పెట్టాడు.

ఒక్క ధర్మరాజు పేరు చెబితే వాళ్ళకు కలిగే భయం ఎంతటిదో చెప్పలేను. బ్రహ్మచర్య దీక్షతో తపోనిష్ఠతో ఉండే ధర్మజునికి క్రోధం కలిగిందంటే అది ఎదుటివారిని నాశనం చేసితీరుతుంది.

అందుచేత, నువ్వు ఉపప్లావ్యం వెళ్ళి వారి కుశలం అడిగి నేను శాంతినే కోరుతున్నాను, అని గట్టిగా చెప్పు.

అక్కడి వారందరినీ పేరు పేరునా నేను అడిగినట్లు చెప్పు. భరతవంశ శ్రేయస్సు ప్రధానంగా అక్కడ మాట్లాడవలసిన మాటలు నీకు నేను చెప్ప నవసరం లేదు. ఏ దశలోనూ క్రోధాన్ని దరిజేర నివ్వకు, అని సాగ నంపాడు.

## ఉపప్లావ్యం

సంజయుడు పాండవుల దగ్గరకు వచ్చాడు. ముందుగా ధర్మరాజును దర్శించి నమస్కరించి:

ధర్మనందనా! ఇంద్రసమానుడ వయిన నువ్వు నీ సోదరులతో, అనుచర మిత్ర బృందంతో సుఖంగా ఉన్నందుకు మా మహారాజు తన సంతోషం తెలుపుతున్నాడు. మీ అందరినీ పేరు పేరునా కుశలం అడగమని ఆజ్ఞాపించాడు. పాంచాలరాజపుత్రి ద్రౌపదీదేవి తన కుమారులతో క్షేమంగా వున్నట్టు కూడా తెలుసుకోమన్నాడు. చక్కని శీలమూ, మంచి నడవడీ కలిగి మీతో వుంటున్న వారందరి సమాచారమూ ఆయన అడిగి రమ్మన్నాడు, అనగా ధర్మరాజు:

సంజయా!

నీ రాక మాకెంతో సంతోషం కలిగిస్తున్నది. నిన్ను చూస్తే మాకు ధృతరాష్ట్ర మహారాజును చూచినంత తృప్తిగా ఉంది. భరతవంశ ప్రముఖుడూ, కురువంశవృద్ధుడూ అయిన మా పెదనాన్న క్షేమసమాచారాలతో వచ్చిన నీకు స్వాగతం.

ధర్మాధర్మవిదుడు మా పితామహుడు భీష్ములవారు క్షేమమా! ఆయనకు మాయందు ఆదరభావం తగ్గలేదు కదా?

ధృతరాష్ట్రనందను లందరూ సుఖంగా ఉన్నారా! బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవస, శల్య, ద్రోణ, కృప, అశ్వత్థామాది యోధవీరు లందరూ కుశలమే కదా! వీరందరూ కౌరవ శ్రేయోభిలాషులై వారి యందు సద్భావంతో ఉంటున్నారా?

శీలసంపన్నుడు, మహాయోధుడు అయిన అశ్వత్థామ నివసించే దేశంలో ధనుర్ధారులకు గౌరవాదరాలు చక్కగా సాగుతాయని నా నమ్మకం. ధృతరాష్ట్రునికి ప్రియమైన యుయుత్సుడు క్షేమమా? తన మంత్రాంగంతో దుర్యోధనుని నడిపించే కర్ణుడు కుశలంగా వున్నాడు కదా?

మా కుటుంబ వృద్ధ నారీజనం, వారి పరివారం క్షేమంగా వున్నారా!

వేదవేదాంగవేత్తలై లోకకళ్యాణకాంక్షతో సత్క్రతువులు సాగించే విప్రశ్రేష్ఠులను మా దుర్యోధనుడు గౌరవిస్తున్నాడా! వారికి నే నిచ్చిన అగ్రహారాలను యథేచ్ఛగా అనుభవిస్తున్నారా! విద్వాంసులకు దానం చేస్తే యీ లోకంలో కీర్తి, పరలోకంలో సుఖప్రాప్తీ వుంటాయని మరచిపోలేదు కదా?

దుర్యోధనుడు తన మంత్రుల పరిజనుల రక్షణ పోషణల విషయమై శ్రద్ధ వహిస్తున్నాడా! లేకపోతే వారు మరో దారి చూసుకోవలసి వస్తున్నదా! మంత్రులు పైకి గౌరవంతో ఉంటూ లోలోపల భేదభావాలు పెంచుకోకుండా ఉంటున్నారా?

మా గురువులు కృప, ద్రోణులూ, ఆచార్యనందనుడు అశ్వత్థామ మాయందు అభిమానంతో ఉన్నారా?

దేశంలో చోరభీతి, శత్రుభయం కలిగినపుడు వారు నకుల సహదేవులను స్మరిస్తున్నారా?

ఘోషయాత్రా సమయంలో వారికి జరిగిన పరాభవం నుంచి మా భీమార్జునులు రక్షించిన విషయం మరువలేదు కదా!

సంజయా! మంచిమాటలతో దుర్యోధనాదులు దారికి రాకపోతే మరొక మార్గాన మా రాజ్యం మేము సాధించుకోగలం, అన్నాడు, ధర్మరాజు.

సంజయుడు: ధర్మనందనా! నీనోట అసత్యం రాదు. అన్నీ వాస్తవాలే పలికావు. అక్కడ వారందరూ కుశలమే. ఇక దుర్యోధనుడు మీరు విద్వాంసుల కిచ్చిన అగ్రహారాలు స్వాధీనం చేసుకుంటాడని అనుకోకు. ఆయన పరిజనులలో సజ్జనులూ, దుష్టాత్ములూ కూడా వున్నారు. ఇంతవరకూ మీ విషయంలో వారు అన్యాయంగా ద్రోహబుద్ధితో వున్నారు. మీరు అందుకు భిన్నంగా వారిపట్ల సద్భావంతో నడుస్తున్నారు.

మీవంటి మంచివారిని హింసించిన ధృతరాష్ట్రుని లోకం నిందిస్తూనే ఉంది.

విశేషం ఏమిటంటే—

తనకు తానై ఆయన తన కొడుకులకు దుష్టబుద్ధులు బోధించడం లేదు. లేకపోగా వారి చెడుతలుపులు విని విచారిస్తున్నాడు. ఆయన దగ్గరకు వచ్చే విద్వాంసులతో ఈ ప్రసంగాలు చేయడం నేను విన్నాను.

మన భవిష్యత్తు ఎలా ఉంటుందనేది యింతవరకూ ఎవరూ ఎరిగిన వారు లేరు. నీవంటి సత్పురుషుడు క్లేశాల పాలబడతాడని ఎవరూహించారు.

మీ రందరూ ఇంద్ర సమ పరాక్రములు. అయినా స్వార్థ చింతతో స్వధర్మం విడిచి పెడుతున్నారు. కురు పాండవ శిబిరాలలో దేశ దేశాల యోధవీరులున్నారు. వీరందరూ సుఖంగా ఉండే మార్గం మీరు చెప్పాలి.

మీ మిత్రులూ, ఆప్తులూ వింటుండగా మా మహారాజు చెప్పిన మాటలు వినిపిస్తాను.

ధర్మరాజు: సంజయా! అందరూ యిక్కడే వున్నారు. వాసుదేవుడు కూడా వున్నాడు. వినిపించు మీ ప్రభువు సందేశం.

మహనీయులారా!

మా మహారాజు శాంతినే కోరుతున్నాడు.

కురువంశ శ్రేయస్సును కాంక్షించే దృష్టితో ఆయన మాటలు వినండి.

స్వయంగా మా మహారాజు రథం సిద్ధం చేయించి నన్ను పంపాడు. ఉభయ పక్షాలు సంధి చేసుకుని సామరస్యభావంతో ఉండేరీతిలో మాట్లాడమని నన్ను పంపాడు.

మీరు సరళస్వభావులు, ధర్మసంపన్నులు, దయార్ద్రహృదయులు. ఔదార్యం, లజ్జా మీ భూషణాలు. క్రూరత్వాన్ని దరిజేర నివ్వరు. ఏనాడూ మీరు చెడుకార్యాలు చేయలేదు.

పాపానికి అవకాశం కలిగించి, నరకానికి బాటలు వేస్తూ సర్వనాశనానికి దారితీసే యుద్ధాన్ని ప్రాజ్ఞు డెవడూ కోరడు. సజ్జనులుగా కీర్తిపొందిన మీరు యుద్ధానికి సుముఖంగా ఉంటారని నేను అనుకోను.

ధార్తరాష్ట్రులను శత్రువులుగా భావించి బంధించడానికి, సంహరించడానికీ మీరు సాహసిస్తారని ఎవరూ ఊహించరు.

సాత్యకి, కృష్ణుడు, ద్రుపదుడు, చేకితానుడు వీరందరూ మీకు సహాయంగా వున్నారు. ఈ దశలో దేవేంద్రుడు వచ్చినా మిమ్ము ఎదిరించి నిలబడలేడు.

దుర్యోధనుని దగ్గర అపారమయిన సైన్యం ఉంది. వారిని జయించడం సామాన్యం కాదు. జయాపజయాలను ఎవరూ ముందుగా నిర్ణయించలేరు.

వయోవృద్ధులు ద్రుపదులవారు, లోకజ్ఞుడు వాసుదేవుడూ యిక్కడ ఉండడం చాలా సంతోషం. వారుభయులూ నిశితంగా ఆలోచించి యీ ఉభయవంశాల శ్రేయస్సుకు తగిన రీతిలో వీరిని నడుపుతారని నమ్ముతాను.

మా ప్రభువుతోపాటు, మీ పితామహుడు కూడా శాంతినే కోరుతున్నాడు. ధర్మ నందనా! అదే మీకు కళ్యాణప్రదమని భావిస్తున్నాను, అన్నాడు.

## ధర్మరాజు

సంజయా! నీ మాటలు చాలా విచిత్రంగా ఉన్నాయి. మేము యుద్ధానికి సుముఖంగా వున్నామనే అభిప్రాయం నీ కెందుకు కలిగిందో తెలీదు. నీ మనస్సులో యుద్ధభీతి ఎలా ప్రవేశించింది. సర్వనాశనానికి దారితీసే సంగ్రామం కంటె నిఖిల జన కళ్యాణహేతువైన శాంతియే శ్రేయస్కరం.

యుద్ధం చెయ్యకుండా మా పని నెరవేరుతుందంటే అంతకంటె కావలసింది లేదు. శ్రమ పడకుండా ఫలం దక్కుతుందని తోస్తే నడ్డి వంచి అవస్థ పడే వా డెవడు!

ధర్మబద్ధంగా, ప్రజా శ్రేయస్కరంగా వుండే కార్యాలే మేం చేస్తాం. సుఖ, భోగాలు లభించినా, అవి ధర్మంగా వస్తేనే స్వీకరిస్తాం.

ఇంద్రియవాంఛలు తీరడానికి శ్రమించే వారికి దుఃఖమే ప్రాప్తిస్తుంది. విషయ సుఖాల ఆలోచనతోనే విచారం ఆరంభమవుతుంది. అది లేని వానికి ఏ బాధా లేదు.

నెయ్యి పడేకొద్ది అగ్ని ప్రజ్వలిస్తూనే ఉంటుంది. అలానే యీ సుఖాలు ఎక్కువయే కొద్దీ వాటిమీద వ్యామోహం పెరుగుతుంది.

మీ మహారాజు అపార ధన, ధాన్య, సంపదలతో సుఖంగా వున్నాడు. తరతరాలు హాయిగా జీవించగల భోగ సాధనాలున్నాయి ఆయనకు. అయినా తృప్తి కలగలేదు వారికి.

సంజయా! ఒక్క విషయం మరచిపోకు. యుద్ధంలో విజయం పుణ్యాత్ములకే లభిస్తుంది.

సామ్రాజ్యంలో పెరిగే భోగతృష్ణ మీ దుర్యోధనుడికి చాలా వుంది. ఆ విషయంలో మీ మహారాజు చిక్కుకుని మమ్మల్ని శాంతంగా, సామరస్యంతో ఉండమని సందేశం పంపుతున్నారు.

మన వ్యవహారాలు మనం ఎలా చూసుకుంటామో, ఇతరులు అలా చూసుకోవడం దోషమా!

మండు వేసవిలో అరణ్యమధ్యంలో నిలబడి అది జాజ్వల్యమానంగా ఫెళ ఫెళార్భటులతో మండుతూ మీదికి వస్తూంటే ఆ మంటలు చల్లగా వుంటే ఎంత బావుండునూ! అనుకునే వాడికీ మీ మహారాజుకీ తేడాలేదు.

దుష్టబుద్ధితో మా సర్వసంపదలూ హరించాడు దుర్యోధనుడు. అది తెలిసి కూడా ఆ కొడుకును వదలలేక బాధపడుతున్నాడు మీ ప్రభువు.

విద్వాంసు డయిన విదురుడు చెప్పే హిత బోధలు తల కెక్కడం లేదు.

ధీయుతుడూ, శీలసంపన్నుడూ, బహుశ్రుతుడూ, కురువంశ శ్రేయస్సు కోసం పాటుపడేవాడు విదురుడు. వాని మాటలే చేదుగా వుంటే ఎవరు చెప్పి ఏం లాభం.

ఈర్ష్య, క్రోధం, పరుషభాషణం, మిత్రద్రోహం, అయోగ్యత యిన్ని అవగుణాలు మూర్తీభవించిన వాడని తెలిసికూడా ఆ కొడుకును విడవలేక పురుషార్థాలకు నీళ్ళు విడిచి పెట్టాడు మీ ప్రభువు.

జూదం సాగుతూన్నపుడు విదురుడు మీ మహారాజుకి ఎంతబోధించినా ఏం ప్రయోజనం కలిగింది. ఆనాడే అనుకున్నాను విదురుని మాట కాదనే వారికి వినాశనం తప్పదని. లోభగ్రస్త హృదయులైన దుశ్శాసన, శకుని, కర్ణుల మంత్రాంగం దుర్యోధనునికి శిరోధార్యం.

ధృతరాష్ట్రుడు మా సంపదలు హరించాడు. విదురుని రాజ్య బహిష్కృతుని చేశాడు. నిష్కంటకంగా పాలించాలనీ తలంపు లేకపోతే యీ పనులు చేసేవాడా!

లోభబుద్ధితో వున్న ధృతరాష్ట్రునితో సంధి జరుగుతుందనే ఆశ నాకు లేదు. దుర్యోధనునికి మా రాజ్యభాగం యిచ్చే తలపు పుడుతుందని అనుకోను.

గాండీవం ధరించి సంగ్రామసమరంలో మా అర్జునుడు నిలబడినప్పుడు కాని వారిని ఆ మమకారం వదలదు.

క్రోధోన్మత్తుడై ప్రచండగదాదండం ధరించి భీమసేనుడు వీరవిహారం ఆరంభించిన మరుక్షణంలో మీవారి ఆశలు గాలిలో కలియక తప్పదు.

నా తమ్ములు నలుగురూ నిలబడి ఉండగా దేవేంద్రుడు వచ్చినా మా రాజ్యం మరొకరికి దక్కదు.

దుర్యోధనాదులు మాకు చేసిన అవమానాలూ, కలిగించిన క్లేశాలు నువ్వెరుగనివి కావు. అయినా నేను వారిని క్షమించి, సోదరదృష్టితోనే చూస్తున్నాను. ఇప్పటికయినా మా రాజ్యం మాకు అర్పించాలి. ఇంద్రప్రస్థంలో మేము ఉంటాం. అందుకు అంగీకరించారా అందరం సుఖశాంతులతో ఉంటాం. అంతే, అన్నాడు.

సావధానంగా విని సంజయుడు:

ధర్మనందనా! లోకవిఖ్యాతిపొందిన నువ్వు ధర్మవిరుద్ధమార్గాన ఏనాడు నడవలేదు.

జీవితం అశాశ్వతం.

కాని కీర్తి వున్నదే అది శాశ్వతం.

కీర్తిని కాపాడుకునే మార్గం మీరు విడిచి పెట్టకూడదు. కౌరవులు మీరాజ్యభాగం మీకివ్వరనే అనుకుందాం. అయినప్పుడు సర్వదోషాలకూ మూలమయిన యుద్ధం చేయడం కంటె హాయిగా అంధక, వృష్ణి వంశీయులు పాలించే దేశాలలో భిక్షాటనం చేసుకు జీవించడం శ్రేయస్కరం.

మీ రందరూ బ్రహ్మచర్య నియమంతో విద్యలు నేర్చి, సత్కర్మలు సాగించి కీర్తి సంపాదించుకున్నారు. వీటివల్ల శాశ్వతంగా మీరు స్వర్గలోక సుఖాలు అనుభవించగలరు.

సంగ్రామం వంటి పాపకర్మలు మీవంటివారు చేయదగినవి కావు. రాజ్యలోభంతో ద్వేషభావం పెంచుకుని యుద్ధానికి దిగడం ఉచితం కాదు. అంతకంటె సుఖంగా అరణ్యాలలో ఉండడం మంచిది. సంగ్రామాలు ద్వేషాగ్నిని రగిలిస్తాయే తప్ప చల్లార్చవు.

మీరు మీ బంధుమిత్ర యోధవరులతో విజృంభించి దుర్యోధనుని గర్వాన్ని అణగార్చవచ్చు. ఇదివరకే ఆ పని చేసి ఉండవలసింది. ఇంతవరకూ వారి బలం పెరిగే అవకాశాలూ కల్పించారు. వాతావరణం మీకు అనుకూలంగా లేదు, ఈనాడు.

ఒక్కొక్కప్పుడు మూర్ఖులు పాపాత్ములూ, యుద్ధంలో విజయం పొందుతారు. ధర్మ సంపన్నులు దైవోపహతులు కావచ్చు. ఎంతక్రోధం వచ్చినా మీరు ధర్మం తప్పరు.

కోపం వచ్చిన వానికి ఎన్ని దురవస్థలు -

తీపి వస్తువు చేదుగా ఉంటుంది.

నిరంతరం శిరోవేదన వేధిస్తుంది.

కీర్తిని నాశనం చేస్తుంది.

నిజానికి మీరందరూ క్షమాగుణ సంపన్నులు.

యుద్ధమే జరిగితే - పితామహుడు భీష్ములవారు ఆచార్యుడు ద్రోణులు ఆయన నందనుడు అశ్వత్థామ వీరందరూ మీకెదురుగా నిలుస్తారు. వారి సంహారము మీకు సంతోషకరమా?

కృప, శల్య, భూరిశ్రవస, వికరణ, వివింశతి ప్రభృతుల వెంట కర్ణ, దుర్యోధనాదులను నేలపాలు చేసి సుఖం అనుభవించగలరా?

ఒకవేళ యీ భూమండలం అంతా స్వాధీనమయినా మీరు జరా మరణాలు లేకుండా శాశ్వతంగా పాలించగలరా? ఇవన్నీ మీకు తెలియనివి కావు.

కాకపోయినా ఏదో ప్రారబ్ధం ఆవహించి మీకు యుద్ధ వాంఛ కలిగించింది!

మీ మిత్రులే మీకు ఈ ఊహ కలిగిస్తే అంతా వారికే విడిచి వానప్రస్థానికి వెళ్ళడం మంచిది. అందువల్ల వంశనాశన పాపం తప్పుతుంది, అన్నాడు.

వింటూ ధర్మరాజు:

సంజయా! అన్నిటికంటె ధర్మం శ్రేష్ఠమయినదనే సత్యాన్ని అంగీకరించావు. బావుంది సంతోషం. నేనిప్పుడు ధర్మం చేస్తున్నానా అధర్మం చేస్తున్నానా! అనేది బాగా ఆలోచించి నిర్ణయించాలి.

ఎందుకంటావా?

ఒకప్పుడు ధర్మం అధర్మంగా, అధర్మం ధర్మంగా కనిపిస్తుంది. విద్వాంసులు తప్ప యీ సూక్ష్మాన్ని గ్రహించలేరు. ధర్మం కూడా అన్నివేళల అందరికీ ఒకే విధంగా ఉండదు.

ఆపద్ధర్మం ఎరుగుదువుకదా! జీవితం నడవడం కష్టమయినప్పుడు సత్కర్మకు లోపం రాకుండా ఏ పని చేసినా దోషంలేదు.

కాని నిరంతరం ఆపద్ధర్మానే అనుసరించకూడదు. ఆపదలలో పడినప్పుడు దానిని గ్రహించనివాడు మూర్ఖుడు. నా తాత తండ్రులు నడిచిన ధర్మమార్గం నేను విడవను. ఆ దారిలో ఏది లభించినా ధర్మంగా ప్రాప్తించినట్లే స్వీకరిస్తాను.

ధర్మరక్షకుడు, నీతికోవిదుడు, బ్రాహ్మణ ప్రియుడూ అయిన వాసుదేవు డిక్కడే వున్నాడు. సామోపాయాన సంధికి నేను సిద్ధంగాలేక యుద్ధోన్మాదంతో వున్నానని భావిస్తే ఆయన నన్ను మందలించవచ్చు.

ఆయన కను సన్నలలో నడిచే సాత్యకి ప్రముఖులున్నారు. వృష్ణి, భోజ, అంధక, కుకుర, సృంజయ, చేది దేశాల ప్రభువులున్నారు. వారందరూ ఆయన మాటమీద నడిచి అభ్యుదయం పొందినవారు. యదువంశ భోగభాగ్యాలన్నీ ఆయన అనుగ్రహ ఫలాలే. కాశీప్రభువుకూడా వాసుదేవుని కరుణతో రాజ్యలక్ష్మిని అనుభవిస్తున్నవాడు ఏ కర్మ ఎలా పరిణమించేది ఆయన చెప్పగలడు. ఆయనకంటె మాకు ఆప్తుడు లేడు. ఆయన మాటను మేమంతా తలవంచి పాలిస్తాం, అన్నాడు.

## శ్రీకృష్ణుడు

ఉభయుల ప్రసంగాలూ విని నవ్వు రాజిల్లెడు మోముతో వాసుదేవుడు:

సంజయా! పాండవులను క్లేశాలనుండి రక్షించి వారికి సుఖ శాంతులు కలిగించడం నా ధ్యేయం. కౌరవులు కూడా సంతోషంగా ఉండాలనే గాఢవాంఛ కూడా నాకున్నది.

ఉభయులూ శాంతిగా జీవించాలనేదే నా అభిమతం. అందుకు వీరిని సంధికి సుముఖులను చేశాను.

ధర్మరాజు కూడా శాంతినే ప్రగాఢంగా కోరుతున్నాడని నువ్వు గ్రహించి ఉండాలి.

రాజ్యం విషయానికి వస్తే సంధి జరుగుతుందనే ఆశ నాకు లేదు. రాజ్యం అంతా తామే అనుభవించాలని మీ మహారాజు సంకల్పం. ఇక యుద్ధం కాక ఏది దారి!

ధర్మజుడు కానీ నేను కానీ ధర్మచ్యుతిని సహించలేము. జ్ఞానమార్గమా కర్మమార్గమా!

ఏది గృహస్థుకు శ్రేష్ఠం? అన్న విషయంలో అభిప్రాయ భేదాలుండ వచ్చు. కాని ఉభయులకూ శరీరపోషణ ఆహారం వల్లనే కాని జరగదని అందరూ అంగీకరించాలి. అందువల్లనే మహా విద్వాంసులయిన విప్రులకు గ్రాస వాసోదైన్యం కాకుండా చూడాలి. జ్ఞానంలో కూడా కర్మ వున్నది. కర్మ చెయ్యని వాని ఉపదేశాలు వ్యర్థం. సత్కర్మలవల్లనే సక్రమంగా వెలుగుతూ, అగ్ని ప్రకాశిస్తున్నాడు.

బ్రహ్మజ్ఞానులు కూడా సత్కర్మలు చేసి పుణ్య లోకాలలో వెలుగు తూంటారు.

నువ్వు జ్ఞానివి.

అయినా మీ మహారాజు కోసం అనవసర ప్రసంగం సాగించావు.

ధర్మరాజు వేద వేదాంగాలు అధ్యయనం చేసి రాజసూయాది సత్క్రతువులు సాగించిన వాడు.

చతురంగ బల సమన్వితుడు అయినా శాంతంగా తమ రాజ్యం తమకు లభిస్తే యుద్ధం అవసరం లేదు అంటున్నాడు.

తాత తండ్రులు నేర్పిన క్షాత్రధర్మాన్ని పాలించడం కోసమే అది కోరుతున్నాడు.

ఇంతకూ - నువ్వు ధర్మం ధర్మం అంటున్నావే సంగ్రామం క్షత్రియ ధర్మం కాదంటావా! శత్రువులకు భయపడి పారిపోవడం వీరధర్మమా! అదేదో నువ్వు చెపితే వినాలని కుతూహలపడుతున్నాను.

ప్రజలు ధర్మమార్గం తప్పకుండా చూడవలసిన ప్రభువు తాను ముందుగా ధర్మ వర్తనుడు కావాలి ధర్మవ్రతులనే న్యాయాధిపతులుగా నియోగించాలి. క్రూరులను దండించాలి. కౌరవులు చెయ్యని క్రూరకార్యం లేదు.

ధృతరాష్ట్రుని కుమారులు తమ ధర్మాన్ని విస్మరించారు. మోసం చేసి కొన్నిట్ని, బలాత్కారంగా అవనిట్ని వీరి భాగ్యాన్ని అపహరించారు. దొంగతనానికీ దీనికీ పెద్ద తేడా లేదు. ఇది ధర్మం అని భావిస్తున్నారు మీ వారు.

ఏమయినా రాజ్య భాగం కోసం వీరు యుద్ధాని కయినా సిద్ధంగా ఉన్నారు. ఇదే మాటను మీ మహాసభ వారికి చెప్పు మదాంధుడై దుర్యోధనుడు మృత్యుదేవత కౌగిలిలోకి వెడుతున్నాడు.

సదాచారమూ సౌశీల్యమూ మూర్తీభవించిన పాంచాల రాజనందనను ఆనాడు ఎంత ఘోరంగా అవమానించారు. భీష్మాది కురువృద్ధులందరూ వున్నారే! మీ ధృతరాష్ట్ర మహా రాజయినా దుశ్శాసనుని దురాగతాన్ని వారించగలిగాడా! మహాసభ మధ్యంలో జరిపిన ఆ అకార్యం ఎంత హీన మైనది. సభలో వున్న రాజులు సైతం భయంతో తలలు వంచుకున్నారే తప్ప నోరెత్తి - 'యిది అన్యాయం' - అనగలిగారా!

ఒక్క విదురుడు కదా ధర్మ ప్రస్తావన చేశాడు. అందుకే దుర్యోధనునికి గారమయాడు ఆ విద్వాంసుడు.

అంత జరుగుతూంటే చూసిన నువ్వు ఈనాడు ధర్మప్రవచనానికి వచ్చావు.

ఆనాడు కర్ణుడు పలికిన పలుకులు ఎంత నీచమయినవి. అవి అర్జునుని హృదయాన్ని ఎంత బాధించాయి. పాండవులు మృగచర్మాలు ధరించి వెడుతూంటే దుశ్శాసనాదులు ఆడిన పరుషవాక్యాలు మరిచిపోయావా!

జూదం సాగిస్తూ శకుని ఏమన్నాడు.

ఇంక పాంచాలి మిగిలింది, అనలేదా!

ఇప్పుడింకా వారి దురాగతాలన్నీ మళ్ళీ త్రవ్వడం దేనికి! నేనే హస్తినాపురం వస్తున్నాను. వీరి రాజ్యం వీరి కిచ్చే విధంగా ధర్మబద్ధమయిన సంప్రదింపులు నడుపుతాను. వారు అంగీకరించారా, అదృష్టవంతులం.

లేదా ఆయుధ పాణులై భీమార్జునులు రణరంగంలో ప్రవేశించి కౌరవ నాశనం చేస్తారు. యుద్ధభూమిలోనే మా భీమసేనుడు మీ దుర్యోధనుని పరిహాస ప్రసంగాలను స్మరణకు తెస్తూ వెండాడుతాడు.

దుర్యోధనుడు మహా క్రోధ వృక్షం.

కర్ణుడు ఆ చెట్టుమాను; శకుని కొమ్మలు

దుశ్శాసనాదులు పత్ర ఫలాలు. ధృతరాష్ట్రుడు మూలం.

ధర్మరాజు ధర్మ వృక్షం.

అర్జునుడు మాను. భీముడు కొమ్మ.

నకుల సహదేవులు పత్ర పుష్పాదులు.

వేదాలు, విప్రులు. కృష్ణుడు మూలం ఈ వృక్షానికి.

సంజయా! మరొక్కమాట. కౌరవు లందరూ మహారణ్యం. పాండవులు పెద్దపులులు. పులులులేని అరణ్యానికి రక్షలేదు. అరణ్యం పులులకు రక్షణ. ఇది వీరి వారి అవినాభావ సంబంధం.

పాండవులు మహావృక్షాలు. మీ వారు లతలు. చెట్టు లేనిదే లత పైకి పెరిగే దారిలేదు.

అన్నీ విడిచిపెట్టు, చివరకొక్కమాట. ఇన్ని జరిపిన ధృతరాష్ట్రుని యందు వీరికి గురుభావం తగ్గలేదు. ఆయనను సేవించాలనే కుతూహలం ఎంత వున్నదో, యుద్ధం చేయాలనే ఆవేశమూ అంత వున్నది.

మీ ప్రభువు ధర్మకర్మను విడవక పోతే సంధి సాగుతుంది. లేదా సంగ్రామం తప్ప శరణ్యం లేదు. ఈ విషయం మీ మహారాజుకి వివరంగా చెప్పు. అన్నాడు.

విన్నాడు సంజయుడు.

అందరి భావాలు గ్రహించి:

పెద్దలందరికీ నమస్కారం

అందరికీ శ్రేయస్సు కలగాలని కోరుతున్నాను.

నా మనస్సుపడే ఆందోళన కారణంగా నేను ఏమేమో అన్నాను. అందులో మీకు కష్టం కలిగించే మాటలు ఉంటే మన్నించండి. అందరూ నన్ను అనుగ్రహించండి, అన్నాడు.

అప్పుడు ధర్మరాజు:

సంజయా! నీ ప్రయాణం సుఖంగా సాగాలని కోరుతున్నాను. మా మీద నీమనసులో చెడు తలంపులు ఉంటాయని మే మెన్నడూ అనుకోలేదు. నిర్మలమయిన నీ దృష్టి కురు పాండవులను సమంగానే భావిస్తుంది. కటువుగా హృదయ వ్యధ కలిగేలా మాట్లాడడం నీ వల్లకాదు. అనవసరపు మాట నీ నోట రానేరాదు.

మనోహరంగా అర్థవంతంగా మాట్లాడగల విదురునివలె నువ్వు ప్రసంగించ గలవు. పయిగా మా అర్జునుడికి నువ్వు ప్రాణమిత్రుడివి. అయినప్పుడు నీ మాటలు మాకు ప్రీతినే కలిగిస్తాయి.

సరే!

నువ్వు హస్తినాపురం చేరగానే అక్కడి ధర్మాధర్మ విదులయిన వేద వేదాంగజ్ఞులకు మా నమస్కారాలు అందించు. విశుద్ధ మనస్కులై వారు స్వాధ్యాయ ప్రవచనాలే జీవికగా సాగుతూంటారు. బ్రహ్మచర్య నియమంతో ధర్మ పరిపాలన వారి జీవిత లక్ష్యం కనక ప్రప్రథమంగా వారికి నా ప్రణామాలు చెపుతున్నాను.

వానప్రస్థులకూ, సన్యాసులకూ, తపస్వులకూ, గురు, వృద్ధజనులకూ, మా వంశ శ్రేయస్సు కోరే పురోహిత ఋత్విగ్గణానికీ వందనాలందించు.

హస్తినాపురంలో మా శ్రేయోభిలాషు లున్నారు. వారందరి యోగ క్షేమాలు అడుగు. చక్కగా వ్యవసాయం సాగించి, పశుపోషణ కొనసాగిస్తూ, వ్యాపారం చేసుకునే వైశ్యులందరి సమాచారం అడుగుతున్నామని చెప్పు.

బ్రహ్మచర్యదీక్షతో వేదాధ్యయనంచేసి ప్రయోగ ఉపసంహార రహస్యాలతో ధనుర్విద్యను అభ్యసించిన మా గురువులు ద్రోణులు. వారికి మా అభివాదాలు.

ఆయన కుమారుడున్నాడు. సదాచార సంపన్నుడు, సర్వ ధనుశ్శాస్త్ర విదుడు అశ్వత్థామ; ఆయన కుశలం కోరుతున్నాం.

ఆత్మవేత్త మహారథికుడు కృపాచార్యులవారు; వారికి నమస్సులు.

శీల, తపస్సంపన్నుడు, దయావీర హృదయుడు శాస్త్రవేత్త, సర్వగుణ శాలి, మేరు నగధీరుడు మా వంశ వృద్ధు భీష్మ పితామహుడు ఆయన చరణాలకు నా కరాంజలులు.

సర్వశాస్త్రాలూ చదివి ధీమంతుడై, గురు వృద్ధజన సేవాపరాయణుడైన ప్రజ్ఞాచక్షువు ధృతరాష్ట్ర మహారాజుకి నా అభివాదాలు అందించి మేము కుశలంగా ఉన్నట్టు విన్నవించు.

పాపాచారపరాయణుడు, మూర్ఖుడు, మందబుద్ధి, నిఖిలజన నిందా పాత్రుడు అయిన దుర్యోధనుని కుశలవార్త కూడా మేము అడిగామని చెప్పు. అంతటి వాడే అయిన దుశ్శాసనుని క్షేమసమాచారం కూడా ఆశిస్తున్నాం.

భరతవంశం ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్న బాహ్లిక, సోమ దత్త, భూరి శ్రవసుల కుశలమూ, ఇతర ప్రముఖుల క్షేమమూ అడిగానని చెప్పు.

జ్ఞానీ, ధర్మవిదుడూ, యుద్ధవిముఖుడూ అయిన యుయుత్సునీ, ధీశాలీ, దూరదృష్టి సంపన్నుడూ, గంభీరహృదయుడూ మాకు గురువు రక్షకుడు, మాతాపితృసముడు అయిన విదురుని మేము అడిగామని విన్నవించు.

ద్యూతవిద్యలో ఆరితేరి దుర్యోధనునికి సన్నిహితంగా వున్న శకునిని మేము మరువలేదనీ, వాని కుశలం కాంక్షిస్తున్నామనీ, అలానే అర్జునుని జయించాలనే గాఢ వాంఛతోవున్న కర్ణుని క్షేమం కోరుతున్నామనీ చెప్పు.

అంతఃపుర నారీజనులందరిలో వృద్ధులకు మా నమస్కారాలు. మిగిలిన వారికి కుశల ప్రశ్నలు. కురువంశకీర్తిని నిలబెట్టవలసిన కోడండ్రందరికీ అవస రానుసారం అన్నీ అందుతున్నాయో లేదో అడిగానని చెప్పు. రాజభవనంలోని బాలికలందరినీ దగ్గరగా తీసుకొని వారికి యోగ్యులయిన భర్తలు లభించాలనీ వీరు శీలవతులై వారితో ఉండాలనీ చెప్పు. సుందర దేహాలతో మనోహర భూషణాలంకృతలై, మధురవాక్కులతో మనోజ్ఞ వ్యవహారాలు నడిపే మదవతీ జనుల కుశలం కూడా మేం కోరుతున్నాం.

కురువంశ సేవాజనంలో కుబ్జలూ, కుంటివారూ వున్నారు. వారినీ అంధులనూ, వృద్ధులనూ, మావటీండ్రనూ అందరినీ అడిగామని చెప్పు.

పర్యవసానం —

దుర్యోధనునికి అంగబలం చాలా వుండవచ్చు కాని, మాది ధర్మబలం. మేము అశక్తులమని భావించడం అవివేకమనీ ధర్మబద్ధంగా మా రాజ్యభాగం మా కివ్వకపోతే యుద్ధం తప్పదనీ దుర్యోధనునికి గట్టిగా చెప్పు.

ఇక్కడ చేరిన సేనల విశేషాలు చూశావు. ఈ విషయం నిస్సంకోచంగా వారికి వివరించు.

మా తాతగారు భీష్ములవారితో—

ఆర్యా! శంతన వంశం అంతం కాకుండా నిలబెట్టిన మీరు ఈనాడు కురువంశం నాశనం కాకుండా చూడాలని చెప్పు.

పాండవుల శ్రేయస్సును కోరే విదురునితో మేము శాంతినే కోరుతున్నాం, అని విశదం చెయ్యి.

దుర్యోధనునితో చివరగా చెప్పవలసిన మాటలు విను:

ఇంతవరకూ మీరు చెయ్యని ద్రోహం, తలపెట్టని అన్యాయం లేదు. అయినా మేం సహించాం. ఇక అవి సాగవు. ఈ నాడు మా రాజ్య భాగం యివ్వలేకపోతే

కుశస్థలం

వృకస్థలం

మాకంది

వారణావతం

అనే గ్రామాలతోపాటు మరో కుగ్రామం ఏదయినా సరే మా అయిదుగురికీ యిస్తేచాలు. సంగ్రామప్రమాదం ఉండదు.

పరస్పర కరస్పర్శలతో

ఆదర దరహాస వదనాలతో

బంధు మిత్రులందరూ సుఖ శాంతులతో జీవించవచ్చు. శాంతిని మేమెంత వాంఛిస్తున్నామో, యుద్ధానికీ అంత ఉత్సాహంగా ఉన్నాం.

ధర్మరక్షణకోసం ఎంత ఉదారంగా మృదు స్వభావంతో ఉన్నానో, అంత దారుణ కర్కశంగానూ ఉండగలను, అన్నాడు ధర్మరాజు.

# హస్తినాపురం

ధర్మరాజాదు లందరివద్దా సెలవు తీసుకుని సంజయుడు అర్జునునితో కొంతసేపు సంభాషించి తిరుగుముఖం పట్టాడు.

హస్తినాపురం చేరి ధృతరాష్ట్ర మందిరద్వారంలో నిలబడి తన రాకను తెలిపి అనుమతి పొంది లోనికి వెళ్ళి:

మహారాజా! నేను సంజయుడను. మీ ఆజ్ఞమేరకు వెళ్ళి పాండవులను దర్శించి వస్తున్నాను. ఉదారహృదయుడైన ధర్మరాజు మీకు నమస్కారాలు తెలుపుతూ మీ కుశలమూ, మీ కుమారుల క్షేమమూ అడిగాడు. ఇక్కడి వారందరినీ, పేరు పేరునా అడిగి కుశలం తెలుసుకున్నాడు, అన్నాడు.

సంజయా! నువ్వు సుఖంగా ప్రయాణం చేసి వచ్చావా! ధర్మరాజు సోదరులతో, మిత్ర, పరిజనంతో కుశలమా! అని ధృతరాష్ట్రుడు ప్రశ్నించగా, సంజయుడు:

మహారాజా! వారందరూ క్షేమంగా వున్నారు. ధర్మమార్గం విడవకుండా పరిశుద్ధ హృదయంతో దయాదృష్టితో వారు నడుస్తున్నారు.

మనిషి ఆటబొమ్మలు ఆడించేటట్లు విధి మనుష్యులను ఆడిస్తున్నాడు.

ఇంతవరకూ మీరు చేసిన అకార్యాలన్నీ భయానక పరిణామాలకు దారితీస్తున్నాయి.

కుబుసం విడిచిన త్రాచుపాములా పాండవులు ప్రకాశిస్తున్నారు. పాప కుబుసంతో మీ రున్నారు.

ఏనాడూ ధర్మార్థాలను గుర్తించి మీరు వ్యవహరించలేదు. అందుచేత అందరినిందా మీ మీద పడింది. ఇది పరలోకంలో సైతం మిమ్ము హింసిస్తుంది.

ధనవ్యామోహంతో పాండవుల సంపదలు హరించాలని యత్నిస్తున్నారు. అది ఫలించదని చెపుతున్నాను.

క్రూరులు, నీచులు, ధర్మశూన్యులు తమ పాప ఫలాలు అనుభవించక తప్పదు.

విద్వాంసులు, జితేంద్రియులు, ధర్మపరులు సుఖ శాంతులతో తుల తూగుతారు.

మీరు ధీమంతులు. చక్కని సలహా లివ్వగల మంత్రులున్నారు. మీ అంతట మీరే ధర్మాధర్మనిర్ణయం చెయ్యగల సమర్థులు. అయినా కర్ణాది మంత్రుల ఊహలతో నడిచి కురువంశనాశనానికి ఉపక్రమిస్తున్నారు. కుల క్షయం చేశారనే నింద మీ నెత్తిన పడకుండా చూసుకోండి.

అర్జునుడు స్వర్గలోకం దర్శించి, లోకపాలురచేత సమ్మానాలు పొందాడు. అయినా ఎందుకీ క్లేశాలు కలుగుతున్నాయంటే పురుష కారం కంటె విధి బలీయం.

కురు పాండవ సంగ్రామం నిఖిల ప్రజానాశన హేతువవుతుంది. అర్జున బాణాలనే అగ్నిలో కౌరవులు ఎండుగడ్డి పరకల వలె బూడిద కాకతప్పదు.

ఇంతకూ మూలకారణం —

విశ్వసనీయులను మీరు విడిచిపెట్టి స్వామిద్రోహులను చేరదియ్యడమే.

సరే, దూరప్రయాణపు బడలిక నాకు ఎక్కువగా వుంది. వెడుతున్నాను. విశేషాలు రేపు సభాభవనంలో వినిపిస్తాను, అన్నాడు.

ధృతరాష్ట్రుడు సంజయునికి సెలవు దయచేసి, ద్వారపాలకుని పిలిచి:

ఒక్కమారు విదురుణ్ణి చూడాలని వుంది. త్వరగా రమ్మను, అని పంపాడు.

విదురుడు వచ్చి, తన రాకను తెలియజేసి, అనుమతిపొంది లోపలకు వెళ్ళి నమస్కరించి:

ప్రభూ! ఏమి సెలవు అన్నాడు.

మహామంత్రీ! సంజయుడు తిరిగి వచ్చాడు. నన్నేమేమో అని వెళ్ళాడు. రాయబార వివరాలన్నీ రేపు సభలో వినిపిస్తా నన్నాడు. నా మనస్సు

వికలమయింది. శరీరం ఉడుకుతోంది. రేపు సంజయుడు చెప్పేదేమిటో తెలియడం లేదు. కంటికి కునుకుపట్టడం లేదు. మనశ్శాంతి కలిగించే మంచిమాటలు చెప్పు, అన్నాడు ధృతరాష్ట్రుడు.

## విదురనీతి

ప్రభూ! మీకు నిద్ర రావడం లేదంటే నాకు ఆశ్చర్యంగా వుంది. రాత్రివేళల నిద్ర పట్టకపోవడానికి నీతిశాస్త్ర కోవిదులు కొన్ని కారణాలు చెప్పారు.

బలవంతులతో వైరం తెచ్చుకునే దుర్బలులు,

పరుల సంపదలు హరించిన వారూ, హరించాలనుకునే చోరులూ, పరస్త్రీతో పొందుకోరే వారు.

ఈ నలుగురికే రాత్రివేళల కన్ను మూతపడదు. నే నెరిగినంతవరకూ యీ దోషాలు మీలో లేవు. అయితే పరధనాపేక్ష కలిగిందా మీకు, అన్నాడు.

మహామంత్రీ! మోక్షదాయకమయిన ధర్మవిషయమే నిన్ను చెప్ప మంటున్నాను, అన్నాడు ధృతరాష్ట్రుడు.

విదురుడు: ప్రభూ! సర్వలక్షణ లక్షితుడైన ధర్మరాజు త్రిలోకాధిపత్యం వహించడానికి సమర్థుడు. అయినా ఏనాడూ మీ మాట కాదనలేదు. అనకపోయినా మీరు వారిని అడవుల పాలువేసి ఎన్ని క్లేశాలు కలిగించారు. సత్యసంధుడు, ధర్మశాస్త్రకోవిదుడు కావడం వల్లనే ధర్మరాజు అన్నీ సహించాడు.

శకుని, కర్ణ, దుర్యోధన, దుశ్శాసనుల వంటి అయోగ్యులను విశ్వసించి మీరు పాండవుల భోగాలు హరించాలని సంకల్పించారు.

నిరంతరం ఏదో కృషి చేస్తూ సాత్విక స్వభావంతో, సహన శీలంతో, నిశ్చల ధర్మదీక్షతో ఉండే వారు ఏనాటికయినా సత్ఫలం పొందుతారు. వీరినే విద్వాంసులుగా లోకం సమ్మానిస్తుంది.

శ్రద్ధ సడలకుండా, ఆసక్తి విడవకుండా సత్కర్మ చేస్తూ, ఆస్తికబుద్ధితో ఉండేవాడు పండితుడు.

పొగడ్తలకు లొంగక, క్రోధాన్ని దరి జేరనివ్వక, లజ్జా వినయాలే అలంకారాలుగా గర్వశూన్యుడై, ప్రశంసలకు వంగకుండా వుండేవానినే విద్వాంసుడని కోవిదులు వక్కాణిస్తున్నారు.

అప్రస్తుత విషయాలలో తలదూర్చరాదు. దొరకని వస్తువుల కోసం బాధపడకూడదు. పోయిన వాటికోసం విచారించకూడదు. కష్టాలలో ధైర్యంగా ఉండాలి. ఆరంభించిన పనిని చివరవరకూ సాగించాలి. ఇవి కలవారే విద్వాంసులు.

వీరు కృతజ్ఞతాసింధువులై వుంటారు. వీరి హృదయం గంభీర గంగానదీ సదృశం.

పదార్థాల యథార్థ స్వరూపం వీరికి తెలుస్తుంది.

అపాయం లేని ఉపాయాలు వీరు ఎరుగుదురు, వ్యర్థం కాని వాక్కు వీరి సొత్తు. ఏ విషయాన్నయినా అవలీలగా గ్రహించి తర్కబద్ధంగా వాదించే శక్తితో శిష్టాచారాలను మర్యాదతో నడిపించగలవారు వీరు.

వీరి విద్య బుద్ధినీ, బుద్ధి విద్యనూ అనుసరించి సాగుతాయి. ఒకదాని కొకటి ప్రోద్బలకంగా నడుస్తాయి.

ప్రభూ! ఇక మూర్ఖులున్నారు.

వారి మొదటి లక్షణం అహంకారం.

విద్యాశూన్యులూ వివేకహీనులూ అయినా కావలసినంత గర్వంతో వుంటారు.

ఏ పని చెయ్యరు కాని ఫలం కావాలనుకుంటారు.

పరమ దరిద్రంతో బాధపడుతూ ఆకాశానికి నిచ్చెనలు వేస్తారు.

స్నేహితులతో అన్యాయంగా చరిస్తారు.

బలవంతులతో వైరం తెచ్చుకుంటారు.

శత్రువులను స్నేహితు లనుకుంటారు.

మనం పిలవకుండానే వస్తారు.

అడగకుండానే సలహాలు కురిపిస్తారు.

ఎప్పుడూ ఎదుటివారిలో దోషాలే వెదుకుతారు.

కృతఘ్నుల యందు విశ్వాసం చూపుతారు.

అకారణంగా క్రోధం ప్రదర్శిస్తారు.

శూన్యాన్ని ఉపాసిస్తారు. దరిద్రులనూ దీనులనూ ఆశ్రయిస్తారు. తమ రక్షణలో వున్నవారి పోషణభారం వహించకుండా తమకడుపు నింపుకుంటారు. వీరందరూ మూర్ఖులే.

మహావీరుని ధనుస్సునుండి వెలువడిన బాణం వృథాగా పోవచ్చు కాని విద్వాంసుని వాక్కు వ్యర్థం కాదు.

తన బుద్ధితో కర్తవ్యా కర్తవ్యాలను గ్రహించి, శత్రు మిత్ర ఉదాసీనులను గురించి సామ దాన భేద దండోపాయాలు సక్రమంగా అనుసరించి, ఇంద్రియ పంచకాన్ని స్వాధీనంలో ఉంచుకొని, సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధీభావ, సమాశ్రయ గుణాలను గ్రహించి మద్యపాన, మృగయావినోద, పరస్త్రీ గమన, పరుషభాషణ, కటు స్వభావ, కఠిన దండన ద్యూతక్రీడలను విసర్జించిన వారు సుఖంగా వుండగలరు.

ఒంటరిగా భోజనం చెయ్యకూడదు. ఏకాకిగా ప్రయాణం చెయ్యకూడదు. విషమ సమస్యలను తనకు తానే పరిష్కరించరాదు. అందరూ నిద్రించేవేళ మనం ఒక్కరం మేలుకొని ఉండడం హానికరం.

మూర్ఖులు క్షమాశీలురను అసమర్థులుగా భావిస్తారు. కాని దాన్ని మించిన శక్తిలేదు. అసమర్థులు క్షమను గుణంగా స్వీకరించాలి. సమర్థులకు క్షమయే భూషణం.

సహనమనే కరవాలం ధరించిన వానికి ఎదురులేదు. దాన్ని మించిన శాంతి సాధనం లేదు.

కర్మ చెయ్యని సంసారీ, కర్మకు దిగిన సన్యాసీ అధములు. ఒకరి అధీనంలో వున్న స్త్రీని వాంఛించే వాడూ, పరుల ఆశ్రయంలో బ్రతికే వారిని చేరదీసే వాడూ అధములే.

శత్రువులను లక్ష్యపెట్టని చక్రవర్తి

దేశాలు తిరగని విద్వాంసుడు.

ఈ ఉభయులూ వ్యర్థజీవులే.

మనం సంపాదించే ధనం పాత్రులకూ దానం చెయ్యకపోయినా, అపాత్రులకు దానం చేసినా నిష్ప్రయోజనమే.

సంపదలు కలవారు దానాలు చెయ్యాలి.

దరిద్రులు కష్టాలు భరించగలిగి ఉండాలి.

వారికి దాన గుణం, వీరికి సహనశక్తి లేకపోతే ఈ ఉభయుల మెడకూ బండరాయి కట్టి లోతైన నీటి మడుగులో పారెయ్యాలి.

దారా, పుత్ర, సేవక జనానికి సంపద లుండవు. వారు ఎవరి రక్షణలో ఉంటారో వారి సంపదలూ ఆ యజమానివే.

పరధనాపహరణం

పరనారీసాంగత్యం

సుహృజ్జనపరిత్యాగం

అనే దోషాలు మన ధర్మ ఆయుర్దాయ, కీర్తులను నాశనం చేస్తాయి.

కామ, క్రోధ, లోభాలు నరకానికి తెరిచిన ద్వారాలు.

వరప్రసాదమూ, రాజ్యప్రాప్తీ, పుత్రోదయమూ అనేవి ఒక్కసారి లభిం చడం కంటె శత్రుబాధనుండి విముక్తి పొందడం శ్రేయస్కరం. శరణువేడిన

వారిని రక్షించడం మన విధి. కుటుంబములో వృద్ధులనూ, బ్రతికి చెడిన వారినీ, సంతానం లేని అక్క చెల్లెళ్ళనూ మనం ఆదరించి పోషించాలి.

దైవసంకల్పం విద్వాంసుల సన్నిధిలో వినయం.

పాపకార్య విరక్తి ధీమంతుల శక్తి

ఈ నాలుగు మానవుని భయాలను దూరం చేయగలవు.

తల్లి, తండ్రి, గురువు, ఆత్మ, అగ్ని ఈ అయిదింటినీ పంచాగ్నులుగా సేవించుకోవాలి.

సిరి సంపదలు కోరేవారు నిద్రా భయ క్రోధ అలసత్వదీర్ఘ సూత్ర గుణాలను విడిచెయ్యాలి.

ప్రజారక్షణ చెయ్యలేని ప్రభువు.

నిరంతరం పరుషంగా భాషించే భార్య

శిష్యులకు విద్య నేర్పలేని గురువు

గ్రామమధ్యంలో ఉండాలనుకునే గోపాలకుడు

వనవాసం మీద ఆసక్తికల క్షురకుడు

వీరు ఎందుకూ కొరగాని వారు. ఎంత తొందరగా వీరిని విడిచిపెడితే అంత మంచిది.

ఆరోగ్యం, సంపదలు, అనుకూలవతి అయిన అర్థాంగి

చెప్పినమాట వినే కొడుకు. జీవికకు పనికివచ్చే విద్య, చక్కని సలహాలిచ్చే స్నేహితుడు వున్నవారి కంటె సుఖంగా బ్రతకగలవాడు లేదు.

రోగులమీద ఆధారపడి వైద్యులు పెరుగుతారు. అజాగ్రత్తగా వుంటే దొంగలు పెరుగుతారు. వ్యభిచారబుద్ధికల పురుషులు వేశ్యలను పెంచుతారు. వితండవాదం కోరే విద్వాంసులు మూర్ఖుల చెంత జేరుతారు.

సంరక్షణ లేని గోవూ, వ్యవసాయమూ, విద్యా, స్త్రీలూ పాడవుతారు.

విద్య నేర్చుకున్నాక శిష్యుడు గురువునీ,

వివాహం అయాక కుమారుడు తల్లినీ,

కామభోగం పూర్తయాక పురుషుడు స్త్రీని,

నదీప్రవాహాన్ని దాటిన తరువాయి నావనూ,

పని పూర్తి కాగానే తోడుపడిన వారినీ,

రోగం తగ్గిన అనంతరం వైద్యునీ

సామాన్యులు మరచి పోతూంటారు.

స్నేహితులతో కలవడం, ధనప్రాప్తి, పుత్రపరిష్వంగం, సుఖసంభోగం, సాటివారిలో కీర్తిపొందడం, ప్రియసంభాషణం, మహాసభలలో సన్మానం, ఆశించినవి నెరవేరడం ఇవి ఎవరి కయినా సంతోషం కలిగిస్తాయి.

ఈర్ష్య, ద్వేషం, అసంతృప్తి, క్రోధం, నిత్యశంక, పరభాగ్యోపజీవనం - యింతకంటె దుఃఖదాయకాలు లేవు.

ఇంద్రియనిగ్రహం, శాస్త్రజ్ఞానం, ధీశక్తి, మితభాషిత్వం, యథాశక్తి దానం, కృతజ్ఞత, ఉత్తమవంశంలో ప్రభవించడం - వీటివల్ల కీర్తి వస్తుంది.

ఉన్మత్తుడు, త్రాగుబోతు, క్రోధి, క్షుదార్తుడు, సావధానహీనుడు, లోభి, భయగ్రస్తుడు, కాముకుడు - వీరందరికీ ధర్మం తెలియదు.

అపరాధులను సకాలంలో దండిస్తూ, ప్రజలకు రక్షణ కలిగించి వారి విశ్వాసం చూరగొనే వాడు ఉత్తమప్రభువు.

స్నేహం, వివాహం, వ్యవహారం - ఈ మూడు సమానులతోనే నడుపుకోవాలి.

నిరంతరం ఏదో పని చేస్తూనే ఉండాలి.

మితంగా భోజనం చేయ్యాలి.

నిద్రకూడా ఎక్కువ పనికిరాదు.

ఆశ్రితులను ఆదరించాలి.

మంచిదారిలో సక్రమంగా సత్కార్యాలు చెయ్యడం మన విధి. అందువల్ల తత్కాలంలో సత్ఫలితాలు కలగలేదని విచారించకూడదు.

చెట్టునున్న పచ్చికాయలు కోస్తే అవి తినడానికి పనికిరావు సరిగదా, వాటి విత్తనాలు కూడా వ్యర్థమవుతాయి. అందుచేత పక్వఫలాలే తినాలి. అలానే సావకాశం వచ్చేవరకూ వేచి ఉండాలి.

పువ్వు పాడవకుండా దానిలోని తేనె త్రాగుతుంది తుమ్మెద.

లతకు ప్రమాదం రాకుండా పూలు కోస్తాడు మాలాకారుడు.

అలానే ప్రజలకు కష్టం కలగకుండా పన్నులు వసూలు చెయ్యాలి ప్రభువు.

నిండుగా పూసిన పూలతో వున్న వృక్షంలా రాజు నిరంతరం ప్రసన్నంగా వుండాలి. అంతే కాని, అధికఫలాలు అందివ్వకూడదు.

సజ్జనులు నడిచిన దారిలో, సంప్రదాయం విడవకుండా నడిచే ప్రభువు ఏలుబడిలో దేశం వృద్ధి పొందుతుంది.

అధర్మమార్గాన నడిస్తే నిప్పుమీద పడిన చర్మంలా దేశం ముడుచుకు పోతుంది.

ఏ కులంలో పుట్టినా సత్ప్రవర్తన కలవాడు ఉత్తముడే. వ్యక్తికి శీలం ప్రధానం. అది లేని వాని జీవితం వ్యర్థం.

అధములు జీవితానికి భయపడితే, మధ్యములు మృత్యుభీతితో ఉంటారు. ఉత్తములు అపకీర్తికి జంకుతారు.

దరిద్రుడికి ఆకలి ఎక్కువ. వాని ఉదరంలో కర్రలు కూడా జీర్ణమవుతాయి. ధనికుడికి అజీర్ణరోగం ఉంటుంది.

మద్యపానం కలిగించే మత్తు కంటె సిరిసంపదలు కలిగించే మత్తు ఎక్కువ.

ఎందుకంటే ఆ సంపదలన్నీ నశించే వరకూ వాడు మత్తులోనే ఉంటాడు.

మనస్సును జయించి, ఇంద్రియాలను స్వాధీనంలో ఉంచుకునే వాడు శుక్లపక్ష చంద్రునివలె వృద్ధి పొందుతాడు.

ఈ దేహం రథం;

బుద్ధి సారథి;

ఇంద్రియాలు గుఱ్ఱాలు;

ఆ గుఱ్ఱాలను అదుపులో ఉంచినవాడు ఉత్తమఫలాలు పొందుతాడు.

ఇంద్రియాలకు లొంగి వక్రమార్గాన నడిచే మనస్సును అదుపులో పెట్టలేనివాడు ఎందుకూ కొరగాడు.

ఎండుకర్రంతో కలిసిన పచ్చికట్టె కూడా నిప్పులో పడాలి; దుర్జనుంతో తిరిగే సజ్జనుడూ క్లేశాలు పడతాడు.

హింసతో దుష్టులు, దండనీతితో ప్రభువులు, సేవాపరత్వంతో స్త్రీలు, క్షమాగుణంతో ధీశాలురు శ్రేయస్సు పొందుతారు. వాక్కును స్వాధీనంలో ఉంచుకున్నవాడు దేన్నయినా జయిస్తాడు.

గొడ్డలి దెబ్బతిన్న చెట్టు మళ్ళీ చివురించవచ్చు, కాని, కటువచనంతో బాధపడ్డ హృదయం కోలుకోదు. శరీరంలో గుచ్చుకున్న నిశితశరాలను తీయవచ్చు. గుండెను నొప్పించిన పరుషవాక్కులు తియ్యలేము.

విధి ఎదురు తిరిగే వాని బుద్ధి నశించి పాపకార్యాచరణకు దిగుతాడు. అవే వాని నాశనానికి బాటలు.

మహారాజా! నీ బిడ్డలు పాండవులను ద్వేషిస్తున్నారు. తేజశ్శాలి, ధర్మవిదుడు, గుణసంపన్నుడు అయిన ధర్మరాజు మీ వారు చేసిన అన్యాయాలను సహిస్తూ యిప్పటికీ మిమ్ము గురుభావంతో చూస్తున్నాడు.

వెయ్యి పుణ్యతీర్థాలలో స్నానం చేసిన ఫలం భూతదయవల్ల కలుగుతుంది. అంతకంటె అందరితోనూ మృదువుగా ఉండడం పుణ్యప్రదం. మీరు మీబిడ్డలను చూస్తున్నట్టే పాండవులనూ చూడండి.

చాలాకాలం క్రితం మాట —

కేశిని అనే లావణ్యవతి స్వయంవరం ప్రకటించింది.

దైత్యవంశీయుడు విరోచనుడు ఆమెను వరించరాగా:

దైత్యకుమారా! విప్ర దైత్యులలో ఎవడు శ్రేష్ఠుడు? అని అడిగింది.

కేశినీ! మేమంటే దైత్యులకే భయం వున్నట్టు తెలుసుకదా! అయినప్పుడు విప్రుడు మా కంటె గొప్పవాడు కాలేడు, అని సమాధానమిచ్చాడు.

మరునాడు ఉదయం సుధన్వుడు వచ్చాడు.

కేశిని కూర్చున్నచోటినుంచి లేచి ఎదురువెళ్ళి స్వాగత సత్కారాలు జరిపింది.

అప్పుడు సుధన్వుడు ప్రహ్లాదనందనా! ఈ యువతీరత్నం చూపించిన బంగారు ఆసనాన్ని నేను స్పృశిస్తాను, కాని దానిమీద నేను కూర్చోను. కూర్చుంటే మనిద్దరం సమానులమే, అన్నాడు.

ఓ బ్రాహ్మణబాలుడా! మీరు దర్భాసనాలమీద, కర్రపీటలమీద కూర్చోవాలి, అని పరిహాసం చేశాడు.

విరోచనా! మీ తండ్రి ప్రహ్లాదుడు కూడా నన్ను సత్కరిస్తాడు. నువ్వుబాలుడివి. ఇప్పుడే మనం మీతండ్రి దగ్గరకువెళ్ళి మనలో ఎవరు శ్రేష్ఠులో నిర్ణయించుకుందాం, అనగా ఉభయులూ ప్రహ్లాదునికి విషయం నివేదించడానికి వెళ్ళారు.

వచ్చే సుధన్వుని చూసి, ప్రహ్లాదుడు ఉచితరీతిని అతిథిసత్కారాలు జరిపి, వారి ప్రశ్న విని:

సుధన్వా! నాకు వీడొక్కడే కొడుకు. మీరిద్దరూ ప్రాణాలు పందెం పెట్టి యిలా వచ్చారు. ఒక్కమాట చెప్పు. అబద్ధం ఆడినందువల్ల వచ్చే స్థితి ఏమిటి? అన్నాడు.

సవతులంతో ఉండే స్త్రీ, జూదంలో ఓడిన జూదరీ, బరువులు మోసేవాడూ ఏస్థితిని పొందుతారో అదే స్థితి కలుగుతుంది, అన్నాడు సుధన్వుడు.

ప్రహ్లాదుడు: నాయనా! వీని తండ్రి అంగిరసుడు నా కంటె శ్రేష్ఠుడు. అలానే వీని మాతృమూర్తి ఉత్తమోత్తమురాలు. కనక సుధన్వుడే నీ కంటె శ్రేష్ఠుడు, అని.

సుధన్వా! నాకు పుత్రభిక్ష అనుగ్రహించు అన్నాడు.

సుధన్వుడు: ప్రహ్లాదా! సత్యయుక్తమైన ధర్మం చెప్పావు కనక నీ కుమారుని అనుగ్రహిస్తున్నాను, అన్నాడు,

విన్నావా! మహారాజా, ఇప్పటికయినా స్వార్థం విడిచి సత్యమార్గాన సాగి పాండవులను ఆదరించండి.

మరికొన్ని నీతివిషయాలు చెపుతాను.

హస్త సాముద్రికుడు,

దొంగవ్యాపారి,

జూదగాడు, వైద్యుడు,

నటుడు, శత్రువు, స్నేహితుడు

వీరెవరూ సాక్షులుగా పనికిరారు.

ఆశవల్ల ధైర్యం పోతుంది.

కోపం పెరిగితే సంపదలు నశిస్తాయి.

అసూయాపరుడు ధర్మంగా ఉండలేడు

కాముకుడు సిగ్గును విడిచిపెడతాడు.

వార్థక్యం సౌందర్యాన్ని హరిస్తుంది.

నీచుల్ని సేవిస్తే మంచితనం మిగలదు.

దురభిమానం సర్వనాశనకారి.

వృద్ధులు లేనిది సభ కాదు. ధర్మం చెప్పలేని వాడు వృద్ధుడు కాడు. సత్యబద్ధం కానిది ధర్మమనిపించుకోదు. కపటం లేనిది సత్యం.

పగలంతా శ్రమపడితే రాత్రి సుఖంగా నిద్రపడుతుంది. ఎనిమిది మాసాలు ఆర్జిస్తే వర్షాకాలం నాలుగు నెలలూ యిబ్బంది వుండదు.

ధీశక్తితో చేసే కర్మ ఉత్తమం, బాహుబలం మధ్యమం, మిగిలినవి అధమాలు. భారవహనం అధమాధమం.

మనలను ఇతరులు నిందించినా పరుషభాషలతో బాధించినా వారు వేసుకున్న పుణ్యఫలం మనకు దక్కుతుంది. వస్త్రం ఏ రంగులో ముంచితే అదే రంగు కనిపిస్తుంది. అలానే దుర్జనుడు సజ్జన సాంగత్యంతో మంచివాడు కాగలడు.

ఎంతటి తపస్సంపన్నుడయినా మూర్ఖులతో చోరులతో చేరితే వాడూ మూర్ఖుడే! దుర్జన సాంగత్యంతో, అక్రమమార్గాన చాలా ధనం సంపాదించవచ్చు. దానిని సజ్జనులు మెచ్చరు.

సదాచారాన్ని సంరక్షించుకోవాలి. సంపదలు వస్తాయి, పోతాయి, ఆచారం క్షీణించదు. దాన్ని విడిచిన వాడు జీవన్మృతుడు.

మధుర మయిన మాట, చల్లని మంచినీరు, శయనానికి దర్భాసనం విశాలమయిన వసతి ఉంటేనే గృహస్థు సుఖ పడతాడు.

దూలం పెద్దదయినా బరువు మోయగలదా! కాని ఎంత చిన్న రథమయినా బరువును భరిస్తుంది.

అదేరీతిగా ఉన్నతగుణాలుకల వంశంలో పుట్టినవాడు దేన్నయినా సహించగలడు. ఎదుటివారివల్ల నిరంతరం ప్రమాదం కలుగుతుందని

శంకించే వాడు స్నేహితుడు కాలేదు. హంసలు ఎండిన చెరువుచుట్టూ తిరగవచ్చు కాని అందులో అడుగుపెట్టవు. అలానే చపల చిత్తులవద్ద లక్ష్మి నిలబడదు.

మిత్రుల శక్తి సామర్థ్యాలను పరీక్షిస్తూ కూర్చునేవాడు అధముడు.

శోకం వల్ల దేనినీ సాధించలేం.

లేకపోగా అది శక్తినీ రూపాన్నీ జ్ఞానాన్నీ నాశనం చేసి రోగాన్ని తెచ్చిపెడుతుంది.

జనన మరణాలు, సుఖ దుఃఖాలు, లాభ నష్టాలు కలుగుతూ పోతుంటాయి. అందుగురించి సంతోష, శోకాలు అనవసరం.

కుండకు ఎటు చిల్లు పడితే అటే నీరు పోతుంది. బుద్ధికూడ ఏ ఇంద్రియానికి లొంగితే అటే క్షీణిస్తుంది.

హృదయంలో ద్వేషం రగులుతూంటే హంసతూలికా తల్పంమీద పరున్నా నిద్రరాదు. వందిమాగధ స్తోత్రాలు వింటున్నా సంతోషం కలగదు. హితవాక్యం చెవికెక్కదు. శాంతి కనిపించదు.

విడిగా పెరిగే చెట్టు ఎంత బలంగా వేళ్ళు తన్ని విశాలంగా విస్తరించినా గాలిదెబ్బకు కూలిపోతుంది. గుంపులో వుంటే పెనుగాలికి కూడా చలించదు.

అలానే గుణసంపన్నులు ఏకాకులుగా ఉండకూడదు. సంఘంలో వుంటే సరోవరం లోని కమలాలవలె ప్రకాశిస్తారు.

రోగి మృతకల్పుడు. వానికి తీపి రుచించదు.

కనిపించని రోగం క్రోధం; ఇది కలవానికి ఏదీ రుచించదు.

లోలోపల విద్వేషం ఉంచుకుని పైకి మెత్తగా ఉండి ప్రయోజనం లేదు. అది వానికే చేటు.

ఆకాశాన్ని గుప్పిట పట్టాలని

ఇంద్రధనుస్సును పంచాలనీ

సూర్యకిరణాలను కాళ్ళతో పట్టాలనీ చూసేవారు మూర్ఖులు.

స్త్రీలను అవహేళన చేసి నిందించేవాడూ, దానం చేసి పదిమంది ముందూ గొప్పగా చెప్పుకునే వాడూ, చేసిన మేలు మరిచేవాడూ, అబద్ధాలతో జీవితం సాగించేవాడూ వీరందరికి పతనం తప్పదు.

అధికప్రసంగం, క్రోధం, దురభిమానం, స్వార్థబుద్ధి, మిత్రద్రోహం త్యాగశూన్యత ఈ ఆరు కత్తులూ మానవుని ఆయుర్దాయాన్ని తెగ నరుకుతూంటాయి.

మన దగ్గరచేరి తియ తియ్యని మాటలు చెప్పేవారు ఎందరో వుంటారు.

హితవు చెప్పేవాడూ వినేవాడూ అరుదుగానే వుంటారు.

జూదం కలహ హేతువు అని ఆనాడు చెప్పాను. వినడానికి మీ మనస్సు అంగీకరించలేదు. ఇంత జరిపి యీ నాడు కాకి రెక్కలవంటి మీ కుమారులను నెమళ్ళ వంటి పాండవులతో యుద్ధానికి వదులుతున్నారు. నక్కలను రక్షించి సింహాలను వదులుకునే స్థితిలో వున్నారు.

ప్రభూ! సేవకుల కష్టసుఖాలను గమనించకుండా ఇతరుల సంపదలు హరించే ప్రయత్నాలు చెయ్యకూడదు. మంత్రులకు సౌకర్యాలు సక్రమంగా సాగకపోతే శత్రుకూటంలో చేరుతారు.

ఆదాయ వ్యయాలు సరిజూసుకుంటూ సేవకులకు ఉచితరీతిని వేతనాలివ్వాలి. యోగ్యత కలవారిని దగ్గరకు తీసుకొని వ్యవహారాలు నడుపుకోవాలి.

మనమాట వినకుండా అహంకారంతో ఉండే వానిని తక్షణం తొలగించాలి.

అహంకార శూన్యంగా దయాహృదయంతో పరిశుద్ధ చిత్తంతో ఏ పని అయినా త్వరగా చేసే శక్తి గలవారినే రాయబారులుగా నియోగించాలి. రాయబారి మంచి ఆరోగ్యవంతుడై ఎదుటివారు చూపే వ్యామోహాలకు లొంగకుండా వుండాలి.

మితంగా ఆహారం, నిత్యం పరిశుభ్ర స్నానం దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అందువల్ల శరీరానికి జవసత్వాలు నిలబడతాయి. వీరి సంతానం కూడా చక్కగా ఉంటుంది.

సోమరులూ, మాయమాటలు చెప్పేవారూ, అందరితో కలహం తెచ్చుకునేవారూ, అతిగా తినేవారూ, క్రూరచిత్తులూ, అసహ్యంగా వస్త్రాలు ధరించేవారూ వీరందరినీ మన గృహ పరిసరాలకు దూరంగా ఉంచాలి.

మూర్ఖులను, నీచులను, కృతఘ్నులను, దీనులను, శత్రువును ఏ స్థితిలోనూ సహాయం కోరకూడదు. కావాలని ప్రమాదాలు తెచ్చిపెట్టే వానినీ, అబద్ధాలాడే వానినీ, చపలచిత్తునీ, దురభిమానినీ, స్నేహితులనీ సేవించకూడదు.

ధనసంపాదనకు సహాయకులు కావాలి. సాయం చేసిన వాడికి ధనకాంక్ష తప్పదు. ఆ విధంగా వారిమధ్య అనుబంధం ఉంటుంది.

పుత్ర సంతానానికి ఉపాధి కల్పించి ఆడపిల్లలకు యోగ్యులతో వివాహాలు జరిపి, బాధ్యతలు తీరగానే వానప్రస్థం స్వీకరించాలి.

మనిషికి దేహబలం అవసరమే కాని అది అధమాధమం, మంచి ఆలోచన నివ్వగల మంత్రి రెండవస్థానంలో ఉంటాడు. ధనసంపదలు తృతీయం. వంశపారంపర్యంగా ప్రాప్తించేది ఉత్తమం. ఇన్నిటినీ మించినది బుద్ధి బలం.

నిప్పు, పాము, సింహం - వీటిని నిర్లక్ష్యంగా వదలకూడదు. అలానే జ్ఞాతుల విషయం కూడా. పాండవులు అగ్ని సదృశులు. వారిని ఉదాసీనంగా చూడకండి. వారు మహావృక్షాలు. నీ బిడ్డలు లతలు. వారు సింహాలు, నీ కొడుకులు అరణ్యం, సింహం లేని అరణ్యం, అరణ్యం రక్షణలేని సింహం నశించక తప్పదు.

పెద్దలను దర్శించినప్పుడు యువకులలో ఒక భీతి కలుగుతుంది. కాని వారిని మర్యాదగా ఆరాధించడంవల్ల నూతనోత్తేజం కలుగుతుంది.

పాలు, పెరుగు, తేనె, నూనె, పళ్ళు, మాంసము, ఉప్పు, బెల్లం, గంధం, అన్నం విక్రయించకూడదు.

మట్టినీ, బంగారాన్నీ సమదృష్టితో చూస్తూ, ప్రశంసలనూ దూషణలనూ లక్ష్యపెట్టకుండా, ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా ఉండేవాడు సన్యాసి.

బుద్ధిమంతులను హింసించి వారికి దూరంగా పోయినంతలో లాభం లేదు. ఎందుకంటే వారి భుజాలు ఎంతదూరాన వున్న వారి నయినా పట్టి పీడించగలవు.

స్త్రీలు గృహలక్ష్ములు. వారి రక్షణ అవశ్యకర్తవ్యం అంతఃపుర రక్షణ గృహయజమానిది. ఇంటి మంచి చెడ్డలు ఇల్లాలివి.

జూదరి, బాలుడు, స్త్రీ ప్రభుత్వానికి పనికిరారు.

మన ఆలోచనలు బయటపడనంత కాలం మనం సుఖ సంతోషాలతో ఉండగలం.

దాత అందరికీ ప్రీతిపాత్రుడు.

ప్రియంగా మాట్లాడేవానికి కీర్తి లభిస్తుంది.

సత్య వాక్పాలనంవల్ల వచ్చే కీర్తి శాశ్వతమయినది.

వెనక ముందులు చూసుకోకుండా అధికప్రసంగాలు వేస్తే బృహస్పతి కూడా అవమానాల పాలవుతాడు.

మున్ముందు నాశనం కలిగిస్తుందని తెలిసినపుడు ప్రస్తుతం వచ్చే కొద్దిపాటి లాభాన్ని వదులుకోవడం మంచిది.

గుణసంపన్నులు - ధనసంపన్నులు ఎదురుపడితే ప్రథమగౌరవం గుణవంతులకే

ప్రాణినాశనం సాగుతూంటే ధీమంతులు చూస్తూ ఊరుకోకూడదు.

ఇంద్రియాలను జయించని వాని హితబోధలు ఎవరూ పట్టించుకోరు.

తల్లినీ, శిష్యులనూ, సేవకులనూ నిజగృహాన్నీ జాగ్రత్తగా రక్షించు కోవాలి.

హృదయాలు ఏకమై, ఆలోచనలు ఒకేగతిలో సాగి, నడవడిలో బేధం లేకపోతే స్నేహం కొనసాగుతుంది.

నాస్తికుడు, దుఃఖపీడితుడు, సోమరి - వీరి వద్ద లక్ష్మి చిరకాలం ఉండదు.

అంతమాత్రాన అది గుణవంతులనూ, ఉదార స్వభావులనూ, వీరులను ఆశ్రయించి ఉంటుందనుకోనవసరం లేదు. పిచ్చిపట్టిన ఆవులా ఎప్పుడు ఎక్కడ ఆగుతుందో తెలియదు లక్ష్మి.

విద్య లేని పురుషుడు, తిండి లేని ప్రజలు, రాజు లేని రాజ్యం, సంతానప్రాప్తిలేని స్త్రీసుఖమూ అనర్థాలే.

అదేపనిగా నిద్రిస్తూ నిద్రను జయించలేము. పదిమంది స్త్రీలతో తిరుగుతూ కామాన్ని అరికట్టలేం. అదేపనిగా సురాపానం చేస్తూ త్రాగుడు వదలలేం.

ధన దానాలతో మిత్రులు.

అన్న పాన సుఖంతో స్త్రీలు,

విజయలక్ష్మితో శత్రువులు మనవశంలో ఉంటారు.

ధన కనక వస్తు వాహన కామినీ జనంతో భూమండలం అంతా తన అధీనంలోవున్నా తృప్తి ఉండదు కొందరికి.

ఆత్మస్తుతి, సేవారాహిత్యం, అనాలోచితంగా ప్రతికార్యానికీ ఉపక్రమించడం విద్యకు శత్రువులు.

సోమరితనం, మదం, మోహం, చపలత్వం, ధూర్తత్వం స్వార్థం, అనవసర ప్రసంగాలు విద్యార్థులకు పనికిరావు.

ఎన్ని కట్టెలు వేస్తే అగ్నికి తృప్తి కలుగుతుంది?

ఎన్ని నదులు కలిసినా సముద్రం పెరగదు!

ఎందరు మరణించినా మృత్యువు ఆకలి తీరదు!

ఎందరు పురుషులు వచ్చినా కులటకు తృప్తి లేదు.

ప్రభూ! సుఖదుఃఖాలూ, వీటిని అనుభవించే జీవితమూ కూడా అశాశ్వ మయినవే. శాశ్వతమయినది ధర్మం ఒక్కటే. అందుచేత నిత్యమయిన ధర్మంమీదనే మన మనస్సును లగ్నం చెయ్యాలి. అదే ఆనందహేతువు.

భూగోళం అంతా జయించి శాసించిన ప్రభువు లెందరో వెళ్ళి పోయారు. వెడుతూ వెడుతూ వారివెంట గడ్డిపోచకూడా తీసుకు వెళ్ళలేకపోయారు. ఈ విషయం మీ కెరుగనిది కాదు. మీ హితవు కోరినవాణ్ణి కనుక యివి మీ గుర్తుకు తెస్తున్నాను.

కష్టపడి కని పెంచి పోషించిన తల్లి దండ్రులు మరణిస్తే ఉత్తరక్షణంలో వారి కుమారుడే ఆ శవాన్ని ఇంటి బయట పెడుతున్నాడు. ఎండు కట్టెలతో దగ్గం చేస్తున్నాడు. అయితే మరణించిన వానివెంట వాని మంచి చెడ్డలు మాత్రమే వెడుతున్నాయి.

ఈ జీవితం నదీప్రవాహం. అది సర్వేశ్వరుని నుండి ప్రభవించింది. దీనికి ధైర్యంగట్టు. దయ తరంగాలు. పుణ్యకర్మలతో ఈ నదిని తరించి ఈశ్వరుని చేరుతాం.

అందుచేత మీరు ధర్మపరులయిన పాండవులను చేరదీసి సుఖ శాంతులతో ఉండండి అని విదురుడు :

సనాతనుడూ, సర్వవిషయవిదుడూ అయిన సనత్సుజాతమహర్షి మృత్యువు లేదని ఘోషించాడు. ఆయన మాటలవల్ల మీ మనస్సు శాంతిని పొందవచ్చు అన్నాడు.

## సనత్సుజాతీయం:

ధీశాలీ!

మృత్యువే లేదన్నారా మహర్షి సనత్సుజాతులు. అదెలా! కొంచెం విశదంగా చెప్పు, అని ధృతరాష్ట్రుడు అర్థించగా, విదురుడు:

ప్రభూ! అంతటి ఆధ్యాత్మిక విషయాలు మహాత్ములయిన అనుభవజ్ఞుల ముఖాన వింటేనే శ్రేయస్కరం. బ్రహ్మవేత్తలే వానిని వివరించాలి. నేను ఆ మహర్షిని ఆహ్వానిస్తాను అని ఏకాగ్రచిత్తంతో సనత్సుజాతుని స్మరించగా ఆయన ప్రసన్నవదనంతో ప్రత్యక్షమయ్యాడు.

మహర్షికి అర్ఘ్యపాద్యాలర్పించి, ఉచితాసనం చూపి ధృతరాష్ట్రుడు:

ఆర్యా! సుఖదుఃఖాలు, ఆకలిదప్పులు ధనకాంక్ష, కామ క్రోధాలు, జరా మరణాలు బాధించని మార్గం ఉపదేశించండి, అని ప్రార్థించాడు.

సనత్సుజాతుడు: రాజా! మృత్యువనేది ప్రమాదానికి మరో మాట. ప్రమాదాన్ని అజ్ఞానం అన్నారు. అది వైదొలగి జ్ఞానం సిద్ధిస్తే మృత్యువే లేదు. సంసార తాపత్రయ బంధనాలే మృత్యువు. ఆ బంధాలనుండి బయటపడ గలిగితే అమృతం ప్రాప్తిస్తుంది. ఇది రానంతవరకూ దేహమే ఆత్మ అనే భావం ఏర్పడుతుంది. దానితో తాపత్రయాగ్ని చుట్టుముట్టి నశింపజేస్తున్నది.

అ సు అంటే ఇంద్రియాలు.

రమ్ అంటే రమించడం, అనుభవించడం.

ఇంద్రియాలు భౌతిక సుఖాలతో రమిస్తూండడంవల్ల వ్యక్తికి ఆత్మజ్ఞానం పోతుంది; వారే అసురులు. వీరు దేహమే ఆత్మ అనుకుని దాన్ని సుఖపెట్టడం కోసం ఎన్నో నీచ కర్మలు చేసి పశు పక్షి జన్మలు ఎత్తుతున్నారు.

వీరికి భిన్నంగా దేవతలున్నారు. వీరిని 'సుర' శబ్దంతో పిలుస్తాం. మంచి యందే రమించే వారు వీరు.

సరే, మృత్యువు ప్రాణికోటిని ఆరగిస్తున్నదని కొందరంటున్నారు. దానికి రూపం లేదు. అది పెద్దపులిలానో, మరే జంతువు ఆకారంలోనో వచ్చి మనలను తింటున్నదా! లేదే!

అటువంటప్పుడు మృత్యువు ఉన్నదని ఎలా చెప్పగలం!

కామ క్రోధ లోభాది ఆసురీ ప్రవృత్తులకు లొంగి జీవుడు కొట్టు మిట్టాడుతూ మృతు డవుతున్నాడు. ఈ దోషాలు లేని బ్రహ్మజ్ఞాని బ్రహ్మరూపం పొందుతున్నాడు.

అనగా, తాను బ్రహ్మకంటె భిన్నుడను కాను అనేజ్ఞానం కలిగిననాడు మృత్యుభీతిలేదు.

జ్ఞానం కలిగించే విషయాలే వినాలి; అటువంటి వాని మీదనే దృష్టి నిలిపి, మనస్సును ఏకాగ్రం చెయ్యాలి. ఈ ఆత్మ వున్నదే, అది నిత్యచైతన్య రూపంతో, ఆనందంతో, నిర్మలంగా, నిరపేక్షంగా ఉంటుంది.

ఆత్మజ్ఞానం కలిగే వరకూ కర్మ చేస్తూనే ఉండాలి. కర్మల ద్వారా పాపాలనూ తొలగించుకుంటూ జ్ఞానాన్ని పొందాలి. ఈ ప్రపంచమంతా ఈశ్వరమయమే అనే భావన స్థిరపడిననాడు ఏ బంధమూ మనిషిని అంటదు.

దేహాభిమానుల చిత్తశుద్ధి కోసం కర్మలు ఏర్పడ్డాయి. చిత్తం నిర్మల మయితే నిష్కామ దృష్టి ఏర్పడి మోక్షమార్గం గోచరమవుతుంది. చిత్తశుద్ధి లేనివానికి జ్ఞానప్రాప్తి లేదు.

కోరికలు అజ్ఞానం కలిగించి వివేకాన్ని నాశనం చేస్తాయి. కామానికి లొంగినవాడు స్త్రీ సుఖం కోసం పరితపిస్తాడు. వీరందరూ తమోమయ దేహులు.

రక్త, కఫ, మూత్ర, కీటకాలతో నిండిన దేహమే నరకం. ఈ నరకం నుండి జీవుడు బైట పడాలి.

కల్లు, సారాయి త్రాగినవాడు ఆ మత్తులో నడుస్తూ రాళ్ళ మీద గోతులలో పడేటట్లు కామమత్తుడు స్త్రీ వలయంలో పడతాడు.

గడ్డితో తయారయిన పెద్దపులి ఏమీ చెయ్యలేదు. అలానే కామ విరహితుడికి ఏ బాధా లేదు. శారీరక సుఖాలకోసం తాపత్రయపడడమే మృత్యువు. అదిలేని వానికి మృతిలేదు.

దేహం మృత్యువు వల్ల నశిస్తుంది. మృత్యువు జ్ఞానంవల్ల నాశన మవుతుంది.

యోగులుంటారు. వీరు కొన్ని శక్తులు పొందుతారు. ఏ పరిస్థితిలోనూ ఆ శక్తులను ప్రదర్శించరాదు. ప్రదర్శిస్తే చుట్టూ ప్రజలు చేరి ఆరాధనలు ఆరంభిస్తారు. దానితో యోగికి పతనదశ ప్రాప్తిస్తుంది. బధిరునివలె, జడునివలె, మూగవానివలె చరించిన యోగి మోక్షం పొందుతాడు.

కుక్కలు తాము తిన్న పదార్థాన్ని కక్కుకొని దానినే తింటాయి. అటువంటిదే యోగ శక్తులతో ఆహారాన్ని సంపాదించుకోవడం.

బ్రహ్మజ్ఞానమే మనం తెలుసుకోవలసిన పరమ సత్యం. సత్యంలోనే లోకంవున్నది. సత్యాన్ని తెలుసుకున్నవాడే జ్ఞాని. వానికి మృతిలేదు. అంటే పరమేశ్వర భావం వానికి కలిగిననాడు మృత్యువూ నరకమూ అనేవి యింకెక్కడ ఉంటాయి! మరి యీ శరీరం నశిస్తున్నది కదా అంటారు. దీని లక్షణమే అది. అది మృత్యువు పని కాదే.

పాపరహితుడు, వికారశూన్యుడు, నిర్మలుడు, సందేహహీనుడు అయిన వాడే బ్రాహ్మణుడు.

పరబ్రహ్మ స్వరూపాన్ని గ్రహించినవాడు జగత్తు మిధ్య అని తెలుసుకుంటాడు. అప్పుడు జ్ఞాని సిద్ధి పొందుతాడు.

ఇంద్రియాలను నిరోధించి మనస్సును లయం చేయగలిగినప్పుడు కలిగే అనిర్వచనీయ స్థితియే విద్య. ఇది కలవాడే విద్వాంసుడు, జ్ఞాని.

బ్రహ్మచర్య నియమంతో గురు సన్నిధానంలో యీ విద్యను ఉపాసించాలి.

త్రాడును చూచి పాము అని భ్రమిస్తున్నాం. అలానే ఈ జగత్తే శాశ్వత పరబ్రహ్మమనే అజ్ఞానం ఏర్పడుతున్నది. ఈ అజ్ఞానం వైదొలగి బ్రహ్మజ్ఞానం పొందగలిగితే మృత్యువు లేదు. అందుకు ప్రయత్నించు, అని ఉపదేశించాడు సనత్సుజాతుడు.

## సభాభవనం

మహర్షి నిష్క్రమించాడు.

తెల్లవారింది.

ఉపప్లావ్యం నుండి సంజయుడు తిరిగి వచ్చిన వార్త రాత్రి విన్న ప్రముఖులందరూ తెల తెల వారుతూండగానే కురుసభా భవనానికి వస్తున్నారు.

సభా సింహద్వారం బంగారుకాంతు లీనుతోంది. సభామధ్యభాగం స్వచ్ఛ ధవళ రోమలతో అలరారుతున్నది. అంతటా మంచిగంధపు వాసనలు.

అర్హతల ననుసరించి మణి, రత్న, సువర్ణ ఆసనాలున్నాయి. భీష్మ, ద్రోణ, కృప, విదురాదులు ధృతరాష్ట్రునితో కలిసి వచ్చారు. వారి వెంట శల్య, జయద్రథ, బాహ్లిక యుయుత్సులూ, కృతవర్మ వచ్చారు. దుశ్శాసన, శకుని, కర్ణులతో వచ్చే దుర్యోధనుని వెంట సోదరులందరూ వచ్చారు. దేవతలతో వచ్చే ఇంద్రునివలె వున్నాడు కౌరవాగ్రజుడు.

సింహశోభితమయిన గుహలా గోచరిస్తున్నది, రాజవీర సంభరితమయిన సభారంగం.

అప్పుడు సంజయుడు వచ్చి సభాద్వారం వద్ద నిలబడి మహారాజుకి తన రాక తెలియజేసి అనుమతి పొంది ప్రవేశించి అందరికీ అభివాదాలు చేసి:

ఆర్యులారా! చక్రవర్తి ఆజ్ఞానుసారం పాండవులను దర్శించి వచ్చాను. వారందరూ మీ అందరి యోగక్షేమాలు అడగమన్నారు. పెద్దలకు నమస్కారాలూ, పిన్నలకు ఆలింగనాలూ పలికారు.

అప్పుడు ధృతరాష్ట్రుడు:

సంజయా! దురాత్ములను అవలీలగా హతమార్చగల ధనంజయుడే మన్నాడో వినాలని మేమందరం ఎదురు చూస్తున్నాం.

సంజయుడు: ప్రభూ, ధర్మజుని అనుమతి పొంది అర్జునుడు కృష్ణుని చూస్తూ పలికిన పలుకులు దుర్యోధనుడు విని తీరాలి.

ఏమన్నాడంటారా అర్జునుడు,

సంజయా! కాలవశుడై మూర్ఖత్వంతో నన్ను జయించగలననే గర్వంతో వున్న కర్ణుడు వింటుండగా యుద్ధోన్మతులై వచ్చిన రాజ వరుల సమక్షంలో దుర్యోధనునితో యిలా చెప్పు:

ధర్మమార్గాన మా రాజ్యం మా కివ్వకపోతే వాని పాపం పండింది. నేను ఆగ్రహించిననాడు ఈ లోకాలను భస్మం చెయ్యగలను.

భీమార్జున నకుల సహదేవ సాత్యకి ధృష్టద్యుమ్న శిఖండి ప్రభృతుల వెంట కృష్ణుడు కూడా మాపక్షాన వున్నాడు.

మా రాజ్యం మా కిప్పించడానికి శ్రమ అవసరం లేదు. సంజయా! సాధ్యమయినంత వరకూ దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధపడే టట్లే చెయ్యి.

మా అగ్రజుడు ధర్మపరుడైనా మీ వారి అన్యాయం కారణంగా ఘోరారణ్యాలలో కంటక శిలల మీద శయనించాడు. దాని ఫలితంగా రణరంగంలో దుర్యోధనుడు రక్తపంకంలో కూలాలి.

మా అగ్రజుడు జితేంద్రియుడు, ధర్మతత్పరుడు, సాధుశీలి అయినా సత్యం తప్పక నానాక్లేశాలూ అనుభవించాడు. మీరు చేసిన చేయించిన ఘాతుకాలన్నీ సహించాడు.

ఇంతవరకూ ఆయన హృదయంలో అణగారిన క్రోధాగ్నిజ్వాలలు కౌరవారణ్యం మీదకు రానున్నాయి.

రథారూఢుడై గదాదండం ధరించి భీకరాకారంతో, భీమసేనుడు క్రోధ విషజ్వాలలు గ్రక్కుతూ రణభూమిని మండిస్తున్నప్పుడు యుద్ధ పర్యవసానం మీకు బోధపడుతుంది. లేడి గుంపులో సింహంలా విక్రమిస్తాడు మా భీముడు.

రథిక శ్రేష్ఠుడు, చిత్ర యుద్ధ కుశలుడు నకులుడు కరవాలంతో మీ సేనలను ఊచకోత కోస్తుంటే;

ఉత్తమజాతి అశ్వాలను పూన్చిన రథంమీద మా సహదేవుడు చక్ర భ్రమణం చేస్తూ శాత్రవ శీర్షాలను తరుగుతూంటే అప్పుడు తెలుస్తుంది, తమ పాప కార్య పర్యవసానం ఏమిటో.

ద్రుపదుడు విరటుడు మహారథికులను చీల్చి చెండాడుతున్నప్పుడు, శిఖండి చేతులలో భీష్ములవారు నేల కూలినప్పుడు, తమ ప్రియ శిష్యుడు దృష్టద్యుమ్నునిచేత ఆచార్య ద్రోణులు పరాభూతులైన నాడు గ్రహిస్తారు మా శక్తిని మీవారు.

సంజయా!

రాజ్యభోగాల మీద, జీవతం మీద ఆశ వదులుకోమని మీ వారికి చెప్పు.

సర్వశస్త్రాస్త్రాలూ ప్రయోగోపసంహారంతో నేర్చిన సాత్యకి రథారూఢుడై వస్తున్నాడు.

కపిధ్వజంతో శ్వేతాశ్వాలను పూన్చిన నా రథం కృష్ణ సారథ్యంలో ప్రవేశిస్తుంది.

గాండీవ ధనుష్టంకారం వింటూంటే వారి చెవులలో పిడుగులు పడ తాయి. నా శరపరంపర ఆకాశం నుండి సూర్యరశ్మిని క్రిందికి రానీయదు. ప్రతిపక్షుల తలలు తాటిపళ్ళవలె నేలకు రాలుతాయి.

విధి, యిలా జరగాలని భావించాడు కాబోలు.

సముద్రాన్ని యీదడం, మండుతూన్న అగ్నిని గుప్పిట పట్టడం, సూర్యచంద్ర గతిని ఆపడం, కైలాసాన్ని చూర్ణం చెయ్యడం సాధ్యమయితే, వాసుదేవునికి ఎదురు నిలిచి జయం పొందడం సాధ్యం.

ఈ గాండీవం దానంతటది ఉరకలు వేస్తున్నది. కుబుసం విడిచిన పాములా నా కరవాలం తళ తళలాడుతున్నది. కపిధ్వజం భీకర గర్జనలు చేస్తున్నది.

దేవేంద్రుని వెంట బెట్టుకు వచ్చినా నేను శత్రువులను విడిచిపెట్టను. శత్రుసేన సర్వం నాశనం అయితేనే నాకు శాంతి. మా పితామహులు, భీష్ములు మా గురువులు కృప, ద్రోణులు వారికి అభివాదాలు చేసి నేను, యుద్ధసన్నాహంలో వున్నానని మీ దుర్యోధనుడికి చెప్పు అన్నాడు.

అంతా సావధానంగా విని భీష్ముడు:

దుర్యోధనా! ఆ నర నారాయణులే యీనాడు అర్జున వాసుదేవులు. శ్రీకృష్ణుని సారథ్యంలో అర్జునుడు ఖాండవ వనాన్ని దహించే అగ్నికి రక్షకుడుగా నిలిచి దేవేంద్రుని పరాభూతుని చేశాడు. ఆ పరాక్రమ సంపన్నుడు కృష్ణ సారథ్యంలో యుద్ధ రంగానికి వస్తున్నాడు. నిశ్చయంగా విజయలక్ష్మి వారినే వరిస్తుంది.

ధర్మ విరుద్ధంగా నడిచే నీ బుద్ధి యీనాడు నా మాటలను లక్ష్యం చెయ్యదు, కాని రణరంగంలో సర్వనాశనం అవుతూంటే యీ వృద్ధుని ఉపదేశం నీ స్మృతికి రాక తప్పదు. సోదర, మిత్ర, బంధు జనులందరి మరణం నీ కళ్ళతో నువ్వు చూసినపుడు నా హితవు గుర్తుకు వస్తుంది.

శాపాలతో దుర్బలుడైన కర్ణునీ, పాపాచార రతుడైన దుశ్శాసన సోదరునీ, మాయాజాల నిపుణుడైన శకునిమామనూ, నమ్మి నాశనం అవుతున్నావు, అంటుండగా

కర్ణుడు: భీష్మ పితామహుల వారు నా మీద అటువంటి దురభిప్రాయంతో ఎందుకున్నారో తెలియదు. ధార్తరాష్ట్రులలో ఏ ఒక్కరూ పాపకర్మలూ, దుష్కార్యాలు చేసిన వారుకారు.

రానున్న సంగ్రామంలో నే నొక్కడనే వారందరినీ సంహరించ గలను. ఇంతకాలం ద్వేషంతో వున్న వారితో సంధికి దిగడం జరిగే పని కాదు, అన్నాడు.

పాండవ బలంలో పదహారో భాగం లేని కర్ణుడు వారందరినీ సంహరించగలనని గాలిమేడలు కడుతున్నాడు. కురువంశానికి నాశనం తెచ్చిపెట్టే చీడపురుగు కర్ణుడు, అని భీష్ముడు:

పాండవులు చేసిన వీరోచిత కృత్యాలలో ఒక్కటయినా యీ కర్ణుడు చేశాడా! వారు అజ్ఞాతవాసం చేస్తున్నప్పుడు గోగ్రహణానికి వెళ్ళిననాడు మనకు జరిగిన పరాభవం విస్మరించాడు కర్ణుడు.

ఘోషయాత్రలో గంధర్వులు దుర్యోధనుని బంధించినప్పుడు పాండవులు విడిపించారు. కాని కర్ణుడు కాదే! ఇప్పుడు మాత్రము రంకెలు వేస్తున్నాడు, అన్నాడు.

ద్రోణాచార్యులు: మహారాజా! పితామహులంవారు వాస్తవం సెలవిచ్చారు. సంజయుడు చెప్పిన మాటలు విన్నాక పాండవులతో సంధిచేసుకోవడమే సముచితమని నేనూ భావిస్తున్నాను. అర్జునుని వంటి వీరుడు ముల్లోకాలలో లేడు అన్నాడు.

వారి మాటలు విననట్లే ధృతరాష్ట్రుడు:

సంజయా! మన సేనాబలం, మిత్రరాజుల సహాయం వివరించావు కదా నువ్వు. అది విని ధర్మరాజు ఏమన్నాడో చెప్పు, అనగా సంజయుడు:

ప్రభూ! ధర్మరాజు నడచి వస్తూంటే ఉదయకాల సూర్యునివలె గోచరించాడు. ఆయనకు సేనలు తలవంచి నమస్కరిస్తున్నాయి. ఆయన నోట మాట వెలువడితే అక్కడి వారందరూ దానిని రాజశాసనంగా భావిస్తున్నారు. యుద్ధవీర వేషంలో వీధులలో నడిచే అర్జునుని చూడడానికి నగర నారీజనం ఉత్సాహంతో తమ గుమ్మాలలో నిలబడుతున్నారు. అంటూ సంజయుడు మూర్ఛపోయాడు.

విదురుడు: మహారాజా! పాండవ యోధులను కనులారా తిలకించిన సంజయునికి ఆ సన్నివేశం స్మృతికి వచ్చినట్లుంది, మూర్ఛపోయాడు. దుర్బలుడు కదా! కొంతసేపు మాట్లాడలేడు, అన్నాడు.

నెమ్మదిగా సంజయుడు తేరుకుని:

ప్రభూ! నేను వారందరినీ చూశాను. అప్పుడే అజ్ఞాతవాసం నుండి వచ్చారు కనక కొంచెం నీరసంగానే వున్నారు.

అయినా ఒక్క భీమసేనుని బలం ఆధారంగా వారు యుద్ధసన్నద్ధులవుతున్నారు. హిడింబాసురుని సంహరించిన యోధుడు, గంధమాదనానికి వెళ్ళి ద్రౌపదికి సౌగంధిక కమలాలు తెచ్చిన సాహసి, లక్కయింటి నుండి తల్లినీ, సోదరులనూ రక్షించిన బలిష్ఠుడు భీమసేనుడే!

శూలపాణితో యుద్ధం చేసినవాడు, లోకపాలకులను లక్ష్యపెట్టని వాడు అర్జునుడున్నాడు వారి బలంలో దిగ్విజయ యాత్రలు సాగించి నానాదేశాల వారిని పీడించిన నకుల సహదేవులున్నారు. అస్త్రవేత్త శిఖండి వున్నాడు. సాత్యకి, కేకయ రాకుమారులు కాశీరాజు, విరటుడు, ఉపపాండవులు, ధృష్టకేతువు, శరభుడు, ద్రుపదుడు, వీరికితోడు జరాసంధతనయులు సహదేవ, జయత్సేనులు. అందరూ మహాయోధులు యుద్ధవిశారదులు అన్నాడు.

ధృతరాష్ట్రుడు: సంజయా! నువ్వు చెప్పింది సత్యం. అందరికంటె నాకు భీముని భయం అధికం. ఆకలిగొన్న పెద్దపులిని చూసిన లేడిలా ఉంటుంది నా హృదయం భీముని పేరు చెపితే. క్రోధం వస్తే పరమశివుడు, వేగానికి వాయువు, అటువంటి భీముడు తన లోహగదాదండంతో నా కుమారులను చెండాడి తీరుతాడు.

ఈ విషయాలన్నీ చెప్పినా నా కుమారులు వినిపించుకోరు. చెట్టు చివరి కొమ్మనున్న తేనెపట్టును చూస్తున్నారే కాని ఆ చివరకు ఎక్కితే కొమ్మ విరిగి పడతామని తెలుసుకోలేని అజ్ఞానంలో వున్నారు.

భీమునికి తోడు గాండీవం ధరించి అర్జునుడు కూడా వస్తాడు.

అర్జునుని జయించగల ననుకుంటున్న కర్ణుని బుద్ధికి స్థిరత్వం లేదు. ఆచార్య ద్రోణులు వృద్ధులయినా శక్తి సంపన్నులే కాని వారికి శిష్యవాత్సల్యం ఉంది. వీరుభయులూ రణరంగంలో తమ పాత్రను ముగిస్తే మన వారికి ధైర్యం లేదు.

దేవేంద్రుని వజ్రాయుధం దెబ్బతిని తట్టుకో వచ్చునేమో కాని గాండీవం నుండి వెలువడే బాణాలు తగిలితే మరి దారి లేదు.

ధర్మజుని క్రోధమూ అంత శక్తివంతమే.

అందుచేత యుద్ధం జరుగకూడదనే నేను అనుకుంటున్నాను. శాంతి కోసమే మనం ప్రయత్నించాలి. కాకపోతే యుద్ధానికి నేనే కారకుడనని ధర్మరాజు నన్ను నిందిస్తాడు. అనగా విని సంజయుడు:

ప్రభూ! ఇంత తెలిసిన మీరు యుద్ధోన్మాదంతో వున్న కుమారుల ఆధీనంలో ఎందుకు పడుతున్నారో తెలీదు.

పాండవుల విషయంలో యిప్పటికీ మీరు కపట వ్యవహారంతోనే వున్నారు. జూదంలో మీ కుమారులు పాండవుల భోగాలన్నీ హరించారని విన్న క్షణంలో మీరు పసిపాపలా చిరునవ్వుతో కూర్చున్నారు. సభా మధ్యంలో వారికి అవమానాలు జరుపుతూంటే ఉదాసీనత వహించారు. ఇవన్నీ భావిలో పతనహేతువులని గుర్తించలేకపోయారు.

మరొక ముఖ్యాంశం:

కురుజాంగలప్రాంతాలు మాత్రమే పితృపితామహప్రాప్తమయిన రాజ్యం, మిగిలిన రాజ్యభాగం అంతా పాండురాజు పరాక్రమంతో సాధించినదే. అదంతా మీ చేతులలో ఉంచితే మీదే అనుకుంటున్నారు.

ప్రభూ! భీమార్జునులు విక్రమిస్తే ఎదిరించి నిలబడగలవారు లేరు. కనక మీ వారిని అదుపులో ఉంచుకోవడం అవసరం. అంతే కాని, వ్యర్థంగా విచారిస్తూ కూర్చుని లాభం లేదు. ఈ విషయాలన్నీ జూదసమయంలో విదురుడూ, నేనూ చెప్పినవే, అన్నాడు.

విన్నాడు దుర్యోధనుడు. ఉద్రేకంతో తండ్రివైపు తిరిగి: మహారాజా! సర్వశత్రు సంహార సమర్థులు భీష్మపితామహులు మనవెంట ఉన్నారు.

మనకు సాయపడవచ్చిన మహావీరుల శక్తిసామర్థ్యాలు మీరు సరిగా గుర్తించలేదు.

భీముని బలాన్ని గురించి మీరు అనవసరంగా భయపడుతున్నారు. గదాయుద్ధంలో నా ముందు నిలబడగలవాడు లేడు. బలరామునివద్ద నేను యీ విద్య అభ్యసించే రోజుల లోనే ఆయన నన్ను ప్రశంసించాడు.

భీముడు నా చేతులలో నేలకూలుతాడు. అప్పుడు అర్జునుడుంటాడు. భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణ, శల్య, భోగదత్త, భూరిశ్రవస, జయ ద్రథులు మనవారిలో ధనుర్విద్యావిదులు. పరశురాముని వంటి

శస్త్రాస్త్రవేత్తతో సమానుడు కర్ణుడు. ఇంద్రుడు వీని కుండలాలు గ్రహిస్తూ యిచ్చిన శక్తి ఆయుధం వున్నది వీనివద్ద, వీని యెదుట అర్జునుడు నిలబడడం కల్ల అందుచేత విజయం మనదే.

పాండవులయిదుగురూ కాక సాత్యకి, ధృష్టద్యుమ్నుడూ. యీ ఏడుగురే ఆ పక్షంలో వీరులు.

మన బలం చూశారా!

భీష్మ, ద్రోణ, కృప, కర్ణ, అశ్వత్థామ, సోమదత్త, బాహ్లీక, భగదత్త, శల్య, వింద, అనువింద, జయద్రథ, దుశ్శాసన, దుర్ముఖ, దుస్సహ, చిత్రసేన, శ్రుతాయు, కురుమిత్ర, వివింశతి, భూరిశ్రవస, వికర్ణాదులు మహావీరులు. అందుకు తోడు మన సేనాబలం పదకొండు అక్షౌహిణులు. ఈ దశలో మనమెందుకు భయపడాలి. మీరు నిశ్చింతగా ఉండండి, అని సంజయుని వైపు తిరిగి:

సంజయా!

వారి యుద్ధసన్నాహాలు ఎలా సాగుతున్నాయో వివరించు, అన్నాడు.

కౌరవాగ్రజా!

వారందరూ ప్రసన్నవదనాలతో, యుద్ధోత్సాహంతో వున్నారు. రథాన్ని సన్నద్ధం చేసి అర్జునుడు అస్త్రమంత్రాలు మననం చేస్తున్నాడు. రథంమీద కపిధ్వజం కాంతులీనుతున్నది. రథానికి పూన్చిన గుర్రాలు ధవళరోమ లీనుతున్నాయి. ధర్మజుని అశ్వాలూ తెల్లనివే. భీమసేనునివి నలుపు. నకులునివి హరితవర్ణంతో, సహదేవునివి నానా వర్ణాలతో శోభిస్తున్నాయి.

దేవ, దానవ, గంధర్వ, మానవ రణవ్యూహ నిపుణుడైన ధృష్టద్యుమ్నుడు వారి సేనాపతి.

మత్స్యసేనావాహినితో విరటుని వెంట శిఖండి వచ్చి మన పితామహులను ఎదుర్కొంటాడు.

దుర్యోధనుని సోదరులూ పుత్రులూ భీముని వంతు.

కర్ణ, వికర్ణ, సైంధవ, అశ్వత్థామలు అర్జునునికి ఎదురురావాలి.

ఉపపాండవులను వెంటబెట్టుకుని వారి మేనమామ ధృష్టద్యుమ్నుడు ఆచార్యులను ఎదురుకుంటాడు. శకునిని సహదేవుడు, కృతవర్మను సాత్యకి చూస్తారు. శకుని కొడుకు ఉలూకుడు నకులుని పాల బడాలి. ఇదే వారి వ్యూహం. ఇప్పుడు బాగా ఆలోచించి నిశ్చయానికి రండి, అన్నాడు సంజయుడు.

ధృతరాష్ట్రుడు: సంజయా! నా కుమారుడు ఎవరు చెప్పినా వినే దశలో లేడు. కానున్నది కాకమానదు, అంటుండగా దుర్యోధనుడు:

మహారాజా! పాండవులుకూడా మానవులే. వారూ మా వలెనే యీ భూమిమీదనే జీవిస్తున్నారు. అయినప్పుడు విజయలక్ష్మి వారినే వరిస్తుందని మీరెలా అనుకుంటున్నారు. మన పక్షంలో వున్న మహాయోధులను కన్నెత్తి చూడగల శక్తి కూడా పాండవులకు లేదు, అన్నాడు.

ధృతరాష్ట్రుడు: సంజయా! వీని ఉన్మత్త ప్రలాపాలు విన్నావా! అని దుర్యోధనుని వైపు తిరిగి:

నాయనా, సర్వనాశన కారణమైన యుద్ధాన్ని సజ్జనులెవరూ హర్షించరు.

వారి రాజ్యభాగం వారి కిచ్చినా మిగిలిన సంపదలలో నువ్వు సుఖ భోగాలు అనుభవించవచ్చు.

ఇక్కడి పెద్ద లెవరికీ యుద్ధం అంటే యిష్టంలేదు. మన ఆశ్రయంలో వున్న వారికే యిష్టంలేని పని ఎందుకు చేస్తావు.

నిజాని కిది నీకు పుట్టిన బుద్ధికాదు. శకుని, దుశ్శాసన, కర్ణులు నిన్ను పురికొల్పుతున్నారు, అనగా దుర్యోధనుడు:

మహారాజా! నేను వీరెవరినీ విశ్వసించను. కర్ణుడూ, నేనూ సంగ్రామయజ్ఞంలో ధర్మరాజును బలిపశువుగా హరించదలిచాం. మా వెంట దుశ్శాసను డుంటాడు. మరెవరూ అవసరం లేదు. పాండవుల మీద విజయం సాధించడానికి మేం ముగ్గురు చాలు అన్నాడు.

సంజయుడు;

మహారాజా! ఉపప్లావ్యం వెడుతూనే నేను కృష్ణార్జునులున్న మందిరానికి వెళ్ళాను. అభిమన్యుడు కూడా వెళ్ళడానికి వీలులేని అంతఃపురంలో వారుభయులూ వున్న చోటికి నన్ను తీసుకువెళ్ళారు. అక్కడ ద్రౌపదీ సత్యభామా వున్నారు.

నేను కృష్ణార్జునులకు పాదాభివందనం చేశాను. వారు బంగారు ఆసనం చూపించారు. నేను గౌరవ పురస్సరంగా దానిని చేత్తో తాకి నేలమీదనే కూర్చున్నాను. అతిథి మర్యాదలు యథావిధిగా నడిపించారు.

వారుభయులూ మంచిగంధపు పూత పూసుకొని వున్నారు. రత్నాంబరాలు ధరించారు. మధ్వాసవం తీసుకుంటూ ఉత్సాహంగా వున్నారు.

అప్పుడు నేను మీ సందేశం వినిపించాను.

అర్జునుని అభిమతం గ్రహించి వాసుదేవుడు:

సంజయా! మా సందేశం వినిపించే ముందు అక్కడ పెద్దలయిన భీష్మ, ద్రోణులకూ మీ మహారాజుకీ మా ప్రణామాలు అందించు. అనంతరం-

కౌరవు లందరూ వారు సంకల్పించిన సత్కార్యాలేమైనా వుంటే అవి త్వరగా పూర్తిచేసుకోమను.

ధారా పుత్రులతో అనుభవించవలసిన భోగాలన్నీ సత్వరం జరిపించుకోమను. వంశాభివృద్ధికి అవసరమయిన ఏర్పాట్లు చేసుకోమని చెప్పు. మిత్రులకు ఉపకారాలు త్వరగా కానిమ్మని విశదం చెయ్యి.

ఇంతా ఎందుకంటే వారి నెత్తిమీదికి విపత్తులు వచ్చి పడనున్నాయి. తేజస్వి అయిన అర్జునుడు కృష్ణసారథ్యంలో గాండీవం ధరించి వస్తున్నాడనీ అదే వారి పాలిట యమపాశమనీ స్పష్టం చెయ్యి.

గోగ్రహణ సమయంలో అర్జునుడొక్కడే వారిని పరాభూతులను చేసిన విషయం అప్పుడే మరచిపోయి వుండరు. ఇంతకంటె చెప్పవలసినది లేదు, అన్నాడు.

ధృతరాష్ట్రుడు రెండు క్షణాలు ఆలోచించి: దుర్యోధనా! మీరెంత చెపు తున్నా నాకు ధైర్యం చాలడంలేదు. దురాగ్రహాన్ని విడిచి యుద్ధసంకల్పానికి నీళ్ళు వొదలండి.

ప్రపంచంలో తల్లి దండ్రులు, నిరంతరం తమ బిడ్డల శ్రేయస్సు కోసమే పాటుపడతారు. ఆ దృష్టితోనే యుద్ధం వద్దని చెపుతున్నాను. వారికి దైవబలం కూడా ఉంది.

అర్జునుడు శత్రుసేనలను చీల్చి చెండాడుతున్నట్లే నాకు నిరంతరం కనిపించి నిద్ర కూడా రావడంలేదు. మనకంటె శక్తిసంపన్నులు వారు. వారితో సంగ్రామం మంచిదికాదు అన్నాడు.

దుర్యోధనుడు ఆగ్రహంతో లేచి:

మహారాజా! పాండవులకు దైవబలం వున్నదంటున్నారు. అదే నిజమయితే వారికి క్లేశాలు కలగవలసిన అవసరం లేదే. దేవతలకు రాగద్వేషాలుండవని మరిచిపోకండి. నేను కూడా అగ్నిని చల్లబరిచే శక్తులు సాధించాను. నేలకూలే పర్వతాలను కదలకుండా నిలబెడతాను. భూమిని బద్దలు కాకుండా చేస్తాను. వర్షాన్ని స్తంభింప జెయ్యగలను. నీటిమీద సైన్యాన్ని నడిపిస్తాను.

మన రాజ్యంలో ప్రజలందరూ ధర్మతత్పరులు. అందువల్లనే అతివృష్టి అనావృష్టి లేవు. నా శక్తి ప్రజలు ఎరుగుదురు. నా ఖ్యాతి దిగంతవ్యాప్తం. ఆత్మస్తుతి మంచిదికాదని తెలుసు. కాని, మీ భయాన్ని తగ్గించడానికి చెపుతున్నాను.

భీష్మ ద్రోణ కృప శల్యుల కున్నంత శస్త్రాస్త్ర జ్ఞానం నాకూ ఉంది. దానితో సర్వ శాత్రవచమూ నాశనం చెయ్యగలను, అన్నాడు.

అనంతరం కర్ణుడు: మహారాజా! పరశురామునివంటి మహామహుని సన్నిధానంలో నేను ధనుర్విద్య అభ్యసించాను. ఆయన శపిస్తూ కూడా

అవసరానికి నీకు అస్త్రజ్ఞానం ఉపయోగ పడదన్నాడే కాని వ్యర్థ మనలేదు. అందుచేత నా శక్తిని మీరు సక్రమంగా అర్థం చేసుకోవాలి.

పాండవులను సర్వనాశనం చేసే భారం నాకు విడిచి మీరు ప్రశాంతంగా వుండండి అన్నాడు.

భీష్ముడు: కర్ణా! ఎందుకీ ఆడంబర ప్రసంగాలు. ఇంద్రదత్తమయిన శక్తి, నీ నాగాస్త్రం అర్జునుని బాణాగ్నికి ఇంధనా లవుతాయి.

కృష్ణ సారథ్యంలో వచ్చే వీరునికి పరాజయం వుండదు.

కర్ణుడు: పితామహా! వాసుదేవుని శక్తి ఎంతటిదైనా నా విషయంలో మీరు తప్పు అంచనా వేస్తున్నారు. మీ పరుషవాక్కులు చాలించండి. ఇది మొదలు నే నీ కురువృద్ధుని చూడబోను. ఆయన అనంతరం రణరంగానికి వస్తాను. అప్పుడు నా శక్తి సామర్థ్యాలను వీరంతా చూస్తారు. అని సభ నుండి కదలి స్వగృహానికి వెళ్ళాడు.

భీష్ముడు: దుర్యోధనా! కర్ణుడు తన ప్రతిజ్ఞ ఎలా నెరవేర్చుకుంటాడో చూడాలని ఉంది.

ఈ చక్రవర్తు లందరూ తమ తమ సేనలతో భీమసేనుని చేతులలో నలిగిపోక తప్పదు. అది మన కళ్ళతో మనం చూస్తాం.

పరశురాముని వద్ద అసత్యమాడి విద్య నేర్చిననాడే వీని ధర్మశక్తి నశించింది. ఇంక ఏం చెప్పను.

దుర్యోధనుడు: తాతా! కురుపాండవు లుభయులూ, విద్యావిషయంలో సములు. ఉభయులూ ఒకే వంశంవారు. అయినప్పుడు విజయలక్ష్మి వారినే వరిస్తుందని మీరెందుకు భావిస్తున్నారో తెలియదు. మీరు కాని కృప ద్రోణ బాహ్లికులు కాని అవసరం లేకుండా కర్ణ దుశ్శాసనుల సాయంతో నేనే వారిని యమపురికి పంపగలనని మరువకండి.

విదురుడు: దుర్యోధనా! ఇంద్రియ నిగ్రహం లేనివాడు ఏదీ సాధించలేడు. జ్ఞానం, దానం, తపస్సు, స్వాధ్యాయం, అన్నిటికి ప్రధానం అంతరింద్రియ నిగ్రహం.

వేటగాడికి మృగాలు భయపడినట్లు నిగ్రహం కలవానికి సర్వప్రపంచం జంకుతుంది. నిరంతరం సంతృప్తితో వుంటారు, నిగ్రహ సంపన్నులు.

చిన్న కథ చెపుతాను.

ఒక బోయవాడు పన్నిన వలలో చిక్కిన పక్షుల జంటలు నేర్పుగా ఆ వలను తన్నుకొని ఆకాశంలో ఎగిరిపోతున్నాయి. అవి వెళ్ళే దిశగా వాడూ పరుగెడు తున్నాడు.

దారిలో ఒకముని వాని అమాయకత్వానికి జాలిపడగా ఆ బోయవాడు నవ్వి:

అయ్యా! అవి కలిసివున్నాయి కనక నా వలను ఎత్తుకుపోగలిగాయి. అవి కలహించుకున్న క్షణంలో వలతో క్రిందపడి నాకు దొరుకుతాయి, అన్నాడు.

అనుకున్నట్లే అవి పొడుచుకుని క్రిందపడి బోయవానికి చిక్కాయి.

అలానే అన్నదమ్ముల కలహం ఎదుటివారికి ప్రయోజనకరం.

కలసివుంటే సింహం రక్షించే అరణ్యంలా ఏ ప్రమాదం రాదు.

మరొక అనుభవం —

ఒక పర్వతగుహలో పెద్ద తేనెపట్టు ఉంది. దాన్ని పెద్ద పెద్ద త్రాచులు రక్షిస్తున్నాయి.

ఆ తేనె త్రాగితే అంధులకు దృష్టివస్తుందనీ, ముసలివారికి యౌవనం ప్రాప్తిస్తుందనీ, అసలు మరణమే వుండదనీ, అక్కడివారు చెప్పగా విన్నారు కొందరు ఆటవికులు. మూర్ఖంగా గుహలో ప్రవేశించి త్రాచుపాముల కాట్లు తిని మరణించారు.

అటువంటి ఆశతో వున్నావు దుర్యోధనా నువ్వు భీమార్జునులతో సంగ్రామం శ్రేయస్కరం కాదు.

శక్తి సంపన్నులైన పాండవులు నేటికీ సోదరప్రేమతో, స్నేహాన్ని కాంక్షిస్తున్నారు. ఆ అవకాశాన్ని జార విడువకు.

ధృతరాష్ట్రుడు: పాండవుల విషయమై వీరందరూ చెపుతూన్న మాటలు యథార్థం. నాయనా! వీరి మాటలు విని సంధికి సమ్మతించు. వీరికంటె మన శ్రేయస్సు కోరేవారు లేరు.

ఆ మాటలు వింటూనే దుర్యోధనుడు సభాభవనం విడిచి వెళ్ళాడు.

ధృతరాష్ట్రుడు కొలువు చాలించి అభ్యంతర మందిరానికి వెళ్ళి చింతాక్రాంతుడయాడు.

వ్యాసులవారు విజయం చేస్తీ వాసుదేవుని ఆశ్రయం సర్వక్లేశహరం అని బోధించారు. విన్నాడు కురునరపతి.

ఇది సంజయరాయబారం

## శ్రీకృష్ణుడు:

ఆపద గడవం బెట్టగ
ఓపి శుభం బైనదాని నొడ గూర్పను మా
కీపుట్టువునకు పాండు
క్ష్మాపాలుడు నిన్ను చూపి చనియె మహాత్మా ॥

వచ్చిన సంజయుడు వచ్చినట్లే వెళ్ళగానే ధర్మరాజు బంధు మిత్రులందరినీ వెంటబెట్టుకుని ద్రౌపదీ సహితుడై కృష్ణుని విడిది మందిరం చేరి, ఆయన జరిపిన స్వాగతసత్కారాలు స్వీకరించి అందరూ సుఖాసనాలు అలంకరించాక:

యదు వంశ శిరోమణీ! ఆప్తులకు సాయం చెయ్యవలసిన సమయం సంప్రాప్తమయింది. మీ యదువృష్ణి వంశీయులను క్లేశాలనుండి ఉద్ధరించినట్లే మమ్ము కూడా రక్షించు.

సంజయుని మాటలు విన్నావు. రాజదూత రాజుగారి అభిప్రాయాలకు విరుద్ధంగా మాట్లాడి ప్రాణాలమీదికి తెచ్చుకోడు. అతని మాటలను బట్టి ధృతరాష్ట్రుడూ ఆయన కుమారులూ ఏ భావంతో వున్నారో మనకు తెలిసింది.

అరణ్య, అజ్ఞాతవాసాలు ముగియగానే మా రాజ్యభాగం మా కిస్తామని ఆయన నోటితో ఆయన అన్నాడు. ఈనాడు పుత్రవ్యామోహం లోభం కలసి వంచించిన మనస్సుతో మాకు రిక్తహస్తాలు చూపుతున్నాడు. అలా చేస్తూ ప్రపంచం దృష్టిలో తను పాండవుల శ్రేయస్సును కాంక్షించే వ్యక్తిగా కనిపించాలనుకుంటున్నాడు.

నేను అయిదు గ్రామాలు చాలన్నాను. అందుకూ వారు సుముఖంగా లేరు.

ధనలోభం వున్నదే - దానికి కులంతో, ఉన్నత వంశంతో నిమిత్తం లేదు. లోభి బుద్ధిహీను డవుతాడు. బుద్ధి లేని వారికి సిగ్గుండదు. అది లేనివాడు ధర్మానికి దూరంగా ఉంటాడు. ధర్మదూరుని యింట లక్ష్మి ఉండదు. లక్ష్మి లేనివాడు దరిద్రుడు. దరిద్రం కంటె మరణం మేలు. పూలూ, కాయలూ లేని చెట్టుమీద పక్షులు చేరవు. ధనహీనుడిని బంధు మిత్రులు విడిచి పెడతారు.

ఇంట్లో అన్న పానాలు లేకపోవడం కంటె దుర్దశ లేదు. ఇదే దరిద్రుడికి కలిగే నిత్య మరణం.

నిజానికి ధనమే ప్రపంచాన్ని నడుపుతున్నది. ధనం కారణంగా ప్రమత్తుడై దుష్కార్యాలకు దిగితే దారిద్ర్యం తప్పదు. అది పతన కారణం. దరిద్రుడికి చిరాకు, పరాకు ఎక్కువ. దానితో అందరూ దూరంగా పోతారు. ఈర్ష్య పెరుగుతుంది. మోహం ఆవేశిస్తుంది. మానాభిమానా లుండవు. అందుచేత ధర్మమార్గం విడవకుండా మా రాజ్యసంపదలు మేము సాధించాలి.

ఇదంతా వారు సంధికి అంగీకరించకపోతే మాట. ధర్మమార్గం తప్పి వారు చరించదలచినట్లయితే మారణహోమం తప్పదు.

జనన మరణాలవలె జయాపజయాలు మన చేతులలో లేవు. అయినా మేము ధర్మ యుద్ధం సాగించి తీరాలి.

రణరంగంలో మహామహులే మరణిస్తారు. ప్రమాద సమయంలో సామాన్యులు పలాయనం చిత్తగిస్తారు. యుద్ధంలో జయం లభించినా పశ్చాత్తాపం తప్పదు.

వైరంతో వైరాన్ని ఉపశమింప చెయ్యలేం. ప్రతీకారం ప్రబలుతూనే ఉంటుంది. ఎవరితోనూ విరోధం లేనివాడే ప్రశాంతంగా జీవించగలడు. శత్రువు ఒక్కడున్నా త్రాచుపామువున్న యింట్లో బ్రతుకుతున్నట్లే.

మనస్సులోని ద్వేషాన్ని వదల గలగాలి. లేదా ప్రాణ త్యాగం చెయ్యాలి. అంతకు మించి మనశ్శాంతికి మార్గం లేదు.

అయితే యిప్పుడు మేము రాజ్యం వదలిపోవచ్చు. అందువల్ల శత్రువుకి బలం, అహంకారం పెరిగి మనకు శాంతి కూడా దక్కదు.

సామ దాన భేదాలతో మన ప్రయత్నాలు ఫలిస్తే సంతోషం. తప్పనిసరి అయితే యుద్ధానికి వెనుకాడము. వాస్తవానికి కుక్కల కొట్లాటకూ, మానవయుద్ధాలకూ భేదం లేదు.

వయోవృద్ధుడూ, పితృతుల్యుడూ అయిన ధృతరాష్ట్ర మహారాజును మేము నేటి వరకూ గౌరవభావంతో పూజిస్తూనే వున్నాం. పుత్రవ్యామోహంలో ఆయన ధర్మాన్ని మరచిపోతున్నాడు. ఈ విషయాలన్నీ ఆలోచించి మా శ్రేయస్సు కోసం అనుసరించ దగిన మార్గం అనుసరించు.

శ్రీకృష్ణుడు: పాండవాగ్రజా! నీ అభిమతానుసారం కురుసభా భవనానికి వెళ్ళి సాధ్యమయినంత వరకూ సంధి ప్రయత్నం సాగిస్తాను. మీకు నష్టం కలగని విధానం నిశితంగా ఆలోచించి నడుపుతాను. మీ ఉభయ వంశాల వారూ, సుఖశాంతులతో ఉంటే ఆనందిస్తారు.

ధర్మరాజు: మిత్రవత్సలా! కురురాజ నందనుడికి నువ్వు చెప్పే హితవు తలకెక్కుతుందనే నమ్మకం నాకు లేదు. ఆ దుర్మార్గుడి కనుసన్నలలో నడిచే సభకు నిన్ను పంపితే వారు నీకు హాని తలపెడతారేమో అనే భయం కూడా కలుగుతున్నది. స్వర్గభోగాలయినా వదులుకుంటాను. కాని నీకు కష్టం కలిగితే సహించ లేను.

శ్రీకృష్ణుడు: ధర్మనందనా! నా గురించు నువ్వు భయపడకు. అక్కడ వ్యవహారం విషమిస్తే వారు నశిస్తారు. క్రోధంతో వున్న సింహం ఎదుట ఏ జంతువు నిలబడుతుంది. అలానే నా భయంకరరూపం ముందు వారు ఊపిరి పీల్చలేరు.

మనం చేసే ఈ సంధిప్రయత్నం వల్ల లోకం మనల్ని వ్రేలెత్తి చూపే అవకాశం ఉండదు.

అలనాడు —

జూదం సాగుతూంటే వారు ఎన్ని అవమానకర వాక్యాలు పలికారు. అంతతో ఆగక మహాసాధ్వి అయిన ద్రౌపదిని ఎంత క్లేశపెట్టారు. మీరు అడవులకు వెడుతూంటే సంతోషంతో ఆడిన దుర్భాషలు విన్న వారందరూ లోలోపల వారిని నిందిస్తూనే వున్నారు. అభిమానం వున్నవాడు నింద కంటె మరణాన్ని మేలుగా భావిస్తాడు. నిందపడిన నాడే దుర్యోధనుడు మరణించాడు.

ఇక యిప్పుడు నేను వెళ్ళి అక్కడి వారందరి సందేహాలూ నివారించి సంధికి ప్రయత్నిస్తాను. నీ అభిప్రాయాలు విని వారందరూ నీ శాంతి ప్రియత్వాన్ని అభినందించి దుర్యోధనుని మీద అభిమానాన్ని చంపుకుంటారు.

శాంతిప్రయత్నాలు సాగకపోతే వారి అంగబలం, ఆయుధ బలం పరిశీలిస్తాను. దుర్యోధనుడు మీ రాజ్యం మీ కివ్వడు. యుద్ధం తప్పదు. అందుకు మనం సిద్ధంగా ఉండాలి; అంటూ సాభిప్రాయంగా భీముని వైపు తిరిగాడు వాసుదేవుడు.

## భీమసేనుడు

మధుసూదనా!

కురుసభాభవనంలో మృదువుగా శాంతి సాధనకే ప్రయత్నించు. యుద్ధప్రసంగంతో వారిని భయపెట్టకు.

క్రోధం, అసూయ మూర్తీభవించిన దుర్యోధనుడికి మంచి, పెద్దల వివేకం లేదు. వాని బుద్ధి నీచమయినది. ఐశ్వర్యమదంతో దూర దృష్టి లేకుండా పాపాచారాలతో బ్రతుకుతున్నాడు.

దురాగ్రహంతో మరణాన్ని కోరి తెచ్చుకునే స్వభావం వానిది. వానితో కటువుగా మాట్లాడక నెమ్మదిగా మన దారికి త్రిప్పు.

పచ్చగడ్డి బీడులో దాగిన త్రాచుపాములా అందరికీ హాని కలిగించడమే వానిలక్ష్యం. ధర్మహాని జరిపి సర్వనాశనం కోరి తెచ్చుకుంటున్నాడు. అందుచేత వాని క్రోధాన్ని శాంతింప చేస్తూ హృదయ రంజకంగా ప్రసంగించి సంధి సాగించు. అక్కడి పెద్దలందరితోనూ పాండవులు శాంతినే కోరుతున్నారని స్పష్టంగా విశదం చెయ్యి, అన్నాడు.

విన్న వాసుదేవుడు ఫకాలున నవ్వి:

భీముడేనా యింత శాంతంగా మధురంగా మాట్లాడుతున్నది. పర్వతాలు గాలిలో తేలినా ప్రచండాగ్ని చల్లగా సోకినా ఆశ్చర్యం లేదు.

నిరంతరం కౌరవద్వేషంతో నిద్రకూడా పట్టక కురువంశ నాశన సంకల్పంలో వున్న భీమసేనుని నోట ఇటువంటి మాటలా!

గదాదండంతో శత్రువుల శిరస్సులు తాటి పళ్ళవలె నేలకు రాలుస్తాననే నువ్వేనా ఈ మాటలంటున్నది. ఆనాటి మాటలు గుర్తుకువచ్చి ఈ ప్రసంగం వింటూంటే నవ్వు వచ్చింది.

పౌరుషం లేని నపుంసకుల దారిలో పడ్డావా? ఇంత భయం నీకెందుకు కలిగింది.

మనస్సు వున్నదే, అదెప్పుడూ స్థిరంగా వుండదు. క్షణ క్షణం మారిపోతూంటుంది, సామాన్యులకు.

కాని నువ్వు ఏ వంశంలో పుట్టావు, ఎలా పెరిగావు, నీ కర్తవ్యం ఏమిటి? ఇన్నీ మరిచిపోయి, చివరకు క్షత్రియ ధర్మాన్ని విడిచిపెట్టే దుర్దశలో పడ్డావా? అన్నాడు.

భీముడు: కృష్ణా! చిరకాలంగా ఎరిగివున్నా మీరు నన్ను పూర్తిగా అర్థం చేసుకోలేదనిపిస్తుంది. నా పరాక్రమం దానికి తోడు యుద్ధప్రీతి మీరు గ్రహించలేదు. సముద్రం మీద ప్రయాణం చేసేవాడు దానిలోతు తెలుసుకోలేడు. అలానే మీరు నా మనస్సును చదవలేకపోయారు.

ప్రాణికోటికి తల్లిదండ్రులవలె వున్న భూమ్యాకాశాలకు ఘర్షణ కలిగితే నా రెండు భుజాలతో వాటిని దూరం చేసి సర్వప్రాణినీ సంరక్షించగలను. నా భుజ ద్వయం మధ్య పడిన ప్రాణి బ్రతికి బయటపడుతుందనుకోకు. మా మీద దాడికి వచ్చే మహాయోధులందరూ ఈ బాహువుల మధ్య నలిగిపోతారు. చతురంగ బలాలనూ బంతులవలె ఆడుతాను. ఆత్మస్తుతి మంచిదికాదు. అయినా అవసరం వచ్చి చెప్తున్నాను. వంశనాశన మవుతుందని యుద్ధవిముఖత చూపాను కాని, మతి చలించి, గుండె అదరి శాంతిపాఠాలు చదవలేదు.

కృష్ణుడు: భీమసేనా! నీ సాహస పరాక్రమాలు నేనెరుగనివి కావు. అయినా నీ అంతరంగం తెలుసుకోవాలని అలా అన్నాను.

నీ మాట ప్రకారం నేను సంధికే ప్రయత్నిస్తాను. వారు అంగీకరిస్తారా, సంతోషం లేదా అనుభవిస్తారు. యుద్ధభారం అంతా నువ్వూ అర్జునుడూ చేపట్టాలి.

పురుషయత్నం లేకుండా ఏ కార్యమూ సిద్ధించదు.

ప్రారబ్ధం లేదా అంటే అదీ వున్నది. ధర్మం విడవకుండా నడిస్తే ప్రారబ్ధాన్ని జయించవచ్చునని వేదవిదులు చెప్తున్నారు. అందుచేత మన కృషి మనం సాగించాలి, అంటూ అర్జునుని వైపు తిరిగాడు.

అర్జునుడు: కృష్ణా! అగ్రజ లిద్దరూ చెప్పిన విషయాలు విన్నాను. మీ సమాధానమూ బావుంది. మా ఉభయ వంశాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని నువ్వు వ్యవహారం నడిపించు.

ధర్మయుద్ధంలో మా మీద విజయం సాధించలేక వారు జూదంలో మోసంచేసి నానా బాధలూ పెట్టారు. అటువంటి నీచులను రణరంగంలో కడతేర్చక తప్పదు.

వారితో సంధి సాగే పనికాదు. ఊసరక్షేత్రంలో విత్తనాలు జల్లి ఏం ప్రయోజనం! అందుచేత నిశితంగా ఆలోచించి అనుసరించదగు మార్గాన వ్యవహరించు.

కృష్ణుడు: ఉభయవంశాల మధ్య శాంతిని స్థాపించడానికే ప్రయత్నిస్తాను. చేను చక్కగా దున్ని నీరుపెట్టి విత్తనాలు జల్లినా సకాలంలో వానలు పడకపోతే పంట పండదు. అంతమాత్రాన మన ప్రయత్నం మానుతామా! మానవ ప్రయత్నానికి దైవం తోడుపడాలి. పురుషప్రయత్నం చెయ్యక తప్పదు. వారు నా మాటలు వింటారనే ఆశ నాకు లేదు. అయినా ప్రయత్నిస్తాను, అని నకులుని వైపు తిరిగాడు.

నకులుడు: మాధవా! మనుష్యుల ఆలోచనలు స్థిరంగా ఉండవు. అందువల్లనే ఆలోచనల ప్రకారం పనులు సాగవు. అరణ్యంలో, అజ్ఞాతంలో వున్న నాటి మా ఆలోచనలు వేరు. ఇప్పుడు విన్నావు కదా వీరి అభిప్రాయాలు.

అక్కడ భీష్మ ద్రోణ విదుర బాహ్లికులు మీ సందేశం విని వారికి నీతి బోధించవచ్చు. సంధి సాగితే మంచిదే, కాదంటే యుద్ధం తప్పదని విశదం చెయ్యాలి.

సహదేవుడు: వాసుదేవా! వీరందరూ ఎంచెప్పినా నేను సంధికి అంగీకరించను. దుర్యోధనుని మనసు మారి నీ మాటలకు తలవొగ్గినా నేను యుద్ధం చెయ్యాలనే సంకల్పంతోనే వున్నాను. ఎవరు ఏం చేసినా సంగ్రామం తప్ప దారిలేదు.

సాత్యకి: సహదేవుని మాటలు సముచితంగా వున్నాయి. ఇంతకాలం వీరు పడిన బాధలకు రణరంగంలో ప్రతీకారం జరిపితీరాలి.

అనగానే అక్కడి వారందరూ సాత్యకి సహదేవులను అభినందిస్తూ హర్షధ్వానాలు చేశారు.

## ద్రౌపది

అప్పుడు ద్రౌపదిదేవి ముందుకు వచ్చి కన్నీరు విడుస్తూ:

వాసుదేవా! వీరందరి అభిప్రాయాలూ, సంజయుని ముఖాన ధృతరాష్ట్రుని సందేశమూ, విన్నావు.

సామ దానాలతో కౌరవుల మనసు మారదు. లోభంతో అకార్యాలకు దిగే వారిని సంహరించడం క్షత్రియ ధర్మం. దోషిని శిక్షించకుండా విడిచిపెట్టరాదని నీతివిదులు చెపుతున్నారు.

ఒక్కసారి ఆలోచించు.

ద్రుపదభూపాలుని యజ్ఞవేదిక నుండి ప్రభవించి, పాండుమహారాజుల కోడలుగా వచ్చి, దేవేంద్రసదృశ పరాక్రమం గల పాండవుల భార్యనై, మహా యోధులయిన కుమారుల తల్లినైన నన్ను రాజసూయావభృథ స్నానంతో పవిత్రమైన ఈ కేశపాశం పట్టి దుష్ట దుశ్శాసనుడు కురువృద్ధులూ గురు పూజ్యులూ ఆసీనులయిన నిండుకొలువులోకి యీడ్చుకు వచ్చాడు. వీరందరూ అక్కడ చూస్తూనే వున్నారు.

యదువృష్ణి వంశాలవారు సజీవంగా ఉండగా జరిగిన ఘోరం యిది. అప్పుడు నన్ను రక్షించే వారులేక 'గోవింద' నామస్మరణ చేశాను.

ధృతరాష్ట్రుడు నా యందు అభిమానంతో వీరి రాజ్యసంపదలన్నీ తిరిగి యిస్తే మళ్ళీ జూదం ఆడి ఓడి అరణ్య అజ్ఞాతవాసాలు సాధించారు.

నన్ను ఇంత అవమానించిన దుర్యోధన దుశ్శాసనులు యింకా సుఖంగా జీవించడం కంటె వీరికి అవమానం వున్నదా!

నా యందు నీకు అభిమానం ఉంటే అక్కడకు వెళ్ళి శాంతంగా సంధికోసం ప్రయత్నించకు. యుద్ధమే సిద్ధం చేసుకురా.

సర్వ లక్షణ సంపన్నం
మహా భుజగ వర్చసం
కేశపక్షం వరారోహా
గృహ్య వామేన పాణినా

అని నల్లత్రాచులా మెరుస్తున్న వినీల విశాల కేశపాశాన్ని ఎడమచేతపట్టి ముందుకు జూపి:

మాధవా! రాయబార సమయంలో ఈ కేశపాశానికి జరిగిన అవమానాన్ని విస్మరించకుండా మాట్లాడు. ఘోరపాపానికి ఒడి గట్టిన దుశ్శాసనుని చెయ్యి ముక్కలు ముక్కలై రణరంగంలో ధూళిలో దొర్లుతూంటే చూసే వరకూ నా గుండె మంట చల్లారదు. పదమూడేళ్ళుగా ఆ చిచ్చును దాచుకున్నాను. ఇప్పుడు భీమసేనుని మాటలు వినగానే ఆ మంట మరింత ప్రజ్వలించింది.

వీరందరూ శాంతిప్రియులయితే నిశ్చింతగా ఉండమను. ముసలితనం మీదపడ్డా నా తండ్రి తన కుమారులతో వస్తాడు. నా బిడ్డ లయిదుగురూ అభిమన్యునితో కలిసి సింహాలవలె విక్రమిస్తారు, అని విలపిస్తూ ఆగింది.

కృష్ణుడు: అమ్మాయీ! నువ్వు విచారించకు.

ఇంతకంటె దారుణంగా కురువంశస్త్రీలు గుండెలు బాదుకు శోకించే రోజులు దగ్గరలో వున్నాయి. నీ కళ్ళతో నువ్వు చూస్తావు వారి దీన వదనాలు.

ధర్మరాజు ఆజ్ఞ దైవ సంకల్పం,

భీమార్జున నకుల సహదేవుల పరాక్రమం,

వీటితో దుర్యోధనాదుల శరీరాలు కుక్కలకూ, నక్కలకూ ఆరగింపు అవుతాయి.

భూమి బ్రద్దలయినా, హిమవంతుడు చలించినా, తారామండలాలు నేలకు రాలినా నా నిర్ణయానికి తిరుగులేదు.

పాండవులు శత్రుసమూహాలను సర్వనాశనం చేసి రాజ్యలక్ష్మి విభవాభిరాములవుతారు. ఇంక శోకించకు, అన్నాడు శాంతంగా.

తూర్పుదిక్కులో అరుణరాగాలు వికసిస్తున్నాయి.

చీకట్లను దూరం చేసి సంతోషంగా కన్నులు విప్పుతున్నది ప్రపంచం.

శరత్కాలం ముగిసి హేమంతం ప్రవేశిస్తున్నది.

రేవతీ నక్షత్రం, మైత్రీ ముహూర్తం, వేదవిదుల ఆశీస్సులు, మంగళ వాద్యాలు వింటూ వాసుదేవుడు ప్రయాణ సన్నద్ధుడయాడు. చక్కగా అలంకరించిన రథానికి ఉత్తమ జాతి అశ్వాలను కట్టి ప్రాంగణంలో నిలబెట్టారు.

వాసుదేవుడు సాత్యకిని పిలిచి:

తమ్ముడూ! దుర్యోధన, శకుని, కర్ణులు దుర్మార్గులు. వారు దుర్బలులే, అయినా మనం మన జాగ్రత్తలో వుండాలి. నా చక్రమూ, గదా రథంమీద పెట్టించు, అని అంతా పూర్తి అయాక రథం అధిరోహించాడు.

రథం బయలుదేరబోయే వేళ ధర్మరాజు దగ్గరకు వచ్చి:

కృష్ణా! ఉపవాసదీక్షతో, గురుసేవా పరాయణురాలై, పతిభక్తి తత్పర తతో, లోక కళ్యాణకాంక్షతో జీవితం గడిపే మా అమ్మగారే మమ్మల్ని యింతవరకూ పెంచి పెద్దచేశారు.

అత్తవారింట అడుగుపెట్టింది మొదలు ఆవిడ సుఖ పడ్డ రోజు లేదు. మేము అడవుల పాలవుతూంటే కన్నీరు మున్నీరుగా శోకించింది. నువ్వు హస్తినాపురం వెడుతూనే ఆవిడకు మా అందరి అభివాదాలూ అర్పించు, అన్నాడు.

రథం బయలు దేరింది.

అక్కడి వారందరూ కొంతదూరం రథం వెంట నడిచి వెనుదిరిగారు.

సాయం సంధ్యకు వృకస్థలం చేరి అక్కడ విశ్రాంతి తీసుకుని ఉదయమే ప్రయాణం ఆరంభించాడు.

## ధృతరాష్ట్రుడు

వాసుదేవుడు రాయబారిగా వస్తున్న వార్త విని ధృతరాష్ట్రుడు పెద్ద లందరినీరావించి.

దుర్యోధనా! యదువంశీయుడు వాసుదేవుడు మన క్షేమంకోరి వస్తున్నాడు. ఆయనకు సముచితంగా స్వాగత సత్కారాలు జరిపించు. ఆయన సంతోషిస్తే మనకు మేలు కలుగుతుంది, అన్నాడు.

దుర్యోధనుడు రాజమర్యాదలతో అన్ని ఏర్పాట్లూ చేయించాడు. వాసుదేవుడు అవేవీ గ్రహించకుండా తన ప్రయాణం తాను సాగిస్తున్నాడు.

ధృతరాష్ట్రుడు విదురుని పిలిచి:

వాసుదేవుడు సర్వజన పూజ్యుడు. ఆయనకు పదహారు బంగారు రథాలనూ, ఎనిమిది ఏనుగులనూ, బంగారు కాంతులీనే నూరుమంది సుందరీమణులనూ కానుకగా యిద్దామనుకుంటున్నాను. స్వాగతమర్యాదలు జరపడానికి పెద్దలూ, పిన్నలూ అందరూ వెళ్ళాలి. అంతఃపుర అభ్యంతరాలు లేని నారీమణు లందరూ ఆయనను దర్శించాలి. అని చెపుతూంటే విదురుడు నవ్వి:

ప్రభూ! ఇన్నిటి కంటె ప్రధానం ఆయన చెప్పినట్లు మనం నడవడం. మణులతో నారీమణులతో ఆయనను వంచించి పాండవులకు శూన్య హస్తాలు చూపించాలని మీ భావం. అది జరిగే పనికాదు. ఎన్ని చేసినా ఆయన అర్ఘ్య పాద్యాలు తప్ప ఏదీ స్వీకరించడు. ఆయనకు పాండవుల మీద వున్న ప్రేమను మీరు తగ్గించ లేరు.

ఇప్పటికయినా పాండవుల యందు మీరు వాత్సల్యం చూపి వారి రాజ్యభాగం వారికిస్తే ఆయన సంతోషిస్తాడు; అన్నాడు.

దుర్యోధనుడు: మహారాజా! రాయబారికి ఏవో సత్కారాలు చేయడం నాకు కిట్టదు. విదురుడు చెప్పినట్లు ఆయన పాండవపక్షపాతి. ఈ కానుక లిచ్చి మనం వారికి భయపడుతున్నట్లు కనిపించడం నా కెంతమాత్రం రుచించదు. పయిగా కళ్ళముందు కయ్యం కనిపిస్తుంటే యీ ప్రయత్నాలు క్షత్రియుడు చెయ్యవలసినవి కావు.

భీష్ముడు: నాయనా! ఆదర సత్కారాలకు పొంగిపోయి లొంగేవాడు కా డాయన. ఆయన చెయ్య దలుచుకున్న పని చేసి తీరతాడు. వాసుదేవుని సందేశానుసారం మనం నడవ గలిగితే ఉభయూలకూ మేలు.

దుర్యోధనుడు: నా గొంతులో ప్రాణం ఉండగా పాండవులకు భాగం యివ్వడం కల్ల. వారికి అండగావున్న వాసుదేవుడు రాగానే వానిని యిక్కడ బంధిస్తాను. దానితో పాండవుల ఆశలు చల్లారుతాయి.

ధృతరాష్ట్రుడు: ఆయన మనకు ఏ అన్యాయం చేశాడని బంధిస్తావు.

భీష్ముడు: నీ కుమారుడు మృత్యుదేవత ఆలింగనం కోరి వెదుతున్నాడు. కానియ్యి. నువ్వుకూడా నా మాటలు వినకుండా వీని మాటలమీద విశ్వాసంతో వున్నావు. ఈ పరుష వాక్కులు వినడానికి నా మనస్సు అంగీకరించడం లేదు. వెదుతున్నాను, అని గృహోన్ముఖుడయాడు.

* * *

శ్రీకృష్ణుదు హస్తినాపురంలో అడుగు పెట్టేవేళకు దుర్యోధనుడు తప్ప మిగిలిన ప్రముఖులందరూ ఎదురు వెళ్ళి స్వాగతం పలికారు.

రాజమార్గానికి రెండువైపులా బారులు తీరి వందిమాగధులు స్తోత్ర పాఠాలు వినిపిస్తున్నారు.

నగరంలోని గృహద్వారాలు, గవాక్షాలు నారీజనుల సంతోష పులకిత నేత్రాలతో అలరారుతున్నాయి. వీధులన్నీ నగరంలోని జనసందోహంతో క్రిక్కిరిసి వున్నాయి.

అందరినీ చిరునవ్వుతో తిలకిస్తూ వాసుదేవుడు సభాభవన ద్వారం ప్రవేశించాడు. ధృతరాష్ట్రుడు సింహాసనం దిగి స్వాగతం పలికి, స్వర్ణాసనం చూపించాడు. వాసుదేవుడు భీష్మ పితామహులకు అభివాదం చేసి మిగిలిన ప్రముఖులందరినీ చిరునవ్వుతో పలకరించి కూర్చున్నాడు.

అతిథి మర్యాదలు సాగుతున్నాయి. అందరితో బంధు మర్యాదలు నడిపాడు.

విదురుని వెంట వాని గృహానికి వెళ్ళాడు. విదురుడు పాండవుల యోగక్షేమాలు విచారించాడు.

మధ్యాహ్న సమయాన బయలుదేరి మేనత్త కుంతీదేవిని చూడడానికి వెళ్ళాడు. మేనల్లుని చూస్తూనే ఆవిడ కొంతసేపు చింతించి, తన కుమారుల క్షేమ సమాచారా లడిగి:

కన్నతల్లిని చూడనోచుకోని దుర్దశ వారికి కలిగింది. సత్య ధర్మ నిరతుడు, మానాభిమానదనుడు, రాగద్వేష రహితుడు, రాజర్షి తుల్యుడు అయిన నా ధర్మరాజు ముల్లోకాలు ఏలడానికి అర్హుడు. వాడు ఇప్పుడెలా వున్నాడు, అని పేరుపేరునా ఒక్కొక్కరి యోగ క్షేమాలు అడిగి, నకుల సహదేవులిద్దరూ ఒక్కక్షణం కనిపించకపోతే నా గుండె బెంబేలు పడేది. వారు కుశలంగా వున్నారా!

కృష్ణా! వీరందరి కంటె నాకు నా కోడలు మీద అనురాగం ఎక్కువ. గుణ శీల సౌందర్యాలలో ఆమెకు సాటి రాగలవారు లేరు. మహోన్నత వంశంలో జన్మించిన ఆమె తన బిడ్డలకంటె నా బిడ్డలనే ఎంతో అభిమానంగా చూసుకునేది.

సదాచారాన్నీ, సత్ప్రవర్తననూ ఏనాడూ విడిచిపెట్టని అటువంటి సాధ్వికే కష్టాలు ప్రాప్తించాయంటే విధిని ఏమనాలి.

ఆనాడు కురు గురు వృద్ధులున్న మహాసభలో ఆమెను ఎంత అవమానించారో, తలుచుకుంటే గుండె బ్రద్ద లవుతున్నది.

ఇక్కడి వారందరిలో విదురుడొక్కడే సద్గుణ సంపన్నుడు. ఆయననే లోకం కీర్తిస్తుంది.

నీకు తెలుసు.

అయిన వారితో కలహం వచ్చింది.

రాజ్యలక్ష్మిని కోలుపోయాం.

నా సౌభాగ్యం ఏనాడో మాసిపోయింది.

అన్నీ నేను సహించాను. కాని కన్న సంతానం కంటికి దూరంగా ఉంటే భరించలేకపోతున్నాను. ఎన్నాళ్ళయింది. పద్నాలుగేళ్ళు!

నువ్వు తిరిగి వెడుతూనే నా బిడ్డలతో చెప్పు: పరుల పంచన బ్రతక వలసి రావడం కంటె ఆడదానికి మరణం మేలు. రాచబిడ్డ ఏ లక్ష్యంతో సంతానాన్ని కంటుందో దాన్ని నెరవేర్చవలసిన సమయం ఆసన్నమయిందని చెప్పు. క్షత్రియుడికి ప్రాణాలమీద తీపి పనికి రాదు. పరాక్రమం ప్రదర్శించి భోగాలు సాధించాలి.

మరొక్కమాట - ద్రౌపది చెప్పినట్లు చెయ్యడం అవసరం అని మా అర్జునుడికి చెప్పు. ఆమెకు జరిగిన అవమానానికి ప్రాయశ్చిత్తం జరిగి తీరాలి.

పరాక్రమ సంపన్నులయిన అయిదుగురు కొడుకులు.

మహాబలిష్ఠుడయిన బలరాముడు, నువ్వు, నీ కొడుకు ప్రద్యుమ్నుడు ఇందరున్నా నాకు దుఃఖాలు తప్పలేదు, అని కన్నీరు పెట్టింది.

శ్రీకృష్ణుడు: విచారించకు. నువ్వు పుట్టిన యిల్లు మెట్టినయిల్లు సామాన్య మయినవి కావు. నీ భర్త మహావీరుడు. అలానే నీ బిడ్డలు మహాయోధులు క్లేశాలను సంతోషంతో సహించగలవారు దేన్నయినా సాధిస్తారు.

త్వరలోనే పాండవులు శత్రుసంహారం చేసి నీకు శాంతి సంతోషాలు కలిగిస్తారు. నిశ్చింతగా ఉండు, అని ఓదార్చి, నమస్కరించి బయలు దేరాడు.

బయలు దేరిన వాసుదేవుడు దుర్యోధనుని మందిరానికి వచ్చాడు. అక్కడ అతిథి మర్యాదలు స్వీకరించి, అందరి కుశలమూ అడిగాడు. కొంతసేపు యిష్టాగోష్ఠి నడిచింది. దుర్యోధనుడు విందుభోజనానికి రమ్మని బలవంతం చేశాడు.

రాయబారి తన పని నెరవేరేవరకూ విందు విలాసాలలో పాల్గొన రాదు. పాండవుల హితవు కోరే నేను వారిమీద ద్వేషం కలవారు పిలిస్తే విందులకు వస్తాననుకున్నావా! మీ మహామంత్రి విదురుడున్నాడు. అక్కడ ఆరగిస్తాను, అని విదురుని గృహానికి వెళ్ళి అక్కడ విద్వాంసులకు మర్యాదలు జరిపి అనంతరం విదురునితో కలిసి భోజనం చేశాడు.

అనంతరం విశ్రాంతి తీసుకుంటుండగా విదురుడు.

వాసుదేవా! ధర్మార్థాలతో నిమిత్తం లేని దుర్యోధనునితో ఏం మాట్లాడినా ప్రయోజనం లేదు. అసత్యాన్ని ప్రేమించే వానికి పెద్దలు చెప్పే హితవు చెవికెక్కదు. పోగా నిత్యశంకితుడు దుర్యోధనుడు.

తన కర్ణుడొక్కడే సర్వశత్రు సంహారం చెయ్యగలడనే విశ్వాసం కల దుష్టునితో నువ్వు శాంతియుతంగా మాట్లాడి ప్రయోజనం లేదు.

రాజ్యం, యౌవనం యీ రెండింటితో మదించి వున్న వానితో సంప్రదింపులు జరపడం వ్యర్థం. పయిగా ఆ దుష్టులు నీకు హాని తలపెడతారని భయంగా ఉంది.

ఈ చక్రవర్తులందరికీ ఆయువు చెల్లింది. కాకుంటే దుర్యోధనుని వెంట చేరేవారు కాదు. ఇవన్నీ నీకు తెలియనివి కావు. అయినా నా విధి నేను నిర్వర్తించాలి, అన్నాడు.

చిరునవ్వుతో వాసుదేవుడు: ధీశాలీ! వాత్సల్యం నిండిన గుండెతో తల్లిదండ్రులు చెప్పవలసిన మాటలు చెప్పావు. వివేకం కల విద్వాంసుడివ్వవలసిన సలహా యిచ్చావు. నే నెందుకు వచ్చానంటే అన్నదమ్ముల మధ్య రేగిన కలహాన్ని నివారించ గలిగి వుండీ మాట్లాడకుండా ఉపేక్షించాననే లోక నిందకు ఆస్కారం యివ్వదలుచు కోలేదు. నా మాటలు సావధానంగా వారు వినగలిగితే సంధికి సమ్మతిస్తారు. లేదంటే వినాశనం తప్పదు, అని శయనించాడు.

## రాయబారం

తెల తెల వారుతూండగా ఉభయులూ నిద్రలేచి సభా భవనానికి బయలు దేరడానికి సన్నద్ధులయారు. వాసుదేవుని రథం నయన మనోహరంగా ఉంది.

దుర్యోధనుడు తన అనుచరులతో స్వాగతం పలకడానికి వచ్చాడు. శ్రీకృష్ణుడు చిరునవ్వుతో విదురుని చేయిపుచ్చుకుని రథంఎక్కించాడు. అనంతరం తాను అధిరోహించాడు.

సాత్యకి, కృతవర్మాది యదువంశీయులు మరొక రథం మీద బయులుదేరారు. శకుని దుర్యోధను లిద్దరూ ఒకే రథం మీద వస్తున్నారు.

రథాలు బయలుదేరుతూంటే మంగళ వాద్యాలు వినిపించారు. ఆయుధ పాణులై సైనికవీరులు ముందు నడుస్తున్నారు.

సభాభవన ప్రాంగణంలో వేణుగానం, వీణానాదం, శంఖధ్వానాలూ, ఆహ్వానగీతులు ఆలపించాయి. ప్రముఖులందరూ వరుసలలో నిలబడి చిరునవ్వుతో వాసుదేవునికి మర్యాద జరిపారు.

సభాభవనంలో అడుగుపేట్టే వేళ భీష్మ ద్రోణాదులు ధృతరాష్ట్రుని వెంట నడిచి వాసుదేవుని లోపలకు తెచ్చారు.

అదే సమయానికి అక్కడకు వచ్చిన నారద పరుశురామాది మును లందరికీ ఉచితాసనాలు వేయించమని వాసుదేవుడు భీష్ములవారికి చెప్పగా క్షణాలలో ఆ ఏర్పాట్లు పూర్తి అయాయి.

అనంతరం వాసుదేవుడు ఆసీనుడయాడు. ప్రక్కనే దుర్యోధన కర్ణులు ఒకే ఆసనం అలంకరించారు. అందరూ సావధానులై రాయబారం వినడానికి ఎదురు చూస్తున్నారు.

సభాసదులందరి కన్నులూ వాసుదేవుని మీదనే వున్నాయి. నిశ్శబ్దంగా వున్నారందరూ.

అప్పుడు గొంతు సవరించి వర్షాకాల మేఘ గర్జనతో సమమయిన గంభీర స్వరంతో శ్రీకృష్ణుడు:

ధృతరాష్ట్ర మహారాజా! కురు పాండవులూ వారి బంధుమిత్రులూ సుఖ సంతోషాలతో జీవయాత్ర సాగించడానికి అనుకూలమయిన శాంతిని ప్రసాదించుమని అడగడానికి వచ్చాను. ఇంతకంటె నిఖిల జన శ్రేయస్కర మయినది లేదని నీకు నేను వేరే చెప్పవలసిన పనిలేదు.

ఈనాడు రాజ లోకంలో కురువంశీయుల కున్న కీర్తి ప్రతిష్ఠలు మరెవరికీ లేవు. అందుకు ముఖ్యకారణం మీరు శాస్త్ర మర్యాదలను

యథాతథంగా అనుసరించి నడవడం దానికితోడు దయా, ఓరిమి, సాను భూతి, సౌమ్యస్వభావం, సత్య వాక్పాలన, ప్రీతి, మీవంశీయులకు సహజ గుణాలు.

అటువంటి వంశంలో ప్రభవించిన మీరు ఏమాత్రం అనుచితంగా ప్రవర్తించినా ఈ లోకం వ్రేలెత్తి చూపి తీరుతుంది.

మన పిల్లలు రహస్యంగా అన్యాయాలు, అక్రమాలు, చేస్తున్నారేమో గ్రహించి వారిని సరయిన దారిలో పెట్టడం మన బాధ్యత. అలాకాక వాళ్ళు మన కనుల ఎదుటనే దుర్మార్గపు పనులు చేస్తూంటే అప్పటికప్పుడే వారిని దండించి బుద్ధి చెప్పుకోవాలని నీకూ తెలుసు.

నీ కుమారులు ఇంత కాలంగా సాగించిన అత్యాచారాల ఫలంగా ఘోర విపత్తు నీ నెత్తి మీద పడనున్నది. ఇప్పటికయినా నువ్వు మేలుకొని వారిని సక్రమ పథాన నడపకపోతే సర్వనాశనం తప్పదు.

నువ్వు తలుచుకుంటే మీ ఉభయవంశాలూ హాయిగా జీవించగలవు. నువ్వు నీ బిడ్డలను అదుపులో పెట్టు. పాండవులను నేను సరిగ్గా నడిపిస్తాను.

పాండురాజనందనులతో సఖ్యంగా ఉంటే వారు మీ అందరినీ మర్యాదగా చూస్తూ రక్షించగలరు. ఆనాడు మీవైపు కత్తి దూయగల వారుండరు. అందువల్ల పాండవుల కంటె మీకే మేలు.

కాదంటావా? యుద్ధం జరుగుతుంది. అటూ యిటూ నాశనం, నీకు సంతాపం. మీకు వార్ధక్యం వచ్చిపడిన యీ సమయంలో ఎందుకీ దురవస్థలో చిక్కుకోవడం.

పాండవుల యందు పుత్రవాత్సల్యం చూపి వారి రాజ్యభాగం కాకపోతే అయిదు వూళ్ళిచ్చినా చాలునని ధర్మరాజు ప్రార్థిస్తున్నాడు. ఈనాటి వరకూ వారికి మీవారు చేసిన అవమానాలూ, కలిగించిన క్లేశాలూ విస్మరించి సంధికే వారు చెయ్యి జాపుతున్నారు. బాగా ఆలోచించి శాంతికోసం కృషి చేయండి, అన్నాడు.

అనంతరం నారద, పరశురామ, కణ్వమహర్షులు దుర్యోధనునికి హితబోధ చేశారు. ద్వేషం కంటె శాంతం ఎంత ప్రయోజనకరమో వివరించారు.

ధృతరాష్ట్రుడు తన నిస్సహాయతను తెలిసి చింతించాడు.

కృష్ణుడు: దుర్యోధనా! మన శ్రేయస్సుకోరే పెద్దల మాటలు విని నడుచుకుంటే సుఖంగా ఉండగలము. నువ్వయినా తెలియని వాడవుకాదు. మహామహుల వంశంలో జన్మించావు. విద్వాంసుల సన్నిధిని సర్వవిషయాలూ గ్రహించావు.

దుస్సహవాసం వల్ల అధర్మమార్గాన పడ్డావు. దానివల్ల విపత్తులు వచ్చి పడుతున్నాయి.

పాండవులతో సంధి మీ అందరికీ క్షేమమని నీ మంత్రులూ, మీ వంశ వృద్ధులూ చెపుతున్నారు. వారి హితబోధలు పెడచెవిని పెడితే నాశనం తప్పదు.

పుట్టింది మొదలు పాండవులతో ద్వేషంతో ఉండి వారిని కడతేర్చాలని చూసినా వారు నీ యందు అభిమానంతోనే వున్నారు. ధర్మమార్గం తప్పకుండా న్యాయంగా వారికి దక్కవలసిన రాజ్యం వారి కిమ్మని అడుగుతున్నారు.

భీమార్జునులే కోపంతో సంగ్రామ రంగంలో నిలబడితే వారి ముందు నిలువగలవారు ముల్లోకాలలో లేరు. అది గ్రహించి వారితో సంధి చేసుకో.

భీష్ముడు: నాయనా! వాసుదేవుడు యథార్థం చెప్పాడు. అది కాదనకు అందువల్ల అందరికీ క్షేమం కలుగుతుంది. కన్న తల్లి దండ్రులకు క్లేశం కలిగించకు.

ద్రోణుడు: దుర్యోధనా! వాసుదేవుడూ, భీష్ముడూ నీ మేలుకోరి చెప్పిన మాటలు సావధానంగా విని ఆచరించు. నీచుల వెంటబడి వారి ప్రియవాక్యాలు విని ఆపదలలో పడకు. ఇంతకంటె ఎవరూ ఏమీ చెప్పలేరు.

విదురుడు: మే మెవరం నీ గురించి బాధపడడం లేదు. ముసలితనం మీదపడ్డ నీ తల్లిదండ్రులకు రాబోయే ప్రమాదానికి చింతిస్తున్నాం.

నీ ఆలోచనలు వంశనాశనానికి దారి తీస్తున్నాయి. నీ మాతా పితరులు రెక్కలు లేని పక్షులవలె గడపవలసి వస్తుందని బాధపడుతున్నాను.

ధృతరాష్ట్రుడు: నాయనా! ఇందరు పెద్దలు వాసుదేవుని హితవునే సమర్థిస్తున్నారు. నేను కూడా ఆ దారినే నడువమని చెప్తున్నాను. అదే శ్రేయస్కరం.

అందరి ఉపదేశాలూ విని దుర్యోధనుడు:

కృష్ణా! పాండవ పక్షపాతంతో సాగిన నీ ప్రసంగం నన్ను దోషిగా చూప డానికీ, నాకు భయం కలిగించి, మీపని నెరవేర్చుకొనడానికీ వినియోగపడేలా వుంది. ఇక్కడి పెద్దలు కూడా అదే ధోరణిలో వున్నారు.

ఎంత ఆలోచించినా నేను చేసిన నేరం ఏమిటో నాకు తెలియదు.

ద్యూతప్రీతిగల పాండవులతో మా శకునిమామ క్రీడ సాగించి రాజ్యం గ్రహించడం నా దోషమా! ఒకసారి ఓడినా, వారికి రాజ్యసంపదలు ధారాదత్తం చేశాం. వారు మళ్ళీ ఆటకు దిగడం నా నేరమా!

సర్వనాశనం అనీ భయానక యుద్ధం అనీ బెదిరించి నంతలో క్షత్రియ వీరులు జంకి తలవంచరు. మా వీరవరుల ముందు దేవతలు నిలబడలేరు. ఇక పాండవుల లెక్కఏమిటి!

వీరుడైనవాడు రణరంగంలో మరణానికి వెనుదీయుడు. పర్యవసానంగా నేను పాండవులకు సూదిమొన మోపిన నేల అయినా విడిచి పెట్టేది లేదు.

శ్రీకృష్ణ: చాలా సంతోషం. అయితే యుద్ధభూమిలో ప్రాణాలు వదలడానికే సిద్ధంగా వుండు. పాండవులకు చేసిన ద్రోహం ఏమిటని అడుగుతున్నావు. వారి సిరి సంపదలు చూచి ఓర్వలేక మాయచేసి హరించడానికి జూదం సాగించడం ద్రోహం కాదూ!

అన్నగారి భార్య అనే ఆలోచన లేకుండా నిండుసభలో ఆమెకు చేసిన అవమానం ఆడిన దుర్భాషలూ అక్రమాలు కావా?

వారు వనవాసానికి వెడుతూంటే కర్ణ దుశ్శాసనులతో కలిసి ఆడిన అపహాస్యం అంతా ధర్మపరు డెవడైనా విని సహించగలడా!

అంతదాకా ఎందుకు!

బాల్యంలో వారిని వారణావతానికి పంపి లక్కయింట పెట్టి నాశనం చెయ్యడానికి పథకం వేయలేదూ!

విషం కలిపిన అన్నం పెట్టి, పాములతో కరిపించి నదిలో త్రోయించి భీమసేనుని చంపడానికి ఎన్ని ఎత్తులు వేయలేదు, ఈ విషయాలన్నీ ఎవరెరుగనివి.

ఈనాడు వారి రాజ్యం వారి కివ్వననడం ఏం న్యాయం, నేడు కాకపోతే రేపు రణ రంగములో రక్త మాంసాలలో నువ్వు గిలగిల లాడే రోజున వారి రాజ్యం వారు తీసుకుంటారు.

దుశ్శాసనుడు: అగ్రజా! వీరి మాటలు వినకపోతే యిక్కడే మనల్ని వీరు త్రాళ్ళతో బంధించే రీతిలో వున్నారు, అనగానే దుర్యోధనుడు సభ్యులందరినీ అవమానిస్తూ వెలుపలకు వెళ్ళిపోయాడు. వెనువెంటనే వాని తమ్ములూ, మిత్రులూ నిష్క్రమించారు.

భీష్ముడు: ధృతరాష్ట్రా! వీణ్ణి రాజసింహాసనం ఎక్కించగలవు. కాని దానికి తగిన సత్ప్రవర్తన ఎక్కడనుంచి తేగలవు.

శ్రీకృష్ణుడు: ఇప్పటికయినా మించిపోయింది లేదు. మా మామ కంసుడు లోకకంటకుడుగా తయారవుతుంటే నేను వానిని మృత్యువుకు ఆరగింపుచేసి భోజవంశాన్ని రక్షించాను. అలానే మీరు దుర్యోధన, దుశ్శాసన, శకుని కర్ణులను బంధించి పాండవులకు అప్పగిస్తే నిఖిల ప్రజాక్షేమం జరుగుతుంది.

మహారాజా!

వంశరక్షణార్థం వ్యక్తినీ, గ్రామ శ్రేయస్సుకోసం కులాన్నీ, దేశ కల్యాణానికి గ్రామాన్నీ, ఆత్మశాంతికి భూమండలాన్నీ, విడిచి పెట్టాలని నీతివిదులు చెపుతున్నారు. అందుచేత మీవంశ రక్షణకోసం దుష్టులను పారద్రోలండి, అన్నాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు విదురుని పంపి గాంధారిని రప్పించాడు, గాంధారి రాగానే ధృతరాష్ట్రుని ఆజ్ఞానుసారం విదురుడు దుర్యోధనుని తీసుకురావడానికి వెళ్ళాడు.

గాంధారి: మహారాజా! పురుషార్థాలలో ప్రధానమయిన ధర్మార్థ పరిజ్ఞానం లేని వానిని ప్రేమగా మీరు సింహాసనార్హుని చేయబోయిన అవివేక ఫలం అనుభవిస్తున్నారు.

దుష్టుడు, మూఢుడు, లోభి, దుస్సహవాసప్రియుడు అయిన కుమారుని మీద అనురాగంతో మీరెంత చేశారు. అప్తుల మధ్య వైరం పెరగనిచ్చారు. అందువల్ల శత్రువులకు చులకన అవుతామని ఊహించలేక పోయారు. సామ దాన భేదాలు ఫలించనినాడు దండోపాయం స్వీకరించాలి కాని ముందుగానే దండనీతిని అనుసరించడం వివేకమా!

అంటుండగా దుర్యోధనుడు క్రోధంతో సెగలు క్రక్కుతూ వచ్చి తల్లి ముందు నిలబడ్డాడు అది గ్రహించి:

నాయనా! నీ శ్రేయస్సు కోరి భీష్మ, ద్రోణ, కృప, విదురాదులు చెప్పిన హితవు విని నడుచుకో ఇంద్రియాలను అదుపులో పెట్టగల శక్తిమంతులే రాజ్యపాలనకు అర్హులు. పెంకి గుర్రాన్ని నిలబెట్టి నడపలేని రౌతుకీ, జితేంద్రియుడు కాని రాజుకూ, భేదం లేదు.

పాండవులు వీరులు, జ్ఞానులు, పయిగా వారందరూ ఏకాభిప్రాయంతో వున్నారు.

కృష్ణార్జునులు అజేయులని మన పెద్దలందరూ చెప్తున్నారు.

నువ్వు క్రోధాన్ని విడిచి వారి రాజ్యం వారికిస్తే నీ శత్రువులను కూడా వారు సంహరించి సుఖ శాంతులు ప్రసాదిస్తారు. నీ రాజ్య భాగంతో నువ్వూ నీ మంత్రులూ భోగ భాగ్యాలతో ఆనందించవచ్చు.

పదమూడు సంవత్సరాలు వారికి కలిగించిన క్లేశాలు చాలు. ఈ నాటికీ వారిని జయించే శక్తి నీకు లేదు.

భీష్మ ద్రోణులు మన ఏలుబడిలో జీవిక సాగిస్తున్నారు. కనక ఆ దృష్టితో యుద్ధం చేస్తారే తప్ప వారు ధర్మవిరుద్ధంగా నడుస్తారని అనుకోకు.

ఎటు చూసినా పాండవులతో సంధి నీకూ, నీ పరిజనానికీ శ్రేయస్కరం అని మరువకు అంది.

తల్లి మాటలు కూడా చెవికెక్కని దుర్యోధనుడి సభారంగం విడిచి మిత్రుల దగ్గరకు వెళ్ళి కృష్ణుని బంధించి యిక్కడే ఉంచితే పాండవులు కోరలు పీకిన పాముల్లా పడి వుంటారని నిశ్చయించి, ఆ ప్రయత్నంలో సభలోకి వస్తున్నాడు. ఇతరుల మనసులోని ఆలోచనలను పసిగట్టగల సాత్యకి ఆవేశంతో లేచి:

మహారాజా! మండుతూన్న నిప్పును ఒడిలో మూట గట్టుకోడానికి ప్రయత్నించే పసివారి వలె నీ కుమారులు వాసుదేవుని బంధించడానికి యత్నిస్తున్నారు.

అన విని విదురుడు; మహారాజా! మహామహుడైన వాసుదేవుని బంధించ డానికి సంకల్పించిన వీరందరికీ మృత్యుదేవత నెత్తిమీద తాండవిస్తున్నది అన్నాడు.

కృష్ణుడు: చాలా సంతోషం. నన్ను బంధించడానికి వచ్చే వారి శక్తి చూడాలని ఉంది. దుష్కార్యాలను ఆచరించడానికి నేను విముఖంగా వున్నాను. లేకుంటే నిశ్శంకగా వీరందరినీ యిప్పుడే కడతేర్చి ధర్మరాజుకు శ్రమ తప్పించే వాడిని. వీరిని బంధించి పాండవుల పాదాలమీద పారవేయడం కష్టం కాదు.

కాని, మహారాజా! నీ యెదుట అటువంటి పని చేయడం నాకు యిష్టంలేదు. రమ్మనండి. నన్ను ఎలా బంధిస్తారో చూస్తాను, అన్నాడు.

ధృతరాష్ట్రుడు, విదురుడు ఉభయులూ మందలించి దుర్యోధనుని మనసు మార్చలేకపోయారు.

శ్రీకృష్ణుడు: దుర్యోధనా! ఒక్కసారి నీ కనులు విప్పి యిటు చూడు, అంటూ విశ్వరూపం ధరించాడు.

ఆ సమయంలో దివ్యకాంతులతో దేవగణాలు, రుద్ర, ఆదిత్య, వసు, మహర్షి గణాలూ, పాండవయోధులూ, ప్రజాపతీ గోచరించారు.

అక్కడి రాజులందరికీ ఆ విద్యుదుజ్వల కాంతిని చూసే శక్తిలేక కన్నులు మూతలు పడ్డాయి.

భీష్మ, ద్రోణ, విదుర, సంజయులు మాత్రం వాసుదేవుని అనుగ్రహంవల్ల ఆరూపాన్ని చూడగలిగారు.

అది గ్రహించి ధృతరాష్ట్రుడు తనకు కూడా ఆ రూపం దర్శించే అవకాశం దయచేయమని కోరగా కృష్ణుడు ఆయనకు నేత్రదానం చేశాడు.

క్షణాలవ్యవధిలో విశ్వరూపాన్ని ఉపసంహరించి సాత్యకి కృతవర్మలను వెంటబెట్టుకొని సభవీడి వెలుపలికి వచ్చాడు. సాత్యకి ఆదేశానుసారం దారుకుడు రథాన్ని ద్వారంలో సిద్ధంగా ఉంచాడు. ధృతరాష్ట్రుడు ఆ వెనుకనే వచ్చి:

కృష్ణా! నా కుమారులమీద నా అధికారం ఎలా వున్నదో చూశావు కదా! ఇంక నా దోషం ఏమీ లేదని అంగీకరిస్తావా! అన్నాడు.

ఆ మాటలు విని వాసుదేవుడు తనను సాగనంపవచ్చిన పెద్దలందరిని చూసి:

మీరంతా విన్నారు కదా! ఇంక నేను పాండవులను కలిసి అనంతర కర్తవ్యం సాగించాలి. నాకు సెలవివ్వండి, అన్నాడు.

రథం కుంతీదేవి గృహం దగ్గర ఆగింది.

కృష్ణుడు లోపలకు వెళ్ళి సభావిశేషాలు వివరించి: అత్తా! జరుగవలసింది జరుగుతుంది. నేను వెడుతున్నాను, అన్నాడు.

కుంతి: కృష్ణా! క్షత్రియ మాత ఏ మహోద్దేశంతో సంతానాన్ని కంటుందో, ఆ లక్ష్యాన్ని నెరవేర్చవలసిన సమయం ఆసన్న మయిందని నా బిడ్డలకు చెప్పు. దండ నీతిని సక్రమంగా నిర్వహించని నాడు ప్రజలలో అధర్మం పెరిగి అమాయకులు క్లేశాలలో చిక్కుకుంటారని వివరించు. పాండురాజు పరాక్రమంతో సాధించిన రాజ్యాన్ని ఆయన కుమారులు ఆదే దారిలో సంపాదించాలనీ, మహావీరులయిన అయిదుగురు కొడుకు లుండి కూడా నే నిక్కడ యిలా బాధపడుతున్నాననీ మరచిపోవద్దని విశదం చెయ్యి, అంది.

మేనత్తదగ్గర సెలవు తీసుకుని, రథం ఎక్కుతూ, మిగిలిన కురు ప్రముఖు లందరికీ వీడ్కోలు చెప్పి తన వెంట కర్ణుని తీసుకుని నగరం సరిహద్దులు చేరాడు.

రథం ఆపాడు.

కర్ణుని దగ్గరగా రమ్మన్నాడు.

## కర్ణహృదయం

శ్రీకృష్ణుడు: కర్ణా! ఈ సమయంలో అతి ముఖ్యమైన విషయం నీతో మాట్లాడాలని పిలిచాను. బాల్యప్రభృతి నువ్వు మహనీయుల సన్నిధిలో సర్వవిద్యలూ అభ్యసించి, జ్ఞానసిద్ధి పొంది ధర్మవిషయాలు గ్రహించావు, నీకు తెలియని లోకధర్మం లేదు.

కానీనుడు, సహోఢుడు అని కన్యాపుత్రులను పిలుస్తారని ఎరుగుదువు.

పెళ్ళికాకుండా శిశువును కంటె

ఆ బాలుడు కానీనుడు.

వివాహానికి ముందు గర్భవతియై

భర్త యిల్లుచేరాక ప్రసవించగా

ప్రభవించిన వాడు సహూఢుడు.

ఆ కన్యలను ఎవరు పెళ్ళి చేసుకుంటే వారే వీరికి తండ్రి అవుతారు.

కుంతీదేవి కన్యగా ఉన్నరోజుల్లో ఆవిడ నిన్ను ప్రసవించింది. అంటే ధర్మరాజాదులకు అగ్రజుడవు. ఆ విధంగా యీ సింహాసనం నీది.

ఇప్పుడు నామాట ప్రకారం పాండవులతో చేరు. చేరితే పితృ వంశీయులయిన పాండవులు, మాతృవంశం వారయిన యాదవవంశాల వారు నీ వెనుక అండగా ఉంటారు.

పాండవులూ, వారి పుత్రులూ సంతోషంతో నిన్ను సేవించడానికి ముందుకు వస్తారు. వంది మాగధస్తోత్రపాఠాలతో రాజభోగాలు అనుభవించ గలవు.

అంతేకాదు, అతిలోకసుందరి ద్రౌపది నిన్ను అనురాగంతో భర్తగా స్వీకరిస్తుంది, అన్నాడు.

కర్ణుడు: కృష్ణా! స్నేహభావంతో, అనురాగంతో నా క్షేమం కోరి చెప్పిన నీ మాటలు పరమసత్యాలు; నేను కుంతీపుత్రుడననీ ఎరుగుదును. కాని ఆ నాడే నన్ను గంగలో విడిచి నాకు రాజవంశసంస్కారం లేకుండా చేసింది.

నేను తమకు దొరికిన నాటినుంచి ఎంతో వాత్సల్యంతో నన్ను పెంచి యింత చేసి, వారి వంశీయులతో నాకు వివాహం జరిపిన యీ అధిరథుడూ రాధా యీనాడు నా మీదనే వారి ఆశలు పెట్టుకున్నారు.

ధర్మశాస్త్రాలు చదివిన నేను ఈ దంపతులకు పరలోకక్రియలు నిర్వర్తించక పోవడం న్యాయమా? అంతకంటె కృతఘ్నత లేదే! భూమండలం అంతా వదులుకోగలను కాని వీరి మనస్సు కష్టపెట్టలేను.

అలానే యీ నాటివరకూ రాజభోగాలలో నన్ను సంతృప్తుని చేసే దుర్యోధనుడు నా మీద ఆశతోనే యుద్ధానికి సిద్ధమవుతూంటే అటువంటి మిత్రునికి ద్రోహం చెయ్యలేను.

సర్వవిద్యావిదులూ, శస్త్రాస్త్రకోవిదులూ అయిన వీరులందరూ రణ రంగంలో దూకడానికి ఉద్యుక్తులయి వున్నారు. వారందరి వీరవిహారం సాగాలి. ఇంతటి వీరులు అజ్ఞాతంగా మరణించడం ఉచితంకాదు.

ఈ సంగ్రామగాథను తరతరాల ప్రజలు చెప్పుకుని సంతోషించే కీర్తి దక్కనియ్యి మాకు.

యుద్ధం పూర్తి అయేవరకూ మన మధ్య సాగిన యీ సంభాషణ ఎవరికీ తెలియనివ్వకు. ఎందుకంటే నా జన్మరహస్యం తెలిస్తే ధర్మరాజు యుద్ధానికి దిగడు.

మరొక్కమాట —

ఈనాడు ఈ రాజ్యం నాకు దక్కినా మరుక్షణంలో అది దుర్యోధనునికి ధారవోస్తాను. సామ్రాజ్య పాలనం ధర్మరాజు సాగించాలి కాని మా చేతులలో పడకూడదు.

ముఖ్యాంశం —

ధార్తరాష్ట్రులు శస్త్రయజ్ఞం ప్రారంభించారు.

అది నీ ఆధ్వర్యవంలో, అర్జునుడు హోతగా, గాండీవం స్రువంగా, అస్త్రమంత్రాలతో వీరుల పరాక్రమమే ఆజ్యంగా, సాగుతుంది.

అభిమన్యుడు ఉద్గాత: భీమసేనుడు ప్రస్తోత, ధర్మరాజు బ్రహ్మణ్యుడు, శంఖభేరీ నాదం సుబ్రహ్మణ్య నాదం.

శత్రు శీర్షాలు పురోడాశం; రక్తం హవిస్సు, దుర్యోధనుడు యజమాని, సేనావాహిని యజమానపత్ని, ఘటోత్కచుడు శామిత్రకర్మ నిర్వహిస్తాడు.

అనాడు సభా భవనంలో దుర్యోధనాదుల ప్రీతికై నేను పాండవులను పరిహాసించి కటువుగా భాషించి నందుకు నా హృదయం పశ్చాత్తాపంతో కుములుతూనే వుంది.

నాటి దుష్కర్మల ఫలితంగా ఇక్కడి వారందరూ రణరంగంలో నిహతులు కాక తప్పదు. భీమసేనుడు దుశ్శాసనుని రొమ్ము చీల్చి రక్తపానం చేసిననాడు, అర్జునుడు సర్వ శాత్రవ చమూ సంహారం చేసిననాడు, భీముడు దుర్యోధనుని నేల కూల్చిననాడు, ఈ సంగ్రామ యజ్ఞం సమాప్తం అవుతుంది.

ఇటీవల నాకు చాలా దుస్స్వప్నాలు వస్తున్నాయి. వాటి పర్యవసానం కురువంశ నాశనమే.

చివరి మాట విను, ఇప్పుడు నేను కుంతీపుత్రుడనని చెప్పుకుంటే లోకులంతా ఏమనుకుంటారు. అర్జునునికి జంకి కర్ణుడు ఎంత నైచ్యానికి దిగిపోయాడు అని పరిహసించరా?

యుద్ధంలో బ్రతికితే మళ్ళీ కలుసుకుందాం, లేదా వీరస్వర్గమే అన్నాడు.

శ్రీకృష్ణుడు: కర్ణా! ఎంత చెప్పినా నీ పట్టుదల నీదే. మీ మహారాజుతో చెప్పు. అమావాస్య రానున్నది. శరత్కాలం వెళ్ళి హేమంతం రానున్నది. భూమి నిండుగా పంటలున్నాయి. చెట్లు తీగలు ఫల పుష్ప సమృద్ధిగా వున్నాయి.

ఈతి బాధలు కలిగించే ఈగలు లేవు. బాటలు బురద లేకుండా గట్టిపడ్డాయి. నదీ జలాలు స్వాదువు లయాయి. వేడీ చలి సమంగా వున్నాయి. యుద్ధాని కిది మంచి కాలం.

పాండవులు రణరంగానికి వచ్చి తమ పరాక్రమంతో రాజ్యం సంపాదించు కుంటారని మీ వృద్ధులందరికీ వివరించు వెళ్ళిరా, అన్నాడు.

రథాలు బయలుదేరాయి.

## కుంతీదేవి

రాయబార విశేషాలు విన్న కుంతీదేవి హృదయం ఆందోళనతో నిండింది. సంపదలు ఎంత నీచమయినవి. వాటికోసం బంధువుల మధ్య విరోధాలు రేగి నాశన కాండ సాగుతుంది. అంతకంటే నిర్ధనుల జీవితాలే శ్రేయస్కరం అనిపించింది.

ఆలోచించి కర్ణుడితో తాను మాట్లాడితే ప్రయోజనం ఉండవచ్చునని భావించి సంధ్యా సమయంలో బయలుదేరింది.

ఆ సమయంలో కర్ణుడు గంగానదీ స్నానం చేసి సూర్యుని ఉపాసిస్తూ ఉంటాడని గ్రహించి నదీతీరానికి నడిచింది.

అప్పటికి కర్ణుడు అర్ఘ్యాంజలు లర్పిస్తున్నాడు.

దూరంగా నిలబడింది కుంతి.

ఉపాసన ముగించి వెనుదిరిగి వస్తూ కుంతీదేవిని చూచి వినయంగా తలవంచి చేతులు జోడించి

రాధేయుడను అధిరథుని కుమారుడను, కర్ణుడను. అభివాదం చేసి అడుగుతున్నాను. ఏ కారణం వల్ల వచ్చారో చెపితే సేవ చేస్తాను, అన్నాడు.

కుంతి: నాయనా! నువ్వు కుంతీ పుత్రుడవు కాని రాధేయుడవు కావు. కుంతి భోజుని యింట పెరిగే రోజులలో నేను నిన్ను ప్రసవించాను. సూర్యుని అనుగ్రహం వల్ల సహజ కవచ కుండలాలతో ప్రభవించావు. అది తెలియక దుష్ట ధార్తరాష్ట్రులను సేవిస్తున్నావు.

అర్జునుడు పరాక్రమంతో సంపాదించిన రాజ్యలక్ష్మిని కౌరవులు మోస గించి అనుభవిస్తున్నారు. పాండవులతో కలిసి యీ రాజ్యం అంతా అనుభవించే హక్కు నీది. తల్లిని సంతోషపెట్టడం తనయుని ప్రథమ కర్తవ్యం అంది.

కర్ణుడు: కుంతిభోజపుత్రీ! మీరు వాస్తవం చెప్పారు. కాని జన్మ ప్రభృతి నా సంస్కారం భిన్నంగా సాగింది. ఆనాడు మీరు ధర్మాన్ని విస్మరించి యీనాడు ధర్మోపదేశం చేస్తున్నారు.

కృష్ణ సారథ్యంలో వచ్చే అర్జునునికి ఎదురు నిలవగల వీరుడు లేడు, నిజం.

ఈనాడు మీమాట ప్రకారం నేను పాండవ పక్షానికి వస్తే ఏమంటారు లోకులు

అర్జునునికి భయపడి యిలా చేశావంటారు తప్ప నిజాన్ని గుర్తించరు.

యుద్ధభేరీలు మ్రోగేవేళ యీ పని జరుగుతూంటే సామాన్యులు ఎలా ఊహిస్తారమ్మా!

ఈ నాటి వరకూ వీరి ఆశ్రయంలో బ్రతికి విపత్సమయంలో వీరిని విడిస్తే కృతఘ్నత నా నెత్తిమీద పడదా?

మీరు వచ్చారు కనక ఒక్కమాట చెపుతున్నాను. యుద్ధం ఎలానూ తప్పదు. అప్పుడు నేను అర్జునుని తప్ప మిగిలిన వారెవరినీ చేత చిక్కినా సంహరించను. అర్జునుడో కర్ణుడో ఒకరే మిగలాలి.

ఎప్పుడయినా పాండవులు అయిదుగురే! నాకు సెలవిప్పించండి అని నిష్క్రమించాడు.

కుంతీదేవి నిట్టూర్చి తన భవనం చేరింది.

ఇది పూర్వరంగం

## సన్నాహాలు

హస్తినాపురం నుండి తిరిగి వచ్చిన రాయబారి వాసుదేవుడు ఉపప్లావ్యంలోని పాండవులకూ వారి ఆప్తులకూ విశేషాలన్నీ విశదం చేసి తన శిబిరానికి వెళ్ళాడు.

అంధః కరణ హీనత్వాత్
నైవ రాజా పితా తవ,
రాజా తు పాండు రభవన్
మహాత్మా లోక విశ్రుతః.

సాయం సంధ్యోపాసనలు ముగించి విశ్రాంతి తీసుకున్నాక ధర్మరాజు వాసుదేవుని రావించి:

నంద నందనా! దుర్యోధనుడు తన దుష్ట బుద్ధి వీడడని తెలుసు. కురు వృద్ధులు మా పితామహులు భీష్ములు, గురువర్యులు ద్రోణులు, మహారాజు ధృతరాష్ట్రుడు వానికి హితబోధ చెయ్యలేదా? అని ప్రశ్నించాడు.

శ్రీకృష్ణుడు: ధర్మనందనా! భీష్ములవారు చెప్పవలసినదంతాచెప్పారు. ధృతరాష్ట్రుడు అంధుడు కనక రాజ్యం పాండురాజుదే అయిందనీ, అనం తరం పాండవులు రాజ్యాన్ని ఎంతో విస్తరింప జేశారనీ వారి భాగం వారి కియ్యడం శ్రేయస్కరమనీ బోధించాడు.

అనంతరం ద్రోణులు కూడా అదే విషయం చెప్పి:

దుర్యోధనా! పాండురాజు అన్నగారి మీద గౌరవంతో యీ రాజ్యం ఆయన అధీనంలో ఉంచి సేవించాడు. కనక భీష్ములవారు చెప్పినట్లు చెయ్యి అన్నారు.

విదురుడు కూడా ఆ మాటలే చెప్పాడు.

గాంధారి పరి పరి విధాల దుర్యోధనుని అకార్యాలను నిందించి ఎలా అయినా సంధికి సమ్మతింప జేయాలని చూసింది. అర్ధరాజ్యం మీకివ్వడం వల్ల వారికి చక్కని రక్షణ ఉంటుందని చెప్పింది.

రాజ్యాధికారి పాండురాజు అనీ, ఆయన అనంతరం రాజ్యం పాండ వులకే చెందాలనీ విశదం చేశాడు, ధృతరాష్ట్రుడు.

తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అనుకునే మూర్ఖుడు దుర్యోధనుడు యుద్ధానికే సిద్ధంగా ఉన్నాడు.

దండనీతి తప్ప మార్గంలేదు కనక మనం మన సన్నాహాలు కానివ్వాలి, అన్నాడు.

అప్పుడు ధర్మరాజు తన సోదరులతో ఆప్తులతో సంప్రదించి ద్రుపద, విరాట, ధృష్టద్యుమ్న, శిఖండి, సాత్యకి, చేకితాన, భీమసేనులను అక్షౌహిణీ పతులుగా నిశ్చయించాడు. సర్వసేనాపతి విషయం వచ్చింది.

సహదేవుడు విరాటరాజుకి పట్టం కట్టాలన్నాడు.

ద్రుపదమహారాజు సమర్థుడని సూచించాడు, నకులుడు.

శిఖండిని నిలబెట్టాడు భీమసేనుడు.

ధృష్టద్యుమ్నుని సామర్థ్యం వివరించాడు అర్జునుడు.

అర్జునుని అభిప్రాయం సమంజసంగా వున్నదని వాసుదేవుడు పలకడంతో అందరూ అంగీకరించారు.

## సమరాంగణం

కురుక్షేత్ర సమీపాన హిరణ్యా నదీతీరంలో పాండవసేన, శిబిరాలు నిర్మించింది.

శస్త్రచికిత్స నిపుణులకూ,

వాస్తుశాస్త్రం తెలిసిన శిల్పులకూ,

సమాలోచనలకు అవసరమయిన ప్రాజ్ఞతకల విద్వాంసులకూ

వేరే విడిది ఏర్పాటు చేశారు.

అన్నపానాలకు సర్వసంభారాలు సమకూర్చుకున్నారు.

అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశాక ధర్మరాజు స్వయంగా అందరినీ కలిసి యోగక్షేమాలు విచారించి వచ్చాడు.

దుర్యోధనుడు స్వయంగా యుద్ధసన్నాహాలు సక్రమంగా నిర్వర్తింపజేసి యోధులందరినీ కలిసి వారికి అన్ని సౌకర్యాలూ కలిగించినదీ లేనిదీ పరిశీలించాడు.

అంతా అయాక ధర్మరాజు:

వాసుదేవా! ఈ మారణహోమం జరగకూడదనే ఊహతోనే యింత కాలం యిన్ని క్లేశాలు అనుభవించాను. ఇప్పుడయినా గురు బంధు వృద్ధులను సంహరించడానికి నామనస్సు అంగీకరించడం లేదు, అన్నాడు.

మహారాజా! విదురుడూ, మాతృదేవి కుంతీ చెప్పిన విషయాలు వినికూడా మీరు యుద్ధానికి విముఖులు కావడం ఉచితం కాదు, అని అర్జునుడు హెచ్చరించగా వాసుదేవుడూ మిగిలిన వీరులూ దానినే సమర్థించారు.

పాండవ శిబిరానికి బలరాముడు వచ్చి బంధుమరణం చూడలేనని, తీర్థయాత్రకు వెడుతున్నాననీ అన్నాడు.

అలానే రుక్మిణి సోదరుడు రుక్మివచ్చి అహంకారం ప్రదర్శించి తిరిగి వెళ్ళాడు. ఈ మహావీరు లిద్దరే ఆనాడు కురుక్షేత్రయుద్ధానికి దూరంగా వున్నవారు.

యుద్ధం ప్రారంభించడానికి ముందు దుర్యోధనుడు శకుని, కర్ణ, దుశ్శాసనులతో సంప్రదించి శకుని కుమారుడైన ఉలూకుని పిలిచి, పాండవులకు సందేశం పంపాడు.

ఉలూకుడు ధర్మరాజును సమీపించి: పాండవాగ్రజా! మా మహారాజు సందేశం శాంతంగా విను.

నాడు జూదంలో ఓడినప్పుడు మీ ద్రౌపదికి మేము చేసిన పరాభవం మీ కెంత మాత్రం ఆవేశాన్ని కలిగించక నపుంసకులను చేసింది.

ఆనాడు భీముడు చేసిన ప్రతిజ్ఞ మరచి వుండకపోతే యుద్ధభూమిలో నెరవేర్చమను.

భీష్మ ద్రోణ కర్ణులతో పోరాటం సామాన్య మనుకుంటున్నాడేమో అర్జునుడు; అలా సాగదని చెప్పు. మాకు సాయపడవచ్చిన రాజుల బల పరాక్రమాలు తెలుసుకొని మరీ రావడం మంచిది; అని చెపుతూ అర్జునుని వైపు తిరిగి:

జూదంలో పరాభవం జరిగినప్పుడు నీ గాండీవమూ, భీముని గదా దండమూ ఏమయినాయి. విరటుని నర్తనశాలలో ఆడపిల్లలకు జడలువేసి నాట్యం నేర్పిన మీరు; వంటలవాడుగా పనిచేసిన భీముడూ, మీకు తోడువచ్చే కృష్ణుడూ మాకు లెక్కకాదు. బాగా ఆలోచించుకుని శాంతంగా వెనుదిరిగిపోయి ప్రాణాలు రక్షించుకోండి.

భీముడు: ఉలూకా! చాలా బావుంది. మా ప్రతిజ్ఞలు నెరవేర్చడానికి వస్తున్నామనీ, రణరంగంలో కౌరవసైన్యం సర్వనాశనం కాక తప్పదనీ వెళ్ళి చెప్పు, అన్నాడు.

* * *

కురుసేనకు అధిపతిగా భీష్ముని అభిషేకించారు.

సేనాపతిత్వం స్వీకరించి భీష్ముడు:

నాయనా దుర్యోధనా! నాకు మీరూ, పాండవులూ సమానమే. అందువల్ల యుద్ధం నీ పక్షాన సాగించినా పాండవులు వచ్చి వేడితే వారికి శ్రేయోమార్గం బోధిస్తాను. దేవదానవులెదురు వచ్చినా నిలబెట్టగలను. పాండవులను మాత్రం నేను సంహరించను, అన్నాడు.

ఈవల ధర్మరాజు ధృష్టద్యుమ్నుని సర్వసైన్యాధిపతిగా అభిషేకించారు.

## సేనాబలాలు

దుర్యోధనుడు: భీష్మపితామహా! మీరు ఉభయ పక్షాలలోని యోధులనూ ఎరుగుదురు. వీరిలో ఎవరెవరు ఎంతటివారు? అని అడిగాడు.

భీష్ముడు: నాయనా! మనపక్షంలో మీ అన్నదమ్ములందరూ కృప ద్రోణుల శిక్షణలో ఆరితేరిన రథికవరులే.

కృతవర్మ, శల్యుడు, భూరిశ్రవసుడు, సుదక్షిణుడు, జయద్రథుడు, నీలుడు విందాను విందులు త్రిగర్తసోదరులు, బృహద్బలుడు వీరందరూ అతిరథులు. నీ కుమారుడూ, దుశ్శాసనుని కుమారుడూ కూడా

అంతటి వారే. కృప, ద్రోణులను గూర్చి చెప్పనవసరం లేదు. బాహ్లిక భగదత్తులు కూడా అంతటివారే.

ప్రాణాలమీద తీపి అనే దోషం వల్ల అశ్వత్థామను రథికుడనీ, అతి రథుడనీ చెప్పరేం; అయినా శాత్రవసేనా సంహారంలో సమర్థుడే. వీనితోనే సంగ్రామయజ్ఞం సమాప్తం కావాలి.

జలసంధుడూ, అలంబసుడూ, కర్ణుని కుమారుడూ కూడా అతిరథులే.

నీ ఆశలన్నిటికీ మూలస్తంభమయిన కర్ణుడు మాత్రం అర్ధరథుడు, అనగా కర్ణుడు ఆగ్రహంతో:

బంధుబలమూ, వార్ధక్యమూ, పలితకేశాలూ వున్నంతలో నాయకత్వం సిద్ధించదు. బల వీర సాహసా లుంటేనే క్షత్రియులకు ప్రాధాన్యం సిద్ధిస్తుంది. వేద, శాస్త్ర పరిజ్ఞానం వున్నవారే విప్రశ్రేష్ఠులు.

ఈనాడు నా వీరత్వం ఎరుగని వారెవరు! అయినా మీరు తప్పు అంచనావేసి విభేదాలు సృష్టిస్తున్నారు. అందువల్ల ఉత్సాహం సన్నగిల్లుతుంది.

పెద్దల మాటలు వినవలసిందే. కాని వార్ధక్యం ముదిరినవారు పసి వారితో సమానం అని వేత్తలు చెపుతున్నారు. అయినప్పుడు ఈ పితామహుని మాటలు లక్ష్యపెట్టనవసరం లేదు.

ఏమయినా యీయనను సేనాపతిగా వరించాం. ఆయన నిష్క్రమించే వరకూ నేను రణరంగంలో అడుగుపెట్టను అన్నాడు.

భీష్ముడు నవ్వుతూ: కర్ణా! ఎందుకీ ప్రలాపాలు. నా శక్తిని గూర్చి చెప్పకోవడం నా కిష్టం లేదు. పయిగా దాని కిది సమయం కాదు, అంటుండగా దుర్యోధనుడు తాత గారిని సమీపించి:

నా శ్రేయస్సు దృష్ట్యా యీ విభేదాలు విస్మరించండి. ఇక శత్రుపక్షంలో యోధుల వివరాలు చెప్పండి, అన్నాడు.

భీష్ముడు: నాయనా! పాండవాగ్రజుడు మహారథికుడు. గజబలుడు భీముడూ అంతే, నకుల సహదేవులు రథికులు. అభేద్యకవచంతో, అక్షయ తూణీరాలతో వాసుదేవుని సారథ్యంలో వచ్చే అర్జునుని శక్తి సామర్థ్యాలు నిన్న మొన్న గోగ్రహణంలో చూశాం.

ఉపపాండవులు, ఉత్తరుడు మహారథికులు. అభిమన్యుడు తండ్రితో సమానుడు.

సాత్యకి, యుథామన్యుడు, ధృష్టద్యుమ్నుడు, ధృష్టకేతువు, భోజరాజు పుత్రులు, అతిరథులు. కేకయ రాకుమారులు రథికవరులు. కాశీరాజు ఎనమండుగురు రథికులకు సముడు. భీమనందనుడు ఘటోత్కచుడు మహా మాయా యుద్ధతంత్ర నిపుణుడు. వీరు కాక యింకెందరో పాండవుల కోసం ప్రాణత్యాగం చెయ్యడానికి వున్నారు.

ఒక్కమాట –

నేను స్త్రీలతో యుద్ధం చెయ్యను. స్త్రీగా పుట్టి పురుషుడుగా మారిన శిఖండి వారి పక్షంలో వున్నాడు. వాడు ఎదుటపడితే నేను అస్త్రసన్యాసం చేస్తాను, కుంతీనందనులను సంహరించనని ముందే చెప్పాను, అన్నాడు.

దుర్యోధమని కోరికమీద భీష్ముడు శిఖండితో యుద్ధం చెయ్యకపోవ డానికి కారణమయిన అంబోపాఖ్యానం చెపుతున్నాడు.

## అంబకథ

నాయనా! మాతండ్రి శంతనమహారాజు దివంగతు డయాక నా సోదరుడు విచిత్రవీర్యుని సింహాసనం ఎక్కించాను. ఆయనకు వివాహం చెయ్యాలని సంకల్పించి కాశీరాజు కుమార్తెలయిన అంబ అంబిక అంబాలిక లను స్వయంవర మండపం నుండి తీసుకువచ్చాను.

ఇక్కడకు వచ్చాక అంబ తన మనస్సు సాళ్వరాజు మీద వున్నదనీ ఆయన తనను ప్రేమించాడనీ అనగా ఆమెను పంపించి మిగిలిన యిద్దరితో వివాహం జరిపించాను.

అక్కడ సాళ్వుడు ఆమెను తిరస్కరించాడు. అంతతో ఆమె నా మీద పగబూని తపస్సు ప్రారంభించింది. ఆ ప్రాంతంలోని వారందరూ ఆమెను పుట్టింటికి వెళ్ళమని హితబోధ చేశారు.

ఈ దశలో పుట్టినింట అవమానం తప్ప మరేమీజరగదని అక్కడే దీక్షలో వుండగా హోత్రవాహనుడనే రాజర్షి ఆమెను చూసి, భీష్ముని మీద ప్రతీకారం జరుపుకోవాలంటే మహేంద్రగిరి మీద తపస్సు సాగించే పరశురాముని దగ్గరకు వెళ్ళడం మంచిదన్నాడు.

ఆ సమయానికి అక్కడకు వచ్చిన పరశురాముని శిష్యుడు అకృత వ్రణుడు ఆమె కథ విని పరశురాములవారే యిక్కడకు వస్తున్నారని చెప్పాడు.

మరునా డాయన వచ్చి ఆమె గాథ విని:

అమ్మాయి! నీకథ నా హృదయాన్ని ద్రవింపజేసింది. నీ హృదయాని కింత వ్యథ కలిగించిన భీష్ముని పిలిపించి నీ పాదాలమీద పడి క్షమార్పణ వేడుకోమంటాను. ఎందుకంటే నే నిప్పుడు వేదవేత్తల రక్షణకు తప్ప అస్త్రం పట్టనని శపథం చేశానన్నాడు. భీష్మ సంహారముతో కాని తన బాధ తగ్గదని అంబ పదే పదే చెప్పడంతో పరశురాముడు చేసేదిలేక అంబను వెంట బెట్టుకుని హస్తినాపురం చేరి నన్ను పిలిపించి ఆమెకు వివాహం జరిపించా లన్నాడు.

నేను ధర్మమార్గం విడిచి వివాహం జరిపించలేను, అని ఎంత చెప్పినా వినక యుద్ధానికి సిద్ధం కాగా కురుక్షేత్రంలో మా మధ్య ఘోర యుద్ధం జరిగింది.

ఉభయులం దివ్యాస్త్రాలతో పోరు సాగిస్తున్నాం. రోజులు నడుస్తు న్నాయి. ఒకనాడు వారో నేనో మిగలాలని తీవ్రక్రోధంతో ప్రస్వాపనాస్త్రం సంధిస్తున్నాను.

అప్పుడు నారదమహర్షి వచ్చి వారించాడు.

జమదగ్ని, ఋచీకుడు ఆదిగాగల వారి పితృపితామహులు వచ్చి వారించారు, మా గురువులను.

అప్పుడు నన్ను అస్త్రసన్యాసం చేయమని ప్రబోధించారు. అది క్షాత్రధర్మం కాదన్నాను.

పరశురాముని చేరి అస్త్రం పట్టకుండా చేశారు.

నేను ఆయన పాదాలకు గురుపూజ చేశాను.

ఆయన నన్ను ఆశీర్వదించి అంబకు హితవు బోధించాడు. ఆమె వినకుండా నా మీద ప్రతీకారం తీర్చుకోవడానికి మళ్ళీ తపస్సుచేసి పరమశివుని వరప్రసాదంతో ద్రుపదుని యింట ఆడబిడ్డగా పుట్టి మధ్యలో పురుషాకృతి పొంది శిఖండిగా ధనుర్విద్య సాధించి నా ఎదుట నిలబడడానికి వస్తున్నది.

ఈశ్వరానుగ్రహం వల్ల అంబ ద్రుపదుని యింట ఆడబిడ్డగా పుట్టింది. ఆ మహారాజు మాత్రం ఆమెను పుత్రుని వలె పెంచుతూ అన్ని విద్యలూ నేర్పించాడు.

వయసు రాగానే దశార్ణదేశపు రాజు కూతురును తెచ్చి వివాహం చేశారు. ఆ అమ్మాయికి తన భర్త కూడా స్త్రీయే నని తెలిసి తండ్రికి కబురు చేసింది.

ఆయన దూతను పంపి తన నింత వంచించి నందుకు యుద్ధంచేసి పగ తీర్చుకుంటా నన్నాడు.

ద్రుపదుడు విచారంలో పడ్డాడు.

విషయం తెలుసుకుని శిఖండి అరణ్యాలకు పోయాడు.

అడవిలో ఒక యక్షుని మందిరం చేరి విచారిస్తుండగా ఆ యక్షుడు అనుగ్రహించి తన పురుషరూపం ఆమెకు దయచేసి తాను స్త్రీ రూపం ధరించాడు.

తరువాయి కొంత కాలానికి యక్షపతి కుబేరుడు ఆ వనానికి వచ్చి తన సేవకుడైన యక్షుడు చేసిన పని విని ఆగ్రహంతో

వీడు శిఖండి మరణించే వరకూ యిలానే స్త్రీ రూపంతో ఉంటాడు అని శపించాడు.

అది మొదలుగా శిఖండి పురుషరూపంతో నా మీద ద్వేషంతో ఉన్నాడు. ఇదీ ఆ కథ అన్నాడు భీష్ముడు.

తూరుపు తెల్లవారింది.

కురుక్షేత్రం మహాయోధులతో అశ్వ, గజ, రథ బలాలతో అలరారు తున్నది.

ఆ సమయంలో దుర్యోధనుడు తన తాతగారిని చేరి.

తాతా! శత్రుసేనను మీ రెంతకాలంలో నిశ్శేషం చెయ్యగలరు, అనగా ఆ వృద్ధుడు:

నాయనా! నా శక్తితో నేను వారందరినీ ఒక నెలలో కడతేర్చగలను, అన్నాడు.

దుర్యోధనుడు ద్రోణుని వైపు చూశాడు.

నాయనా! వార్ధక్యం మీద పడింది. అందుచేత నాకు కూడా నెలరోజులు పడుతుంది, అన్నాడాయన.

కృపాచార్యులు రెండు మాసాలు కావాలన్నాడు.

అశ్వత్థామ పది రోజులు చాలుననగా కర్ణుడు అయిదు రోజులకంటె అవసరం లేదు అన్నాడు.

భీష్ముడు నవ్వి:

కర్ణా! వాసుదేవుని సారథ్యంలో అర్జునుడు రణరంగంలో కనిపించనంత వరకూ ఎవరెన్ని మాటలు పలికినా ప్రమాదం లేదు, అన్నాడు.

ఇక్కడ జరిగిన యీ ప్రస్తావనలు విని, ధర్మరాజు తన యోధులను పిలిచి వారి వారి శక్తి ఎంతటిదని అడిగాడు.

అర్జునుడు: అగ్రజా! వారందరినీ నిమేష మాత్రంలో నశింపజెయ్యగల పాశుపతాస్త్రం. నా దగ్గర ఉన్నది.

పరమశివుడు దీనిని ప్రళయ సమయంలో కాని ప్రయోగించడు. ఆయన నాకు దీనిని అనుగ్రహిస్తూ:

సామాన్యులపై యీ దివ్యాస్త్రం ప్రయోగించరాదు, అన్నాడు.

అయినా మన సేనలోని శిఖండి, ధృష్టద్యుమ్న, సాత్యకి, భీమ, నకుల, సహదేవ, యుధామన్యు, ఉత్తమేజ, విరాట, ద్రుపదులు, భీష్మ, ద్రోణుల కంటె తక్కువవారు కారు.

అందాకా దేనికి, మీరు ఆగ్రహించి కన్నులు ఎర్రజేస్తే లోకాలు భస్మమవుతాయి, అన్నాడు.

విజయమో

వీర మరణమో

మరొకదారి మనకులేదు, అనే దృఢసంకల్పంతో కురు పాండవ సేనలు కురు క్షేత్రంలో మహోత్సాహంతో అడుగు పెడుతున్నాయి.

అక్కడకు చేరిన వైశ్యులకూ, వేశ్యలకూ, గూఢచారులకూ, ప్రేక్షకులకూ, తగిన సౌకర్యాలూ స్వయంగా కల్పించాడు దుర్యోధనుడు.

యుద్ధభేరీ మ్రోగనున్నది, అని వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఉద్యోగపర్వం వినిపించాడు.

## ఉద్యోగపర్వం సమాప్తం

## మూలభారతంలో ఉద్యోగ పర్వవిభజన

ఉద్యోగపర్వము - అర్జున దుర్యోధనులు శ్రీ కృష్ణుని సహాయము అర్థించటం, శ్రీ కృష్ణునిరాయబారం, విశ్వరూపదర్శనం, అంబోపాఖ్యానం, శ్వేతాభిషేకం అను పర్వాలతో 6,900 పైగా శ్లోకాలతో వుంది.

* * *

T.T.D. Religious Publications Series No. 110
Price : Rs. 20/-

మహాభారతగాథను గూర్చి తెలియని వాళ్లెవరు? ఈ మహేతిహాసం ప్రాచీన కాలం నుండీ ప్రశస్తిగాంచిన పవిత్ర కథ. భారతీయ భాషలన్నింటిలోనూ ప్రసిద్ధి పొందిన కథ. ఇందలి ఉత్తమ సందేశం అవిచ్ఛిన్నమైనది, అందరికీ ఆదరణీయమైనది, అవశ్యం ఆచరణీయమైనది.

ఆధునిక కాలంలో భారతాన్ని అవలీలగా అలవోకగా రచించిన వాళ్లు ఎందరో వున్నారు. వారిలో 'ఉషశ్రీ' గారు ప్రత్యేక కోవకు చెందినవారు. కథ చెప్పటంలో వారి బాణీయే వేరు. ఆకాశవాణిలో ధారావాహికంగా ప్రసారం కావించిన వారి రచన చాలా కాలం క్రితమే పుస్తక రూపాన్ని పొంది, అశేష పాఠకమహాశయుల ఆదరణను అందుకొన్నది. తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'ఉషశ్రీ' గారి ఈ ప్రశస్త రచనను ఇంతకు మునుపు అనేక పర్యాయాలు ప్రచురించారు. ప్రతులు చెల్లిపోయినందున ఇప్పుడు పునర్ముద్రింపబడుతున్నది.

అశేష పాఠకుల సౌలభ్యం నిమిత్తం ప్రస్తుతం ఈ గ్రంథం రెండు భాగాలుగా ప్రచురింపబడుతున్నది.

భారత కథ విజ్ఞానదాయకం; అమృతం వలె ఆనందదాయకం. వాచవియైన ఈ ప్రచురణను ఆంధ్రావళి అందరూ అందుకొని చదవండి! చదివించండి! ఆనందించండి!

Published by Sri A.P.V.N. Sarma, I.A.S., Executive Offic
Tirumala Tirupati Devasthanams and Printed at The Vidyarambham Press and
Depot (P) Ltd., Alleppey-688 011, Kerala. Ph: 0477 2262334.